
# శ్రీవాసవాంబ

పోతా చంద్రయ్య



# శ్రీవాసవాంబ

(పురాణేతిహాసిక నవల)

ఐతా చంద్రయ్య

జాతీయ సాహిత్య పరిషత్తు

సిద్ధిపేట - 502 103.

శ్రీ వాసవాంబ (పురాణేతిహాసిక నవల) - ఐతా చంద్రయ్య
జాతీయ సాహిత్య పరిషత్తు - సిద్దిపేట ప్రచురణ సంఖ్య 122

**SREE VASAVAMBA .... *By ITHA CHANDRAIAH***


| | | |
|---|---|---|
| *First Edition* | : | *2009* |
| *Copies* | : | *1000* |
| *Cover page painting* | : | *Bali* |
| *Line drawings* | : | *T. Ramakrishna* |


*Rights : Reserved with the Author*


*PRICE : Rs. 200/- Foreign : 30 $*

*Copies can be had from :*


1. ***Itha Chandraiah - Writer***
   *H.No. 4-4-11, Sherpura, Siddipet - 502 103. A.P.*
   *Ph : 9391205299*


2. ***Vishalandhra Publishing House***
   *4-1-435, Bank Street, Hyderabad - 500 001.*

3. ***Sahitya Nikethan***
   *3-4-852, Barkatpura, Hyderabad - 500 027.*

4. ***Navayuga Book House***
   *4-5-317, Sultan Bazar, Hyderabad - 500 096*


*Coverpage Printing : Karshak Press, Hyderabad.*
*Book Printed at :*

***Sri Vasavi Printers, Siddipet.***

***Ph : 08457 - 224125, 9848192125***

# అంకితం



అక్కగా జన్మించి, అమ్మగా లాలించి, ఆదరాభిమానాలు పంచియిచ్చి,

అమ్మవారిలా స్వర్గారోహణం చేసిన మా చిన్నక్క

# శ్రీమతి కాపర్తి రాజమ్మ

పాద పద్మములకు

# కృతజ్ఞతాంజలి

## వెన్ను తట్టి హార్థిక సహకారమందించిన



## శ్రీ వబిలిశెట్టి కనకరాజు

అధ్యక్షులు – ఆం.ప్ర. ఆర్యవైశ్య మహాసభ, హైదరాబాదు.



**Vn. KCGF యాసాల వెంకటలింగం**

అధ్యక్షులు

మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం

సిద్ధిపేట.



**Vn. KCGF గంప శ్రీనివాస్**

ప్రధాన కార్యదర్శి

మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం

మరియు గవర్నర్, వాసవిక్లబ్స్, సిద్ధిపేట.

## గారలకు అభివాదములు

# కృతజ్ఞతాంజలి

## వెన్ను తట్టి హార్ధిక సహకారమందించిన



## శ్రీ ఉమాపార్థివ కోటిలింగేశ్వర దేవాలయం, సిద్ధిపేట.

### వ్యవస్థాపక ధర్మకర్తలు




శ్రీ తడ్కమడ్ల మల్లయ్య




శ్రీ తడ్కమడ్ల రంగయ్య



శ్రీ తడ్కమడ్ల కోటయ్య



శ్రీ తడ్కమడ్ల లింగయ్య



శ్రీ తడ్కమడ్ల రాజేశం

మ
రి
యు



శ్రీ తడ్కమడ్ల ఈశ్వరయ్య

వ్యవస్థాపక నిర్వాహకులు

## గారలకు అభివాదములు

**అమ్మన చంద్రారెడ్డి**
అధ్యక్షులు,
జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్ధిపేట.

# చంద్ర దర్శనం

సిద్ధిపేట జాతీయ సాహిత్య పరిషత్తు సాహతీ సామ్రాజ్ఞ మణికిరీటంలో ప్రకాశించిన 122వ కలికితురాయి పురాణేతిహాసిక నవల 'శ్రీ వాసవాంబ'. ప్రముఖ కథా రచయిత, ఆత్మీయులు, సాహితీక్షేత్రంలో లబ్ధప్రతిష్ఠులైన శ్రీ ఐతా చంద్రయ్య గారి కలం నుండి సౌదామినిలా జాలువారిన శిష్ట వ్యావహారిక నవలా ఖండిక యిది. ఇంతవరకు ఈ అంబ గురించిన రచనలన్ని కఠినమైన గ్రాంధిక భాషలో వ్రాయబడి పాఠకులకు యిబ్బందిగా ఉండేది. ప్రస్తుతము రచయిత కీలెరిగి తన శక్తియుక్తులను ధారబోసి సమగ్రంగా, సరళంగా చదువరుల కామోదయోగ్యంగా శ్రీ పరమేశ్వరీ చరిత్రను వ్రాశారు. అందరూ చదువదగిన సులభ, సుందర శైలిలో గ్రంథం రావడం యిదియే ప్రప్రథమని చెప్పవచ్చు.

శ్రీ చంద్రయ్య గారు సహజంగా జాతీయవాదులు, నవలాకారులు మరియు సద్భక్తి పరాయణులు. అందువలన వారు సుమారు పది సంవత్సరాలు కఠోరంగా పరిశ్రమించి, పరిశోధించి ఆర్యవైశ్య సోదరులకుపయుక్త ఇతిహాసిక నవలను తెలుగులోనికి తెచ్చారు.

నిజంగా యిట్టి గ్రంధము వాసవీమాత పరమభక్తులైన వైశ్య కులదీపకులకు జీవనదీపిక కాగలదని నా ప్రగాఢ విశ్వాసము. ఇలాంటి అపూర్వ గ్రంధాన్ని తన ఆత్మ చైతన్యం ద్వారా, బయటి ప్రపంచానికి అందించిన రచయిత గారు అభినంద నీయులు. అట్లే తమ అమూల్య గ్రంధాన్ని జాతీయ సాహిత్య పరిషత్తు సిద్దిపేట శాఖ పక్షాన ప్రచురణకు అనుమతించినందున వారికి శతధా ధన్యవాదములు. శుభం భూయాత్. ...

**- అమ్మన చంద్రారెడ్డి**

# నివేదనము

సుమారు పది సంవత్సరాల క్రితము ప్రముఖ చరిత్ర పరిశోధకులు, శాసన పరిశోధకులు, "మూసి" పత్రిక సంపాదకులు శ్రీ బి.యన్. శాస్త్రి గారిని వారింట్లో కలిసి మాట్లాడుతున్నాను. మాటల మధ్యన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అవతార కాలము ప్రస్తావన కొచ్చింది. ఈ విషయములో నేను చాలా ఆసక్తిగా ఉన్నానని, శ్రీ వాసవాంబ జీవిత చరిత్ర కూలంకశంగా తెలుసుకుని ఓ పుస్తకం రాయదలుచు కున్నానని వారితో చెప్పాను. వారు శుభమంటూ ఆశీర్వదించి, అవతార కాలము, చారిత్రకాధారాల గురించి చక్కని మార్గదర్శనం చేశారు. అది నాకెంతో స్ఫూర్తి నిచ్చింది. అంతకు ముందే వాసవి గురించి కొంత చదివాను. కొంత విన్నాను. అప్పట్నుంచి విషయ సేకరణ ప్రారంభించాను. శ్రీ బి.యన్. శాస్త్రి గారు పరమ పదించినా వారు చెప్పిన విషయాలు ఈ పుస్తకం రాసేందుకు ఎంతగానో తోడ్పడినాయి.

శ్రీ వాసవి కర్మక్షేత్రమైన పెనుగొండకు రెండుసార్లు వెళ్లాను. అమ్మవారి గుడి ప్రాంగణములోని మ్యూజియంములో పొందుపరిచిన చిత్రాలు, కథా విశేషాలు పరిశీలించాను. వాసవి గురించి వెలువడిన పుస్తకాలు, వ్యాసాలు సేకరించి సావకాశంగా చదివాను. పూర్వజన్మ శాపము ఫలితంగా అపురూప సౌందర్యరాశి వాసవిని పెళ్లాడ్తానని పట్టుబట్టిన విష్ణువర్ధనుని కుమారుడు రాజనరేంద్రుడు, పదకొండవ శతాబ్దము నాటి రాజరాజనరేంద్రుడు వేరని తెలిసింది. శ్రీవాసవాంబ అవతారము ఐదువేల సంవత్సరాల క్రితముదనే నిర్ణయానికొచ్చాను. కాలనిర్ణయం, శాపాలు – ప్రతి శాపాలు, వరాలు లాంటి విశేషాల కోసం ఎన్నో పుస్తకాలు తిరగేశాను. వాటిలో పేర్కొనదగినవి (1) ఆర్షమహర్షి విద్వాన్ గట్టి సత్యనారాయణ గుప్త గారి "శ్రీ వాసవీ కన్యకా పురాణము", (2) శ్రీ చర్ల సత్యనారాయణ గారి "శ్రీ వాసవి అను కన్యకా పరమేశ్వర చరిత్రము", (3) శ్రీ పి. లక్ష్మీకాంత శ్రేష్ఠి గారి "వాసవి", (4) ఆర్యవైశ్య యువజన సంఘము (పెనుగొండ) వారి "శ్రీ వాసవీ కన్యకా పురాణ సంగ్రహము", (5) శ్రీ లింగా నాగభూషణం గుప్త గారి "శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి", (6) మహావధానులు శ్రీ దోమా వెంకటస్వామి గుప్త గారి "శ్రీ కన్యకా పురాణము" (పద్యకావ్యము), (7) వాసవి ఆర్యవైశ్య మ్యారేజి లింక్స్ (యం.పి. సుందర రావు) వారి "శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జీవిత చరిత్ర", (8) శ్రీ నీలా జంగయ్య గారి "అగ్ని దీప్త వాసవి కన్యకా చరిత్ర", (9) శ్రీ నండూరి రామకృష్ణమాచార్య గారి

నృత్య నాటిక "శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి", (10) గురుశ్రీ శ్రీధరస్వామి గారి "శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పురాణము" పుస్తకాలే కాకుండా వార్త, ఈనాడు మొదలైన పత్రికల్లో వచ్చిన వ్యాసాలు గూడా విషయావగాహనకు సహకరించాయి. ఆయా రచయితలందరికీ ధన్యవాదాలు.

పుస్తక ముద్రణ యజ్ఞము లాంటిది. అందుకు ఆర్థిక సమిధలందించి, అభినందనలతో ప్రోత్సహించిన వారందరికి కృతజ్ఞతలు. హార్థికంగా వెన్నుతట్టిన సేవాపరాయణులు శ్రీ తడ్కమడ్ల ఈశ్వరయ్య, ఆం.ప్ర. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు శ్రీ వబిలిశెట్టి కనకరాజు, మెదకు జిల్లా ఆర్యవైశ్య సంఘము అధ్యక్ష కార్యదర్శులు శ్రీ యాసాల వెంకటలింగము, శ్రీ గంప శ్రీనివాస్, వ్యాపారవేత్త శ్రీ గట్టు కృష్ణమూర్తి (ముఖచిత్రం ఎడుమ ఫోటోలో కన్పిస్తున్నవారు), ఆర్యవైశ్య సంఘము ప్రశాంతినగర్ సభ్యులు, తి.తి.దేవస్థానము – హిందూ ధర్మ ప్రచార పరిషత్తు మెదకు జిల్లా సలహా మండలి ప్రధాన కార్యదర్శి శ్రీ తోపాజు అనంతకిషన్, శ్రీ చొల్లేటి శేఖరం సోదరులు, శ్రీ వేలూరి రవీంద్రనాథ్ గుప్త వాసవిక్లబ్స్ – ఇంటర్నేషనల్, శ్రీ రేకా నగేశ్ గారలకు అభివాదములు.

కోరగానే రంగుల ముఖ్యచిత్రం గీసిచ్చిన ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ బాలి, రేఖా చిత్రాలు వేసిచ్చిన మిత్రులు శ్రీ టి. రామకృష్ణ, పుస్తకాన్ని అభిమానముతో అచ్చువేసిచ్చిన శ్రీ వాసవి ప్రింటర్స్ అధినేత శ్రీ గందెశిరి శ్రీనివాస్ గారలకు ధన్యవాదములు.

అన్నింటిని మించినది పండితుల అభిప్రాయము. స్ఫూర్తిదాయకమైన తమ పీఠికతో "శ్రీవాసవాంబ" నలంకరించిన ఆచార్య మసన చెన్నప్ప (ఉస్మానియా విశ్వ విద్యాలయము) మరియు తమ అమూల్యాభిప్రాయాన్నందిచిన ఆచార్య రావికంటి వసునందన్ (డా॥ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయము) గారలకు నమోవాకములు.

*ఈ గ్రంథముపై పాఠకుల స్పందన నాశిస్తున్నాను*

**- ఐతా చంద్రయ్య**

రచయిత

**ఆచార్య మసన చెన్నప్ప**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు విభాగము
ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు.

# పీఠిక

ప్రాచీనులు కావ్యేతి వృత్తాన్ని ప్రఖ్యాతోత్పాద్య మిశ్రమాలని ముప్విధాలుగా విభజించారు. ఈ ఇతివృత్త విభజనను ఆధునిక నవలకు కూడా వర్తింప జేయవచ్చు. అప్పుడు 'శ్రీవాసవాంబ' లోని ఇతివృత్తం మిశ్రమ విభాగానికి చెందుతుంది.

మిత్రులు శ్రీ ఐతా చంద్రయ్య గారు ప్రఖ్యాతేతివృత్తాన్ని కల్పనలతో జోడించి అద్భుతంగా 'శ్రీ వాసవాంబ' నవలను రూపొందించారు. ఈ నవలను చదువుతుంటే 'నవల రూపకమై తనలో రంగస్థలాన్ని కల్గి ఉంటుంది' అన్న మాటలను ఋజువు చేస్తుంది.

ఈ నవలలో కథంతా వాసవి చుట్టు తిరుగుతుంది. ఈ నవలలో ఆమే ప్రధాననాయిక. ఆమె నడవడి లోకోత్తరమైంది, ఆదర్శమైంది. ఆమె వాక్కు సుకుమారమైంది, సుందరమైంది. ఆమె మనస్సు నిర్మలమైంది, నీతివంతమైంది. ఆమె ప్రతిభ అసాధారణమైంది, అకుంఠితమైంది. ఆమె జీవితం పవిత్రమైంది, దివ్యమైంది.

వాసవి పాత్ర చిత్రణలో రచయిత ఎంతో సంయమనాన్ని ప్రదర్శించినాడు. పుట్టింది మొదలు తనను అగ్నిదేవునికి అర్పించుకున్నంతవరకు జరిగిన సంఘటనలన్నీ వాసవి మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని నిరూపిస్తున్నాయి. వాసవి శమదమాదులకు పుట్టినిల్లు. ఆమె శాంతమూర్తి. 'శమం' స్థాయిగా గల 'శాంతం' ఈ నవలలోని ప్రధానరసం. శృంగారం, అద్భుతం మొదలైనవి అంగరసాలు.

కుసుమగుప్తుడు రాజు, సదాచార సంపన్నుడు. కుసుమాంబ అతని భార్య. పతివ్రతాశిరోమణి. ఆ దంపతులకు వాసవి కన్యకాపరమేశ్వరి వరంగా జన్మించింది. ఆమె ఎవరో కాదు సాక్షాత్తు పార్వతి, లోకమాత. ఆమె సోదరుడు విరూపాక్షుడు, అతడెవరో కాదు సాక్షాత్తు నందీశ్వరుడే. కుసుమగుప్తుడు వారిద్దరినీ అల్లారుముద్దుగానే

కాదు, అన్నివిద్యలలో ప్రతిభ గలవారిగా పెంచాడు. అన్నిటికి మించి వాసవికి ఆధ్యాత్మిక విషయాలపై మక్కువ ఎక్కువ. ఈ నవలలో ప్రశ్నోత్తర పద్ధతిలో సాగిన ఆధ్యాత్మిక విషయాలను పరిశీలిస్తే, రచయితకు వాటిపట్ల గల శ్రద్ధాభక్తులు ఏపాటివో తెలుస్తాయి. వాసవిలో కనిపించే మరోవిశేషం, ఆమె వచోనైపుణ్యం. ఒక నేరస్థుని పక్షాన నిలబడి మాట్లాడటమే గాక, నేరస్థుని జీవితంలో మార్పు తెచ్చే విధంగా శిక్షావిధానం ఉండాలని చెప్పిన మాటలు నేటి న్యాయవ్యవస్థకు అనుసరణీయ మనిపిస్తాయి.

వాసవి నవల చదువుతుంటే వెన్నెల తోటలో విహరించి నట్లుంటుంది. ఇంతకాతోట ఏదో కాదు, భారతీయ పురాతన వైభవమే. రచయిత కేవలం జాతీయ భావాలు కల్గిన వాడే కాదు, సంప్రదాయపు మూలాలు తెలిసినవాడు. భారతీయ సాంస్కృతిక సమాజాన్ని దర్శించడమే ఈ నవలా పఠనం వల్ల కలిగే పుణ్యఫలం.

మానవ సంస్కారాల గురించి, యజ్ఞయాగాదుల గురించి, వర్ణాశ్రమ ధర్మాల గురించి, రాజనీతి గురించి, మంత్రశక్తుల గురించి, సంగీతాది కళల గురించి అనేక విషయాలు మనోజ్ఞంగా ఈ నవలలో చిత్రింపబడినాయి. ఇవన్నీ పరిశీలిస్తే నవలాకారుని లోకజ్ఞత స్పష్టమవుతుంది.

18 అధ్యాయాలలో విరచితమైన 'వాసవి' నవల ఒక బృహద్గ్రంథమే. వివిధ పాత్రలతో, వివిధ సన్నివేశాలతో, వివిధ విషయాలతో చకాచకా సాగే ఈ నవల కేవలం ఒక అమ్మాయి దివ్య చరిత్రనే కాక, భారతీయ జీవనంలోని సౌందర్యాన్ని మనకెఱుక పరుస్తుంది.

ఐతా చంద్రయ్య సంప్రదాయాన్ని గౌరవించే రచయిత. కవిగా, కథకుడుగా ప్రసిద్ధికెక్కిన ఆయన చరిత్రకు నవలాకృతినిచ్చి భావితరాలకు తద్వారా గొప్ప స్ఫూర్తిని కల్గిస్తున్నాడు. కేవలం వాసవి చరిత్రను తెలుసుకోవడానికే ఈ నవల రచింపబడ లేదు. ధర్మాధర్మ వివేచనకు ఇది పెద్ద పీట వేసింది. కుసుమగుప్తుడు ధర్మానికి, విష్ణువర్ధనుడు అధర్మానికి ప్రతీకలు. విష్ణువర్ధనుడు బిడ్డలా చూసుకోవలసిన వాసవిని భార్యగా చూడగోరినాడు. అధర్మానికి పాల్పడినాడు. తత్ఫలితంగా తన ఖడ్గానికి తానే ఆహుతి అయ్యాడు. ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకోవలసిన రాజులో కామాది దుర్గుణాలు ప్రవేశిస్తే ఎలాంటి తీవ్ర పరిణామాలు ఏర్పడుతాయో ఈ నవల నిరూపిస్తుంది.

వాసవి సందేశాత్మక నవల. వాసవి శీలంతోపాటు, ఆమె తల్లిదండ్రుల చరిత్ర, బంధుజనుల ఆదరాభిమానాలు, గురువుల సత్యనిష్ఠ లోకానికి ఆదర్శంగా నిలుస్తాయి. శ్రీ చంద్రయ్య గారికీ నవల వల్ల మంచిపేరు కలుగుతుందని భావిస్తున్నాను. ఆయన తన వంశీయుల చరిత్రను తన గుండెలో నింపుకొని ఈ నవలను రచించాడనిపిస్తుంది. ఆయనే చెప్పినట్లుగా ఇది పురాణేతిహాసిక నవల. నవలాకారుల్లో ఈ విధమైన నవలలు రచించినవారు తెలుగులో విశ్వనాథ, నోరి, ముదిగొండ లాంటి ఉద్దండులున్నారు. ఈ నవల కొన్నిచోట్ల దేవీ పురాణం లాగా, కొన్ని చోట్ల మహాభారతంలాగా భాసిస్తుంది, మైమరిపిస్తుంది.

సరసమైన వర్ణనలతో, సముచితమైన సన్నివేశాలతో, ఆనందాద్భుతాలకు ఆలవాలమైన ఐతా చంద్రయ్య గారి 'శ్రీ వాసవాంబ' నవల తెలుగు పాఠకలోకానికి ఆమోద యోగ్యం కావాలని ఆశిస్తూ, రచయితను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

- మసన చెన్నప్ప

కవి శిరోమణి - **ఆచార్య రావికంటి వసునందన్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు విభాగము
డా॥ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటి,
హైదరాబాదు.

# చంద్రాలోకం

'మా' ఐతా చంద్రయ్య మధుర వచన రచనా ధురీణుడైన మహనీయ శిల్పి అని ఈ కృతిలోని ప్రతి ఘట్టం, ప్రతి సన్నివేశం, ప్రతి వర్ణనలోని 'చెక్కడం' చెప్పకనే చెప్పుతున్నది.

"అమ్మవారి దివ్య తేజస్సుతో వనము నందనోద్యాన వనమై" అన్నా, "చెప్పినా వినకుండా మన మహారాజు మట్టి కరిచాడు" అన్నా ఐతా చంద్రయ్య కలం బలం కలకోకిల గళ మధురిమలను పులుముకొనే పలకరిస్తున్నది. ఈ కృతిలోని షోడశ కర్మలు, యజ్ఞయాగాదులు వర్ణనలు, సంస్కృత పాఠాలు సాధికారికమైన రచయిత నిజాయితీని నిలువెత్తున ప్రకటిస్తున్నాయి. వైశ్య వంశ వర్ణనలు, పట్టికలు, వివరాలు, ప్రాచీన మహత్త్వ స్థాపనతు పరమాద్భుత రీతిలో సుప్రకటితాలై – వర్ణాశ్రమ రీతులకు పట్టం కడుతున్నాయి.

'శ్రీ వాసవాంబ' చరితం ఎన్నో పోకడలు పోయిన పౌరాణిక వాద వివాదాలకు ఆస్పదం. అర్ధ చారిత్రకం. అందుకే వాటి వివరాలకు నేను పోను. అద్యతనాంధ్ర కవిత్వ యుగకర్త గురుజాడ కూడా అందుకే ఆ లోతులకు దిగక 'కన్యక' అని మాత్రమే ఆ సందర్భాన్ని ఉట్టంకించడం ఇక్కడ గమనార్హం.

శ్రీ అమ్మవారు ఆదిపరాశక్తి. సృష్టి స్థితిలయాలకూ, సకల కమలజాండ సంచయాల సంచలనాలకూ ఆధారభూతమైన, ప్రాణశక్తి మయమైన శ్రీ కన్యకా పరమేశ్వరి అనే అంశాన్ని ఐతా చంద్రయ్య ప్రత్యక్షరంలో ప్రత్యక్షపరచడానికి అన్ని విధాలా పరిశ్రమించడం అభినందనీయం. ప్రతి పాత్ర చిత్రణలో, ముఖ్యంగా 'వాసవి' మూర్తి కథనంలో ఆబాల్య అగ్ని ప్రవేశం వరకూ అతిజాగ్రత్తగా తన రచనా వలయాన్ని విస్తరింప జేయడం ఆశ్చర్యాన్ని కలిగించే అంశం.

"హింసతో సాధించలేని దేన్నైనా అహింసతో సాధించవచ్చునని"

"నేరస్తులను హింసకు గురిచేయకుండా వారి మానసిక స్థితిని మంచి మాటలతో మార్చి సన్మార్గానికి మళ్లించడమే మంచిదని" ఐతా చంద్రయ్య కృతి మొదట్లోనే చేసిన స్టేట్‌మెంట్స్ శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ మాత అగ్ని ప్రవేశ ఘట్టానికి సోపపత్తికమైన ఆధారాలుగా, సతార్కికమైన చారిత్రక *(Charectoristic)* చిత్రణలుగా అలరారు తున్నాయి.

ఈ నవల ప్రారంభంలోనే "శ్రీమద్భారత దక్షిణ గంగా" అని కథాశిల్పి ఐతా చంద్రయ్య చరురశ్ర (4) గతిలో ఎత్తుకొన్న గేయఖండిక అమ్మవారి అద్భుత చరితం చతుర్వేదాత్మకమని ధ్వని గర్భితంగా చాటుతున్నది. ఆప్తమిత్రుడు శ్రీ ఐతా చంద్రయ్య ఇలాంటి మరెన్నో మధురకృతులు మున్ముందు అందించాలని ఆకాంక్ష.

**- రావికంటి వసునందన్**

# ఐతా చంద్రయ్య - ముద్రిత గ్రంథములు

*నవలలు :*

1) ఇసుక గోడలు, 2) ఆడపిల్ల, 3) తల్లి భారతి,

4) సత్తికొండ, 5) శ్రీ వాసవాంబ.

*కథానిక సంపుటాలు :*

1) వరవిక్రయం, 2) ఊహలఊయల, 3) కథామంజూష,

4) ఐదు నిమిషాలు, 5) కుంకుమరేఖ, 6) భారతాంబ పూజా పుష్పాలు,

7) చిలకపచ్చ చీర, 8) సౌందర్యలహరి, 9) స్వేచ్ఛాజీవులు,

10) సిద్ధిపురి కథలు, 11) ఏడువారాల నగలు, 12) నిశ్చితార్థం,

13) ఆనందనందనము, 14) అంకితం.

*కవితా కావ్యములు :*

1) చందమామ పదాలు, 2) లక్ష్మణరేఖ,

3) శ్రీ వేంకటేశ్వర తారహారము, 4) ప్రణవనాదం, 5) త్రిశూలం,

6) శ్రీ గిరీశ శతకము, 7) భద్రగిరి నివాస శతకము, 8) గంగోత్రి,

9) జాతీయ విప్లవజ్యోతి (వీరసావర్కర్ గేయకథ), 10) సంక్రాంతి,

11) గుండె చప్పుళ్లు - నానీలు, 12) మానసరోవరము.

*నాటికలు :*

1) రోజులు మారాలి, 2) బుద్ధొచ్చింది, 3) తిక్క కుదిరింది,

4) పెద్దమ్మ పేచీ, 5) హరిశ్చంద్రుడు.

*ఏకపాత్రలు :*

1) మూడు ఏకపాత్రలు, 2) నాలుగు ఏకపాత్రలు, 3) త్రిమూర్తులు,

4) నాలుగు స్తంభాలు, 5) భారమేలుతో నాలుగు, 6) పది ఏకపాత్రలు.

*ఇతరములు :*

1) గోత్ర దర్శిని.

*అనువాదములు :*

1) అల్లూరి సీతారామరాజు, 2) లాచిత్ బడ్ పుకాన్,

3) రాజేంద్ర ప్రసాద్, 4) బంకించంద్ర చటర్జీ, 5) బసవేశ్వరుడు,

6) మహాత్మాగాంధి, 7) నందలాల్ బోసు, 8) సతీ సక్కుబాయి,

9) గురునానక్, 10) హోమీబాబా, 11) అద్భుత సాహసము.

# అభినందనలతో ...



**Vn. 3* KCGF జిల్లా జోగేందర్‌నాథ్**
సిద్ధిపేట.



**శ్రీ కూర పండరినాథ్**
అధ్యక్షులు, తి.తి.దే. ధర్మప్రచార పరిషత్
సలహా మండలి, మెదక్ జిల్లా. సిద్ధిపేట.



**Vn. నల్ల నాగరాజం**
దుబ్బాక.



**కోటగిరి చంద్రమౌళి** ధ॥ **శశిరేఖ**
సిద్ధిపేట.



**Vn. పెద్ది వైకుంఠం**
*Rtd. Dy. E.O.,* సిద్ధిపేట.



**Vn. KCGF అయిత రత్నాకర్**
డిప్యూటీ గవర్నర్, వాసవిక్లబ్స్ – సిద్ధిపేట.



**Vn. ఇల్లెందుల అంజయ్య**



**రాచకొండ అశోక్**

**శ్రీ రాఘవేంద్ర ఇండస్ట్రీస్, సిద్ధిపేట.**




అభినందనలతో ...

## ఆర్యవైశ్య నిత్యాన్నదాన సమాజము

**(శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి క్షేత్రము)**

పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా. (ఆం.ప్ర.)

| | |
|---|---|
| **Vn. KCGF నూలి వెంకటరమణమూర్తి** | **చక్కా వెంకటనర్సింహమూర్తి** |
| అధ్యక్షులు | కార్యదర్శి |

---

## మైత్రి వెల్ఫేర్ అసోసియేషన్ - (మైత్రి క్లబ్) సిద్ధిపేట.

**(రి.నెం. 549/2004)**

| | | |
|---|---|---|
| **చొల్లేటి విశ్వం** | **ఉప్పల శ్రీనివాస్** | **చందా సదాశివ్** |
| **చీకోటి మధుసూదన్** | **కూర శ్రీనివాస్** | **నల్ల శివానందం** |
| **రాచకొండ అశోక్** | **కొమ్మ బాలయ్య** | **చోకోటి లింగేశ్వర్** |
| **అమిరిశెట్టి మాణిక్యం** | **గందె వెంకటేశం** | **అయిత ప్రభాకర్** |
| **సముద్రాల శ్రీనివాస్** | **గందె శ్రీనివాస్** | |

---

**కొమురవెల్లి లింగం, సిద్ధిపేట.**
**కొమురవెల్లి శివప్రసాద్, సిద్ధిపేట.**
**కాచం సిద్దిరాములు, సిద్ధిపేట.**
**Vn. చింత రాజు, దుబ్బాక.**
**నర్సింలు, ఆర్.కె.కిరాణం, సిద్ధిపేట.**
**ముత్యం బాల్‌కిషన్, రామాయంపేట.**
**జిల్లా ముత్తయ్య గారి బాలయ్య & రమేష్, సిద్ధిపేట.**
**డా॥ జి. మల్లయ్య, గజ్వేల్.**
**కె. గాలయ్య, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, సిద్ధిపేట.**
**చకిలం మమ్మయ్య, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, సిద్ధిపేట.**
**చీకోటి వెంకటేశం, రిటైర్డ్ SDOT, సిద్ధిపేట.**
**గందె ఈశ్వర్‌చరణ్,సిద్ధిపేట.**
**శివనంది నారాయణ గుప్త, ఆర్గనైజింగ్ సెక్రెటరి, ఆ.వై.సం. మెదక్**
**Vn. కొర్తివాడ విధుమౌళి, రిటైర్డ్ టీచర్, ప్రశాంతినగర్, సిద్ధిపేట.**
**చింత సంగయ్య, ప్రశాంతినగర్, సిద్ధిపేట.**

# శ్రీ వాసవాంబ

## (పురాణేతిహాసిక నవల)

"**శ్రీమద్భారత** దక్షిణ గంగా
సురుచిర, సుమధుర దయాంతరంగా
త్ర్యంబకేశ్వర హర్షోత్తుంగా
పావన గోదావరీ తరంగా ... "

**పెనుగొండ** సామ్రాజ్యాధిపతి, కుసుమగుప్త మహారాజు గోదావరి నదిలో మునకలు వేస్తూ పుణ్యస్నానమాచరిస్తున్నాడు. ప్రకృతి పులకింతలకు ప్రత్యక్షసాక్షిగా ఒయ్యారాలొలికిస్తూ ప్రవహిస్తున్న పుణ్యనదీ తరంగాల్లో పరవశిస్తూంటే కన్నతల్లి ఒడిలో సేదదీరుతున్నట్టుంది. మనసు పొంగులు గోదావరి మహాత్మ్యాన్ని మహదానందంగా కీర్తిస్తున్నాయి.

ఆకాశమైదానములో తూరుపుదిశ సిందూర వర్ణం సంతరించుకుని నిష్ణాతుడైన చిత్రకారుడు గీసిన రంగుల చిత్రంలా రూపుదిద్దుకుంది. ఉదయసూర్యకిరణాలు శత సహస్ర దళాలుగా విచ్చుకుంటున్నాయి. విచ్చుకున్న కాంతి పుంజాలు పచ్చని పొలాలకు గిలిగింతలు పెడుతూ నదీ తరంగాలకు మెరుపులు అద్దుతున్నాయి.

"ఓం మిత్రాయనమః ... " నడుము నంటుతున్న ప్రవాహములో సూర్య నమస్కారాలు చేస్తూ మంత్రాన్నుచ్చరిస్తున్న కుసుమగుప్తుని పెదాలను స్పర్శించిన నునులేత కిరణాలు పరావర్తనం చెంది సర్వాంతర్యామికి నీరాజనాలర్పిస్తున్నాయి.

తెలుగు నేలను సస్యశ్యామలం చేస్తూ, పొలాల గళాలను అమృతధారాలతో తడుపుతూ, పసిడిపంటల నందిస్తూ తెలుగు జనమనో విహారిణిగా పూజలందుకుంటుంది గోదావరి నది. జ్యేష్టశైలము, బృహద్గిరి, మహాశైలము, మహాగిరి ప్రాంతముగా భారతప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్న పెనుగొండ పట్టణము పొలిమేరల్లో ప్రవహిస్తుంది. స్వేచ్ఛావాహినియై వేదమంత్రాల మహత్తును తరంగ ధ్వనిగా వినిపిస్తుంది. తన చుట్టూ విస్తరించిన పెనుగొండ సామ్రాజ్యములోని 18 సామంత రాజ్యాల ధాన్యాగారాలలో ధనలక్ష్మిని నర్తింపజేస్తోంది.

అమృత ఘడియల్లో గోదావరితీరము చేరడము, ప్రవాహతరంగాల్లో ఉల్లాసంగా మునకలువేస్తూ సూర్యభగవానునికి స్వాగతం పలకడం కుసుమగుప్త మహారాజు నిత్యకృత్యము. కరిగిపోతున్న కాలములో శాశ్వత విలువలను ప్రతిపాదిస్తున్న ఆదర్శ

జీవితము ఎంతో తృప్తినిస్తోంది. అతని సామ్రాజ్యము సిరిసంపదలకు నిలయము. ప్రజాసంక్షేమము రామరాజ్యాన్ని తలపిస్తుంది. సామంత రాజ్యాల ప్రజలను మురిపిస్తోంది.

అన్నీ బాగున్నాయి గానీ అదొక్కటే తక్కువుంది. ధనధాన్యరాశులున్నా, కీర్తిచంద్రికలు నలుదిసలా వ్యాపించినా, కుసుమగుప్తునికి సంతాన సౌభాగ్యము చేకూరలేదు. అదొక్కటే ఆరాటము మనసులో పోరాటము. అదే మనోవేదనగా పరిణమించింది.

పుణ్యస్నానము పూర్తయింది. కొద్దిగా కదిలి నదీప్రవాహానికి అభిముఖంగా నుంచున్నాడు. ఎదసొద కళ్లల్లో కరిగి భాష్పధారలైంది. అశ్రుబిందువులు తరంగాలమీద వాలి ప్రవాహంలో కలిసిపోతున్నాయి. తడిసిన ధోవతి అంచులు పిండి ముఖము తుడుచుకున్నాడు. చరాచర సృష్టికి మూలమైన ఆదిశక్తి, కన్యకాపరమేశ్వరి రూపములో కళ్లముందు గోచరించింది. చేతులెత్తి నమస్కరించాడు.

" అమ్మా, జగజ్జననీ ! త్రిమూర్తులను సృష్టించి సృష్టి, స్థితి, లయ, బాధ్యత లప్పగించావు. త్రిమాతలు, సప్తర్షులు, దిక్పాలకులు అందరూ నీ కనుసన్నలలో మెదిలేవారేగదా ! నిన్నే నమ్ముకుని, నీ పాదసేవలో నిరంతరం పరవశిస్తున్న నన్ను కరుణించు తల్లీ !" హృదయవేదన నివేదిస్తున్నాడు. ఒడ్డున విస్తరించిన తరుతరుణులు కొమ్మల చేతులాడిస్తూ, రెమ్మల కళ్లతో అంతా చూస్తున్నారు. మహారాజు వెంటవచ్చిన రక్షణ సిబ్బంది, సైనికులు అంతా గమనిస్తున్నారు.

మహారాజు హృదయఘోషను రోజూ వింటున్న ఆదిశక్తి నీటి తరగలపై చిరునవ్వులు చిందిస్తోంది.

"అమ్మా ! అపుత్రస్వ గతిర్నాస్తి అంటారు గదా ! సంతానహీనుల కీ లోకంలోనే కాకుండా పైలోకాల్లో గూడా సద్గతలుండవంటారు. ముక్కోటి జీవరాశుల్లో మానవ జన్మమే మహత్తరమైనది గదా ! అష్టైశ్వరాలలో జన్మించిన నా అర్ధాంగి కుసుమాంబ నోచని నోములేదు, చెయ్యని వ్రతం లేదు. మేము త్రికరణ శుద్ధిగా నిన్నే నమ్ముకున్నాము, ఇంకెన్నాల్లమ్మా ఈ పరీక్ష ? ఇప్పుడే, ఇక్కడే ... నీ కరుణాకటాక్ష వీక్షణాలు నామీద ప్రసరించక పోతే ఈ గోదావరి తల్లి గర్భములో ప్రాణాలొదిలి నిన్ను చేరుకుంటాను." ఎన్నడూ లేనంతటి ఉద్వేగం తెగింపుగా మారింది.

తన కుత్తుకను తానే చేతులతో అదిమిపెట్టి ప్రాణత్యాగానికై నీటిలో మునిగేందు కుద్యుక్తుడవుతున్నాడు.

"బిడ్డా ! కుసుమగుప్తా !" అభయ హస్తంతో ఆదిశక్తి కళ్లముందు కనబడింది. దివ్యాలంకార శోభితయై నీటి తరగలమీద దర్శనమిచ్చింది. "ఆగునాయనా ! ఆత్మహత్య



మహాపాపము. నీ నిరీక్షణ ఫలించే సమయమాసన్నమైంది. సద్భావనా శీలుర పూజలు సత్ఫలితాలిస్తాయి. నీవు మీ కుల గురువును సంప్రదించి యజ్ఞము చెయ్యాలి. యజ్ఞహవనము సర్వదోష నివారిణి. పర్యావరణ కాలుష్యాన్ని పారదోలి ప్రాణ కోటికి ఆరోగ్య సౌభాగ్యాల నందిస్తుంది. సంతానోత్పత్తికి అడ్డుపడుతున్న శారీరక రుగ్మతలను తొలగిస్తుంది. ఇదే యజ్ఞము ద్వారా నీ కోరిక నెరవేరే మార్గము లభిస్తుంది. శుభంభూయాత్ !" ఆశీర్వదించి అదృష్యమైంది.

ఒంపుల సొంపులతో నిండుగా ప్రవహిస్తున్న గోదావరి తరగల చిరునగవులు చిందించింది. "కుసుమగుప్త మహారాజా ! విశ్వ వినోదిని, లోకమాత ఆదిశక్తి నీ మూలంగా నన్ను కరుణించింది. నీకు ధన్యవాదాలు." అలల కదలికల సవ్వడిలో వినిపించింది. కుసుమ గుప్తుడిని ఆనందాశ్చర్యాలలో ముంచెత్తింది.

"ధన్యోస్మి మాతా ! జై గోదారీ ! జై జై కన్యకాపరమేశ్వరీ !" నరాల స్వరాల జయజయధ్వానాలు నిలువెల్లా పులకింపజేశాయి. కృతజ్ఞతా భావంతో ఒడ్డుకు చేరాడు. మందీ, మార్బలముతో బయలుదేరాడు. అశ్వదళము రక్షణ వలయముగా వెంబడిస్తోంది.

"ప్రభూ ! "దళాధిపతి ఆశ్చర్యాన్నణచుకుని సవినయముగా అడిగాడు." ఎన్నడూ లేనంత హుషారుగా ఉన్నారు. మీ హావభావాలలో సంతోషం వ్యక్తమవుతోంది. దయచేసి కారణం సెలవిస్తారా !" గుర్రాన్ని పక్కనే పరుగెత్తిస్తున్నాడు.

"నిజమే... అన్నీ ఉన్నా ఏమీలేని వాడిలా బాధపడుతున్న నా మనసుకిప్పుడే ఊరట లభించింది. నా సమస్యకోపరిష్కారం లభిస్తుంది."

"అలాగా ప్రభూ ! చాలా సంతోషం."

"సరే ... నేనిప్పుడు మన రాజగురువు భాస్కరాచార్యుల వారిని దర్శించుకోవాలి. వెంటనే వెళ్లి వారికి నా అభీష్టాన్ని తెలియజెయ్."

"చిత్తం ప్రభూ !"

త్రేతాయుగములో జనమనోరంజకుడుగా ఖ్యాతి నార్జించిన ఉద్వాహుడు ప్రాభాతస గోత్రానికి మూలపురుషుడు. అతని కుమారుడు మఘుడు యజ్ఞయాగాదులతో దేవతలను మెప్పించాడు. కామగమన విమానములో గంధర్వరాజు విశ్వావసుడిని దర్శించుకున్న మధుమంతుడు, ధర్మపాలనా దక్షుడు తులాధారుడు, సచ్ఛీలుడు మణిగ్రీవుడు, గార్గ్యమహర్షి దయతో యోగము పొంది బ్రహ్మజ్ఞానియైన జటిలుడు, శూద్రస్త్రీని ధర్మపత్నిగా స్వీకరించిన పద్మాక్షుడు... వీరంతా అదే వంశస్తులు. పద్మాక్షుని కొడుకు శ్రవణ కుమారుడే

దశరథ మహారాజు శబ్దభేధి బాణానికి గురై మరణించాడు. ఆ మహనీయులంతా కుసుమ గుప్తుని వంశస్తులే. ప్రాభాతస గోత్రీకులే.

అంతేకాదు. ద్వాపర యుగములోని శివుడు, గోముఖుడు అతని ముత్తాతలు. కలియుగారంభాన్ని కళ్లారా వీక్షించిన కుముదుడు అతని తాత. కుసుమేశ్వరుని పరమభక్తుడు, ధర్మకర్మ పరాయణుడైన కల్హారుడు అతని తండ్రి. అతడు జన్మించగానే దివి నుండి భువికి పూలవాన కురిసింది. అందుకే కుసుమ గుప్తుడైనాడు.

పరమ భాగవతోత్తముడు, మణిమయ భూషణధారి మణికుండలుని కూతురు కుసుమాంబ ధర్మపత్ని. తాతముత్తాతల వైభవప్రాభవాలను వర్తమానానికి అన్వయించు కుంటూ సుపరిపాలన సాగిస్తున్న కుసుమ గుప్తుడు పెనుగొండ సామ్రాజ్యాధిపతి. అతని పాలనా పరిధిలో 18 సామంత రాజ్యాలు పాడిపంటలతో వర్ధిల్లుతున్నాయి. 1) జ్యేష్ఠ శైలము (గోదావరి తీరమందలి పెనుగొండ), 2) నిరవద్యకము, 3) ఏలాపురము (ఏలూరు), 4) వీరనారాయణము, 5) విశాలము (విశాఖపట్టణము), 6) శివపురము, 7) ఆసంటము (ఆచంటి), 8) నరసము (నరసాపురము), 9) ధనదము, 10) ధర్మపురము (ధర్మవరము), 11) జగన్నాథము (జగ్గయ్యపేట), 12) కళింగము, 13) పాంచాలము, 14) పాలకుండము (పాలకొల్లు), 15) త్రిగుణము, 16) భీమము (భీమవరము), 17) ఘంటసాలము (ఘంటసాల), 18) పీఠికాపురము (పిఠాపురము) పట్టణాలు ఆయా సామంత రాజ్యాల రాజధానులు.

ఆ రాజ్యాల సామాన్య జనాలనెవరినడిగినా – "ఏ పూర్వ జన్మ సుకృతమో కుసుమగుప్త ప్రభువుల చల్లని పాలనలో సుఖంగా ఉన్నాము." అంటారు. మరికొందరు సగర్వంగా

"మా పెనుగొండ ప్రభువు పరిపాలనా దక్షులేకాదు. వర్తక వాణిజ్యాల్లో నిష్ణాతులు. విదేశీ వాణిజ్యములోని కిటుకులన్నీ తెలుసు. వారి శక్తియుక్తులే మా రాజ్యాలకు శ్రీరామ రక్ష" చెప్పేస్తారు.

చావడి చర్చల్లో, రచ్చబండ ముచ్చట్లలో కుసుమగుప్తుని ధర్మాచరణ, ఆదేశిక సూత్రాలను శిరోధార్యంగా భావిస్తారు.

పెనుగొండ మహారాజు శాంతికాముకుడు. కాని శాంతి సౌభాగ్యాల రక్షణ కోసం క్రాంతి అవసరమంటాడు. ప్రజలంతా బుద్ధిబలంతో పాటు భుజబలం సాధించాలంటాడు. గజ, తురగ పదాదిదళాలు సామ్రాజ్యం ఎల్లల్ని కంటికి రెప్పలా కాపాడుతుంటాయి. త్రివిధ దళాలకు తోడుగా నౌకాదళములో యుద్ధనిపుణులున్నారు. వారంతా నిరంతరం అప్రమత్తమై ఉంటారు. పటిష్ఠమైన గూఢాచార వ్యవస్థలో పగతుర

ఎత్తులకు పైఎత్తు వేసి చిత్తు చేయగల నిష్ణాతులున్నారు. అయినా చీటికిమాటికీ యుద్ధానికి దిగడం మూర్ఖత్వమంటాడు. తోటి సామ్రాజ్యాధిపతులతో, సామంత రాజులతో చెలిమి కలిమి పంచుకున్నాడు. అందుకే వారందరి హృదయాల్లో మర్యాదా పురుషోత్తముడుగా స్థానం సంపాదించాడు.

పెనుగొండ సామ్రాజ్య ప్రజాజీవనములో సమైక్యత, సమరసత, దేశభక్తి ప్రముఖస్థానాన్నాక్రమించాయి. వేదాలు, పురాణాలు విశ్వమానవ కల్యాణకారకాలని విశ్వసిస్తారు. వేదాల్లో నిక్షిప్తమైన ధర్మ సూక్ష్మాలను సరళభాషలో రాయించి సామ్రాజ్యాల కందుబాటులో ఉంచాడు కుసుమగుప్తుడు. అందుకే సామాన్యులు గూడా అసామాన్య ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తుంటారు.

భారతఖండములో ఎవరేమతాన్ని స్వీకరించినా హిందూ జీవన విధానము అందరికీ ఆచరణీయమని నమ్ముతాడు కుసుమ గుప్తుడు. అప్పటికే వ్యాప్తిచెందిన జైన మతాన్ని, అప్పుడప్పుడే వికసిస్తున్న బౌద్ధమమతాన్ని వ్యతిరేకించలేదు. అంతేకాదు. జైన, బౌద్ధారామాల నిర్మాణం కోసం ధన సహాయమందిస్తున్నాడు. అప్పటికే ద్రాక్షారామంలోని జైనారామం అభివృద్ధికోసం భూరి విరాళమందించాడు.

ఆదిశక్తి సకలదేవతారాధన లందుకుంటుంది. ఆదిశక్తి రూపాల్లో ఒకటైన శ్రీ కన్యకాపరమేశ్వరి కుసుమగుప్తునితో పాటు పెనుగొండ సామ్రాజ్యప్రజావళికి ఇలవేలుపు. ప్రత్యేకించి వైశ్య జాతికి కొంగు బంగారము. వర్ణాశ్రమ ధర్మ సంరక్షణ, సాంప్రదాయాల సంరక్షణ కుసుమగుప్తుని జీవన విధానములో జీర్ణించుకున్నాయి. కళారాధన అతని కానందదాయకము. కవులు – కళాకారులను ఆస్థానానికాహ్వానించి, ప్రదర్శనల్లో పులకించి, స్వయంగా సన్మానిస్తాడు. పంచభక్ష్య పరమాన్నాలతో బంతి భోజనాలేర్పాటు చేసి అందరితో పాటు తానూ భోంచేస్తాడు. విద్యా – వైద్య సౌకర్యాలు జన సామాన్యానికి అందుబాటులో ఉంటాయి. పేదలకు ధనసహాయం, పేద విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు ఉచిత భోజన వసతి ఉంటుంది. కుసుమగుప్త మహారాజు పాలనలో పెనుగొండ కవుల తోట, కళాకారుల కోట అంటారు మిగితా సామ్రాజ్యాధిపతులు.

అందాల భరణి, పతివ్రతాశిరోమణి కుసుమాంబ అర్ధాంగిగా భర్త కనుసన్నలలో మెదుల్తుంది. ప్రజా సంక్షేమమే పాలకుల సంక్షేమమని విశ్వసిస్తుంది. నిత్యము కన్యకాపరమేశ్వరి పూజలో పులకించి పోతుంది. దానధర్మాలలో ముందుంటుంది. సలహా సంప్రదింపులలో భర్తకు కుడిభుజమన్పించుకుంటుంది.

ఆకాశ హర్మ్యాలు, బహుళ అంతస్తుల భవనాలు, కనుసన్నలలో మెదిలే

పరివారము... అన్నీ ఉన్నా సంతాన సౌభాగ్యము లేదని బాధపడుతుంది. వ్రతాలు, నోములు, ఉపవాసాలు... చేస్తూనే పోతుంది. కరిగిన గుండెతో

"మాతృత్వం మహిళకోవరం గదమ్మా ! నా కడుపులో కాయ కాయని కారణమేమిటో చెప్పు తల్లీ !" అంటూ కన్యకాపరమేశ్వరికి పాదాభివందనం చేస్తోంది. భాష్పధారాలతో అమ్మవారి పాదాలు కడిగేస్తుంది. తల్లి కావాలనే తపన రోజు రోజుకూ బలపడుతోంది.

తానే దైవమని నమ్ముకున్న కాంత, ఏకాంతములో సేవలందిస్తూ "ఇహ మనకీ జన్మలో సంతాన సౌభాగ్యం లభించదా ప్రభూ !" విలవిల్లాడిపోతోంది. అన్ని సంపదలున్నా సంతాన సంపదకోసం కంటతడి పెడుతున్న మహారాణి ఆరాటం కుసుమగుప్త మహారాజు అంతరంగ తరంగాల్లో తుఫాను రేపుతుంది. ఆవేదన నదిమిపెట్టి ఆప్యాయంగా

"కుసుమా ! పరమాత్మ పంచలో ఆలస్యమున్నా అంధకారం మాత్రం లేదు సుమా ! ఈ గోదావరి తీరము పూర్వకాలములో పులస్త్యాశ్రమము. ఈ తపో భూమిలోనే కుమారస్వామి అనితర సాధ్యమైన యజ్ఞముచేసి బ్రహ్మదేవుని ఆశీస్సులందుకున్నాడు. ఇంతటి పవిత్ర భూమిలో మన పూజలు ఫలించకుండా పోతాయా ? మన కోరిక నెరవేరకుండా పోతుందా ?" లాలించిన దృశ్యము మదిలో మెదలగానే తనలో తానే నవ్వుకున్నాడు. తాతలనాటినుండి నేటి వరకు కుల గురువు మరియు రాజగురువైన భాస్కరాచారికి మనసులోనే నమస్కరించుకుంటూ అంతఃపురము చేరుకున్నాడు.

ఆధ్యాత్మిక భావాల కాలవాలమైన భాస్కరాచారి ఆశ్రమము ప్రశాంత వాతావరణములో, ప్రకృతి ఒడిలో పరవశిస్తోంది. సువిశాలమైన ఆశ్రమప్రాంగణం పవిత్ర వేదమంత్రాలతో, నిత్యం యజ్ఞయాగాదులతో పరిఢవిల్లుతుంది. మనసులనలరిస్తోంది.

ప్రశిష్యులు పాఠాలు వల్లెవేస్తున్నారు. యజ్ఞధూమము నాస్వాదిస్తూ పర్యావరణము పరవశించిపోతోంది. ఆశ్రమం చుట్టూ వరుసల్లో పెరిగిన చెట్లు, పచ్చని పీతాంబరాలు ధరించిన స్త్రీసైనిక వలయములా కన్పిస్తున్నాయి. పవిత్ర భూమిలోని నిత్యయజ్ఞము, కమ్మని హవనముతో గోదావరి తీరము నిష్కల్మశంగా, నిర్మలంగా తయారై మనోల్లాసాన్నిస్తోంది.

ఆశ్రమం నడుమ పవిత్రాసనము. ఆసనమ్మీద పరుచుకున్న జింక చర్మము మీద ఆసీనుడైన ఆశ్రమాధిపతి భాస్కరాచారి మనోనేత్రాలతో ఆశ్రమవాసుల కదలికలను పర్యవేక్షిస్తున్నాడు. విశాలమైన నుదుటి మీద తెల్లని విభూతిరేఖలు, రేఖల మధ్యలో

గంథం బొట్టు, గోష్పాదమంత పిలక చూపరుల నాకట్టు కుంటున్నాయి. పవిత్ర కాషాయంబరధారి మెడలో రుద్రాక్షమాల పారమార్థిక చింతన రేకెత్తిస్తోంది. బ్రహ్మతేజస్సు మూర్తీభవించిన గురువు గారు కనబడగానే అశ్వదళాధిపతి సవినయముగా తలవంచి నమస్కరించాడు.

"గురువర్యా ! ప్రభువుల వారు తమరిని అంతఃపురానికి ఆహ్వానించారు." మనవి చేశాడు.

"ప్రభువుల వారు మమ్ములనెందుకాహ్వానించారో నీకేమైనా తెలుసా ?" ప్రేమగా అడిగాడు భాస్కరాచారి.

ఏం చెప్పాలో అశ్వదళాధిపతికర్థం కాలేదు. అసలేమీ తెలియదంటే గురువుగారు ఏమనుకుంటారో ! తెలుసునంటే వివరాలు చెప్పాల్సివస్తుంది. చెప్పాలంటే పూర్తి వివరాలు తెలియవాయె.

"ప్రభువుల వారి మనోగతము మాలాంటి సేవకులకు తెలియదు స్వామీ !" తో ప్రారంభించి... గోదావరి నదీ స్నాన సమయాన మహారాజు ప్రవర్తన, హావభావాలన్నీ చెప్పేశాడు.

గురువుగారి దృష్టి శూన్యంలోకి చొచ్చుకు పోతోంది. నుదుటి అనుభవ రేఖల మధ్య గంధముబొట్టు నీలాకాశంలో ఉదయభానునిలా భాసిస్తోంది. ఏదో అర్థమవుతున్నట్టుగా అతని పెదాలమీద సన్నని చిరునవ్వు మెరిసి మాయమైంది.

చేతులు కట్టుకు నుంచున్న అశ్వదళాధిపతితో

"సరే ... నువు వెళ్లు, నేను వస్తా..." అన్నాడు.

వేదఘోష చెవులు కింపుగా వినబడుతూనే ఉంది. మెత్తని ఆసనమ్మీద జింకచర్మం రంగులీనుతోంది. గెడ్డం నిమురుకుంటూంటే అలనాటి సంఘటన భాస్కరాచారి మనసు తెరమీద లీలగా మెదుల్తోంది ....

స్వర్గముకన్నా మిన్నయని దేవతలే మురిసిపోయిన భారతావని భాగ్యరేఖలు హిమాలయ పర్వత శ్రేణులు, రాశులు పోసిన వెన్నముద్దల్లాగున్నాయి. వెండికొండల మధ్య మంచుతెరలకు ఆరేసిన ధవళవస్త్రాల్లా కనబడుతున్నాయవి. పర్వత శిఖరాగ్రాల నుండి సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్న జలపాతాల సవ్వడి కర్ణపేయంగా వినిపిస్తోంది. గుహల్లోంచి పైకెగసి ఆకాశంవైపు పయనిస్తున్న హోమ ధూమం బాలభాస్కరుని లేతకిరణాలకు వన్నెలు దిద్దుతోంది. ఆహా ! ఈ కైలాస వాసులెంత అదృష్టవంతులో ! ... ఆలోచనాలోచనాలతో హిమన్నగాన్నవలోకిస్తూ కుబేరుడు తనలో తానే మురిసిపోతూ నడచి వస్తున్నాడు.

సర్వసంపదల కధిపతిని, నాకేం కొదవ అనుకున్నాను గాని మనసులను మయూరాలుగా నర్తింపజేసే ఇంతటి ప్రకృతి రమణీయత నా నివాసానికి దరిదాపుల్లో ఉందా ? తనను తానే ప్రశ్నించుకున్నాడు.

నగరాజు హిమవంతుడింకా కన్పించడేమిటి ? బ్రహ్మ, విష్ణుమహేశ్వరులు వారి నివాసాల కెళ్తే ఎదురొచ్చి స్వాగతం పలికారు. అష్టదిక్పాలకులను గూడా పలుకరించి సముచిత మర్యాదలందుకుని వస్తున్నాను. అందరూ సగౌరవంగా స్వాగతించారు. పురప్రవేశములోనే ఎదురొచ్చి తోడ్కొని వెళ్లారు. మరీ నగరాజైన హిమవంతుడు ఇంకా ఎదురు రాడేమిటి ?... అవమానం ఛాయలు ఆందోళన పరుస్తున్నాయి. గంభీరంగా అడుగులేస్తూ హిమవంతుని అంతఃపురము చేరుకున్నాడు. సకల సంపదల అట్టహాసం కిరీటం దగద్ధగల్లో ప్రస్ఫుటమవుతూంటే హిమవంతుని సేవాపరివారము అబ్బుర పడుతోంది.

"నవనిధుల కధిపతియైన కుబేరుడిని. నేనొచ్చానని హిమరాజుకు తెలియజేయ్." ప్రతీహారినాజ్ఞాపించాడు.

ప్రతీహారి లోపలికెళ్లి తిరిగి వచ్చాడు.

"దయచేయండి. మా హిమన్నగరాజు మీ కోసం చూస్తున్నారు." సగౌరంగా ఆహ్వానం పలికాడు.

కుబేరుని భృకుటి ఆశ్చర్యంతో పీటముడేసుకుంది.

ఇప్పుడు గూడా ఎదురు రాడేమిటి ? ఏమి చూసుకొని ఈ మిడిసిపాటు ?... లోలోపల అవమాన భావము కలవరపెడుతోంది. పైకి మాత్రము ఏ భావమూ వ్యక్తము కాకుండా జాగ్రత్త పడుతూ అంతఃపురములో ప్రవేశించాడు.

"రండి కుబేరా !... రండి. ఆసీనులు కండి." లేచి నుంచుని కళ్ళతో ఉచితాసనం చూపించాడు హిమవంతుడు. కుబేరుని లోపలి సెగలు – పొగలు కొంతమేరకు ఉపశమనం పొందాయి. సుఖాసీనుడై

"పర్వత రాజా ! ఇంటికొచ్చిన అతిథి దేవతలను సంపూర్ణ గౌరవ మర్యాదలతో స్వాగతించడం మన సాంప్రదాయం గదా !" బలవంతపు చిరునవ్వుతో అడిగాడు.

"అవునా కుబేరా ! అందుకే గదా తమరు కనబడగానే లేచి నుంచుని ఉచితాసనం చూపించాను." మందహాసములో అట్టహాసముంది.

"దీన్ని సంపూర్ణ స్వాగత మంటారా ?"

"ఎందుకనరటా ?"

"మేము పురప్రవేశ సమయములోనే మా ఆగమన వార్తను మీకు పంపాము గదా !"

"అవును... అయితే ?"

"అప్పుడే నాకెదురొచ్చి బయటి ద్వారము వద్దనే సగౌరవంగా స్వాగతం పలుకవచ్చు గదా ! త్రిమూర్తులు, అష్టదిక్పాలకులను సందర్శించి వస్తున్నాను. వారంతా అలాగే స్వాగతించారు. మీనుండి గూడా అదే మర్యాద లభిస్తుందనుకున్నాను." ముక్కుపుటాలు రోషంతో ఎగిరిపడుతున్నా లోపలి కుతకుతల్ని నియంత్రించుకోవాల్సి వచ్చింది.

"అబ్బా !" నుదురు చిట్లించి "మీరొచ్చిన పనేమిటో చెప్పండి." విలాసంగా ఆసనం వెనక్కు ఒరిగాడు. "త్రిమూర్తులు, అష్టదిక్పాలకులు నాతో సరితూగరని తెలుసు గదా !" మాటల్లో గర్వం, హావభావాల్లో దర్పం తొణకిసలాడాయి.

"ప్రత్యేకంగా పనేమీలేదు. మీ అందరినోమారు సందర్శించి పలుకరించాలని అనిపించింది. బయలుదేరాను. సకల లోక సంపదలన్నింటికీ అధిపతినైన నేను దేవతలందరి అవసరాలను కనుక్కోవాలి గదా !"

"అలాగా దిశాధిపతీ !" హిమవంతుడు నవ్వేశాడు. ఆ నవ్వులో ఒకింత వ్యంగం తొంగిచూసింది. "మీ రాక మాకు సంతోషదాయకమే. కానీ... దేవతలెవ్వరికీ లేని ప్రత్యేకత నాకుందని తెలియదా ?"

"ఏమిటో ఆ ప్రత్యేకత ?" కుబేరుడి మొహం ముడుచుకు పోయింది. అసహనంగా అటూఇటూ చూస్తున్నాడు.

"లయకారుడైన పరమేశ్వరుడు నా అల్లుడు. పర్వతశ్రేణులన్నింటినీ శాసించగల పర్వత రాజును. అన్నింటినీ మించి సర్వశక్తి సంపన్నురాలైన పార్వతిని కూతురుగా పొందిన భాగ్యవంతుడిని. కాబట్టి మిగితా దేవతలందరిలా నేను సామాన్యుడిని కాను. ఈ సంగతి తమరికి తెలియదా కుబేరా ?"

చివరి వాక్యాలు కుబేరుడిని ఆలోచనలో పడేశాయి.

ఓహో ! పార్వతీదేవి కూతురని గదా ఇంత గర్వము. అయితే సకల దేవతల సృష్టికర్త, ఆదిశక్తి రూపమైన కన్యకాపరమేశ్వరి అంతకంటే గొప్పది గదా !... భావం మనసులో దృఢపడింది.

అవసరమున్నంత వరకే పొడిపొడిగా మాట్లాడి బయటికొచ్చేశాడు. దృఢ నిర్ణయం ఆరాటం అధికమైంది. సముచిత ప్రదేశం కోసం వెతికాడు. అక్కడే

కన్యకాపరమేశ్వరి గురించి తపస్సు ప్రారంభించాడు. కఠోర నియమనిష్ఠలు పాటిస్తున్నాడు.

కొంతకాలం కూచుని, ఇంకొంత కాలం నిల్చుండి, మరికొంత కాలం ఒంటి కాలుమీద తపస్సు చేశాడు. ప్రాణం కన్న పరువు మిన్న ... సంకల్పబలం, పట్టుదలను పెంచింది. జగన్మాత కన్యకాపరమేశ్వరి కరుణించి ప్రత్యక్షమైంది. కుబేరుని సంతోషం కట్టలు తెంచుకుంది. ఆదిశక్తికి పాదాభివందనం చేశాడు.

"కుమారా, కుబేరా ! నీవు అభిమానధనుడివని రుజువైంది. సకల సంపదలకధిపతివై గూడా ఎందుకింత కఠోర తపస్సుకు పూనుకున్నావు ? ఏమిటి నీ కోరిక ?" ఆప్యాయంగా అడుగుతూంటే అమ్మవారి దివ్య తేజస్సుతో వనము నందనోద్యానవనమై పులకరించింది.

"అమ్మా ! జగజ్జననీ ! విశ్వవినోదినీ ! ఇన్నాళ్లకు కరుణించావా తల్లీ !" అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని చూసేందుకు రెండు కళ్లు చాలవనిపిస్తుంది. మానసవీణ దివ్యానుభూతిలో లీనమై మూగవోయింది.

"నీ అభీష్టమేమిటో చెప్పు కుమారా !" అభయహస్తం ఆశీస్సులందించింది.

"అమ్మా !" తేరుకుని గొంతు సవరించుకున్నాడు. "నా వద్ద ధనరాశులెన్నో ఉన్నాయి. భోగభాగ్యాలకేమీ కొదవ లేదు. కాని... హిమవంతుని పుత్రికాగర్వం నన్ను అవమాన పరిచింది తల్లీ !"

"అయితే... !"

"హిమవంతుని లాగానే నాకూ ఓ సుపుత్రిక కావాలి. నీ అంశతో త్రిమాతల్లో ఒకరు నా పుత్రికగా జన్మించాలి. ఆ పుత్రికోత్సాహాన్ని నేను మనసారా ఆనందించాలి. అదే నా కోరిక తల్లీ ! నాకా వరం ప్రసాదించు మాతా !" మనసులోని కోరిక విన్నవించుకున్నాడు.

"వత్సా ! కోటానుకోట్ల సంపదలున్న వారి గ్గూడా కోర్కెలుంటాయని రుజువు చేశావు. నీ కోర్కె వింతగా ఉంది. అయినా అందులో నిజాయితి ఉంది. కాబట్టి నెరవేరుతుంది. విశ్వశ్రేయస్సు కోసం కలియుగారంభములో నువ్వు మానవుడిగా జన్మిస్తావు. పెనుగొండ సామ్రాజ్యధిపతిగా కీర్తినార్జిస్తావు. కుసుమగుప్తుడనే పేరుతో విశ్వఖ్యాతి నార్జిస్తావు. ఏ పార్వతినైతే పుత్రికగా పొంది హిమవంతుడు గర్వంతో నిన్ను అవమాన పరిచాడో, అదే పార్వతి... నా అంశతో నీకు కూతురుగా జన్మిస్తుంది. నాలుగు కాళ్లతో నడవాల్సిన ధర్మదేవత కలియుగములో ఒంటికాలుపై నడుస్తుంది. అది కలిపురుషుని ప్రభావం. కలియుగారంభము నుండే వర్ణాశ్రమ ధర్మ సంరక్షణ,

న్యాయవర్తనం, శాంతస్వభావం అవసరమవుతుంది. పారలౌకిక సుఖం కోరుకునే వారు లౌకిక సుఖ, దుఃఖాలకు, దుర్మార్గులకు తలవంచరని నువ్వు నిరూపించాల్సి ఉంది. ఆ ప్రయత్నములోనే నా అంశయైన పార్వతి ఆత్మార్పణం చేస్తుంది. నీవు గూడా నీ పుత్రికతో ఆత్మార్పణం చేసి అలకాపురి చేరుకుంటావు. నీ అధిపత్యాన్ని నిలుపుకుంటావు."

"తల్లీ ! కోరిక నెరవేర్చుకునేందుకు నేను మానవ జన్మ ఎత్తాలా ?"

"వత్సా ! మానవ జన్మ సామాన్యమైనది కాదు. చరాచర జగత్తులోని ప్రాణకోటిలో మానవ జన్మ ఉత్తమమైనది. ప్రత్యేకించి వేదభూమిమైన భారతావనిలో జన్మ... సామాన్యులకు దుర్లభమైనది. అందుకే మానవులను అమృత పుత్రులంటారు. అదే భారతభూమిలో జన్మిస్తావు గదా !"

"ధన్యోస్మిమాతా ! లోకకల్యాణ యజ్ఞములో నేనూ ఓ సమిధను కావడం సంతోషమేనమ్మా."

"అభీష్ట సిద్ధిరస్తు"

"చాలు తల్లీ ! నా మానవ జన్మ చరితార్థం కాబోతుంది." నిలువెల్లా పొంగిపోతూ ఆదిశక్తి ముందు మోకరిల్లి సాష్టాంగ ప్రణామం చేశాడు...

...అలనాటి కుబేరుడే నేటి కుసుమగుప్తుడు.

దివ్యదృష్టితో అవలోకించిన భాస్కరాచార్యుడు గాల్లోకి చేతులెత్తి ఆకాశానికి నమస్కరించాడు. "విధాతా ! నీ నిర్ణయం జీవులందరికీ శిరోధార్యము. ఏది ఎప్పుడెలా జరగాలో అది అప్పుడు జరిగి తీరాల్సిందే గదా !" గొణుక్కుని నిట్టూర్చాడు. పెదాలమీద నిర్వేదమైన చిరునవ్వు కలియుగ మాయకు సంకేతములా అలా మెరిసి ఇలా మాయమైంది.

నిశ్చల హృదయంతో నిరాడంబరముగా కొద్దిమంది శిష్యులతో కుసుమగుప్తుని అంతఃపురము చేరుకున్న భాస్కరాచార్యుడుకి వాతావరణము హృదయోల్లాసమునిచ్చింది.

అప్పటికే... సూర్యోదయ శుభముహూర్తాన గోదావరి నదిలోని అనుభవాన్ని ధర్మపత్ని కుసుమాంబకు వివరించాడు కుసుమగుప్తుడు.

మహారాజు – రాణి సపరివారముగా ఎదురొచ్చి గురువుగారికి సాష్టాంగ ప్రణామమాచరించి తోడ్కొని వెళ్లారు. ఉచితాసనం చూపించారు. ఆసనాన్నలంకరిస్తున్న భాస్కరాచార్యుడు అపర బ్రహ్మలా కన్పించాడు.

"మహారాజా ! సామ్రాజ్యములో అందరూ క్షేమమే గదా !" ఆత్మీయంగా

పలుకరించి "కూచోండి. సుఖాసీనులు కండి." అనుమతించాడు.

గోదావరి నదీమ తల్లి ఒడిలో తన అనుభవాన్ని, అనుభూతిని పూర్తిగా వివరించాడు కుసుమగుప్తుడు.

"గురువర్యా !" కుసుమ కోమల శరీరధారియైన మహారాణి కుసుమాంబ చేతులెత్తి నమస్కరించింది. "ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి ప్రభువుల వారికిచ్చిన సూచన ఫలిస్తుందటారా ? మాకు సంతాన సౌభాగ్యం లభిస్తుందటారా ?" మనసులోని ఆరాటం బయటపడింది. జవాబు కోసం ఆసక్తిగా ఉంది.

"మహారాణీ !" భాస్కరాచారి నుదుటి రేఖలు వంకలు తిరిగి యధాస్థానాని కొచ్చాయి. "ఆదిశక్తి లీలావిలాసము అనంతమైనదమ్మా. మానవమాత్రులు కర్తవ్యాన్ని మరువరాదు. ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి సూచనను అల్లాటప్పాగా భావించరాదు." అంటూంటే కాషాయ వస్త్రాలు కాంతులు విరజిమ్ముతూ ఉదాత్త భావాలను రేకెత్తిస్తున్నాయి.

కుసుమాంబ మనోవనములో ఆశలకోయిల గొంతు సవరించింది. చూపులు భర్తవైపు మళ్లాయి. ముత్యాల ముక్కుపుడక మెరుపులు చిరునవ్వులో ప్రతిబింబిస్తున్నాయి. అసలు సంగతి అడగమంటున్నాయా చూపులు. కుసుమగుప్తుడు సంతోషంగా తలపంకించాడు.

"గురువర్యా ! సంతాన సాఫల్యం కోసం కన్యకాపరమేశ్వరి అమ్మవారు యజ్ఞం చెయ్యాలంది గదా ! బ్రహ్మమానస పుత్రులైన మీరు ఆ యజ్ఞమేమిటో, విధివిధానాలేమిటో సెలవివ్వండి."

భాస్కరాచార్యుడు బ్రహ్మతేజస్సు నుండి ఓ నిట్టూర్పు వెలువడింది. "మహారాజా ! త్రేతాయుగములో దశరథ మహారాజు పుత్రకామేష్ఠి యాగం చేసి సత్సంతానాన్ని పొందారని తెలుసు గదా ! అలాగే మీరు గూడా అదే పుత్రకామేష్ఠి చెయ్యాలి. అందుకు చెయ్యాల్సిన ఏర్పాట్లు చాలా ఉన్నాయి. ఏ యాగాన్నైనా సమర్థవంతముగా నిర్వహించే శక్తియుక్తులు మీకున్నాయని తెలుసు."

యజ్ఞము విధివిధానాలను, చెయ్యాల్సిన ఏర్పాట్లను సవివరంగా చెప్పాడు. సుముహూర్తం గూడా నిర్ణయమైంది.

కుసుమగుప్త మహారాజులో ఉత్సాహం ఉరకలేసింది. కుసుమాంబ హృదయ పుష్పం ఉదాత్తంగా విచ్చుకుంది. మాతృత్వం మహిళా లోకానికి ప్రకృతి ప్రసాదించిన వరము. నేనుగూడా తల్లినై తీరుతాను... గుండెనిండా ఆనందము.

అంతఃపుర పరివారానికి ఆజ్ఞలు జారీచేశారు. ఏర్పాట్లు చకచకా జరిగి పోతున్నాయి.

భారతఖండములోని మహారాజులకు, పెనుగొండ సామ్రాజ్యములోని నగరస్వాములకు, సామంత రాజులకు ప్రత్యేక దూతల ద్వారా ఆహ్వానాలు పంపించారు. 714 గోత్రీకులైన వైశ్యోత్తములకు, ఋషిపుంగవులందరికీ ఆహ్వానాలందాయి.

పచ్చని పందిళ్లు, స్వాగత తోరణాలతో పెనుగొండ నగరము శోభాయమానంగా తయారైంది. ఎవరికి వారు తమ ఇంటిని సర్వాంగ సుందరంగా అలంకరించుకున్నారు. పాతబారిన వీధి స్థంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటుచేశారు. రాత్రి సమయాన దూరం నుండి పెనుగొండ నగరము చుక్కల పందిరిలా కనబడుతోంది.

యజ్ఞము రోజు... ఉదయాన్నే వాకిళ్లన్నీ ముత్యాలముగ్గులతో నిండాయి. రావాల్సిన వారంతా వచ్చేశారు. అందరికీ స్వాగతసత్కారాలు లభిస్తున్నాయి. పెనుగొండ సామంతరాజులు, మంత్రులు స్వయం స్ఫూర్తితో రంగములోకి దిగి కార్యకర్తలుగా పంజేస్తున్నారు. ఎవరికెలాంటి ఇబ్బంది కలగకుండా విడిది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహారాజు హృదయంలా యజ్ఞవాటిక విశాలంగా తయారైంది. చుట్టూరా పూలతోరణాలు కనువిందు చేస్తున్నాయి. ప్రవేశద్వారాలు కొబ్బరి, అరటాకులతో స్వాగతం పలుకుతున్నాయి. యజ్ఞనిర్వహణలో ఆరితేరిన ఋత్విజులు తమ తమ విధుల్లోకి దిగారు.

కుసుమగుప్త దంపతులు మామూలు యజ్ఞవస్త్రాలు ధరించి యజ్ఞగుండము వద్ద కూచున్నారు. మహారాజులు, సామంతరాజులు, వైశ్యప్రముఖులు, నగరస్వాములు తమ స్థానాలనలంకరించారు.

యజ్ఞం ప్రారంభమైంది. వేదపండితులు మంత్రోచ్చారణతో యజ్ఞసమిధలను అగ్నిదేవునికి సమర్పిస్తున్నారు. కుసుమగుప్త దంపతులు స్వయంగా ఆవునెయ్యి సమర్పిస్తున్నారు. యజ్ఞగుండములోంచి అగ్నిజ్వాలలు స్వర్ణవర్ణం దాల్చి పైకెగురుతున్నాయి. అంతా ముగ్ధులై యజ్ఞాన్ని తిలకిస్తున్నారు. యజ్ఞం సఫలం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

అగ్నిపురుషుడు నాల్కలు చాచి సంబారాలను సంతోషంగా జీర్ణం చేసుకుంటూ మిగితా దేవతలకు ఆజ్యధారల నందిస్తున్నాడు. యజ్ఞధూమము కమ్మని వాసనలను వెదజల్లుతూ నలుదెసలా వ్యాపించి వాతావరణాన్ని శుద్ధి చేస్తోంది. అగ్ని ద్వారా హవిస్సులందుకున్న దేవతలు యజ్ఞపురుషుణ్ణి ప్రేరేపించారు.

అందరి సమక్షములో, వేదపారంగతుల మంత్రోచ్చారణల మధ్య యజ్ఞపురుషుడు

బంగారు కలషంతో ప్రత్యక్షమయాడు. యజ్ఞగుండములో దేదీప్యమానంగా వెలిగిపోతూ

"పుణ్యమూర్తులైన కుసుమగుప్త దంపతులారా ! మీ ప్రయత్నం ఫలించింది. ఈ కలషాన్ని అందుకోండి. దైవప్రసాదమైన ఇందులోని పాయాసాన్ని భుజించి సంతానవంతులు కండి." కలషాన్ని అందిస్తూ సంతృప్తి వెలిబుచ్చాడు.

"మహాప్రసాదం మహానుభావా!" అంటూ కుసుమగుప్త దంపతులు వికసిత వదనులై పాయస కలషాన్ని స్వీకరించి భక్తితో కళ్లకద్దుకున్నారు.

సఫల మనోరథుడైన కుసుమగుప్త మహారాజు ఋత్విజులను, ఋషిపుంగవులను, మహారాజులను, సామంతరాజులను సముచిత రీతిన సత్కరించాడు. గోదాన భూదానాలు చేశాడు.

శుభముహూర్తాన పాయస సేవనం జరిగింది.

# 2

కుసుమ కోమల మనస్వి మహారాణి కుసుమాంబ గర్భం ధరించింది. పుల్లని పదార్థాలు తింటూ పులకించిపోతోంది. మట్టిబెడ్డలను చప్పరిస్తూ మహదానంద పడుతోంది. కుబేరుని సంపదలన్నీ తన సొంతమైనంత సంతోషంగా ఉంది కుసుమగుప్తునికి. అంతఃపుర వాసులంతా మురిసిపోతున్నారు. పుంసవనం ఘనంగా జరిగింది. విప్రోత్తములకు, పేదలకు వస్త్ర, గో, ధనధాన్యాలు దానం చేశారు.

మధురోహల ఊయలలూగుతూ మహారాణి చెలికత్తెల మధ్య హుషారుగా తిరుగుతోంది. సీమంతోత్సవం రంగరంగ వైభోవంగా సాగింది. పట్టణములోని పెద్ద ముత్తైదువులందరూ వేడుకల్లో పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయములో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాటలు పాడుతూ రంగుల గాజులు తొడిగారు. మళ్లీ కొత్త పెళ్లికూతురుగా రాణిస్తున్న కుసుమాంబ ముత్తైదువులకు వాయినాలిచ్చి ఆశీస్సులందుకుంది. వేదపండితులు పవిత్ర మంత్రోచ్చారణతో దీవించారు.

నెలలు నిండాయి. కుసుమాంబకది తొలిచూలు కాబట్టి శారీరక మార్పులు కొత్త అనుభవపాఠాలు నేర్పుతున్నాయి.

"ప్రభూ !" ఏకాంతములో కుసుమగుప్తుని ఒడిలో కుసుమాంబ ఒదిగిపోయింది. గుండెల్లో మొగ్గదొడిగిన ఆనందం కళ్లల్లో కదిలి పెదాలనాక్రమించింది. చిరునవ్వు వెన్నెల కెరటాల్లాగుంది.

"నిజంగా మన కోర్కె నెరవేరుతుంది గదా ! మన కలల పంటను కళ్లారా చూస్తాం గదూ !" సిగ్గుల బుగ్గలు ఎర్రగులాబీలైనాయి. పున్నమి రాత్రి కలువలా విచ్చుకున్న మోహాన్ని అరచేతుల్తో కప్పుకుంది. నుదుటి సిందూరము, ముత్యాల ముక్కుపుడక, జరీఅంచు ఆకుపచ్చ పీతాంబరము... త్రివర్ణ ముఖ చిత్రములాగుంది. మహారాణి మనసులో మల్లెల వర్షం కురిసింది. చూపులక్కడే నిలబడిపోయినై,

"చెప్పండి ప్రభూ ! మీ చిలిపి చూపులు గిలిగింతలు పెడుతున్నాయి సుమా !" కళ్లు మూసుకుంది.

"కుసుమా !" చెంపమీద చిటికేశాడు."కన్యకాపరమేశ్వరి మన కులదైవం. ఆ తల్లి ఇచ్చిన వరమే గదా, అనుమానమెందుకూ ?"

"అవును. అంతా ఆ పరమేశ్వరి దయనే గదా !" ఒడిలో ఒదిగిపోయింది.

"కుసుమా ! కుసుమ పేశల సమానమైన నీ రూపమిప్పుడు చూడ ముచ్చటగా ఉంది సుమా !" గిలిగింతలు పెట్టాడు.

"ఓహ్ ! అందుకేనా తమరిప్పుడు సరస సల్లాపాలకు దిగారు !" గలగలా నవ్వింది.

అలా ఎంతసేపు గడిచిందో.

గతం ఆ గతానికి, వర్తమానానికి ముడిపడి ఉందని అర్థమైన కాలం కౌగిలింతల్లో కరిగిపోయింది.

మన్మథుని మాయాజాలం, శివపార్వతుల కేళీవిలాసము, కుమారస్వామి జననం, తారకాసుర సంహారం... సంఘటనలు గతకాలం కౌగిట్లో ఒదిగిపోయినై. లోకకంటకుడైన తారకాసురుని సంహారంతో ఋషులు, దేవతలు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

కైలాసగిరి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. అసుర సంహారంలో అనితర సాధ్యుడనిపించుకున్న కుమారస్వామిని కైలాసవాసులు, ప్రమదగణాలు, పార్వతీ పరమేశ్వరులు అభినందిస్తూ ఆనందముతో ఉక్కిబిక్కిరవుతున్నారు. నందీశ్వరుడైతే నిలువెల్లా పొంగిపోతూ పార్వతీ పరమేశ్వరులను స్వయంగా తోడ్కొని వచ్చాడు. శివపార్వతులు కొలువుదీరగానే విజయోత్సవ వేడుకలు ప్రారంభమైనాయి.

నందీశ్వరుని పొంగులు, హంగులు నాట్యభంగిమలుగా రూపు దిద్దుకున్నాయి. భృంగి వాయిద్యం ప్రమదగణాల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. నందీశ్వర నృత్యహేలా విలాసములతో కైలాసగిరి కళకళలాడ్తోంది. శివుని కనుసన్నలలో నందీశ్వరుని నృత్యము

చివరి దశకొచ్చింది. శారీరికంగా అలసిపోయినా మానసికోల్లాసం ఏమాత్రం తగ్గలేదు. పరమేశ్వరుడు పరమానందభరితుడై

"భళా నందీ ! నీ నృత్యహేల నా తాండవ నృత్యాన్ని మరపించింది. హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను." ఆశీస్సులందించాడు. కంఠాభరణమైన నాగరాజు తృప్తిగా తలాడించాడు.

"నా వాయిద్యాన్ని కనుగుణంగా నర్తిస్తావో లేదో అనుకున్నాను గాని... అమోఘమైన ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించావు నందీశ్వరా !" భృంగి ప్రశంసల్లో ముంచెత్తాడు. ప్రమదగణాల కేరింతలు మిన్ను ముట్టాయి.

ఆనంద పరవశముతో పార్వతికి నోటి మాట రాలేదు.

నందీశ్వరుడు అందరికీ నమస్కరించాడు. అదే ఊపుతో పరమేశ్వరునికి ప్రదక్షణం చేసి పాద నమస్కారం చేశాడు. శివుని ఆశీస్సులందుకని పక్కకు జరిగాడు.

"ఇదేమిటటా ?" పార్వతిలో అవమాన భావం. కనుబొమలు ముడిపడినై. ఎప్పుడూ మా ఇద్దరికి ఒకసారి ప్రదక్షిణం చేసి పాదనమస్కారం చేసే నందీశ్వరుని కంటికి నేను కనబడలేదా ? అంత అహంకార మెందుకో ! ఆలోచన సుడులు తిరిగింది.

"నందీ ! నీకిది తగునా ?" హుంకరించింది – ఆప్యాయంగా.

"నేనేమన్నాను తల్లీ !" వణికిపోయాడు నందీశ్వరుడు.

"ఏమీ అనలేదు గాని చేసి చూపించావు. పరమేశ్వరుని పక్కనే ఉన్న నేను నీ కంటికి కనబడలేదా ? నీ భక్తి ప్రపత్తులివేనా ?"

"నా భక్తి ప్రపత్తుల కేమీ కొదవ లేదమ్మా. కానీ... " ఇంకేదో అనబోయి ఆగిపోయాడు నందీశ్వరుడు. అతని ముఖ కవళికల్లో నిస్పృహ గోచరించింది. పార్వతి అందుకుంది –

"నీ నృత్యహేలను చూచి పులకించి పోయాను. ఆ తన్మయత్వంలో నిన్ను అభినందించేందుకు మాటలు గూడా రాలేదు తెలుసా ?"

నందీశ్వరుని కామాటలు నమ్మశక్యము కాలేదు. ఎదలో సన్నని బాధ." మీ సుపుత్రుని శౌర్యసాహసము చూసి పట్టరాని ఆనందముతో పొంగిపోయాను తల్లీ ! పుత్రోత్సాహంలో మునిగి తమరు నన్ను... ఈ సేవకుణ్ణి మరిచారు గదా మాతా ! అందుకే నాకు ఆశీస్సులందించలేక పోయారు గదా ! అది నా మనస్తాపానికి కారణమైందమ్మా !"

అతని సమర్థన పార్వతికే మాత్రం నచ్చలేదు.

"మనస్తాపం కాదది, అహం" కళ్లల్లో ఎర్రజీరలు. "ఈ అహంకార ప్రదర్శనం ఊరకే పోతుందనుకోకు. కైలాసపతి కర్ధాంగినైన నన్నే విస్మరించి అవమానపరిచిన నీవు భూలోకములో మానవుడివై జన్మిస్తావు." శపించింది.

పార్వతి పలుకులు ములుకులైన నందీశ్వరుని ఒంటినిండా గుచ్చుకున్నాయి. నిరంతరం శివపార్వతుల సేవలో నిమగ్నమైన నన్నే శపించి దూరం చేసుకోవాలా ? ఇది అమానుషం... గుండె మండింది. ఆవేశంతో ఊగిపోతూ

"తల్లీ ! తనయుడిలాంటి నన్నే శపించావు గదూ !" కొమ్ముల నూపుతూ "అదే భూలోకంలో నాతోపాటు తమరు గూడా మానవిగా జన్మిస్తారు." ప్రతిశాపమిచ్చాడు.

కైలాసవాసుల మనసుల్లో కల్లోలం చెలరేగింది. అతిసంతోషం ఇంత అనర్థానికి దారిదీస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. ప్రమదగణాల ఆశ్చర్యానికంతులేదు. క్షణాల్లో పరిస్థితి గంభీరమైంది.

"పరమేశ్వరా !" అందరూ ఒకేసారి చేతులెత్తి నమస్కరించారు. మీరు కల్పించుకోక తప్పదనే ఆర్తనాదమది.

పరమేశ్వరుని పెదాలమీదో నిర్వేదపు చిరునవ్వు చిందులేసింది. అంతా గమనించా నన్నట్టుగా, చిద్విలాసంగా తలపంకించాడు.

"కైలాస వాసులారా ! మీరంతా ఆందోళన పడాల్సిన అవసరం లేదు." పరమేశ్వరుడు కల్పించుకున్నాడు. పార్వతి, నందీశ్వరుల శాప ప్రతిశాపాలు విధి విలాసములో అంతర్భాగాలు. అవి ఊరకేపోవు. వాటివల్ల భవిష్యత్తులో లోకాలకు మేలు జరుగుతుంది."

పార్వతి, నందీశ్వరులు శాంతించి మొహాలు చూసుకున్నారు. కొద్దిపాటి దురవగాహన కొంప ముంచేస్తుందనుకోలేదు గదూ !... అనుకున్నారు.

"అం...టే నేను భూలోకములో జన్మించక తప్పదా స్వామీ ?" నందీశ్వరుడడిగాడు – దీనంగా.

"తప్పదు నందీ ! ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి రూపములో ఇంతకు ముందే కుబేరునికి వరమిచ్చింది. ఆ వర ప్రభావం వల్ల పార్వతి భూలోకములో మానవిగా అవతరించక తప్పదు. అప్పుడు నీవు ఆమెకు సోదరునిగా జన్మిస్తావు. ఏది ఎప్పుడెలా జరగాలో అలా జరిగి తీరుతుంది."

త్రినేత్రుని వివరణ అందరికీ తృప్తినిచ్చింది.

"దేవతలు మానవులుగా జన్మించడం దేవలోకాని కవమానం కాదా పరమేశ్వరా ?" ప్రమదగణాల్లోంచి ఒకరడిగారు.

"అవమానం కాదు, అమితానందం. భూలోకములో ధర్మం నశించినప్పుడు దేవతలే నడుం బిగించి దుష్టశక్తుల నంతమొందించి ధర్మ సంస్థాపన చెయ్యాల్సిన అగత్యముంది. అందుకే గదా విష్ణుమూర్తి అన్ని అవతారాలెత్తాడు. సృష్టి – స్థితి – లయలు క్రమ బద్ధంగా జరిగి తీరాలి. వీరిద్దరికి భూలోకములోనే శాపవిమోచనం జరుగుతుంది. తిరిగి కైలాసానికి చేరుకుంటారు."

ప్రభవనామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమి, శుక్రవారము... వసంత కోయిలలు గొంతెత్తి గాన కచేరీ చేస్తున్నాయి. ఆకుపచ్చని పీతాంబరాలు ధరించినట్టున్న చెట్టుచేమలు గాలికి కొమ్మలాడిస్తూ కనువిందు చేస్తున్నాయి. శుభముహూర్తం సమీపించింది. కుసుమాంబ ప్రసవవేదన సుఖాంతమైంది. పునర్వసు నక్షత్రములో ఓ ఆడపిల్లకు, మరో మగ శిశువుకు జన్మనిచ్చింది. మాతృత్వం మధురానుభూతి మైమరపించింది. కుసుమగుప్తుని కళ్లల్లో సుడులు తిరిగిన ఆనంద భాష్పాలు ముత్యాల్లా నేలరాలి మెరుస్తున్నాయి.

పార్వతీ దేవి ఆడపిల్లగా, నందీశ్వరుడు మగ శిశువుగా అవతరించారని కాలగతికర్థమైపోయింది. పెనుగొండ వాసులకా రోజు కొండంత పండుగ. అంతఃపుర వాసుల ఆనందోత్సాహాల్లో ప్రజలు పాలుపంచుకుంటున్నారు.

"చూశావా మహారాణీ !" కుసుమగుప్తుని చూపులు చేతులై పసిపిల్లల ఒళ్లంతా తడుముతున్నాయి. "పసిపాపలు పరమాత్మ స్వరూపులంటారు గదా ! మన ప్రార్థన నాలకించి కన్యకాపరమేశ్వరి తల్లి దీవించి కడుపు పండించింది. ఆ తల్లి మన వైశ్యజాతికి ఇలవేలుపు గదా !"

"అందుకే గదా ప్రభూ, ఒకేసారి ఆడ, మగ పిల్లలనిచ్చి మనింటి నిండా వెలుగులు నింపింది. ఆదిశక్తి దయ అనంతము గదా !"

"అవును కుసుమా ! తరతరాల నుండి మన వంశాన్ని, జాతిని కంటికి రెప్పలా కాపాడుతున్న కన్యకాపరమేశ్వరి ఆలయములో ప్రత్యేక పూజలు చేయించాను. అన్నట్టూ... మన నగరములోనే వెలసిన జనార్ధన స్వామి – కోనకమలా దేవి ఆలయములో గూడా అర్చనలు చేయించారు సుమా !"

సువిశాలమైన పెనుగొండ పట్టణం నడిబొడ్డున కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి దేవాలయముంది. ఆ దేవి కరుణాకటాక్ష వీక్షణాలు కుసుమగుప్తుని వంశ యశోకాంతులను విశ్వవ్యాప్తం చేశాయి. ఆధ్యాత్మ దృశ్యాల కాలవాలమైన ఆలయమది. బంగారు శిఖరం మెరుపులు చూపరుల నబ్బుర పరుస్తాయి. బంగారు రంగు సింగారించుకున్న గోపుర శిఖరము ప్రభాత సూర్యునికి కాంతి పుంజాలతో స్వాగతం పలుకుతుంది. మేలు జాతి రతనాలు పొదిగిన ద్వార బంధాలు, తలుపులు, స్థంభాలు మిరుమిట్లు గొలుపుతుంటాయి. సజీవ శిల్ప సౌందర్యం ఉత్తమ భావాలను ప్రోదిచేస్తుంది. కన్యకాపరమేశ్వరి ఆలయానికొక పక్కన వింధ్యవాసిని – నగరేశ్వరాలయం, మరో పక్కన జనార్థన – కోనకమలాదేవి ఆలయం కన్నుల పండువ చేస్తుంటాయి.

పదిరోజులు పదిక్షణాల్లా గడిచాయి. పదకొండవ రోజున నామకరణోత్సవ యజ్ఞానికి సమిధలు, సంబారాలు తయారుగా ఉన్నాయి. ప్రభాత సూర్యుని పసిడి కిరణాలు భూమాతను ముద్దాడుతున్నాయి. యజ్ఞశాలలో వేదపండితులు స్వస్తివాచకము పలికి శాంతిమంత్రము పఠించారు. కులగురువు భాస్కరాచారి అప్పటివరకే వేంచేసి ఉన్నారు. పవిత్ర గోదావరి ఒడిలో కుసుమగుప్తుడు అభ్యంగన స్నానమాచరించి పట్టువస్త్రాలు ధరించి సతీసమేతంగా విచ్చేశాడు.

బంధుమిత్రులు, సామంత రాజదూతలు, నగరస్వాములు తమకు కేటాయించిన స్థానాల్లో ఆసీనులైనారు. రాజదంపతులు గురువుగారికి పాదాభివందన మాచరించారు. గురువుగారి మార్గదర్శనములో కార్యక్రమము జరగుతోంది.

యజ్ఞగుండానికి పశ్చిమదిశలో రాజదంపతులు కూచున్నారు. యజ్ఞనిర్వహణా ప్రవీణులైన బ్రాహ్మణులు గొంతు కలుపగా భాస్కరాచారి “ఓం విశ్వానిదేవ సవితర్థురితాణి, పరాసురయద్భద్రసన్న... ” మంత్రముతో నామకరణోత్సవానికి శ్రీకారం చుట్టాడు.

వరుసగా పదహారు ఘృతాహులు జరిగాయి. దేవీమూర్తుల్లాగున్న ముత్తైదువులు పసిపిల్లలిద్దరికీ మంగళస్నానాలు చేయించారు. నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి కన్నతల్లి వద్దకు తీసుకొచ్చారు.

సర్వాలంకార భూషితయైన కుసుమాంబ లక్ష్మీదేవిలాగుంది. చిరునవ్వులు చిందిస్తూ ముందుగా కుమార్తె నందుకుంది. ముసురుకుంటున్న మురిపాలు హుషారు నిస్తుంటే భర్త వెనకనుండి పాపను తీసుకొచ్చి కుడివైపున నుంచుంది. పాప తలభాగము ఉత్తరము వైపు ఉండేట్టుగా భర్త చేతి కందించింది. తిరిగి వచ్చిన దారినే ఎడమవైపు వెళ్లి తన స్థానాన్నాక్రమించింది. కుసుమగుప్త మహారాజు పాప తల ఉత్తరంవైపు, కాళ్లు

దక్షిణం వైపు ఉండేలా చూసి కుసుమాంబ కందించాడు. ఆ తర్వాత "ఓం ప్రజాపతయో స్వాహాః" పఠిస్తూ నాల్గుసార్లు యజ్ఞగుండములో నేతి ధారలు విడిచాడు. యజ్ఞ జ్వాలలు పసిడికాంతులతో పైకెగురుతున్నాయి. అదే విధముగా మగ శిశువుతో... కార్యక్రమము నిర్విఘ్నంగా సాగింది. తిరిగి స్రువము నేతి ధారలను నాలుగుసార్లు అగ్నిదేవుని కర్పించారు.

ప్రాణవాయువులా పొంగుకొస్తున్న పితృవాత్సల్యాన్ని అదిమిపెట్టి కుసుమగుప్తుడు ఆడశిశువు ముక్కుముందు వేలుంచాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసలను స్పృశిస్తూ "వాసవాంబ" అని ఉచ్ఛరించాడు.తర్వాత మగ శిశువు ఉచ్ఛ్వాస నిశ్వాసలను స్పృశిస్తూ "విరుపాక్షుడు" అని ఉచ్ఛరించాడు. ఆ తర్వాత బంగారు పల్లెములోని బియ్యములో చేతివేలితో అవే పేర్లు రాశాడు. పెద్దలంతా శిశువులనాశీర్వదించారు. విప్రులు వేదమంత్ర సహితముగా ఆశీర్వదించారు. భాస్కరాచారితో బ్రాహ్మణులు గొంతు కలిపి "ఓం భూర్భువస్వః... " మంత్రముతో నామకరణోత్సవానికి ముగింపు పలికారు.

కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను రాజదంపతులు ఉచితరీతిన సన్మానించారు.

కుసుమగుప్త దంపతులు తమ కవలపిల్లలను కన్నుల పండువగా చూస్తూ పొంగిపోతున్నారు. పిల్లలిద్దరూ మంచం మధ్యన కాళ్లూ చేతులాడిస్తున్నారు. రాజ దంపతులు చెరో పక్క కూచున్నారు. పసిపిల్లల బోసినవ్వుల్ని చూస్తూ మురిసి పోతున్నారు.

"ప్రభూ ! మన పిల్లలు మణిమాణిక్యాల్లాగున్నారు గదూ !" కుసుమాంబ వాత్సల్య దృక్కులు వాసవి మీద కేంద్రీకృతమైనాయి. వాసవి కిలుక్కుమంది. దంపతుల అంతరాళాల్లో మురిపాల మూట విచ్చుకుంది. "బంగారుకొండా !" అంటూ ఒడిలోకి తీసుకుని గుండెలకు హత్తుకుంది తల్లి.

బాలవిరూపాక్షుడు హుషారుగా కాళ్లాడిస్తూ చెంగలించాడు. ఆ బోసినవ్వులు దంపతుల ఎదలో గిలిగింతలు పెట్టాయి.

"వరాల మూటా... !" అంటూ తండ్రి ఒళ్లోకి తీసుకుని లేత బుగ్గల్ని ముద్దాడాడు.

"ప్రభూ ! మన్నించండి... " ప్రతీహారి వచ్చి నమస్కరించాడు.

బాలుణ్ని మంచమ్మీద పడుకోబెడుతూ "ఏం సంగతీ ?" అడిగాడు.

"వారెవరో సమాధి మహర్షట. తమరి దర్శనార్థం వచ్చారు ప్రభూ !"

"మహర్షా ! ఇది శుభసూచకమే." గొణుక్కుంటూ ప్రతీహారి వెంట వెళ్లి సమాధి మహర్షిని సగౌరవంగా తోడ్కొని వచ్చాడు. కుసుమాంబ ఎదురెళ్లి నమస్కరించింది.

"దయచేకసి ఆసీనులు కండి. మీలాంటి తపోధనుల పాద స్పర్శతో మా ఇల్లు



పావనమైంది మహర్షీ !" కుసుమగుప్తుడు ఉచితాసనం చూపించాడు. సతీసమేతంగా పాదాభివందనం చేశాడు. మహర్షి దివ్యతేజస్సు పవిత్ర భావాలు రేకెత్తిస్తోంది.

కాషాయాంబరధారి, నుదట విభూతి రేఖల మధ్య ఎర్రని బొట్టు ఉదయా కాశములో బాలభానునిలా ప్రకాశిస్తోంది.

"మహర్షీ !" కుసుమగుప్తుడు ఆశ్చర్యంగా చూస్తూ "మీ కీర్తి విన్నాముగాని మూర్తినిప్పుడే చూస్తున్నాము. మా జన్మ చరితార్థమైంది మహానుభావా !" సంతోషం వెలిబుచ్చాడు.

"చాలా సంతోషం రాజేంద్రా !" రాజదంపతుల హావభావాలను నిశితముగా పరిశీలిస్తూ మహర్షి వెండితీగల్లాంటి గెడ్డాన్ని నిమురుకున్నాడు. బంగారు ఊయలల వైపు చూపులు మళ్లించాడు. పసిపాపలు కాళ్లూ చేతులాడిస్తున్నారు. నిశిత దృక్కులు బాలిక మీదున్నాయి. గబుక్కున లేచినుంచున్నాడు. రాజదంపతులు గూడా లేచి నుంచున్నారు. సేవకులు మొహాలు చూసుకున్నారు.

"క్షమించండి మహర్షీ ! మా వల్ల ఏదైనా అపచారం జరిగిందా !" భయం భయంగా అడిగాడు మహారాజు.

"అపచారం కాదు మహారాజా !" మహర్షి మొహంలో వింత మార్పులు చోటుచేసుకున్నాయి. "మీరు నిజంగా పుణ్యదంపతులు" కళ్లు దివ్యజ్యోతులైనాయి.

చిన్నారి వాసవి కిలుక్కున నవ్వింది. ఆ నవ్వులో మహర్షికేమి గోచరించిందో ఏమో గాని చేతులెత్తి భక్తితో నమస్కరించాడు. ఆప్యాయంగా పసికూనల తలలు నిమిరాడు.

"స్వామీ ! మీరు తపస్సంపన్నులు, త్రికాలజ్ఞుల్లాగున్నారు" ఈ పసికూనకు చేతులు జోడించడము... " కుసుమగుప్తుని కళ్లల్లో ఆశ్చర్యానందాలు.

"దయచేసి మా ఆతిథ్యాన్ని స్వీకరించండి స్వామీ !" ప్రశ్నార్థకమైన కళ్లతో నమస్కరించి అభ్యర్థించింది కుసుమాంబ.

సమాధి మహర్షి సుఖాసీనుడయాడు. రాజదంపతులతని పాదాలను పన్నీరుతో కడిగి కళ్లకద్దుకున్నారు.

రాజదంపతుల చూపుల్లోని ఆసక్తి, ఆందోళన సమాధి మహర్షికర్థమైంది. నిమీలిత నేత్రాలతో "పుణ్యదంపతులారా ! మీ జన్మ ధన్యమైంది. మీ పిల్లలు అసామాన్యులు. మీ కీర్తి చంద్రికలను ప్రపంచ వ్యాప్తం చేస్తారు." అన్నాడు.

రాజదంపతులు తృప్తిగా ఊపిరిపీల్చుకుంటూ కూచున్నారు.

"ధన్యులము స్వామీ !" వినయ విధేయతలతో కుసుమగుప్తుని ఒళ్లు కుంచించుక పోయింది. "మా వాసవి... చిన్నారి మిమ్మల్ని చూడగానే తలాడించి నవ్వింది. ఈ పసికూనకు తమరు నమస్కరించారు. దీని అంతరార్థమేమిటో దయచేసి వివరించండి స్వామీ !"

"మహారాజా ! నా పేరు సమాధి అని తెలిసింది గదా ! తొలుత నేను భోగభాగ్యాలనుభవించాను.

'నాటి బిచ్చగాడు నేటి ధనవంతుడు
నేటి ధనుడు నాటి వెట్టిగాడు.
నిలువలేని సిరికి నీ రాజసము లేల ?"

అన్న కవి వాక్కును విస్మరించి అశాశ్వతమైన సుఖాలననుభవించాను. ఎన్నో వ్యాపారాలు చేశాను. ఊహించనన్ని ఆస్తిపాస్తులు సంపాదించాను. సంపాదించిన ధనరాశుల్లోంచి కొంత నిరుపేదలకు పంచి దానధర్మాలతో జీవితాన్ని సార్థకం చేసుకోవాలనుకున్నాను. నా ఆస్తిపాస్తులకు వారసులైన నా భార్యా పుత్రులు అందు కేమాత్రం అంగీకరించలేదు. సమాజ పరమేశ్వరుణ్ని మరిచి సంపాదననంతా స్వయంగా అనుభవించడం మహాపాపమని ఎంత చెప్పినా వారు ఒప్పుకోలేదు. "కష్టపడి సంపాదించినదంతా కాకులు, గద్దలకు పంచి మమ్మల్ని నిరుపేదలుగా మార్చేస్తావా ?" అని నిలదీశారు. "ప్రజల నుండి సంపాదించినది ప్రజలకే పంచిపెట్టడం సదాచార"మని ఎంతో వాదించాను. కాని ఏమీ లాభం లేదు.

నశ్వర ప్రపంచములో నానా బాధలనుభవిస్తూ మోక్షసాధన గురించి ఆలోచించని మనిషి జన్మ వృధా గదా ! పరమేశ్వరుని పాదాల చెంతకు చేరేందుకు చివరి పరీక్ష మానవజన్మ. ఈ పరీక్షలో విజయం సాధించాలంటే అర్థకామ పురుషార్థాలను ధర్మబద్ధంగా ఆచరిస్తేనే మోక్షసాధన సులువవుతుంది. సంసారసాగర యానములో గృహస్తు కెన్నో పరీక్షలు ఎదురవుతుంటాయి. ధర్మబద్ధ కర్మలే ఆ పరీక్షల్లో విజయం సాధించి పెడ్తాయి.

ఈ విషయం నా భార్యా బిడ్డల కవగాహన కాలేదు. ఎంత చెప్పినా అర్థం కాలేదు. అప్పటికే నేను తేనెకుండలో ఈగలా సంసారమనే ఊబిలో దిగబడిపోయానని అర్థమైంది. దాంతో నాకు జ్ఞానోదయమైంది. సంసారబంధాలను వదులుకుంటేనే స్వర్గానికి మార్గం కనబడుతుందని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఆస్తిపాస్తులు, సంపదలన్నీ వారికే వదిలేసి ఒంటరిగా హిమాలయాలకెళ్లాను. పుణ్యనదీ తీరాన ప్రకృతి ఒడిలో పరవశించాను. ప్రశాంత వాతావరణములో జగన్మాతయైన ఆదిశక్తి దర్శనం కోసం కఠోర తపస్సు చేశాను. కొంతకాలం కందమూలాలు భుజిస్తూ ఆ తర్వాత గాలినే

భోంచేస్తూ తపమాచరించాను. ఆకలి దప్పుల కతీతముగా సాగిన తపస్సు ఫలించినది. ఆదిశక్తి ప్రత్యక్షమై ఏమి కావాలని అడిగింది. పట్టరాని సంతోషంతో,

"జగన్మాతా ! సృష్టి, స్థితి, లయకారులను నియమించి చరాచర సృష్టిని క్రమబద్ధీకరించిన నీ దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించాను. ఈ ప్రపంచములో నాక్కావాల్సిందింకేమీ లేదు. శాశ్వతానంద దాయకమైన మోక్షాన్ని ప్రసాదించు మాతా" అని వేడుకున్నాను.

దయామయి ఆదిశక్తి ఆమోదించింది.

"కుమారా ! నీ కోర్కె నెరవేరుతుంది, కాని ఇప్పుడే కాదు." అంది.

ఇంచుక కలవరపడ్డాను. "మరెప్పుడు తల్లీ ?" అడిగాను.

"కలియుగారంభములో పార్వతి నా అంశతో మానవ కన్యగా జన్మిస్తుంది. వర్ణాశ్రమ ధర్మరక్షణకు దారి చూపించి అవతారం చాలిస్తుంది. ఆమెతో పాటు నీవు గూడా మోక్షలోకానికొస్తావు" అని ఆశీర్వదించింది.

అందుకే పసిపిల్లల నందరినీ దర్శిస్తున్నాను... చెప్పుకుపోయాడు.

"స్వామీ ! మరి మా పసికూనలు... " కుసుమాంబ.

"మీ పసిపాపలు పరమాత్మ స్వరూపులమ్మా. ఈ వాసవి కారణ జన్మురాలు. బ్రహ్మ అంశతో జన్మించిన మీ గురువు భాస్కరాచారి మార్గదర్శనం మీకు మేలు చేస్తుంది. పాప బోసి నవ్వులో శాశ్వత కీర్తినార్జించే బంగారు భవిష్యత్తు గోచరించింది. మీరు నిశ్చింతగా ఉండండి. జగన్మాత పిలుస్తోంది. నేనిక వెళ్తా... " నంటూ తన్మయత్వంలో తేలిపోతూ సమాధి మహర్షి వెళ్లిపోయాడు.

వెంటనే అస్థాన జ్యోతిష్కులను పిలిపించారు. వారు శిశువుల జన్మ తిథి వార నక్షత్రాలను పరిశీలించి అమోఘమన్నారు. రాశి చక్రముతో పాటు నవాంశ కుండలి వేసి పరిశీలించారు. జాతక ఫలం వివరించారు.

"ఈ వాసవి అతిలోక సౌందర్యవతి అవుతుంది. ప్రతిభా పాటవాల్లో అద్వితీయమవుతుంది. మానవ లోకానికి ఆదర్శమవుతుంది. జన్మనిచ్చిన వారికి ఉత్తమ లోకం ప్రాప్తింపజేస్తుంది."

నామకరణోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలంతా ఉత్సాహంగా వేడుకలు జరుపుకుంటున్నారు. ప్రభువు పూజలనామోదించి పరమాత్మ సంతానాన్ని ప్రసాదించాడని మురిసిపోతూ పల్లెజనాలు గూడా పెనుగొండకు తరలివచ్చి వేడుకల్లో పాలుపంచు కుంటున్నారు. ప్రధాన ఉత్సవ సభకు సామంత రాజ్యాల ప్రతినిధులు హాజరయారు.

అందరికీ ఉచితాసనాలు ఏర్పాటైనాయి. స్త్రీలకు ప్రత్యేక వసతులు కల్పించారు. కులగురువు భాస్కరాచారిని స్వాగత సత్కారాలతో తోడ్కొని వచ్చి సుఖాసనమ్మీద కూచోబెట్టారు.

"యశో విభూషణా ! పెనుగొండ సామ్రాజ్య కీర్తికిరీటమా ! వైశ్యవంశ రాకాసుధాకరా ! అరివీర భయంకరా ! ఆశ్రిత జన రక్షకా ! కుసుమగుప్త మహా రాజేంద్రా ! బహు పరాక్... బహు పరాక్... " వందిమాగధుల జయజయ ధ్వానాలు విన్పించాయి. సభలోని వారందరి దృష్టి అటు మళ్లింది.

పట్టు వస్త్రాలు, రత్న ఖచిత కంఠహారాలు ధరించిన కుసుమగుప్తుడు రాచఠీవితో సభాప్రవేశం చేశాడు. సభలోని వారంతా మర్యాదగా లేచినుంచున్నారు. రత్నాల బిళ్లలతికించిన తలపాగా, భుజాలపై నుండి వేళ్లాడుతున్న జరీఅంచు కాశ్మీరీ శాలువా, పెదాలపై చెరగని చిరునవ్వు, కన్పించగానే చేతులెత్తి నమస్కరించాలన్పించే ముఖ వర్చస్సు... అందరినాకర్శిస్తున్నాయి. ప్రధానమంత్రి మహారాజుకు ఎదురేగి తొడ్కోని వచ్చాడు –

"ధర్మప్రభువు కుసుమగుప్తుల వారికి జయము, జయము." సాధారణ జనాల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. గురువుగార్కి, సింహాసనానికి, సభకు నమస్కరిస్తున్న మహారాజు మర్యాదా మన్ననలు అందరినబ్బుర పరిచాయి.

ప్రభువు సింహాసనమ్మీద కూచోగానే మంత్రిమండలి, దండనాథులు సహా మిగితా వారంతా తమ ఆసనాల నలంకరించారు. రాజగురువు భాస్కరాచారి మంత్ర సహితముగా మహారాజునాశీర్వదించాడు. బ్రాహ్మణోత్తములు శాంతి మంత్రము పఠించారు. మంత్రులు, సామంతులు, పురప్రముఖులు తాము తెచ్చిన కానుకలను సింహాసనం ముందుంచి నమస్కరిస్తూ వెనుదిరిగారు. సామంతరాజులు అభినందనలందిస్తూ తమ రాజ్యాల ప్రజలు సుఖశాంతులతో తులదూగుతున్నారని ప్రకటించారు. కొద్దిసేపు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

ప్రధాని లేచినుంచుండి "ఇప్పుడు మన మహారాజు శ్రీ కుసుమగుప్తుల వారు తమ సందేశాన్నిస్తారు." ప్రకటించాడు. అంగరఖా సవరించుకుంటూ కుసుమగుప్తుడు లేచినుంచుని సభకు నమస్కరించాడు. కవి-పండితులు, కళాకారులతో కళకళలాడ్తున్న సభనోసారి విహంగవీక్షణం గావించాడు.

"మహాజనులారా ! సామంత రాజన్యులారా !" చీమ చిటుక్కుమనని నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ప్రసంగం ప్రారంభమైంది. ఎదపొంగుల భావాలు భాషగా రూపాంతరం చెంది బయటపడుతున్నాయి. "మీ అందరి శుభకామనలతో మాకు మన కన్యకాపరమేశ్వరి

మాత సంతాన సౌభాగ్యాన్ని ప్రసాదించింది. మా పట్ల ప్రజల పట్ల మీరు ప్రదర్శిస్తున్న భక్తి శ్రద్ధలు మన పెనుగొండ సామ్రాజ్యలక్ష్మి యశఃకాంతుల్ని విశ్వవ్యాప్తం చేస్తున్నాయి. సామాన్య జనాలు సుఖసంతోషాలతో నిత్యజీవనం గడుపుతున్న కారణంగానే ఈ సామ్రాజ్యం నిత్యకల్యాణం పచ్చతోరణంగా వర్ధిల్లుతోంది. మనమిప్పుడు కలియుగా రంభములో ఉన్నాము. కలియుగమంటే కల్లా కపటాలకాలవాలమైంది. ఈ యుగములో ధర్మదేవత ఒంటికాలు మీద నడుస్తుందంటారు కాని మనము ధర్మదేవతను నాలుగు పాదాల నడిపించాలని కంకణ బద్ధులమైనాము. పెనుగొండ సామ్రాజ్య వృక్షానికి పద్దెనిమిది రాజ్యాలు పట్టుగొమ్మలు. ప్రజల సుఖసంతోషాలే పాలకుల పరమావధి. కాని దేశ రక్షణ విషయములో రాజీ పడబోము. అరివీర భయంకరులైన బాలనగరులు, సైనికులు సదా అప్రమత్తులై ఉంటున్నారు. దురాక్రమణదారుల పాలిటి పిడుగులై తయారుగా ఉన్నారు. శాంతిని రక్షించేందుకు మాత్రమే క్రాంతి నాశ్రయిస్తున్నారు.

ఇప్పటికే ప్రభవించి వ్యాప్తి చెందుతున్న జైనమతం, ఇప్పుడిప్పుడే బలం పుంజుకుంటున్న బౌద్ధ మతంతో పాటు శైవం, వైష్ణవం, శాక్తేయం లాంటి మతాలన్నీ హిందూ ధర్మంలోని అంతర్భాగాలే. మన మతాలన్నింటి అంతస్సూత్రము భారతీయ జీవన విధానమే. మతద్వేషం కాలనాగులాంటివి. దాని పడగ నీడలు గూడా మన సరిహద్దుల్లోకి సోకకుండా జాగ్రత్త పడదాం. మన సామంత రాజులంతా శక్తిమంతులే.

*దేశ రక్షా సమం పుణ్యం, దేశరక్షా సమం వ్రతం*
*దేశ రక్షా సమం యోగో, దృష్టో నైవచ నైవచ.*

అన్న ఆర్యోక్తిలోని అంతరార్థం దేశ రక్షణతో సమానమైన పుణ్యం, వ్రతం, యోగం, యజ్ఞం మరోటి లేదని అందరూ భావిస్తున్నారు.

మీ అందరి శక్తియుక్తులతో మన సామ్రాజ్యం సమైక్యతా బంధములో ఇమిడింది. ఇకముందు గూడా ప్రగతి పథములో పయనించాలని పరమేశ్వరుణ్ని ప్రార్థిస్తున్నాను. శ్రమకోర్చి వచ్చి మా చిరంజీవులనాశీర్వదించిన మీ కందరికీ కృతజ్ఞతాభివందనాలు."

తదనంతరం, వ్యాపారాల్లో నష్టపోయిన వారికి ధనసహాయం, ప్రతిభావంతులైన విద్యార్థులకు పారితోషకాలందించారు. విశేష ప్రతిభాపాటవాలు ప్రదర్శించి సామ్రాజ్య గౌరవ ప్రతిష్ఠల నినుమడింపజేసిన క్రీడాకారులను, కళాకారులను కుసుమగుప్తుడు స్వయంగా సన్మానించాడు.

మరికొన్ని వినోద కార్యక్రమాల ప్రదర్శనతో ఆనాటి సభ ముగిసింది.

# 3

వాసవి విరూపాక్షులొకే రోజు కవలలుగా భూలోకములో కళ్లు తెరిచినా ముందు జన్మించిన వాసవి అక్క అయింది. బంగారు ఊయల, పట్టుపరుపులలో శిశువులు కేరింతలు కొడుతూంటే రాజదంపతులు మైమరిచి ఆనంద డోలికలూగుతున్నారు. బోసినవ్వుల్లో కరిగి బ్రహ్మానందమనుభవిస్తున్నారు. పొత్తిళ్లలో లాలిస్తూ లేతచెంపల్ని ముద్దులతో నింపేస్తున్నారు. అంతఃపురము ఆనందనిలయమైంది.

నాల్గో నెలలో నిష్క్రమణ సంస్కారము సంపన్నమైంది. ఆ రోజు శిశువులను పవిత్ర గోదావరి జలాలతో స్నానం చేయించారు. నూతన వస్త్రాలతో మొదటిసారిగా అంతఃపుర భవనం వెలుపలికి తీసుకొచ్చారు. లాలిస్తూ, బుజ్జగిస్తూ విశాల ప్రపంచ మైదానములో కర్మసాక్షి సూర్యునికి బుల్లి చేతులతో నమస్కరింపజేశారు.

భాస్కరాచారి కనుసన్నులలో బ్రాహ్మణులు

"ఓం యదశ్చంద్రమసి... " మంత్ర పఠనముతో పరమాత్మ ఆశీస్సులు కోరారు. అందరూ ఒకే గొంతుతో "త్వం జీవశరదః శతం వర్ధమానః... " మంత్రోచ్చారణతో శిశువుల కదలికలను ప్రత్యేకంగా గమనిస్తూ ఆశీర్వదించారు. ఎప్పట్లాగే బ్రాహ్మణులకు భూదాన, గోదానాలు జరిగాయి. ఇండ్లు లేని వారికి గృహదాన పథకం అమలైంది.

దినదిన ప్రవర్ధమానంగా పసిపాపలు ఎదుగుతున్నారు. ఆరవ మాసములో అన్నప్రాశన సంస్కారము అమలైంది. బంగారు గిన్నెల్లోని పాలబువ్వను శిశువుల లేత నోటికందించారు. పసి వాసవి లేతపెదాలను తీగల్లా కదిలిస్తూ మొదటిసారి, అమ్మా అనగానే కుసుమాంబకు కొండెక్కి కూచున్నంత సంతోషమైంది. ఆనందాన్నాపుకోలేక ఇద్దర్నీ ఒకేసారి గుండెలకు హత్తుకుంది. బాలుని నోట అదేమాట రాజదంపతులను సంతోష సామ్రాజ్యములో విహరింపజేసింది. కుసుమగుప్తుడు పాపలిద్దర్ని ముద్దుల్లో ముంచెత్తాడు.

రానురాను శిశువుల నోట చిన్నచిన్న మాటలు పలికిస్తున్నారు. అంతఃపుర జనాలకదో సరదా. ఒకరికొకరు పోటీలు పడుతూ కొత్త మాటలు పలికిస్తున్నారు. ఆనందమనుభవిస్తున్నారు.

"మహారాజా ! మన పిల్లల బుడిబుడి నడకలతో అంతఃపురానికి నూతన కాంతులొచ్చాయి గదూ !" పిల్లల్ని కన్నార్పకుండా చూస్తూ అంది కుసుమాంబ. అప్పటికే వాసవి తల్లిఒడిలో, విరూపాక్షుడు తండ్రిఒడిలో కేరింతలు కొడుతున్నారు.

"అంతఃపురమేమిటి మహారాణీ ! మనసులకే వీళ్లు కొత్త వెలుగులైనారు. పసిపాపల్ని లాలించడములో అలౌకికానందాన్ని అనుభవిస్తున్నాం గదూ ! అందుకే అంటారేమో 'పసిపాపలు పారాడని ఇల్లు మూగదెయ్యాల నిలయ'మని."

శిశువులు మొహాలు చూసుకుని కిలుక్కుమన్నారు. రాజదంపతుల ఎదల్లో పూలవర్షం కురిసింది.

"ఆహా ! పద్దెనిమిది రాజ్యాల ప్రభువు పసిపాపల చేష్టలకు పరవశించి పోతున్నారే !" కుసుమాంబ మందహాసము. వెంటనే చెంపమీద చిటిక పడింది. సిగ్గుల బుగ్గలు సన్నజాజుల్లా విచ్చుకున్నాయి.

"పద్దెనిమిది రాజ్యాల ప్రభువైనా ఈ రాణీగారి మనోసామ్రాజ్యాన్ని గెలవడమే అదృష్టం సుమా !" మరో చెంపమీద చిటిక వేయబోయాడు.

"అమ్మో ! మీ సరసల్లాపాలేమీ సన్నబారలేదే !" బుగ్గ దగ్గరే చేతిని నిలువరించింది. "తమరింకా బాలా కుమారులనుకున్నారా ! ఇద్దరు పిల్లలకు తండ్రి అనే సంగతి మరవొద్దుసుమా !" కిలకిలా నవ్వింది. ఆ నవ్వులో గంగాఝురి తరంగధ్వని వినబడింది.

నిద్రలోకి జారుకున్న పిల్లల్ని ఉయ్యాలలో పడుకోబెట్టి సరససల్లాపాలలో మునిగారు.

మూడో సంవత్సరం వచ్చేసింది.

శిశువులతో ముద్దుముచ్చట్ల మధ్య చూడాకర్మ సంస్కారం సంపన్నమైంది. యజ్ఞహవనము, వేదమంత్రాల సాక్షిగా తలవెంట్రుకలు తీయించారు. వయసును మించిన తెలివితేటలు అందరినాశ్చర్య పరుస్తున్నాయి.

అంతఃపురము గోడలమీద రామాయణ, భారత, భాగవత తైలవర్ణచిత్రాలున్నాయి. వాసవి, విరూపాక్షులు చిత్రాలను విచిత్రంగా చూస్తూ కేరింతలు కొడుతూంటే కుసుమాంబ గూడా పసిపాపగా మారి చిత్రాల నేపథ్యాన్ని, కథలను బుల్లిబుల్లి మాటలతో వివరిస్తుంది.

నాల్గో సంవత్సరం పూర్తికాబోతుంది. ఓ రోజు సాయంత్రము శ్రీరాముని బాల్యచిత్రాన్ని చూస్తున్నారు. ఆ చిత్రములో... శ్రీరాముడు కౌసల్యఒడిలో ఉన్నాడు. ఆకాశములోని చందమామను చూపిస్తున్నాడు. నేలమీద అద్దములో చందమామ ప్రతిబింబముంది. ఆ చిత్రాన్ని తదేకంగా చూసిన వాసవి మొహం ప్రశ్నార్థకమైంది. తల్లికి ఆశ్చర్యమేసింది. లేత బుగ్గల్ని ఆప్యాయంగా ముద్దాడి.

"అదేమిటమ్మా ! అలాగైపోయావేయిటీ ?" లాలనగా అడిగింది.

విరూపాక్షుడు గూడా అక్కపక్కన చేరిపోయాడు.

చిత్రాన్ని చూపించి నోరెల్లబెట్టింది వాసవి. ఇద్దరిని చెరోపక్క కూచోబెట్టుకుంది కుసుమాంబ. చిత్రము నేపథ్యాన్ని వివరించేందు కుపక్రమించింది,

"శ్రీరామచంద్రుడు మీలాగే చిన్నపిల్లాడప్పుడు... "

పాపల భుజాలు సంతోషంగా ఎగిరిపడినై. కుసుమాంబ నవ్వుకుంది.

"ఓ రోజు రాత్రి అంటే... పున్నమి రాత్రినాడు బాలరాముణ్ని మేడమీదికి తీసుకెళ్లింది తల్లి కౌసల్య. చందమామను చూపించి చందమామ రావే, జాబిల్లి రావే... పాటపాడుతూ అన్నం తినిపిస్తోంది."

"బలే బలే... " విరూపాక్షుడు ఖుషీగా చప్పట్లు చరిచాడు.

"అమ్మా ! నా గ్గూడా చందమామ చూపించవే... " మారాముకు దిగాడు. కుసుమాంబ నవ్వుకుంది. వాసవి ఆశగా చూసింది. కుసుమాంబ ఇద్దరినీ మేడమీదికి తీసుకెళ్లింది. కాస్సేపయాక

"అమ్మా... కథనే" వాసవి గుర్తుచేసింది.

తిరిగి చిత్రం దగ్గరికొచ్చారు. మళ్లీ ఇద్దర్ని చెరోవైపు కూచోబెట్టుకుని కథలోకెళ్లింది కుసుమాంబ.

"అన్నం తినిపిస్తుంటే శ్రీరాముడు ఆకాశంలోని చందమామను చూపిస్తూ అది తనకు కావాలన్నాడు. అది కుదరదని చెప్పింది తల్లి. కాదు... నా కదే కావాలని మారాముకు దిగాడు. అప్పుడు శ్రీరాముడు మీకంటే గూడా చిన్నవాడు... "

"బలే... బలే... " భుజాలెగరేస్తూ నవ్వాడు విరూపాక్షుడు.

"అమ్మా... కథనే !" వాసవి అందుకుంది.

"సర్సరే !" కుసుమాంబ మళ్లీ కథ అందుకుంది. "శ్రీరాముడి మారాము శృతిమించింది. చందమామను తెచ్చి ఇస్తేనే అన్నం తింటానని మొండికేశాడు. ఈ విషయం తండ్రి ధశరథునికి, మంత్రులందరికీ తెలసి గబగబా అక్కడికొచ్చారు. ఎవరేమి చెప్పినా బాలరాముడు మంకు పట్టు మానలేదు."

"మరైతే... చందమామను తెచ్చిచ్చారా ?" గంభీరంగా అడిగాడు విరూపాక్షుడు ఊపిరిబిగపట్టుకుని.

"లేదు నాన్నా ! ఆకాశంలోని చందమామ నెట్లా తేగలరు ? తేలేరు గదా !... "

"మరైతే... చివరికేమైందమ్మా ?" బాలవాసవి కళ్లల్లో ఆసక్తి తళుక్కుమంది.

"అప్పుడు సుమంతుడనే మంత్రి ముందుకొచ్చి ఓ అద్దం తెప్పించాడు. అద్దంలో

చందమామను చూపిస్తూ 'ఇదిగో తీసుకో' అన్నాడు. బాలరాముడా అద్దాన్ని తన చేతిలోకి తీసుకుని అందులో చందమామను చూస్తూ మురిసిపోయాడు. అద్దం చందమామను చేత్తో తడుముతూ గబగబా అన్నం తినేశాడు... "

"బలే... బలే... " విరూపాక్షుడు కేరింతలు కొడుతూ గంతులేశాడు. చిన్నారి వాసవి చిరుపెదాలపై చిరునవ్వు మెరిసి మాయమైంది.

"అద్దం చందమామనే అసలు చందమామ అనుకున్నాడా ?" అని ప్రశ్నించినట్టుందా నవ్వు. అంతా గమనిస్తున్న సేవికలు ముఖాలు చూసుకుంటూ నవ్వుకున్నారు. గుసగుసలాడుకున్నారు.

వాసవి, విరూపాక్షులు ఐదో సంవత్సరములో ప్రవేశించారు. మరికొంత వయసు దాటగానే శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం జరిగింది. గురువుల వద్ద శుశ్రూశలు చేస్తూ విద్యాభ్యాసం చేస్తున్నారు.

స్వభావరీత్యా వాసవి శాంతశ్రోతస్విని. గంగా తరంగిణి. విరూపాక్షునిది బ్రహ్మపుత్రా ప్రవాహం. గంతులేస్తూ ఉరుకులు పరుగులతో సాహసోపేతంగా ముందుకు సాగే స్వభావం. అయినా చదువుల్లో ఒకరిని మించి ఒకరనిపించుకుంటున్నారు. గురువులు పాఠాలు చెబుతూంటే శ్రద్ధగా వింటూ, అనుమానాలు అడిగేస్తున్నారు. విన్న పాఠాన్ని చక్కగా అవగాహన చేసుకుంటున్నారు.

వాసవి ఏకసంథాగ్రాహి. నిశ్చలతత్వము, నిర్మలమైన మనసు, నిర్భయత్వము స్వభావ సిద్ధమైనవి కాబట్టి ఒక్కసారి పాఠం వింటే చాలు గడగడా తిరిగి అప్పజెప్పేస్తుంది. విరూపాక్షుడు మాత్రం గట్టిపట్టుదలతో, వెంటవెంటనే సందేహం నివృత్తి చేసుకుంటూ విద్యలన్నీ నేర్చుకుంటున్నాడు.

విద్యార్థుల ఆసక్తి గురువులకుత్సాహం. నేర్చుకోవాలనుకునేవారికి ఎంతైనా నేర్పాలనుకుంటారు. తమ వద్ద విద్యాభ్యాసం చేసిన శిష్యులు జీవితంలో ఉన్నత శిఖరాలధిరోహించాలని ప్రతి గురువు కోరుకుంటాడు. చదువుతోపాటు సంస్కారం నేర్పించడం గురువుల విధి. సంస్కారంలేని చదువు దారంలేని గాలిపటం లాంటిదని తెలిసిన గురువులు రోజువారీ చదువులతో పాటు రామాయణ, భారత, భాగవతాలు వాటి నేపథ్యం గురించి వివరంగా చెప్తున్నారు. వాసవి, విరూపాక్షలడిగే సందేహాలు ఒక్కోసారి గురువుల నాశ్చర్యపరుస్తున్నాయి. తమకు తెలియని విషయాలను భాస్కరాచార్యుల ద్వారా తెలుసుకుని బోధిస్తున్నారు.

ప్రకృతి ఒడిలో ప్రశాంత నిలయమైన గురుకులంలో విద్యాభ్యాసం చేస్తున్నవారి

మానసికోన్నతి రోజురోజుకు పెరుగుతోంది. కోయిల పాటను వాసవి శ్రద్ధగా వింటుంది. తన గొంతెత్తి అలాగే పాడుతుంది. పక్షుల కిలకిలారావాల్లో సంగీతరాగాలు వింటుంది. నదీప్రవాహంలో, జలపాతం సవ్వడిలో సరికొత్త స్వరాలు వింటుంది. గురువుల నేర్పిన సరిగమలకు అభ్యాసం తోడై గొంతులో తియ్యనిరాగాలు శృతిచేసుకుంటున్నాయి. వాసవి గానమాధుర్యాన్ని అవలోకిస్తూ ఆశ్రమవాసులంతా అలౌకికానందాన్నినుభవిస్తున్నారు.

"వాసవిది గంధర్వగానం." "ఆ గొంతులో అమృతఝరి ఉంది." అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. ప్రశంసలను ప్రశాంతచిత్తముతో విని ఓ చిరునవ్వు నవ్వేస్తుంది.

విరూపాక్షుడు ఆటల్లో దిట్ట. కర్రసాము, ఖడ్గ విద్య, గుర్రపు స్వారిలో తనకు తానే సాటి అనిపించుకుంటున్నాడు.

ఓ రోజు వాసవి గురువు గారికి నమస్కరించి

"ఆచార్యా ! ఈ సృష్టికి మూలమేది ? ఏ శక్తి సృష్టి క్రమాన్ని నియమబద్ధంగా నడిపిస్తుంది ?" అడిగింది.

ఇంత చిన్ననోట అంత పెద్ద ప్రశ్ననా ? జవాబు కోసం వెతుక్కుంటూ గురువు గుటకలు వేశాడు. అతనిలో చిన్నపాటి ఆందోళన. ఆశ్చర్యాన్నంతా అదిమిపెట్టి చిన్నగా నవ్వాడు.

"చాలా చక్కగా అడిగావమ్మా !" ఆనందానుభూతి కళ్లలో మెరుస్తూ చెప్పడం ప్రారంభించాడు. "ఈ చరాచర సృష్టికి మూలము ఆదిశక్తి. ఆదిశక్తి దేవీ స్వరూపము. అందుకే సర్వం శక్తిమయం జగత్ అన్నారు."

వాసవి విరూపాక్షులు సహా మిగతా విద్యార్థులందరి వాలకాన్ని గమనిస్తూ తృప్తిగా చెబుతున్నాడు.

"బ్రహ్మాది త్రిమూర్తులను, త్రిమాతలను, వేదాలను సృష్టించిందా ఆదిశక్తియే. అందుకే ఆమెను దేవతలంతా విశ్వమాతగా పూజిస్తారు. ప్రకృతి, పురుషుడు గూడా ఆమెనే. లక్ష్మిస్వరూపములో విష్ణుశక్తి అనీ, పార్వతి స్వరూపములో శివశక్తి అనీ, విద్యల తల్లి సరస్వతీ రూపములో బ్రహ్మశక్తి అని పిలువబడే ఆదిశక్తికి పద్నాలుగు పేర్లున్నవి. వాటినే పద్నాలు రూపాలంటారు.

విరూపాక్షుడు ఠక్కున లేచి నుంచున్నాడు.

"దయచేసి ఆ పేర్లు గూడా చెప్పండి గురుదేవా !" అడిగి కూచున్నాడు.

"అంత తొందరెందుకు నాయనా... చెప్తున్నాను, విను." కూర్చుని ఉన్న గద్దెమీద జింకచర్మాన్ని సరిచూసుకున్నారు గురువుగారు. "ఆ ఆదిశక్తి పేర్లు ఇవే. 1) దుర్గాదేవి 2) భద్రకాళి 3) విజయ 4) వైష్ణవి 5) కుముద 6) చంద్రిక 7) కృష్ణ 8) మాధవి 9) కన్య అంటే కన్యకాపరమేశ్వరి 10) మాయ అనగా మాయాదేవి 11) నారాయణి 12) ఈశాని 13) శారద 14) చండిక.

ఏ పేరుతో పూజించినా ఆ దేవి పలుకుతుంది. సీత సావిత్రి, ద్రౌపతి, మండోదరి, అనసూయాది పతివ్రతలు పూజించినది ఆ ఆదిశక్తినే. సర్వకళా శోభిత, సౌందర్యరాణి, శాంత స్వభావి అయిన కన్యకాపరమేశ్వరి రూపాన్ని మన పెనుగొండ సామ్రాజ్యములో పూజిస్తున్నాము. ఆ దేవి సంకల్ప వికల్పముల వల్లనే జీవుల జనన, మరణాలు జరుగుతున్నాయి... " అలా చెబుతూపోతున్నారు.

ఓ శిష్యుడు లేచి తనదో సందేహమన్నట్టుగా చూస్తూ పంచ సవరించుకున్నాడు.

"చెప్పు నాయనా... నీ సందేహమేమిటి ?"

"ఆచార్యా ! ఆ ఆదిశక్తి ఎక్కడ ఉంటుంది ?"

"చెబుతున్నా. ఆ ఆదిశక్తి నివాసము మణిద్వీపము. అదే ఆ దేవి మూలస్థానము. అక్కడ కల్పవృక్షము కింద ఓ అందాల భవనముంది. భవనములో హేమపీఠమ్మీద కూచుని లోకాలను పరిపాలిస్తుంది. త్రిమూర్తులు, త్రిమాతలు, దిక్పాలకులు, దేవతలందరూ ఆమె ఆదుపాజ్ఞల్లో ఉంటారు... "

వాసవి లేచి నుంచుంది.

"చెప్పమ్మా... "

"మరీ... ఈ మనుషుల సృష్టి ఎట్లా జరిగింది ఆచార్యా ? మనుషుల పనుల్లో తేడాలెట్లా వచ్చినయో... దయచేసి చెప్పండి." చేతులు జోడించింది. ఈ వయసులో రావాల్సిన అనుమానమా ఇది ? అయినా... ఆమె వినయ విధేయతలు గురువుగారి నానందపరిచాయి.

ఈ విషయాలన్నీ పిల్లలందరికి అర్థమవుతాయా ? అనుమానం గోకుతూంటే అందరినీ చూపులతో తడిమాడు. అంతా శ్రద్ధగా వింటున్నారని అర్థమైంది. వాసవినోసారి వాత్సల్య దృక్కులతో పరిశీలించాడు. తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"ఆ దేవి సంకల్పం బలంతోనే త్రిమూర్తుల సృష్టి జరిగిందని చెప్పాను గదా ! త్రిమూర్తులలో ఒక్కొక్కరికొక్కో బాధ్యతనప్పగించింది. సృష్టికార్యం అనగా ప్రాణుల జననాల, జనన కారణాల గురించి బ్రహ్మదేవుని కప్పగించింది. స్థితి అనగా చరాచర

సృష్టిలో జీవుల మంచి చెడుల్ని చూస్తూ పాలించే పని విష్ణుమూర్తి కప్పగించింది. పరమేశ్వరుణ్ని శంకరుడు అని గూడా అంటారు. అతనికి లయ అనగా జీవుల్ని తనలో ఐక్యం చేసుకునే బాధ్యతను నిర్దేశించింది. ఇట్లా ఆదిశక్తి కనుసన్నులలో చరాచర సృష్టిలో పనులన్నీ ఓ క్రమపద్ధతిలో జరిగిపోతున్నాయి.

ఇహ... మానవాళి విషయానికొద్దాం. సృష్టి పనుల్లో మానవ సృష్టి గూడా ఓ పద్ధతి ప్రకారమే జరిగింది. ఆ దేవి విరాట్ స్వరూపములో బ్రాహ్మీశక్తికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు బ్రహ్మదేవుడు. అతని ముఖమునుండి బ్రాహ్మణులుద్భవించారు. భుజాల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, శరీరంలోని అన్ని అవయవాలకు ఆధారభూతమైన పాదాలనుండి శూద్రులు పుట్టుకొచ్చారు. ఈ విధంగా మానవులను చాతుర్వర్ణాలుగా విభజించారు. ఈ చాతుర్వర్ణాల వారిలో ఒకరెక్కువ, ఒకరు తక్కువ అని కాకుండా బ్రహ్మదేవుడు ఎవరి పనుల్ని వారికి అప్పగించాడు.

మీరు రోజూ వేదమంత్రాలను వల్లెవేస్తున్నారు గదా !"

"అవును ఆచార్యా !" అంతా ఒకేసారి జవాబిచ్చారు.

"ఆ నాలుగు వేదాల పేర్లు చెప్పమ్మా వాసవీ !"

"వేదాలను పరిష్కరించి వేదవ్యాసుల వారు క్రమబద్ధం చేశారు." వాసవి లేచి నుంచుండి చెబుతోంది. "అందులో మొదటిది ఋగ్వేదము. రెండవది యజుర్వేదము, మూడవది సామవేదము, నాల్గవది అధర్వణ వేదము." తడుముకోకుండా చెప్పేసి కూచుంది.

"భేష్ ! వేదాభ్యాసానికి అందరూ అర్హులే. వేదవాఙ్మయ రక్షణను బ్రాహ్మణుల కప్పగించారు. ప్రజల బాగోగులు చూస్తూ, పరిపాలించే బాధ్యతను క్షత్రియుల కప్పగించారు. పశుపోషణ, వ్యవసాయము, వ్యాపార - వాణిజ్యాలు వైశ్యులకు మిగితా పనులన్నీ శూద్రులకు అప్పజెప్పారు. బ్రాహ్మణ కర్మల విషయమై అంగీరస మునిని, క్షత్రియుల కోసం వశిష్ఠ మునిని, వైశ్యుల కోసం అపరార్కమునిని నియమించారు. పై ముగ్గురూ మిగితా వారందరికీ బాధ్యులుగా నియమించారు.

బ్రహ్మ ఆదేశాన్ననుసరించి కుడిభాగమునుండి ప్రభవించిన పురుషులతో, ఎడమ భాగమునుండి ఉద్భవించిన స్త్రీల వివాహము జరిపించారు. చాతుర్వర్ణాల వారు సంతాన వృద్ధితో ఎవరి బాధ్యతలు వారు నిర్వహిస్తారు.

'క్షీరం చాన్నం తథా జ్ఞానం లోకేభ్యా దయతే యమా
గోమాతాసా సదా సేవ్యా ధనుః పృధ్వీ సరస్వతీ...

ప్రకారము పాలు ఇచ్చు గోవు, అన్నమిచ్చే భూమి, జ్ఞానమిచ్చే సరస్వతి ముగ్గురిని మాతలుగా భావించి అందరూ సేవిస్తున్నారు... " చెప్పుకుపోయాడు.

ఇలా ఎన్నో ధర్మ సందేహాలను తీర్చుకుంటూ, గురువుల్ని సేవిస్తూ వేదాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలను ఆపోసన పట్టారు. వాసవికి సంగీతమంటే ఎంతో మక్కువ. సంగీత శాస్త్రము లోతుపాతులన్నింటినీ కూలంకశంగా తెలుసుకుంది. జలప్రవాహంలో, పక్షుల కిలకిలా రావాల్లో లయబద్ధమైన సంగీత ధ్వనుల్ని వింటూ పరవశించిపోతుంది. గొంతులో కోటిరాగాల మాధుర్యం కలబోసుకుంది. విరూపాక్షుడేమో ధనుర్విద్య, ఖడ్గచాలనము, వివిధాస్త్ర ప్రయోగాలు... వివిధ యుద్ధ విద్యలు అమితాసక్తితో నేర్చుకున్నాడు. కొన్ని సంవత్సరాలలోనే అన్ని విద్యలు నేర్చుకున్న చిన్నారుల తెలివితేటలు ఆచార్యులను ఆశ్చర్యములో ముంచెత్తాయి.

రాజ్యపాలన, పాలకుల విధుల గురించి వరిష్ఠ ఆచార్యుడు స్వయంగా బోధిస్తున్నాడు. ఆనాటి పాఠానికి ముగింపుగా అడిగాడు-

"ఈ విషయములో ఎవరికేమన్నా సందేహాలుంటే అడగండి."

విరూపాక్షుడు లేచినుంచున్నాడు. చేతులు కట్టుకుని

"గురుదేవా ! రాజ్యపాలన, పాలకుల విధుల గురించి అర్థమైంది, కాని రాజైన వ్యక్తికి ఉండాల్సిన ముఖ్యమైన గుణాల గురించి తెలుసుకోవాలనుంది." అడిగి కూచున్నాడు.

"తప్పకుండా నాయనా ! వినండి." ఆచార్యుడికి ఉత్సాహంగా ఉంది. ఆశ్రమాన్ని అలుముకుంటున్న హోమధూమాన్ని క్రీగంట చూస్తూ చెప్పుకుపోతున్నాడు. "ప్రజాభీష్టం ప్రకారం రాజుగా అనగా పాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తికి ముఖ్యంగా ఎనిమిది గుణాలుండాలంటుంది ధర్మశాస్త్రం -

'సోగ్నిర్భవతి వాయుశ్చసోర్కః సోమః సధర్మరాట్
సకుబేరః సవరుణః సమహేంద్రః ప్రభావతః

అనగా 1) అగ్ని చెత్త చెదారాన్ని భస్మం చేసినట్టే రాజు దుష్టులను అణచివేయాలి. 2) ప్రాణ వాయువులా అన్ని ప్రదేశాలలో వెళ్లగలగాలి. 3) సూర్యుడు నీటిని ఆవిరి చేసినట్టే ఎవరికీ బాధ కలుగకుండా ప్రజలనుండి పన్నులు వసూలు చెయ్యాలి. 4) చంద్రుని వలె ప్రసన్నత కలిగి ఉండాలి. 5) న్యాయాన్యాయాలను విచారించి దండన విధించాలి. 6) కుబేరుని కోశాగారాన్ని ధనంతో నింపాలి. 7) జీవరాశిని సుడిగుండాల్లో ముంచివేసే సముద్రునిలాగా అపరాధులను కారాగారములో బంధించాలి. 8) వర్షాలు కురిపించే ఇంద్రునిలాగా ప్రజలకు సుఖసంతోషాలు పంచాలి.

రాజ్య వ్యవస్థలో రాజు అనుసరించే శిక్షావిధానం విశిష్టమైంది. రాజు అపరాధులను నిర్దాక్షిణ్యంగా శిక్షించాలి. అపరాధులకు భయం కలిగించి వారినుండి సామాన్యులను రక్షించేదే రాజదండము. ఒక విధంగా ప్రజలను రక్షించేది, శాసించేది రాజదండమే. సభలో బాగా ఆలోచించి అమలు జరిపే శిక్ష లోకానికి ఆనందాన్ని కలిగిస్తే – అనాలోచితంగా, పక్షపాతముతో అమలు జరిపే శిక్ష అజాగ్రత్త వహిస్తే పరంపరాగతంగా వస్తున్న అన్ని మర్యాదలూ, అన్ని ధర్మాలూ చిన్నాభిన్నమవుతాయి.

ప్రజలకు సత్ప్రవర్తననూ, భయాలవల్ల రక్షణనూ కలిగించి, అన్న పానాదులిచ్చి వారిని పోషించడము వల్ల రాజు తండ్రి స్థానాన్ని ఆక్రమిస్తాడన్నారు రఘువంశీయులు.

'ప్రజాణం వినయా దానాత్
రక్షణాత్ భరణా దపి ।
సపితా పితరస్తానాం
కేవలం జన్మ హేతువః'

అనగా 1) రాజు ఎవరితో స్నేహం చెయ్యాలో, ఎవరితో పోరాడాలో, తనను రక్షించుకుంటూ రాజ్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఎప్పటికప్పుడు మంత్రులతో సంప్రదించాలి. మిత్రుల విషయంలో, శత్రువుల విషయంలో అప్రమత్తుడై ఉండాలి. రాజుకు ఎంత బలమున్నప్పటికీ అహంకారం తగదు. అహంకారి అయిన ప్రభువు వల్ల ప్రజలకు కష్టాలు తప్పవు. సామ, దాన, భేద, దండోపాయాలలో సామమునకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. స్నేహితులను దూరం చేసుకోవడం, శత్రువులతో చీటికిమాటికి తలపడడం ఉత్తముడైన రాజుకు తగిన పని కాదు... " చెప్పుకుపోయాడు.

ఇలా సందేహాలన్నింటినీ వెంటవెంటనే తీర్చుకుంటున్నాడు.

మొదటినుండి వాసవిది విలక్షణమైన వైఖరి. ఎప్పుడూ ఏదో ఆలోచనలో మునిగితేలుతున్నట్టుగా ఉంటుంది. కొన్ని గంటలపాటు సుదీర్ఘాలోచనలతో ఏకాంతముగా, మౌనముద్రలో కూచుంటుంది. ఎన్ని నేర్చుకున్నా ఏదో వెలితిగా ఉన్నట్టు, దేనికోసమో నిరంతరాన్వేషణ సాగిస్తున్నట్టు కనిపిస్తుంది. ఒక్కోసారి తోటి బాలికా గణంతో కలిసి పిల్లలాట ఆడుకునేందుకు విముఖత వ్యక్తం చేస్తుంది. అప్పుడప్పుడు ఆటల్లోకి దిగినా అడుగడుగునా వింత సందేహాలు వ్యక్తం చేస్తూ జవాబుల కోసం వెతుక్కుంటుంది. కాస్సేపు మౌనంగా కూచుండి అలౌకికానందాన్ననుభవిస్తుంది. వెంటనే ఏదో గుర్తుకొచ్చి ముఖం వికసిస్తుంది. ఇంకేదో గుర్తుకొచ్చి ముకుళించుకు పోతుంది. తన సందేహాలకు తానే సమాధానం వెతుక్కుంటుంది.

మహారాణి కుసుమాంబ కంతా తెలుస్తుంది. వాసవిని చదివేస్తుంది.

"మన వాసవి వైఖరి గమనించారా మహారాజా !" ఏకాంత సమయములో అడిగిందోసారి. కుసుమగుప్తుడు యథాలాపంగా

"మన ముద్దుల పట్టి వాసవి తెలివితేటలు అమోఘమని ఆచార్యులు, గురుదేవులు భాస్కరాచారిగారు గూడా చెప్పారు గదా మహారాణి గారూ !" అన్నాడు – ముసిముసి నవ్వుతో.

"ఆద్సరే గానీ... ఎవరికీ రాని అనుమానాలు, ఎప్పుడూ వినని సందేహాలు వాసవి కొస్తున్నాయి. ఇంత చిన్న వయసులో అంత పెద్ద ఆలోచనలెందుకో ! మనుషుల సుఖదుఃఖాల గురించి, జననమరణాల గురించి మనమెన్నడూ వినని వింత వింత ప్రశ్నలడుగుతుంది. నాకెందుకో ఆందోళనగా ఉంది మహారాజా !"

నిద్రలోకి జారుకోబోతున్న కుసుమగుప్తుడు ఉలిక్కిపడి లేచికూర్చున్నాడు. పాదాలు పడుతున్న భార్య ముఖకవళికల్ని గమనిస్తూంటే మెత్తని పట్టుపరుపు బండరాయిలా గన్పించింది.

"నిజమే కుసుమా ! వాసవిలో ఏదో అంతర్మథనం జరుగుతున్నట్టుంది."

"అంతర్మథనమా ! నా తల్లికేం కష్టమొచ్చిందనీ ! అసలేం జరిగింది మహారాజా?" గుండెల మీద చెయ్యేసుకుంది. దీపకాంతులలో పోటీపడుతున్న ముత్యాల ముక్కుపుడక మెరుపుల మధ్య నుదుటి సిందూరం రక్తవర్ణంలో మెరిసింది.

తాను గాబరాపడితే మహారాణిలోని ఆందోళన తుఫానుగా మారి అనారోగ్యానికి గురిచేస్తుంది. పాలనా వ్యవహారాల్లోని ఒడిదుడుకులను, బాధ్యతల బరువులను తానే మోయాలి. సంసారంలోని నిరాశా నిట్టూర్పులను మగవాడే భరించాలి. అన్నింటిని భరించేవాడు కాబట్టే భర్త అన్నారు. అంతరాళాల్లోని సుడిగుండాలను గొంతులో బంధించి గరళకంఠుడవాలి.

"అయ్యో... కుసుమా !" గంభీరవదనము అరువు సంతోషాన్ని పులుముకుంది. " అంతర్మథనమంటే అదేదో కష్టమొచ్చిందనుకున్నావా ? అదేమీకాదు. మన వాసవి వరాలమూట. కష్టాలెందుకొస్తాయి ? ఈ మధ్యనే శాస్త్రాలన్నీ చదివేసింది గదా ! ఆ చదువుల సారాన్ని మననం చేసుకుంటుందేమో !"

"ఓహ్... అంతేనంటారా !" మహారాణి మనసు తేలికైంది. "అంతా ఆ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దయ గదా !" ఊపిరి పీల్చుకుంది. పెదాలమీద చిరునవ్వు మెరిసింది.

ప్రజాసంక్షేమమే పరమావధిగా కుసుమగుప్తుడు చేపట్టిన పరిపాలనా సంస్కరణలు చక్కని ఫలితాలనందిస్తున్నాయి. పారదర్శకత మంత్రిమండలికి, సైనికాధికారులకు, ఉన్నతాధికారులకు తృప్తినిస్తుంది. 'యథారాజా తథాప్రజ' అన్నట్టుగా కలియుగారంభమై కొద్దికాలం గడిచినా ప్రజలు సత్యశీలురై ధర్మపరాయణులుగా రాగద్వేషాలు జోలికి పోకుండా నిత్యజీవనం సాగిస్తున్నారు. ధర్మాచరణ జరుగుచున్న చోట ఋతు ధర్మాలు క్రమం తప్పకుండా జరుగుతాయన్న వేదసూక్తి అక్షరాలా నిజమైంది. గోదావరి కాలువలు పొలాల గళాలను తడిపేస్తుంటే పుష్కలంగా పంటలు పండుతున్నాయి. కడుపునిండా తిండి, ఒంటినిండా బట్ట దొరికినప్పుడు ప్రజల దృష్టి పుణ్యకార్యాలు, యజ్ఞయాగాదుల వైపు మళ్లుతుంది. విశేషమైన యజ్ఞయాగాదుల ఫలితంగా హోమధూమము పర్యావరణాన్ని పరిశుభ్రపరుస్తుంది. పన్నుల విధానం అందరికీ ఆమోద యోగ్యమైంది కాబట్టి నూటికి నూరుపాళ్ల వసూలవుతున్నాయి. ధాన్యాగారాలు, ప్రభుత్వ కోశాగారము పూర్తిగా నిండిపోతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన వారెవరన్నా ఉంటే వారిని గ్రామాధికారులే గుర్తించి ప్రభుత్వ సహాయాన్ని ఇంటికి తెచ్చి అందిస్తున్నారు.

వయోవృద్ధులు, వికలాంగులు తప్ప మిగితా వారంగా ఏదో ఒక పనిలో నిమగ్నమై తీరాలి. సోమరితనం క్షం తవ్యం కాదు. అందుకే కుసుమార్యుని పరిపాలనా విధానము, సామ్రాజ్యములోని ప్రజాసౌకార్యాలు భారతఖండములోని ఇతర రాజ్యాలిన్నింటిలో చర్చనీయాంశాలైనాయి.

అకారణమైన హింస అల్లకల్లోలం రేపుతుంది తప్ప సుఖశాంతుల నివ్వదని, హింసతో సాధించలేని దేన్నైనా అహింసతో సాధించవచ్చునని చదువు ముగించుకున్న వాసవి నిర్ణయించుకుంది. పగ, ద్వేషము మనిషిని రాక్షసునిగా మారుస్తాయని సత్యశోధనలో తేలింది. ప్రేమాభిమానాలు సత్ఫలితాస్తాయని అర్థమైంది. హింసను సమూలంగా అంతం చేసి అహింసా సిద్ధాంతాన్ని సర్వవ్యాప్తం చెయ్యాలనే వాసవి సంకల్పం మేధావుల నాకట్టుకుంది. తపోధనులు గూడా ఆ సిద్ధాంతాన్ని ఆమోదించి ప్రశంసలు కురిపిస్తున్నారు.

వికలాంగులు, రోగులు, వృద్ధులను చూస్తుంటే వాసవి మనసు అల్లకల్లోలమై పోతుంది. పన్నెండేళ్ల వయసులో ఆరవయ్యేళ్ల ఆలోచనా ధోరణి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తుంది. గురువు భాస్కరాచారి సాంత్వన వచనాలతో మనసులు కుదుటబడ్తున్నాయి.

తప్పుచేసిన వారిని కఠినంగా దండిస్తే తిరిగి ఆ తప్పుచేయరని విరూపాక్షుని వాదన. నేరస్తులను హింసకు గురిచేయకుండా వారి మానసికస్థితిని మంచిమాటలతో

మార్చి సన్మార్గానికి మళ్లించడమే మంచిదని వాసవి వాదిస్తుంది.

కుసుమగుప్తుని ఛత్రఛాయలోని రాజ్యాల్లో శిక్షాస్మృతి కఠినంగా అమలవుతుంది. ప్రజల మధ్య తలెత్తిన తగవులను పరిష్కరించేందుకు ధర్మబద్ధంగా దోషులను శిక్షించేందుకు ప్రతి గ్రామములో ధర్మాసనం పంజేస్తుంది. అనుభవజ్ఞులు, న్యాయశాస్త్ర కోవిధులతో కూడిన ఐదుగురు ధర్మాసనంలో సభ్యులు. అన్ని వర్గాలు, వర్ణాల వారికి ఒకే చట్టం, ఒకే న్యాయం వర్తిస్తుంది. తప్పుచేసిన మనిషి తప్పించుకోలేడు. ఎట్టి పరిస్థితిలోనూ నిర్దోషిని శిక్షించరాదు. ప్రతి పట్టణం, రాజాస్థానాల్లోనూ ధర్మాసనాలున్నాయి. ధర్మదేవత నాలుగు పాదాలతో నడవాలనేదే ధ్యేయం. ధర్మాధికారులు విచారణను, తీర్పును వాసవి సాధారణ జనాల్లో కూచుండి గమనిస్తుంది. తీర్పుల్ని క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. వయసుతో పాటు పరిశీలనా శక్తి ఎదుగుతోంది. అయినా విచారణలో జోక్యం చేసుకోదు, తీర్పును ప్రభావితం చెయ్యదు.

అది చైత్రమాసము. ఆకులు రాలి దిగంబరులైన తరులకు వసంతయామిని ఆకుపచ్చని పీతాంబరాలు కట్టిస్తుంది. అంతఃపురములోని ఉద్యానవనము విశాలమైనది. వనమునిండా పొన్న, పొగడ, సన్నజాజి, సంపంగి, మందార సుమ పరిమళాలు సురభిళాలు వెదజల్లుతుంటాయి. పూలమొక్కల కొమ్మలు, రెమ్మలు ఆరోజు సయ్యాట లాడుకుంటున్నాయి. నేలమీద మెత్తని గడ్డి పరుపులాగుంది.

సాయం సమయం. నీరెండలో తరుతరుణుల ఒంటి నిండా పిల్లగాలి తెరలు గిలిగింతలు పెడుతున్నాయి. వాసవి బృందము ఆటపాటల నవలోకిస్తూ కొమ్మలు-రెమ్మలు తలలాడిస్తున్నాయి. ఆకాశమైదానములో చెమ్మాచెక్కలాడుకుంటున్న మబ్బు కన్యలను ఆసక్తిగా చూస్తూ కూచుంది వాసవి. రెక్కలు విప్పి వరుసల్లో పయనిస్తున్న పక్షుల్ని చూస్తుంటే మనసు మయూరమై నర్తిస్తోంది.

ముఖకవళికలు గాంభీర్యాన్ని పులుముకున్నాయి.

"మన రాకుమారి ముఖంలో రంగులు మారుతున్నాయేమిటీ ?" చుట్టూరా చేరిన చెలికత్తెల్లోంచి ఒకరన్నారు. ఒకరి తర్వాత ఒకరు...

"అవునే. చల్లని సాయంకాలం... పిల్లగాలి ఒంటికి హాయిగా ఉంది. మల్లెమొల్లల సువాసనలు, కనకాంబరాలు-మందారాల అందాలు ఈ పుత్తడిబొమ్మను నవ్వించలేవా ?" ముక్కుమీద వేలు.

"మనసు విప్పి మనతో మాట్లాడదా ?" మూతి విరుపు.

"బతిమాలినా గూడా బంతులాటకు రాదటా !"

"దాగుడుమూతలాడుకుందామంటే దేవతామూర్తిలా కూచుందేమిటి ? ఇదేం విచిత్రమో !"

అంతా కలిసి కూడబలుక్కున్నారు. దగ్గరికొచ్చి గిలిగింతలుపెట్టారు. వాసవి కిలకిలా నవ్వింది. చెలికత్తెలు గలగలా నవ్వుతున్నారు.

ఓ లేడిపిల్ల బెదురు చూపులతో పరుగెత్తుకుంటూ వచ్చి వాసవి ముందు ఆగిపోయింది. దమ్ముదీస్తోంది. "నన్ను రక్షించవా !" అన్నట్టుగున్నాయా చూపులు. ప్రాణభీతితో వణికపోతోంది. దమ్ముదీస్తుంటే ప్రాణం విలవిల్లాడిపోతుంది. డొక్కలో బాణం గుచ్చుకుని ఉంది. లేడిపిల్లను ఒడిలోకి తీసుకుంది. నాజుగ్గా ఒళ్లు నిమురుతూ బాణాన్ని లాగిపారేసింది. నీటితో గాయం కడిగింది. ఆకుపసరు గాయమ్మీద పిండింది. వోణీ కొసను చించి గాయానికి కట్టు కట్టింది.

హడలిపోయిన కాపలాదార్లు పరుగెత్తుకొచ్చి భయం భయంగా చేతులు కట్టుకు నుంచున్నారు.

"ఈ ప్రాంతములో వేటగాడుంటాడు. వెతికి పట్టుకురండి." వాసవి ఆదేశించింది.

కాపలాదారులు నాల్గువైపులా పరుగెత్తారు. తోటంతా వెతికారు. విల్లమ్ములతో సహా వేటగాణ్ని పట్టుకొచ్చారు. వేటగాణ్ని కిందినుంచి మీద్దాకా చూశారంతా. అతనిలో దయాదాక్షిణ్యాలు మచ్చుకైనా లేవని ముఖకవళికలు చెబుతున్నాయి.

"నీది గుండెనా ? బండనా ?" రోషంతో వాసవి ముఖము ఎర్రబారింది.

"అదేమిటి రాకుమారీ ?" భయంతో వణికిపోయాడు వేటగాడు. తానుచేసిన అపరాధమేమిటో అతనికర్థం కాలేదు.

"పాపం ! ఈ సాధుజీవి నీకేం అపకారం చేసిందని ? ఎవ్వరికీ అపకారం తలపెట్టని ఈ అమాయక జీవినెందుకు హింసిస్తున్నావు ?"

"వేట నా వృత్తి రాకుమారీ ! వృత్తిధర్మం ఎవరికైనా ఆచరణీయం గదా !"

"కాని... ఈ పెనుగొండ సామ్రాజ్యములో హింసకు తావులేదని తెలియదా ? అహింసా సిద్ధాంతం అమలైందని తెలియదా ?"

వేటగానికి నోటిమాట కరువైంది.

అతణ్ని ధర్మాసనం ముందు హాజరుపరచాలని ఆదేశించింది.

యథావిథిగా ధర్మాసనం సమావేశమైంది. ఫిర్యాదుదారు రాకుమారి కాబట్టి

ప్రాధాన్యత సంతరించుకుంది. కుసుమగుప్తుడు, మంత్రులు, దండనాథులు సభలో ఆసీనులై చూస్తున్నారు. పట్టణ ప్రముఖుల్లో ఆసక్తి పెరిగింది.

బాల్యదశ దాటి కౌమారంలో కువకువలాడుతున్న వాసవి ధర్మాసనానికి సవినయంగా నమస్కరించింది. తన ఫిర్యాదును వినిపించింది. చివరగా తన వాదనను వినిపిస్తూ "పరమేశ్వరుని సృష్టిలో ప్రాణులన్నీ సమానమే. ఏ తప్పుచేయని అమాయక ప్రాణిని హింసించడం మహాపాపం. హింసకు దూరంగా, మమతానురాగాల కాలవాలమైన పాలనలో ఓ అమాయక జీవి స్వేచ్ఛా ప్రపంచంలో విహరిస్తూంటే ఉద్దేశ్యపూర్వకముగా గాయపరిచిన ఈ వేటగాడిని ఊరికే వదిలేయరాదని విన్నవిస్తున్నాను." మరోసారి నమస్కరించి కూచుంది. ప్రతి కదలికలో పట్టుపరికిణి రంగుల హంగులు ఒంటిరాయి ముక్కుపుడక మెరుపులు శోభాయమానంగా కన్పిస్తున్నాయి.

ధర్మాసనంలోని ధర్మాధికారులు మొదట చూపులతో మాట్లాడుకుని తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత తమలోతాము చర్చించుకున్నారు. అహింసా రాజ్యములో హింసకు ఆస్కారం లేదు. ఇకముందు ఇలాంటి సంఘటనలు జరుక్కుండా చూడాలనుకున్నారు. ఏదిఏమైనా నిందితుని అభిప్రాయాన్ని, వాదనలను పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు. వేటగాణ్ని ఆపాదమస్తకం పరిశీలిస్తూ ధర్మాధికారి ఒకాయన

"ఈ లేడిపిల్ల నెందుకు హింసించావు ? ఈ లేడిపిల్ల వల్ల నీకేమైనా అపకారం జరిగిందా ?" అడిగాడు.

వేటగాడు చేతులు కట్టుకుని నుంచున్నాడు. ధర్మాసనానికి నమస్కరించి "అయ్యా ! వేట నా వృత్తి. పైకెగిరే పక్షులు, భూమ్మీద సంచరించే జంతువులు, మృగాలను వేటాడి వాటి మాంసంతో పొట్టబోసుకోవడం అనాదిగా వస్తున్న మా ఆచారము. వాటి మాంసాన్ని అమ్మి జీవనం సాగించడం మా వృత్తిధర్మం." ధైర్యంగా, నిర్మొహమాటంగా జవాబిచ్చాడు.

"కుసుమ గుప్త రాజేంద్రుల సామ్రాజ్యములో హింసకు తావు లేదని చాటింపు వేయించారు. ప్రచారం చేయించారు. అది నీకు తెలియదా ?"

"తెలుసు నయ్యా ! కాని... నా జీవనోపాధి అదే కాబట్టి తప్పలేదు. అది తప్పుకాదని అనుకుంటున్నాను."

"జానెడు పొట్టకోసం అమాయక జీవుల్ని వెన్నంటి, వేటాడడం అమానుషం... రాక్షసత్వం.. పిడికెడన్నం కోసం వేరే ఉపాధి దొరకదా ?"

"దొరుకుతుంది. దొరక్కపోతే గ్రామాధికారులు ఇప్పిస్తారు కాని... ఇది నా

వృత్తి ధర్మం. ధర్మాన్ని ఆచరించకపోవడం గూడా అధర్మంగదా ! మా పూర్వజుడైన ధర్మవ్యాధుడు అతనికిష్టం లేకపోయినా వృత్తి ధర్మాన్నంగీకరించి మాంసము అమ్మి జీవించలేదా ?"

ధర్మ సందేహం మీ మాంసంలో పడేసింది. అందరిలో ఆసక్తి పెరిగిపోయింది. ధర్మాసనంలోని ధర్మాధికారుల దృష్టి వాసవి వైపు మళ్లింది. ఓ ధర్మాధికారి చొరవగా

"అమ్మా ! దీనికి మీ సమాధానమేమిటి ?" అడగాడు. వాసవి లేచి నుంచుని అందరి ముఖకవళికలను కనిపెట్టింది.

"అయ్యా ! అతణ్ని నేను కొన్ని ప్రశ్నలడగదలుచుకున్నాను. దయచేసి అనుమతించాలని మనవి."

"అడగండమ్మా !"

"నాయనా ! వృత్తి ధర్మమంటే నిరపరాధ జీవులను హింసించడము కాదు." వాసవి దృష్టి వేటగాడి వైపు మళ్లింది. "ధర్మవ్యాధుడెప్పుడూ ఏ ప్రాణినీ హింసిచలేదు. అయినా అది రామాయణకాలము, త్రేతాయుగము. ఇది కలియుగము మొదటి పాదము. అకారణముగా ఎవరినీ హింసిచరాదనే ప్రభుత్వ ఆదేశముంది. రాజశాసనాన్ని ధిక్కరించడము తప్పు కాదా ?"

"తప్పెలా అవుతుందమ్మా ? నా జీవనోపాధికి మరో మార్గం లేదుగదా ! ఇది శాస్త్రసమ్మతమే గదా ?" నిర్భయంగా జవాబిచ్చాడు వేటగాడు.

"పొరపాటు నాయనా !" వాసవి ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. "ఎవరికీ ఏ అపకారము తలపెట్టని జీవిని హింసించి మరో జీవి బతకాలని ఏ శాస్త్రమూ చెప్పలేదు. అహింసో పరమో ధర్మః అన్నారు పెద్దలు. నీ ప్రాణాలు నిలుపుకునేందుకు మరో ప్రాణి ప్రాణాలు హరించడం నిష్కృతిలేని పాపము. అయినా ఈ రాజ్యములో పాడిపంటలకు కొదవ ఉందా ?"

"లేదు"

"చేసేందుకు పనులు దొరకడం లేదా ?"

"దొరుకుతున్నాయి."

"ఈ సామ్రాజ్యములో ఎవరైనా ఆకలి దప్పులతో అలమటిస్తున్నారా ?"

"లేదు. అందరూ సుఖసంతోషాలతో గడుపుతున్నారు."

"మరి... ఈ హింసా వృత్తిని వదిలేసి మరో వృత్తినెందుకు స్వీకరించడము లేదు ? నీకు అపకారం చేసిన జీవిపై కక్ష ఉండొచ్చుగానీ వృత్తిధర్మమని సమర్ధించుకుంటూ

అమాయక ప్రాణుల్ని నిర్దాక్షిణ్యంగా చంపి వాటి మాంసం తినడం రాక్షసకృత్యం కాదా ?"

ఏం జవాబియ్యాలో వేటగానికి తోచలేదు. నీళ్లు నమిలి తలవంచుకున్నాడు.

"ధర్మదేవతాస్వరూపులారా !" ధర్మాసనాన్ని ఉద్దేశించింది వాసవి. "ఈ సామ్రాజ్యము పరిధిలో అకారణమైన హింస జరుగరాదనే ఆదేశాన్ని ధిక్కరించిన ఈ అమాయకుని అహింసా పద్ధతిలో శిక్షించాలని కోరుతున్నాను. న్యాయ కోవిధులైన మీ తీర్పు అందరికీ శిరోధార్యము." విన్నవించి కూచుంది.

ధర్మాసనంలో, సభలో గుసగుసలు ప్రారంభమైనాయి.

అహింసా మార్గములో శిక్షించడమా ! అందరినీ ఆశ్చర్యములో ముంచెత్తింది. ధర్మాసనాన్ని అయోమయంలోకి నెట్టేసింది.

"ఈ తీర్పు రాకుమారే చెప్పాలి." ప్రజావాణి.

"అయ్యలారా, అమ్మలారా !" వాసవి ప్రజాసమూహానికి చేతులు జోడించింది. "నేను రాకుమారిగా కాదు, ఓ సామాన్య వ్యక్తిగా ఫిర్యాదు చేశాను. నాకు తోచింది వాదించాను. ధర్మాసనం తీర్పు ఏదైనా సంతోషంగా స్వాగతిస్తాను."

ధర్మాధికారులు కాస్సేపు తర్జనబర్జనలు చేసుకున్నారు. వాసవి వాదన శాసనబద్ధమైంది. శిక్ష అనేది నేరస్తుని మనసు మార్చేదిలాగుండాలి. మానవతా వాదాన్ని నిలబెట్టాలి. హింసకు జవాబు హింస కారాదు... చర్చ ముగిసింది.

ధర్మాధ్యక్షుడి ద్వారా తీర్పు వెలువడింది.

"మన చట్టాల ప్రకారం ఈ వేటగాడు దోషియే. అందుకు శిక్షార్హుడే. బుద్ధి పూర్వకముగానే లేడిపిల్లపై బాణము ప్రయోగించి హింసించాడు, గాయపరిచాడు. అందుకే... గాయపడ్డ లేడిపిల్లను అతని దగ్గరనే ఉంచుకుని గాయానికి చికిత్స చేయించాలి. గాయాలు పూర్తిగా మానాక ధర్మాసనానికి తెలపాలి. ఆ తర్వాత వదిలేయాలి. ఇకనుంచి అతడు వేటాడరాదు. జీవనోపాధికోసం అతనికి నచ్చిన మరోవృత్తిని స్వీకరించవచ్చు. అందుకోసం అవసరమైతే ప్రభుత్వ సహాయాన్ని పొందవచ్చు. అంతవరదాకా రాజభటులు అతని ప్రవర్తనపై నిఘా వేసి ఉంటారని గుర్తుంచుకోవాలి."

తీర్పును విని అంతా సంతోషించారు.

ఈ తీర్పు ఇతర రాజ్యాలలో చర్చనీయాంశమైంది. ప్రజల మన్నలందుకుంది.

వాసవి ధైర్యసాహసాలు, తాత్వికచింతన, సామాజిక స్పృహ కుసుమ గుప్తుని పాలనకెంతో ఉపయోగపడుతున్నాయి. దాంతో వ్యాపార రంగములో నీతినిజాయితీలను నమ్ముకోవడం, మాట మీద నిలకడగా ఉండడం అలవాటైన వర్తకులకెంతో ధైర్యమొచ్చింది.

నవయువకులు కొందరు వ్యాపారాలు చేస్తామని ముందుకొచ్చారు. అడిగిన వారందరికీ ప్రభుత్వం ఋణాలిచ్చి ప్రోత్సహించింది. విదేశీ వ్యాపారానికి ప్రోత్సహకాలు ప్రకటించింది. పడవల్లో సముద్రయానంవల్ల విదేశీ వ్యాపారం దినదినాభివృద్ధి దిశలో పయనించింది.

విదేశీ వ్యాపారం చెయ్యాలనుకున్న ఔత్సాహికులు ముందు ప్రభుత్వ అనుమతి పొందాలి. ఆ వ్యక్తి గుణగణాలకు, దేశభక్తిని ప్రభుత్వాధికారులు ముందు పరీక్షించి సమర్ధులకు మాత్రమే అనుమతిస్తారు. విదేశీ భాషలు నేర్చుకునేందుకు ప్రభుత్వ పక్షాన ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దురాశ దుఃఖానికి చేటు కాబట్టి వర్తకులు అధికలాభార్జనకు అధర్మాన్నాశ్రయించరాదని శాసించారు.

వైశ్యులు వాణిజ్య వ్యాపారాలతోపాటు పశుపోషణ, వ్యవసాయం పనుల్లో ఆరితేరిన వారు. నువ్వులు, రస వస్తువులు, సుంగధ ద్రవ్యాలను విరివిగా విదేశాలకు ఎగుమతి చేస్నున్నారు. వ్యాపార వాణిజ్యాల్లో, వ్యవసాయం, పశుపోషణలో, సేవా కార్యక్రమాల్లో నిష్ణాతులైన వారిని బహుమతులతో ప్రోత్సహించి అభినందించేందుకు ఏటేటా మహాసభనేర్పాటు చేస్తున్నారు. ఆ సభకు విదేశీ ప్రతినిధులు హాజరై తమ రాజ్యాల్లో వ్యాపారాభివృద్ధికి దారులు వెతుక్కుంటున్నారు.

ఆనాటి ఆచారము ప్రకారము విరూపాక్షుడిని గౌరబాలుడు గాను, వాసవిని గౌర బాలిక గాను, వైదిక విధానములో ప్రకటించారు. సాంప్రదాయము ప్రకారము గౌర బాలికలు గౌర బాలురను మాత్రమే పెళ్లాడాలి. ఇతరులతో వివాహ సంబంధాలు ఆమోద యోగ్యము కావు. ఆచార సాంప్రదాయాలను తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. గౌరులనగా పరమేశ్వర స్వరూపులు. సమాజ పరమేశ్వరుని సేవకు అంకితమైనవారు.

కిశోరదశ అంటే తెలిసీతెలియని వయసు, ఆసక్తికరమైన అనుమానాలను రేకెత్తించే ప్రత్యేక దశ. ఆ దశలో అనుమాన నివృత్తి జరక్కపోతే అయోమయం అలుముకుంటుంది.

అంతఃపురము లోపలి గోడలకు రామాయణ, భారత, భాగవతాలకు సంబంధించిన తైలవర్ణ చిత్రాలున్నాయి.

ఓ రోజు వాసవి ఆ చిత్రాలను ప్రత్యేకంగా చూస్తోంది. రామాయణానికి సంబంధించిన చిత్రము ముందు నిలబడి పోయింది. లంకేశుని అశోకవనములో చింతాకాంతయై కూచున్న సీతమ్మ చిత్రమది. చిత్రములో జీవం ఉట్టి పడుతోంది. వాసవి మస్తిష్కాన్ని అనుమానాలు అలుముకున్నాయి. ముందుకు పోకుండా గదవకు ఎడమచేతి మడమ ఆనించి చిత్రం ముందు నుంచున్న కూతుర్ని చూసి కుసుమాంబ

విస్తుబోయింది. కూతురు దగ్గరి కొచ్చి

"ఎందుకట్లా నిలబడిపోయావు వాసవీ ? ఏమాలోచిస్తున్నావు ?" లాలలనగా తల నిమురుతూ అడిగింది.

"అమ్మా !" విశాల నేత్రాలను విచిత్రంగా కదిలిస్తూ "ఆ చిత్రం చూడమ్మా !" అంది తనముందున్న వర్ణ చిత్రాన్ని వేలితో చూపిస్తూ.

"అవును తల్లీ ! అది తైల వర్ణ చిత్రం. మన ఆస్థాన చిత్రకారులు వేసిన చిత్రం. చాలా బాగుంది గదా !"

"చిత్రం బాగుంది గాని ఆ చిత్రములోని విచిత్రం అర్థం కాలేదమ్మా !" మొహం ప్రశ్నార్థకమైంది.

"విచిత్రమా ? అదేమిటి తల్లీ !" కుసుమాంబలో అయోమయం "నువ్విలారా" చెయ్యిపట్టి తీసుకెళ్లి ఆసనమ్మీద కూచోబెట్టింది. తాను పక్కన కూచుండి "ఇప్పుడు చెప్పు, నీకా చిత్రములో ఏం విచిత్రం కన్పించిందో" తల నిమురుతూ అడిగింది.

"అమ్మా !" వాసవి హాషారుగా కళ్లు తిప్పింది. "సీతామాత మిథిలా రాజకుమారి గదా !"

"అవును."

"అవునుగదా ! సీతమ్మ ఎనిమిదేళ్ల వయసులో చెలికత్తెలతో బంతి ఆడుకుంటూంటే, ఆ బంతి శివధనస్సు కింద పడితే, ఆమె ఆ శివధనస్సును ఎడమ చేత్తో అలవోకగా ఎత్తి పక్కనబెట్టింది. బంతిని బయటకు తీసిందని రామాయణములో ఉంది గదా !"

"ఉంది. కాని... దానికి ఈ చిత్రానికి సంబంధమేమిటమ్మా ? ఈ చిత్రము సీతామాత అశోకవనములో బేలగా కూచున్నప్పటిది."

"సీతామాత అబల కాదు గదా !"

"కాదు... సబలనే ! అయితే...!"

"సీతమ్మ చిన్నప్పుడు ఎడమచేత్తో ఎత్తి పక్కనబెట్టిన శివధనుస్సును స్వయంవర సమయములో రావణాసురుడు ఎత్తలేక మీద పడేసుకుని గిలగిల కొట్టుకున్నాడు గదా !"

"అవునూ... అయితే !"

"అంతటి బలవంతురాలైన సీతమ్మను ఆ రావణాసురుడు ఎత్తుకెల్తుంటే ఎందుకెదిరించలేదు. సీతమ్మ వాణ్నో చెంపదెబ్బ పెడితే గిర్రున తిరిగి పడిపోయేవాడుగదా! అలా చెయ్యకుండా పిరికి దానిలా ఏడ్చింది ఎందుకూ ? అశోక వనములో కష్టాలనుభవిస్తూ

చింతాక్రాంతయై ఎందుక్కూచుంది ? అదే అశోక వనములో ఆమె ఒక్క గుద్దుగుద్దితే ఆ రావణుడు చతికిలపడిపోయేవాడు గదా !"

కుసుమాంబ తుళ్లిపడింది. అమ్మ బాబోయ్ ! గొప్ప సందేహమే ! వెంటనే గొంతు పెగలక గుటకేసింది. కాస్సేపటికి తేరుకుని కూతురు హావభావాలను సునిశితంగా పరిశీలించి నవ్వేసింది.

"నీకా సందేహం రావాల్సిందే ! సీతామాత రావణునికంటే శక్తిమంతురాలే. ఆమె తలచుకుంటే రావణున్ని పర్ణశాలముందే పరాభవించి పంపగలిగేదే ! కాని... శ్రీరామావతారము ముఖ్య ఉద్ధేశ్యము రాక్షసులందరినీ సంహరించడం. కేవలం రావణాసురుని మదమణిగించినంత మాత్రాన రాక్షసులందరూ చావరు గదా ! భారత స్త్రీ అగ్నికణం లాంటిది. అపకారము తలపెట్టిన వారి అంతం చూడక మానదు. రాక్షస జాతిని సమూలంగా అంతం చేసి ధర్మ సంస్థాపన చెయ్యాలని ఆమె పట్టుదల. రావణునితో పాటు లంకలో కుంభకర్ణుడు, ఇంద్రజిత్తులాంటి జిత్తుల మారి రాక్షసులెందరో ఉన్నారు. వారందరి అంతం చూడాలి. ఏదో ఒక సంఘటన ఉండాలి. వారందరి అంతం చూడాలి. ఏదో ఒక సంఘటన అందుకు దారిదీయాలి. ఆ సంఘటనకు సరియైన కారణం ఉండాలి. సీతాపహరణమే దానికి మూలము. దాంతోనే శ్రీరాముడు రాక్షస సంహారానికి లంకకు రావాలి. రావణుడు సహా మిగితా రాక్షసులందరినీ చంపేసి తనను రక్షించాలి. ఆ ఉద్దేశ్యంతోనే సీతామాత అరివీర భయంకరురాలైనా రావణున్ని ఎదిరించలేదు, ధర్మ సంస్థాపన కోసం సీతమ్మ కష్టాలనుభవించింది. అశోక వనములో చింతా క్రాంతమై కూచుంది... "

సందేహ నివృత్తి జరగ్గానే వాసవి ముఖారవిందము వేయి సంతోషదళాలుగా విచ్చుకుంది. తల్లిఒడిలో తలానించి "అయితే లోక కల్యాణం కోసం భారత స్త్రీ ఎంతటి త్యాగానికైనా వెనకాడదన్న మాట." విశాల నేత్రాలను తృప్తిగా కదిలిస్తూ హాయిగా ఊపిరి పీల్చుకుంది.

# 4

మానవజాతి మనుగడ క్రమ పద్ధతిలో సాగేందుకు షోడషసంస్కారా లేర్పాటైనాయి. ప్రతి మనిషి ఆచరించాల్సిన సాంప్రదాయాలు. మనిషికి ఏ వయసులో ఏ సంస్కారం జరగాలనేది శాస్త్రాలు చెబుతున్నాయని కుసుమగుప్తునికి తెలుసు.

అశ్వలాయన గృహ్యసూత్రాన్ననుసరించి పన్నెండేళ్ల వయసులో వైశ్యబాలునికి

ఉపనయనం జరగాలనే విషయం గుర్తుకొచ్చింది. విరూపాక్షుని ఉపనయనం గురించి గురువుగారి సలహా తీసుకోవాలనుకున్నాడు. సతీసమేతంగా బయలుదేరి భాస్కరాచారి ఆశ్రమం చేరుకున్నాడు.

రథం దిగి ఆశ్రమం లోపలికొస్తున్న రాజదంపతులకు సముచిత మర్యాదలతో శిష్యులు స్వాగతం పలికారు. రాజదంపతుల వెంట వాసవి, విరూపాక్షులున్నారు. నలుగురూ లోపలికొచ్చి గురువుగారికి పాదాభివందనం చేశారు.

గద్దెమీద కూచున్న గురువుగారి ముందు నేలమీద సుఖాసీనులయారు. గురువు భాస్కరాచారికి రెండువైపులా శిష్యులున్నారు. ఆశ్రమం చుట్టూ రాజభటులు కాపలా కాస్తున్నారు. కుశల సమాచారాల తర్వాత

"గురుదేవా ! చిరంజీవి విరూపాక్షుని ఉపనయన సంస్కారం గురించి మీతో సంప్రదించాలని వచ్చాము." కుసుమగుప్తుడు సవినయంగా ప్రస్తావించాడు.

"అవును మహారాజా !" భాస్కరాచారి ముఖములో బ్రహ్మతేజస్సు కనబడుతోంది. "షోడషసంస్కారాల్లో ఉపనయనం ముఖ్యమైంది. బాలుని జీవితం పునీతమయేందుకు ఆచరించాల్సిన సంస్కారము. బ్రాహ్మణ బాలునికి ఎనిమిదవ ఏట, క్షత్రియునికి పదకొండవ ఏట, వైశ్యునికి పన్నెండవ ఏట జరపాల్సిన విధి విధానము. మిగితావారు గూడా వైశ్యులననుసరిస్తారు... "

"దయచేసి ముహూర్తం నిర్ణయించండి గురుదేవా !"

"బ్రాహ్మణునికి వసంత ఋతువు, క్షత్రియునికి గ్రీష్మ ఋతువు, వైశ్యునికి శరదృతువులో మిగితావారికి ఏ ఋతువులోనైనా ఉపనయనం చెయ్యాలి. శరదృతువు సమీపిస్తుంది కాబట్టి విరూపాక్షునికి ఉపనయనం జరిపించడము ఉచితముగా ఉంటుంది." అని వేళ్లమీద ఏవో లెఖ్ఖలు వేస్తుంటే నుదుటి భస్మరేఖలు మధ్యాహ్న మార్తాండ కిరణాల్లా కన్పిస్తున్నాయి. ముహూర్తం నిర్ణయమైంది.

విరూపాక్షుడు గురువుగార్కి నమస్కరించి

"గురువర్యా ! ..." ఏదో అడగబోయి ఆగి తల్లిదండ్రుల వైపు చూశాడు. ఏదో సందేహం అడిగేందుకు ఇబ్బంది పడుతున్నాడని అర్థమైంది.

"అడుగు నాయానా ? ఏ దన్నా సందేహమా ?" భాస్కరాచారి ప్రోత్సహించాడు. కనుసైగలతో తల్లిదండ్రులనుమతించారు.

"సందేహమేగానీ సందర్భం గదా !" చేతులు కట్టుక్కూచున్నాడు విరూపాక్షుడు.

"షోడశసంస్కారాలంటే ఏమిటో, వాటినెందుకాచరించాలో తెలుసుకోవాలనుంది. దయచేసి..."

"సరే నాయనా... సంతోషం ! సంక్షిప్తంగా చెబుతాను." శిష్యుని ఆసక్తి గురువుగారి నుత్సాహపరిచింది. "ఇప్పుడుర్థంకాని కొన్ని విషయాలు యుక్తవయసులో అర్థమవుతావి కాబట్టి శ్రద్ధగా విను." అందరి మొహాలను విహంగవీక్షణం చేస్తూ ప్రారంభించాడు.

"మనిషి జీవితములో విభిన్న దశలను క్రమబద్ధీకరించేవి షోడషసంస్కారాలు. ఏది, ఎప్పుడు జరగాలో అప్పుడు యజ్ఞహవనము సాక్షిగా వేదమంత్ర పఠనంతో జరగాలి. ఈ సంస్కారాలు పదహారు. అవి... వరుసగా చెబుతున్నాను.

**1) నిషేకము :-** దీన్నే గర్భాదాన సంస్కారమంటారు. ఏడేడు జన్మల అనుబంధం మూడుముళ్ల పెళ్లితో వధూవరులను ఏకం చేస్తుంది. మనసులు కలసిన నూతన వధూవరులు ఏకాంతములో శారీరికముగా ఏకమవడం... దీన్నే నిషేకమంటారు. ఇది చరాచర సృష్టిలోని ప్రాణులన్నింటికి సహజము. సంతానోత్పత్తికి మూలకారణము. దీన్నే గర్భాదానమని గూడా అంటారు.

**2) పుంసవనము :-** వధువు గర్భధారణ రూఢి అయింతర్వాత మూడోనెలలో ఆచరించాల్సిన సంస్కారకర్మ. భార్యాభర్తలు శుద్ధమనస్కులై యజ్ఞహవనముతో పునీతులవాలి. ఇది వారి శారీరక, మానసికారోగ్యాన్ని కాపాడుతుంది. యజ్ఞధూమము వ్యాపించినంత దూరము వాతావరణములోని కాలుష్యాలు హరించుకుపోతాయి. గర్భవతికి మానసికోల్లాసం కలుగుతుంది. గర్భస్తశిశువుకు మేలు జరుగుతుంది.

**3) సీమంతోన్నయనము :-** గర్భధారణ రూఢియైన తర్వాత నాలుగు నుండి ఎనిమిది నెలల లోపల గర్భవతిచే చేయించాల్సిన సంస్కారవిధి. దీన్ని సాధారణ జనాలు సీమంతోత్సవ వేడుకగా జరుపుకుంటారు. సామాన్యజనాల్లో గూడా బహుళప్రాచుర్యంలో ఉన్నది. పుట్టబోయే శిశువు తల్లిగర్భములో ఆరోగ్యంగా ఉండాలని, నెలలు నిండిన తర్వాత సునాయాసంగా బాహ్య ప్రపంచంలోకి రావాలని కోరుకునే శుభసందర్భము. ఈ సమయములో పునిస్త్రీలు గర్భవతిని సర్వాంగసుందరంగా అలంకరించి యజ్ఞగుండం ముందు ఆసనమ్మీద కూచోబెడ్తారు. హవనము తర్వాత పాటలుపాడుతూ వేడుకలు చేస్తారు. గర్భవతి తనకిష్టమైన, గర్భస్థశిశువుక్కావాల్సిన ఆహారాన్ని దృష్టిలో పెట్టుకుని రుచికరమైన పదార్థాలను భుజిస్తుంది.

**4) జాతకర్మ :-** గర్భస్తశిశువు మాయాలోకం నుండి మానవ లోకానికొచ్చేటప్పుడు

అనగా గర్భవతి ప్రసవసమయాన జాతకర్మ సంస్కారాన్నాచరిస్తారు. సుఖప్రసవానికిది దోహదపడుతుంది.

**5) నామకరణం :-** శిశువు ఈ లోకములో కళ్లు తెరిచిన తర్వాత ఆచరించాల్సిన మొదటి సంస్కారమిది. శిశువు జన్మించిన తర్వాత పదకొండవరోజు లేదా ఇరవయ్యొకటవ రోజు నుండి ఏ రోజైనా నామకరణోత్సవం చేస్తారు. ఆ రోజే శిశువుకు పేరు పెడతారు. అదే పేరుతో లోకం గుర్తిస్తుంది. ఇదిగూడా సర్వజనామోదమైన సంస్కారము. ఆ రోజే శిశువుకు యజ్ఞహవనము సాక్షిగా నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. ఊయలలో పడుకోబెట్టి పాటలు పాడుతూ వేడుకలు చేస్తారు.

**6) నిష్క్రమణము :-** పుట్టినప్పట్నుంచి నాలుగ్గోడల మధ్య ఉండే శిశువును నాల్గో నెలలో ఇంట్లోంచి బయటకు శాస్త్రోకంగా తీసుకురావడాన్ని నిష్క్రమణ సంస్కారమంటారు. శిశువును పరిశుభ్రమైన ప్రదేశానికి తీసుకొచ్చి స్వచ్ఛమైన గాలి పీల్చేలా చెయ్యడమే ఈ సంస్కారము ఉద్ధేశ్యము.

**7) అన్నప్రాశనము :-** అప్పటిదాకా తల్లిపాలతో కడుపు నింపుకుంటున్న శిశువుకు ఆరోమాసం నుండి అదనపు ఆహారము అవసరమవుతుంది. అప్పుడే అసలు జీర్ణశక్తి ప్రారంభమవుతుంది కాబట్టి యజ్ఞహవనము ముందు అన్నం తినిపించడము ప్రారంభిస్తారు. దాన్నే అన్నప్రాశనమంటారు.

**8) చూడాకర్మ :-** శిశువు పుట్టినప్పట్నుంచి తలపై పెరిగిన వెంట్రుకలను తొలగించడమే చూడాకర్మ సంస్కారము. శిశువు జన్మించిన సంవత్సరంలోగా లేదా మూడో సంవత్సరం నుండి ఎప్పుడైనా ఉత్తరాయణ పుణ్యకాలమున ఈ సంస్కారాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించాలి.

**9) కర్ణవేధ :-** శిశువు జన్మించిన మూడవ లేదా ఐదవ సంవత్సరములో చెవులు కుట్టించాలి. ఆడపిల్లలకీ సంస్కారము తప్పనిసరిగా చేయించాలి.

**10) ఉపనయనము :-** పరమాత్మ ప్రసాదించిన జన్మను సార్థకం చేసుకునేందుకు ఆచరించాల్సిన ముఖ్య సంస్కారమే ఉపనయనము. సర్వేంద్రియాణాం నయనం ప్రధానమంటారు గదా ! మనిషికి కన్ను ఎంత ముఖ్యమో బాలునికి ఉపనయనమంతే ముఖ్యము. ఆపస్తంబ సూత్రము, ఖాదిర గృహ్యసూత్రము, పావస్కర గృహ్యసూత్రములీ సంస్కార విధిని వివరించాయి. ఈ సంస్కారాన్ని ఆచరించనివారు గాయత్రీ దానమునకు, జప తపాలకు అనర్హులు. వైశ్య బాలురకు గూడా ఈ సంస్కారమును వేదోక్తముగా యజ్ఞహవనము ముందు జరిపించాలి. బాలుని తండ్రి, అతనికి తన తండ్రి ఉపదేశించిన రహస్య మంత్రాన్ని కుమారుని చెవిలో బ్రహ్మోపదేశం చెయ్యాలి. యజ్ఞోపవీతము

ధరింపజెయ్యాలి. ఆనాటినుండే బాలుడు ద్విజుడవుతాడు. ఈ సంస్కారవిధిలో భిక్షాటన... అనగా అహాన్ని వదిలి నిరాడంబరముగా జోలె ధరించి భిక్షాటన చెయ్యాలి. తల్లిదండ్రులు, తోబుట్టువుల నుండి భిక్ష స్వీకరించాలి.

**11) వేదారంభము :-** ఉపనయన సంస్కారములో బాలుడు గాయత్రి ధరించిన తర్వాత వేదపఠనం ప్రారంభించడమే వేదారంభ సంస్కారము. బ్రాహ్మణ బాలునికిది తప్పనిసరి.

**12) సమావర్తనము :-** విద్యాభ్యాసము, వేదాధ్యయనం పూర్తయిన తర్వాత బ్రహ్మచర్య దీక్షను విరమించడాన్ని కేశాంత లేదా సమావర్తన సంస్కారమంటారు. సంపూర్ణ విద్యావంతులైన బ్రహ్మచారి విద్యావ్రతస్నానము చేస్తాడు.

**13) వివాహము :-** మనిషి సాంఘిక జీవనానికి పరిపూర్ణత చేకూర్చేది వివాహ సంస్కారము. యువతీయువకులు బ్రహ్మచర్యాన్ని వదిలేసి గృహస్థాశ్రమాన్ని స్వీకరించే ముందు వివాహం చేసుకొంటారు. గుణకర్మ స్వభావములలో తుల్యులై ఒకరినొకరు ఇష్టపడిన యువతి-యువకుడు వివాహ సంస్కారమాచరిస్తారు. సాంసారిక సుఖము, సంతానోత్పత్తి, సమాజసేవ కోసం వేదమంత్రాలు, యజ్ఞహవనము సాక్షిగా మనసులు కలుపుకుని ఒకటవడము అపూర్వ సంగమము. ప్రకృతి - పురుషులైన దంపతులు సృష్టికార్యములో పాల్గొంటారు. వివాహ విధిలో ముఖ్యమైన నియమము - వధూవరులు ఒకే గోత్రికులై ఉండరాదు. అన్యగోత్రములకు చెందిన వధూవరుల వివాహం శ్రేష్ఠము, ఆరోగ్యకరమైనది. సాంసారిక జీవితములో కష్టసుఖాలను కలిసి పంచుకుంటామని, జీవితాంతం కలిసి ఉంటామని వేదమంత్రాల మధ్య, హవన ప్రమాణముగా వధూవరులు ప్రమాణాలు చేస్తారు.

**14) గృహప్రవేశము :-** శాస్త్రోక్తంగా వివాహమైన తర్వాత నూతన దంపతులు సంసార జీవితమనే గృహములో ప్రవేశించడాన్ని గృహప్రవేశ సంస్కారమంటారు. గృహస్థాశ్రమం కోసం అగ్నిని సేకరించి దాంపత్య జీవితాన్ని ప్రారంభిస్తారు. గృహస్తుజీవితములో పరోపకారానికి, ఈశ్వరోపాసనకు శ్రీకారం చుట్టడం ఆ తర్వాత సంసార సాగరయానము చెయ్యడం సర్వసామాన్యమైనది.

**15) వానప్రస్థము :-** గృహస్థాశ్రమములో దంపతులు ధర్మాన్నాచరిస్తూ సంతానము పొందుతారు. పిల్లలు పెరిగి పెద్దవారై జీవితంలో స్థిరపడ్తారు. అప్పుడు తల్లిదండ్రులు తమబాధ్యతలను పిల్లలకప్పగించి ప్రశాంత జీవితము గడిపేందుకు ఉపక్రమిస్తారు. ఆ ప్రక్రియను యజ్ఞహవనము సాక్షిగా ప్రారంభించడాన్ని వానప్రస్థమంటారు. వయసుమళ్లిన

వారుమాత్రమే వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలి. మితభోజనము, దైవచింతన, వానప్రస్థాశ్రమములో ఆచరణీయములు. అలా కొంతకాలం గడిపిన తర్వాత సన్యాసాన్ని స్వీకరించవచ్చు. సంసార సుఖాలను త్యజించి భిక్షాటనతో కడుపునింపుకుంటూ జనాలకు ధర్మబోధ చేస్తూ దేశాటన చెయ్యడం, సమాజాన్ని చైతన్యపరచడం సన్యాసి కర్తవ్యము.

**16) అంత్యేష్ఠి :-** మరణానంతరము మనిషి పార్థివశరీరానికి శాస్త్రోక్తంగా జరిపే అంతిమ సంస్కారమే అంత్యేష్ఠి. దీని తర్వాత శరీరానికి మరో సంస్కారములేదు. శవానికి స్నానం చేయించి, సుగంధద్రవ్యాలు పూసి, నూతన వస్త్రాలంకరణ చేసి వేదమంత్రో చ్చారణల మధ్య శ్మశానానికి తీసుకెళ్లి అగ్నిదేవునికి లేదా భూగర్భానికి సమర్పిస్తారు.

నాయనా ! ఇవీ షోడష సంస్కారాలు. వీటినాచరించే విధివిధానాలను శాస్త్రాలు నిర్దేశించాయి. ఏ సంస్కారమైనా శాస్త్రబద్ధంగా జరిగితే అందరికీ మంచిది. నీ ఉపనయన సంస్కారముగూడా శాస్త్రబద్ధంగా జరుగుతుంది."

భాస్కరాచారి ముగింపుతో అంతా తృప్తిచెందారు.

అది శరదృతువు. విరూపాక్షుని ఉపనయన మహోత్సవానికి వేంచేసి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని బంధుమిత్ర సామంతులందరికీ ఆహ్వానాలు పంపించారు.

సామంతరాజులు, నగరస్వాములు, బంధుమిత్రుల సమక్షములో, భాస్కరాచారి నేతృత్వములో ఉపనయనోత్సవము కన్నుల పండువగా ప్రారంభమైంది.

శుభోదయ సమయాన రాకుమారుడు విరూపాక్షునికి క్షురకర్మ చేయించి పవిత్ర గోదావరి జలాలతో పుణ్యస్నానం చేయించారు. శుద్ధ వస్త్రములు ధరింపజేశారు. అల్పాహారము తినిపించి యజ్ఞశాలకు తోడ్కొని వచ్చారు. యజ్ఞగుండానికి పశ్చిమభాగమున పూర్వాభిముఖముగా కూచోబెట్టారు. అందరూ తమతమ స్థానాల్లో ఆసీనులై తిలకిస్తున్నారు.

తండ్రి కుసుమగుప్తుడు, కులగురువు భాస్కరాచారి చెరో పక్కన ఆసీనులయారు. యజ్ఞసమిధలుగా ఉపయోగించే కర్రముక్కల రాపిడితో అగ్ని పుట్టించారు. యజ్ఞజ్వాలలు అందరికి కనువిందు చేస్తుంటే హవనము ప్రారంభమైంది.

భాస్కరాచారి సాంగోపాంగ వేదమంత్రము నుచ్చరించి అర్థతాత్పర్యాలు వివరించారు. కుసుమగుప్తుడు ప్రేమపూర్వకముగా నూతన వస్త్రాలు కుమారుని కందిస్తూ

"ఓం యనేంద్రాయ బృహస్పతిర్ వాసః
పర్వదధామృతమ్
తేనత్వా పరిదధామ్యాయుషే దీర్ఘాయు
త్వాయ బలాయ వర్చసే... "

(పూర్వకాలమున బృహస్పతి ఇంద్రునికి నాశరహితము జ్ఞానరూప వస్త్రమును ధరింపజేసినట్లు, నేను నీకు యజ్ఞోపవీతరూప వస్త్రములను, దీర్ఘాయు బలము, తేజస్సునిచ్చుటకై ధరింపజేయుచున్నాను.)

మంత్రోచ్ఛారణ చేశాడు. ఆవునెయ్యి, యజ్ఞసమిధలు అగ్నిదేవుని కాహారముకాగా యజ్ఞధూమము నలుదెసలా వ్యాపిస్తూ సువాసనలు వెదజల్లుతోంది.

విరూపాక్షుడు నూతన వస్త్రాలు ధరించి తిరిగి యజ్ఞగుండము ముందుకొచ్చాడు. కుసుమగుప్తుడు యజ్ఞోపవీతమును చేతిలోకి తీసుకుని అగ్నిదేవునికి నమస్కరించాడు. ఆ తర్వాత గురువుగారికి, జనాలందరికీ నమస్కరించాడు.

"ఓం యజ్ఞోపవీతం పరమం పవిత్రం
ప్రజాపతేర్యత్ సహజం పురస్తాత్
ఆయుష్య మగ్ర్యం ప్రతిముంచ శుభ్రం
యజ్ఞోపవీతం బలవస్తు తేజః
ఓం యజ్ఞోపవీత మసి యజ్ఞస్వ
త్వాయజ్ఞోపవీతేన ఉపనహ్యామి"

(ఈ బ్రహ్మసూత్రము అతి పురాతనమైనది, పవిత్రమైనది. ప్రజాపతితోబాటు వర్తిస్తుంది. ఆయువు నిచ్చునది, జీవితములో ముందుండునది. దీనిని భుజముపై విడువుము,ఉంచుము. పవిత్రమైనది కావున బలము,తేజస్సునిస్తుంది. ఓ బాలుడా ! నీవు యజ్ఞోపవీతుడవు. యజ్ఞోపవీతముతో నిన్ను సమీపమునకు తీసుకొనుచున్నాను.)

మంత్రమునుచ్చరించాడు. భాస్కరాచారి నిర్దేశాన్ననుసరిస్తూ బ్రాహ్మణులతో మరికొన్ని మంత్రాలనుచ్చరిస్తూ కుమారునికి యజ్ఞోపవీతము ధరింపజేశాడు. ఆ తర్వాత చెవిలో గాయత్రీ మంత్రముచ్చరిస్తూ బ్రహ్మోపదేశం చేశాడు.

తల్లిదండ్రులు, బంధువులు, రాజన్యులు
"ఓం హే బాలకః త్వం జీవరదః శతమ్ వర్ధమానః
ఆయుష్మాన్ తేజస్వీవర వర్చస్వీభూయాః"

(ఓ బాలకా ! నీవు నూరు సంవత్సరాలు వర్ధిల్లుము. ఆయుష్మంతుడవు, తేజస్సు గలవాడవగుము)

మంత్రసహితముగా విరూపాక్షుడి నాశీర్వదించారు. భాస్కరాచారి బాలుణ్ని పక్కన కూర్చోబెట్టుకుని రోజూ సంధ్యావందన మాచరించుమని హితవు పలికాడు. కుసుమగుప్తుడు చేతులు జోడించి

"గురువర్యా ! దయచేసి సంధ్యావందనము గురించి చిరంజీవికి వివరించండి." సవినయముగా కోరాడు.

నేనదే చెప్పబోతున్నానన్నట్టుగా భాస్కరాచారి మందహాసము చిందించాడు. సర్దుక్కూచుని చెబుతున్నాడు. ఆధ్యాత్మిక వాతావరణములో అందరూ శ్రద్ధగా వింటున్నారు.

"సంధ్య అనగా సూర్యుడు, నక్షత్రములు లేని పగలు-రాత్రిల మధ్యకాలము. సూర్యుడు నడినెత్తిమీదున్న సమయాన్ని మధ్యాహ్నసంధ్య అంటారు. ఉపనయనమైన వ్యక్తిని ద్విజుడు అంటారు. ద్విజుడైన వాడు గాయత్రి మంత్రం జపిస్తూ రోజుకు కనీసం మూడుసార్లైనా సంధ్యావందన మాచరించాలి. ఉషః కాలమున చేయు సంధ్యను గాయత్రి అంటారు. మధ్యాహ్న సంధ్యను సావిత్రి మరియు సాయం సంధ్యను సరస్వతి అంటారు.

గాయత్రి మంత్రము బ్రహ్మహత్యాది పాపాలను ప్రక్షాలనం చేస్తుంది. గాయత్రిని ఉదయ సంధ్యలో బ్రహ్మ స్వరూపిణిగా, మధ్యాహ్న సంధ్యలో రుద్రరూపిణిగా, సాయం సంధ్యలో విష్ణు స్వరూపిణిగా ఆరాధించాలి. సంధ్యావందనము తెలిసిగూడా ఆచరించని మనిషి మరణానంతరము శునకముగా పుట్టాలంటుంది శాస్త్రము. గాయత్రి మంత్రాన్ని ఉదయము తూర్పు ముఖముగా నుంచుని మధ్యాహ్నము సూర్యభగవానుని కెదురుగా కూచుని జపించాలి. సాయంకాల సంధ్యావందనమప్పుడు తూర్పుదిశగా కూచుని జపించడము శ్రేష్ఠము. గాయత్రి వేదమాత. పవిత్రము మరియు చాలా శక్తివంతమైనది గూడా. అయితే గాయత్రి మంత్రాన్ని బిగ్గరగా జపించరాదు.

'ఓం భూర్భువస్సువః, తత్సవితు ర్వరేణ్యం, భర్గోదేవస్య ధీమహి, ధియోయోనః ప్రచోదయాత్' అను గాయత్రి మంత్రాన్ని పెదవులు మెల్లగా కదిలిస్తూ లోలోపల జపించాలి.

మహాజనులారా ? ఆకాశమందు మేఘము మూడు విధములుగా ఎట్లా గర్జించునో ద్విజులంతా ఆ విధముగా త్రికాల సంధ్యావందనము చేయాలి..."

మరెన్నో విషయాల నుటంకిస్తూ సోదాహరణ వివరణ జరిగింది. విన్నవారంతా ఉల్లాసంగా ఉండిపోయారు.

పంచభక్ష్య పరమాన్నాలతో విందు భోజనాలైనాయి. విశ్రాంతి తర్వాత సాధారణ సభ కొలువుదీరింది. సామంతరాజ్యాల ప్రతినిధులు, మంత్రిమండలి, దండనాథులు సహపుర ప్రముఖులుగూడా సభలో ఉన్నారు.

కుసుమగుప్త దంపతులు బంగారు సింహాసనమ్మీదున్నారు. గురువు భాస్కరాచారి ప్రత్యేక ఆసనమ్మీదున్నాడు. వాసవి, విరూపాక్షులు గురువుగారి పక్కనున్నారు. కవులు, కళాకారులు మరోపక్కన కూచున్నారు. భూలోక ఇంద్ర సభలాగుంది. కన్యకాపరమేశ్వరి ప్రార్థనతో సభాకార్యక్రమం ప్రారంభమైంది. ప్రధానమంత్రి లేచి నుంచున్నాడు.

"సభా సరస్వతికి నమస్సుమాంజలి. సామంతరాజ్యాల ప్రతినిధులారా ! మీ రాజ్యాల పరిపాలనా విశేషాలను ప్రభువులవారి దృష్టికి తీసుకురండి. సమస్యలేమైనా ఉంటే నిర్మోహమాటంగా చెప్పండి. సభలో చర్చించి సరియైన నిర్ణయం తీసుకోవచ్చు." ప్రకటించి కూచున్నాడు.

ముందు పెనుగొండ నివేదిక సమర్పించారు. ఆ తర్వాత సామంతరాజులు లేదా రాజప్రతినిధులు ఒకరి తర్వాత ఒకరు సమగ్ర నివేదికలు సమర్పించారు. కన్యకా పరమేశ్వరి కృపతో తమ రాజ్యాలలో పరిపాలన బాగుందని, పాడిపంటలకు కొదవలేదని ప్రజలు సుఖసంతోషాలనుభవిస్తున్నారని చెప్పారు. సైనిక బలగాలు అప్రమత్తంగా, రేయింబవళ్లు సరిహద్దుల్లో గస్తీ తిరుగుతూ రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నా యన్నారు. కుసుమగుప్తుల వారి ధైర్యసాహసాలు, న్యాయపాలన వైవిధ్యం, పన్నుల వసూళ్ల విధానం భారత ఖండములోని పాలకులందరికీ ఆదర్శంగా ఉన్నాయన్నారు. పరిపాలనా పరమైన చిన్నచిన్న సమస్యలను చర్చించి తగునిర్ణయం తీసుకున్నారు. అందరి ప్రసంగాల తర్వాత మహాసభ మౌనముద్ర దాల్చింది. ప్రధానమంత్రి లేచి

"ఇంకా ఎవరికన్నా ఎలాంటి సందేహాలున్నా అనగా పరిపాలనాపరమైనవే కాకుండా సందేహాలు గూడా అడగొచ్చు. ధార్మిక సందేహాలను రాజగురువుగారు తీర్చుతారు." ప్రకటించాడు.

నగరస్వామి ఒకాయన లేచి గురువు గార్కి నమస్కరించి

"గురువర్యా ! నమస్కారం గురించి అనగా ఎవరికి ఎవరు ఎందుకు నమస్కరించాలో తెలుసుకోవాలనుంది." ధర్మసందేహం వెలిబుచ్చాడు. ఆ సందేహం అందరిలో ఆసక్తి రేకెత్తించింది.

"అందరూ తెలుసుకోవాల్సిన విషయమడిగావు నాయనా !" భాస్కరాచారి హర్షం

వెలిబుచ్చి ప్రారంభించాడు. "నమస్కారం ఒక సంస్కారం. సృష్టిలోని జీవరాశుల్లో మనుషులకే ఉద్దేశింపబడింది. నాగరిక సమాజములో అందరూ ఆచరించాల్సిన సంస్కారమిది.

జ్ఞాన వృద్ధులు, వయో వృద్ధులు, తపస్సంపన్నులు నమస్కారమందుకునేందుకు అర్హులు. వారికి తప్పకుండా నమస్కరించాలి. సమాన స్కందులు గూడా ఒకరికొకరు నమస్కరించుకోవడం మర్యాదగా ఉంటుంది. అయితే ఎవరికి ఎవరు నమస్కరించినా అది భగవదర్పితమే. ప్రతిప్రాణిలో ఆత్మ ఉంటుంది. ఆత్మ పరమాత్మ స్వరూపము. నమస్కరించేది నశ్వరమైన మానవ శరీరానికి కాదు. ఆ శరీరములో అంతర్లీనమై నడిపిస్తున్న పరమాత్మకే చెందుతుంది. ఉన్మత్తులకు, మర్యాద తెలియని వారికి, అపకారులకు, పాపాత్ములకు, శీలభ్రష్టులకు, దుర్మార్గులకు నమస్కరించరాదు.

అలాగే నాస్తికులు గూడా నమస్కారానికి అనర్హులు. అప్పుడే తలస్నానం చేసిన వారికి, జపములో లీనమైన వారికి నమస్కరించరాదు. గారడివానికి, ఉపనయన సంస్కారము కాని వారికి, జ్యోతిష్యునికి నమస్కరించాల్సిన అగత్యము లేదు. ఆధ్యాత్మిక సభల్లోను, దేవస్థానములోను, భగవాధ్వజం ఛాయలోనూ నమస్కారం చేసుకోరాదు. అలా చేసినచో పురాకృత పుణ్యం నశిస్తుంది.

శ్రాద్ధము, వ్రతము, యాగము, దానము, తర్పణము చేస్తున్న ద్విజునికి నమస్కరించరాదు. పుణ్యక్షేత్రాలలో, వేదాధ్యయన సమయములో నమస్కారము నిషేధము. నమస్కార మందుకున్న వారు విధిగా ప్రతినమస్కారం చేసి తీరాలి. లేనిచో సంస్కార ధిక్కార పాపమంటుకుంటుంది... "

నమస్కార సంస్కారము గురించి సాకల్యముగా వివరించాడు. సరియైన అవగాహన లేని, ఎన్నడూ వినని అంశాలు విన్నందుకు అందరికి తృప్తిగా ఉంది.

మరికొందరు అడిగిన ధర్మసందేహాలు తీర్చి భాస్కరాచారి తన నివాసానికి బయలుదేరాడు.

సాయం సంధ్యావందనానికింకా సమయముంది. శిష్యులు సంధ్య హోమానికి సమిధలు సమకూర్చుతున్నారు. ఆశ్రమానికో పక్కన... నిశ్శబ్ద వాతావరణములో ఏకాంతముగా కూచున్నాడు -

కుసుమగుప్తుడు కారణజన్ముడు, వైశ్యవంశోత్తముడు. అతడు, అతని సామంతరాజులంతా ధార్మికులే. విలక్షణమైన పరిపాలనలో ప్రజలు చీకూచింత లేకుండా

సుఖసంతోషాలనుభవిస్తున్నారు. విధాతా ! ఇదంతా నీ లీలావిలాసమే గదా !... ఆలోచనలు మనసులో మెదులుతున్నాయి.

కాలగతీ ! సృష్టి ప్రారంభమునుండి వైశ్యజాతి గతివిధులనోసారి నెమరేసు కోవాలనుంది సుమా ! సంకల్పించాడు. అంతే... మనసు మైదానములో గతం గుర్రం పరుగులు తీస్తూ వైశ్యజాతి పుట్టుపూర్వోత్తరాలను గుర్తుకు తెస్తోంది...

# 5

అది బ్రహ్మలోకము. సృష్టిరహస్యాల చిదానందము. అమావాస్యరోజు. సృష్టిలోని చాతుర్వర్ణాల మానవజాతి జీవన విధానాన్ని క్రమబద్ధీకరించేందుకు ఓ సమావేశమేర్పాటైంది. తపస్సంపన్నులంతా బ్రహ్మదేవుని పిలుపునందుకుని అక్కడికి చేరుకున్నారు. అనుకున్నంతనే సకలదేవతలను దర్శించుకోగల ఋషి – మునులు, లోక కల్యాణమే పరమావధిగా భావించే సర్వసంగ పరిత్యాగులు, అన్ని వర్ణాలకు సంబంధించిన సామాన్య – అసామాన్యులతో సభ కిటకిటలాడుతుంది.

పద్మాసనుడైన బ్రహ్మదేవుడు ఆదిశక్తి తనకప్పగించిన బాధ్యతలను గుర్తు చేసుకుంటూ అందరికీ స్వాగతం పలికాడు. "మీరంతా మీమీ వంశాల గోత్రవివరములు తెలపండి. సృష్టికార్యం క్రమబద్ధంగా జరగాలంటే పూర్తి వివరాలు నాకు తెలియాలి." అందరి నుద్దేశించి అడిగాడు.

బ్రాహ్మణ వర్ణము వారంతా దుర్వాస మహర్షివైపు చూసి కనుసైగలతో వివరములందించుమన్నారు. దుర్వాస మహర్షి సంతోషచిత్తుడై లేచి నుంచున్నాడు. బ్రహ్మదేవునికి నమస్కరించి సభనంతా ఓ సారి కలియజూశాడు.

"మా బ్రాహ్మణ వర్ణస్తులవి నూటా ఏడు గోత్రాల వంశాలున్నవి. అందులో పద్దెనిమిది గోత్రాలు చాలా ప్రసిద్ధమైనవి." గంభీరంగా చెప్పి కూచున్నాడు.

క్షత్రియ వర్ణాలవారి చూపులన్నీ రాజా ధనుంజయుని మీద కేంద్రీకృతమైనాయి. అందరి అభిప్రాయము అతనికర్థమైంది. ఠీవిగా లేచి సభకు నమస్కరించాడు.

"మా క్షత్రియ వర్ణములో ఏడు గోత్రాల వంశస్థులున్నారు. మొత్తం ఏడు గోత్రాలు ప్రసిద్ధములే." సగర్వముగా చెప్పి కూచున్నాడు.

"వైశ్యోత్తరములారా ! మీ వర్ణము వారి గోత్రాల వివరాలివ్వండి." బ్రహ్మ ఆదేశించాడు.

వైశ్యుల గుంపు అందరికంటే పెద్దదిగా ఉంది. గుంపులోని గుసగుసలన్నీ సమాధి వైశ్యమునిని ప్రతిపాదించాయి. సమాధి ముని అందరినోసారి కృతజ్ఞతగా చూస్తూ లేచి నుంచున్నాడు. బ్రహ్మదేవునికి, సభకు నమస్కరించి తనలో తానే నవ్వుకున్నాడు.

"చతురాననా ! వాసిలోను, రాశిలోను మా వైశ్య వర్ణము వారి గోత్రాలదే ప్రథమస్థానము. మా వంశస్తుల గోత్రాలు మొత్తము ఏడువందల పద్నాలుగు. అందులో నూటారెండు గోత్రముల వారు తమ వ్యవహార శైలిలో ప్రాధాన్యత సంతరించుకున్నారు."

ఆ తర్వాత మిగితా వర్ణమువారి వివరాలందుకుని బ్రహ్మదేవుడు ఆనంద భరితుడైనాడు. వైశ్యసమూహాన్ని ప్రశంసాపూర్వకముగా చూశాడు. వైశ్యుల గోత్రాధిక్యత నంగీంకరించి అభినందించాడు. వైశ్య వర్ణములోని నూటా రెండు గోత్రాలవారు లోలోపల సంతసించారు.

మానవ సృష్టిలో మాదే గొప్ప వర్ణము. మాదే గొప్ప జాతి. మేమే మిగితావారి కంటే అధికులము... అనే ఆలోచన ఆరొందల పన్నెండు గోత్రీకుల నుర్రూతలూగించింది. వారిలో గర్వం పొంగుకొచ్చింది. వారంతా సభలోంచి లేచి కరతాళ ధ్వనులు చేస్తూ కేరింతలు కొట్టారు. ఒకరినొకరు పొగడుకుంటూ మిగితా వర్ణాల వారిని చులకన చేసి మాట్లాడసాగారు. నూటారెండు గోత్రాల వారు వారించినా వినకుండా రెచ్చిపోయి బ్రాహ్మణులపై నిష్ఠురాలు రువ్వారు. వ్యంగాస్త్రాలు సంధించారు.

అది భరించలేక బ్రహ్మదేవుడు సభ చాలించి వెళ్లిపోయాడు. తమ ఆరొందల పన్నెండు గోత్రీకుల ప్రవర్తన నూటారెండు గోత్రాల వారికి రుచించలేదు. వారంతా దూరం జరిగారు.

వైశ్యజాతి పరువు మర్యాదలు మంట కలిపారు. మీ వల్ల మాగ్గూడా అవమానం జరిగింది... అనుకుంటూ మొహాలపై గుడ్డలు కప్పుకున్నారు.

బ్రాహ్మణ వర్ణం వారిలో రోషం బుసబుసలాడింది. పరిహాసాన్ని భరించలేక ఊగిపోయారు. తమలో తాము గుసగుసలాడుతూ చర్చించుకున్నారు.

ఆరున్నూటపన్నెండు గోత్రజుల దూకుడు నరికట్టాల్సిందే ననుకున్నారు. సామూహికంగా నిర్ణయం తీసుకున్నారు.

"వైశ్యులారా !" బ్రాహ్మణ ప్రముఖుడు కోపంతో "చాతుర్వర్ణాలలో మీరు అధిక సంఖ్యాకులమని మిడిసిపడుతున్నారు గదూ ! పవిత్ర హృదయులైన ఋషుల పేర్లలో

ప్రసిద్ధికెక్కిన మీ గోత్రాలన్నీ ఇకముందు అసలుపేర్లతో కాకుండా ప్రాకృత నామాలతో వ్యవహరింపబడు గాక ! మూల గోత్రాలను మూలనబెట్టి సాంకేతక గోత్రనామాలతోనే గుర్తించబడుదురు గాక." అందరి బ్రాహ్మణుల తరపున శపించాడు. "మీరంతా భూలోకములో జన్మింతురు గాక !" అని గూడా శపించాడు.

నూటారెండు వైశ్య గోత్రజుల్లో ఆందోళన పెల్లుబికింది. వారు బ్రాహ్మణులకు నమస్కరించి దోసిలియొగ్గి ప్రార్థించారు.

"బ్రాహ్మణోత్తములారా ! దయచేసి మీరంతా శాంతించాలి. చెయ్యని తప్పుకు మేము గూడా శాపగ్రస్తులం కావాలా ? మీకిది ధర్మమా ? వారితోపాటు మమ్ముల్ని గూడా శపించడం న్యాయామా ?" సామూహికంగా అడిగారు.

బ్రాహ్మణులు నాలిక్కరుచుకున్నారు. తిరిగి వారిలోవారు తర్కించుకున్నారు. శాంతమనస్కులైనారు. బ్రాహ్మణ ప్రముఖుడు'' నూటారెండు గోత్రీకులారా ! భయపడకండి. మీరిప్పటినుండి సిద్ధ వైశ్యులుగా గుర్తించబడుతారు. మీ గోత్రములు మాత్రం బీజాక్షరాలతో కూడి భూలోకములో చిరస్థాయిగా ఉండిపోతాయి. ఎక్కువ గోత్రముల వారమని విర్రవీగిన వారితో వేరై మీరు ఆదిశక్తి కృపకు పాత్రులవుతారు. శాశ్వత కీర్తి నార్జిస్తారు." అంటూ హర్షామోదం తెలియజేశాడు.

నూటారెండు వైశ్యగోత్రీకుల వైఖరి మిగతా వైశ్యులకసలే నచ్చలేదు. బ్రాహ్మణులను బ్రతిమిలాడ్డం అవమానకరంగా భావించారు. ముఖాలు చిట్లిస్తూ, పిడికిళ్లు బిగిస్తూ, వ్యంగ్యాస్త్రాలతో బ్రాహ్మణులను కవ్వించారు. పకపకా నవ్వుతూ, గేళిచేస్తూ మీరెంత అన్నట్టుగా మాట్లాడారు. బ్రాహ్మణుల కోపాగ్నిలో ఆజ్యం పోసినట్టైంది. వారంతా ఏకమై

"బ్రహ్మదేవుని సృష్టి బాధ్యతనే అపహాస్యం చేస్తున్న పరనిందాసక్తులారా !" అంటూ విరుచుకుపడ్డారు. "మీ దుష్ప్రవర్తన వైశ్యజాతికే కళంకము. మీరు సకల కర్మబాహ్యులై నిశాచరుల్లా మధుమాంసాలు సేవిస్తూ భూలోకములో దేశదిమ్మరులై సంచరిస్తుంటారు. మీ గోత్రాలు చలామణిలో ఉండవు. కులభ్రష్టులై గౌరవమర్యాదలు కోల్పోదురు గాక." మరోసారి శపించి వెనక్కు తిరిగి చూడకుండా వెళ్లిపోయారు.

శాపగ్రస్త వైశ్యులు ఖిన్నులయారు. కొద్దిపాటి ఆవేశం కొంపముంచివేసింది అనుకుంటూ పునరాలోచనలో పడిపోయారు. అయినా లాభం లేదు. జరగాల్సిందేదో జరిగిపోయింది. శాపాన్ని అనుభవించక తప్పదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనముండదు.

“ఇంత పనికి నువ్వేకారణం” “కాదు... నువ్వే... ” అంటూ వారిలో వారే నిందించుకుంటూ శాప ఫలాన్ని అనుభవించేందుకు భూలోకానికి ప్రయాణమై ముందు గోబిలములో ప్రవేశించారు. బ్రాహ్మణుల శాపము ననుభవిస్తూ అష్టకష్టాలనుభవిస్తున్నారు. బాధలు భరించలేక అక్కడున్న మహర్షులను వేడుకున్నారు.

ఇదంతా లోక కల్యాణానికే జరుగుతుందన్నారు మహర్షులు. అంతేకాదు “పాప ఫలితాన్ని అనుభవించక తప్పదు. అది విధాత నిర్ణయం. మీరు సహనంతో ఉండాలి. కొంతకాలం తర్వాత మీ కష్టాలు కడతేరుతా”యని జాలి చూపించారు.

నూటారెండు గోత్రీకులైన సిద్ధవైశ్యులు విచారవదనులై బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి ప్రార్థించారు. సృష్టికర్త బ్రహ్మ సంతసించి వారికి సమస్త వస్తువిజ్ఞానము, క్రయవిక్రయ ప్రావీణ్యతను ప్రసాదించాడు. ధర్మాచరణతో కూడిన వ్యాపార రహస్యాలను, కళాపోషణ ప్రాధాన్యతలను వివరించాడు.

శరత్కాలము సమీపించినది. పన్నెండేళ్ల బాలబాలికలకు స్వశాఖా విధానములో ఉపనయనములు జరిపించి వేదవేదాంగ విద్యలు నేర్పించాడు. వేదపారాయణం నేర్పించాడు. బ్రహ్మచర్య దీక్షాదక్షులై, సితయజ్ఞోపవీత దారులై, మోదుగ కర్రలు ధరించి, మేలిమౌంజీ దర్భలతో పేనిన మొలతాళ్లు కట్టుకుని పవిత్ర హృదయులై సంచరిస్తున్న వైశ్య యువతీయువకుల ప్రవర్తనను పరిశీలించి బ్రహ్మ పరమానందభరితుడయాడు. వారి గోత్రప్రవరలను పాటింపజేస్తూ స్వయంగా వివాహాలు జరిపించాడు. నూటారెండు గోత్రాల వైశ్యఋషులందరికీ బ్రహ్మలోకమాన ప్రకారము సంచరించే శక్తిని ప్రసాదించి ఆశీర్వదించాడు.

ఓ రోజు శుభముహుర్తాన “ఇన్నాళ్లు బ్రహ్మలోకములో ఉన్నారు గదా, ఇహ భూలోకానికి వెళ్లండి.” ఆజ్ఞాపించాడు. వారంతా భయవిహ్వలులై భక్తిశ్రద్ధలతో వేడుకొనగా

“ఇదంతా లోకకల్యాణం కోసమే. మీరు భయపడవద్దు. సాక్షాత్తు పార్వతీదేవి శ్రీ కన్యకాపరమేశ్వరి అంశతో వైశ్య వంశములో జన్మిస్తుంది. అప్పుడామె మీ 102 వంశస్తులకు మోక్షమార్గం చూపుతుంది.” అని కొన్ని రహస్యాలు తెలియజేశాడు.

“మరి... మా గోత్రనామాలు సంగతేమిటి బ్రహ్మదేవా ?” తిరిగి ప్రార్థించారు. బ్రహ్మ మందహాసము చిందించాడు.

“మీ మూలగోత్రాలు యధావిధిగా ఉంటాయి కాని వ్యవహారములో సాంకేతిక నామాలు చలామణిలో ఉంటాయి.”

వెంటనే భూలోకానికెళ్లాలంటే సిద్ధవైశ్యులకు మనసొప్పలేదు. మరోసారి చేతులు జోడించి భక్తిప్రపత్తులతో వేడుకున్నారు. మరికొంతకాలం అక్కడే ఉండేందు కనుమతించుమని ప్రార్థించారు.

బ్రహ్మదేవునిలో జాలి జాలువారింది.

"సరే... మరికొంత కాలము ఈ తపోలోకములోనే గడిపి ఆ తర్వాత భూలోకానికెళ్ళండి." కరుణించాడు.

అక్కడ కొద్దికాలము గడిపి సిద్ధవైశ్యులు భూలోక ప్రయాణమయారు. మనసులోని సందేహాల మారాము భరింపలేక నేరుగా అపరార్క మహాముని ఆశ్రమం చేరుకున్నారు. నిత్యం యజ్ఞయాగాదులతో, హోమ ధూమముతో విరాజిల్లుతుందా ఆశ్రమం. అంతా కలిసి అపరార్కమునికి పాదాభివందనం చేసి తమ హృదయ ఘోషను విన్నవించుకోసాగారు.

"మునీశ్వరా ! చేయనితప్పుకు శాపగ్రస్తులమై బ్రహ్మలోకము నుండి భూలోకానికొచ్చాము, కాని ఈ భూలోకము రాగద్వేషాల నిలయము. ఇక్కడ మధుమాంసాలు విరివిగా వాడుతారు. ఈ రాగద్వేషాలు మమ్మల్ని బాధిస్తాయని భయమేస్తుంది." అంటూ బోర్‌మన్నారు – కొందరు.

"ఇంతవరకు చాలాకాలము బ్రహ్మలోకములో బాదరబందీ లేకుండా హాయిగా గడిపాము. నిరపరాధులమైనా మా ఆరున్నూట పన్నెండు గోత్రీకుల దుందుడుకు ప్రవర్తన వల్ల మేము గూడా శాపగ్రస్తులమైనాము స్వామీ !" ఇంకొందరు గుండెలు బాదుకున్నారు.

"రాగద్వేషాల కతీతమైన బ్రహ్మలోకములో మావారల అహంకార ప్రవర్తన ఇంత పంజేసింది. ఇపుడు కష్టకాలము రాబోతుంది. ధర్మదేవత రానురాను కుంటిదై పోతుంది. మేమీ ఆపద నుండి బయటిపడే ఉపాయమేదన్నా చెప్పండి." అంటూ విలవిల్లాడిపోయారు. విచారవదనులై తలలు వంచుకున్నారు.

సృష్టి ప్రారంభములో వైశ్యుల విహిత కర్మలనాచరించిన అపరార్క ముని బ్రహ్మజ్ఞాని. దివ్యజ్ఞాన దృష్టితో అంతా అర్థం చేసుకున్నాడు.

పాపం ! కులానికెంత అంటే తలా గోరెడు అన్నట్టుగా అపరాధుల వర్గానికి చెందిన నిరపధులగ్గూడా శాపమంటుకుంది... అనుకున్నాడు. గోడుగోడుమంటున్న వారి మనస్తాపం మహాముని దయార్ద్ర హృదయాన్ని కరిగించింది.

"బిడ్డలారా ! భూలోక వాసమంటే కంగారు పడాల్సిందేమీలేదు. సచ్ఛీలము, సద్భావము సదా రక్షిస్తాయి. నియమనిష్ఠలతో చేసిన యజ్ఞయగాదులు, జపతపాలు, పుణ్యకార్యాలు దుఃఖనాశకాలు. ఇవి మానవమాత్రులను మాధవ సాన్నిధ్యం చేర్చేందుకు రాజమార్గాలు. సద్బుద్ధితో సదాచార వర్తనులై ధర్మమార్గాన్ననుసరించండి. మీకు శుభం జరుగుతుంది." ధైర్యం చెప్పాడు.

అయినా సిద్ధవైశ్యుల మనస్తాపం పూర్తిగా తగ్గలేదు. తమలో తాము సైగలు చేసుకుని పెద్దమనిషి నొకాయనను ముందుంచారు. ఆ పెద్దమనిషి అందరి తరపున నమస్కరించి

"ప్రస్తుతం మేమీ భూలోకములో ఉండలేము స్వామీ ! దయచేసి మాకేదైనా తరుణోపాయం సెలవివ్వండి." విన్నవించాడు.

అపరార్కముని సంతసించి "అయితే మీరు వెంటనే హియాలయ పర్వతాలకు వెళ్లి పాపనాశంకరుడైన పరమేశ్వరుని కరుణకై తపస్సు చెయ్యండి. శివనివాసమైన కైలాసము హిమాలయాల్లోనే ఉంది. ఇప్పటికీ మీరంతా వైశ్యమునులే. మీ అతీతశక్తి ఇంకా నశించలేదు. మీ బాధలన్నీ ఈశ్వరునికి విన్నవించండి. బోళా శంకరుడు తప్పకుండా మిమ్ముల్ని కరుణిస్తాడు." అని సలహా ఇచ్చాడు. సిద్ధవైశ్యులందరికీ శివపంచాక్షరీ మంత్రాన్నుపదేశించాడు. తపోవిధానాన్ని వివరించాడు.

సిద్ధవైశ్యులు ఊరట చెందారు. తృప్తిగా అపరార్క మునికి ఆత్మనమస్కారాలు గావించి హిమాలయాలకు చేరుకున్నారు. నిత్యం భగవదారాదనతో విరాజిల్లుతున్న హిమాలయ పర్వత శ్రేణులు వెండికొండల్లా కన్పించాయి. చల్లని ప్రదేశము మనోల్లాసాన్నిచ్చింది. హృదయఫలకాలపై శివలింగాలను ఊహించుకున్నారు. ఊత్తుంగ తరంగాలతో ప్రవహిస్తున్న పావన గంగాఝరిలో శంకరాభరణ రాగాన్ని వింటూ త్రికరణ శుద్ధిగా శివపంచాక్షరీ మంత్రానుచ్చరిస్తూ తపస్సు ప్రారంభించారు.

గ్రీష్మ ఋతువులో పంచాగ్నుల మధ్య, శిశిర ఋతువులో జల మధ్యమున, వర్షాకాలములో నేలపై ప్రాణాలకు తెగించి ఘోరతపస్సు చేస్తున్నారు. అలా ఎంతకాలం తపస్సు చేసినా శివానుగ్రహం లభించలేదు. తిరిగి వారంతా అపరార్క మహాముని నాశ్రయించారు. అపరార్క ముని విషయాన్నంతా గ్రహించి

"ముందు మీరు మీకిష్టమైన వాటిని త్యాగం చెయ్యనందున అలా జరిగింది." అన్నాడు.

వైశ్యమునులు తమకిష్టమైన వస్తువులను త్యాగం చేసి తిరిగి తపోదీక్షకు పూనుకున్నారు. మొదటి కొద్ది రోజులు ఆకులలములు, కందమూలాలు నాహారముగా స్వీకరించారు. ఆ తర్వాత వాయు భక్షణమే సరిపోయింది. చలిపులి ఎముకలు కొరికేసినా, కుండపోత వర్షాలు అతలాకుతలం చేసినా, మండుటెండలు గుండెల్ని గుబగుబలాడించినా పట్టువీడలేదు. కొంతకాలం ఒంటికాలిపై, మరికొంత కాలం బొటనవేలిపై నిలబడి చేతులు పైకి జోడించి కఠోర తపస్సు కొనసాగించారు. ఏమాత్రం అదరకుండా, బెదరకుండా పంచాక్షరీ మంత్రాన్ని జపించారు. అలా ఎంతోకాలం గడిచింది. వైశ్యమునుల భీకర తపస్సు కైలాసాన్ని కదిలించింది. ప్రమదగణాలను ఊగిసలాడించింది.

పరమశివుడు సంతసించి ప్రత్యక్షమయాడు. వైశ్యమునులంతా పరమశివునికి సాష్టాంగ ప్రణామాలాచరించారు.

నుదుటి విభూతి రేఖల మధ్య మూడోకన్ను, పులితోలు, జటాజూటములో గంగాభవాని, చంద్రవంక, మెడలో నాగభూషణాలు... భూతనాథుని దివ్యమంగళ స్వరూపాన్ని కాస్సేపు కళ్లారా తిలకించారు. తన్మయత్వం నుండి తేరుకుని మనసారా ప్రార్థించారు.

"మహాదేవా ! భక్తులకు సర్వసంపదలిచ్చి నీవేమో శ్మశాన విహారం చేస్తుంటావు."

"నమ్మిన వారికి పట్టువస్త్రాలు ప్రసాదించి నువ్వేమో పులితోలు కట్టుకుంటావు."

"పిలిచిన వెంటనే ప్రత్యక్షమై భక్తులకు సర్వసంపదలు, సర్వాభరణాలు ప్రసాదిస్తావు. నువ్వేమో పాములనే అలంకరించుకుని బూడిదను నుదుట రుద్దుకుంటావు."

"ఒక భార్యకు సగం శరీరమిచ్చి, మరో భార్యను నెత్తినెక్కించుకున్నావు బోళా శంకరా !"

"నీ లీలలు అనంతములు మహాదేవా !"

ఒక్కొక్కరు ఒక్కో విధంగా సన్నుతించారు. చివరికి అందరూ కలిసి "మమ్ముల్ని కరుణించు తండ్రీ !" ప్రార్థించారు.

భక్తవత్సలుడైన బోళా శంకరునికి అంతా అర్థమైపోయింది. వాత్సల్యం గంగా తరంగాల్లా పొంగుకొచ్చింది.

"వైశ్యమునులారా ! మీ తపోదీక్ష అమోఘము, అద్భుతము. మీకేం కావాలో కోరుకోండి."

"మహాదేవా ! మాకు మీ అనుగ్రహము అమూల్యము. ప్రస్తుతం భూలోక

వాసమనే కష్టాల్లోంచి మాకు విముక్తి ప్రసాదించు స్వామీ ! ఇప్పుడే భూలోకానికెళ్లలేము స్వామీ !"

"అట్లే అగుగాక !" ఆశీర్వదించాడు.

అనితరసాధ్యమైన వైశ్యమునుల తపస్సుకీ చిన్న వరము ఏ మాత్రము సరిపోదనుకున్నాడు పరమశివుడు.

"వైశ్యమునులారా ! మీ భక్తిప్రపత్తులు కైలాసాన్ని ఆనంద డోలికలూగించాయి. మీకిష్టమైన మరో వరము కోరుకోండి.

హృదయోల్లాసంతో వైశ్యమునుల మొహాలు ఆనంద దీపికలైనాయి. ఒకరినొకరు చూసుకొని తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

"బోళా శంకరా ! భక్త వశంకరా ! బ్రహ్మాది దేవతలకు దుర్లభమైన కైలాసవాసాన్ని మాకు ప్రసాదించండి, మా భార్యపిల్లలతో నిత్యం మీ పదకమలాలను సేవిస్తూ మీ సన్నిధిలోనే నివాసముంటాము." అసలు కోర్కె వెల్లడైంది.

పరమేశ్వరుడు కరుణించాడు. అందుకు సరేనని అనుగ్రహించాడు. అంతేకాదు... కుబేరుని పిలిచి వారందరినీ కైలాసము చేర్చుమని ఆదేశించాడు.

పుష్పక విమానములో అందరినీ ఎక్కించుకుని కుబేరుడు కైలాసములో దిగబెట్టాడు.

సిద్ధవైశ్యులు సకుటుంబ సమేతముగా చీకూచింత లేకుండా కైలాసగిరిపై నివసిస్తున్నారు. శివనామ సంకీర్తనతో కాలం సుఖంగా గడుస్తోంది. ఆరొందలపన్నెండు గోత్రాల వైశ్యులు దినిదినగండం నూరేళ్లాయుష్షులా గడుపుతున్నారు.

సిద్ధవైశ్యుల్లో మైత్రేయస గోత్రీకుడైన వైరాజు కుమార్తె ప్రభావతి సౌందర్యవతి. యవ్వనం హంగులతో కువకువలాడ్తోంది.

ఓ రోజు చెలులతో విహరిస్తూ, ప్రకృతి అందాలనాస్వాదిస్తూ పరవశించి పోతోంది. యువతుల దాగుడు మూతలాటలతో, కిలకిల నవ్వులతో, గాజుల సవ్వడితో ఆ ప్రదేశం పులకించిపోతోంది. అటువైపు విహారానికొచ్చిన సోమదత్తుడనే వైశ్యయువకుడు ప్రభావతి అందచందాలకు ఆకర్షితుడైనాడు. తానూ అందగాడే. రోజూ ప్రభావతిని దర్శించుకుంటున్నాడు. కళ్లు కలిపే ప్రయత్నం చేస్తున్నాడు.

ఓ రోజు ప్రభావతికో పూవు అందిస్తూ తననను తాను పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత

"సుందరీ ! నువు నా మనసు దోచావు. నీకిష్టమైతే మనం పెద్దల అనుమతితో పెళ్లిచేసుకుందాం" అన్నాడు ధైర్యంగా.

ప్రభావతి కనురెప్పలు ఎగరబోతున్న పక్షిరెక్కల్లా టపటపలాడాయి. చిలిపి చూపులతో సోమదత్తుణ్ని ఆపాదమస్తకం తడిమింది. సిగ్గులతో బుగ్గలు ఎర్రమందారాలైనాయి. అరచేతుల్తో కళ్లుమూసుకుని

"మీరు మా పితృదేవతల నడగండి" అని తుర్రుమంది. ఆమె కోసమే సోమదత్తుడు తన తల్లిదండ్రుల ద్వారా వైరాజును సంప్రదించాడు. వైరాజు మొదట సంతోషించాడు. ఆ తర్వాత విచారవదనుడై

"ఈ వివాహం నాకామోదమే కాని గంధర్వరాజు ప్రభావతిని తనకిచ్చి పెళ్లి చెయ్యమంటున్నాడు. లేకపోతే నేను మృత్యువాత పడ్తానని శపించాడు." అసలు విషయం బయటపెట్టాడు.

సోమదత్తుడు నిత్య శివపూజా దురంధరడు ఈ విషయాన్ని పరమేశ్వరునికి విన్నవించి తరుణోపాయం సెలవివ్వమని అర్థించాడు. బోళాశంకరుడు ఆశీర్వదించి

"గంధర్వరాజు శాపము తప్పదు. కాని దాని ప్రభావం వారంరోజులు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత పెళ్లాడు"మన్నాడు. వారంరోజుల తర్వాత శాపవిముక్తి జరిగింది. పరమేశ్వర సన్నిధానమైన కైలాసములో సిద్ధవైశ్యులందరి సమక్షములో, ప్రమదగణాల ప్రమోదాలతో సోమదత్తుడు – ప్రభావతుల వివాహం రంగరంగ వైభగంగా జరిగింది.

గంధర్వగణము ఈ అవమానాన్ని భరించలేకపోయింది. గంధర్వజాతి దేవతలు కంటే తక్కువ, మానవులకంటే ఎక్కువ అని అందరికీ తెలుసు. భూలోకానికెళ్లాల్సిన మానవ మాత్రులకింత గౌరవమా ! కన్నుకుట్టింది. కోపతాపాలేవీ పనికి రాలేదు. ఎలాగైనా సరే మానవులతో వివాహ సంబంధాలేర్పచుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని వైశ్యులందుకంగీకరించలేదు.

చిలకా–గోరవంకల్లా తిరుగుతూ సుఖాలనుభవిస్తున్న ప్రభావతి – సోమదత్తులకు కుమార్తె జన్మించింది. ఆ బాలిక వైశ్యుల కీర్తిని ఇనుమడింపజేసినదనే భావనతో, కీర్తికన్యక అని పేరుబెట్టారు. కీర్తికన్యక సకల విద్యలనభ్యసిస్తూ పెరిగి తల్లినే కాదు రంభా, ఊర్వశిలను తలదన్నే సౌందర్యవతి అయింది.

కాలగమనం, కడలికెరటం ఎవరికోసమూ ఆగవు.

దక్షయజ్ఞము సమయాన శివపరాభవము, శివజటాజూటము నుండి అవతరించిన వీరభద్రునిచే దక్షయజ్ఞ విధ్వంసము, దక్షుని కుమార్తె శివపత్ని అయిన సతీదేవి యజ్ఞగుండములో దూకి దేహత్యాగము చేసి దాక్షాయణి అనిపించుకోవడము, భార్యావియోగము భరించని శివుడు ఆత్మ శుద్ధికోసం తపస్సులో మునిగిపోవడం, ఒకదాని వెనక ఒకటి జరిగిపోతున్నాయి.

అప్పుడే తారకాసురుని అకృత్యాలకు తట్టుకోలేక దేవతలు బ్రహ్మదేవుణ్ని ప్రార్థించారు. బ్రహ్మ సంతసించి

"దాక్షాయని హిమవంతుని కూతురు పార్వతిగా జన్మించింది. షోడషకళా ప్రపూర్ణగా పెరిగిన పార్వతి యవ్వనతియై పెళ్లీడుకొచ్చింది. ఆమె అతిలోక సౌందర్యరాశి. తపోదీక్షలో మునిగిన శివుని మనసు కరిగి పార్వతిపై లగ్నం కావాలి. శివపార్వతుల కల్యాణం జరగాలి. వారికి కుమారస్వామి జన్మించాలి. ఆ కుమారస్వామియే విజృంభించి తారకాసుర సంహారం చెయ్యాలి." జరగాల్సిన విధివిధానాన్ని తెలియజేశాడు.

దేవతలంతా సంప్రదించుకున్నారు. శివతపోభంగము గావించగలవాడు, వివాహోన్ముఖుణ్ని చేయగలవాడు మన్మథుడేనని తీర్మానించుకున్నారు. దేవేంద్రుని ఆదేశముతో మన్మథుడు శివతపోభంగానికి పూనుకున్నాడు. మన్మథ బాణాలు ప్రయోగించి శివాగ్రహానికి గురై బూడిదైపోయాడు. మన్మథుని భార్య రతీదేవి ప్రార్థనాలకించి తరుణోపాయం సూచిస్తూ

"మన్మథుడు తిరిగి సజీవుడవుతాడు గాని రతీదేవికి తప్ప ఇతరులెవ్వరికీ కన్పించడు." వరమిచ్చాడు.

మదనతాపముతో ఊగిపోతున్న శివుడు నారదముని సలహాతో పార్వతిని ప్రసన్నం చేసుకున్నాడు. సకలదేవతల సమక్షములో శివపార్వతుల కల్యాణమహోత్సవము వైభవంగా జరిగింది. సకల లోకాల నుండి వచ్చిన దేవ, గంధర్వ, కిన్నెర, కింపురుషులంతా కానుకలు సమర్పించారు, కాని భూలోకమునుండి పెళ్లికెవ్వరూ రాలేదు, కట్నకానుకలు తేలేదు. శివుడు కుబేరుని పిలిచి కారణమడిగాడు.

"పరమేశ్వరా !" కుబేరుడు ముకుళిత హస్తాలతో విన్నవించాడు. "తారకాసురుని అకృత్యాలు భరించలేక బ్రాహ్మణులు గౌతమాశ్రమానికెళ్లి తలదాచుకున్నారు. క్షత్రియులు అడవుల పాలయారు. సిద్ధవైశ్యులు ఇక్కడే ఈ కైలాసములోనే ఉన్నారు. మిగితా వైశ్యులు గోబిలములో ఉన్నారు. శూద్రులు తమ సేవాధర్మాన్నాచరిస్తున్నారు.

భూలోకములో వర్తక-వాణిజ్యాలు, వ్యవసాయ-పశుపోషణలు లేవందుకే. అందుకే భూలోకవాసులెవ్వరూ శివ కల్యాణం సంబరాల్లో పాలుపంచుకోలేదు.

అది విని శివుడు సిద్ధవైశ్యులను భూలోకానికెళ్లాలన్నాడు. సిద్ధవైశ్యులు కుడితిలో పడ్డ ఎలుకల్లాగైపోయారు. వారంతా కుబేరుణ్ని ప్రార్థించారు.

"భూమ్మీద కాలుబెట్టగానే మా తపోశక్తి తగ్గిపోతుంది. అందుకే భూలోకానికెళ్లి కట్నకానుకలు తేలేకపోయా"మని వివరణ ఇచ్చారు.

కుబేరుడు తన పుష్పక విమానములో వారిని భూలోకానికి పంపాడు. భూలోకములో తమక్కావాల్సిన వారెవరున్నారని సిద్ధవైశ్యులు వెతికారు. అలసిసొలసి వేసారిపోయారు. చివరికి వారికో ఆశాజ్యోతి కనిపించింది.

భార్గవముని ఆశ్రమములో వారికి దివ్యశక్తిగల బాలుడు కన్పించాడు. అతనిపేరు దేవప్రవరుడు. దివ్యశక్తి గలవాడు. సాందీపస గోత్రీకుడతడు. సిద్ధవైశ్యులు తమ పరిస్థితినంతా దేవప్రవరునికి వినిపించి సహాయమర్థించారు. దేవప్రవరుడు వారిని తనవెంట తీసుకెళ్లి కస్తూరిపెట్టెలు, పచ్చకర్పూరము, కాశ్మీర శాలువలు, సన్నని వస్త్రాలు ఇప్పించి వాటిని పరమశివునికి సమర్పించుమన్నాడు. వారట్లే చేశారు. పరమేశ్వరుడు సంతోషించి సిద్ధవైశ్యులనాశీర్వదించాడు. మరికొంతకాలము కైలాసములో ఉంటామన్న వారికోర్కెను మన్నించాడు. సిద్ధవైశ్యులు ప్రశాంతచిత్తులై అక్కడే ఉండిపోయారు.

పార్వతీ-పరమేశ్వరుల కేళీవిలాసము, కుమార సంభవము, తారకాసుర సంహారము సంఘటనలను కాలగతి జీర్ణించుకుంది. కైలాసవాసులైన సిద్ధవైశ్యులు అరమరికలు లేకుండా హాయిగా గడిపేస్తున్నారు.

ఓ రోజు... విశ్వవార్త సంచాలకుడు నారద మహర్షి కైలాసానికొచ్చాడు. వెండికొండ మంచుపూలతో స్వాగతం పలికింది. ప్రమదగణాలు నాట్యవిన్యాసాలతో తోడ్కొని వెళ్లి పరమేశ్వరుని చెంతకు చేర్చాయి. కైలాస కొలువులో అందరితోపాటు సిద్ధవైశ్యులు గూడా స్వాగతం పలికారు. నారదుడు పార్వతీపరమేశ్వరుల ముందు ఆసీనుడైనాడు. మహతి తీగలు సవరించి వీణానాదము ప్రారంభించాడు. కమ్మని స్వరాలతో పరమేశ్వర స్తోత్రము గావించాడు. గానమాధుర్యం పార్వతీపరమేశ్వరుల నలరించింది. సభలోని వారంతా మంత్రముగ్ధులై అలౌకికానంద మనుభవిస్తున్నారు.

కంఠాభరణమైన నాగరాజు హర్షాతిరేకము నాలకించి పరమేశ్వరుడు

"నారదా ! ఈ మధ్య భూలోకములో ఏమి జరుగుతుందో తెలియడం లేదు.

నీవు సకలలోక సంచారివి. లోకాల పోకడలను తిలకిస్తూ తిరుగుతుంటావు. వార్తలు చెరవేస్తూ విశ్వవినోదాన్ని కాంక్షిస్తావు గదా !... " అన్నాడు.

"పరమేశ్వరా ! త్రినేత్రులైన మీకు అంతా తెలుసు. త్రిమూర్తుల లీలావిలాసాన్ని సర్వవ్యాప్తంచేస్తూ లోక కల్యాణాన్ని కోరుకుంటాను. దివ్యదృష్టితో మీరన్నీ తిలకించగలరు."

"కాని నారదా ! చీటికి మాటికి దివ్యదృష్టినుపయోగిస్తే తపోశక్తి తగ్గిపోతుంది గదా ! అందుకే నీవందించే వార్తావిశేషాలు మాకెంతో విలువైనవి."

"ఆదిశక్తి ఆడించే నాటకములో మీరు సూత్రధారులు, నేను పాత్రధారిని స్వామీ !"

"అంతేకాదు నారదా ! నువు సహసూత్రధారివి గూడా. లోక కల్యాణార్థము జరగాల్సిన పనుల్లో నీ పాత్ర అద్వితీయము. పాత్రధారుల ప్రతినిధిగా వారి స్థితిగతులన్నీ మాకు చెబుతుంటావు."

"అదంతా ఈశ్వర లీల గదా !" గొణుక్కుని చేతులు పైకెత్తి నమస్కరించాడు నారదుడు. పార్వతీపరమేశ్వరులు సహాఅక్కడున్నవారి మొహాలు చిరునవ్వు పులుముకున్నాయి.

"నారదా ! భూలోక వార్తలు వినాలనుంది." ఆసక్తిగా అడిగాడు పరమేశ్వరుడు.

"అవును నారదా ! నాగ్గూడా కుతూహలంగా ఉంది." పరమశివుణ్ని చూపులతో తడిమిన పార్వతి దృష్టి నారదుని వైపు మళ్లింది. అప్పటిదాకా వికసించిన కమలంలాగున్న నారదుని మొహం ముడుచుకుపోయింది.

"భూలోక మిప్పుడు శూన్యంగా తయారైంది పరమేశ్వరా !"

"ఏం... ఎందుకూ ?"

"అబ్బా !" నందీశ్వరునిలో ఆసక్తి కట్టలు తెంచుకుంది. "మాకెవరికీ తెలియదు గదా మహర్షీ ! దయచేసి చెప్పండి." గమ్మత్తుగా చెవులూ, కొమ్ములాడించాడు. ఆ భంగిమ అందరి నాకట్టుకుంది.

"సరే !" నారదుడు తప్పదనుకుని సర్దుక్కూచున్నాడు. "పరమేశ్వరా ! తారకాసురుని రాక్షస కృత్యాల వల్ల భూలోకములో వేదాధ్యయనం ఆగిపోయింది. యజ్ఞయాగాదుల ఉనికే లేదు. అవింకా పునరుద్ధరించబడలేదు. తారకాసుర సంహారంతో భూలోక వాసుల కష్టాలు కడతేరలేదు. వ్యవసాయం, వర్తక వాణిజ్యాలు లేవు. పంటలు లేక కరువు రక్కసి కరాళ నృత్యం చేస్తుంది."

అంతా అర్థమైనట్టుగా పరమేశ్వరుడు తలపంకించాడు. చూపులు పార్వతివైపు మళ్లాయి. కారణం నువ్వే అడుగుమన్నట్టుగున్నాయా చూపులు. మెడనలంకరించిన నవరత్న మాలను సవరించుకుంటూ

"ఎందుకలా తయారైంది నారదా ?" అడిగింది పార్వతి.

"ఎందుకంటే తల్లీ ! సదాచారులు, వేదాధ్యయన శీలురైన బ్రాహ్మణులు గౌతమ మహర్షి ఆశ్రమంలోనే ఉండిపోయారు. భృగు మహర్షి పుత్రరత్నము పరశురాముడెప్పుడో భూలోకాన్ని క్షత్రియ శూన్యం చేశాడు. సిద్ధవైశ్యులు మీ కళ్లముందున్నారు. శాపగ్రస్తులైన మిగితా వైశ్యులు గోబిలములోనే గోడుగోడుమంటున్నారు. కేవలం శాకంబరి మహర్షి కరుణ వల్ల మిగిలిన భూలోక వాసులు కూరగాయలు, కందమూలాలను ఆహారముగా తీసుకుంటూ ప్రాణాలు నిలుపుకుంటున్నారు. ఇదమ్మా భూలోకములో ప్రస్తుత పరిస్థితి !"

పరమేశ్వరుడు కలవరపడ్డాడు. "భూలోకమలా ఉండడానికి వీల్లేదు !" గంభీర వదునుడైనాడు. "నారదా ! చరాచర సృష్టి కార్యక్రమాల్లో అసంతులనం చోటుచేసుకోవద్దు. అంతా క్రమబద్ధంగా జరిగితీరాల్సిందే. కాబట్టి నీవు నీ శక్తి యుక్తులనుపయోగించి భూలోకములో మళ్లీ క్రమబద్ధ జనజీవనం సాగేలా, వర్ణాశ్రమ ధర్మాలు యధావిధిగా కొనసాగేలా పునర్నిర్మాణము చేయాలి." ఆదేశ పూర్వకముగా సూచించాడు.

"అయితే మహాదేవా !" నారదుని వాలకం గంభీరమైంది. "మీ పాదపద్మాలను నిత్యం సేవిస్తూ కైలాసములో తిష్ఠవేసిన వైశ్యులను వెంటనే భూలోకానికి పంపించాలి." నిర్మోహమాటంగా చెప్పేశాడు.

"అవును, ఈ పని తక్షణమే జరిగి తీరాలి." పరమేశ్వరుడన్నాడు సిద్ధవైశ్యులతో. "మీరిక్కడ చాలాకాలం గడిపారు. ఇహ వెంటనే భూలోకానికికెళ్లండి. వెళ్లేప్పుడు గోబిలములో ఊగిసలాడుతున్న మిగితా వైశ్యులను తీసుకెళ్లండి. వారిని గూడా శాపవిముక్తులను చెయ్యండి. మీరందరూ కలిసి భూలోకములో సహజీవనం కొనసాగించక తప్పదు." ఆజ్ఞాపించాడు.

సిద్ధవైశ్యుల్లో భయాందోళన పెల్లుబికింది. ఇంకేమీ మాట్లాడలేక తలలు వంచి పరమేశ్వరుణ్ని వేడుకున్నారు.

"వైశ్యమునులారా ! విధాత నిర్ణయాన్ని ఎవ్వరూ ఉల్లంఘించలేరు. సృష్టికార్యం అన్నిలోకాల్లో క్రమబద్ధం కావాల్సిందే. భూలోకములో చాతుర్వర్ణాల వారు ఉండితీరాల్సిందే.

జగన్నాటకములో మనమంతా పాత్రధారులం కాబట్టి మీరిప్పుడు భూలోకానికెళ్లక తప్పదు." పరమశివుని సముదాయింపు మాటల్లో వాత్సల్యముంది. "మీరంతా సకుటుంబ సమీతముగా వెళ్లి ముందు కామధేనువు నాశ్రయించండి. భూలోకానికి అన్ని వస్తువులతో పాటు సుగంధ ద్రవ్యాలు తీసుకెళ్లండి. వ్యవసాయం, వ్యాపారం పనులు ప్రారంభించి ధర్మజీవనానికి పరిపూర్ణత చేకూర్చండి, సమయం, సందర్భం కలిసినప్పుడు తిరిగి నా సాన్నిధ్యానికి చేరుకుంటారు."

సిద్ధవైశ్యుల ఆందోళన చల్లారింది. కాని భూలోకములో ఎక్కడుండాలనే అనుమానం మిగిలింది. వారి అంతరంగ ధ్వని పరమేశ్వరునికి వినిపించింది. వారందరినీ దగ్గరకు పిలుచుకుని "భూలోకములో మీ కోసం పెనుగొండ పట్టణము భూలోక కైలాసముగా తయారై ఉంటుంది. పెనుగొండతోపాటు మరికొన్ని పట్టణాలను, జనపదాలను విశ్వకర్మ ఏర్పాటుచేస్తాడు. నా సన్నిధినుండి వేరవుతున్నామని మీరు బాధపడాల్సిన అవసరంలేదు. అక్కడ పార్వతి, నా అంశలు వింధ్యవాసిని-నగరేశ్వర స్వామిగా మీకు అందుబాటులో ఉంటాయి. శ్రీ మహావిష్ణు దంపతుల అంశలు జనార్ధనస్వామి-కోనకమలాదేవిగా అక్కడే ప్రభవిస్తాయి. కొంతకాలము తర్వాత అనగా కలియుగారంభములో ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి అంశతో పార్వతి మీ వంశములో జన్మించి మీకందరికి మోక్షమార్గం చూపిస్తుంది. మీ జాతి కీర్తిప్రతిష్ఠల నార్జిస్తుంది." ప్రేమతో పలికాడు.

సిద్ధవైశ్యులు నారదమహర్షి వెంట బ్రహ్మలోకము వెళ్లి చతుర్ముఖుని ప్రార్థించారు. బ్రహ్మదేవుడు సంతసించి

"వైశ్యమునులారా ! పుణ్య గోదావరి నదీతీరాన పెనుగొండ క్షేత్రవాసులై మీ వంశములను భూలోకములో సుస్థిరపరచండి. సూర్యచంద్రులున్నంత వరకు మీ కీర్తిప్రతిష్ఠ లుంటాయి." ఆశీర్వదించాడు.

ఆ తర్వాము గోబిలము చేరుకున్నారు.

అక్కడ తమ వర్ణమువారైన ఆరొందలపన్నెండు గోత్రీకుల దయనీయ స్థితిని కళ్లారా చూశారు. వారి కన్నీళ్లు గుండెల్ని కరిగించాయి. వారంతా మూకుమ్మడిగా

"నూటారెండు గోత్రాల సోదరులారా ! మా తప్పులకు మన్నించి దయచేసి మమ్ముల్ని మీతో తీసుకెళ్లండి." దీనంగా అడిగారు.

"మీ తపోశక్తిని కొంత ధారబోస్తేనే వారికి శాపవిముక్తి కొంత కలుగుతుంది. అప్పుడే మీవెంట రాగలుగుతారు." అన్నాడు నారదుడు.

సిద్ధవైశ్యులందు కంగీకరించారు.

అటు బ్రహ్మలోకములో... బ్రహ్మ విశ్వకర్మను పిలిచి

"వైశ్యుల కోసం గోదావరి నదీతీరాన భూలోకములో సుందరమైన పట్టణాలు, జనపదాలు నిర్మించి ఇవ్వు"మని ఆదేశించాడు.

విశ్వకర్మ వెంటనే ఆ పనికి పూనుకున్నాడు.

ఇటు సిద్ధవైశ్యులు గోలోకముకెళ్లి కామధేనువును భక్తి ప్రపత్తులతో పూజించారు.

"గోమాతా ! వేదస్వరూపిణీ ! పూజ్యమాతవై సకల లోకాలను కాపాడుతున్నావు. విధి చేతిలో వింతబొమ్మలమైన మమ్ముల్ని, మా వారలను కరుణించు.'' మని పాదాభివందనం చేశారు. గోమాత హృదయం వాత్సల్యవాహిని అయింది.

"వైశ్యమునులారా ! మీరు లోక కల్యాణార్థమే భూలోకముకెల్తున్నారు. అందుకు మీరేమీ చింతించవలదు. మీకేమీ కావాలో కోరుకోండి."

"సురభిమాతా ! బ్రహ్మదేవుడు, పరమేశ్వరుడు మమ్ముల్ని భూలోకముకెళ్లాలని ఆదేశించారు గదా ! నీవు మాకు తల్లివై నీ గర్భము ద్వారా మమ్ముల్ని భూలోకానికి పంపించు."

"సరే... గాని" కామధేనువు కరుణించింది. "ముందు మీరు మిగితా వైశ్యులతో కలిసి క్షీరసాగర తీరముకెళ్లి శ్రీ మహావిష్ణువు ఆశీస్సులందుకుని తిరిగిరండి." మార్గదర్శనం చేసింది.

వైశ్యులంతా కలిసి వైకుంఠము చేరుకున్నారు. ఏడొందల పద్నాలుగు గోత్రీకుల సామూహిక ప్రార్థనాలకించి శ్రీ మహావిష్ణువు సంతోషించాడు.

తెల్లని మల్లెపూల ప్రవాహంలాగున్న క్షీరసాగర తరంగాల్లో శేషతల్పముపై పవళించినవాడల్లా పాదాలుపడుతున్న లక్ష్మిదేవినోసారి గమనించి దృష్టి వైశ్యులవైపు మరల్చాడు.

"పునీతులై భూలోకములోని పెనుగొండకెల్తున్న వైశ్యులారా ! ఈశ్వరాజ్ఞ మాకవగతమైంది. మిమ్ముల్ని ఎల్లవేళలా కనిపెట్టుకొని ఉండేందుకు మా అంశలు పెనుగొండలో జనార్ధన-కోనకమలాదేవిగా అవతరిస్తున్నాయి. మీరంతా భూలోకములో శ్రమించి గోదావరి తీరాన సకల భోగభాగ్యాలనుభవించండి. కొంతకాలము తర్వాత ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి అంశతో జన్మించే పార్వతితో పాటు మీ వంశస్తులతో కైలాసము చేరుకుంటారు." ఆశీస్సులందించాడు.

మనోధైర్యము సంతరించుకున్న వైశ్యులంతా తిరిగి కామధేనువు వద్దకొచ్చారు.

వారందరినీ కామధేనువు తన గర్భము ద్వారా భూలోకానికి పంపించింది. గోమఠం నుండి భూలోకానికికొచ్చిన వైశ్యులు మొదట గోమఠాలుగా ఆ తర్వాత కోమటులుగా వ్యవహరింపబడ్డారు.

వైశ్యులు భూలోకానికికొచ్చేసరికి పెనుగొండతో పాటు మరెన్నో పట్టణాలు, జనపదాలు తయారుగా ఉన్నాయి. అంతటా సకలసదుపాయాలున్నాయి. సంపదలు, భవనాలున్నాయి. గోదావరి జలాలతో గొంతులు తడుపుకుని పంటలందించేందుకు పొలాలు తయారుగా ఉన్నాయి.

ప్రాభాస గోత్రీకుడైన కుసుమార్య ప్రభువుకు బ్రహ్మ అంశతో జన్మించిన తాను గురువుగా ఉండడం... గతమంతా కళ్లముందు కదలాడిన భాస్కరాచారికి సరికొత్త అనుభూతి కలిగింది. తనలో తానే నవ్వుకున్నాడు. చేతులు పైకెత్తి నమస్కరించి

"ఆదిశక్తీ, కన్యకాపరమేశ్వరీ మాతా ! నీ లీలలు అనంతములు. వాటినర్థం చేసుకోవడం నా తరమా ! ఈ జగన్నాటకములో పాత్రధారినై కర్తవ్యాన్ని నిర్వహించడమే నా బాధ్యత గదా !" నిర్వేదంగా నిట్టూర్చాడు. అంతా గమనిస్తున్న చెట్లకొమ్మలు, రెమ్మలు తలలూపుతున్నాయి. సంధ్యావందనానికి సమయమైంది.

# 6

వయసుతోపాటు వాసవి గొంతులో రాగమాధుర్యం మెరుగులు దిద్దుకుంటోంది. మానసిక పరిణతి వయసును మించిపోయింది. ఉద్యానవనములో ఉల్లాసంగా విహరిస్తూ పాటపాడుతూంటే నెమళ్లు ఒళ్లువిరిచి నాట్యం చేస్తున్నాయి. గురువునేర్పిన సంగీత విద్యకు మెరుగులుదిద్ది, సరికొత్త బాణీలు సమకూర్చుకుని భక్తిగీతాలు పాడుతూంటే శ్రోతలు అలౌకికానందాన్ననుభవిస్తున్నారు. పాటకు తోడు వీణావాద్యం... బంగారుతీగల్లాంటి వేళ్లతో వీణాతంత్రులు మీటుతూంటే సాక్షాత్తు వీణాపాణి కొలువుదీరి కచేరి చేస్తున్నట్టనిపిస్తుంది.

"ఈమెకింత విద్వత్తు ఎలా అబ్బింది ?" అని సంగీత గురువునడిగితే ఆయన పొంగిపోతూ

"అజ్ఞాతశక్తి ఏదో వాసవిలో ఆలోచనామృతం చిలికిస్తుంది. కళామతల్లి ప్రసాదించిన స్వరమాధుర్యానికి తోడు సాధనద్వారా గురువును మించిన శిష్యురాలైంది." అంటాడు.

సాధారణ జనజీవితం వాసవి మనోఫలకంపై చెరగని ముద్రవేస్తోంది. తండ్రితో విహారానికెళ్లేప్పుడు, తల్లితో గుడికెళ్లేప్పుడు జనజీవితాలను, వారిస్థితిగతుల్ని నిశితంగా పరిశీలిస్తుంది. కుంటి, గుడ్డి, మూగవారిని చూసి చలించిపోతుంది. తండ్రితో ఓసారి విహారానికెళ్లేప్పుడు మార్గమధ్యములో కర్రసాయంతో నడుస్తున్న ముదుసలి కన్పించాడు. నడుము వంగిపోయింది. వాసవి మనసు వికలమైంది. ఆ ముదుసలిని తండ్రికి చూపిస్తూ

''అటు చూడు నాన్నా ! పాపం... ఆ పెద్దమనిషి అడుగుతీసి అడుగువేసేందుకెంత అవస్థ పడుతున్నాడో !" అంది బాధగా.

కుసుమగుప్తుడు కలవరపడ్డాడు. వెంటనే సర్దుకుని

"భూలోకములో జీవిస్తున్న ప్రతిమనిషికీ ఇలాంటి అవస్త తప్పదమ్మా. ప్రతిమనిషి బాల్య, కిశోర, యవ్వన, ప్రౌఢావస్తలను దాటి వృద్ధాప్యంలో ప్రవేశిస్తాడు. అది సహజం. ప్రకృతి నియమం. మనిషి చేయని తప్పుకు మాధవుడు విధించే శిక్ష వృద్ధాప్యం తల్లీ. వృద్ధాప్యమావహించిన మనిషినే ముసలి అంటున్నాము గదా ! ముసలితనంలో శరీర పటుత్వం తగ్గిపోతుంది, ఓపిక నశిస్తుంది. నరాలు బలహీనమై పంచేంద్రియాలు పట్టుదప్పిపోతాయి. పళ్లూడిపోతాయి. కళ్లు కనిపించవు. అందుకే ఆ ముసలాయన అలా నడుస్తున్నాడమ్మా !" నిబ్బరంగా చెప్పాడు.

"అయితే అమ్మా, నువ్వు, నేను, తమ్ముడు.. ఏదో ఒకరోజు ఇట్లా ఐపోతామా?"

"అవును తల్లీ."

వాసవి గుండెల్లో గుండ్రాయి దొర్లినట్టైంది. ఆలోచనలో పడిపోయింది.

మరోసారి రోగిని చూసి అలానే అడిగింది. ఆ రోగమేదో తనకే వచ్చినంత బాధపడిపోయింది.

"రోగాలు, ఈతిబాధలు మానవులకు సహజములే... " నంటూ సమాధానం చెప్పాడు.

ఓ రోజు కుసుమగుప్తుడు భాస్కరాచారి ముందు కూచుండి ఏదో విషయం చర్చిస్తున్నాడు. వాసవి వచ్చి గురువుగారికి నమస్కరించి తండ్రి పక్కన కూచుంది. మనసులో సందేహాలు మెదుల్తున్నాయి.

వారి సంభాషణ ముగియగానే

"గురుదేవా ! నన్నో సందేహం పట్టి పీడిస్తుంది." ప్రస్తావించింది. అరవిరిసిన ముద్దమందారం లాగున్న మొహాన్ని విషాదఛాయలు అలుముకున్నాయి.

"ఆ సందేహమేదో... అడుగు తల్లీ !"

"మనుషుల సుఖదుఃఖాలకు మూలమేమిటి ? ప్రతిమనిషి వృద్ధాప్యమనే శిక్షను అనుభవించి తీరాల్సిందేనా ?"

బ్రహ్మజ్ఞాని భాస్కరాచారి విస్తుబోయాడు.

జ్ఞానవృద్ధులకు, వయోవృద్ధులకు రావాల్సిన సందేహం పాలబుగ్గల పసి వయసులో రావడమేమిటీ ?... అతని నిశిత దృక్కులామెను వాత్సల్య పూర్వకముగా తడుముతున్నాయి. తనలోతానే నవ్వుకున్నాడు.

"సుఖదుఃఖాలనేవి పూర్వజన్మల కర్మఫలాలు తల్లీ."

"అంటే... !" భృకుటి ముడిపడింది. "వివరంగా చెప్పండి గురుదేవా !" ఆసక్తిగా అడిగింది. కుసుమగుప్తుడు అవాక్కయాడు.

"చూడమ్మా !" భాస్కరాచారి గొంతు గాంభీర్యం పులుముకుంది. "మనుషులు తమ వెనుకటి జన్మల్లో చేసుకున్న పాపకార్యాలు ఈ జన్మలో దుఃఖాన్నిస్తాయి. పుణ్యకార్యాలు సుఖాన్నిస్తాయి. అయితే మోక్షగామి అనగా మరోజన్మ వలదనుకున్న జ్ఞాని మాత్రం జన్మరహస్యాన్ని తెలుసుకుని పాపకార్యాల జోలికిపోడు. తాను బాధలనుభవించినా సాటిమనిషికి మేలు జరిగేలా చూస్తాడు. కష్టనష్టాలను తానే భరిస్తాడు. ఎలాంటి పరీక్షలెదురైనా నిరుత్సాహపడక ధైర్యంగా ఎదిరిస్తాడు. అలాంటి వారికి మోక్షమార్గం సులువైపోతుంది. పునర్జన్మ ఉండదు. వారి ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది."

"మరి... వృద్ధాప్యం సంగతో !"

"అదిగూడా అంతే. పూర్వజన్మ కర్మఫలంగా మనిషి అనుభవించే కష్టాల్లో అదొకటి. పుణ్యాత్ములు అనాయాస మరణం చెందుతారు. మిగితావారు వృద్ధాప్యం కష్టాలననుభవించిన తర్వాతనే మరణిస్తారు."

వాసవికి ఉల్లాసంగా ఉంది. ముఖారవిందము తేజోవంతమైంది. గురువుగారు, మహారాజు మొహాలు చూసుకుని తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

రోజురోజుకూ వాసవిలో తత్వచింతన బలం పుంజుకుంటోంది. అది కుసుమగుప్త దంపతుల నాశ్చర్యపరుస్తోంది.

ఆ రోజు శుక్రవారము, శుభోదయం. సుప్రభాత సమయం. కలకూజితాల కలరవాలకు గోమాతల అంబా అరుపులు తోడై సాధారణ జనాలకు మేలుకొలుపులు పాడుతున్నాయి. చల్ల కవ్వముల సవ్వడులు కన్యకాపరమేశ్వరాలయ సుప్రభాత సేవా మంత్రోచ్చారణకు తోడై ఆదిశక్తికి నీరాజనాలర్పిస్తున్నాయి.

పెనుగొండ పట్టణములో కన్యకాపరమేశ్వరాలయము అతి ప్రాచీనమైనది. తరతరాలుగా కుసుమగుప్తుని వంశస్తులు ఆ తల్లిని సేవించి తరిస్తున్నారు.

వాసవి నిత్యపూజకు తయారైంది. పూజాద్రవ్యాలతో కన్యకాపరమేశ్వరి ఆలయానికి బయలుదేరింది. ముందు, వెనక రక్షకభటులు నడుస్తున్నారు. సుప్రభాత సూర్యుని నునులేత కిరణాలు ఆలయ శిఖరానికి బంగారుపూతలు పూస్తున్నాయి. ఆకాశములో వరుసలుదీరి వెల్తున్న పక్షులపరుగులు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి పులకించి వింతశోభలతో వాసవి నలరిస్తోంది.

పూజాద్రవ్యాలు పూజారికందించి మూలవిరాట్టుకు నమస్కరించింది. గర్భగుడి ముందు, మూలవిరాట్టుకభిముఖంగా కూచుంది. అర్చకులు పూజాకార్యక్రమాల్లో లీనమైనారు. వాసవిని తన్మయత్వమావరించింది. కళ్లు మూసుకుని ధ్యానముద్ర దాల్చింది. ఉచ్ఛ్వాస నిశ్వాసలను భ్రూమధ్యమున నిలిపి అంతర్ముఖురాలైంది. బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతోంది. అటు చూసిన వారు భక్తితో చేతులెత్తి నమస్కరిస్తున్నారు.

మంత్రోచ్ఛారణ, స్తోత్రపారాయణం దైవసాన్నిధ్యానికి చేరుకునే సాధనాలైతే ధ్యానము జ్ఞాన, కర్మేంద్రియములకు ప్రశాంతత చేకూర్చి మేధోవృద్ధికి తోడ్పడుతుంది. అంతేకాదు చిత్తశుద్ధి, ఏకాగ్రతల ఆసరాతో ఆత్మ పరమాత్మను దర్శించుకునే అవకాశముంది. ఇవన్నీ గురువులద్వారా విన్న వాసవి స్వయంగా అమలుచేస్తోంది.

గర్భగుడిలో అభిషేకము, అర్చన కార్యక్రమము ముగియబోతుంది. రాజగురువు భాస్కరాచారి అక్కడికొచ్చాడు. కన్యకాపరమేశ్వరి మాతకు నమస్కరించాడు. ధ్యానముద్రలో కూచున్న వాసవి కనిపించింది. పూర్తిగా ధ్యానములో మునిగి ఉంది.

ఇంత చిన్నవయసులో అంత ఏకాగ్రతనా ! ఆటపాటలతో గడిపే వయసులో భక్తివైరాగ్యాలా ! ఆదిశక్తి ఆశీస్సుల కోసం అంత ఆరాటమా !

వాసవికెదురుగా కూచున్నాడు.

"వాసవి ఇలా కూచుని ఎంతసేపైంది ?" ఓ పూజారినడిగాడు.

"చాలసేపైంది గురువుగారూ !"

"ధ్యానము ఈ రోజునుండే ప్రారంభించిందా ?"

"లేదు. చాలా రోజుల క్రితమే."

"ఇలా ఎంతసేపు కూచుంటుంది ?"

"చాలా సేపు."

"అంటే... "

"రెండు ఘడియలు దాకా."

అంతా అమ్మవారి లీల... అనుకుని తనలో తానే నవ్వుకున్నాడు. తిరిగి వాసవిని పరిశీలనగా చూస్తున్నాడు.

వాసవిలో కదలిక లేదు. తృప్తిగా, ప్రశాంతముగా దేవతామూర్తిలాగుంది. దృష్టి మరల్చకుండా అలాగే చూస్తున్నాడు. ఎంతసేపు చూసినా తృప్తికలగడం లేదు. వాసవి మొహంలోని బ్రహ్మ తేజస్సు సూర్యకాంతి వెదజల్లుతోంది. అతని అంతరాళాల్లో వింత కదలిక. నరాల్లో కొత్త స్వరాలు... కళ్లముందున్న వాసవిలో కన్యకాపరమేశ్వరి కనబడుతోంది. చిరుమందహాసమ, అభయహస్తము, అదొక సౌందర్యలహరి... ఒళ్లంతా కళ్లైపోయినై. అనుమానం లేదు... ఈమె ఆదిశక్తి కన్యకాపరమేశ్వరియే. భావోద్రేకము పొంగుకొచ్చింది.

"ధన్యోస్మి మాతా ! నమోన్నమః" చేతులెత్తి నమస్కరించి శ్రీ చక్రమునందు కున్నాడు.

శ్లో॥ ధ్యాయే వాసవీదేవం, బ్రహ్మ విష్ణు శివాత్మకాం,
పరాశక్తిం జగద్ధాత్రీం, కన్యకాపరమేశ్వరీం,
చతుర్భుజాం, చంద్రచూడాం, కమలాసన సంస్మితాం,
వరదా అభయ హస్తంచ, శుక పద్మాకరం శుభం... "

ముందుకు వంగి పాదనమస్కారం చేశాడు.

అప్పటికే పూజ ముగించిన పూజారులు విస్తుబోయి వింతగా చూస్తున్నారు. పద్నాలుగేళ్ల బాలికకు బ్రహ్మజ్ఞాని రాజగురువు పాదాభివందనం చెయ్యడమా ! మొహాలు చూసుకున్నాయి.

అమ్మవారి లీలలు అర్థమయేదెవరికి ?... అనుకుంటూ మూల విరాట్టుకు నమస్కరించారు.

వాసవిలో కదలిక ప్రారంభమైంది. అప్పుడే నిద్రలోంచి మేల్కొంటున్నట్టుంది. అప్పుడే విప్పుకుంటున్న పూవురెక్కల్లా కనురెప్పలు మెల్లగా తెరుచుకున్నాయి.

"గురుదేవులకు నమస్సుమాంజలి." అంటూ పాదాలకు నమస్కరించబోయింది.

"అమ్మా... ఆగుతల్లీ !... " వారించాలనుకున్నాడు.

మొగిలి రేకుల్లాంటి చేతులు అప్పటికే అతని పాదాలను స్పృశించాయి. ఆప్యాయంగా లేపికూచోబెట్టాడు. ఆనందబాష్పాలు సుడులు తిరుగుతున్న కళ్లు ఆమెమీదనే ఉన్నాయి.

"నన్ను మీరీ రోజు వింతగా చూస్తున్నారు గురుదేవా !"

"పసికూనలో పరమేశ్వరి దర్శనం గదమ్మా !" అనాలకున్నాడు కాని అనలేకపోయాడు. మనసు ఆనంద డోలికలూగుతోంది.

తల్లీ ! నీ లీలా వినోదాన్ని వివరించడము నాతరమా !... గొణుక్కుంటూ మూలవిరాట్టుకు మరోసారి నమస్కరించాడు.

"నువు ధన్యురాలివమ్మా !" వాసవి నాశీర్వదించాడు.

విరూపాక్షుడు రణవిద్యాపారంగతుడయాడు. రాజనీతి లోతుపాతులను, తన పూర్వజుల అనుభవాలను అవగాహన చేసుకున్నాడు. పెనుగొండ పట్టణమంతా, సామంత రాజ్యాలలో, మారుమూల పల్లెటూళ్లల్లో మారువేశములో పర్యటిస్తూ ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటున్నాడు. పెద్దలపట్ల వినయవిధేయతలు ప్రదర్శిస్తూ రాజనీతి, శాస్త్రచర్చల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. కళలపట్ల ఆసక్తి మానసికానందాన్నిస్తోంది. అక్కతో ఉల్లాసంగా మాట్లాడ్డం, అంతఃపుర జనాల బాగోగులు చూడ్డం అలవాటైంది. దైవానుగ్రహం వల్ల రక్తంపంచుకు పుట్టిన చిరంజీవులు తాము ఆశించిన దానికంటే మెరుగ్గా కనబడ్డం కుసుమార్య దంపతులకెంతో తృప్తినిచ్చింది.

అక్క ఆలోచనాధోరణి కనుగుణంగా అహింసా ప్రాతిపాదికపై శాసనాలు చేయించి, శిక్షాస్మృతిని అమలు చెయ్యడములో కీలకపాత్ర వహిస్తున్నాడు. అలాగని దురుద్దేశ్యముతో, దుర్మార్గాలు చేస్తున్న వారిని క్షమించడములేదు.

నూతన శిక్షాస్మృతిని సమర్థవంతముగా అమలుచేసేందుకు కుసుమగుప్తుడు పటిష్టమైన ఏర్పాట్లు చేశాడు. ప్రజల మధ్య తలెత్తిన తగాదాలను, వివాదాలను విచారించి తీర్పులిచ్చేందుకు, దోషులను శిక్షించేందుకు ఊరూరా ధర్మాసనాలను పునర్వవస్థీకరించారు. ధర్మాసనములో ఐదుగురు సభ్యులుంటారు. అనుభవజ్ఞులైన న్యాయకోవిధులను మాత్రమే ధర్మాసనములో సభ్యులుగా నియమిస్తారు. ఐదుగురిలో అమితానుభవమున్న వ్యక్తి అధ్యక్షుడుగా ఉంటాడు. ధర్మాసనము విచారణ సమయములో వాసవి అప్పుడప్పుడు ప్రేక్షకుల్లో కూచుంటుంది. విచారణా విధానాన్ని, తీర్పులోని ధర్మ సూక్ష్మాలను పరిశీలిస్తుంది.

నేరస్తులను సంస్కరించి సన్మార్గమువైపు మళ్లించేందుకు సామ, దాన, భేద, దండోపాయాలను కఠినంగా అమలుపరచాలంటాడు విరూపాక్షుడు. దానికి వాసవి అంగీకరిస్తూనే దండోపాయములో హింస ఉండరాదంటుంది. మొదటి మూడు విధానాల

ద్వారా నేరస్తునిలో మార్పురాలేదంటే అతని మానసికస్థితిని లోతుగా పరిశీలించి జాగ్రత్తగా వ్యవహరించాలంటుంది. ఏదిఏమైనా ఆత్మాభిమానాన్ని కాపాడుకోవాలంటుంది. ఒక్కోసారి వారిద్దరి మధ్య ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది.

"అక్కా ! మంచి మాటలను పెడచెవినబెట్టి దుర్మార్గాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా దండించితీరాల్సిందే. అలాగైతేనే అతనిలో మార్పువస్తుంది. లేకపోతే ధర్మదేవత బలహీనురాలనుకునే ప్రమాదముంది."

"కాదు తమ్ముడూ ! దండనం దశగుణం భవేత్ అనేది చివరి ఉపాయం. అదిగూడా శారీరక హింసద్వారా వచ్చిన మార్పు తాత్కాలికమైంది. ఒక్కోసారి శారీరక హింసను భరించలేక నిరపరాధి గూడా నేరాన్ని అంగీకరించవచ్చు. ఆ వ్యక్తికి దండన విధించడమంటే ధర్మదేవతను శిక్షించడమే అవుతుంది. నేరస్తులెవరైనా తమ వాదనా పటిమతో శిక్ష తప్పించుకున్నా ఫరవాలేదు గాని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోలేని నిర్దోషికి శిక్ష విధించడము ఘోరపాపకార్యం."

"మరి నేరస్తులు శిక్ష తప్పించుకుపోతే ప్రజల్లో పాపప్రవృత్తి, హింసాప్రవృత్తి పెరిగిపోతాయి గదా !"

"అందుకే విచారణ సమయమప్పుడు నిందితులను భయపెట్టకుండా ప్రేమతో ప్రశ్నిస్తుండాలి. నిజాలను నిర్భయంగా బయటపెట్టే వాతావరణం కల్పించాలి. దుర్మార్గులలోని దుర్మార్గప్రవృత్తి మాయమయేందుకు దోషులను మానసికంగా మార్చేందుకు ప్రయత్నించాలి. అందుకోసం అహింసా విధానాన్నాశ్రయించి శిక్షలు విధిస్తూ మనిషి ఆలోచనలో మార్పువచ్చేలా చూడాలి. మానవాళి సమస్తం ఒకే కుటుంబముగా జీవించాలంటే ద్వేషం, అసూయ, స్వార్థాలను పారదోలాలి. మన సంస్కృతికి మూలకందాలైన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాల్లోంచి ఉదాహరణలిస్తూ నేరస్తుని మనసు మారేలా చూడాలి... "

అలా చర్చసాగిపోతుంటే తల్లిదండ్రులు, మంత్రులు ప్రేక్షకుల్లా చూస్తుంటారు.

చివరికి వారిద్దరు అహింసోపరమో ధర్మః సిద్ధాంతాన్నంగీకరిస్తూనే శాంతిని రక్షించాలనుకుంటారు. శాంతిని రక్షించేందుకు, ఇతరులనుండి తమను తాము రక్షించుకునేందుకు శరీర దారుఢ్యం పెంచుకోవాలని, అధర్మాన్నెదిరించేందుకు యుద్ధసన్నద్ధులై ఉండాలని తీర్మనించుకుంటారు.

వాసవికి యుక్త వయసు వచ్చేసింది. సహజరూపవతి కాబట్టి పట్టుపావడా, సన్నని వల్లెవాటు, నిరాడంబరమైన అలంకరణ సహజ అందాలను రెట్టింపు చేస్తున్నాయి.

పచ్చిపాలలో సాయపసుపు రంగరించిన దేహఛాయ, నున్నటి నుదుటిపై ఎఱ్ఱని బొట్టు, బుగ్గమీద కస్తూరి చుక్క, ఎక్కుపెట్టిన ధనస్సుల్లా కనుబొమలు కనువిందుచేస్తున్నాయి. దానిమ్మ గింజల్లాంటి పలువరుస... నవ్వుతూంటే నోటిముత్యాలు రాలిపోతాయేమో నన్పిస్తుంది. గుండెల మీదాడుకుంటున్న పొడగాటి జడ కొండలు పాకుతున్న నల్లనాగులా కన్పిస్తుంది. నడకలో మయూరగతి, కాలి అందియల గలంగలలు, మాటలో తియ్యదనం, కళ్లల్లో కాంతిరేఖలు... అపర పార్వతీదేవిలా, అందాల శచీదేవిలా కనబడుతుంది.

కన్యకాపరమేశ్వరాలయ ప్రాంగణము సువిశాలమైంది. అందులో విశాలమైన పూలతోట. పూలతోటలో అప్పుడప్పుడు పూబోణులతో బంతులాడుకుంటుంది వాసవి.

ఆ రోజు బంతులాటలో అలసిపోయింది. ఓ చోట కూచుండిపోయింది. చుట్టూరా చెలికత్తెలున్నారు. వాసవి దృష్టి వికసించిన సన్నజాజుల మీదుంది. వయసు ప్రభావముతో శరీరములో చోటుచేసుకుంటున్న మార్పులు జిలిబిలి ఆలోచనలను రేపుతున్నాయి. అరవిరిసిన పూలను చెలికత్తెకు చూపిస్తూంటే చూపుల్లో కొత్తదనం సంతరించుకుంది.

"ఆ మాధవీలత పక్కనున్న మొక్కనెలాఅల్లుకుందో చూడు"అంది మరో చెలికత్తెతో.

"ఆ ఆనందము మాటల్లో చెప్పరాదు గదూ !"

"అవును... "

మరోదిక్కు ఇంకో చెలికత్తెకు చూపిస్తూ

"ఆ గండుతుమ్మెద చూడు. నిండుగా విచ్చుకున్న ఆ పూరేకుల మీదవాలి ఏంచేస్తుందీ ?'' క్రీగంటి చూపులతో పరవశంగా అడిగింది. చెలికత్తెకు సిగ్గుముంచుకొచ్చింది.

"గండుతుమ్మెద పూరేకుల్ని చప్పరిస్తుంది. పూరేకుల్ని పరవశింజేస్తూ తానూ పరవశించి ఆనందాన్ననుభవిస్తుంది."

"పూరేకులతో పరవశమా ?"

"అవునమ్మా ! పూవుకు రేకులు అధరాల్లాంటివి. పూవు తన అధరామృతాన్ని గండుతుమ్మెద కందిస్తూ అలౌకికానందాన్నభవిస్తుంది."

"అలాగా... !" తియ్యని అనుభూతి "అంటే... మనుషులుగూడా... "

"అవునమ్మా ! సృష్టికార్యం సజావుగా జరగాలంటే పురుషుడు గండుతుమ్మెదగా, ప్రకృతిరూపమైన స్త్రీ పూవుగా మారిపోతారు. దాంతోనే స్వర్గసుఖాలనుభవిస్తారు. అదే సంతానోత్పత్తికి మూలకారణమవుతుంది." వివరించింది.

"ఆ... తర్వాత ?"

"ఆ తర్వాతనా... ?" చెలికత్తె నోరెల్లబెట్టింది.

"ఆ తర్వాత ఏమవుద్దంటే... ఇంకో చెలికత్తె అందుకుంది." స్త్రీ పురుషులు ఒకటై సంసారసాగరాన్ని ఈదుతారు."

"ఆ తర్వాత !"

"ఆ తర్వాత పిల్లల్ని... తమకు జన్మించిన పిల్లల్ని పెంచి, పోషించి పెద్దవాళ్లను చేసి వాళ్లు వృద్ధులవుతారు. ఆ తర్వాత ఆయుష్షు తీరాక మరణిస్తారు." గడగడా చెప్పేసి వాసవి వాలకాన్ని గమనిస్తోంది.

"ఓస్ ! అంతేనా !" వాసవి పెదాలు చప్పరించి నిట్టూర్చింది.

"అయితే చెలీ ! సృష్టిలోని జీవకోటిలో ప్రతిప్రాణి పుడుతూ మరణిస్తూ జననమరణ సంకుల సమరంలో చిక్కుకుపోతుందన్న మాటా."

"అవునమ్మా... అంతే."

"అయితే పుట్టడం, తాత్కాలిక సుఖాలనాశించి కష్టాలనుభవించడం, సంసారసాగరములో కొట్టుకుపోతూ సుడిగుండాల్లో చిక్కుకుపోవడం... ఫ్చ్... ఇదంతా విడ్డూరంగా ఉంది గదూ !" కనుబొమలు వింతగా కదిలాయి.

చెలికత్తెలు నోటమాట రాలేదు.

"ఆ శిరీష కుసుమం చూడండి." వాసవి చెప్తూనే ఉంది. "పూర్తిగా వికసించింది. యవ్వన సంరంభములో గండుతుమ్మెదతో మమేకమై ఆనందాన్ననుభవిస్తుంది. అదెంత కాలము ? తాత్కాలికమే. ఆ తర్వాత యవ్వనప్రాయం దాటిపోతుంది. సౌందర్యం నశిస్తుంది. స్వల్ప కాలములోనే అన్నీ పోగొట్టుకుని మర్నాటికి నేల రాలిపోతుంది. అది తన జీవితములో సాధించినదేమున్నది ?" నుదురు ప్రశ్నార్థకమైంది.

చెలికత్తెల బుర్రల్లో భూగోళం గిర్రుమంది. వాసవి మొహంలోకి చూస్తుండి పోయారు.

"మరి ఎలాగైతే ఆ పూవు జీవితం సార్థకమవుంది ?" ధైర్యంగా అడిగిందో చెలికత్తె.

"తాత్కాలిక సుఖాన్నాశించక ఆ పూవు పరమేశ్వరి పాదాల చెంతకు చేరితే దాని జన్మ సార్థకమవుతుంది. దేవుని పాదపద్మాలమీద ఏ కొద్దిసేపు పరవశించినా లేదా మాతృభూమి రక్షణకోసం మహాత్యాగం చేసే వీరసైనికుని మెడనలంకరించినా దాని ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది. శాశ్వతానందాన్ననుభవిస్తుంది." చెబుతూంటే వాసవి మొహం పున్నమి చందమామలా కనబడింది.

ఏదో అర్థమయీ కానట్టున్న చెలికత్తెలు తేరుకుని అంతా అర్థమైనట్టుగా కిలకిలానవ్వారు. లేకపోతే రాకుమారికి కోపం రావచ్చుననుకున్నారు. ఆ విషయాన్ని అవగాహన చేసుకున్న వాసవి చెలికత్తెల వైపు జాలిగా చూసింది. దొండపండు లాంటి పెదాలమీద సన్నని చిరునవ్వు విద్యుల్లతలా ఇలా మెరిసి అలా మాయమైంది.

ఆ రోజు ఓ కొత్త అంశం, ఎన్నడూ కనీవిని ఎరగని విషయం ధర్మాసనం ముందుకొచ్చింది. ఆసక్తిగల పెనుగొండ ప్రజలందరి సమక్షములో ధర్మాసనం సమావేశమైంది. ధర్మాసనాధ్యక్షుడైన ధర్మాధికారి, నలుగురు సభ్యులు వేదిక మీదున్నారు. రంగుల తల పాగాలు, జరీఅంచు కండువాలు, ధోవతులపై పొడగాటి అంగరఖాలు,నుదట తిలకం ధరించిన వారిని చూడగానే చేతులెత్తి నమస్కరించాలనిపిస్తుంది. వేదికమీద ఓ పక్కన ధర్మదేవత చిత్రముంది.

వేదికకు ఒక పక్కన నిందితుడు, అతని శ్రేయోభిలాషులు, మరోపక్క హత్యకు గురైన మనిషి కుటుంబసభ్యులు, బంధువులు, ఎదురుగా పట్టణప్రముఖులు ఆసీనులైనారు. సాధారణ యువతిలా వాసవి ప్రేక్షకులమధ్య కూచునుంది. సభలోని గుసగుసలు, రుసరుసలు, బుసబుసలన్నింటినీ ఆసక్తిగా గమనిస్తోంది.

ధర్మాసనానికి సహాయకారిగా ఉన్న న్యాయాధికారి లేచి సంఘటన వివరాలు, పూర్వాపరాలు వివరిస్తూ చివరికి

"ధర్మదేవతా స్వరూపులారా ! మన పెనుగొండ సామ్రాజ్యములో ధర్మదేవత నాల్గుపాదాల నడుస్తుందని భావిస్తున్నాము. చిన్నచిన్న నేరాలు, వాటికి శిక్షలు సర్వసాధారణమైనవే. కేవలం ఆస్తికోసం తనతండ్రి తోడబుట్టినవాణ్ని కత్తితో పొడిచి చంపడం అసాధారణం, క్షమించరాని నేరం. నిందితుడు మన ముందున్నాడు. శ్రీమాన్ కుసుమగుప్త ప్రభువుల ధర్మపాలనలో ఇలాంటి ఘోరం జరగడం దురదృష్టం." ముగించి కూచున్నాడు.

"ఏమయ్యా ! నీపై వచ్చిన ఆరోపణకు నీ సమాధానమేమిటో నిర్భయంగా చెప్పెయ్." ధర్మాధికారి అడిగాడు.

నిందితుడు ధర్మాసనానికి, సభకు నమస్కరించాడు.

"అయ్యా ! మా చిన్నాన్న, మానాన్నకు తోడబుట్టినవాడని తెలుసు. చిన్నప్పుడు నన్ను తన గుండెలమీద ఆడించిన సంగతి గుర్తుకుంది. మా తండ్రులది ఉమ్మడికుటుంబం. ముగ్గురన్నదమ్ములు, వారి పిల్లలమైన మేము అంతా ఒకే ఇంట్లో ఉంటున్నాము. ముగ్గురిలో మా నాన్న పెద్దవాడు, ఉమ్మడి కుటుంబానికి పెద్ద, మా చిన్నాన్నలు సమిష్టి బాధ్యతలు

మరిచి ఎవరికివారే యమునాతీరే అన్నట్టుగా ఉంటున్నారు. వాళ్లకు మగసంతానం లేదు. మా ఉమ్మడి కుటుంబానికి తర్వాతి తరంలో నేనే వారసుణ్ని. కుటుంబ భారాన్ని మోయలేక మా నాన్న చిన్నాన్నలను వేరుగా ఉండుమన్నాడు. వాళ్ల ఆడపిల్లలకు పెళ్లిళ్లైపోయినై. అంతా అత్తవారి ఇళ్లల్లో సుఖంగా ఉన్నారు. అయినా మా చిన్నాన్నలు తాము చాటుమాటుగా కూడబెట్టుకున్న ఆస్తులను బయటపెట్టలేదు సరికదా మా నాన్న సంపాదించిన ఆస్తిపాస్తుల్ని ముగ్గురికి సమానంగా పంచాలని పట్టుబట్టారు. మంచి మాటలతో పెద్దమనుషులు మా పెదచిన్నాన్నను ఒప్పించగలిగారు, గాని చినచిన్నాన్న ససేమిరా అన్నాడు. అంతేకాదు పెద్దవాడనే గౌరవంలేకుండా మా నాన్నను దుర్భాషలాడాడు. మా నాన్న అతణ్నో చెంపదెబ్బవేశాడు. దానికతడు మా నాన్నను కత్తితో పొడవబోయాడు. నా రక్తం కుతకుతలాడింది. మెరుపు వేగంతో చినచిన్నాన్న మీదికి దుంకి కత్తితో పొత్తికడుపులో పొడిచేశాను. కుటుంబ పెద్దయైన మా నాన్న ప్రాణాలు రక్షించాను. దానికి మా చినచిన్నాన్న చచ్చిపోతాడనుకోలేదు." చెప్పి సిగ్గుతో తలవంచి, చేతులు కట్టుకు నుంచున్నాడు.

ధర్మాసనం సభ్యులు తమలో తాము మాట్లాడుకున్నారు. నేరస్తుడు నేరాన్ని అంగీకరించాడు కాబట్టి విధించబోయే శిక్ష గురించి ఆలోచించాలనుకున్నారు.

అందులోంచి ఒకాయన

"అయ్యా ! నువు చేసిన తప్పు ఒప్పుకున్నావు కాబట్టి మరణశిక్ష విధించాల్సి ఉంటుంది" అనేశాడు.

నేరస్తుడు హడలిపోయాడు. వణికిపోతూ

"అయ్యా నేను ఆవేశంతో పొడిచాను. ప్రాణాలు పోతాయనుకోలేదు. దయచేసి నా ప్రాణాలు కాపాడండి. నా తల్లిదండ్రులు గర్భకోశాన్ని భరించలేరు. నా భార్య వైధవ్యాన్నుభవిస్తూ బతకలేదు. దేవుడా... నువ్వే దిక్కు." ఆకాశానికి నమస్కరించాడు.

అతని తల్లిదండ్రులు, భార్య తలబాదుకుంటూ రోదిస్తున్నారు.

"నేరస్తుడా !" ధర్మాధికారి అడిగాడు "నీ తరఫున మాట్లాడేందుకెవరైనా ఉన్నారా ?"

నేరస్తుడు దీనవదనంతో నాల్గువైపులా చూశాడు. ఆదుకునే వారెవ్వరూ కనబడలేదు. కన్యకాపరమేశ్వరి ఆలయంవైపు చేతులెత్తి నమస్కరిస్తూ "తల్లీ ! దిక్కులేని వారికి నువ్వే దిక్కు గదా ! నా ప్రాణం కాపాడమ్మా !" వేడుకున్నాడు.

"నేనున్నాను." వాసవి ధైర్యంగా లేచి ముందుకొచ్చింది. ధర్మాసనానికి వినయంగా ప్రణామం చేస్తూ "ఈ నేరస్తుని తరఫున నేను వాదిస్తాను. దయచేసి అనుమతించుమని ప్రార్థన."

అప్పటిదాకా నిశ్శబ్దంగా ఉన్న సభలో కలకలం బయలుదేరింది. ఈమె రాకుమారి వాసవీదేవి. ఇంతవరదాకా మన మధ్యనే కూచుంది గదా ! ఆశ్చర్యంతో జనాలు గుసగుసలాడుతున్నారు.

"తమరు రాకుమారి గదా !" ధర్మాధికారి అడిగాడు గంభీరంగా.

"నేనిప్పుడు రాకుమారిగా రాలేదు. ధర్మదేవత ముందు అంతా సమానమే. సామాన్యురాలిగానే మీ ముందుకొచ్చాను. దయచేసి నా వాదన వినండి. మీ విధులు మీరు నిర్వహించండి." ధైర్యంగా వేడుకుంది.

"అనుమతిచ్చాము. వాదన వినిపించవచ్చు." ధర్మాధికారి తమ నిర్ణయాన్ని ప్రకటించాడు.

అక్కడున్న వారంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా, అమితాసక్తితో చూస్తున్నారు. నేరస్తుడిని పక్కకు పిలిచి కొద్దిసేపు మాట్లాడింది వాసవి. ఆ తర్వాత ధర్మాసనం ముందుకొచ్చింది.

"ధర్మదేవతకు నమస్సుమాంజలి." ధర్మాసనానికి చేతులు జోడించింది. "హింసాప్రవృత్తికి ఆవేశం తోడైతే మానవుడు దానవుడవుతాడు. ఈర్ష్య, అసూయలు హింసాప్రవృత్తికి మూలాలు. అవి శృతిమించితే మానవమాత్రుల్లోని విచక్షణా శక్తిని మింగేస్తాయి. దూరాలోచన లేని దురాలోచన అపరాధాలు చేయిస్తుంది. ఇతని విషయంలో జరిగిందదే.

తండ్రిలాంటి చిన్నాన్నను ఆస్తి తగాదాలో హత్యచేశానని స్వయంగా ఒప్పుకున్నాడు. ప్రతీకారం తీర్చుకోబోయి ప్రాణాలు తీశాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు. హత్యకు హత్యే సమాధానమైతే శిక్షాస్మృతి ప్రత్యేకత ఏముంది ? కళ్లముందు కన్నతండ్రికి జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ భరించలేకపోయాడు. తాత్కాలికావేశంతో నేరం చేశాడు... "

"అయితే ఈ నేరస్తుడికి శిక్ష విధించవద్దంటారా ?" ధర్మాధికారి సూటిగా ప్రశ్నించాడు.

"నేనలా అనను. నేరస్తునికి శిక్ష పడాల్సిందే. కాని ఆ శిక్ష నేరస్తునిలోని నేరప్రవృత్తిని మాయంచేసి సన్మార్గములో పయనించేందుకు దోహదపడాలి. శిక్ష మనిషిని సంస్కరించాలి. అహింసో పరమో ధర్మః అని శాస్త్రాలు చెబుతున్నాయి. హింసాప్రవృత్తిని అహింసా విధానం ద్వారా తొలగించాలి. ఈ నేరస్తునికి మరణదండన విధిస్తే ఇతనిమీద ఆధారపడ్డ కుటుంబ సభ్యులు అనాథలైపోతారు. సనాథలను అనాథలుగా మార్చేయడం

న్యాయదేవతకు అన్యాయం చేసినట్టవుతుంది. ఈ విషయాన్ని పరిశీలించాలని ప్రార్థిస్తున్నాను."

ధర్మాసనం ఆలోచనా సంద్రములో కొత్తకెరటాలు లేస్తున్నాయి. పట్టణ ప్రముఖులు, సాధారణ ప్రజల్లో ఆసక్తి రెట్టింపై ఉద్వేగంగా చూస్తున్నారు. ధర్మాధికారి తన పక్కనున్న నలుగురు సభ్యులకు సైగలు చేశాడు. గుసగుసలతో సంప్రదించుకున్నారు. ధర్మాధికారి వాసవినుద్దేశించి

"ఆశయం మంచిదే కాని ఆచరణలో అది సాధ్యమా ? హింసకు తావులేని శిక్ష ఎలాగుంటుంది ?" అడిగాడు.

"నా ఉద్దేశ్యం... శారీరక హింసద్వారా మనిషిలో మార్పురాదని... "

"అయితే ఈ నేరస్తుడినెలా శిక్షించాలంటారు ?"

"నాకు తోచింది నేను చెప్తున్నాను. నేను చెప్పింది మీకు శిరోధార్యం కాదు. కేవలం ఇదొక సలహా మాత్రమే."

"సరే... చెప్పమ్మా !"

"ఈ నేరస్తుని హింసాప్రవృత్తి వాళ్ల చిన్నాన్న ప్రాణాలు తీసింది. ఫలితంగా చనిపోయినాయన మీద ఆధారపడిన వారు దిక్కులేనివారయారు. కాబట్టి వారి పోషణ భారాన్ని ఇతనికే అప్పగిస్తే సరిపోతుంది. అదే ఇతనికి తగిన శిక్ష. మరణించి నాయన కుటుంబ సభ్యులకు రక్షణ." వాదన ముగించి వచ్చి తన స్థానములో కూచుంది. కరతాళ ధ్వనులతో ఆ ప్రదేశం మార్మోగింది.

వాసవి వాదనకు జనామోదముందని ధర్మాసనానికి అర్థమైంది. ధర్మాధికారి సహా ఐదుగురు తృప్తిగా ఊపిరిపీల్చుకుని తమలోతాము చర్చించుకున్నారు. ఏకగ్రీవ నిర్ణయం ధర్మాధికారి ద్వారా వెలువడింది.

"నేరస్తుడు స్వయంగా నేరాన్ని అంగీకరించి పశ్చాత్తాప పడ్తున్నాడు. అయినా శిక్షార్హుడే. అతని చర్యవల్ల మరణించిన వాళ్ల చిన్నాయన కుటుంబ సభ్యుల పోషణ బాధ్యతను సంపూర్ణంగా స్వీకరించడమే ఇతనికి తగిన శిక్ష. ఈ శిక్ష వెంటనే అమల్లోకొస్తుంది."

నేరస్తుడు, నేరస్తుని బంధువులు, ఫిర్యాదుదారులు, వారి బంధువులు... అందరిలో హర్షాతిరేకం వ్యక్తమైంది. పట్టరాని ఆనందముతో వాసవికి పాదాభివందనం చెయ్యబోయారు. మర్యాదగా వారిని వారించింది.

"మీరంతా పెద్దవారు. పెద్దలు చిన్నవారికి నమస్కరిస్తే ఆయుక్షీణమంటారు.

మనమంతా ఆ కన్యకాపరమేశ్వరీ దేవికి నమస్కరిద్దాం.” అంటూ అందరినీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి తీసుకెళ్లింది.

ఇలా... ఎన్నో విషయాల్లో వాసవి ధైర్యసాహసాలతో ముందుకొచ్చి తన ఆలోచనలను అమల్లో పెడుతుంది. ధర్మాసనం విచారణాంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఎవరూ అడక్కపోయినా బాధితుల తరపున వాదిస్తుంది. నేరస్తుల పట్ల జాలి చూపిస్తుంది. అహింసా ధోరణికి అనుకూలంగా అందరికీ ఆమోదయోగ్యమైన తీర్పు వెలువడేలా చూస్తుంది. అందుకే వాసవిలో కొందరు పార్వతీదేవిని, మరికొందరు కన్యకాపరమేశ్వరిని దర్శించుకుంటున్నారు.

ధర్మాసనం సభ్యులను, ధర్మాధికారిని తికమకపెట్టే విచారణాంశాలు ముందుకొచ్చినప్పుడు ఒక్కోసారి ధర్మాధికారులే వాసవి సలహా తీసుకుంటున్నారు. ఈ విషయం పెనుగొండ సామ్రాజ్యములోని సామంతరాజులకు, తెలిసిపోయింది. ప్రశాంత విప్లవమై సర్వజనామోదమైంది.

# 7

“అన్నయ్యా ! నీ సుగంధ ద్రవ్యాల వ్యాపారమెట్లా సాగుతుంది ?” వజ్రాల వ్యాపారి కంకణుడు సుగంధ ద్రవ్యాల ప్రముఖ వ్యాపారి పింగళుడి నడిగాడు ఆప్యాయంగా. వారిద్దరూ కన్యకాపరమేశ్వరిని దర్శించుకుని ఆలయ ఉద్యానవనములో ఓ చెట్టుకింద కూచుండి కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఉదయమే కన్యకాపరమేశ్వరిని దర్శించుకోవడం పెనుగొండ వాసుల రోజువారీ కార్యక్రమము.

ఆరోజు అమావాస్య. వాణిజ్య, వ్యాపారాలకు సెలవుదినము. కాబట్టి ఆలయోద్యాన వనములో కూచుండి కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడుకుంటారు. పరస్పర అవగాహన, బంధుభావము, ఆప్యాయత మాటల్లో, చేతల్లో వ్యక్తమౌతుంది.

“అమ్మవారి దయవల్ల నా వ్యాపారం చాలా బాగుంది తమ్ముడూ. సింహళము, జావా, సుమత్రా, చీనీ దేశాలకు సరుకులు ఎగుమతి చేస్తున్నాను.” హుషారుగా చెప్పాడు పింగళుడు.

“విదేశాలకు సరుకుల ఎగుమతికోసం పెద్దపెద్ద పడవలు కావాలి గదా ! ఆ పడవలు అద్దెకు తీసుకంటున్నావా లేక నీ సొంతానివా ?”

“కుసుమగుప్త ప్రభువుల పాలనలో మనలాంటి వ్యాపారులకు గూడా ఋణాలు లభిస్తున్నాయి గదా ! నేను గూడా వ్యాపార ఋణం తీసుకుని ఓ పెద్ద పడవ కొనేశాను.

కిస్తులమీద అప్పు తీర్చేశాను. ఇప్పుడా పడవ నా సొంతమైంది తమ్ముడూ."

"చాల సంతోషమన్నయ్యా !" కంకణుని చూపు వికసించిన పూలమీదుంది. "ఈ గడ్డి పరుపులాగుంది గదూ !" నేలమీద గడ్డిని అరచేత్తో నిమిరాడు.

"అద్సరే గాని తమ్ముడూ !" చిన్నగా చిటికేసి కంకణుని దృష్టిని తనవైపుకు తిప్పుకున్నాడు పింగళుడు. "మరి నీ వజ్రాల వ్యాపారమెట్లా ఉంది ?" కండువా సవరించుకుంటూ అడిగాడు.

"ఆ తల్లి దయవల్ల లాభాల బాటలో నడుస్తుందన్నయ్యా !" తృప్తిగా తలాడించాడు. ఆ ఊపుకు వీపుపై వేళ్లాడ్తున్న తలపాగా అంచు ఛాతీమీది కొచ్చింది. జరీ అంచు తళుక్కుమంది.

"రతనాల వీధిలో చూశానులే. అప్పుడే అనుకున్నాను నీ వ్యాపారం బాగుందని. రత్నాల రాశులముందు మీ తమ్ముడు కూచున్నాడు. వైఢూర్యాలు, ముత్యాలు గూడా ఉన్నాయి గదా !"

"అవును. నేను సరకుల ఖరీదు చూసుకుంటున్నాను. తమ్ముడు దుకాణంలో కూచుంటున్నాడు. మన పెనుగొండ సామ్రాజ్యములోని సామంత రాజ్యాలన్నింటికీ సరుకులు పంపిస్తున్నాము. కెంపులు, పచ్చలు... నవరత్నాలన్నీ అమ్ముతున్నాము. నవరాత్రోత్సవాలు వస్తున్నాయి గదా. విజయదశమినాడు కన్యకాపరమేశ్వరి అమ్మవారికో రత్నకిరీటం అలంకరించాలనుకుంటున్నాము. రాజాస్థానము కళాకారుల పర్యవేక్షణలో కిరీటం తయారైంది. తుది మెరుగులు దిద్దుకుంటుంది."

కంకణుని మాటలు వింటుంటే పాలమీగడలో పంచదార కలుపుకు తిన్నట్టుంది పింగళునికి. ఇంకేవేవో దానధర్మాల గురించి మాట్లాడుకుంటున్నారు.

వ్యాపారములో బోలెడన్ని ఆస్తిపాస్తులు సంపాదించి, బాధ్యతలన్నీ కొడుకుల కప్పగించి, విశ్రాంత జీవితము గడుపుతున్న వృద్ధవైశ్యుడు గాంగేయుడు వచ్చి వారికెదురుగా కూచున్నాడు. నుదుట భస్మరేఖల మధ్య చందనం బొట్టు, తెల్లని తలపాగా, భుజాలమీద జరీఅంచు కండువా... చూడగానే గౌరవభావం రేకెత్తించే ఆకారం... గాంగేయునికి గౌరవంగా నమస్కరించారు.

ఇద్దరినీ ఆశీర్వదించి "ఏరా అబ్బాయిలూ ! నవరాత్రోత్సవాల్లో ఏంచెయ్యాలని మాట్లాడుకుంటున్నారా ?" అడిగాడు. పలుకరింపులో వాత్సల్యం ఉట్టిపడింది. చందనం బొట్టు ఆకాశంలో పున్నమి చంద్రునిలా కనబడింది.

"ఏదో... సరదాగా ! కాలక్షేపానికి కబుర్లు బాబాయ్ !" పింగళుడు నవ్వేశాడు. తాను అమ్మవారికి సమర్పించబోయే బంగారు కిరీటం గురించి చెప్పాడు కంకణుడు.

గాంగేయుడు తృప్తిగా నవ్వి

"మంచి పంజేస్తున్నవు నాయనా !" మెప్పుకోలుగా వీపు నిమిరాడు. కంకణునిలో ఉత్సాహం ఉరకలేసింది. పింగళుడు తాను చేస్తున్న, చేయబోతున్న దానధర్మాల గురించి చెప్పి

"బాబాయ్ ! నాకో విషయం చెప్పవా !" పసిపిల్లాడిలా అడిగాడు. గాంగేయుడు సర్దుక్కూచున్నాడు.

"ఏ విషయం నాయనా !"

"మన వైశ్యజాతి చరిత్ర పరమాద్భుతం గదా !"

"అవును తమ్ముడూ. అందులో అనుమానమేముంది ?" పింగళుడు.

"అనుమానం లేదుగానీ ఆదివైశ్యుల గురించి ఓ విషయం తెలుసుకోవాలనుంది."

"అడుగు నాయనా ! నాకు తెలిసినంత చెప్తాను. ఆ విషయం గుర్తుచేసుకుంటే నాకూ తృప్తి, మీకూ తృప్తి." ప్రోత్సాహించాడు గాంగేయుడు. కంకణునిలో ఉత్సాహం ఉరకలేసింది.

"మన పూర్వీకులైన వైశ్యులు ఎంతకాలము కైలాసములో ఉన్నారు ? ఏ సమయాన గోగర్భము నుండి గోకర్ణముల ద్వారా భూలోకానికొచ్చారు ? వివరంగా చెప్పు బాబాయ్."
"నాగ్గూడా వినాలనుంది బాబాయ్." పింగళుడు గూడా సర్దుక్కూచున్నాడు. ఆ విషయం పసికట్టిన చుట్టుపక్కల వారుగూడా వచ్చి గాంగేయుని ముందు కూచున్నారు. గాంగేయుని పెదాలమీద ఉల్లాసమైన చిరునవ్వు మెరిసింది.

నేనున్నానంటూ ఓ గాలి తెర... చెట్టుకొమ్మలు, రెమ్మల నూగించి శుభం పలికింది. చల్లగాలి కన్నతల్లిలా ఒళ్లంతా నిమిరింది. హాయిగా ఉంది.

"సరే నాయనాలారా వినండి. మన పూర్వీకులు వైశ్య వంశాలను కృత యుగములోనే భూలోకములో నిలపాలనుకున్నారు. ఆ ఆలోచననే వారితో వేలాది సంవత్సరాల తపస్సు చేయించింది. తరం తర్వాత తరం తపస్సు చేస్తూనే ఉన్నారు. ఆ తపస్సు ముందుకు సాగి స్వారోచిష మనువు కాలములో కఠినతరమైంది. పరమశివుని సాక్షాత్కారం కోసం పగలూ-రాత్రి తేడాలేకుండా ఘోరతపస్సు చేశారు. అందుకు త్రినేత్రుడు మెచ్చుకుని ప్రత్యక్షమైనాడు. మునులన బడే ఆనాటి వైశ్యులు భక్తితో పూజించి కైలాసనివాసము కోరుకున్నారు. పరమశివుడు ప్రసాదించాడు. అంతేకాదు "ఇంతకాలం తపస్సు చేసిన మీరు మహామునులన్పించుకున్నారు. కాబట్టి వైశ్యమునులుగానే పరిగణించ బడతారు." అని ఆశీర్వదించాడు.

అప్పట్నుంచి కాలంతో పోటీపడుతూ కైలాసములో సుఖంగా గడుపుతున్నారు. భూలోకానికికెళ్లాలంటే అందరికీ భయం. కాని ఎప్పుడో ఒకప్పుడు వెళ్లక తప్పదు. అప్పుడప్పుడు ఆ విషయం గురించి చర్చించుకుంటున్నారు.

"రోగాలు-రొచ్చులు, ఈతిబాధలకు నిలయమైన భూలోకానికిప్పుడెందుకులే !" అని కొందరంటారు.

"అదేమన్నా స్వర్గలోకమా, అంత తొందరపడి వెళ్లేందుకు ?" అని మరికొందరు టలాయిస్తున్నారు. ఏది ఏమైనా బ్రహ్మలోకములో బ్రాహ్మణులిచ్చిన శాపాన్ని అనుభవించక తప్పదాయె. ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ వాయిదావేస్తూ పోతున్నారు. వైవస్వత మనువు కాలములో, ఏడవ మహాయుగములో కైలాసము నుండి బయలుదేరక తప్పలేదు. అక్కడినుండి వారంతా శ్రీ మహావిష్ణువు దర్శనార్థం వైకుంఠము చేరుకున్నారు. పాలసంద్రములో శేషతల్పశాయియైన విష్ణుమూర్తిని ప్రార్థించి ఆశీస్సులందుకున్నారు. గోబిలములో ఆరొందలపన్నెండు గోత్రాల వైశ్యులతో నూటారెండు గోత్రాల సిద్ధవైశ్యులు కలిసి ఇరవయ్యేదవ మన్వంతరములోని కలియుగారంభములో గోకర్ణము నుండి భూమ్మీదికొచ్చారు. గోవుమఠములోంచి వచ్చారు కాబట్టి గోమఠులన్నారు. రానురాను గోవుమఠులే కోమటులైనారు."

"ఓహో ! అప్పుడే గదా మన కుసుమగుప్త ప్రభువుల వారి మూలపురుషుడు ఉద్వాహుడీ లోకానికొచ్చింది" హుషారుగా అన్నాడు పింగళుడు.

"అవునవును. భూలోకములో వారిగోత్రము ఉద్వాహునితోనే నిలిచింది." గాంగేయుడు ముగించాడు.

గుడిగంటలు గణగణ మ్రోగి అప్రమత్తం చేశాయి.

"అమ్మవారికి ఆరగింపు జరుగుతోంది. పదండి" అంటూ లేచాడు గాంగేయుడు. కంకణుడు, పింగళుడుతో సహా మిగితావారంతా అతని వెంట నడిచారు. తీర్థప్రసాదాలు స్వీకరించి తృప్తిగా వెనుదిరిగారు.

ఆశ్వీజమాసం. వరుణదేవుని కరుణ వర్షమై కురిసింది. వర్షాకాలం పెనుగొండ సామ్రాజ్యాన్ని సస్యశ్యామలం చేసింది. వ్యవసాయము, వాణిజ్యములో ఆరితేరిన వైశ్యులతో పాటు జనాలంతా సంతోషంగా ఉన్నారు. హలాలతో పొలాలు దున్ని నాట్లు వేశారప్పటికే. పల్లెసీమల్లో జానపదుల గుండెల్లోంచి జాలువారిన జ్ఞానపథ గీతాలకు పులకించిన తరుతరుణులు పచ్చని పీతాంబరాలు ధరించారు. కొమ్మలు-రెమ్మలు సన్నని గాలులకు లయబద్ధంగా తలలాడిస్తున్నాయి. మందారాలు, సంపెంగలు, సన్నజాజులు పిల్లగాలితో

సరసాలాడుకుంటున్నాయి. ఎటుచూసినా విచ్చుకున్న పచ్చదనం, కనువిందు చేస్తోంది. సామాన్యులు, అసామన్యుల గుండెల్లో సంతోష తరంగాలెగసిపడుతూ నవరాత్రోత్సవాలకు స్వాగతం పలుకుతున్నాయి. వర్షాల జోరు తగ్గుముఖం పట్టింది.

దేవీనవరాత్రోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమైనాయి.

ఆరోజు మహార్నవమి.

బాలనగరులు వాడవాడా ఆయుధపూజ నిర్వహిస్తున్నారు. పెనుగొండ పట్టణములోని అన్ని వాడల పూజలను విరూపాక్షుడు తన బృందముతో పర్యవేక్షిసున్నాడు. తగు సూచనలిస్తున్నాడు.

"సోదరులారా ! ఈ పండగ మన భారతీయ సంప్రదాయాల పట్టుగొమ్మ. త్రిమూర్తులు-త్రిమాతలు శక్తినంతా తానే స్వీకరించి అమ్మవారు మహాశక్తిగా అవతరించి లోకకంటకుడైన మహిషాసురుణ్ని వధించిన శుభ సందర్భము. వీరులకు, వీరవనితలకిది పర్వదినము." అంటూ కార్యకర్తల వెన్నుతడుతున్నాడు. అందరితో కలిసి వాసవి ఉత్సాహంగా పంజేస్తూ స్త్రీ శక్తి ప్రాముఖ్యతను మహిళాలోకానికి తెలియజేస్తుంది. "భారతనారి, వీరనారి, శక్తిస్వరూపిణి. తలుచుకుంటే ఎంతటి శక్తినైనా ఎదిరించి విజయం సాధించి తీరుతుం"దని మహిళా కార్యకర్తలనుత్సాహ పరుస్తుంది.

యౌవన ప్రాయాన్ని సంతరించుకున్న విరూపాక్షుడు పొడగాటి చేతులు, విశాల వక్షస్థలము, స్ఫురద్రూపముతో అపరమన్మథుడిలా కనబడుతున్నాడు. అస్త్ర శస్త్రవిద్యల్లో, సాటిలేని మేటి గుర్తింపు పొందాడు.

సాయంత్రం కన్యకాపరమేశ్వరాలయములోని విశాల మైదానములో అస్త్ర-శస్త్ర, ఖడ్గచాలన పోటీలు ఏర్పాటైనాయి. సామంత రాజ్యాలనుండి ఎందరో యువకిశోరాలు వచ్చారు. బాలనగరులు గూడా రెట్టింపు ఉత్సాహంతో పోటీల్లో పాల్గొంటున్నారు. అనుభవజ్ఞులైన క్రీడా నిపుణులు, అస్త్ర-శస్త్ర విద్యా పారంగతులు న్యాయనిర్ణేతలుగా హాజరయారు. కుసుమగుప్త మహారాజు, మంత్రిమండలి, దండనాథులు మొదలగు రాజపరివారముతో వైభవ ప్రాభవాలను విశ్వవ్యాప్తం చేస్తున్నాయంటారు పక్క సామ్రాజ్య ప్రజలు.

మైదానము జనాలతో కిటకిటలాడ్తోంది. కుసుమార్య ప్రభువు కన్యకాపరమేశ్వరికి నమస్కరించాడు. శాంతి మంత్రము పఠిస్తూ జ్యోతిప్రజ్వలన గావించాడు. దాంతో పోటీప్రదర్శనలు ప్రారంభమైనాయి. యువతీ-యువకుల సాహస ప్రదర్శనలు, పోటీలు అందరి నలరిస్తున్నాయి. కుస్తీ పోటీల్లో జమాజట్టీలు పాల్గొని పోటీలను రక్తి కట్టించారు.

ఖడ్గచాలన, ధనుర్విద్యలో విరూపాక్షుడు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కబడ్డీ పోటీల్లో పెనుగొండ పట్టణ యువకులకు ధీటుగా సామంత రాజ్యాల యువకులు తమ శక్తియుక్తులు ప్రదర్శించారు. గుర్రపు స్వారీలో గూడా అదే పరిస్థితి. ప్రేక్షకుల కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య యువశక్తి అందరి మన్ననలందుకుంది. కొన్ని పోటీల్లో పెనుగొండ పట్టణ యువకులు మరి కొన్నింటిలో సామంత రాజ్యాల యువకులు బహుమతు లందుకున్నారు.

ప్రతి చోటా క్రమశిక్షణ, ప్రతి ఆటలో క్రమపద్ధతి, క్రీడాకారుల పట్టుదలకు వన్నెలు దిద్దాయి. బహుమతి ప్రదానోత్సవములో కుసుమగుప్త మహారాజు క్రీడాకారుల్ని, ఔత్సాహికుల్ని అభినందిస్తూ

“మనం శాంతి కాముకులం. అహింస మన ఆయుధం. అలాగని ఎవరన్నా అన్యాయంగా, అధర్మంగా మనమీదికొస్తే సహించజాలము. ఎదిరించి అంతం చూస్తాము. అక్రమార్కుల నెదిరించేందుకు మన యువతీయువకులు భుజబలాన్ని, బుద్ధిబలాన్ని ప్రదర్శించాల్సి ఉంటుంది. అరాచకాల నణిచేందుకు సన్నద్ధులై ఉంటారు. అస్త్ర–శస్త్ర విద్యల్లో నిష్ణాతులై సామ్రాజ్య సరిహద్దుల్ని కంటికి రెప్పలా కాపాడడం యువత పవిత్ర కర్తవ్యం. కండబలముతోనే గుండె బలము. గుండె బలమే సామ్రాజ్యానికి శ్రీ రామరక్ష. మన పౌరులంతా వీరులుగా, ధీరోదాత్తులుగా తయారవాలనేది మన ఆశయం. యువతలో సోదరభావాన్ని, క్రీడా స్ఫూర్తిని ఇలాంటి క్రీడాపోటీలు రేకెత్తిస్తాయి. క్రీడాపోటీల్లో పాల్గొన్న వారందరికీ అభినందనలు” సంక్షిప్త సందేశాన్నందించాడు.

చివరగా వాసవి వేదికమీదికొచ్చింది. గానకళను మొదటిసారిగా నలుగురి ముందు ప్రదర్శిస్తూ... ముందు కన్యకాపరమేశ్వరి ప్రార్థనా గీతాన్ని ఆలాపించింది. ఆ తర్వాత కల్యాణి రాగములో కమ్మని గీతాలు, శివరంజని, మోహన రాగాలలో మరికొన్ని గీతాలను వినిపించి అందరి మనసులను ఆనంద డోలికలూగించింది. ప్రతిపాట స్వీయరచనే. ప్రతి రచనలో సంగీత–సాహితీ పటిమలుట్టిపడ్డాయి.

పాటలన్నీ విన్న వాసవి చెలికత్తెలు గర్వంతో ఊగిపోతున్నారు. మర్నాడు ఆ విషయాన్ని గుర్తుచేసుకుంటూ

“మన వాసవమ్మ ఎంత బుద్ధిమంతురాలో ! ఓ సారి ఉద్యానవనంలో నేను పూవు కోయబోతే వారించి ఈ పూవు నీకేం ద్రోహం చేసిందని నిలదీసింది. తల్లినుండి పిల్లనెందుకు వేరు చేస్తున్నావని అడిగింది.” ఓ చెలికత్తె అంటే

“నిజమే. నేనోసారి అలాగే చెయ్యబోతే అడ్డుకుంది. ఈ పూవుతోనే కాయ,

కాయతోనే పండు, పండులోని విత్తనాలతో మరో మొక్క... ఈ విధంగా జరుగుతున్న సృష్టికార్యాన్ని మనమెందు కాపాలంటూ కళ్లను విచిత్రంగా తిప్పేసింది." అంది.

"అవునే... అమ్మవారి అవతారాల గురించి, దేవీతత్వం గురించి చాలా విషయాలు చెబుతుంది. ఆ సరస్వతమ్మ గొంతులో కూచుందేమో... తియ్యగా పాడుతుంది గదూ !" ఇంకో యువతి అంది.

"ఓ సారి... దేవీ నవరాత్రుల గురించి చెప్తూ భారత మహిళ మహాశక్తి... ఆడది అబల కాదు... మర్యాదకు మంచిది దుర్మార్గుల పాలిట దుర్గామాత అన్నది. అబ్బో ! ఎన్ని తెలివితేటలో !" మరొకావిడ గుండెలమీద చెయ్యేసుకుంది.

ఎప్పట్లాగే విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని ముగింపు సభ జరుగుతుంది. సభలో సామ్రాజ్యము పరిధిలోని సామంతరాజులు, మేధావులు, విద్యాపారంగతులు, కవులు-కళాకారులు, వివిధ రంగాల్లో ఆరితేరిన నిష్ణాతులున్నారు. కుసుమార్య ప్రభువు ఆయా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తాడు.

సభావేదికపై కన్యకాపరమేశ్వరి తైలవర్ణ చిత్రముంది. వేదికకు ఒక పక్కన విదేశీ ప్రతినిధులున్నారు. వారందరి దృష్టి అమ్మవారి చిత్రము పక్కనున్న తులాధారుని రంగుల చిత్రము మీదుంది. సభాప్రాంగణము నిండా రంగురంగుల తోరణాలు, పూల మాలలు కనువిందుచేస్తున్నాయి. భారతదేశములోని ఇతర సామ్రాజ్యాల ప్రతినిధులకు ప్రత్యేక ఆసనాలేర్పాటు చేశారు. రాజగురువు భాస్కరాచారి ఉచితాసనాన్నలంకరించాడు. సభనంతా విహంగ వీక్షణం చేస్తున్నాడు.

పట్టువస్త్రాలు, నవరత్న మాలలు ధరించిన కుసుమగుప్తుడు సతీసమేతంగా సింహాసనమ్మీదున్నాడు. మణిమయ భూషితమైన కిరీటం కాంతులు, పెదాల చిరునవ్వులతో మమేకమవుతున్నాయి. వాసవి, విరూపాక్షులు తమ ఆసనాల నలకరించారు. జ్యోతి ప్రజ్వలతో సభ ప్రారంభమైంది.

ఆ స్థాన గాయకులు కన్యకాపరమేశ్వరి ప్రార్థనా గీతన్నాలాపించారు. పండితులు వేదమంత్రాలు పఠించారు. ప్రధానమంత్రి సవినయంగా సభకు నమస్కరించి అందరికీ స్వాగతం పలికాడు. కొత్త వారిని సభకు పరిచయం చేశాడు. ఆ తర్వాత

"ప్రజా జీవితానికి వ్యవసాయము, వర్తకవాణిజ్యాలు ఉచ్ఛ్వాస నిశ్వాసల్లాంటివి. రైతు చెమటోడ్చి పంటలు పండిస్తాడు. ఆ ధాన్యరాశులను వర్తకుడు ప్రజలందరికీ వితరణ చేస్తాడు. వ్యాపారం పవిత్రమైన వృత్తి. అది దేశభక్తితో కూడుకున్నదని మన ప్రభువుల వారెన్నో సార్లు చెప్పారు. తైత్తరేయ సంహిత, పురుష సూక్తము, ఋగ్వేదము,

యజుర్వేదాల్లో వైశ్యుల ప్రసక్తి ఉందని మన రాజగురువు శ్రీమాన్ భాస్కరాచార్యులు ఇంతకు ముందోసారి చెప్పిన విషయం మనందరికీ తెలుసు. శ్రీశ్రీ కుసుమగుప్త ప్రభువుల వారి పాలనలో శక్తియుక్తులతో పాటు దేశభక్తిగల వారికి మాత్రమే వ్యాపారం చేసేందుకు అనుమతి లభిస్తుంది. వ్యాపారములో మోసానికి తావు లేదు. విదేశాల కెగుమతి అవుతున్న సరుకుల్లో నాణ్యత ఏ మాత్రం లోపించినా దాన్ని దేశద్రోహంగా భావిస్తున్నాము. అలాంటి నేరాలకు కఠిన శిక్షలున్నాయని అందరికీ తెలుసు. కన్యకాపరమేశ్వరి ఆశీస్సులతో సాగుతున్న పాలనలో చాతుర్వర్ణాలవారు సుఖశాంతులనుభవిస్తున్నారు." తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

ఇప్పుడు మన రాజగురువు గారి ఆశీః ప్రసంగము విందాము" ప్రకటించాడు.

రాజగురువు భాస్కరాచారి ఆశీః ప్రసంగము అందరిలో ఉదాత్త భావాలను రేకెత్తించింది. ఆ తర్వాత ప్రధానమంత్రి

"మన ప్రియతమ ప్రభువులు శ్రీశ్రీ కుసుమగుప్తులవారు వివిధ రంగాల్లోని నిష్ణాతులను సన్మానిస్తారు." ప్రకటించాడు.

వ్యవసాయము, పశుపోషణ, వ్యాపార, సేవారంగములతో పాటు సంగీత, సాహిత్యాది కళా రంగాలలో విశేష కృషి చేసిన ప్రముఖులను కుసుమగుప్తుడు పట్టుశాలువా, బంగారు జ్ఞాపికలతో సన్మానించాడు. యుద్ధనిపుణులను, సాహసవీరులను, క్రీడానిపుణులను పట్టుశాలువా, రతనాల పిడిగల స్వర్ణఖడ్గాలతో సత్కరించాడు. వర్తకంలో ఆరితేరి, సింహళ రాకుమారిని ఓడదొంగల బారినుండి కాపాడిన వీరవరుడు, వైశ్యయువకుడు ధనగుప్తుడికి ప్రత్యేక సన్మానం జరిగింది.

ఆ తర్వాత సుమత్రాదేశము నుండి కర్పూరము దిగుమతి చేసుకుని రాజ్యాలన్నింటికీ సరఫరా చేస్తున్న లాభశ్రేష్ఠి, శ్రీగంధ సిందూరాదుల వ్యాపారి ప్రద్యుమ్నశ్రేష్ఠి, హోరముంజి (రేవు పట్టణము) నుండి మేలుజాతి గుర్రాలను తెప్పించి భారత ఖండములోని రాజ్యాలన్నింటికీ సరఫరా చేస్తున్న సౌమ్యశ్రేష్ఠి, జాప్నా ద్వీపంతో ముత్యాల వ్యాపారం చేస్తున్న రమణశ్రేష్ఠి, చీనాదేశంతో వస్త్రవ్యాపారం, భూటాన్ దేశంతో కస్తూరి, బంగారం, పారశీక దేశాలతో అత్తరు పన్నీరు వ్యాపారాలు చేస్తున్న యువకులు సత్కారాలందుకున్నారు.

వెంటనే కుసుమార్యుడు ముందుకొచ్చాడు. కిరీటం మెరుపులు భుజకీర్తుల తళత్తళలను ద్విగిణీకృతం చేస్తున్నాయి. సభలోని వారంతా సావధానచిత్తులైనారు.

"సభా సరస్వతికి నమస్సుమాంజలి." కుసుమగుప్త మహారాజు గొంతు గాంభీర్యం సంతరించుకుంది. "సభనలంకరించిన సామంతరాజన్యులు, మంత్రులు,


దండనాథాది సైనిక బలగాలు, సామాన్య, అసామాన్యులందరికీ విజయదశమి, నవరాత్రోత్సవ శుభాకాంక్షాలు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి కృపా కటాక్షవీక్షణములతో నేడు పెనుగొండ సామ్రాజ్యలక్ష్మి సుఖ శాంతులు, సకల సంపదలతో తులదూగు తోంది. మాతృభూమి ప్రజల, పాలితుల మమతాను రాగాలు, దేశభక్తులు శక్తి సామర్థ్యాలు ఇందుకు మూలకారణాలు.

మనజాతి సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుతున్న మహిళా లోకము, సామ్రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనిక బలగాలు మనకు గర్వకారణం. వ్యవసాయం–పశుపోషణ, వ్యాపార–వాణిజ్యాల్లో మనమెంతో అభివృద్ధి సాధించాము. అందుకు త్రికరణ శుద్ధిగా సేవలందిస్తున్న సాధారణ వృత్తుల వారికి మనమెంతో ఋణపడి ఉన్నాము. వర్తక, వాణిజ్యాల్లో ఇతర సామ్రాజ్యాల కంటే ముందున్నాము. అందుకు నిదర్శనము ఈ సభలో ఆసీనులైన విదేశీ ప్రతినిథులే. వారివెంట ఆయాదేశాల వ్యాపారవేత్తలున్నారు.

వర్తకం పవిత్రమైన వృత్తి, ముఖ్యమైన సమాజాసేవ. ఒకచోట దొరకని వస్తువులను మరోచోటి నుండి తెప్పించి, ప్రజలకు అందుబాటులో ఉంచడం శ్రమ, పెట్టుబడి, తెలివితేటలతో కూడుకున్నది. శ్రమకు తగిన లాభాన్నాశించేవాడు వ్యాపారి. మోసాన్నాశ్రయించి అధికలాభాలార్జించేవాడు మోసగాడవుతాడుగాని వ్యాపారి కాడు. ప్రజల విశ్వాసాన్ని నమ్ముకున్నవాడు వ్యాపారి, అమ్ముకున్న వాడు మోసగాడు. విదేశీయుల విశ్వాసాన్ని చూరగొన్న మన వాణిజ్యవేత్తలు ధైర్యసాహసాలతో ముందుకెల్తున్నారు. వేదికమీద, మన ముందు తులాధారుని చిత్రముంది. ఆ మహనీయుడు ధర్మబద్ధమైన వ్యాపారముతో పొట్టబోసుకుని, చతుర్విధ పురుషార్థాలను సాధించిన సాధుపుంగవుడు. అలాంటి మహాత్ముని స్మరించడము మన ధర్మము... ” చూపులు సామంతరాజులను తడుముతున్నాయి. అందులోంచి ఓ సామంతరాజు లేచి

“మహారాజా ! మహనీయుడైన తులాధారుని గురించి కొందరికే తెలుసు. దయచేసి ఈ తరం వారికి గూడా తెలిసేలా తులాధారుని గురించి సంక్షిప్తముగా తెలియజేయండి.” సవినయముగా అడిగాడు. “సరే వినండి” అంటూ ప్రారంభించాడు మహారాజు.

అదొక మహారణ్యము. దట్టమైన చెట్లు–చేమలు, తరు–లతాదులతో నిండి ఉంది. ఆ అరణ్యములో ఓ బ్రాహ్మణుడున్నాడు. అతని పేరు జాజిలి. నియమనిష్ఠలతో జీవితం గడుపుతున్నాడు. దగ్గరలో ఉన్న సముద్ర తీరానికి రోజూ వెళ్లి తపస్సు చేస్తున్నాడు.



కొద్ది కాల మలాగడిచింది. ఆ తర్వాత ఇల్లూ ముంగిలి మరిచి తపస్సులో మునిగాడు. ప్రకృతి మార్పులు, ఎండావానలకే మాత్రం చలించకుండా తపస్సు చేస్తున్నాడు.

కాలగమనాన్ని గమనించకుండా, బాహ్యప్రపంచాన్ని మరచి తపస్సమాధిలో లీనమైనాడు. తలవెంట్రుకలు, గెడ్డం బాగా పెరిగినా అతనికేమీ స్పృహ లేదు. నెత్తిమీద పెరిగిన వెంట్రుకలతో రెండు కుళింగ పక్షులు గూడుకట్టుకుని నివసిస్తున్నాయి. స్వేచ్ఛా జీవులైన ఆ పక్షులు ఉదయం ఆహారానికెళ్లి సాయంత్రానికి గూడు చేరుతూ జంటగా సంసారం చేస్తున్నాయి. గుడ్లుపెట్టడం, పొదగడం అన్నీ తలగూటిలోనే జరిగిపోతున్నాయి. పొదిగిన గుడ్లల్లోంచి బయటికొచ్చిన పక్షిపిల్లలు కిచకిచలాడ్తున్నాయి. అప్పుడు జాజిలికి స్పృహ వచ్చింది. అయినా చలించకుండా తపస్సు చేస్తున్నాడు. పక్షిపిల్లలు పెరిగి పెద్దవైనాయి. రెక్కలొచ్చి ఎగిరిపోయినై.

ఇక్కడో విషయం మనం గుర్తుంచుకోవాలి. ఆడ-మగ పక్షిజంట కలిసి ఒకసారి సంసారం చేస్తే, అవి విడిపోయినా మరో పక్షితో జత కట్టవు. అయితే పిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయినా కుళింగపక్షుల జంట తలగూటిలోనే ఉండిపోయింది.

ఘోర తపస్సుతో జాజిలి మునీశ్వరుడయాడు. కొంతకాలం తర్వాత కుళింగ పక్షుల జంట అతని తలగూడును వదిలి మానసరోవరానికెళ్లి పోయినై. అంతవరకు జాజిలి మునీశ్వరునిలో అహం గూడుకట్టుకుంది. తన తపస్సు ఫలించింద నుకున్నాడు. ఆనందోత్సాహాలతో లేచి నుంచున్నాడు. అప్పుడు ఆకాశం నుండి ఓ శబ్దం వినిపించింది. అటు చెవులుబెట్టి వింటున్నాడు.

"ఓయీ ! జాజిలి మహాషయా ! నీ తపస్సింకా ఫలించలేదు. నీ కింకా జ్ఞానోదయం కాలేదు." ఆకాశవాణి పలికింది.

జాజిలి సంతోషం పొంగులన్నీ కుంగిపోయినై. ఎదలో ఏదో గందరగోళం. పక్షిగూడులాగున్న శిరోజాలను సవరించుకుని విచారవదనుడైనాడు. చేతులెత్తి పైకి నమస్కరించి

"ఓ ఆకాశదేవతా ! నాకు ఆత్మజ్ఞానము కలిగి జ్ఞానోదయమవాలంటే ఎవరి నాశ్రయించాలో దయచేసి చెప్పు"మని ప్రార్థించాడు.

"కాశీ నగరములో తులాధారుడనే వర్తకుడున్నాడు. అతని ఉపదేశాన్నందుకుంటే నీ ప్రయత్నం ఫలిస్తుంది."

జాజిలి మునీశ్వరుడు చలించిపోయాడు.

జన్మతః బ్రాహ్మణుడిని. అరణ్యములో ఫలాలు, కందమూలాలు తింటూ జీవిస్తున్నాను. ఎంతోకాలం తపస్సు చేశాను. బ్రహ్మాంశ సంభూతుడనైన నాకంటే గొప్పవాడా వైశ్యుడు ? సరుకులమ్ముకుని పొట్టబోసుకునే కోమటి వద్దకు సద్బ్రాహ్మణుడినైన నేను వెళ్లి అర్థించాలా ?... కోపావేశము బుసకొట్టింది. హుటాహుటిన కాశీనగరం చేరుకున్నాడు. తులాధారుని ముందు నుంచున్నాడు. తులాధారుడు ఎవరితోనో వ్యాపార విషయాలు మాట్లాడ్తూ ఓ కంట జాజిలి ముఖ కవళికల్ని, హావభావాలను కనిపెడుతూ అతని అంతరంగాన్ని చదివేస్తున్నాడు.

"తులాధారుడంటే... నువ్వేనా ?" జాజిలి గొంతులో అహం ఛాయలున్నాయి.

"అవును జాజిలి మహర్షీ ! రండి... దయచేయండి. కూచోండి" ఆసనం చూపించాడు తులధారుడు.

ముందున్న వ్యాపారస్తులు మాటలు త్వరగా ముగించి వెళ్లిపోయారు.

"నా పేరు... నీకిలా తెలుసు ?" సందేహిస్తూ ఠీవిగా కూచున్నాడు జాజిలి.

"సర్వంతర్యామి దయతో ప్రసాదించిన దివ్యదృష్టితో !" గాల్లోకి చేతులెత్తి నమస్కరించాడు.

తుళ్లిపడ్డాడు జాజిలి.

దివ్యదృష్టా ! అది నాకింకా అబ్బలేదే ! నరాల్లోంచి పొంగుకొస్తున్న అహం ఎండలో మంచుముద్దలా కరిగిపోతోంది. కోపావేశముతో అల్లకల్లోలమైన అంతరంగము ప్రశాంతమవుతోంది. తల్లిరెక్కల కింద భయంభయంగా ఒదిగిన కోడిపిల్లలా కూచున్న తులాధారుని వినయవిధేయతలు గమనిస్తూంటే వీపుమీద చర్నాకోల దెబ్బపడ్డట్టనిపించింది.

"తపోధనా ! జాజిలి మునీశ్వరా !" తులధారుని ప్రశాంత వదనముపై చిరునవ్వు తొణకిసలాడింది." మీరు సత్సంకల్పముతో సముద్ర తీరాన చిట్టచిడవిలో తపస్సుచేస్తూ చాలాకాలం గడిపారు. అయినా లోపలి అహం అలాగే ఉండిపోయింది. తలమీది పక్షిపిల్లల కిచకిచలతో బలం పుంజుకుంది. ఆకాశవాణి సలహాతో ఆత్మజ్ఞానం పొందేందుకు శ్రమించి ఇంతదూరం వచ్చిన మీకు ఆతిథ్యమివ్వడం నా అదృష్టంగా భావిస్తున్నాను." భక్తి ప్రపత్తులతో నమస్కరించాడు.

జాజిలి ఆశ్చర్యానికంతులేదు. మనసులోని తుఫాను మాయమైంది. తులధారుని పట్ల గౌరవభావమేర్పడింది.

"మహానుభావా ! ఉదర పోషణార్థం ఉల్లిగడ్డలతోసహా రకరకాల సరుకులను అమ్ముకుంటూ వర్తకము చేస్తున్న మీకీ ఆత్మజ్ఞానమెలా అబ్బింది ?" అడిగాడు.

"వర్తకము నా వృత్తి మహాశయా !" తులాధారుని వర్చస్సు మరింత కాంతివంతమైంది. "ధర్మాచరణముతో చేసిన ఏ వృత్తియైనా పవిత్రమైనదే. నా వృత్తిని నేను ధర్మబద్ధంగా ఆచరిస్తున్నాను. వ్యాపారులు, వర్తకులు, వైశ్యుల పట్ల చులకనభావం ఉంది కాబట్టే అలా అడిగారు. శీలవంతుడైన మనిషి, పరోపకార బుద్ధితో ఏ వృత్తిని చేపట్టినా అది కర్తవ్య నిర్వహణే అవుతుంది. పొట్టబోసుకోవాలంటే ఏదోఒకటి చెయ్యక తప్పదు గదా ! చెప్పులు కుట్టడం, శవాలకోసం బొందలు తోడేవారు, పారిశుద్ధ్యం పనివారలు మొదలగు సేవావృత్తుల వారు ధన్యజీవులు. మనిషిలో మాధవుడిని చూడగల అలాంటి వృత్తుల వారికి రోజూ నమస్కరించినా తప్పులేదు, కాని ఏ ఒక్క వృత్తిని నీచంగా భావించినా అది అజ్ఞానమే అవుతుంది."

"నన్ను మన్నించండి మహానుభావా !" జాజిలిలో పశ్చాత్తాపం "అహం జ్ఞాన సముపార్జనకు అడ్డంగా నిల్చుందని ఇప్పుడే అర్థమైంది. మీ దర్శనం... సుదర్శనం, మహాభాగ్యం." చేతులు జోడించాడు.

"అందుకు మీరేమీ బాధపడాల్సిన అవసరం లేదు... " తులాధారుని సాంత్వన వచనాలు జాజిలి మానసభిత్తిపై చెరగని ముద్రలు వేస్తున్నాయి.

"దయచేసి నాకు ఆత్మజ్ఞానము బోధించండి మహాశయా !"

"ఆత్మజ్ఞానమంటే అదేదో ప్రత్యేక విద్యకాదు మునీశ్వరా ! చరాచర సృష్టిలోని జీవరాశులన్నీ సమానమేనన్న భావనతో ప్రవర్తించడము సర్వోత్తమము. అదే ఆత్మజ్ఞానము కలిగిస్తుంది. తత్త్వవేత్తయైన ధర్మవ్యాధుడు మాంసంతో వర్తకం చేసేవాడు, దాంతోనే పొట్టబోసుకునేవాడు. ఎవరన్నా సంశయం వెలిబుచ్చితే 'అమ్మడములో, కొనడములో మోసమేమీ చెయ్యడం లేదు. ధర్మబద్ధమైన లాభాన్నే ఆశిస్తున్నాను.' అంటూ సవినయంగా సమాధానం చెప్పేవాడు. కష్టసుఖాలను, దూషణ-ప్రశంసలను సమానంగా భావించిన ఆ మహనీయుడు మనకాదర్శం.

మానవ మాత్రులమైన మనం సంసారసుఖాలను ధర్మబద్ధంగా అనుభవిస్తున్నాము. అయినా... తేనెకుండలో ఈగలా అందులోనే కూరుకు పోరాదు. లౌకిక విషయాలపట్ల తామరాకుమీది నీటిబిందువులా అంటీఅంటనట్టు ఉండాలి. ఇలాంటి సాధనతోనే జనక మహారాజు, అంబరీశుడు రాజర్షులయారు."

"రాజర్షులా ! బాగుంది. కాని జనక మహారాజు జీవితములోని ఏదో ఒక సంఘటన మీనోటి ద్వారా వినాలనుంది మహానుభావా !" ఆసక్తిగా అడిగాడు.

"ఓ తప్పకుండా... వినండి !" హుషారుగా చెప్తున్నాడు. "జనకుడు రాజర్షి

ఎలాగయాడో తెలుసుకోవాలనే ఆసక్తితో ఓ సాధువు అతని ఆ స్థానానికెళ్లాడు. అప్పుడు జనక మహారాజు రాచకార్యాల్లో నిమగ్నుడై ఉన్నాడు. ప్రజల బాగోగుల గురించి మంత్రులు, సామంతులను అడిగి తెలుసుకుంటున్నాడు. పన్నుల విషయములో పకడ్బందీ చర్యల గురించి మాట్లాడుతున్నాడు.

సిరిసంపదలతో తులదూగుతున్న జనకుడు లౌకిక విషయాలనే చర్చిస్తున్నాడు. మరి... రాజర్షి ఎలాగయాడు ? ఇతణ్ని జ్ఞాని అన్నవారంతా అజ్ఞానులే అనుకున్నాడు సాధువు.

చర్చల తర్వాత జనకుడా సాధువును దగ్గరకు పిలుచుకుని "నీవు నాగురించే ఆలోచిస్తున్నావు. నేను తప్పు పనిచేస్తున్నా ననుకుంటున్నావు. ఇతరుల తప్పులు వెతుకుతున్న నీవు సాధువెలాగయావు ? నీ సమయమంతా తప్పులు వెదకడంతోనే గడిచిపోయింది. తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు. కాబట్టి నువు నేరస్తుడివి." అని "ఈ సాధువును వారం తర్వాత ఉరిదియ్యా"లని పరివారానికి సూచించాడు.

వెంటనే సాధువును బందికానాలో ఉంచారు. ఉప్పూకారం లేని భోజనం పెడ్తున్నారు. సాధువు ఆలోచనలు అతని మెడకు బిగుసుకుపోబోయే ఉరితాడు చుట్టూ తిరుగుతున్నాయి. ఉరితాడు మెడకు బిగుసుకుపోతుంటే ఎంత అవస్త అవుతుందో ! కాళ్లూ చేతులు కొట్టుకుని ఛస్తాను... అనుకుంటున్నాడు. తింటున్న ఆహారం రుచీపచి తెలియడం లేదు. వారంరోజుల మనోవేదనంతో చిక్కి శల్యమైనాడు.

వారం కాగానే సాధువును మహారాజు ముందుకు తెచ్చారు. జనకుడు ఉప్పుకలిపిన పాలను తెప్పించి తాగించాడతనితో. ఆ తర్వాత "సాధు మహాషయా ! పాలల్లో పంచదార సరిపోయిందా !" అడిగాడు.

సాధువు కళ్లు ధారాపాతాలైనాయి.

"ఈ వారం రోజుల్లో రుచీ-పచులన్నీ మరిచాను మహారాజా ! కన్నుమూసినా, తెరచినా ఉరికంబమే కనబడుతుంది. నా ప్రాణాలు హరించబోయే ఉరితాడు గురించే ఆలోచిస్తున్నాను. పాలరుచి గూడా నాకు తెలీలేదు." అన్నాడు తలవంచుకుని.

"మహాషయా ! ఈ వారం రోజులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నావు, తింటున్నావు. కాని... దృష్టి అంతా ఉరి మీదుంది. అలాగే నేను లౌకిక విషయాలు మాట్లాడుతున్నా, రాచకార్యాలు నిర్వహిస్తున్నా నా దృష్టి ఎప్పుడూ పారలౌకిక పరమార్థం పైననే లగ్నమై ఉంటుంది. ధర్మాచరణ ద్వారా దైవాన్ని చేరాలనే ఆలోచిస్తుంటాను. మనిషి మానసిక స్థితి గురించి మీకిప్పుడు బాగా తెలిసింది గదూ !

ఇకముందు ఇతరుల తప్పుల గురించి తక్కువగా ఆలోచించండి. పారమార్థికం గురించి ఎక్కువగా ఆలోచించండి. తపస్సులో నిశ్చలత్వం, ధ్యానములో ఏకాగ్రత అలవరుచుకోండి. ప్రాపంచిక విషయాలపై ఆసక్తి తగ్గించుకుని విశ్వమానవ కల్యాణం గురించి ఆలోచించండి." చెప్పి నమస్కరించాడు.

సాధువు జ్ఞాన నేత్రాలు తెరుచుకున్నాయి. తనను మన్నించుమని వేడుకున్నాడు. అప్పుడా సాధువును సత్కరించి

"ఉరిశిక్ష వేసింది మీ అజ్ఞానానికి, కాని మీ ప్రాణానికి కాదు. అజ్ఞానం తొలగి పోయింది, శిక్ష అమలైంది. ఇకమీరు వెళ్లవచ్చు." అని మర్యాదగా పంపించాడు జనకుడు.

మనిషిలోని అహం అజ్ఞానానికి నిదర్శనం. ఆత్మజ్ఞానమంటే ఇదే... " మరికొన్ని విషయాలు చెప్పి ముగించాడు తులాధారుడు. కొన్నిరోజులు జాజిలికి తన వద్దనే ఆతిథ్యమిచ్చి మరెన్నో విషయాలు బోధించాడు. చివరికి

"మీ నెత్తిమీద గూడుకట్టుకున్న కుళింగపక్షులు పరీక్షార్థమై ధర్మదేవత పంపించినవి." అన్నాడు. అప్పుడా కుళింగపక్షులు తమ దివ్యరూపాలతో ప్రత్యక్షమై ఆశీర్వదించినై.

ఆత్మజ్ఞానము సంపూర్ణముగా తెలుసుకున్న జాజిలి తులాధారునికి పాదాభివందనము చేసి

"మహాత్మా ! అనితర సాధ్యమైన ఇలాంటి ఆత్మజ్ఞానము మీకెలా అబ్బింది ?" అడిగాడు.

"మునీశ్వరా ! మనది సనాతన ధర్మము. ధర్మ సూక్ష్మాలు తెలిసిన బ్రహ్మజ్ఞానులను సేవించి తెలుసుకున్నాను. నిష్కామ కర్మ, అహంకార త్యాగము, సర్వభూత దయ, నిత్యభగవత్ ప్రార్థన నాకెన్నో పాఠాలు నేర్పినై."

తులధారుని బోధనలతో జాజిలి మహర్షి సంతసించి తిరిగి తపస్సుకోసం అడవికెళ్లాడు.

"తులధారుని కుమారుడు మణిగ్రీవుడు. అతని కుమారుడు జటిలుడు. జటిలుడు గార్గ్యమహర్షిని సేవించి యోగాభ్యాసం సాధించాడు. బ్రహ్మజ్ఞాని అయాడు. జటిలుని కుమారుడు భద్రుడు. భద్రుని కుమారుడు హయగ్రీవుడు. హయగ్రీవుని సుపుత్రుడు పద్మాక్షుడు విలాసజీవితం గడుపుతూ శూద్ర స్త్రీని వివాహమాడాడు. ఆ శూద్ర స్త్రీతో అతడు పొందిన సంతానమే శ్రావణ కుమారుడు. ఆ శ్రావణ కుమారుడే

దశరథ మహారాజు శబ్దవేది బాణానికి గురై మరణించిన సంగతి మనందరికీ తెలుసు.”

ప్రసంగం ముగించి కుసుమార్యుడు తులాధారుని చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించాడు.

విదేశీ ప్రతినిధుల్లోంచి సింహళ ప్రతినిధి లేచి

“మహారాజా ! మా సింహళ మహారాజు శ్రీశ్రీ విక్రమ వర్మ రాజావారు మీకో లేఖను, బహుమతిని పంపించారు. దయచేసి స్వీకరించండి” అంటూ చందనం పెట్టె చూపించాడు.

“రండి... !” కుసుమగుప్తుడు ఆహ్వానించాడు.

సింహళ ప్రతినిధి అందించిన లేఖను ప్రధాని కందజేసి అందాల చందనం పెట్టెను సభకు చూపించాడు. చందనం సువాసనలు సభలో గుబాళించినై. పెట్టెమీది నగిషీబొమ్మలు, చెక్కడాలు... ముందున్న వారి నాకట్టుకున్నాయి. లేఖ చదవాలని ప్రధానికి సైగ చేశాడు. ప్రధాని లేఖను విప్పాడు.

“మహా రాజమాన్య రాజపూజితులైన పెనుగొండ సామ్రాజ్యాధిపతి శ్రీశ్రీశ్రీ కుసుమగుప్త మహారాజు గార్కి సింహళ రాజ్యాధిపతి విక్రమవర్మ వందనాలు.

మీ పెనుగొండ వ్యాపారులు వర్తక-వాణిజ్యాల్లో ఆరితేరిన వారు. వారి ధైర్యసాహసాలు ప్రపంచ వ్యాపార వర్గానికి ఆదర్శప్రాయములు.

మీ వ్యాపారి శ్రీ ధనగుప్తుడు మా దేశముతో వర్తకము నిర్వహిస్తూ మన ఇరుదేశాల పరువుప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేస్తున్నాడు. అతడో సాహసవీరుడు. మా ముద్దుల కుమార్తె, రాకుమారి రత్నావళిని సముద్రచోరుల బారినుండి రక్షించిన ఘనుడు. మా కుమార్తెను క్షేమంగా మా వద్దకు చేర్చిన మహాయోధుడు. అలాంటి సాహస వర్తకుల నందించిన మీకు జోహార్లు. మీ సామ్రాజ్య ప్రజలకు మా అభినందనలు. చంద్రునికో నూలుపోగులా పంపిస్తున్న ఈ చిన్న కానుకను స్వీకరించి మన స్నేహబంధాన్ని బలోపేతం చెయ్యాలని కోరుతున్నాను. అభినందనలతో... ” ముగించాడు.

కుసుమ గుప్తునిలో ఆనందం పరవళ్లు తొక్కింది. ధనగుప్తునికి వద్దకు స్వయంగా వెళ్లి హృదయానికి ఆప్యాయంగా హత్తుకున్నాడు. అభినందనలతో సత్కరించి

“దయచేసి ఆ సంఘటన పూర్వాపరాలను మాకందరికీ వివరించండి.” కోరాడు.

“మహారాజా !” ధనగుప్తుడు అమితానంద భరితుడైనాడు. “సింహళ రాజేంద్రుని సౌభ్రాతృత్వం, మీ సౌజన్యాన్ని నేనెన్నడూ మరువలేను.

నేనా రోజు సింహళ దేశములో పనులు ముగించుకుని నా ఓడలో సముద్ర యానంచేస్తూ మన రాజ్యానికి తిరుగుప్రయాణమైనాను. సింహళ దేశముతో వ్యాపారం ప్రోత్సాహకరంగా ఉంది. నా నౌకా పరివారము, రక్షకులతో సరదాగా ముచ్చటిస్తూ, సముద్రము అందాలను కనువిందు చేసుకుంటున్నాము. సముద్రము మధ్యకొచ్చే సరికి ఓ ఆడకూతురు అరుపులు, అంగలార్పులు, కేకలు వినబడ్డాయి. మా అందరి దృష్టి అటు మళ్లింది. మా వెనక వస్తున్న మరో ఓడలో సముద్ర దొంగలు ఆడమనిషిని బంధించారని అర్థమైంది. వెంటనే కనుసైగలతో మా ఓడ రక్షణ దళాన్ని రంగములోకి దింపి, నా వెంట ఆ ఓడ వద్దకు తీసుకెళ్లాను. మేమంతా ఆ ఓడలోకి దూకి ఓడదొంగల తలల్ని మా కత్తులకు బలి ఇచ్చాము. దొంగలు గూడా బలాఢ్యులే కాని వారి ప్రతిఘటన మా ముందు నిర్వీర్యమైపోయింది. ఆడకూతురును సురక్షితంగా మా ఓడలోకి తీసుకొచ్చాము. ఆమెకు ధైర్యం కల్పించి "మీరెవరు ?" అని అడిగాను. అందుకామె భయం గుప్పిట్లోంచి బయటపడుతూ

"నా పేరు రత్నకుమారి. సింహళ దేశ రాకుమారిని. మా తండ్రి విక్రమసింహ మహారాజు. సరదాగా సముద్రతీరాన విహరిస్తున్నాను. దొంగలు వెనుకనుంచి వచ్చి, మా చెలికత్తెల్ని బెదిరించి, నన్ను బంధించి తెస్తున్నారు. ఆపద్బాంధవుడిలా మీరు కాపాడారు." అంది.

మంచి మాటలతో ఆమెకు మరింత ధైర్యం నూరిపోసి దొంగల నుండి స్వాధీనం చేసుకున్న ఓడలోనే మా రక్షకదళం సాయంతో రాకుమారి రత్నకుమారిని క్షేమంగా వారి తండ్రివద్దకు చేర్చాను. కన్యకాపరమేశ్వరి కృపతో మేమీ సాహసనికి దిగాము."

కరతాళ ధ్వనులతో సభ మార్మోగింది. చివరగా వాసవి వీణావాయిద్యంలో కొత్తరాగాలు వినిపిస్తూ, రెండు కొత్త పాటలు వినిపించింది. నూరుకోయిలలు ఒకేసారి గొంతెత్తి పాడినట్టున్న ఆ స్వరమాధుర్యం వీనుల విందు చేసింది.

కాలం కౌగిట్లో దొర్లుతూ వాసవి, విరూపాక్షులు యవ్వన ప్రాయులైనారు.

కులగురువు, రాజగురువైన భాస్కరాచారి సలహాపై కుసుమగుప్తుడో శుభ ముహుర్తాన విరూపాక్షుణ్ని యువరాజుగా ప్రకటించాడు. పట్టాభిషేక మహోత్సవం నిర్వహించి అందరి మన్ననలందుకున్నాడు.

యువరాజు కిరీటము విరూపాక్షుని ఆత్మవిశాస్వసాన్ని రెట్టింపు చేసింది. బాధ్యతలను గుర్తు చేసింది. నిత్య పరిపాలనలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సమయసందర్భాలు దొరికినప్పుడల్లా అక్క వాసవితో మాటామంతి నెరపుతూ కొత్త విషయాలు చర్చిస్తున్నాడు.

# 8

అది పద్మశయన పురము. పెనుగొండ పక్క సామ్రాజ్యానికి రాజధాని నగరము. అందమైన అంతఃపురములో సుందరమైన పడకగది... అదే శయన మందిరము.

తియ్యని గొంతులోంచి కమ్మని పాట... వసంత కోయిల పసందు గానాన్ని మైమరపించే గంధర్వగాన మాధుర్యము చెవులకు సోకి ఒళ్లంతా గిలిగింతలు పెడుతోంది. ఎదలో పులకింత... ఎన్నడూ కనీవిని ఎరుగని సరికొత్త అనుభూతి ఏదో చేస్తోంది. పట్టుపరుపుపై పవళించి నిద్రావస్థలో ఉన్న విష్ణువర్ధన మహారాజు ఉలిక్కిపడి లేచి కూచున్నాడు. హంసతూలికా తల్పము అదిరిపడింది. పక్కన గాఢనిద్రలో మునిగిన రాణి విమలాదేవినా కదలిక అతలాకుతలం చేసింది. ఆందోళనగా కళ్లు తెరిచింది. కిటికీలోంచి కోట ప్రాకారం కనబడింది. ప్రాకారం పైన పున్నమి చందమామ... వెన్నెల సోయగాలు విరజిమ్ముతోంది. నడిరేయి దాటింది. పక్కన ప్రాణేశ్వరుడు... పద్మశయన సామ్రాజ్యాధినేత విష్ణువర్ధన మహారాజు. దీపం వెలుగులో దేని కోసమో అటూ, ఇటూ చూస్తున్నాడు. మొహమ్మీద ఆందోళన... మంచం దిగి నుంచున్నాడు.

ఇదేమిటీ ! ఓ సామ్రాజ్యాధినేత... సామంతుల నీరాజనాలందుకుంటున్న మహారాజు, ఎప్పుడూ సంతోష తరంగాల్లో తేలిపోయే మహాసామ్రాజ్యాధిపతి... ఎందుకిలా... సందేహం పొటమరించింది. మెల్లిగా మంచం దిగింది. భర్త భుజాలు పట్టి మంచమ్మీద కూచో బెట్టింది. దీపకాంతిని పెంచి తిరిగి వచ్చింది. కాలి అందియల రవళి, చేతి గాజుల గలగలలో కలిసి నాట్యభంగిమ ధ్వనిలా వినిపించింది. అది విష్ణువర్ధనునికి మాత్రమే వినిపించింది.

“ఎవరు... ఎవరూ ?” విష్ణువర్ధనుడు దిగ్గున మంచం దిగాడు. తాను వేటాడిన జింక వెంట పరుగెడుతున్న వేటగాడిలా అటూ, ఇటూ గది నలుమూలలా వెతుకుతున్నాడు.

“ప్రభూ ! ప్రాణేశ్వరా ! నేను... మీ అర్థాంగిని... ” అపురూప సౌందర్యవతి రాణి విమలాదేవి వచ్చి ఎదురుగా నుంచుంది. సూర్యబింబము లాంటి కుంకుమబొట్టు ఒకింత చెదిరి ఉంది. కిటికీల్లోంచి చొచ్చుకొచ్చిన సుమ సౌరభాల నాఘ్రానిస్తూ భర్తను తేరిపార చూసింది.

మహారాజు స్పందించలేదు. ముఖ కవళికల్లో మార్పు లేదు. రాణి హృదయ స్పందన రెట్టింపైంది.

"ప్రభూ ! ఏమిటా పరాకు ? ఇటు చూడండి. నా మోహంలోకి చూడండి." ఆందోళన నదిమిపెట్టి గలగలా నవ్వింది. హిమాలయాలు దిగుతున్న గంగాఝరి సవ్వడిలాగుందా నవ్వు. భర్త చేతులందుకోబోయింది.

"పాట... ఆ పాట ఎక్కడా ? ఆ గంధర్వగానం... ఎవరి గొంతు ? ఎవరక్కడా ! అంటూ గుమ్మం వైపు పరుగెత్తాడు మహారాజు. గానమాధుర్యం అతని చెవిలో గంతులేస్తోంది.

"ప్రభూ... మహారాజా !" మహారాణి వెంబడించింది.

గబగబా గది తలుపులు తీసి బయటికొచ్చాడు. అంతఃపురమంతా తిరుగుతున్నాడు. రాణి వెంబడిస్తోంది. గుండెలు బిగపట్టుకుని గంట మ్రోగించింది. అంతఃపుర రక్షక భటులు బిలబిలమంటూ వచ్చేశారు. అయోమయంగా రాజువెంట నడుస్తున్నారు.

"పలుక రేమిటి ప్రభూ ! మీకేమైంది ?" రాణి అడుగుతూనే ఉంది.

విష్ణువర్ధనుడు పలుకలేదు. వెర్రిగా దిక్కులు చూస్తూ, పరదాలను తొలగించి వెతుకుతూ ద్వారం వద్దకొచ్చాడు. భటులు ద్వారం తెరిచారు. బయట ఉద్యానవనమంతా తిరిగాడు. పొదల మాటున, చెట్ల చాటున వెతికి నిరాశగా పెదాలు చప్పరించాడు. ఏదో గుర్తుకొచ్చినట్లు పరుగెత్తి అంతఃపురములో చొరబడ్డాడు. శయన మందిరం చేరుకున్నాడు.

విమలాదేవి మందిరములో కెళ్లి తలుపులు మూసేసింది. మహారాజు చేతులందుకని

"ఇదేమిటి ప్రభూ ! ఏమిటీ వింత ? ఈ రోజు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు ?" అడుగుతూ శయ్యవైపు నడిపించుకెళ్లింది. హంసతూలికా తల్పముపై కూచోబెట్టి తాను పక్కన కూచుంది. గుండెల్లోని గుబులు బయటికి పొక్కకుండా జాగ్రత్తపడుతూ ఒడిలోకి చేర్చుకుంది.

"విషయమేమిటో చెప్పకుండా మీ ప్రాణేశ్వరినిలా వణికించడం బాగుందా ? మీకిది న్యాయమేనా ప్రభూ ?" గోముగా వీపు నిమిరింది.

"విమలా ! మానవజాతి ఊహకందని అపురూప జవ్వని... ఓ సౌందర్యరాశి... ఇలలో ఎన్నడూ కనిపించని సుందరాంగి అలలా కన్పించింది. తేనెలూరించే తియ్యని గొంతులో కమ్మనిపాట... గంధర్వగానం వినిపించింది. కళ్లు తెరిచి చూద్దును గదా ఏమీ కన్పించలేదు. ఎంత వెతికినా కనబడుట లేదు. ఆ గానమాధుర్యం మాత్రం

నాకింకా వినబడుతూనే ఉంది. ఆ జవ్వని కోసం, ఆ గంధర్వ కన్యకోసం మనసు పరుగెడుతోంది దేవీ !"

విమలాదేవి మనసులోని దుమారం కొంత సద్దుమణిగింది. గట్టిగా ఊపిరి పీల్చుకుంది. "మనిషి మనసు చంచలమైంది ప్రభూ ! కనబడని దానికోసం పరుగులెందుకూ ? అదో పీడకల మహారాజా ! కలలన్నీ అద్దంలో నీడలే. ఎంత అందంగా కన్పించినా చేతికందవు గదా ! అదంతా మరిచి హాయిగా నిద్రించండి." ఒడిలోంచి పడక మీదికి తరలించి పడుకోబెట్టింది. దీపకాంతి తగ్గించి తానూ ఒరిగింది.

ఈనాటి రాజమహేంద్రవరమే ఆనాటి పద్మశయన పురము.

ప్రజా సంక్షేమమే ప్రభువుల పరమావధిగా భావించిన క్షేముని పౌత్రుడు విష్ణువర్ధనుడు. పెద్దల అడుగుజాడలలో పయనిస్తూ పరిపాలన సాగించిన విజయార్కుడు–చారుమతిదేవిల కుమార రత్నము. అరివీర భయంకరుడై, రాజ్య విస్తరణ కోసం పలుయుద్ధాలు చేసి ఎన్నో విజయాలు సాధించాడు. గలగల పారే గోదావరి నది ఒడ్డున కళామతల్లి గజ్జెకట్టి నర్తిస్తున్న సుందర నగరము పద్మశయన పురము. అదే అతని సామ్రాజ్యానికి రాజధాని నగరము. పద్మశయన పురానికి పలు హంగులు చేకూర్చి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు. విజయాలకు గుర్తుగా రాజసూయ యాగము చేసి విజయధ్వజా న్నెగరవేశాడు.

స్వతహాగా అందగాడు. వేదాధ్యయనంతోపాటు సకల శాస్త్రాలల నభ్యసించిన వాడు. ప్రజా మనోరంజకముగా పాలన సాగిస్తూ కేళీవిలాసాల కౌగిట్లో బందీ అయాడు. అయినా ఇంకా రాజ్యాలను జయించాలనే కోరిక తీరలేదు.

పక్కనున్న పెనుగొండ సామ్రాజ్యముతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నాడు. లలిత కళలను పోషిస్తున్నాడు.

అంతటి విష్ణువర్ధన మహారాజు ఇలా బేలగా, అర్ధరాత్రి వెర్రివానిగా పరుగులు తీయడం రాజ పరివారాన్ని, పాలనా యంత్రాంగాన్ని అయోమయంలో ముంచెత్తింది.

తెల్లవారే సరికి ఆ వార్త ప్రధానమంత్రి విజయసింహుని ద్వారా దండనాయకుల దాకా వెళ్లింది. ముఖ్యమైన వారంతా అంతఃపురము చేరుకున్నారు. విష్ణువర్ధన మహారాజు ఈశ్వరార్చన ముగించేలోగా రాణి విమలాదేవి అంతా పూసగుచ్చినట్టు చెప్పేసి ఆ స్థాన జ్యోతిష్కులను పిలిపించాలని కోరింది.

రాజగురువు రంగప్రవేశం చేశాడు. జ్యోతిష్కుల చేతుల్లో పంచాంగాలు రెక్కలు విప్పుకున్నాయి. వేళ్ళ మీద లెఖ్కలు వేశారు. సంఘటన సమయాన్ని రాజుగారి

జన్మకుండలితో సమన్వయపరిచి తరచితరచి చూశారు. తమలో తాము గుసగుస లాడుకున్నారు.

ఏదో దుష్టశక్తి ప్రభావమని రాజుగారి కనుకూలముగా ఉన్న గ్రహాలు స్థానాలు వదిలి పోయేందు కుద్యుక్తమవుతున్నాయి. ఫలితం సుస్పష్టం కాకపోయినా ఏదో విపత్తు రాబోతుందని లెఖ్ఖల్లో తేలింది. చర్చల సారాంశాన్ని ప్రధాన జ్యోతిష్కుడు రాణి విమలాదేవి సమక్షములో రాజుగార్కి

"మహారాజా ! మీ జాతక చక్రమును క్షుణ్ణంగా పరిశీలించాము. ఇప్పటి వరకు మీకు అనుకూలముగా ఉన్న గ్రహచార స్థితిలో మార్పు రాబోతుందనిపిస్తుంది. దాని ప్రభావమే మీ మనసును వక్రమార్గం పట్టించాలని ప్రయత్నిస్తుంది." విన్నవించాడు.

రాజదంపతుల ముఖకవళికలు మారాయి.

"దీనికేదైనా ఉపాయముంటే చెప్పండి." రాణి విమలాదేవి చేతులు జోడించింది. విష్ణువర్ధనుడు పరధ్యానంగా ఉన్నాడు. రాత్రి సంఘటనను గుర్తుచేసుకుంటున్నాడు.

"మహారాణి గారూ !" ప్రధాన జ్యోతిష్కుడు పంచాంగం మూసేసి మెడలోని రుద్రాక్షమాల సవరించుకున్నాడు. "కాలపురుషుని కనుసన్నలలో గ్రహాలు ఎప్పుడెటు పయనించాలో నిర్ణయించుకుంటాయి. విధాత లీలలలో భాగస్వాములై కదుల్తూ మానవ మాత్రులకు శుభాశుభాలు ప్రసాదిస్తుంటాయి. ప్రభువుల వారిని గ్రహదోషం పట్టి పీడిస్తుంది. దోషం తొలగాలంటే నిత్యశివ పూజలు, శాంతి కార్యక్రమాలు చేయించాలి." శాంతిపూజ విధివిధానాలను వివరించాడు.

రాజగురువు ఆమోదముతో పూజలు నిర్వహించారు. రాణి విమలాదేవి పార్వతీ పరమేశ్వర పూజల్లో నిమగ్నమైంది.

ఇక నాకేమీ ఢోకాలేదు... విష్ణువర్ధనుడాలోచిస్తున్నాడు. యుద్ధ విద్యాప్రవీణులు, గజ–తురగ–రథ–పదాది దళాలెన్నో ఉన్నాయి. నా సామ్రాజ్యానికే ఆపదా లేదు. సమర్థులైన సైనికులు, పటిష్ఠమైన గూఢాచార వ్యవస్థ నా సొంతము. నాకపకారము తలపెట్టిన వారి గుండెల్లో నిద్రపోతానని సామంతరాజులకు, ఇరుగుపొరుగు సామ్రాజ్యాధిపతులకు తెలుసు... అదే ఆలోచన ఆత్మవిశ్వాసాన్ని గట్టిపరిచింది.

అతని కుమారుడు రాజనరేంద్రుడు యవ్వన ప్రాయుడవుతున్నాడు. వేదవేదాంగాలభ్యసించి అస్త్ర–శస్త్ర విద్యల్లో ప్రావీణ్యత సంపాదించాడు. తండ్రి మానసిక పరిస్థితి గురించి తల్లిద్వారా విని చలించిపోయాడు. తల్లి అశ్రుధారలు తుడిచి "నీకు నేనున్నానమ్మా !" అని ధైర్యం చెప్పాడు. "కొద్ది రోజుల్లో నా గురుకుల విద్య ముగుస్తుంది.

ఆ తర్వాత ఇంటికొచ్చి అంతా చూసుకుంటా" నన్నాడు. ఆ మాటల్లో పట్టుదల ద్యోతక మైంది.

బుద్బుధ ప్రాయమైన జీవితములో కష్టసుఖాలు రాత్రింబవళ్లలా వస్తూ పోతుంటాయి. అలాగని సుఖజీవితాన్ని, విలాసాలను తనివిదీరా అనుభవించకపోవడం మూర్ఖత్వమే. సుందరాంగుల అందచందాలననుభవించి తీరాల్సిందే. అప్సర్సల్లాంటి నాట్యాంగనల అధరామృతాన్ని హాయిగా గ్రోలాల్సిందే. వయసులో ఉన్నప్పుడే శృంగార జీవితం గడపకపోతే వృద్ధాప్యంలో పశ్చాత్తాప పడాలి... విష్ణువర్ధనుని ఆలోచనా ధోరణి బలపడింది.

ఎక్కువ సమయం విలాస మందిరములో గడిచిపోతుంది. చేతిలో మధుపాత్ర, కౌగిట్లో మగువ... రాత్రి, పగలుకు తేడా తెలీడం లేదు. అయినా ఆనాటి మధుర ధ్వని చెవిలో ప్రతిధ్వనిస్తూనే ఉంది, సౌందర్యరాశి రూపం కళ్లల్లో కదుల్తూనే ఉంది. దాంతో పిచ్చెక్కి పోతుంది. ఎవ్వరికీ కనబడని దానికోసం మనసు పరుగెడుతుంది. ఆ పరిస్థితి నధిగమించేందుకు మరింత మధువు, మరికొందరు మగువుల బిగి కౌగిలి... ఇదే లోకమైపోయింది. రాజ్యపాలనలో ఆసక్తి లేదు. రాజ్యాంగ విధులు, సామంతుల నుండి రావాల్సిన నిధులు, ప్రజల స్థితి గతులు... ఇవేవీ పట్టించుకునే పరిస్థితి లేదు.

ధారుణాన్ని తట్టుకోలేక రాణి విమలాదేవి మనసు క్షోభిస్తుంది. చతురంగ బలాలను, దళాధిపతుల్ని కనుసైగలతో నియంత్రించే మహారాజు చతురాంగనల కనుచూపుల్లో, కౌగిళ్లలో కరిగిపోతున్నాడు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఫలితాలు భయంకరంగా ఉంటాయి. తనమాట వినే పరిస్థితిలో లేడు కాబట్టి రాజగురువు పాదాలచెంత మోకరిల్లింది. మహారాజ వ్యవహారశైలిని వివరించి

"గురువర్యా ! పాడిపంటలు, శాంతి సౌభాగ్యాలతో తులదూగుతున్న పద్మశయన సామ్రాజ్యము పటిష్ఠమైన పాలనకు దూరమవుతుంది. పరువు ప్రతిష్ఠలను కోల్పోతుంది. యథారాజా తథాప్రజ అన్నట్టు మహారాజు శీల భ్రష్టతను మన ప్రజలు ఆదర్శంగా తీసుకుంటే ఈ సామ్రాజ్యం రాక్షస రాజ్యమైపోతుందేమోనని భయమేస్తుంది. మహారాజు మనసు మార్చేందుకు మన ప్రధానామాత్యులు, శ్రేయోభిలాషులు ఎన్ని ప్రయత్నాలుచేసినా ఫలితాన్నివ్వడం లేదు. చిరంజీవి రాజనరేంద్రుడింకా గురుకులములోనే ఉన్నాడు గదా ! ఇప్పుడేం చెయ్యాలో చెప్పండి." కంటతడి పెట్టింది.

రాజగురువు వాలకం గాంభీర్యాన్ని పులుముకుంది.

"అమ్మా ! మధువు మానవమాత్రులను ఉన్మాదులుగా మార్చేస్తుంది. అధిక మధుసేవనం అనర్థానికి దారితీస్తుంది. కర్తవ్యం గుర్తుకు రానివ్వదు. మానసికాందోళనను తాత్కాలికంగా ఉపశమింపజేసినా శాశ్విత అనారోగ్యానికి కారణమవుతుంది. దానికి

తోడు శృతిమించిన శృంగారం చేటు కలిగిస్తుంది. ఎవరు చెప్పినా విననివారిని ఆ పరమేశ్వరుడే మార్చాలి.

"దానికి మనమేం చెయ్యాలో సెలవివ్వండి గురువేవా !"

"ఆశ్రిత వత్సలుడు, ఆదిభిక్షువు, ఆ పరమ శివుడే మనకిప్పుడు శరణ్యం. ఆ మహదేవుని ఆశీస్సుల కోసం ఉమామహేశ్వర వ్రతమాచరించాలమ్మా. ఆ బోళాశంకరుడు భక్తవశంకరుడమ్మా !" సలహా ఇచ్చాడు. పురోహితులను పిలిపించి వ్రత విధానాన్ని వివరించాడు.

రాణి విమలాదేవి పట్టువీడలేదు. ఉమామహేశ్వర వ్రతాన్ని ప్రారంభించింది.

మితిమీరిన పాలకుల స్వసుఖాలు పరిపాలన పాలిట శాపమైపోతాయి. ఆసురీ శక్తుల ఆటలకు ప్రోత్సాహం లభిస్తుంది... ఆలోచనలతో ప్రధానామాత్యుడు పూనుకున్నాడు. గూఢాచార విభాగాధిపతి, ప్రధాన గూఢాచారులతో సమావేశమయాడు. పరిస్థితులను తెలుపుమన్నాడు.

"సామంత రాజ్యాలలో అక్కడక్కడా అంతఃకలహాలు చెలరేగుతున్నాయి. వాటిని వెంటనే అణచివేయాలి."

"ప్రజాప్రముఖులకు, సామంత రాజులకు మహారాజు విష్ణువర్ధనులవారి చేష్టలు తెలిసిపోతున్నై. ఎవరేక్షణాన స్వతంత్రులైపోతారో తెలీడం లేదు. అందరికి కాకపోయినా కొందరికైనా దురాలోచన రావచ్చు. మనం దూరాలోచనతో చర్యలు తీసుకోవాలి."

"మహారాజు గారి దాయాదులు దీన్నే అదునుగా తీసుకోవచ్చు. వారు పరాయి రాజులతో కలిసి కుట్రలు, కుతంత్రాలకు పాల్పడవచ్చు. అలాంటి సూచనలు చూచాయగా కనబడుతున్నాయి... "

వేగుల వార్తలు ప్రధాని విజయసింహుడిని కలవరపరిచాయి. వెంటనే సర్వసైన్యాధ్యక్షుడిని, మంత్రిమండలిని రాజగురువు సమక్షములో సమావేశపరిచాడు. విషయాలన్నీ విని రాజగురువు సలహా ఇచ్చాడు.

"మీరంతా కలిసివెళ్లి మహారాజు గారికి వాస్తవాలను వివరించండి. కర్తవ్యోన్ముఖుల్ని చెయ్యండి."

అందరితో కలిసి ప్రధాని రాజమందిరం చేరుకున్నాడు. విజ్ఞుడైన రాజభటుడ్ని పిలిచి

"మేమంతా మహారాజు గారితో మాట్లాడాలి. నువు విలాస మందిరానికెళ్లి అనుమతి అడిగిరా ?" ఆదేశించాడు.

రాజభటుడు విలాసమందిరానికెళ్లాడు. లోపలికెళ్లేందుకు అనుమతి లభించలేదు.

"ఎవరొచ్చినా లోపలికి అనుమతించరాదని మహారాజు గారి ఆదేశం." ద్వార పాలకుల కరాఖండిగా చెప్పేశారు.

అదే విషయం ప్రధానికి విన్నవించాడు రాజభటుడు. మంత్రిమండలి నివ్వెరబోయింది.

"మనమే స్వయంగా వెల్దాం పదండి." విజయసింహుడు బయలుదేరాడు. అందరూ అతని వెంట నడిచారు.

విలాస మందిరము ముందు ఎంతసేపు ఎదిరిచూసినా మహారాజుగారి దర్శనం లభించలేదు. లోపలి నుండి పిలుపు రాలేదు. ఎన్నిసార్లు ద్వారపాలకులు చెప్పినా మహారాజు బయటకు రాలేదు.

"ప్రతీహారీ ! ద్వారాపాలకులారా ! మీరు పక్కకు జరగండి. మేమే స్వయంగా లోపలి కెల్తాం." ప్రధాని విజయసింహుడు ఆజ్ఞాపించాడు. లోపలి విషయాల నెప్పటికప్పుడు కనిపెడుతున్న ప్రతీహారి

"క్షమించండి దొరా ! లోపలి దృశ్యాలను మీరు చూడలేరు. మహారాజుగారు మన లోకములో లేరు. ఆ తర్వాత మీ ఇష్టం." తలవంచి నిస్సహాయత వెలిబుచ్చాడు.

రాణి విమలాదేవి చేస్తున్న ఉమామహేశ్వర వ్రతము చివరిదశ కొచ్చింది. మర్నాడు ఉద్యాపన పూజతో ముగుస్తుంది. ప్రధాని, మంత్రిమండలి బృందము రాణి విమలాదేవిని దర్శించి తమ అనుభవాన్ని వివరించారు. రాణి మోహం నిర్మలంగా ఉంది. వెంటనే గాంభీర్యాన్ని సంతరించుకుంది.

"ఈ సారి నేనే వెల్తాను." అంది ధైర్యంగా. "మీరు సామ్రాజ్య పాలనను సవ్యంగా సాగించండి." స్థిర నిర్ణయం.

బాధనంతా లోపలనే బందీచేసి గుండెదిటవు చేసుకుంది. భారమంతా మహేశ్వరునిపై వేసి స్వయంగా బయలుదేరింది.

విలాస మందిరము వైపు తానెప్పుడూ వెళ్లలేదు. ఇప్పుడు తప్పలేదు. ఇది తప్పుకాదు. కానీ... కాళ్లల్లో సన్నని వణుకు... అన్నింటినీ అధిగమించి అడుగులు వేసింది.

రాణిని చూసి రక్షకభటులు, ప్రతీహారులు హడలిపోయారు. సవినయంగా నమస్కరిస్తూ పక్కకు తప్పుకున్నారు. నేరుగా లోపలికెళ్లింది. తన కాలి అందియల

రవళి చెవులకు సోకినంతనే చెవుల పిల్లిలా పరుగెత్తుకొచ్చే మహారాజు కోసం కళ్లు వెతుకుతున్నాయి.

మహారాజు ఉన్నాడు. విలాస భామినుల మధ్య మత్తుగా జోగుతున్నాడు. నగ్న సుందరి తొడపై తల, ఒడిలో చేతులు, మరో ఇద్దరు భామినుల తొడలపై చెరోకాలు ఉంది. ఓ చతురాంగన మత్తు కళ్లతో మధు పాత్రను పెదాల కందిస్తుంది. అంతా అర్ధనగ్న సుందరీమణులే. ఎవరి ఒంటిమీద ఏముందో అర్థం కావడం లేదు.

"ప్రభూ ! పాట కావాలా లేక ఆటకావాలా ?" మధు పాత్ర మనోహరి కళ్లూ, ఒళ్లు తిప్పుతూ అడిగింది.

"ఆ... ఆట, ప ప... పాట... రెండూ కావాలి." మహారాజు కళ్లు కైపెక్కి ఎర్రబారినై. వయ్యారి భామలంతా మహారాజు చుట్టూ మూగారు. ఓ మధుమతి బిగి కౌగిట్లో మహారాజు... మిగితావారు గంతులేయబోతున్నారు. ఎవరికి వారు దేవలోకములో విహరిస్తున్న అప్సరాంగన లనుకుంటున్నారేమో... దృశ్యం జుగుప్సాకరంగా మారింది.

రాణి విమలాదేవికి ఒంటిమీద తేళ్లూ-జెర్రులు పాకినట్లైంది. అరికాలు మంట నెత్తికెక్కింది. గొంతు సవరించుకుంది.

"ఆగండి !" మహారాణి అరుపుకు విలాస మందిరం దద్దరిల్లింది. సుందరాంగులు చెల్లాచెదరై వణికిపోతున్నారు.

"మ్మ... మహారాజా ! మ్మా... మ... మహారాణి గారు... !" ఓ చతురాంగన ఒంటినిండా చీర కప్పుకుంది. మహారాజును కౌగిట్లో బంధించబోతున్న యువతి భుజాలు పట్టి కుదుపుతూ మరో జవ్వని...

"వ్వా... వొసే మొద్దూ ! మ్మ మ... మహారాణే... మహారాణి గా రొచ్చారే !" హెచ్చరించింది. యువతి దిగ్గున లేచి గుడ్డలందుకుంది. బిత్తర చూపులతో బెదిరిపోతున్నారంతా

"మీరంతా వెళ్లిపొండి." హుంకరించింది మహారాణి. గుడ్డలు సర్దుకుంటూ పక్కకు తప్పుకున్నారు. వణికిపోతున్నారు.

"మీరంతా బయటికెళ్లిపోండి." కాటుక కళ్లు విశాలమైన మహారాణి కాళికాదేవిలా కనబడింది.

ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని పడుతూ, లేస్తూ పరుగుకెత్తు కెళ్లారంతా. మత్తులో చిత్తైపోయిన విష్ణువర్ధన మహారాజు తూలుతూ వెళ్లి మంచమ్మీద వెల్లకిలా పడుకున్నాడు.

కళ్లు మూసుకుపోతున్నాయి.

"మహారాజా ! మనోహరా !... చూడండి. ఇటు చూడండి." భుజాలు పట్టి కుదిపింది మహారాణి. ఒంటిమీద గుడ్డల్ని ఒడుపుగా సర్ది" మీకేమైంది మహారాజా ?" ఆందోళనగా అడిగింది.

మహారాజు కళ్లు బలవంతంగా తెరుచుకున్నాయి. కనుగుడ్లు నిప్పుకణిక ల్లాగున్నాయి. చల్లని నీటితో ముఖ ప్రక్షాళన చేసి కొనకొంగుతో తుడిచింది. మహారాజు మత్తుగా కదిలాడు.

"య్యా... యావైందీ ?... ఏదీ... ఆట... ప్పా... పాట ఏదీ ?" కనురెప్పలు టపటపలాడినై. రాత్రి నిద్ర లేనట్టుంది. మళ్లీ కనురెప్పలు మూతలు పడుతున్నాయి.

మహారాజు గారిప్పుడప్పుడే పూర్తి స్పృహలోకొచ్చేట్టులేరు. కాస్సేపు నిద్రపడితే ఒళ్లు తేలికై పోతుంది. పరుపు, పక్కబట్టలు సరిగా సర్ది పడుకోబెట్టింది. ఒళ్లంతా నిమురుతూ జోకొట్టింది. హాయిగా నిద్రలోకి జారుకున్నాడు.

పరిచారికలను పిలిపించి మందిరాన్ని సర్దించింది. శుభ్రంగా ఊడ్పించి పన్నీరుతో కడిగించింది. సాంబ్రాణి పొగవేయించింది. తన అనుమతి లేనిదే ఎవ్వరినీ లోపలికి రానివ్వొద్దని ప్రతీహారుల నాదేశించింది. ఆ రోజు తానక్కడే ఉండాలనుకుంది. భర్త పాదాలు ఒత్తుతూ సపర్యలు ప్రారంభించింది.

అప్పటికే ప్రధాని రంగములోకి దిగి విలాస మందిరము చుట్టూ గట్టి కాపాలా ఏర్పాటు చేశాడు. కోటను కంటికి రెప్పలా కాపాడాలని బలగాల నాదేశించాడు. నలుమూలల నుంచి వస్తున్న చారుల వార్తలను స్వయంగా సేకరిస్తున్నాడు.

ఆ రోజు రాత్రి రాణి విమలాదేవి విలాస మందిరములోనే ఉంది. తెల్లవార బోతుంది. ప్రకృతి ఒళ్లు విరిచింది. తూరుపు ఆకాశం కాషాయకాంతులు కిటికీల్లోంచి తొంగి చూస్తున్నాయి. మబ్బులు తొలగిపోతున్నాయి. విలాసమందిరము చుట్టూ ఉన్న ఉద్యానవనము సుమపరిమళాల సురభిళాలు వెదజల్లుతోంది. వందిమాగధుల బహు పరాకులు, మేల్కొపులు చెవులకు సోకుతున్నాయి.

గజిబిజిగా ఉన్న ఆకాశం నిర్మలంగా, శుభ్రస్నాత సుందరి లాగైంది. ఉదయ సూర్యకిరణాలు తూర్పు ద్వారం నుండి చొచ్చుకొస్తున్నాయి. రాణి విమలాదేవి భర్త పక్కన కూచుంది. మహారాజులో కదలిక ప్రారంభమైంది.

"మహారాజా ! ప్రాణేశ్వరా !" సున్నితంగా భుజాలు కుదిపింది. మహారాజు

కళ్లు తెరుచుకున్నాయి. నిర్మలంగా ఉన్నాయి. కనురెప్పలు టపటపలాడినై. "ఎ... ఎవరూ ? మహారాణీ !" లేచి కూచున్నాడు.

"నేనే మహారాజా ! మీ హృదయేశ్వరి విమలాదేవిని." చిరునవ్వుతో చేతులందుకుని కళ్లకద్దుకుంది. గాజుల సవ్వడి వినసొంపుగా ఉంది.

"నిజమా ! విలాస మందిరములో విమలాదేవి గారా !" కళ్లు నులుముకుని సూటిగా చూస్తున్నాడు.

"వింతగా చూస్తున్నారెందుకు మహారాజా ?" కాటుక కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా కొట్టుకున్నాయి. "క్షమించండి. మీరీ విలాస మందిరము నుండి రాలేకపోతున్నారని నేనే వచ్చాను. ఓ ముఖ్య విషయం మీతో... " గొంతులో దుఃఖ ఛాయలు. చేతులు జోడించింది.

నిన్న తానున్న పరిస్థితి గుర్తుకొచ్చి మహారాజు తల సిగ్గుతో వంగిపోయింది. "ఇందులో క్షమించేదేముంది విమలా ? విమల హృదయవు. నా రాణివి." ఆమె చేతుల్ని సున్నితంగా స్పర్శించాడు.

ప్రేమగా లాలిస్తూ విషయాలన్నీ వివరముగా చెప్పింది.

"ముందు మీరు కాలకృత్యాలు తీర్చుకోండి." లేచినుంచుంది.

"విశేషమేమిటి మహారాణీ ?"

"మన సామ్రాజ్య సంక్షేమాన్నాశించి ఉమామహేశ్వర వ్రతం చేస్తున్నాను. ఈ రోజు ఉద్యాపన. మీరు త్వరగా తయారై పూజా మందిరానికి దయచేయాలి. ఉద్యాపన సమయాన మీరు నాతో ఉండాలి." గొంతులో ఆవేదన, మాటల్లో మాధుర్యం.

"తప్పకుండా వస్తా."

"మాటివ్వండి." అరచెయ్యి ముందుకు చాచింది.

"ఈ మాత్రానికే ఇంతగా ప్రాధేయపడాలా ! మన సామ్రాజ్య సంక్షేమం నాకు వాంఛితం కాదా !" చేతిలో చెయ్యేసి మాటిచ్చాడు. "స్నాన సంధ్యాదులు ముగించుకుని వస్తాను. నువ్వెళ్లి తయారవు." మందహాసం.

పావన గోదావరి జలాలతో పవిత్ర స్నానాలైనాయి.

మధువుకు మగువ తోడైతే మానవమాత్రుడీ లోకాన్ని పట్టించుకోడు. విలాస మందిరానికి పరిమితమై పరిపాలన గురించి పట్టించుకోలేకపోయాను. చఛా... పొరపాటైపోయింది. ప్రధాని, మహారాణి, గురువుగార్ల జాగ్రత్త వల్ల సరిపోయింది. లేకపోతే పద్మశయనముపై పరాయి రాజుల కన్ను పడేదేమో... అనుకుంటూ విష్ణువర్ధనుడు

తయారై బయలుదేరాడు.

విమలాదేవి సాంబ్రాణి పొగతో తలారబెట్టుకుంది. నల్లని పొడగాటి శిరోజాలను జారుముడితో ఏకంచేసి మల్లెదండ అలంకరించుకుంది. మల్లెల మధ్య కనకాంబరాలు నవ్వుతున్నాయి. మల్లెల సువాసనలు, కనకాంబరాల కాంతులకు తగినట్టుగా బంగారు పూల అంచు గులాబి రంగు పీతాంబరము సింగారించుకుంది. పాపిట సిందూరము, నుదుట బొట్టు, ముత్యాల ముక్కుపుడకతో కైలాసం నుండి దిగివచ్చిన పార్వతీదేవి లాగుంది.

వేదమంత్రాలు పఠిస్తూ పురోహితులు రాజదంపతులతో పూజా కార్యక్రమాలు చేయిస్తున్నారు. రాజగురువు మార్గదర్శనం చేస్తున్నాడు. మండలం రోజుల నుండి కఠిన నియమాలతో గడుపుతున్న విమలాదేవి "తల్లీ ! జగన్మామాతా !" అనుకుంటూ చేతులు జోడించింది. "తాత్కాలిక సుఖాల వలలో సతమతమవుతూ పరిపాలనకు దూరమవుతున్న మహారాజులో మార్పు రావాలమ్మా ! నన్ను నైవేద్యంగా స్వీకరించినా సరే, మహారాజు మామూలు మనిషయేలా దీవించమ్మా." ప్రార్థించింది.

విష్ణువర్ధన మహారాజు మామూలు మనిషిగా కన్పించాడు. ప్రశాంత వదనముతో పూజా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో మంత్రులు, పరివారము తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

తీర్థ ప్రసాదాల వితరణతో ఉద్యాపన ముగిసింది. రాజగురువు, వేదపండితులు రాజదంపతుల నాశీర్వదించారు. సమయ సందర్భాలెరిగి వ్యవహారం నడిపించడములో నిష్ణాతుడైన ప్రధాని విజయసింహుడు

"మహారాజా ! మనం ముఖ్యమైన రాచకార్యాల గురించి చర్చించాలి. సమావేశమేర్పాటు చేయించుమంటారా ?" మందహాసముతో అడిగాడు.

విష్ణువర్ధనుని ముఖములో మునుపటి కళాకాంతులున్నాయి.
"సరే... చేయించండి."

రాజగురువు సలహాతో మంత్రిమండలి, సర్వసైన్యాధ్యక్షుడు, గూఢాచార విభాగాధిపతి ఇతర ప్రముఖులతో ఆంతరంగిక సమావేశమేర్పాటైంది. పరిస్థితుల్ని మహారాజుకు వివరించారు. విషయాలన్నీ విని విష్ణువర్ధనుని మనసు వికలమైంది.

దీనికంతకూ నేనే కారణం. విలాసాలు జీవితములో ఒక భాగమే కాని విలాసాలే జీవితం కావద్దు. పాలకునిలో అశ్రద్ధ చోటు చేసుకుంటే ప్రజాపాలన పట్టు దప్పిపోతుంది. పాలకుడు ప్రజల దృష్టిలో చులకనైపోతాడు. సామంతులు స్వతంత్రులైతే సామ్రాజ్యంలో

దేశద్రోహులు చెలరేగి అల్లకల్లోలం సృష్టిస్తారు. అదను కోసం వేచి చూస్తున్న ఇరుగుపొరుగు సామ్రాజ్యాధిపతులు దండయాత్రకొస్తే... రాజ్యం పరాయిల భోజ్యమవుతుంది.

"రాజద్రోహుల్ని క్షమించేది లేదు." అంతరాళాల్లోని పొంగు గొంతులో కొచ్చింది. "ఆంతరంగిక భద్రత విషయంలో అతి జాగ్రత్త వహించాలి. అవసరమైతే మేమే స్వయంగా రంగంలోకి దిగుతాం." మునుపటి మహారాజులా హెచ్చరించాడు.

"పరిస్థితులన్నీ అదుపులోనే ఉన్నాయి ప్రభూ !" అని ప్రధానామాత్యుడు అందరినీ పంపించి తానొక్కడే మహారాజు ముందున్నాడు. మహారాజు మత్తు సమయములో జరిగిన విషయాలన్నీ గుర్తుచేశాడు.

"మహారాజా !" చేతులు జోడించాడు. "మీరు మరో విధంగా భావించకుంటే ఓ ముఖ్య విషయం తమరి దృష్టికి తేవాలనుకుంటున్నాను."

"ఫరవాలేదు. చెప్పండి." మహారాజులో ఆత్మస్థైర్యము పుంజుకుంది.

"మీరు విలాసాలకు పరిమితమవడం మమ్మలందరినీ బాధించిందని చెప్పాము గదా ! శృతిమించిన శృంగారము శరీరానికి చేటు. దానికి మదువుతోడైతే... ఒళ్లు గుల్లచేసి మనిషని నిర్వీర్యం చేస్తుంది. మహారాణి మానసికాందోళన మమ్మల్ని కుంగదీసింది. అంతఃపురము శోక సముద్రమైంది. 'యత్రనారీ పూజ్యంతే తత్ర రమంతి దేవతా' అన్నారు పెద్దలు. కలకంఠి కంట కన్నీరొలికిన చోట సిరి నిలువదంటారు. దయచేసి మీరిక... " గొంతు గద్గదమైంది.

"మహామాత్యా ! మాకంతా అర్థమైంది. కానీ... అదేదో అజ్ఞాత శక్తి, ఆ... గాన మాధుర్యం నన్ను వివశుణ్ని చేసింది. ఆ ధ్వని వెంట పరుగెత్తాను. ఆ పరిస్థితి నధిగమించేందుకు విలాస మందిరములో మధువు, మగువ నాశ్రయించాను. అందుకు సిగ్గుపడ్తున్నాను." ఇబ్బందిగా కదిలాడు.

"దయచేసి అదంతా మరిచిపోండి ప్రభూ ! రాకుమారుడు రాజనరేంద్రులవారు గురుకులములో సకల విద్యాపారంగతులైనారు. త్వరలోనే ఇంటికి రాబోతున్నారు. శరన్నవరాత్రులు సమీపిస్తున్నాయి. ఆలోగానే రాకుమారులు గురుకులం నుండి విచ్చేస్తారు... "

"హమ్మో ! శరన్నవరాత్రులా !" గుండెలమీద చెయ్యేసుకున్నాడు. "అయితే మా విలాస జీవితం చాలా రోజులే... !"

"అవును మహారాజా ! దాన్నో పీడకలగా భావించి మరిచిపోతే మనందరికీ క్షేమం."

"నిజమే మహామత్యా ! ఎప్పట్లాగే శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరగాలి. ఏర్పాట్లు చేయించండి."

"సరే మహారాజా ! మరొక్క మనవి... "

"చెప్పండి."

"ఇదే శరన్నవరాత్రోత్సవాల్లో రాజనరేంద్రుల వారికి యువరాజుగా పట్టాభిషేకం చేస్తే బావుంటుందేమో !"

మహారాజు మనసు నిర్మలాకాశం లాగుంది. ఏవో సందేహాలు శ్రావణమేఘల్లా వచ్చి మాయమవుతున్నాయి.

"ఆలోచించాల్సిందే." ప్రధానిని మెప్పుకోలుగా చూస్తూ భుజకీర్తులు తడుము కున్నాడు.

రాజగురువుతో సలహా సంప్రదింపులు ముగించుకుని అంతఃపురము చేరుకున్నాడు. మహారాణి విమలాదేవి దిగులుగా కన్పించింది. మబ్బులు కమ్మిన ఆకాశంలా మొహం మ్లానమైంది. చాలారోజుల తర్వాత భర్త తనంత తానుగా రాణివాస మొచ్చినందుకు సంతోషంగా ఎదురెళ్లింది. మనసులో మల్లెలు గుబాళించినై. ముఖారవిందము విచ్చుకుంది. బతుకు బాటలో అమావాస్య చీకటులు అలుముకుంటా యేమొనని హడలిపోయిన అంతరగములో కార్తీక పౌర్ణమి వెన్నెల పరుచుకుంది.

"మహారాణీ... విమలాదేవీ !" చేతులు చాచాడు.

ఆలస్యం అమృతం విషమవుతుందేమో ! లేడిపిల్లలా పరుగెతుకెళ్లి ఒడిలో వాలింది. భర్త బాహుబంధము స్వర్గద్వారాలను బార్లా తెరిచింది. పున్నమి వెన్నెలలో, నందననములో విహరిస్తున్నట్టుంది. ఆనందామృతం గొంతులో కదలాడింది.

"మనోహరా ! ప్రభూ... ప్రాణేశ్వరా !" గాల్లో తేలిపోతున్నట్టుంది.

"మా హృదయోశ్వరికో శుభవార్త." కౌగిలి బిగించి పాన్పు వద్దకు నడిపించు కెళ్లాడు.

"ఎన్నాళ్ల కెన్నాళ్లకు ప్రభూ !" ఒడిలో ఒదిగిపోయింది. కళ్లల్లో వినూత్న కాంతిరేఖలు విచ్చుకుంటున్నాయి. కనురెప్పలు కలువరేకుల్లా విచ్చుకుంటున్నాయి.

జీవితమంతా ఇలాగే ఉంటే బాగుండు... అనుకుంటూ వెల్లకిలా పడుకుంది. ఆరబోసిన అందాలు మహారాజు నూరిస్తున్నాయి. గుండెల మీద తలానించి లయబద్ధమైన సవ్వడి వింటున్నాడు. చేతి గాజుల్ని ముందుకూ, వెనక్కు జరుపుతూ ఆనందిస్తున్నాడు. కొన్ని క్షణాలు మౌనరాగ మాలాపించినై. మహారాజు పక్కకు జరిగి కుడి పక్కమీద

పడుకున్నాడు. మహారాణి ఎడమ పక్కకు మారింది. ఎదురెదురుగా... చూపులు దోబూచులాడుకుంటున్నాయి.

"నేనింతకు ముందే మన రాజగురువు గారితో మాట్లాడాను."

"నిజమా ! మీరే స్వయంగా వెళ్ళొచ్చారు కాబట్టి శుభవార్తనే !"

"రాజగురువుతో మాట్లాడ్డమే శుభవార్తనా ? ఎంత అల్పసంతోషివి విమలా !"

"అల్పసంతోషిని కాదు. అదృష్టవంతురాలిని మహరాజా ! శుభవార్త అని తమరే అన్నారు గదా !"

"నేను శుభవార్త అన్నది అదికాదు."

"మరేమిటటా ?" చిలిపిగా ముక్కులాగి వదిలేసింది. లేచి పక్కన కూచుంది.

"మన చిరంజీవి రాజనరేంద్రుడు గురుకులంలో విద్యాభ్యాసం ముగించుకుని తిరిగొస్తున్నాడు ప్రియే !"

"ఓహో... అదా శుభవార్త !" మూతులు తిప్పింది. గాజుల సవ్వడితో చెంప గిల్లింది.

"ఏం... అది శుభవార్త కాదా ?"

"కన్నకొడుకు సకల విద్యాపారంగతుడై తిరిగి వస్తున్నాడుంటే అది శుభవార్తనే. మన చిరంజీవికి స్వాగత సత్కారలేర్పాటు చెయ్యాలి గదా !" లేవబోయింది. భుజాలు పట్టి కూచోబెట్టాడు.

"అసలు శుభవార్త నేనింకా చెప్పనేలేదు రాణిగారూ !" కౌగిట్లో బంధించబోయాడు.

"మీరలా ఊరిస్తుంటే ఎలా ?" చిన్నపిల్లలా బుంగమూతి పెట్టి చేతులు పట్టుకుంది.

"మన చిరంజీవి రాజనరేంద్రునికి ఈ శరన్నవరాత్రోత్సవాల్లోనే యువరాజుగా పట్టాభిషేకం చేయిస్తున్నాము. మన వంశోద్ధారకుడు రాజ్యపాలనలో నాకు కుడిభుజంగా ఉంటాడిక."

"ఆ... అలాగా !" ఆనందోత్సాహాన్ని ఆపుకోలేక బుగ్గమీద ముద్దుబెట్టి అల్లరి పిల్లలా నవ్వింది. "గొప్ప శుభవార్త చెప్పారు ప్రియా !" బాహువుల్లో బంధించి తనను తాను సమర్పించుకుంది. దివి నుండి భువికి స్వర్గం దిగి వచ్చింది.

"ప్రభూ ! నా దొక మనవి." కళ్లలోకి సూటిగా చూస్తూ లాలనగా అడిగింది.

"అడుగు మహారాణీ !"

"భారత స్త్రీకి కావల్సింది భర్తతో సుఖాలు పంచుకోవడం. కష్టాలు గూడా పంచుకుంటుంది. కాని సదా భర్త సాంగత్యాన్నే కోరుకుంటుంది. భర్త ఒడిలో ఒదిగి

పోతుంది. భర్త ప్రేమానురాగాలే భార్యకు సుఖభోగాలు. భర్త నిరాదరణ నరకప్రాయము. మీ ఆదరాభిమానాలకు నన్ను దూరం చెయ్యకండి ప్రభూ ! ఇలాగే... మీ చల్లని నీడలో జీవితాన్ని గడపనివ్వండి... " గొంతులో సన్ననిజీర. కడుపులోని ఆవేదన కళ్లలోకి ఎగదన్నుకొచ్చి చెంపల్ని తడిపేస్తోంది. మహారాజు చలించిపోయాడు.

"తప్పకుండా విమలా !" చెంపల తడిని తన చెంపలతో తుడిచాడు." ఈ విష్ణువర్ధనుడెప్పుడూ విమలాదేవి ప్రాణవల్లభుడే సుమా !" చెక్కిలి మీద చిటికేసి చక్కలిగింతలు వడ్డించాడు. గలగలా నవ్వింది. గతాన్ని మరిచి అందమైన ఆగతాన్ని ఊహించుకోసాగింది.

కాలచక్రం గిరగిరల్లో వర్షఋతువు అలసి-సొలసి విశ్రాంతికెళ్లింది. భూమాత పులకింతలు శరదృతువు నాహ్వానించినై. ప్రకృతి నూతనశోభ సంతరించుకుంది. పచ్చని పంట చేలు, విరగబూసిన పూలు అందాలు విరజిమ్ముతూ మానవాళికి స్ఫూర్తినిస్తున్నాయి. అప్పటివరకు ఉరుములు-మెరుపులతో దద్దరిల్లిన ఆకాశము నిర్మలంగా శుభ్రజ్యోత్స్న పరుచుకున్నట్టుంది. సర్వం శక్తిమయం అనుకుంటూ ప్రజలంతా శరన్నవరాత్రోత్సవాలకు శ్రీకారం పలుకుతున్నారు.

గురుకులాల్లో గురువులు 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ' అంతరార్థాన్ని శిష్యులకు వివరిస్తూ భారతీయ సంస్కృతి మాతృమూర్తికే పెద్దపీట వేసిందని చెప్తున్నారు. ఆదిశక్తి మహిమల్ని, రూపలావణ్యాలను స్త్రీ సూక్తం ఆధారంగా బోధిస్తున్నారు. తల్లిదండ్రులు పార్వతి-పరమేశ్వరులు, భార్యాభర్తలు, సీతారాములు, లక్ష్మీనారాయణులు జంటపదాల్లో ఇమిడిన స్త్రీ ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తున్నారు. వైశ్యులు ఆదిశక్తి పద్నాలుగు రూపాల్లో ఒకటైన కన్యకాపరమేశ్వరిని కులదైవంగా పూజిస్తున్నారు.

రాజనరేంద్రుడు విద్యాపారంగతుడై గురుకులము నుండి తిరిగి వచ్చాడు. ముందు నిర్ణయించిన ప్రకారము శ్రవణ నక్షత్రముతో కూడిన ఆశ్వీజ శుద్ధ దశమి శుభముహూర్తాన రాజనరేంద్రునికి యువరాజు పట్టాభిషేకం చేసి విష్ణువర్ధనుడు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. పదిరోజుల ఉత్సవాలు అమితోత్సాహంగా సాగుతున్నాయి. దేశ-విదేశీ కళాకారులు రాజాస్థానములో తమ కళాకౌశలాన్ని ప్రదర్శించి కానుకలందు కుంటున్నారు.

భాగవతులు, నాట్యకళాకారులు, గాయకులతో కూడిన పెనుగొండ కళాబృందము పద్మశయన పురము చౌరస్తాలో ప్రదర్శనలిస్తోంది. జనాల రాకపోకల కేమాత్రం ఆటంకము కలుగకుండా విష్ణువర్ధనుని అంతఃపురానికి సమీపములో కళాప్రదర్శనలు ప్రజల

నుగ్రూతలూగిస్తున్నాయి. చుట్టూ చేరిన ప్రజాసమూహాల మధ్యన పెనుగొండ సామ్రాజ్యం వైభవప్రాభవాలు, కుసుమగుప్తుని పాలనాపటిమ, ప్రజల సుఖసంతోషాలను పాటలుగా మలిచి ఆటల్లో చూపిస్తున్నారు. కళాకారుల గొంతుల్లోంచి వెలువడిన రసరమ్య గీతాలు, మధుర స్వరాలు విష్ణువర్ధన మహారాజు చెవులకు సోకి తన్మయత్వం కల్గిస్తున్నాయి. గంధర్వగానాన్ని రాగమాధుర్యం ఆనందడోలికలూగిస్తోంది.

ఆ కళాకౌశలాన్ని చూసి నా సామ్రాజ్యంలోని కళాకారులు స్ఫూర్తి పొందాలి. మా ఆస్థానము ఆనందించాలి... అనుకున్నాడు. భటులను పిలిచి పెనుగొండ కళాబృందాన్ని తమ సన్నిధిలోకి తీసుకురమ్మన్నాడు. మంత్రులు, పరివారాన్ని పిలిపించాడు.

పెనుగొండ కళాబృందము మహారాజుకు, సభకు సవినయంగా నమస్కరించింది.

"పెనుగొండ సామ్రాజ్యములో మీది ఏ రాజ్యము ? ఏ పట్టణము ?" అడిగాడు మహారాజు. కళాబృందము నాయకుడు

"మహారాజా ! మా పెనుగొండ సామ్రాజ్యములోని అన్ని రాజ్యాల కళాకారులు మా బృందములో ఉన్నారు." జవాబిచ్చాడు.

"పెనుగొండ వైభవ-ప్రాభవాలను పాటలో వినిపించింది మీరేనా ?"

"అవును మహారాజా !"

"ఆ గీతాలను రాసిందెవరు ? సంగీతం సమకూర్చిందెవరు ?"

"మా సామ్రాజ్యములోని కవులు రాశారు, సంగీత విద్వాంసులు బాణీలు కట్టారు. మా గురువు గారు మాకు నేర్పించారు. మేము పాడుతున్నాము ప్రభూ !"

అయితే పెనుగొండ కవుల తోట, సంగీత విద్వాంసుల కోట, గాయకుల పేట, నాట్యకళాకారుల బాట... అంతా కలిసి అదో కళాకేంద్రమన్న మాట.... ఆశ్చర్యంలో మునిగి ఆనంద తరంగాల్లో తేలిపోతున్నాడు విష్ణువర్ధనుడు.

"ఏదీ... ఆ గీతాల నిక్కడ వినిపించండి."

"సరే... ప్రభూ !"

కళాబృందము మనసుల్లో చైతన్యకేతనము రెపరెపలాడింది. ఉత్సాహం ఉరకలేసింది. సంగీత విభావరి ప్రారంభమైంది. కవుల కలాల నుండి వెలువడిన చైతన్య గీతాలు గాయకుల గళాల నుండి గంగా తరంగాలుగా వెలువడుతున్నాయి. గీతాల కనుగుణంగా రంగస్థల కళాకారులు నర్తిస్తున్నారు. పెనుగొండ కళామేళ పద్మశయన రాజసభ నలరించింది. అంతా పెదాలు చప్పరిస్తూ పులకించి పోయారు.

"చాల బాగుంది. పరిపాలనా దక్షులైన మీ కుసుమగుప్త మహారాజుగారు

మంచి కళాపోషకులన్న మాట. వారికి, మీకు మా అభినందనలు." మహారాజు ప్రశంసలు కురిపించి తన కంఠహారాన్ని బహుమతిగా అందించాడు.

"మహారాజా !" ప్రధాని విజయసింహుడు సంతోష తరంగాల్లో తేలిపోతూ "మోహన రాగం, శివరంజని రాగం, కల్యాణి మొదలగు రాగాల్లో నిబద్ధమైన గీతాలు మరికొన్ని వినాలని సభాసదులు ఆసక్తిగా ఉన్నారు." అడిగాడు.

"అవును అమాత్యా ! మాకూ అలాగే అన్పిస్తుంది." ఆమోదించి మరికొన్ని గీతాలు పాడుమన్నాడు.

కళాబృందము ఉత్సాహము రెట్టింపైంది. కుసుమగుప్తుని పాలనా దక్షత, వాసవి ప్రతిపాదించిన అహింసా సిద్ధాంతములోని శాంతి సందేశాలు మేళవించిన గీతాలను కమ్మగా పాడుతూ నాట్య భంగిమల్లో ఆకట్టుకున్నారు. కరతాళ ధ్వనులతో పాటు మరికొన్ని బహుమతులందుకున్నారు. అవన్నీ విష్ణువర్ధనుని మనో ఫలకంపై చెరగని ముద్రవేశాయి.

అందుకేనేమో పెనుగొండ కీర్తి ప్రతిష్ఠలు భారత ఖండములోనే గాక ప్రపంచమంతా వ్యాపించినై. వ్యాపార-వాణిజ్య రంగాల్లోనే కాదు లలిత కళల్లో గూడా రాణిస్తుంది... ఏదో ఆసక్తి లోలోపల మొగ్గదొడిగింది.

సాయంత్రం... ప్రధాని విజయసింహునితో సమాలోచన కుపక్రమించాడు.

"మహామాత్యా ! పెనుగొండ సామ్రాజ్య పాలనా చాతుర్యం, కుసుమగుప్త మహారాజు గుణగణాలు, లలిత కళల రాణింపు ఆ సామ్రాజ్యం కళాకారుల ద్వారా విన్నాం గదా ! వారి రాజధాని పెనుగొండ పట్టణాన్నోసారి సందర్శించాలని మా మనసు ఉబలాట పడుతోంది."

ఆ మాటలు వింటూంటే పాలమీగడలో పంచదార కలిపి తిన్నట్టుంది ప్రధానికి. "చాల మంచి ఆలోచన మహారాజా ! కొంతకాలం మరో లోకంలో విహరించిన తమరు మళ్లీ మన లోకంలోకి రావడం మాకెంతో సంతోషంగా ఉంది ప్రభూ !"

"అదేమిటో మహామాత్యా ! కలలో ఓ గంధర్వ కన్య కన్పించినట్టు, స్వర మాధుర్యంతో ఎద వీణను మీటినట్టు... ఆ మానసిక పరిస్థితి అంత పని చేయించింది. మానసికాందోళన మాయం కావాలంటే పుణ్యక్షేత్రాల దర్శనమే సరియైన ఔషధము. నల్లమల అడవుల్లో కొలువుదీరిన శ్రీ శైల మల్లికార్జున స్వామి-భ్రమరాంబలను దర్శించి ఆశీస్సులందుకోవాలనుంది. మీ అభిప్రాయమేమిటో నిర్మొహమాటంగా చెప్పండి."

"మీ అభిప్రాయమే నా అభిప్రాయం మహారాజా ! ద్వాదశ జ్యోతిర్లింగాల్లో

మొదటిదైన శ్రీ శైల క్షేత్ర మహిమ చాలా గొప్పది. భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దర్శనము మనకిప్పుడు వాంఛనీయము. రాజగురువుగారి సలహాతో ముహూర్తం నిర్ణయించుదాం. ప్రయాణానికి ఏర్పాట్లు చేయిస్తా. తిరుగు ప్రయాణములో పెనుగొండ పట్టణాన్ని సందర్శించవచ్చు."

ఆశ్వీజ బహుళ విదియనాడు విష్ణువర్ధన మహారాజు తీర్థయాత్ర ప్రారంభమైంది. వర్షాలు అలసిపోయి విశ్రాంతి కుపక్రమించినై. పిల్లగాలులు గిలిగింతలు పెడుతున్నాయి. చలి బలం పుంజుకోలేదింకా. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. పద్మశయనపురము రక్షణ బాధ్యతను సర్వసైన్యాధ్యక్షుని కప్పగించారు. పరిపాలనా పర్యవేక్షణ యువరాజు రాజనరేంద్రుని కనుసన్నల్లోకొచ్చింది. ప్రధానమంత్రి సహా పరివారము మహారాజుతో బయలుదేరుతుండగా మహారాణి విమలాదేవి మంగళహారతులిచ్చి వీడ్కోలు పలికింది.

# 9

విష్ణువర్ధన మహారాజు ప్రయాణము సపరివార సమేతముగా దక్షిణ దిశగా సాగింది. మార్గమధ్యములో విశ్రాంతికోసం గుడారాలు వేస్తున్నారు. సదుపాయలన్నీ కల్పించే సేవాపరివారము వెంట ఉంది. సామంత రాజులు స్వాగత సత్కారాలందిస్తూ విలువైన కానుకలందిస్తున్నారు. సామంత రాజుల యోగక్షేమాలు, పరిపాలనలో వారి కెదురవుతున్న సమస్యలను చర్చిస్తూ సలహాలిస్తున్నారు. కోటిపల్లి మీదుగా సాగిన ప్రయాణము గోదావరి నదిని దాటించింది. బెజవాడలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. కృష్ణా నది దాటి నల్లమల అడవుల్లో ప్రవేశించారు. పురివిప్పిన నెమళ్ల నాట్యాలను, స్వేచ్ఛగా సంచరిస్తున్న వన్య మృగాలను, ప్రకృతి సోయగాలను కనువిందు చేసుకుంటూ శ్రీశైల మల్లికార్జున క్షేత్రానికి చేరుకున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రములో ఆనందము వెల్లివిరిసింది.

నల్లమల చిట్టడవి నట్టనడుమ వెలసిన మల్లికార్జున స్వామిని ధూళిదర్శనం చేసుకుని అక్కడే విశ్రమించారు. సుప్రభాత సమయాన నీటి ఒడిలో సేదదీరాలనే ఆకాంక్ష పాతాళ గంగా స్నానముతో నెరవేరింది. విష్ణువర్ధన మహారాజు శ్రీ భ్రమరాంబా సహిత మల్లికార్జున స్వామికి మొదటి అభిషేకం చేయించాడు. ఆ తర్వాత ప్రభాత పూజలో స్వామివారి పాదాల చెంత పరవశించాడు. ఎత్తైన ప్రదేశములో, రమణీయ దృశ్యాలతో అలరారుతున్న శ్రీశైల పర్వతము విడిచి రావాలంటే మనసొప్పలేదు. కాని కింకర్తవ్యము కదలించింది. మూడు రోజులక్కడే గడిపి తిరుగు ప్రయాణానికి సిద్ధమైనారు.

బెజవాడ మీదుగా వెళ్ళి పెనుగొండను సందర్శించి, పాలకొల్లులో శ్రీరామలింగేశ్వరునికి క్షీరాభిషేకం చేయించి అట్నుంచి అటే రాజధాని చేరుకోవాలని నిర్ణయించుకున్నారు.

అనుకున్నట్టుగా మొదట తణకు చేరుకున్నారు. అక్కడి నుండి పెనుగొండకు బయలుదేరారు. విష్ణువర్ధనుని మనో విహంగము రెక్కలు విప్పి ఎదిరిచూస్తోంది.

రంగురంగుల ప్రాకారాలు, పలు అంతస్తుల మేడలు, బంగారు రంగు ధ్వజ స్తంభాలు, మణిమయ శోభలొలికించే ద్వారాలు, పాలరాతి కట్టడాలు, ఎత్తైన కోట బురుజులు... అల్లంత దూరము నుండి అలకాపురిలా కన్పించిన పెనుగొండ పట్టణ శోభ విష్ణువర్ధన బృందాన్ని ఆకట్టుకుంది. పట్టణ శివారులో ఉద్యాన వనాలున్నాయి. విశాలమైన ఉద్యానవనము రంగురంగుల పూలమొక్కలు, తీగలు, విరబూసిన సుమసురభిళాలతో స్వాగతం పలికింది. అందులోనే గుడారాలు వేశారు. తనకోసం ఏర్పాటు చేసిన గుడారములో ప్రవేశిస్తూ విష్ణువర్ధనుడు

“మహామాత్యా ! ఇన్ని అందచందాలు ఈ పట్టణానికెట్లా వచ్చాయంటారు ?” విజయసింహుడి నడిగాడు.

“ప్రభూ ! ఇది విశ్వకర్మ స్వయంగా నిర్మించిన నగరము... ” చెప్పబోతున్నాడు. బయటి నుండి తుమ్ము వినిపించింది. అనుమానంతో క్షణకాలం అవాక్కయారు.

“ఫరవాలేదు ప్రభూ ! గుడారాలేశారు గదా !” సర్ది చెప్పాడు ప్రధాని. ఓ భటుడు పరుగెత్తుకొచ్చి

“ప్రభూ ! వంట గుడారానికి నిప్పంటుకుంది. మేమంతా మంటల్ని చల్లార్పి మరో గుడారం వేశాము.” చేతులు కట్టుకుని చెప్పాడు.

మహారాజు, మహామాత్యులు మొహాలు చూసుకున్నారు.

“ఫరవాలేదు మరోటి వేశారు గదా ! అందులోనే వంటలు చేయించండి.” ప్రధాని ఆదేశించాడు కాని అతని మనసులో అనుమానం గోకుతూనే ఉంది.

ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ విష్ణువర్ధనుడు మంచమ్మీద కూచుంటున్నాడు. మంచం విరిగి పడిపోయింది. ప్రధాని సిబ్బందిని పిలిచి కేకలేశాడు.

“మహారాజు కోసం పుచ్చిపోయిన పాత మంచం ఏర్పాటు చేస్తారా ?” నిలదీశాడు. సిబ్బంది నాయకుడు వణికిపోతూ

“పాతది కాదు ప్రభూ, కొత్తది. ఈ మధ్యనే మేలుజాతి టేకు కర్రతో చేయించింది.

మనం బయలుదేరినప్పట్నుంచి మహారాజు విడిదిలో ఇదే వేస్తున్నాం." విన్నవించుకున్నాడు.

మరోసారి మందలించి మరో మంచం తెప్పించాడు. అప్పటికే దండనాయకుడు, మరికొందరు బిలబిల మూగారు.

"ఇదెలాగైంది మహామాత్యా ?" లోపలి ఆందోళన బయటపడకుండా అడిగాడు విష్ణువర్ధనుడు. ప్రధాని నీళ్లు నమిలాడు. మహారాజు దృష్టి సాలోచనగా దండనాయకుని వైపు మళ్లింది.

"మహారాజా ! ఇది అపశకునం కావచ్చు. మనం వెంటనే బయలుదేరి వెళ్తే బాగుంటుదేమో ! మరెప్పుడన్నా పెనుగొండకు రావచ్చు".

పెనుగొండ పట్టణ శోభను తిలకించి తీరాలనే ప్రగాఢ వాంఛ దండానాయకుని అభిప్రాయంతో ఏకీభవించాల్సిన అవసరము లేదన్నది.

"ఎలాగూ వచ్చేశాం గదా ! పట్టణ శోభను చూసి వెళ్లిపోతే సరి !" మీరేమంటా రన్నట్టుగా చూపులు ప్రధానామాత్యుడిని తడిమినై.

ప్రధానికి మహారాజు అంతరంగము అర్థమైంది. వద్దంటే మానుకునే పరిస్థితి లేదు.

"ఫరవాలేదు మహారాజా ! మనం పుణ్యక్షేత్రాలను దర్శించి వస్తున్నాం గదా ! అయినా ఇది మన చివరి మజిలీ కాదు. ఇట్నుంచి పాలకొల్లు వెళ్లి శ్రీ క్షీర రామలింగేశ్వరుణ్ని దర్శించుకుని వెళ్తాం గదా !" చెప్పక తప్పలేదు.

"అది నిజమే కానీ... " ఇంకేదో అనబోయాడు దండనాయకుడు.

"ఇప్పుడింకేమీ మాట్లాడొద్దు. మన మహారాజు రాక గురించి ఈ పెనుగొండ సామ్రాజ్యాధినేత కుసుమగుప్త ప్రభువుల వారికి వర్తమానం పంపించండి." ఆదేశించాడు.

ఇరుగు పొరుగు మహారాజులు ఒకరినొకరు ఇలవేల్పుల్లాగుంటే భారత ఖండము భాగ్యవిధాతగా ఉండిపోతుందని కుసుమగుప్తుని విశ్వాసం. విష్ణువర్ధనుని రాక అంతకుముందే వేగుల ద్వారా తెలుసుకుని సంతోషించాడు. అదే వార్తతెచ్చిన విష్ణువర్ధనుని భటులకు బహుమతులిచ్చి పంపించాడు. ప్రధానిని పిలిపించి విషయం చెప్పి

"పద్మశయన సామ్రాజ్యాధిపతి విశ్రాంతికి, నగర సందర్శనకు తగు ఏర్పాట్లు చేయించండి. ఆయన మన అతిథి. అతిథి మర్యాదల్లో ఏ లోటూ జరగకూడదు." సూచించాడు.

"మహారాజా ! విష్ణువర్ధనుల వారు పద్మశయన పురము నుండి బయలుదేరి

నప్పటినుండి వారి పర్యటన విశేషాలు మన వేగులద్వారా తెలుస్తూనే ఉన్నాయి గదా ! నేనే స్వయంగా వెళ్లి వారిని నగర సందర్శనకు రావాల్సిందిగా తమరి ఆహ్వానాన్నందిస్తాను. కాని... " ఆగిపోయాడు ప్రధాని.

"చెప్పండి. మనలో మనకు మొహమాట మెందుకూ ?"

"సరే మహారాజా !" ప్రధాని గొంతు గాంభీర్యం పులుముకుంది. "రాజుల చిత్తములు, ప్రవృత్తులు తమరికి తెలియనివి కావు. విష్ణువర్ధన మహారాజు మనసులో రాజ్య విస్తరణ కాంక్ష బలంగా ఉందని విన్నాం గదా ! అతిథిగా వచ్చిన వారు విజ్ఞత మరిచి విస్తరణకు పూనుకోవచ్చు. కీడెంచి మేలేంచుమన్నారు పెద్దలు. ఎందుకైనా మంచిది సర్వసైన్యాధ్యక్షుడిని పిలిచి సైనిక బలగాలను అప్రమత్తం చెయ్యాలని ఆదేశిస్తాను ప్రభూ !"

"అవును. ఆ పని చెయ్యండి. కానీ... మన అంతస్తుకు తగినట్టుగా అతిథికి మర్యాదలు, స్వాగతసత్కారాలు చెయ్యాలి."

"చిత్తం మహారాజా !"

అదే సాయంత్రము విష్ణువర్ధనుని వద్దకేగి నగరసందర్శనకు రావాలని కుసుమగుప్తుని ఆహ్వానాన్నందించాడు ప్రధాని.

విష్ణువర్ధనుడు ఆనందభరితుడయాడు.

"కుసుమగుప్త మహారాజు గురించి, పెనుగొండ ప్రభ గురించి మేము చాలా విన్నాము. రేపు పొద్దున ప్రత్యక్షంగా చూస్తాము. మీ ఆహ్వానానికి మా ధన్యవాదాలు తెలపండి" మురిసిపోయాడు.

సుప్రభాత సూర్యకిరణాలు పెనుగొండ మేడలకు, ఆలయ శిఖరాలకు పసిడి రంగులు పులుముతున్నాయి. ఆలమందలు గోధూళి రేపుతూ పొలాల కెల్తున్నాయి. గురుకులాశ్రమం పైన యజ్ఞహవనము తెరలు తెరలుగా కనిపిస్తోంది. కన్నె పిల్లలు పరాచకాలాడుకుంటూ, చంక బిందెలతో గోదావరికెల్తున్నారు. పడుచు కన్యల నవ్వులు, గాజుల గలగలలు, కాలిఅందియల ఘల్లుఘల్లులతో మిళితమై వీనుల విందు చేస్తున్నాయి. పట్టణం వీధులన్నీ పూలమాలలతో, స్వాగత తోరణాలతో కనువిందు చేస్తున్నాయి. సనాతన ధర్మచైతన్యానికి, త్యాగానికి ప్రతీకయైన కాషాయ ధ్వజము రాజప్రాసాదము, కోటబురుజుల పైన రెపరెపలాడ్తోంది. రాజవీధుల ఇళ్లముందు అత్తరు పన్నీరుతో కల్లాపిచల్లి ముత్యాల ముగ్గులు అలంకరించారు.

సపరివార సమేతముగా విష్ణువర్ధనుడు పెనుగొండ నగర సందర్శనకు

బయలుదేరాడు. కుసుమగుప్తుడు వెంట ఉండి విశేషాలు వివరిస్తున్నాడు. ప్రధానులతో సహా ఇరుదేశాల ప్రముఖులు, రక్షణ బలగాలు వెంట ఉన్నారు. నగర పర్యటనకు బయలుదేరే ముందు విష్ణువర్ధనుడు, కుసుమగుప్తునితో కరచాలనం చేస్తూ

"మనం స్నేహం, ఇరుసామ్రాజ్యాల సౌభాగ్యం" అన్నాడు.

"తరతరాలుగా మన సామ్రాజ్యాల మధ్య పెనవేసుకున్న మైత్రీబంధము మరింత బలోపేతమవుతుంది." కుసుమగుప్తునిలో సంతోషం పొంగింది. "భారత ఖండము మనలాంటి సామ్రాజ్యాల సమూహము, రాజ్యాలన్నీ సుఖసంతోషాలతో వర్ధిల్లుతూంటే, మనమంతా ఐక్యంగా ఉంటేనే భారత ఖండము అఖండంగా ఉంటుంది. పరాయిలు ఇటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించరు. మీరు మా పెనుగొండను సందర్శించడము అదృష్టంగా భావిస్తున్నాము." అంటూ ఆప్యాయంగా కౌగలించుకున్నాడు.

పట్టణ ప్రధాన ద్వారము వద్ద బాలనగరుల సాహస విన్యాసాలు అందరినీ అబ్బుర పరిచాయి.

"వీరంతా ఎవరు ?" పక్కనున్న తన గూఢాచారాధిపతి నడిగాడు విష్ణువర్ధనుడు.

"వీరంతా యువకులు. ఈ సామ్రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడే బాలనగరులు. వీరంతా సైనిక శిక్షణ పూర్తి చేసినవారే. శిక్షణా శిబిరాల్లో వీరికి భారత వీరుల సాహస కృత్యాలు, పురాణ పురుషుల జీవనశైలి, ధర్మాచరణ గురించి బోధిస్తారు. ఈ వీరులంతా రణరంగ ధీరులే. బాలనగరుల బృందాలన్నింటినీ కుసుమగుప్తుల వారి కుమార శేఖరులు, యువరాజు విరూపాక్షుల వారు పర్యవేక్షిస్తారు." చెవిలో చెబుతూ పక్కనే వెంబడిస్తున్న విరూపాక్షుడిని కంటితో చూపించాడు.

అక్కడే మహారాజులిద్దరూ ఏనుగు అంబారీలు దిగి ప్రత్యేక రథములో ఆసీనులయారు. గజ, తురగ దళాలు వెంట నడుస్తున్నాయి. పదాది దళాలు ముందున్నాయి. శోభాయాత్ర మేళతాళాలతో ప్రధాన వీధుల గుండా సాగుతోంది. మేడల పైనుండి తరుణులు పూలవాన కురిపిస్తున్నారు. బాట కిరువైపులా బారులు తీరిన జనాలు అమితానందముతో తిలకిస్తున్నారు.

ఇంద్రలోకాన్ని తలపిస్తున్న పట్టణ శోభ విష్ణువర్ధనున్ని ఆశ్చర్యానందాలలో ముంచెత్తింది. శోభా యాత్ర శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం ముందు ఆగింది. కుసుమగుప్తుడు ముందు రథము దిగి విష్ణువర్ధనునికి స్వాగతం పలికాడు. వేదపండితులు వికసిత వదనాలతో ఎదురొచ్చి

"ఓం హిరణ్య వర్ణాం హరిణీం
సువర్ణ రజతస్రజామ్ చంద్రాం
హిరణ్మయీం లక్ష్మీం
జాతవేదోమ ఆవహ... " శ్రీ సూక్తాన్ని పఠిస్తున్నారు. అర్చక స్వాములు పూర్ణకుంభముతో స్వాగతం పలుకుతూ ఆలయంలోనికి తీసుకెళ్లారు. విష్ణువర్ధనుని చూపులు అమ్మవారి విగ్రహాన్ని ఆపాదమస్తకం తడుముతున్నాయి. షోడష కళాప్రపూర్ణ కన్యకాపరమేశ్వరిలో అమోఘమైన కళాకాంతులున్నాయి. సర్వాలంకార భూషిత నూతన సోయగాలొలికిస్తుంది. నుదుటిపైన ఎర్రని కుంకుమబొట్టు, బొట్టుపైన సిందూర కాంతులీనుతున్న రత్నము పాపిట బిళ్లగా అలంకరించబడింది. నవరత్నాలు పొదిగిన కిరీటం కాంతులు చెక్కిళ్ల మెరుపుల్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. వజ్రవైఢూర్యాలు పొదిగిన బంగారు వొడ్డాణము మిరుమిట్లు గొలుపుతుంది. అంతా కలిసి దివినుండి అప్పుడే భువికి దిగిన దేవతలాగుంది.

"విష్ణువర్ధన మహారాజా !" కుసుమగుప్తుడు చెప్తున్నాడు. "ఆదిశక్తి పధ్నాలుగు రూపాలలో కన్యకాపరమేశ్వరి రూపము ప్రముఖమైంది. ఏడొందల పధ్నాలుగు గోత్రీకులైన వైశ్యులకీ తల్లి కులదేవత. అంతేకాదు సమస్త ప్రాణికోటిని రక్షించేది ఈ అమ్మనే. అందుకే అందరూ ఈ మాతను పూజించి ఆశీస్సులందుకుంటారు... "

తన ముందున్నది విగ్రహములా కాకుండా పదహారేళ్ల పడుచులా కనబడుతోంది విష్ణువర్ధనునికి. కదలి ముందుకొస్తున్నట్టు, గాజుల గలగలలు, కాలి అందెల సవ్వడితో కలిసి చెవులకు సోకినట్టు... అదేదో వింత అనుభూతి.

ఈ రూపానికీ, నాకు ఏదో సంబంధమున్నట్టుంది... అనుకుంటూ కనురెప్ప వేయకుండా చూస్తున్నాడు.

"మహారాజా ! అమ్మవారి ప్రసాదం స్వీకరించండి." ప్రధాన పూజారి పలుకరించాడు. కనురెప్పలు కదిలినై. తీర్ధ ప్రసాదాలు స్వీకరించాడు.

అక్కణ్నుంచి బయలుదేరి నగరేశ్వరాలయం చేరుకున్నారు. నగరేశ్వరస్వామికి పూజలు చేయించి కుసుమగుప్తుని నివాసానికి బయలుదేరారు. రంగురంగుల మేడలు, గోడలకు తైల వర్ణచిత్రాలు, బహుళ అంతస్తుల మేడల మీంచి కురుస్తున్న పూలజల్లు... దేవలోకములో విహరిస్తున్నట్టుంది.

అంతఃపురములో అతిథి గణానికి విందు ఏర్పాటైంది. షడ్రుచులతో పసందైన వంటకాలు జిహ్వాచాపల్యాన్ని తీర్చాయి. ఆ తర్వాత సభామంటపములో కొలువుదీరారు.

రతనాలు పొదిగిన ప్రత్యేక ఆసనంపై విష్ణువర్ధనుడాసీనుడయాడు. అతిథికి అతి విలువైన వజ్రవైఢూర్యాలను కానుకగా సమర్పించి కుసుమగుప్తుడు సభనుద్దేశించాడు.

"మహాశయులారా ! ఇరుగుపొరుగు సామ్రాజ్యాలతో మైత్రీబంధాన్ని పెంచుకోవాలనేది మన ఆశయం. అహింసా సిద్ధాంతాన్ని ఆదరించిన మన పరిపాలనా సంస్కరణలందరికీ తెలుసు. బలవంతులైన శ్రీ విష్ణువర్ధన మహారాజు మన రాజధాని నగరాన్ని సందర్శించడం మనకెంతో ఆనందదాయకం. సాధు స్వభావులైన మా ప్రజల తరపున అరివీర భయంకరులైన సేనాపరివారము తరఫున వారికి కృతజ్ఞతలర్పిస్తున్నాను. మా ఆహ్వానాన్ని సహృదయంతో మన్నించినందుకు ఈ చిరుకాన్కను సమర్పిస్తున్నాము. స్వీకరించండి." అంటూ రంగుల రతనాలు పొదిగిన త్రాసును బహుకరించాడు.

విష్ణువర్ధనుని ఆనందానికవధుల్లేవు. తృప్తిగా, మనస్ఫూర్తిగా నవ్వుకున్నాడు. సపరివార సమేతముగా విడిది చేరుకున్నాడు.

వైభవోపేతమై, సకలసంపదలతో తులదూగుతున్న ఈ సామ్రాజ్యము నా పరిపాలనాధీనములో ఉంటే ఎంత బావుంటుందో !... కోర్కె లోలోపల రెపరెపలాడింది. ఇప్పుడే అలా ఆలోచిస్తే బావుండదనే ఇంగిత జ్ఞానం అడ్డొచ్చింది.

సాయం సమయమాసన్నమైంది. ఆకాశయానములో అలసిన సూర్యుడు పశ్చిమాద్రి చేరుకుంటున్నాడు. కాషాయ కాంతి కిరణాలు ఉద్యానవనము నిండా కొత్త రంగులు పరుస్తున్నాయి. మనోజ్ఞ దృశ్యాలను మనో నేత్రాలతో అవలోకిస్తున్నాడు విష్ణువర్ధనుడు. పరివారము తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తోంది. అప్పుడే చల్లని పిల్లగాలి కెరటము మంజుల మనోజ్ఞరాగాలు మేళవించిన సుమధుర గానలహరిని మోసుకొచ్చింది. ఏ గంధర్వ కన్య గొంతులోంచి వెలువడుతుందో ! అది... అవును... అదే స్వరము. ఆనాడు అర్ధరాత్రి తనను మైకంలో ముంచెత్తి పిచ్చెక్కించింది... అదే సుస్వరము... అదే గానమాధుర్యము. అది అంతరంగ తరంగ ధ్వనులకు తాళం వేస్తోంది. ఎక్కడినుండి వస్తుందా సుస్వర గానము ? ఎవరి గొంతులోంచి వస్తోంది ? ఆహా... ఎక్కడినుంచో కాదు... పక్కనున్న ఉద్యానవనము లోంచే ! మనసు చెంగలించింది. భటులను పిలిచి ఆ గాన మాలాపిస్తున్న దెవ్వరో కనుక్కుని రమ్మని ఆజ్ఞాపించాడు. మెదడు పొరల్లో సంచలనం చెలరేగింది.

గానము వినబడుతూనే ఉంది. భటులు అటువైపు పరుగులు తీశారు.

విష్ణువర్ధనుని నరాల్లో వింత స్వరాలు వినబడుతున్నాయి. బయటికొచ్చి అటూ, ఇటూ చూపులు సారించాడు. పొదలమాటున ఓ జవ్వని, అపురూప లావణ్యవతి గొంతు

లోంచి వస్తుందా గానమాధుర్యము. చుట్టూరా చెలికత్తెలున్నారు. అయాచితంగా అడుగులు అటు పడుతున్నాయి. పూపొదలకు దగ్గరయాడు.

హంసలా అడుగలేస్తూ, మయూరిలా నర్తిస్తున్న బాలామణి పట్టుపరికిణీ గాలికి రెపరెపలాడ్తోంది. భావగీతాన్నాలాపిస్తూ చెలికత్తెలతో ఆడుకుంటోంది. గీతము భావుకత, గొంతులో అమృతవాహిని... అనితర సాధ్యము. ఆమెరూప లావణ్యాన్ని, ఒంపుసొంపుల్ని విష్ణువర్ధనుని చూపులు అమితాసక్తిగా తడుముతున్నాయి. అందాల చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాయి. నిశ్చేష్టుడై అక్కడే నుంచుండిపోయాడు. భుజాల మీంచి జారిపోతున్న పట్టు వస్త్రాన్ని సవరించుకోవాలన్పించలేదు. బొమ్మలా నుంచున్న మహారాజు వాలకం భటులను అయోమయంలో ముంచెత్తింది. వెంటనే ప్రధాని నాశ్రయించారు. ప్రధాని సైనికాధికారితో సహా వచ్చాడక్కడికి.

సంజ కెంజాయలు బూడిద వర్ణమవుతున్నాయి. సూర్యుడు పశ్చిమాద్రి చేరుకున్నాడు. అందాల బాలామణి పాట, ఆట పూర్తయింది. నవ్వుతూ, నవ్విస్తూ చెలికత్తెలతో పట్టణం వైపు నడుస్తోంది. మరబొమ్మలా విష్ణువర్ధనుడా గుంపు వెనక నడుస్తున్నాడు. ప్రధాని, సైనికాధికారి పరుగెత్తుకొచ్చి విడిది లోపలికి నడిపించుకెళ్లారు.

"తమరి మనసు నంతగా రంజింపజేసిన ఆ బాలామణి ఎవరు ప్రభూ ?" సౌమ్యంగా అడిగాడు ప్రధాని విజయసింహుడు.

"అదే తెలుసుకోవాలి అమాత్యా ! ఆనాడు... అర్ధరాత్రి... నన్ను పిచ్చివానిగా మార్చేసిన గానమాధుర్యమదే. నా ఊహాలోకాల్లో చిందువేసిన ఆ బాలమణే, ఈ బాలామణి. ఆమెకు పెళ్లికాలేదని మెడలో ఉన్న రూపు ఆభరణం ద్వారా తెలుస్తుంది. ఆ సౌందర్యరాశి ఎవరో వెంటనే వివరాలు సేకరించండి." తేరుకుంటూ దండనాయకు న్నాదేశించాడు.

ఆదేశం వెంటనే అమలైంది.

విష్ణువర్ధనుని మెదడు పొరల్లో తుఫాను ఊపిరి పోసుకుంటోంది. క్షణమొక యుగంగా గడుస్తోంది. నాల్గువైపులా వెతికి, వేసారి భటులు, దండనాయకుడు తిరిగొచ్చారు.

"వివరాలు సేకరించారా ?" ప్రధాని అడిగాడు.

"ప్రభూ ! సేకరించాము." దండనాయకుడు తలవంచుకున్నాడు. "ఆ సౌందర్యరాశి పెనుగొండ సామ్రాజ్యాధిపతి శ్రీ కుసుమగుప్త మహారాజు గారి గారాల కూతురు వాసవీదేవి."

"సరే... మీరు వెళ్లొచ్చు."

అందరినీ బయటకు పంపించి ప్రధాని ఒక్కడే విష్ణువర్ధనుని ముందున్నాడు. విష్ణువర్ధనుని మనో విహంగము రెక్కలు విప్పుకుని ఊహా లోకాల్లో విహరిస్తోంది.

"ఇక వెల్దామా ప్రభూ !" ప్రధాని కదిపాడు.

"వెళ్లడానికి తొందరెందుకూ ?" అసహనంగా కదిలాడు.

"అదేమిటి ప్రభూ ! మనం ఇక్కణ్నుంచి పాలకొల్లు వెళ్లి క్షీరరామలింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేయించాలి గదా !"

"పాలకొల్లా !... క్షీరాభిషేకమా !... ప్చ్ !" పెదవి విరిచాడు. బుర్రలో ఏదో బురిడీలు కొడుతోంది.

ఏమైంది మహారాజా ?"

"ఆ స్వరమాధుర్యం నా సొంతం కావాలి. ఆ అందాల వాసవి మా మనసు దోచింది అమాత్యా ! ఆ పైడి బొమ్మను అర్ధాంగిగా చేసుకుని పద్మశయనపురం తీసుకెళ్లాలి. ఆ అడుగుల సవ్వడి వినకుండా, గానమాధుర్యాన్నానుభవించకుండా ఉండలేను." మాటల్లో ఉద్రేకం... కళ్లల్లో ఉన్మాదం. పిడుగు పడ్డట్టైంది ప్రధానికి. "మహారాజా !" ఆవేశాన్ని అదిమిపెట్టి అరిచాడు.

మహారాజు చలించలేదు.

"మహారాజా ! ఏమిటా వింత కోర్కె ? మీరో సామ్రాజ్యాధినేతలు. మహారాజులు... పైగా వివాహితులు."

"అయితే ఏం ?" రోషం రుసరుసలాడింది." మా అంతఃపురము మరో రాణికి చోటులేనంత ఇరుగ్గా ఉందా ? మా హృదయములో మరో భామకు చోటు ఉండదనుకున్నారా ?"

"మహరాజా ! పద్మశయన అంతఃపురము విశాలమైనదే. మీ హృదయం అంతకంటే విశాలమైందనీ తెలుసు. కానీ... వాసవి వయసు, మీ వయసులో... తేడా... చాలా ఉంది గదా !"

"వయసుతో పనిలేదు. మనసులోనే అంతా ఉంది."

"అదికాదు మహారాజా !" ప్రధాని అయోమయం. "కుసుమగుప్తుల వారిది వైశ్యజాతి. మీరు క్షత్రియులు. ప్రభువంటే ఈ సామ్రాజ్య ప్రజలకు ప్రాణం... "

"అయితే మాత్రం ఏమిటటా ? శ్రీకృష్ణుడు యాదవుడు. అతని అష్టభార్య లందరూ యాదవులేనా ! అయినా... శాస్త్రోక్తంగా పెళ్లాడ్తానంటున్నాను గదా !"

"నిజమే కానీ... తమరు తొందరపడుతున్నారేమో ప్రభూ ! దయచేసి మరోసారి ఆలోచిస్తే బావుంటుందేమో !" చేతులు జోడించాడు. ఇది తగదని హితవు పలికాడు.

"అన్నీ ఆలోచించాను అమాత్యా ! ఆనాడు... అర్ధరాత్రి... ఇదే స్వరం,ఇదే గానమాధుర్యం మమ్మల్ని మరో లోకానికి తీసుకెళ్లింది. ఆ గానమాధుర్యాన్నొలకించిన అందాల సుందరి ఆచూకి ఈ రోజు తెలిసింది. ఈనాడా గానం విన్నప్పట్నుంచి, ఆ కన్యకామణిని కళ్లారా చూసినప్పట్నుంచి మళ్లీ మా మనసులో దుమారం చెలరేగుతోంది. ఆ బాలామణి, ఆ గంధర్వ గానము నా సొంతం కావాల్సిందే." పిచ్చిగా అరిచాడు.

ప్రధాని విజయసింహునిలో భయాందోళనలు.

"ప్రభూ ! మీ కోర్కె వెనక పద్మశయన సామ్రాజ్యం గౌరవ ప్రతిష్ఠలు, మహారాణి విమలాదేవి గారి పాతివ్రత్యం, మీ ఆరోగ్యం... " చెప్పుకు పోతున్నాడు.

"అమాత్యా !" అసహనం ఆకాశానికంటింది." ఇక చాలించండి. మీరు స్వయంగా నడుం బిగించి వ్యవహారం నడిపించండి."

"అం... టే ! మహారాజా !" నోరెల్ల బెట్టాడు.

"మీరే స్వయంగా కుసుమగుప్తుల వారి వద్దకెళ్లి వాసవిని నాకిచ్చి వివాహం చెయ్యాలనీ, ఆమెనో మహారాణిగా చూడాలని... ఒప్పించండి. వాసవి నా అర్ధాంగి కావాల్సిందే. దానికి తిరుగులేదు."

ప్రధానికి పచ్చుమిరపకాయ పంటికింది కొచ్చినట్టైంది.

"మహారాజా !" ధైర్యం కూడగట్టుకున్నాడు. "భస్మాసురాదులు, మరెందరో మానవులు పరనారీ వ్యామోహంతో పతనమై... "

"మహామంత్రీ !" చిన్నపాటి గర్జన. " మాకన్నీ తెలుసు." ప్రధాని మాటల్ని తుంచేశాడు. వాసవి సర్వాలంకార భూషితయై తనముందే సంచరిస్తున్న అనుభూతి. కళ్లల్లో చిరాకు నింపేసింది. "ఉచితానుచితాలు మాకు మాబాగా తెలుసు. ఆ భామిని లేకుండా నేనుండలేను. ఇప్పుడు నాక్కావల్సింది హితవచనాలు కాదు... ఆ అందాల సుందరి కరగ్రహణం. ఇంతటి మహారాజును. మీలాంటి సర్వసమర్థులైన ప్రధానమంత్రి గలవాడిని... ఆ మాత్రం కోర్కె నెరవేర్చుకోలేనా ? మనసైన మగువను శాస్త్రోక్తంగా నాదానిగా చేసుకోలేనా ?" ప్రశ్నా బాణాలు సంధించాడు.

అది నిందా ప్రశంసనో, ప్రశంసా నిందనో అర్థంకాక ప్రధాని హతాశుడయాడు.

మానవుడెంత ఉత్తముడైనా... కామం పొరలు కళ్లను కప్పేస్తే దానవుడైపోతాడు.

యుక్తాయుక్త విచక్షణ నశిస్తుంది. ధర్మసూక్ష్మాలెన్ని చెప్పినా తామరాకుమీది నీటి బిందువుల్లా జారిపోతుంటాయి.

వినాశకాలే విపరీత బుద్ధిః... పాడుకాలం దాపురిస్తే ఫాలాక్షుని మాటలు గూడా రుచించవు. చెడిపోయే కాలానికి చెట్టుకు కుక్కమూతి పిందెలు పుడతాయట. ఎవరి భవిష్యత్తు ఎలాగుందో ! అంతా దైవాధీనం.

అయినా పద్మశయన సామ్రాజ్య లక్ష్మి క్షేమం దృష్ట్యా ప్రయత్నించక తప్పదు. ప్రయత్నం ఫలిస్తే విమాలాదేవి లాంటి సాధ్వీమణి కపచారం చేశాననే బాధ మిగులుతుంది. భారతఖండం భవిష్యత్తు... నా ప్రజల సంక్షేమం కోసం ఆ బాధ భరించక తప్పదు... విజయసింహుని ఆలోచనాలోచనాల్లో ఎన్నో సంఘటనలు ఇలా ప్రత్యక్షమై అలా మాయమైపోతున్నాయి.

ఆ రాత్రి అక్కడే విశ్రమించాలని నిర్ణయించారు.

# 10

పద్మశయన పురము... అంతఃపుర సమావేశ మందిరము. ప్రధాని విజయసింహుడు, సామంత రాజులతో సహా మహారాజు విష్ణువర్ధనుని ముందున్నాడు. యువరాజు, కోశాధికారి, సేనా నాయకులు... సామంతులతో చర్చలు సాగించారు. సామ్రాజ్యములో అంతా బాగుందని తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. సమావేశం చివరలో

"ప్రజల కోసం సత్కార్యాలు చేసేవారికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. కార్యక్రమాల కోసం కాసులకేమీ కొదవలేదు. ఖజానా నిండుగా ఉంది." మహారాజు సూచననుసరించి ప్రకటించాడు కోశాధికారియైన విత్తమంత్రి.

రాజ్య రక్షణ గురించి ప్రకటించాలని మహారాజు ఆదేశం.

"సామ్రాజ్య రక్షణ విషయంలో మన యంత్రాంగం రాజీపడదు. యువరాజు రాజనరేంద్రుల వారు సైనిక బలగాల పనితీరును, రక్షణ బలగాల సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలిస్తున్నారు. తగు సలహాలిస్తున్నారు." చెప్పాడు సర్వసైన్యాధ్యక్షుడు.

ఝంయ్... ఝంయ్... ఝంఝం... ఝం... ఈదురుగాలి మందిరం లోపలికొచ్చింది. క్షణక్షణానికి ఉధృతి పెంచుకుంటూ సుడిగాలి... ఎన్నడూ కనీవిని ఎరుగని తుఫానులా రూపుదిద్దుకుంటోంది.

"ఇదేమిటి ? నాలుగ్గోడల మధ్య... సుడిగాలా... !" మహారాజులో ఆందోళన

అంతా ఆందోళనగా అటూ ఇటూ చూస్తున్నారు. ఎక్కడినుంచి వచ్చిందో ఎవ్వరికీ అంతుబట్టలేదు... సుడిగాలికి కిటికీల రెక్కలు, తలుపులు కొట్టుకుంటున్నాయి. దబదబా అన్నింటినీ మూసాశేరు. అయినా గాలి దుమారం ఆగలేదు.

ఝు ఝు ఝు ఝు ఝుంయ్... ఝుంయ్... జ ఝు... జ ఝు... ఝుంయ్... ఝుంయ్... అది సుడిగాలా లేక ప్రళయ ఝుంఝూమారుతమా !...

ఆసనాలు కదుల్తున్నాయి... కాదు... తలకిందులై పడిపోతున్నాయి. అయ్యో... అయ్యయ్యో... అరుపులు... గావు కేకలు... మిడిమేలిపు సుడిగాలి మనుషులకు వడివడిగా చుట్టుకు పోతోంది. మందిరం బొంగరంలా తిరుగుతోంది, ఒకరిమీదొకరు, ఒకరి అరుపులో ఇంకొకరి ఆర్తనాదం... అందులో రాజు ఎవరో, మంత్రి ఎవరో... భటులెవరో... అంతా ప్రభంజనం... అందరి ప్రాణాలు అరచేతుల్లో...

"గాలి... సుడిగాలి... అబ్బో... ప్రళయం... తుఫాను... కాపాడండి... ఎవరక్కడా... కాపాడండి... " ప్రధానమంత్రి అరుపులు, కేకలు విష్ణువర్ధనుని పెనుగొండ విడిదిని అతలాకుతలం చేసినై. పద్మశయన పురము కాదది... పెనుగొండ !

ఏమైంది... ఏమైందటా... ఈ రాత్రి అరుపులేమిటీ ?... భటులు, సేవకులు ప్రధాని గుడారంలోకి పరుగెత్తుకొచ్చారు.

"సుడిగాలి... దెయ్యం గాలి... కాపాడండి... " విజయసింహుని కేకలకు దిక్కులు పిక్కటిల్లుతున్నాయి.

"అయ్యా ! ప్రధానామాత్యా !" ప్రతీహారి భుజాలు పట్టి కదిలించాడు. ప్రధాని విజయసింహుడు ఉలిక్కిపడి లేచి శయ్యమీదనే కూచున్నాడు. ఆ ఊపుకు శయ్య ఊగిసలాడింది. కళ్లు నులుముకున్నాడు. మసక దీపం వెలుతురు... ఎదురుగా ప్రతీహారి, భటులు...

"ఏమైంది... మీకెమైంది ప్రధానామాత్యా ? ఎందుకలా కేకలు పెడుతున్నారు ?" అడిగాడు ప్రతీహారి. భటుడొకడు దీపకాంతి పెంచాడు.

"ఆఁ... ఆఁ... గాలి... సుడిగాలి... ఆగిపోయిందా ? ఏరీ... మన యువరాజు, మంత్రులు, అంతఃపుర వాసులు... " మరోసారి కళ్లు నులుముకున్నాడు ప్రధాని." మన మహారాజుగారేరీ ?" అటూ ఇటూ దృష్టి సారించాడు. ఇంకా తెల్లవారలేదు.

"మహామాత్యా ! మనమున్నది పెనుగొండలో... "

"అవునవును. పద్మశయన పురము... సమావేశము... క్కా... కాదు గదూ !"

పూర్తిగా నిద్రావస్తలోంచి బయటపడ్తున్నాడు. “అరెరే... మరి... అదేమిటీ ? అదో పీడకల అన్నమాట.” అరచేతుల్తో మొహం తుడుచుకున్నాడు. అంతరాళాల్లోని తుఫాను శాంతించింది. కల గురించి అందరికీ చెప్పేశాడు.

విడిదిలో కలకలం వ్యాపించింది. పరివారము మనసుల్లో కలవరం పొడ సూపింది. సైనికాధికారులు స్వయంగా వచ్చి పలుకరించారు, పరామర్శించారు.

“నా కల గురించి మీరేమీ ఆందోళన పడొద్దు. వెళ్లండి. విశ్రాంతి తీసుకోండి. ఈ పీడకల నిక్కడే వదిలేసి బాధ్యతలను నిర్వర్తించుదాం... ”

“సరేగాని మహామాత్యా ! తెల్లవారే ముందు వచ్చిన కల నిజమవుందంటారు. మన సామ్రాజ్యానికేదో ముప్పు ముంచుకొస్తుందేమో !” ఓ సైన్యాధికారి అనుమానం.

“ఏది ఏమైనా... ఎవరేం చెప్పినా మన మహారాజుగారు పెడచెవిన పెడ్తున్నారు. ఇదంతా ఓ కట్టుకథ అని కోపగిస్తారు. అయినా... కలలన్నీ కల్పితాలు. నిజంకావు... వెళ్లండి.”

చిమ్మ చీకట్లను తరిమేస్తూ చైతన్యం తన ఉనికి తెలుపుకుంటోంది. బయటి వాతావరణం రంగులు మారుతూ బూడిద రంగులో కొస్తోంది. తూరుపు ఆకాశం అరుణవర్ణం పులుముకుంది.

ఒకానొక దుర్ముహూర్తములో మెదడు పొరల్ని తొలిచేసిన దురాలోచన మారో సుముహూర్తంలో దూరాలోచనగా మారవచ్చు. దూరభారాలను విశ్లేషించుకుని సదాచారాన్ని పాటించు మనవచ్చు. ఆవులిస్తూ శయ్య దిగాడు ప్రధాని. ఒళ్లు నొప్పిగా ఉంది. తయారై మరో ప్రయత్నానికి బయలుదేరాడు.

విష్ణువర్ధనునికి గూడా రాత్రంతా సరియైన నిద్రలేదు. కళ్లు మూసినా, తెరచినా వాసవి రూపమే కవ్విస్తోంది. తెల్లవారక ముందే స్నానాదులు ముగించుకుని కూచున్నాడు. విజయసింహుడు కనబడగానే

“ఎందుకింకా ఆలస్యం ? వెంటనే బయలుదేరండి. కుసుమగుప్తుల వారితో సంప్రదించి శుభవార్తతో తిరిగిరండి.” పురమాయించాడు హుషారుగా.

“మహారాజా !” పెదాలపై బలవంతపు చిరునవ్వు పులుముకోక తప్పలేదు. “నాదో మాట... ”

“ఏమిటది ?” వాలకం గంభీరమైంది.

“వర్ణాశ్రమ ధర్మాలను తు.చ. తప్పకుండా పాటించే కుసుమగుప్తుల వారు...

ఆగ్రహిస్తారేమో ! ఆయన సామాన్యమైన సామ్రాట్టుకాదు. అస్త్రశస్త్ర ప్రయోగాల్లో ఆరితేరి అరివీర భయంకరులైన సైనికులాయన వద్ద ఎందరో ఉన్నారు. పైగా ఈ సామ్రాజ్య ప్రజల్లో రాజభక్తి, దేశభక్తి మెండు. మహారాజుకు రాజ్యవిస్తరణ కాంక్షలేదు గానీ అపకారం తలపెట్టిన వారి అంతుచూసి గాని వదలరు. వంశ మర్యాదలు, ధర్మాచరణ మంటే ప్రాణప్రదంగా భావిస్తారు... " పూర్తి కాలేదింకా. ఒక్కోమాట ఒక్కో వాడిబాణమై విష్ణువర్ధనున్ని గాయపరుస్తోంది.

"అయితే ఏమిటటా ?" అసహనంగా హుంకరించాడు. "మన పద్మశయనానికేం కొదవ ? సుశిక్షితమైన సైనిక బలగాలున్నాయి. ఏ యుద్ధములోనూ అపజయమెరుగని చరిత్ర ఉంది. మన ప్రజల రాజభక్తిని, దేశభక్తిని శంకించాల్సిన అవసరమే లేదు. నేనో సామ్రాజ్యాధిపతిని. మనసుదోచిన మగువను శాస్త్రోక్తంగా స్వీకరించడం తప్పా ? ఇది మన పరువు ప్రతిష్ఠల విషయం గూడా."

"అయితే... మీ నిర్ణయమదేనంటారా ?" తల నేలకు వాలింది.

"ముమ్మాటికీ అంతే. శశభిషలు మాని వెళ్లండి. శుభవార్తతో తిరిగిరండి." తిరుగులేని ఆదేశం.

కల విషయం చెబితే కల్ల అని కొట్టిపారేస్తాడు. నా నిజాయితీని శంకిస్తాడు. ఆజ్ఞాపాలనమే అవశ్యము.

"సరే... మహారాజా !" విజయసింహుడు వికల మనస్కుడై బయలుదేరాడు. పద్మశయన సామ్రాజ్యలక్ష్మి ! నిన్ను నీవే కాపాడుకో తల్లీ !... మనసులోనే ప్రార్థిస్తూ అశ్వారూఢుడైనాడు.

విశాలమైన బాటల కిరువైపులా బహుళ అంతస్తుల భవనాలు స్వాగతం పలుకుతున్నాయి. ముంగిళ్లలో రంగుల ముగ్గులు, మంచినీళ్ల బిందెలతో యువతులు, నదీస్నానానికెళ్లి వస్తున్న నాగరికులు... సుప్రభాతం ఆహ్లాదకరంగా ఉంది.

"మహారాజా ! పద్మశయన సామ్రాజ్య ప్రధానామాత్యులు తమరి దర్శనం కోసం ఎదిరి చూస్తున్నారు." అప్పుడే పూజా గదిలోంచి బయటికొచ్చిన కుసుమగుప్తునికి విన్నవించాడు ప్రతీహారి.

విష్ణువర్ధనుని ప్రధానియా ! ఇంత పొద్దున్నే... ఎందుకో ! బహుశః... తిరిగి వెళ్లేముందు చెప్పివెళ్లాలనేమో !...

"మర్యాదగా తీసుకురండి." ప్రతీహారిని పంపించి తయారై కూచున్నాడు.

"శ్రీ కుసుమగుప్త ప్రభువుల వారికి సాదర నమస్సుమాంజలి." నమస్కరిస్తూ లోపలికొచ్చాడు విజయసింహుడు.

"రండి... ఆసనాన్నలంకరించండి."

"ప్రభూ ! మహారాజుగారి అభ్యర్తనతో వచ్చాను." సుఖాసీనుడయాడు. "చెప్పుమంటారా ?"

"చెప్పండి." పెదాలమీది చిరునవ్వు ఉదాత్తంగా ఉంది.

"మహారాజా... !" విజయసింహుడు ధైర్యం కూడగట్టుకున్నాడు. "మా విష్ణువర్ధన మహారాజు ఇరు సామ్రాజ్యాల మైత్రీ బంధాన్ని బంధుత్వంగా మార్చాలనుకుంటున్నారు."

"మాతో... బంధుత్వమా ?" కనుబొమలు అసంకల్పితంగా ముడిపడినై. "ఎలా ... ?"

"పెళ్లి సంబంధముతో... !"

"పెళ్లా... ఎవరికి... ఎవరితో ?"

"మీ చిరంజీవి... లక్ష్మీసేవకురాలైన వాసవి మా సామ్రాజ్యానికి కోడలుగా రావాలని వారి సంకల్పం... "

"మా వాసవి... మీ సామ్రాజ్యానికి కోడలా ?" అయోమయం. "అంటే మీ మహారాజు గారు తమ కుమారుని వివాహం చెయ్యాలనుకుంటున్నారా ?" సర్దుక్కూచున్నాడు.

"కాదు. మా మహారాజు గారే స్వయంగా వాసవీదేవిని శాస్త్రోక్తంగా వివాహమాడి పద్మశయన సామ్రాజ్యానికి మహారాణిగా చెయ్యాలనుకుంటున్నారు ... కాదు ... నిర్ణయించారు."

"నిర్ణయమా ?" రోషం పొడుచుకొచ్చింది. అయోమయం అసహనంగా మారింది. "అసలూ ... మీరేం మాట్లాడుతున్నారు ? సరిగా ఆలోచించుకునే మాట్లాడుతున్నారా ? ఇది కలకాదు గదా !"

"కల కాదు మహారాజా... వాస్తవమే. మా మహారాజుగారు బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ శుభవార్త మీకందించే బాధ్యతను నాకప్పగించారు..."

"శుభవార్త కాదిది, దుర్వార్త." ఆవేశాన్నంతా అదిమిపెట్టి "నిర్ణయం వెంటనే ఉపసంహరించుకుంటే మంచిది." తెగేసి చెప్పేశాడు. ముఖంలో రంగులు మారాయి.

"ప్రభూ !" కొంచెం భయమేసింది. "అందచందాల్లో శచీదేవిని మించిపోయిన మీ ఏకైక పుత్రికను అర్ధాంగిగా స్వీకరించేందుకు మీ అనుమతి తీసుకురమ్మన్నారు.

"అసంభవం. అనూహ్యం. అసంగతం." నిప్పులమీద అడుగేసినట్టుంది కుసుమగుప్తునికి. లోలోపలి కోపాన్ని మర్యాద కోసం గొంతులో బందీచేయాల్సి వచ్చింది. "ఇదా మీ మహారాజు పన్నాగం ! దీనికి మీరుగూడా సమ్మతించారా ?" హుంకరించాడు.

"మీకు తెలియని దేమున్నది ప్రభూ !" సిగ్గుతో విజయసింహుని చూపులు నేలకు వాలాయి. "మహారాజుగార్కి మా సమ్మతితో పనేముంది ? వారి ఉప్పు-పులుసు తింటున్న సేవకులము. మా మహారాజుగారి ఆదేశాన్ని శిరసావహించడమే శరణ్యము గదా ! పాలకుల తప్పులను ఎత్తిచూపడం గూడా తప్పే గదా !" గొంతులో బాధ.

"అదెలా మహామాత్యా ? ఒకానొక సమస్య మహారాజుగారి ఆలోచనను తప్పుదారి పట్టించవచ్చు. ఆ సమస్యలోని చిక్కులను విడమరచి చెప్పి... కీడెంచి మేలెంచాలని నచ్చజెప్పడం... ప్రధానమంత్రిగా మీ బాధ్యత కాదా ? గతకాలములోని సంఘటనలను ఉటంకిస్తూ చెప్పి ముందు ముందు రానున్న ప్రమాదాలను మొదట్లోనే నివారించడము మీ ధర్మము కాదా ?"

నిర్మోహమాటంతో నిగ్గుదేలిన ప్రశ్నాబాణాలు సూటిగా గుండెలకు గుచ్చు కుంటున్నాయి. ఓర్పు వహించి నేర్పుగా ప్రవర్తించడమే మేలనుకున్నాడు విజయసింహుడు.

"మహారాజా !" చేతులు జోడించాడు. "దయచేసి నన్నంతగా పరీక్షించకండి. మీరు సర్వజ్ఞులు. మా మహారాజు అంతరంగ తరంగ ధ్వనిని పసికట్టి ఆ విధంగా మసలుకోవడం నా విధి. మా ప్రభువుల కోర్కెను మీకు విన్నవించాను. మీ సమాధానాన్ని మోసుకెల్తాను. బాగా ఆలోచించండి... "

అసలేం జరిగిందో కుసుమగుప్తుని కవగతమైంది.

"మహామాత్యా ! మీరు విజ్ఞులు. మీ ప్రభువుల కోరిక వర్ణాశ్రమ ధర్మానికి విరుద్ధము కాదా ?"

"మను స్మృతి ప్రకారం ధర్మమే గదా ప్రభూ !"

"మనమిప్పుడు కలియుగములో ఉన్నాము. ఈ యుగములో ఆచరణీయ మేదంటారు ? పోనీ... పరాశర స్మృతి అంగీకరిస్తుందా ?"

"స్మృతికి, గతికి సుతికుదరక పోవచ్చు. కాని... మహారాజులు తలచుకుంటే అసాధ్యాలు గూడా సుసాధ్యాలైపోవచ్చు."

"విష్ణువర్ధన మహారాజు పద్మశయన సామ్రాజ్యాధినేత. పెనుగొండ సామ్రాజ్యానికి కాదు గదా !"

"అవును ... నిజమే ప్రభూ ! కాని ... స్నేహం ?"

"స్నేహబంధమైనా ధర్మబద్ధంగా ఉండాలి. అధర్మం అనర్ధదాయకమని ప్రత్యేకంగా చెప్పాలా ? మీ మహారాజుది దురాలోచననే గాని దూరాలోచన కాదు. మేమందుకంగీకరించమని వేరుగా చెప్పాలా ?"

"కుసుమార్య ప్రభూ !" విజయసింహుడు ప్రయత్నం మానలేదు. "మన ఇరు సామ్రాజ్యాల శ్రేయస్సు దృష్టా ఇది సమ్మతమనే భావించవచ్చు గదా !"

"ఇది భావాలకు సంబంధించిన విషయం కాదు. వర్ణాశ్రమ ధర్మాచరణానికి సంబంధించిన విషయము. బాగా గుర్తుంచుకోండి... నిప్పుల మీద నడవాలనుకోవడం మూర్ఖత్వం. అందని ఫలాన్ని ఆశించడము అవివేకము." కుసుమగుప్తుడు నిబ్బరంగా మాట్లాడుతున్నాడు. "ఇరు సామ్రాజ్యాల శ్రేయస్సు నాశించి మీరు మీ మహారాజుకు ఈ ధర్మసూక్ష్మాలను విడమరచి చెప్పవచ్చు గదా ! కామాతురుడైన పాలకుడిని ముందు తరాల వారు ఛీకొడతారని సముదాయించవచ్చు గదా !"

విజయసింహుడు హతాశుడై నిట్టూర్చాడు.

"నా ప్రయత్నం నేను చేసింతర్వాతనే మీ ముందు కొచ్చాను మహాప్రభూ ! మా విష్ణువర్ధనుల వారి హృదయ పీఠమ్మీద మీ ముద్దుల కూతురు కొలువు దీరిందటా. ఏదిఏమైనా వారి మనసు మారదటా. మీరో విషయాన్ని గుర్తుంచుకోవాలి మహారాజా !"

"ఏమిటది ?" కనుబొమ లెగిరిపడినై.

"విష్ణువర్ధన మహారాజు సుక్షత్రియుడు. మహాబల సంపన్నుడు. వివాహ విషయములో రాజులు వర్ణబేధాలను పాటించాల్సిన అవసరం లేదన్న ధర్మ సూక్ష్మమున్నది. ఈ వివాహ బంధముతో పెనుగొండ సామ్రాజ్యం మరింత బలోపేతమవుతుంది. పెనుగొండ-పద్మశయన సామ్రాజ్యాలొకటైతే గోదావరి తీరమే కాదు, కృష్ణా-తుంగభద్ర తీరాలను గూడా జయించి దక్షిణ భారత ఖండాన్ని మన అధీనంలోకి తెచ్చుకోవచ్చు... " చెప్పుకు పోతున్నాడు.

"మహామాత్యా !" కుసుమగుప్తుడు నవ్వేశాడు. ఆ నవ్వులో సహృదయ సౌందర్యం గోచరించింది. "మీరు సలహాలివ్వడములో సమర్థులు. కాని... పెనుగొండ సామ్రాజ్యలక్ష్మి తన పరిధులను విస్తరించదలుచుకోలేదు. అకారణ యుద్ధ జ్వాలల్లో ఇతరులను తోసేసే రాజ్యవిస్తరణ కాంక్ష మాకు ఏ కోశానా లేదు. మా సైన్యములో అరివీర భయంకరులు, యుద్ధ విద్యాపారంగతులు, శస్త్రాస్త్ర ప్రయోగాల్లో నిష్ణాతులైన వారెందరో ఉన్నారు. మా బలగాల మీద మాకు సంపూర్ణ విశ్వాసముంది. అయినా... మా సామంత రాజ్యాల

నిత్యపరిపాలనలో గూడా మేము తలదూర్చము. మా ప్రజల రాజభక్తి, ధర్మదీక్ష... ఈ అధర్మాన్ని సహించవు."

"అయినా సరే... మీరు మరోసారి ఆలోచించండి మహారాజా ! గోరుతో పోయేదాన్ని గొడ్డలిదాకా తేకండని సవినయముగా మనవి చేస్తున్నాను."

కుసుమగుప్తుడు ఆలోచనలో పడిపోయాడు.

"అయితే మనం మా నగరేశ్వరస్వామి ఆలయంలో మాట్లాడుకుందాం రండి."

ప్రధానామాత్యుని పిలిపించి వెంటనే సమావేశానికేర్పాట్లు చేయించుమన్నాడు. నగరస్వాములు, మంత్రులు, పురప్రముఖులు అత్యవసర సమావేశానికి హాజరయారు.

నగరేశ్వరాస్వామి ఆలయము తూర్పువాకిలి మంటపములో సమావేశమయారు. కుసుమార్యుడు విజయసింహుని రాక గురించి అందరికీ చెబుతూ విష్ణువర్ధనుని వింతకోర్కె , అంతవరదాకా జరిగిన సంభాషణ గురించి వివరించి చివరికి

"ప్రజాస్వామ్యం పునాదులపై మన పరిపాలన సాగుతోంది. ఈ విషయములో మీ అభిప్రాయాలను నిర్మోహమాటంగా తెలిపి నా కర్తవ్యమేమిటో చెప్పండి." అన్నాడు.

సభాసదులంతా గుసగుస లాడుకున్నారు. కొద్దిసేపు తమలో తాము చర్చించుకున్నారు.

నగరస్వామి ఒకాయన ధైర్యంగా లేచి నుంచున్నాడు.

"మహారాజా ! వివాహాలు ధర్మబద్ధంగా జరగాలి గదా ! కేవలం విష్ణువర్ధనుల వారి కోర్కెను తీర్చడం కోసమే వర్ణాశ్రమ ధర్మాలను తోసిరాజనడం సమంజసంగా లేదు. ఈ సంబంధానికి ధర్మబద్ధత లేదు." నిర్మోహమాటంగా చెప్పేసి కూచున్నాడు.

మరో నగరస్వామి, అనుభవజ్ఞుడు సవినయముగా

"క్షత్రియుడైన విష్ణువర్ధనునికి – వైశ్యులైన మన మహారాజుల మధ్య వివాహ సంబంధం పొసగదు. స్నేహబంధము అపవిత్రమైపోతుంది. అంతే కాదు... వధూవరుల వయో భేదాల దృష్ట్యా గూడా ఇది అసంబద్ధము." కరాఖండిగా చెప్పేశాడు. మరో నగరప్రముఖుడు, వయోవృద్ధుడు

"ధర్మాన్ని రక్షించాల్సిన సామ్రాజ్యాధిపతులే తుచ్ఛమైన కోర్కెలు తీర్చుకోవాడాన్కి ధర్మాన్ని ఫణంగా పెట్టరాదు. ఈ సంబంధం పొసగదు. అతిథిగా వచ్చిన పద్మశయనాధిపతి అతిథిగానే వెళ్లిపోవడం మంచిది." హితవు పలికాడు.

విజయసింహుడు లేచి సభకు నమస్కరించాడు. అందరి వాలకాన్ని అవలోకిస్తూ

"మహామహులారా ! గంధర్వ కన్యలను తలదన్నే సౌందర్యవతులకు మా సామ్రాజ్యములో కొదవలేదు. అయినా మా మహారాజుగారీ సంబంధాన్నే ఇష్టపడడములో ఓ సదుద్దేశ్యముంది. మా మహారాజు గార్కి అన్ని హంగులున్నాయి. సాహస పౌరుషాల్లో వారిని మించిన వారులేరు. ధన, కనక, వస్తు, వాహనాలకు కొదవలేదు. విశాలమైన సామ్రాజ్యముంది. అయినా మా విష్ణువర్దనుల వారు సాధుస్వభావులు. శాంతికాముకులైన శ్రీ కుసుమగుప్త మహారాజుతో బాంధవ్యము వసంతకాలము, వసంత కోయిలకు గల సంబంధం లాగానే ఉంటుంది. దాంతో మన ఇరుసామ్రాజ్యాల ప్రజలు సుఖశాంతులనుభవిస్తారు. కష్టసుఖాలను కలిసి పంచుకుంటారు... " వాదన వినిపించాడు.

సభలో మళ్లీ గుసగుసలు... పుంజుకున్నాయి.

ధర్మ నిష్ఠాగరిష్టుడు, మౌద్గల్యస గోత్రోద్భవుడైన మౌళిశిష్ఠుడి కిదంతా అనవసరమైన ప్రహసనంలా గన్పించింది. లోలోపల పౌరుషం పొడసూపింది. లేచినుంచుని

"పద్మశయన ప్రధానమాత్యా ! మా కుసుమగుప్తుల వారి గురించి, వాసవాంబ గురించి మీకింకా పూర్తిగా తెలియదు. పగతుర గుండెల్లో నిద్రబోయే మా మహారాజు పుత్రకామేష్ఠి ద్వారా వాసవాంబను పుత్రికగా పొందారు. ఆమె అందాలరాశి మాత్రమే కాదు. సకల విద్యాపారంగతురాలు. కదన రంగములో ఆమె కత్తికి ఎదురుండదు. అయినా... శాంత స్వభావి. ఇంతకుముందీ లోకములో ఇష్టంలేని పెళ్లిల్లేవీ జరగలేదు. కాబట్టి ఈ వివాహము ధర్మబద్ధము కాదు. వాంఛనీయమూ కాదు." సముదాయించాడు.

విజయసింహునిలో పట్టుదల తగ్గలేదు.

"అయ్యలారా ! బాగా ఆలోచించండి. చంద్రవంశ యశో విశారదుడైన మా మహారాజును అల్లునిగా చేసుకోవడం మీ రాజ్యానికి క్షేమదాయకం. పాశుపతాస్త్రాన్ని సంపాదించిన అర్జునుని వంశజుడైన శ్రీ విష్ణువర్ధన మహారాజుతో వివాహబంధము మీ వైశ్య జాతికి మేలు చేస్తుంది."

తపస్సంపన్నుల కుటుంబములో జన్మించిన నాభీల వంశజాతుడు మల్హర శ్రేష్ఠి తలపాగా సవరించుకుంటూ లేచినుంచున్నాడు.

"మహామాత్యా ! మీ మహారాజు ఇంద్రుడు, చంద్రుడిలా మీకెలా కన్పిస్తున్నారో, మా మహారాజు మాకలాగే కన్పిస్తున్నారు. మీ మహారాజు ద్వారా లభించే కీర్తికండూతి మాకు గడ్డిపోచతో సమానము. దాంతోపాటు చేకూరే అపకీర్తిని మేము భరించలేము. మా శౌర్యసాహసాలనెవ్వరూ శంకించాల్సిన అవసరము లేదు. మా ఆత్మాభిమానము

ముందు దేవేంద్రుడు గూడా తలవంచాల్సిందేనని విష్ణువర్ధనుల వారికి వివరించండి.” చెప్పేసి కూచున్నాడు.

మల్హారశ్రేష్టి వైపు గుర్రుగా చూశాడు విజయసింహుడు. కళ్లల్లో ఎర్రజీరలున్నాయి. భుజకీర్తులను సగర్వంగా చూసుకున్నాడోసారి.

“ఓయీ మల్హారశ్రేష్ఠి మహాషయా ! చాతుర్వర్ణాల విభజనను గర్తుచేసుకుంటే బాగుంటుంది. బ్రహ్మ ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదభాగము నుడి శూద్రులు జన్మించారని తెలుసు గదా ! బ్రాహ్మణులు నాల్గు వర్ణాల వారితో, క్షత్రియులు మూడు వర్ణాల వారితో, వైశ్యులు రెండు వర్ణాల వారితో, శూద్రులు తమ వర్ణం వారితోనే వివాహం చేసుకునుట కర్తవ్యాలు గదా ! దేవయాని యయాతిని పెళ్లాడింఇ ఈ పద్ధతి ననుసరించే గదా !” యుక్తిగా నచ్చజెప్పాలని ప్రయత్నించాడు.

సభలో కలకలం బయలుదేరింది. పెనుగొండ ప్రధాని సైగనందుకుని ప్రశాంతమైంది. మైత్రేయస గోత్రీకుడు, వైశ్యప్రముఖుడు నాగశ్రేష్ఠి నవ్వుతూ లేచాడు. విజయసింహుని వైపు మందలింపుగా చూస్తూ కండువా సవరించుకుని

“కచ-దేవయానుల వివాహము వెనక కొంత నేపథ్యముంది, మహామాత్యా ! శుక్రాచార్యుని కూతరు దేవయాని కచుడుని మనసారా కోరుకుంది. అతనికే ఇల్లాలైంది. ఇక్కడి పరిస్థితి వేరు. మా వాసవాంబ విష్ణువర్ధన మహారాజును కోరుకోలేదు, ఇష్టపడలేదు. దేవయాని వృత్తాంతము సర్వేసర్వత్ర యోగ్యమైనది కాదు. అందరికి అనుసరణీయమూ కాదు. వధూవరుల ఇష్టంతోనే పెళ్లి జరగడం న్యాయము. ఒకరి ఇష్టంతో మాత్రమే జరగడం పైశాచికం. కాబట్టి మీ మహారాజుతో వాసవాంబ వివాహం ఆమోదయోగ్యం కాదు.” నిక్కచ్చిగా చెప్పేశాడు.

“మీ వాదన మా మహారాజు గారికి ఆమోద యోగ్యంకాదు.” రపీన అనేశాడు విజయసింహుడు.

సచ్చీలుడు, సనందన గోత్రోద్భవుడు హరిశిష్ఠుని కా మాట కర్ణకఠోరంగా వినబడింది. రోషం పులుముకున్న బాధతో కనుబొమలు ముడిపడినై. మొహం రౌద్రవర్ణమైంది. ఎగదన్నుకొస్తున్న ఆవేశాన్ని గొంతులో ఆపేసి లేచినుంచున్నాడు.

“అయ్యయ్యో ! నిష్కళంకమైన చంద్రవంశము మాన మర్యాదలను విష్ణువర్ధన సర్పం కాటేయబోతుందన్న మాట. ఆ వంశానికి మూలపురుషుడైన చంద్రుడే అతని గురువైన బృహస్పతి భార్య తారను గ్రహించి గురుద్రోహిగా చరిత్ర సృష్టించాడు. అదే వంశస్థుడైన దుశ్యంతుడు కణ్వమహర్షి పెంచి పోషించిన శకుంతలను రాక్షస విధిన

పెళ్లాడి ఆమెకే ద్రోహం చెయ్యాలనుకున్నాడు. అంత గొప్పవంశస్థుడైన విష్ణువర్ధనునికి మూర్ఖపు ఆలోచనలు రాక మంచి ఆలోచనలొస్తాయా ? ముందే వయసు మళ్లినవాడు. పెళ్లికెదిగిన కొడుకున్నవాడు. బాలాకుమారుడిలా మరో పెళ్లికి అర్రులు చాచడం అవివేకము. పద్మశయన సామ్రాజ్ఞికి తీరని మనోవేదన. అందుకే అంటారేమో... పటుత్వమనేది బాలునికి కాళ్లల్లో, యువకునికి నడుములో, వృద్ధునికి నోట్లో ఉంటుందని... పాపం !" ఝాడించి పారేశాడు.

మాటల్లోని కవ్వింపు, వ్యంగం అందరికీ అర్థమైంది. అందరి చూపులు విజయసింహుని వైపు మళ్లినై. ఆ చూపులు ములుకులై గుచ్చుకున్నాయి విజయసింహునికి. రోషం పొడుచుకొచ్చింది.

"ఓయీ ! వైశ్య వంశాధమా ! మీకు మా మహారాజ శౌర్య పరాక్రమాల గురించి ఇంకా తెలియదు. మేము తలుచుకుంటే రాకుమారి వాసవీదేవిని బలాత్కారముగా మా వెంట తీసుకెళ్లగలం." పళ్ల పటపటలు బయటికి వినబడకుండా జాగ్రత్త వహించాడు. కోపోద్రిక్తులైన యువకులను పరీక్షగా చూశాడు. రెచ్చిపోతే పుచ్చెలెగిరి పోతాయని అర్థమైంది. నాలిక్కరుచుకుని సంయమనమే శరణ్యమనుకున్నాడు. దృష్టి కుసుమార్యుని వైపు మరల్చి సవినయముగా చేతులు జోడించాడు.

" మీ అభిప్రాయం గూడా అదేనా మహారాజా !" మందహాసము పులుముకుని అడిగాడు.

కుసుమగుప్తుడు యువకులను సైగలతో శాంతింపజేశాడు. ఆ తర్వాత విజయసింహుణ్ని తేరిపార చూస్తూ

"మహామాత్యా ! మా గారాల కూతురు వాసవాంబ కన్యకాపరమేశ్వరి వరప్రసాదము. అందగత్తెనే కాదు, అలనాటి సీతామాతలా అతి బలాఢ్యురాలు గూడా. ఆమెకింకా సంసారజీవితం పై ఆశలు చిగురించలేదు. మానవ మాత్రులను ధర్మపథములో నడిపించి మోక్షమార్గం చూపించాలని ప్రయత్నిస్తుంది. మీ విష్ణువర్ధనుల వారి వింత కోరిక వినాశనానికి దారితీయవచ్చు." హెచ్చరించాడు.

"ప్రభూ ! విజ్ఞులైన తమరే దూరభార మాలోచించండి. మా మహారాజు కోరిక నెరవేరకుంటే ఎవరి వినాశనానికి దారిదీస్తుందో అంచనా వేసుకోండి. పాడిపంటలతో, శాంతి సౌభాగ్యాలతో తులదూగుతున్న పెనుగొండ పీనుగుల పెంట అయిపోతుందేమో ! మీరు అనుసరిస్తున్న అహింసా వ్రతం అపహాస్యం పాలైపోతుందేమో ! దయచేసి... "

"విజయసింహా !" కుసుమగుప్తునిలో రోషం పొడసూపింది. "మమ్మల్ని భయపెడుతున్నారా ? అహింసా అంటే పిరికితనం కాదని అర్థం చేసుకోండి. శాంతి కాములమే... కాని శాంతి రక్షణ కోసం అవసరమైతే క్రాంతి నాశ్రయిస్తాము. అదే పరిస్థితి ఎదురైతే... మా సామ్రాజ్యములోని ఒక్కో యువకుడు ఒక్కో అగ్నికణమై విజృంభిస్తాడు. అశాంతి శక్తుల గుండెల్లో నిద్రబోతారు. మమ్ముల్ని, మా ఆత్మాభిమానాన్ని రక్షించుకునే శక్తియుక్తులు మాకున్నాయని మీ మహారాజుగార్కి విన్నవించండి. అతిథిగా వచ్చిన మీ మహారాజుకు స్వాగత సత్కారాలతో గౌరవించినందుకు మాకు లభించే ప్రతిఫలమిదా ? మా వాసవిని మీ మహరాజుకు కట్టబెడతామనుకోవడం పిచ్చివాని కలగా భావించాలని చెప్పండి." గట్టిగా హెచ్చరించాడు.

పెనుగొండ ప్రధాని "ఇక మీరు వెళ్లవచ్చు" అని విజయసింహునికి సైగచేశాడు. బాలనగరుల చూపు కత్తుల మీదుంది.

మారుమాట్లాడకుండా విజయసింముడు వెనుదిరిగాడు. విషయాలన్నీ పూసగుచ్చినట్టు విష్ణువర్ధనునికి వివరించి చెప్పాడు.

విష్ణువర్ధనునిలో ఆగ్రహావేశాలు ఉవ్వెత్తున పొంగినై. పళ్లు పటపటలాడిస్తూ, భుజాలెగరేస్తూ

"ఇక ఉపేక్షించలేము. కుసుమగుప్తుడుని వెంటనే బంధించి తీసుకువచ్చి నా పాదాల వద్ద పడేయండి." సేనానాయకుడి నాదేశించాడు. సేనాననాయకుడి కదేమీ సబబుగా తోచలేదు.

"మహారాజా ! ఇది తొందరపాటు చర్య అవుతుందేమో ! మన వెంట తగినన్ని సైనిక బలగాలు లేవిప్పుడు. మనమున్నది కుసుమగుప్తుల వారి ఇలాకాలోనే." గుర్తుచేశాడు.

అరుణవర్ణం దాల్చిన విష్ణువర్ధనుని ముఖములో రంగులు మారాయి. చూపులు విజయసింహుని వైపు మళ్లాయి.

''నిజమే మహారాజా !" విజయసింహునిలో భయాందోళనలున్నాయి. "కుసుమార్య ప్రభువుల శక్తి సామర్థ్యాల గురించి తక్కువ అంచనా వేయలేము. శాంతిని రక్షించేందుకు క్రాంతి నాశ్రయిస్తామన్నారు. ఈ సామ్రాజ్యములోని యువకులంతా సైనిక శిక్షణ పొంది సర్వసన్నద్ధులై ఉంటారట. వారికీ విషయం తెలిస్తే ఏ క్షణాన్నైనా మనం ప్రమాదములో పడిపోవచ్చు. తొందరపాటు నిర్ణయాలు మనకే చేటు కల్గించవచ్చు. కాబట్టి తక్షణమే ఇక్కడినుండి బయలుదేరడమే క్షేమం." గొంతులో సన్నని వణుకుంది.

అనువుగాని చోట అధికుల మనరాదనుకున్నాడు విష్ణువర్ధనుడు. వెంటనే బలగాలతో బయలు దేరేముందు నాల్గువేలమందిని తన భటుల్ని పెనుగొండలో ఉంచేసి

"వాసవిని మరొకరికివ్వకుండా, వేరేచోటికి తరలించకుండా జాగ్రత్తగా చూస్తుండండి. ఇక్కడి విశేషాలను మాకు వెంటవెంట తెలియజేయండి. మారువేషాల్లో సంచరించాలి సుమా !" ఆజ్ఞాపించి హెచ్చరించాడు.

గుండెల్లో వాసవి కాలిఅందియలు ఘల్లుఘల్లు మంటూంటే హుటాహుటిన బయలుదేరి నేరుగా రాజధానికి చేరుకున్నాడు. పాలకొల్లులో క్షీరాభిషేకం చేయించాలనే విషయమే గుర్తుకు రాలేదు.

నోటి మాటలతో లాభం లేదనుకుని కుసుమగుప్తునికో లేఖ రాసి పంపించాడు.

# 11

పెనుగొండ జనాల మనసుల్లో పెనుతుఫాను చెలరేగింది. మంత్రిమండలి, దండనాయకులు, నగరస్వాములతో కుసుమగుప్తుడు సమావేశమై పరిస్థితిని సమీక్షిస్తున్నాడు. విరూపాక్షుడు, బాలనగరులు గూడా ఉన్నారు. విష్ణువర్ధనుని వింత ప్రవర్తన గురించి చర్చ జరుగుతోంది. అప్పుడే లేఖ అందినది... అది విష్ణువర్ధనుడు పంపించినదే. ప్రధానమంత్రి చేతుల్లో లేఖ విప్పుకుంది. అందరికీ వినబడేలా చదువుతున్నాడు.

"మహా రాజమాన్య, రాజపూజితులు, శాంతి–సౌభాగ్య సంపన్నులు, సద్ధర్మ పాలకులు, సద్గుణ యశోభూషితులైన పెనుగొండ సామ్రాజ్యాధిపతులు శ్రీశ్రీ కుసుమగుప్త మహారాజుల వారికి పద్మశయన సామ్రాజ్యాధినేత శ్రీ విష్ణువర్ధన మహారాజు సాదర నమస్కారములతో వ్రాయులేఖ–

సుగుణాల రాశి, సౌందర్యదేవత... మీ గారాల కూతురు వాసవాంబ కంఠ స్వరము, రూపలావణ్యము మమ్ముల్ని సమ్మోహితుల్ని చేసింది. ఇరు రాజ్యాల మైత్రీ బంధము మరింత బలోపేతమవాలనే సదాశయంతో ఆమెను శాస్త్రోక్తంగా నా అర్ధాంగిగా స్వీకరించాలని నిర్ణయించాము. మీ సమ్మతి కోసం మా మహామాత్యులు శ్రీ విజయసింహుల వారిని పంపించాము. కాని మీరందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. మా మనసు మారదు. మీరు మరోసారి లోతుగా ఆలోచించి సమ్మతించే సదవకాశము కల్పిస్తున్నాము. ఏది ఏమైనా సరే... వాసవిని చేపట్టి తీరుతామని మరోసారి గుర్తుచేస్తున్నాము. శాంతి కాముకులైన మీరు సమరాన్ని కోరుకోరని ఆశిస్తున్నాను.

నెలరోజుల లోగా మీ సమ్మతిని తెలియజేస్తారని కయ్యానికి బదులు, వియ్యానికే ప్రాధాన్యతనిస్తారని ఆశిస్తున్నాము.

నెలరోజుల గడువు ఎక్కువే. అయినా మీ సహృదయానికి గుర్తింపుగా ఇంతపెద్ద గడువు ఇవ్వనైనది.

ఈ లేఖ అందిన వెంటనే మీ సమ్మతిని తెలియజేస్తారని గూడా ఆశిస్తున్నాము. మీ జవాబు కోసం ఎదిరి చూస్తుంటాము.

ఇట్లు
మీ శ్రేయోభిలాషి
శ్రీశ్రీ విష్ణువర్ధన మహారాజు... "

లేఖ విని అంతా విస్తుబోయారు. మొహాలు చూసుకున్నారు. బాలనగరుల్లో పౌరుషం పొంగుకొచ్చింది.

"ఏమిటీ దుందుడుకు వ్యవహారము ?" విరూపాక్షుడు నిలదీశాడు. "మీ మహారాజు ఏమనుకుంటున్నాడు ?" రోషంతో లేఖ తెచ్చిన భటుడినడిగాడు. "పెనుగొండ పాలకులు, ప్రజలు పిరికి వాళ్లనుకుంటున్నారా ?" పిడికిళ్లు బిగించాడు.

"కుమారా... ఆగు !" కుసుమగుప్తుడు వారించాడు.

"లేఖ తెచ్చిన వాడు సేవకుడు. ఇందులో అతని ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేదు. కూచో !"

సభవారందరికీ జరిగిన విషయాలను గుర్తుచేసి

"వారిప్రధాని విజయసింహునికి సమాధానమిచ్చాము. అయినా... ఈ లేఖ ఆంతర్యమేమిటో అర్థం కాలేదు. ఇలాంటి బెదిరింపులకు మనమేమీ భయపడము. కాని... ప్రజా సంక్షేమం, సామ్రాజ్య క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మనందరం మరోసారి ఆలోచించి జవాబు పంపిద్దాం." అన్నాడు.

సభలో ఆసీనులైన వారందరిలో స్వాభిమానం జాగృతమైంది. రోషం రుసరుస లాడింది. రుసరుస గుసగుసల సంప్రదింపులుగా మారింది. అతిథిగా వచ్చిన విష్ణువర్ధనుడు తిన్న ఇంటివాసాలను లెఖ్క బెడుతున్నారన్నారు బాలనగరులు. నగరస్వాముల్లో అసహనం, విష్ణువర్ధనుని పట్ల అసహ్యం పేరుకుపోయింది. అందరి మనోభావాలను ముఖకవళికల ద్వారా చదివేసిన ప్రధానమంత్రి లేచినుంచున్నాడు.

"ప్రభూ ! విష్ణువర్ధన మహారాజు ఇంతకు తెగిస్తాడనుకోలేదు. దీన్ని మనం సహించలేము. విజయసింహుల వారికి ఇంతకు ముందిచ్చిన సమాధానమే సరియైందని అంతా భావిస్తున్నారు." నిష్కర్షగా చెప్పేశాడు.

"మహారాజా !" ప్రధాన సైనికాధికారికి కుతకుతలాడ్తోంది. సభలోని వారి

నందరినోసారి కలియ జూసి "ఈ విషయం అప్పుడే మనకు తెలిస్తే... విష్ణువర్ధనుని తలనరికి, పెనుగొండ సామ్రాజ్యలక్ష్మి పాదాలకు సమర్పించి, అతని రక్తంతో అభిషేకం చేసేవాళ్లము గదా !" ధైర్యంగా అనేశాడు.

అందరిలో పౌరుషం ఉరకలు వేస్తోంది. విష్ణువర్ధనుని చర్యను ముక్తకంఠంతో ఖండించారు. ఆవేదననంతా అదిమిపెట్టి

"మీ ప్రభువుల మనసు మారనట్టే గదా ! ఈ విషయములో ఇంకేమైనా చెప్పేదుందా ?" పద్మశయన భటుడి నడిగాడు.

అప్పటికే వణికిపోతున్న భటుడు సభకు తలవంచి నమస్కరించాడు. "మహారాజా ! మా ప్రభువుల ఎవరు చెప్పినా మంకుపట్టు వీడడం లేదు. ప్రధానామాత్యులు, మహారాణి విమాలాదేవి గారల ప్రయత్నం ఫలించలేదు... ఇంతకు మించి ఇంకా నేనేమీ చెప్పలేను ప్రభూ !"

అంతలోనే గూఢాచార విభాగాధిపతి సభ అనుమతితో లోపలికొచ్చి "ప్రభూ ! పద్మశయన సామ్రాజ్యాధిపతి శ్రీ విష్ణువర్ధనుల వారు మనపై దండయాత్రకు సిద్ధమవుతున్నారని విశ్వసనీయంగా తెలిసింది." చెప్పేశాడు.

ఇదేమిటి ? ఇంతలో... ఇంత పరిణామమా ! సాధారణ విషయాన్ని సమస్యగా మార్చేస్తున్నాడా మహారాజు... అంతా ఆశ్చర్యంలో మునిగారు. కుసుమార్యుని శాంత స్వభావం పునరాలోచనకు పురికొల్పింది. ఆవేదన రెట్టింపైంది.

హింసకు తావులేని శిక్షాస్మృతిని అమలుపరుస్తూ యుద్ధరంగములోకి దిగడమా! వేలాది సైనిక కుటుంబాల్లో అల్లకల్లోలం సృష్టించాలా ! కోర్కెల సాధన కోసం శాంతియుత సత్యాగ్రహ విధానాన్ని వ్యాపింపజేశాము. శాంతికపోతం రెక్కలకింద రాజ్యపాలన సాగించాలన్న ఆశయం... అడియాశ కావల్సిందేనా ! నా ఒక్క కుటుంబ సమస్య ప్రజా సమస్యగా మారవల్సిందేనా !

"మన మనోభావాల నుటంకిస్తూ ఓ లేఖ రాసిచ్చి విష్ణువర్ధనుని భటుణ్ని పంపించండి." ప్రధానికి సూచించాడు. సూచన వెంటనే అమలైంది. భటుడు నిష్క్రమించాడు. కుసుమగుప్తుడు తిరిగి సభనుద్దేశించి

"పెద్దలారా ! మా కుటుంబ సమస్య అనుకుంటున్నానిది. ఈ సమస్య ప్రజా జీవితాన్ని అతలాకుతలం చెయ్యవద్దు. నేను లేకపోతే మరొకరు ఈ సింహాసన్నానధిష్టించి పరిపాలన సాగిస్తారు కాని ప్రజలే లేకపోతే పాలకుల ఉనికిలేదు. కాబట్టి మా కుటుంబ సమస్యనే... మాకే వదిలెయ్యండి. ఆ కష్టనష్టాలేవో మేమే భరిస్తాము... " గుండె

దిటువు చేసుకుని చెప్పుకుపోతున్నాడు.

"వద్దు... ఇది మనందరి సమస్య." సభాసదుల గొంతులేకమైనాయి.

అందరి మనోభావాలను వారి హావభావాల ద్వారా కనిపెడుతున్న ప్రధానమాత్యుడు కల్పించుకున్నాడు.

"మహారాజా ! ప్రజల కష్టసుఖాలు ప్రభువుల వన్నట్టే ప్రభువుల కుటుంబ సమస్య సామ్రాజ్య ప్రజలందరి సమస్య అవుతుంది. ప్రజాభిమానాన్ని చూరగొన్న మా మహారాజుగారి కుటుంబ సమస్య మా సమస్యనే. పెద్దలారా ! ఈ సమస్య గురించి మనమంతా సమిష్ఠిగా ఆలోచించి నిర్ణయం తీసుకుందాము." అందరి అభిప్రాయాన్ని తానే వెలిబుచ్చాడు.

"అవును. అదే సరైంది." ముక్తకంఠంతో ఆమోదించారు.

ప్రధాన సైన్యాధికారిలో పౌరుషం పొంగులెత్తింది. వాలకం గంభీరమైంది. "మహారాజా ! విష్ణువర్ధనుడే కాదు, విశ్వములో ఏ శక్తీ మన పంథాను మార్చలేదు. గోదావరి తీరప్రాంత పాలకులే కాదు, భారతఖండములోని పాలకులంతా ఏకమై వచ్చినా మన స్వాభిమానాన్ని ఫణంగా పెట్టలేము. దురాలోచనాపరుడైన విష్ణువర్ధన మహారాజు ఇకముందు గూడా దుందుకుడుగా ప్రవర్తిస్తే దండించి తీరాలి. అతణ్ని యుద్ధరంగములోనే చిత్తుగా ఓడించి మీ పాదాల చెంత పడేస్తాము. మీరు ఆజ్ఞ ఇవ్వండి." కట్టలు తెంచుకొస్తున్న ఆవేశాన్నాపుకోలేకపోయాడు.

మరో సైన్యాధికారిలో కదనోత్సాహం కదుల్తోంది.

"మన సైనిక బలగాల సామర్థ్యాన్ని శంకించాల్సిన పనిలేదు. ధర్మరక్షణకు ఎదురవుతున్న ఆటంకాలను నిర్దాక్షిణ్యంగా అణిచి వెయ్యడాన్ని హింసగా భావించరాదు. మన వాసవాంబ బాగోగుల గురించి, భవిష్యత్తు గురించి మనమే ఆలోచించాలిగాని అందుకా పద్మశయన సామ్రాజ్యాధిపతి ఎవరు ? తమరు అనుమతిస్తే యుద్ధానికి సర్వసన్నద్ధమైన సైనిక బలగాలను తరలిద్దాం, మన సత్తా ఏమిటో ఆ మహారాజకు చూపిద్దాం మహారాజా !" పిడికిలి పైకెత్తి చూపించాడు.

బాలనగరుల్లో పౌరుషోత్సాహం ఉరకలేస్తోంది.

"మహారాజా ! ఈ విషయమై ఇక చర్చ చాలిద్దాం. మాకనుమతిస్తే సైనిక సహాయం అవసరం లేకుండా మేమే... బాలనగరులమే వెళ్లి ఆ దుర్మార్గుని జుట్టుబట్టి లాక్కొస్తాము. మీ ముందు పడేస్తాం" అన్నాడు విరూపాక్షుడు.

కుసుగుప్తునిలో ఆవేదన తగ్గింది. ఆలోచన పెరిగింది.

"యువకులారా ! అంత తొందరవద్దు. సమస్యను సాకల్యంగా చర్చించి సక్రమ మార్గములోనే ఆలోచించి నిర్ణయం తీసుకుందాము." శాంతింపజేశాడు.

ఆరొందల పన్నెండు గోత్రాలకు సంబంధించిన వైశ్య ప్రముఖుడొకాయన లేచి "మహారాజా ! మనం మరో రకంగా గూడా ఆలోచించాలి. వాసవాంబను విష్ణువర్ధనుని కిచ్చి పెళ్లి చేస్తే ఇరురాజ్యాల్లో సుఖసంతోషాలుంటాయి గదా ! నెయ్యమును వియ్యముగా మార్చుకుంటే శుభప్రదమవుతుంది గదా !" సలహా ఇచ్చాడు.

"లేదు... వీల్లేదు." నగరస్వాములు, బాలనగరులతో పాటు ప్రముఖులంతా తోసిపుచ్చారు. ఓ మంత్రి లేచి

"అలాగైతే మనం పిరికివాళ్లమని రుజువౌతుంది." అన్నాడు.

ఓ బాలనగరు కత్తిపిడిపై చెయ్యేసి "ప్రాణాలు పోయినా సరే ఆత్మాభిమానాన్ని కాపాడుకోవాలి." పౌరుషంగా అన్నాడు.

కుసుమగుప్తుడు కల్పించుకున్నాడు. "మహాషయులారా ! మన సైనిక బలగాల, బాలనగరుల ధైర్యసాహసాలు మనకు గర్వకారణం. కదనరంగములో మన వీరులు శత్రువులను చీల్చి చెండాడుతారని తెలుసు. కాని చతుర్విధ ఉపాయాల్లో దండన అనగా యుద్ధము చివరి ఆయుధము. దాన్నిప్పుడే ప్రయోగిస్తే మన అహింసా సిద్ధాంతాని కర్థముండదు.

కామాంధుడైన విష్ణువర్ధనుని దుందుడుకు చర్యలు మన శక్తిసామర్థ్యాలను తక్కువ అంచనా వేస్తున్నాయి. అయినా మనం అహింసా వ్రత విధానానికే కట్టుబడి ఉన్నాయి. ఈర్ష్య, అసూయ, ద్వేషాలనే చీకట్లు అలుముకుంటున్న ఈ లోకానికి విజ్ఞాన జ్యోతి వెలుగుల్ని చూపించాలనుకుంటున్న మన వాసవాంబ ప్రయత్నాలకు విఘాతం కలగకుండా చూసుకోవాలి. అందుకోసం ఇంకేదన్నా మార్గముందేమో ఆలోచించాలి." గంభీర దృక్కులు ప్రధాని వైపు మళ్లినై.

ప్రధాని మెదడు పొరల్లో ఏదో వెలిగినట్టుంది.

"మహారాజా ! నాకో మార్గం కనిపిస్తుంది."

"అదేమిటో చెప్పండి మహామాత్యా !"

"మన సామ్రాజ్యలక్ష్మి యశోవిలాసాలు విశ్వవ్యాప్త మయేలా మార్గదర్శనం చేస్తున్న మన రాజగురువు శ్రీ భాస్కరాచారి గారిని విష్ణువర్ధనుని వద్దకు రాయబారిగా పంపి, ధర్మాధర్మాల గురించి మన ఆలోచనా విధానం గురించి అతనికి సముదాయించాలని కోరుదాం. ప్రజలందరి శాంతి సౌభాగ్యాలు కోరుకుంటున్న మనను బాధించవద్దని

చెప్పుమందాం. దాంతో విష్ణువర్ధనుల వారి మనసు మారవచ్చు. సమస్య శాంతియుతంగా పరిష్కారం కావచ్చు.”

కుసుమగుప్తునికది బాగా నచ్చింది. ఎందుకైనా మంచిదని

“ఈ ప్రతిపాదన గురించి మీ అభిప్రాయమేమి”టని మిగితా వారినడిగాడు.

“ఈ ప్రతిపాదన చాలా బాగుంది.” ఏకగ్రీవంగా ఆమోదించారంతా.

“ప్రధానామాత్యా !” కుసుమగుప్తుని మొహం వెలిగింది. “మీ సలహా ప్రశంసనీయమైంది. సర్వజ్ఞులైన మన గురువు గారీ బాధ్యతను సమర్థవంతముగా నిర్వహించగలరు.”

ఆశ్రమ వాతావరణం ఆహ్లాదంగా ఉంది.

మహారాజు, ప్రధానమంత్రి కలిసి రావడం ఆశ్రమవాసుల కాశ్చర్యంగా, ఆనందంగా ఉంది. కొందరు ఎదురొచ్చి స్వాగతం పలికారు. హోమ ధూమాన్ని పరికిస్తూ, శిష్యుల వేదమంత్రాల వల్లింపులు వింటూ లోపలికొచ్చారు. గురువు భాస్కరాచారి చిరునవ్వుతో పలుకిరించి కూచొమ్మన్నాడు. గురువు గారి ముఖ వర్చస్సులోని బ్రహ్మ తేజస్సును అవలోకిస్తూ విష్ణువర్ధనుని లేఖాంశాలు, సభలో జరిగిన చర్చాంశాలు, సభాసదుల అభిప్రాయాలను పూసగుచ్చినట్టు చెప్పేశారు. చివరికి కుసుమగుప్త మహారాజు

“గురువు గారూ ! ఈ విషయంలో మీరో గురుతర బాధ్యతను నిర్వహిస్తారనే ఆశతో మీ ముందుకొచ్చాము” అన్నాడు తటపటాయిస్తూ.

“చెప్పండి మహారాజా ! కులగురువు, రాజగురువులంటే ముక్కుమూసుకుని తపస్సు చేస్తూ, శిష్యులకు పాఠాలు చెప్పడమే కాదు. రాజవంశము పరువు ప్రతిష్ఠలను, ప్రజా సంక్షేమాన్ని కాపాడేందుకు ధర్మబద్ధమైన బాధ్యతలను మోయడం గూడా. నిర్మొహమాటంగా చెప్పడి”.

“ధన్యవాదాలు గురువర్యా ! ” మహారాజులో ఉత్సాహం. “పద్మశయన పురానికి తమరే స్వయంగా వెళ్లి మన అభిప్రాయాలను, ఆశయాలను విష్ణువర్ధనునికి తెలియజేసి, అతనికి కొన్ని మంచిమాటలు చెప్పాలని మా ప్రార్థన”.

“ఇది మన ప్రజలు, ప్రజాప్రతినిధుల ఆకాంక్ష గూడా గురువు గారూ ! దయచేసి తమరు ...” ప్రధానమంత్రి విన్నవించాడు.

“ప్రధానామాత్యా ! ప్రజా సంక్షేమం ప్రభువుల బాధ్యత. ప్రభువు సంక్షేమం రాజగురువు బాధ్యత. కాబట్టి తప్పకుండా వెళ్లివస్తాను. ప్రయత్నం మన వంతు, ఫలితం పైవాడి తంతు”. నిబ్బరంగా సుముఖత వ్యక్తం చేశాడు భాస్కరాచారి.

గురువుగారు తయారై రాజభవనం చేరుకున్నారు. పద్మశయనానికి బయలు దేరే ముందు కుసుమగుప్తుడు పాదనమస్కారం చేశాడు. బాధనంతా బిగపట్టి

"గురువర్యా ! విష్ణువర్ధనుని దుష్టబుద్ధి తమరికి సరియైన గౌరవ మర్యాద లందించక పోవచ్చు. అయినా ... మన ఆలోచనలను, మన బలగాల ధైర్యసాహసాలను వారికి నిర్మొహమాటంగా చెప్తారను కుంటున్నాము. అహింసా మార్గములో పయనించడమే మన ఆశయమని నచ్చజెప్పండి" చెప్పేశాడు.

తండ్రి అభిప్రాయమే తన అభిప్రాయమన్నట్టుగా నమస్కరించి వాసవి పక్కకు తప్పుకుంది. ఆమె కళ్లల్లో ఆందోళన ఏమీ లేదు. కుసుమాంబ మనోవేదన నాపుకోలేక పోయింది. కంటిధారలను కొనకొంగుతో అద్దుకుని "విష్ణువర్ధనుడు బలవంతుడేకావచ్చు. కాని గురువర్యా ! దయచేసి మా బాలనగరుల కదనోత్సాహాన్ని ఆ దుర్మార్గునికి తెలయజేయండి. కోరి మృత్యువును కొనితెచ్చుకోవద్దనీ, ఒక్క కత్తివేటుతో అతని కంఠాన్నుత్తరించి పెనుగొండ సామ్రాజ్య లక్ష్మికి కానుకగా సమర్పించ గలరని హెచ్చరించండి". రోషంగా చెప్పేసింది.

నిర్వేదమైన చిరునవ్వు భాస్కరాచారి పెదాలమీద మెరిసి మాయమైంది. కనుబొమలు ముడిపడి అర్ధచంద్రాకారాలైనాయి.

"అందరి మనోభావాలను విష్ణువర్ధన మహారాజుకు వివరిస్తాను. వియ్యం దురాశతో కయ్యానికి కాలుదువ్వ వద్దని చెప్తాను" అంటూ ప్రత్యేక రథాన్నధిరోహించాడు. భటులు వెంబడించగా రథం ముందుకు కదిలింది. విధాత లీలావిలాసాన్ని తలుచుకుంటూ గాల్లోకి చేతులెత్తి నమస్కరిస్తున్న గురువు గారిని వింతగా చూశారు రక్షకభటులు.

అలనాడు ... అన్నీ తెలిసిన శ్రీకృష్ణ భగవానుడు పాండవ రాయబారిగా కౌరవ సభకెళ్లాడు. ఆ మహానుభావుని నీతిబోధ కౌరవులకేమాత్రం రుచించలేదు. ఇప్పుడు నా రాయబారం !? ... తనలో తాను నవ్వుకున్నాడు. విధి ఆడిస్తున్న వింత నాటకములో నేనూ ఓ పాత్రధారినే గదా !

విష్ణువర్ధనుని విపరీత ప్రవర్తన కుసుమాంబ మాతృహృదయాన్ని బాధిస్తూనే ఉంది. జీవితములో ఇంతటి క్షోభనెన్నడూ అనుభవించలేదు. "ముక్కుపచ్చలారని ముద్దుల కూతురుకిప్పుడే ఇంత కష్టం రావాలా ! రక్షించే భారం నీదేనమ్మా" అంటూ పూజాగదిలో కన్యకాపరమేశ్వరి పాదాలచెంత మోకరిల్లింది. హృదయవేదన నంతా ఆ దేవికి విన్నవించుకుంది.

అన్నింటినీ గమనిస్తున్న వాసవి అవేవీ తనకవసరం లేవన్నట్టుగా నిర్లిప్తంగా నవ్వుకుంది.

పెనుగొండ పట్టణ ప్రజల మనోభావాలను పసికట్టిన విష్ణువర్ధనుని భటులు ప్రజల మధ్య స్వేచ్ఛగా సంచరిస్తున్నారు. జనాలంతా విష్ణువర్ధన మహారాజును అసహ్యించుకుంటున్నారు, ఛీకొడుతూ శాపనార్థాలు పెడుతున్నారు. విష్ణువర్ధనుని అనుచిత ప్రవర్తన సామాన్యులను గూడా బాధిస్తుంది. అన్యాయాన్నెవ్వరూ సహించలేక పోతున్నారు... అంతా గమనిస్తున్న భటులు అయిష్టంగా ఉంటున్నారు.

నాలుగు వీధుల్లో తిరిగిన నలుగురు భటులు పట్టణం పొలిమేరల్లో కలుసుకున్నారు. చౌరస్తా మధ్య చెట్టుకింద గద్దెమీద కూచున్నారు. కాస్సేపు ఎవరెక్కడ తిరుగుతున్నారో చెప్పుకున్నారు. ఆ తర్వాత అసలు విషయం గుర్తుకొచ్చింది.

పక్కనున్న ఇద్దరి వీపు తడుముతూ ఒకడు

"ఒరేయ్ ! మన విష్ణువర్ధన మహారాజు గారి కోర్కెలో న్యాయముందంటావా?" అడిగాడు.

"న్యాయం లేదు, ధర్మం లేదు. వయసు ఉడిగిపోతుంటే వైసులున్న పిల్లను పెండ్లిజేసుకుంటానంటే బాగుంటదా ! మన మహారాజు మంకుపట్టు మహాపచారమే. ఒరే ... ఇక్కడి జనాలెంత మంచివారో ! మనకు రోజూ అన్నపానీయాలిచ్చి ఆదుకుంటున్నారు". రెండోవాడు కాళ్లు పైకి ముడుచుకున్నాడు.

"ఈ పెనుగొండ రాకుమారి వాసవాంబను ఎవరికోఇచ్చి పెండ్లి జేస్తారనో, ఎక్కడికో తరలిస్తారనో మనల్ని కాపలా పెట్టిరి గదా ! అలాంటి దేమీ ఇక్కడ లేదు గదా ! పాపం ! కుసుమగుప్త ప్రభువులు ప్రజల్ని కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారు. కన్న కూతురు భవిష్యత్తు గురించి గూడా ప్రజా సమ్మతితోనే నిర్ణయిస్తున్నారు." మూడో వాడి గొంతులో ఆర్ద్రత.

"అదికాదురా ! " నాల్గోవాడిలో ధర్మ సందేహం". ఇక్కడి వాళ్ళంతా ధర్మంగ నడుస్తున్నరు. రాకుమారి, మహారాజు, మంత్రులు గూడా ధర్మం దప్పడం లేదు. మనగ్గూడా రక్తమాంసాలున్నాయి గదా ! చీమూ నెత్తురుంది గదా ! మనం మాత్రం ధర్మంగా ఎందుకుండొద్దూ ?" తలపాగా తీసి నెత్తి గోకున్నాడు.

నలుగురూ ఆలోచనలో పడిపోయారు.

"అవున్రా ! మనుషులమై పుట్టినందుకు మనం గూడా సరిగా ఆలోచించాలి గదా ! అధర్మాన్ని, అన్యాయాన్ని గుడ్డిగా ఎందుకు సమర్థించాలి ?" సవాలు విసిరాడు రెండోవాడు.

నాలుగు వేల మంది పద్మశయన భటుల్లో ఎవరెక్కడ కలుసుకున్నా ఇదే విషయం

చర్చకొస్తుంది. పాపకార్యాన్ని సమర్థించి పాపం కట్టుకునే బదులు పుణ్యాత్ముడైన పెనుగొండ మహారాజుకు విధేయులుగా ఉండడమే మేలని గుసగుసలాడుకుంటున్నారు.

భాస్కరాచారి పద్మశయన పురానికి బయలుదేరకముందే ఆరొందల పన్నెండు గోత్రాల వైశ్యులు భయంతో వణికిపోతూ సమావేశమైనారు. వారి మానసిక స్థితి డోలాయమానంగా ఉంది. సభలో గురువుగారి రాయబారానికి సమ్మతించినా విష్ణువర్ధను డేంచేస్తాడోనని పునరాలోచనలో పడి కొట్టుకుపోతున్నారు. పూర్వవైరం గుర్తుకొచ్చింది.

"పూర్వం కైలాసములో మన వంశస్తులకు నిలువనీడ లేకుండా చేసిన సిద్ధ వైశ్యులకు తగిన శాస్తి కావల్సిందే !" అంటూ ఎగదోశాడొకాయన. మిగితా వారంతా సమర్థించారు.

"బలవంతుడైన మహారాజుతో బంధుత్వం నెరపడమే మేలు గదా !" కొందరన్నారు.

చివరికి విష్ణువర్ధనునికి వాసవి నిచ్చి పెళ్లిచెయ్యడమే క్షేమమనుకున్నారు. అందుకు విష్ణువర్ధనునికే మద్దతివ్వాలని నిర్ణయించుకున్నారు. వాళ్లలోంచి ఇద్దరు ప్రతినిధులను పద్మశయన పురం పంపి తమ మద్దతును మహారాజుకు తెలపాలనుకున్నారు.

ఇద్దరు ప్రతినిధులు అశ్వారూఢులై మనోవేగముతో ప్రయాణిస్తూ భాస్కరాచారి కంటే ముందే పద్మశయనపురము చేరుకున్నారు. విష్ణువర్ధనునితో సమావేశమై తమ మద్దతు తెలిపారు.

"మా కుసుమగుప్తుల వారి చుట్టూ స్వార్థపరులు చేరి చెడు సలహా లిస్తున్నారు" అన్నాడొకాయన.

"ఏది ఏమైనా తమలాంటి బలవంతులతో మా ఆరొందల పన్నెండు గోత్రీకులం వైరం కోరుకోము. మా పూర్తి సహాయసహకారాలు మీకుంటాయి" అన్నాడింకొకాయన. అంతేకాదు "ఆరొందల పన్నెండు గోత్రీకుల నిర్ణయం ముందు నూటారెండు గోత్రీకుల నిర్ణయమేం చేస్తుంది ? వాళ్లంతా పునరాలోచనలో ఉన్నారు." అంటూ మురిసిపోయాడు.

విష్ణువర్ధనుని మొహం, శ్రీమహావిష్ణువు ముఖారవిందములా వెలిగి పోయింది. గర్వంతో ఛాతీ వెడల్పై పోయింది.

## 12

పద్మశయన పుర ప్రజలు, పురప్రముఖులు తమ మహారాజు వింత కోర్కె, విచిత్ర ప్రవర్తన గురించి ముచ్చటించుకుంటున్నారు. రాను రాను ఆ విషయం సామంత రాజ్యాలకు పాకుతోంది.

విష్ణువర్ధనుడు మాత్రం వాసవాంబ తనసొంతమై పోయినట్టు తీపికలలు కంటూ ఊహల్లో ఊరేగుతున్నాడు.

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు ... పెనుగొండ ప్రజలే కుసుమగుప్తుని కెదురు తిరుగుతున్నారు కాబట్టి ... నా పంతం చెల్లితీరుతుంది. నెలరోజుల్లో వాసవి నా అర్థాంగై పోతుంది. అప్పట్నుంచి పెనుగొండ సామ్రాజ్యపాలనలో నాకూ భాగస్వామ్య ముంటుంది.

ఆ తర్వాత ... ఓహ్ ... గోదావరి తీరప్రాంతమంతా నాకు పాదాక్రాంత మవుతుంది. ఏ క్షణాన్నైనా పెనుగొండ నుండి శుభవార్త రావచ్చు ...

"మహారాజా !" ప్రతీహారి తలవంచి నమస్కరించి చేతులు కట్టుకు నుంచున్నాడు" పెనుగొండ నుండి శ్రీమాన్ కుసుమగుప్త మహారాజు గారి రాజగురువులు వేంచేశారు. తమరి దర్శనం కోరుతున్నారు ప్రభూ !"

ఆహా ... ఎంత చల్లని కబురు ! అనుకున్నంత అవుతుంది. పెనుగొండ రాజ గురువులే కుసుమగుప్తుని కులగురువు. తప్పకుండా తీపి కబురుతోవచ్చుంటారు. మమ్మల్ని సంప్రదించి పెళ్లిముహూర్తం నిర్ణయిస్తారేమో ! ఏదైతేనేం శుభస్య శీఘ్రం ... విష్ణువర్ధనుని ఎదపొదలో తియ్యని అలజడి.

"అయితే పద ! మేమే స్వయంగా ఎదురేగి తోడ్కొని వస్తాము". మందహాసంతో లేచి అట్టహాసంగా బయలు దేరాడు.

సపరివార సమేతముగా భాస్కరాచారి కెదురేగి సాదరంగా ఆహ్వానం పలికాడు. సువాసినులు మంగళహారతులిచ్చారు. చతురాంగనలు పూలవర్షం కురిపిస్తున్నారు. భాస్కరాచారి గంభీర వదనముతో లోపలికొచ్చి ఆసనం స్వీకరించాడు.

ప్రధాని విజయసింహుడు, ఇతరులు వారి వారి ఆసనాలధిష్ఠించారు. ఎదపొంగులను లోలోపలే అదిమిపెట్టి విష్ణువర్ధనుడు చిరునవ్వుతో

"ఆచార్యా ! మీ పవిత్ర పాదధూళితో మా సామ్రాజ్యము ధన్యమైంది." భక్తి ప్రపత్తులతో చేతులు జోడించాడు. మంత్రులు తమ మనోభావాలు బయటపడకుండా హర్షాతిరేకం వెలిబుచ్చుతున్నారు.

"పద్మశయన సామ్రాజ్యాధిపా, విష్ణువర్ధన మహారాజా !" భాస్కరాచారి గొంతులో అనునయం, గాంభీర్యాలున్నాయి. "మా పెనుగొండ మహారాజు సందేశాన్ని అందించాలని వచ్చాను."

అయితే సంబంధం ఖాయమన్న మాటా ! మంత్రుల చూపులు మహారాజు హావభావాల మీద కేంద్రీకృతమైనాయి.

"చాల సంతోషం గురువర్యా ! శాంతికాముకులైన శ్రీ కుసుమగుప్త మహారాజు గారు కయ్యాన్ని కోరుకోరని మాకు తెలుసు. మీ శుభసందేశాన్ని వినాలని మేమంతా కుతూహలంగా ఉన్నాము." విష్ణువర్ధనుని మొహం విజయగర్వం పులుముకుంది.

"నిజమే మహారాజా ! మా కుసుమార్యుల వారు 'సర్వేజనా స్సుఖినోభవంతు' ఆర్యోక్తిని అక్షరాలా అమలు చేయాలనుకుంటున్నారు. కయ్యానికి కాలుదువ్వరు. తాను సత్యవ్రతుడు, ధర్మావలంబి కాబట్టి మిగతా రాజులంతా అలాగే ఉండాలని కోరుకుంటున్నారు."

"అయితే గురువర్యా ! కుసుమార్యుల వారు మా కోర్కెనంగీకరించారు గదూ ! వారు నిర్ణయించిన ముహూర్తానికే మేము కట్టుబడి ఉంటాము. అంతేనా, ఇంకేమన్నా ఉందా ? సంకోచించకండి. వాసవి నీ సామ్రాజ్యానికి పట్టమహిషి చెయ్యాలన్నారా ? అందుగ్గూడా మాకేమీ అభ్యంతరము లేదు... " సంతోషంగా తలాడిస్తూంటే విష్ణువర్ధనుని కిరీటం వెలుగులు విరజిమ్ముతోంది.

"తొందరపడకండి మహారాజా !" భాస్కరాచారి నిట్టూర్చాడు. గొంతులో ఉత్సాహాన్ని నింపుకున్నాడు." గోదావరి తీరప్రాంతమంతా శాంతి సౌభ్యాలతో విలసిల్లాలనీ, పవిత్రగోదావరి జలాలు యుద్ధోన్మాదము ఫలితంగా రక్తసిక్తం కారాదని మా మహారాజు మనసారా కోరుకుంటున్నారు."

"మేమూ అదే కోరుకుంటున్నాము కాబట్టే వాసవిని శాస్త్రోక్తంగా పెళ్లాడాలని నిర్ణయించుకున్నాము."

"అది కాదు మహారాజా ! .... "

విజయసింహునితో సహా మంత్రులంతా అయోమయంలో మునిగారు. ఊక దంపుడు సంభాషణ నింకా కొనసాగించరాదనుకుని విజయసింహుడు

"గురుదేవా ! అసలు విషయమేమిటో సెలవివ్వండి." సూటిగా అడిగాడు.

"సరే ... !" భాస్కరాచారి గొంతు మరింత గాంభీర్యాన్ని ప్రోదిచేసుకుంది. "పెనుగొండ సామ్రాజ్యములోని యువతీయువకులు బాలనగరులుగా దీక్ష వహిస్తారు. బాలనగర కన్య, బాలనగరుడిని మాత్రమే పెళ్లాడలనే నియమముంది. దాన్నెవ్వరూ ఉల్లంఘించరు. వాసవి, విరూపాక్షులు గూడా బాలనగరులుగా దీక్షవహించారు. కాబట్టి వాసవితో మీ పెళ్లి అసమంజసము. మహారాజా ! అందరి సుఖ సంతోషాల కోసం మీ

అనుచితమైన కోర్కెను ఉపసంహరించుకుంటే మంచిది. గోరుతో పోయేదాన్ని గొడ్డలిదాకా తేవద్దు. ఇదే మా కుసుమగుప్త మహారాజు మీకు పంపించిన సందేశము...”

“అసంభవం, అసంగతం ... అనూహ్యం.” విష్ణువర్ధనుని ఆకలికేక అది. ప్రపంచం తలకిందులైనట్టనిపించింది. లోకమంతా ఒక్కటై వెక్కిరిస్తున్నట్టనిపించింది. “ఆచార వ్యవహారాలు, నియమ నిబంధనలు కాలప్రవాహానికి ఎదురీదలేవు. మారుతున్న లోకవ్యవహారాని కనుకూలంగా మారుతుంటాయి. మీ మహారాజు మాకు నీతిబోధ చేస్తున్నారా ? మా మంచిచెడులు మాకు తెలియవనుకున్నారా ?” కళ్లల్లో ఎర్రజీరలు కదుల్తున్నాయి.

“అదికాదు మహారాజా ! ఆచారవ్యవహారాలు సాంప్రదాయాలతో ముడిపడి ఉంటాయి గదా ! అసాధ్యమైన దాన్ని సాధించాలనుకునే ముందు ఒకటికి రెండుసార్లు బాగా ఆలోచించాలి ...” సముదాయింపుకుదిగాడు. మహారాజును సూటిగా చూస్తూ ఆవేశం పనికిరాదని సైగలతో చెప్పాడు.

“మహారాజా ! కామ, క్రోధ, మద, మాత్సర్యాలు పండితులను సైతం పరమ రాక్షసులుగా మార్చేస్తాయి. తీరని నష్టాన్ని కల్గిస్తాయి. లంకాధీశుడు రావణాసురుడు అతి బలవంతుడు, గొప్ప పండితుడు, అకలంక శివభక్తుడు, లంకానగరాన్ని స్వర్ణమయం చేసుకున్నాడు కాని సీతామాత మీద కన్నేసి తనచావును తానే కోరి తెచ్చుకున్నాడు. స్త్రీ వ్యామోహం చేతనే గదా భస్మాసురుడు భస్మమై పోయింది. అందమైన ఆడది గదాని పరాయివాడి భార్యమీద మనసు పడిగదా నహుష చక్రవర్తి ఇంద్రపదవి పోగొట్టుకుంది. ఇలాంటి వెన్నో ఉన్నాయని మీకు తెలుసు. సమర్థులైన మీకు వాస్తవ స్థితిని గుర్తు చేయాలని వచ్చాను.

మరోమాట, వాసవి దైవసేవకే అంకితమైంది. ఎప్పుడూ కన్యకాపరమేశ్వరి ధ్యానంలో ఉంటుంది. ప్రాపంచిక సుఖాలపై విముఖత పెంచుకుంది. పెనుగొండ సామ్రాజ్యములో అహింసా శిక్షాస్మృతిని ప్రవేశపెట్టడములో ఆమె పాత్ర కీలకమైంది. వాసవిని మీరు చెల్లిగానో, కూతురుగానో భావించడము అందరికీ క్షేమము. అదే ధర్మము.”

“ఆచార్యా !” రోషం, ఆవేశం కలెగలుపుకుని వచ్చాయి. “ధర్మాధర్మ విచక్షణ మాకు లేదంటారా ? మనసుకు నచ్చిన మగువను పెళ్లాడ్డం అధర్మమా ? ఆ మాత్రం కోర్కె తీర్చుకోజాలని అసమర్థుడినా ? మా కోర్కెను మన్నించకపోతే, మా బుద్ధిబలాన్ని గుర్తించక పోతే భుజబలంతోనైనా సరే వాసవిని సొంతం చేసుకునే శక్తి సామర్థ్యాలు



మాకున్నాయని మీ మహారాజుకు చెప్పండి. కదన రంగమో, కల్యాణ మంటపమో ... తేల్చుకొమ్మనండి." చెయ్యి అసంకల్పితంగా మీసమ్మీది కెళ్లింది.

మంత్రుల కదేమీ బాగన్పించక పోయినా పెంచిపోషిస్తున్న మహారాజుపట్ల వినయ విధేయతలు ప్రకటించడం భావ్యమనుకున్నారు. కొత్తనాటకం చూస్తున్న ప్రేక్షకుల్లా ఉండి పోయారు.

విష్ణువర్ధనుని వైఖరికి నవ్వాలో, బాధ పడాలో అర్థం కాలేదు భాస్కరాచారికి.

"మహారాజా ! వాస్తవాలెన్ని చెప్పినా మీ మనసు మారలేదంటే ... కుసుమ గుప్తుల వారి బలం, బలగాలు, యువత శక్తియుక్తుల గురించి మీరు సరిగా అంచనా వేయలేదని అర్థమవుతుంది. సామ్రాజ్యం శిక్షాస్మృతిలో అహింస ప్రాధాన్యత నందుకున్నా, బాలనగరులు శాంతిని రక్షించేందుకు యుద్ధసన్నద్ధులై ఉంటారు. యుద్ధమే అనివార్యమైతే ఒక్కొక్కరు ఒక్కో అగ్నికణమై మీ బలగాలను ఎండుగడ్డిగా భావించి కాల్చిపారేస్తారని వారి మాటగా చెప్తున్నాను. అహింసావ్రతాన్ని అవహేళన చేసి అనర్థాన్ని కొని తెచ్చుకోకండి. విజయమో, వీరస్వర్గమో ధర్మయుద్ధమే నిర్ణయిస్తుంది, కాని అది ఇరువురికీ నష్టం కలిగిస్తుంది. తుచ్ఛమైన కోర్కెతో సర్వనాశనాన్ని కోరుకోవద్దని ..."

"అం ... టే ... !" విష్ణువర్ధనునిలో అసహనం పెల్లుబికింది. తోసుకొస్తున్న ఆవేశాన్ని అదిమిపెట్టి "మమ్ముల్ని భయపెడ్తున్నారా ఆచార్యా ? పిట్ట బెదిరించి బట్ట ఎత్తుకపోయిందన్న సామెతను నిజం చెయ్యాలనుకుంటున్నారా ?" ఊగి పోతున్నాడు. మొహంలో రంగులు మారుతున్నాయి. ఒళ్లంతా చెమట పట్టేసింది.

"మహారాజా !" భాస్కరాచారి మందహాసం ... నువ్వెంతటి అమాయకుడివయ్యా అన్నట్టుగుంది. "పవిత్ర భారత భూమిలో పరిఢవిల్లుతున్న వర్ణాశ్రమ ధర్మాలను పనికి మాలిన కోర్కెతో అపవిత్రం చెయ్యకండి. వాసవాంబ కన్యకాపరమేశ్వరి వరప్రసాది. ఆమె ఒక వ్యక్తి కాదు శక్తి. ఆమె లక్ష్యసాధనలో అధర్మవర్తనులు అంతంకాక తప్పదు... గుర్తుంచుకోండి."

"ఓహో ! తమరు రాయబారానికొచ్చారా లేక రాచకార్యసాధన కోసం వచ్చారా?" కోపాన్ని పంటి బిగువున ఆపుకున్నాడు.

"మహారాజా ! అలనాటి శ్రీకృష్ణరాయబారాన్ని గుర్తుకు తెచ్చుకోండి. ఆ అవతారమూర్తి మాటల్ని పెడచెవిన పెట్టిన కౌరవులేమయారో మనందరికీ తెలుసు. అందరి శాంతిసౌభాగ్యాల నాశించే నాలాంటి వారి ఆశయం సర్వేజనాస్సుఖినోవంతు. అంతేకాని సర్వనాశనం కాదు. మీ చివరి నిర్ణయమేమిటో చెప్పి సెలవిప్పించండి."

అగ్నిలో ఆజ్యం పోసినట్లైంది విష్ణువర్ధనునికి. దృష్టి ప్రధానామాత్యుని వైపు మళ్లింది. రాయబారిని గౌరవించి తీరాలన్నాయతని సైగలు. అన్నీ దిగమింగక తప్పలేదు.

"ఆచార్యవర్యా ! ఏది ఏమైనా వాసవిని పెళ్లాడితీరాలన్న మా పట్టుదలలో సడలింపు లేదు. మీ మహారాజుగారే మనసు మార్చుకుంటే బాగుంటుంది." కుండబద్దలు కొట్టినట్టు చెప్పేశాడు.

"సరే మహారాజా !" భాస్కరాచారి లేచి నుంచున్నాడు. "విధి విధానాన్ని ఎవ్వరూ మార్చలేరు. మా యువరాజు విరూపాక్షుని శౌర్యప్రతాపాలు ఏ అన్యాయాన్నీ సహించవు. బాలనగరుల ఒరలో నిద్రిస్తున్న కత్తుల నెత్తురు దాహానికి బలై పోవద్దని చివరి సారిగా హెచ్చరిస్తున్నాను. ఈ వేదభూమిలో ఆర్ష సంస్కృతి వర్ధిల్లుతుందనీ, అధర్మ వర్తనులంతా చరిత్రహీనులై మట్టికొట్టుకు పోతారని గతం చెబుతోంది." అంటూ బయలుదేరాడు.

మంత్రులంతా గౌరవసూచకంగా లేచి నుంచున్నారు. వారి మనసుల్లోని ఆందోళన కీడు శంకిస్తోంది.

నిరాశతో విష్ణువర్ధనుడు హతాశుడైనాడు.

సగౌరవంగా కన్య నిస్తారనుకుంటే కయ్యానికి తయారని కవ్వించి వెళ్లాడు. ఇది దుస్సాహసం. పెనుగొండ సామ్రాజ్యపతనానికి నాందీ వాచకము. అనుకున్న ప్రకారం పెనుగొండను ముట్టడించి కుసుమగుప్తుడిని మట్టి కరిపించి, వాసవిని చేపట్టి తీరాల్సిందే... దృఢ నిర్ణయం నాటుకుపోయింది.

"మహామాత్యా !" విజయసింహుని వైపు మళ్లినై చూపులు.

"మహారాజా !"

"మన సేనలను సిద్ధం చెయ్యండి."

"ఎందుకు మహారాజా !"

"ఎందుకంటారేమిటీ ? భాస్కరాచారి కఠినవైఖరితో పెనుగొండ ప్రభువుల మూర్ఖత్వం అర్థమైంది గదా ! ఓవైపు శాంతిమంత్రాన్ని వల్లిస్తూ మరోవైపు కయ్యానికి కాలు దువ్వుతున్నారు. పద్మశయన సామ్రాజ్యాధిపతి ఇంతచిన్న కోర్కెను తీర్చుకోలేడా? అలాగైతే మన ప్రజలే మనను బలహీనులుగా భావిస్తారు. మన పరువు ప్రతిష్ఠల సంగతి గూడా మరవ గూడదు గదా !"

"మహారాజా ! శారీరక బలహీనతలను పరువు ప్రతిష్ఠలుగా భావించకుండా మరో విధంగా ఆలోచిస్తే ... !"

"అంటే ... మనం పిరికి సన్యాసులమా ! మనకేం తక్కువ ? బుద్ధిబలం, భుజం బలం ... ఏది లేదని ?"

"అన్నీ ఉన్నాయిగానీ ..." ఆవేశంగా అనబోయి ఆపుకుని నీళ్లు నమిలాడు.

"ఇహ మేమేమీ వినదల్చుకోలేదు. గడువు తీరిన మరుక్షణమే పెనుగొండను ముట్టడించవలసిందే. సేనలను సిద్ధం చెయ్యండి." ఆదేశించి అంతఃపురాని కెళ్లి పోయాడు.

మంత్రులు, అధికారులు నివ్వెరబోయారు.

"విన్నారుగా మన మహారాజు గారి ఆదేశం." విజయసింహుడు సేనానాయకులకు కర్తవ్యాన్ని నిర్దేశిస్తున్నాడు. "యుద్ధానికి ఏర్పాట్లు చెయ్యండి. కత్తులు, కటారులకు పదును పెట్టించండి."

"ప్రధానామాత్యా !" సర్వ సైన్యాధిపతి ఊరుకోలేక పోయాడు." మన మహారాజు గారి కోర్కె సముచితమైందంటారా ?" అడిగేశాడు. "ఇది న్యాయమేనా ?"

"న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు నిర్ణయించవలసింది మహారాజు గారు. వారి ఉప్పుతింటున్న మనం... వారి ఆదేశాన్ని శిరసావహించి తీరాలి."

"మహామాత్యా !" దండనాయకుడు గూడా ధైర్యం చేశాడు. "సామ్రాజ్యాధిపతి అనుచిత ప్రవర్తన వల్ల సామ్రాజ్య రక్షణ ప్రమాదంలో పడిపోదా ?"

"ప్రమాదమో, ప్రమోదమో ... అదంతా దైవేచ్ఛ. మనం ప్రభు భక్తులం. మహారాజు కనుసన్నలలో మెదలాల్సిందే."

"అయితే మహామాత్యా !" మరో సైనికాధికారి బుర్ర గోక్కున్నాడు. "మహారాజు రక్షణ కోసం మనం మన విచక్షణా జ్ఞానాన్ని మరిచిపోవాలా ? పెనుగొండ మహారాజు మర్యాదలను బలహీనంగా భావించాల్సిందేనా ?"

ఏం జవాబివ్వాలో విజయసింహునికి తోచలేదు. కాస్సేపు మౌనముద్ర దాల్చాడు. మహారాజు మూర్ఖత్వం వల్ల సామ్రాజ్యం కకావికలు కారాదనుకున్నాడు.

"మనం సాధారణ ప్రజల్లా కాకుండా రాజ్యపాలనలో కీలకపాత్ర వహిస్తున్న అధికారుల్లా ఆలోచించాలి. మహారాజు ఆదేశాన్నమలు పరచడమే రాజభక్తి అని గ్రహించాలి. అదే దేశభక్తి, దేశ రక్షణ. అందుకే మన పూర్వులు

*'శ్లో॥ దేశరక్షా సమం పుణ్యం, దేశ రక్షాసమం వ్రతం*
*దేశ రక్షా సమం యోగో, దృష్టానైవ చ నైవచ'*

అంటే ... దేశరక్షణతో సమానమైన పుణ్యకార్యం వ్రతం, యోగం మరోటి లేనే లేదన్నారు. కాబట్టి మనం మన విధి నిర్వహణలో వెనుకంజ వేయరాదు.”

అందరికీ సమాధానం చెప్పి కర్తవ్యోన్ముఖుల్ని చేశాడు.

“విధినిర్వహణలో వెనుకంజ వేస్తే ముందు తరాల వారు మనను దేశద్రోహులుగా చిత్రిస్తారు.” హెచ్చరించాడు.

రాణి విమలాదేవి మనసులో మళ్లీ తుఫాను చెలరేగింది. భర్త మొండివైఖరి భయాందోళనలకు దారి దీసింది. తనలో తాను కుమిలిపోతుంది.

వాసవి వయసెంతా, మహారాజు వయసెంతా ? కూతురు వయసున్న వాసవిని పట్టి తెచ్చి పట్టమహిషిని చేస్తారా ? తీర్థయాత్ర కెళ్లి తిక్కతో తిరిగొస్తారా ? వక్రమార్గం నుండి సక్రమార్గానికొచ్చిన మహారాజును మళ్లీ ఏ దయ్యం ఆవహించింది ? మహామంత్రి మాటల్ని గూడా పెడచెవిన పెడితే పద్మశయన సామ్రాజ్యం భవిష్యత్తేమిటి ? ... జవాబు లేని ప్రశ్నాబాణాలు మనసుకు గుచ్చుకుంటున్నాయి. పంచభక్ష్య పరమాన్నాలు పిశాచాహారంలా కనబడుతున్నాయి. పూలపాన్పు ముళ్లశయ్య లాగన్పిస్తుంది. శయ్యా మందిరానికి రావాలని ఎన్నిసార్లు ఆహ్వానించినా రారేమిటీ ?

“మీరు రాకపోతే నేనేవచ్చి కలుస్తాను.” అని చెలికత్తెతో కబురంపింది. అయినా లాభం లేదు. రాత్రంతా నిద్రలేదు. “మహారాజు గారు మనలోకంలో లేరు.” మహామంత్రి విజయసింహుని మాటలు మాటిమాటికి గుర్తుకొచ్చి కలవర పెడ్తున్నాయి. తెల్లవారే ముందు కలతనిద్ర ... కలతనిద్రలో కల ...

మెడనిండా జడలతో బ్రహ్మరాక్షసి, పొడగాటి కోరలతో, బలవంతంగా రాజమందిరములో ప్రవేశించింది. భయంకరంగా నవ్వుతూ మహారాజు నాక్రమించ బోతుంది. ఒళ్లంతా నూనె రాసుకుని నల్లని వస్త్రాలు ధరించిన విష్ణువర్ధన మహారాజు బయటకు పరుగెత్తాడు. బయటనుంచున్న నల్లని దున్నపోతునెక్కి దక్షిణ దిశగా పయనిస్తున్నాడు.

“మహారాజా ... ! ప్రియా ... !” అరుస్తూ తాను దున్నపోతువెంట పరుగులు దీస్తోంది. బ్రహ్మరాక్షసి వెన్నంటి తరుముతూనే ఉంది.

“అయ్యయ్యో ... మహారాజా ... మహారాజా !” అంగలారుస్తోంది. దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తోంది. అరుస్తూ అరుస్తూ మంచమ్మీంచి కింద పడింది... మెలకువొచ్చింది.

చెలికత్తెలు, సేవికలు చుట్టూ మూగారు.

"ఏమైంది మహారాణీ ? అలా కేకలేస్తున్నారెందుకూ ?" ఆందోళనగా అడిగారు.

లేచి మంచమ్మీద కూచుంది. ఒళ్లంతా చెమట పట్టింది.

"ఏదో కల ... పీడకల ... " దమ్ముదీస్తూ అందర్నీ చూసింది.

రాజగురువుల్ని, ప్రధాని విజయసింహుడిని రప్పించుకుని కల గురించి చెప్పింది.

"తెల్లవారే ముందు వచ్చే కలలు నిజమవుతాయంటారు గదా !" విజయసింహు డన్నాడు.

"ఇది ఏదో అశుభాన్ని సూచిస్తుంది." రాజగురువు అనుమానము. "శాంతి పూజలు జరిపించాలి." సలహా ఇచ్చాడు.

మహారాణి వెన్నుపూసలోని సన్నని వణుకు బలం పుంజుకుంది. మరోసారి స్వయంగా వెళ్లి మహారాజును కలిసి మాట్లాడాలి. వక్రమార్గంలో పరుగెడుతున్న కోర్కెల గుర్రాన్ని సక్రమ మార్గంలోకి మళ్లించాలి. నిర్ణయించుకుంది.

"ప్రభూ ! ప్రాణేశ్వరా ! ఏదో పోగొట్టుకున్నట్టు అలా కూచూన్నారేమిటీ ?" తలపట్టుకుని కూచున్న విష్ణువర్ధనుని పక్కన కూచుంది. భర్త వాలకం దయనీయంగా కన్పించింది. ఇల్లాలిలో నిక్షిప్తమైన తల్లి అంశ జాగృతమైంది. ఆప్యాయంగా తల నిమిరింది.

"అయాచితంగా అందివస్తున్న దనుకున్నది అందకుండా పోతుంటే దాన్ని పోగొట్టుకుంటున్నట్టే గదా విమలా !" విచార వదనం వింతగా ఉంది. చూపులు భార్య వైపు మళ్లాయి.

కళ్లల్లో మునుపటి కాంతులు లేవు. నిద్రలేమితో కనుగుడ్లు చల్లారుతున్న నిప్పుకణికల్లాగున్నాయి.

"మీకేం తక్కువైందని ? అందని దానికోసం అర్రులుచాస్తున్నారెందుకూ ? బలము, బలగాలు, సంపదలు ఎన్నున్నా మనం మానవ మాత్రులం. మానవ మాత్రులకు సాధ్యంకాని వెన్నో ఉంటాయి. ఉన్నదానితో తృప్తి పడ్డం ఉత్తమ లక్షణం గదా ! ప్రభూ! మనకన్నీ ఉన్నాయి. ఉన్నవాటితోనే సుఖసంతోషాలున్నాయి ప్రాణేశ్వరా !" ప్రేమగా చేతులందుకుని అరచేతులు చెంపల కద్దుకుంది. ఒడిలోకి చేర్చుకుని లాలించింది.

అర్ధాంగి ఒడి అమ్మవారి గుడిలాగుంది, ఆరాటాలు, ఆర్భాటాలు మాయమై పోయినై. హాయిగా ఉంది.

కొద్దిసేపు అలా గడిచింది. మనసు తెరమీద మళ్లీ వాసవి ప్రత్యక్షమైంది.

గంధర్వగానం ... పిచ్చెక్కిస్తోంది. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలను తలదన్నే అందచందాలు అదేపనిగా కవ్విస్తున్నాయి. ఆవేశం, ఆందోళన ...

"కాని ... విమలా !" గబుక్కున లేచాడు. "వాసవి తోడు లేకుండా నేను జీవించలేను. వాసవి నా సొంతమయేలా ప్రయత్నించవూ !" చంటి పిల్లాడు ఆటబొమ్మ కోసం మారాము చేస్తున్నట్టుంది మహారాజు వాలకం.

"మహారాజా !" విమలాదేవి అంతరాళాల్లో భర్త వికృతరూపం ప్రత్యక్షమైంది. "మీరోసారి దారి దప్పారు. వాస్తవాన్ని గ్రహించి సరియైన దారిలోకొచ్చారు. మళ్లీ దారి దప్పడం భావ్యమా ? మనకూ, మన ప్రజలకది క్షేమమా ? సాధ్వీమణి సీతామాత నాశించి రావణుడు, ఆడదానికోసం పోటీలు పడిన సుందోప సుందులు ఏమయారో తెలుసుగదా ! వాసవి అగ్నిలాంటిది. అగ్నిజ్వాలల్ని అలుముకుంటే మంటల్లో మాడి పోవాల్సిందే గదా !" సముదాయిస్తూ బాహువుల్లో బంధించ బోయింది.

బాహువులు విష్ణువర్ధనునికి పాము పడగల్లా కన్పించినై.

"వద్దు ... వద్దు .." చేతుల్ని నెట్టేశాడు కోపంగా. "అది అసంభవం." అసహనంగా దూరం జరిగాడు. "మీరంతా పిరికి మందు సేవించారా ? నన్ను గూడా పిరికిపందగా మార్చాలనుకుంటున్నారా ? ఇంత బతుకు బతికి అసమర్థుడిగా మిగిలి పోవాలా ?"

"కాదు ... కానేకాదు మహారాజా ! ఈ రోజు తెల్లవారుఝామున నాకో పీడకల వచ్చింది ప్రియా !" దగ్గరకు జరిగింది.

"మీ కల గురించి విన్నాను రాణీ !"

"మరైతే ఇప్పుడన్నా మనసు మార్చుకోండి. ఆ కల ఏదో అశుభాన్ని శంకిస్తుందన్నారు మన గురుదేవులు."

"వెర్రిదానా !" వెర్రిగా నవ్వాడు. "కలలన్నీ అద్దమ్మీది ఆవగింజల్లాంటివి. నిజ జీవితములో నిలవవు. అవేవీ నిజం కావు. నువ్వేమీ భయపడకు. నీ ప్రాణేశ్వరుని శక్తి సామర్థ్యాలను శంకిస్తున్నావా ?"

"నేను శంకిస్తున్నది మీ శక్తిసామర్థ్యాలను కాదు, బలహీనతలను ప్రభూ ! బలహీనతలు బలం పుంజుకుని మననూ, మన సామ్రాజ్యాన్ని మట్టిపాలు చేస్తాయేమో నని హడలి పోతున్నాను."

"నాకన్నీ తెలుసు. అలాంటి భయమేమీ అక్కరలేదు."

"ప్రాణేశ్వరా ! పరనారీ వ్యామోహం ..."

"వ్యామోహం కాదిది.  ధర్మబద్ధంగా పెళ్లాడ్తానన్నాను."

"కాని ... ఇష్టం లేని ఆడదాన్ని కష్టపడి సాధిస్తాననుకోవడం... "

"అదే మగధీరుని లక్షణం దేవీ ! ... "

"కాదు ... అవలక్షణం ... "

"ఏది ఏమాన్నాకానీ ... పెనుగొండను ముట్టడిస్తాను.  కుసుమగుప్తుణ్ని, అతని కూతుర్ని నా పాదాక్రాంతం చేసుకుంటాను.  ఈ విషయంలో ఎవరేమి చెప్పినా వినేది లేదు దేవీ !  ఇది నా పంతం ... అంతే !" ప్రతి మాటలో గర్వం.

నెత్తిమీద పిడుగు పడ్డట్టైంది విమలాదేవికి.

"మహారాజా !  ప్రాణేశ్వరా !  మీకిది తగదు ... " గుండెల మీద వాలిపోయింది. కట్టలు తెంచుకొస్తున్న దుఃఖాన్నాపుకోలేక పోయింది.  అయినా రాతిగుండెలో తేమ కరువైంది.

"ఇక తమరు వెళ్లవచ్చు మహారాణీ !" భార్య భుజాలు పట్టి కూచోబెట్టి చరచరా బయటికెళ్లి పోయాడు.

# 13

పెనుగొండ నగరస్వాములు, కుసుమగుప్తుడు, ప్రముఖులంతా నగరేశ్వరాలయ మంటపమ్మీద సమావేశమై ఎదిరిచూస్తున్నారు.  రాజగురువు శాంతి, సద్భావన వార్త మోసుకొస్తారను కుంటున్నారు.  కాని ... భాస్కరాచారి వచ్చీరావడం తోనే

"మన ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరైంది." తో ప్రారంభించి విష్ణువర్ధనుని మొండివైఖరిని, విఫలమైన రాయబారం విశేషాలను వివరించాడు.  చివరికి "యుక్తాయుక్త విచక్షణ మరచిన మనిషి మనసు కోరికల పుట్టగా మారుతుంది.  పుట్టనిండా విషనాగుల్లాంటి కోర్కెలు కోరలు చాస్తుంటాయి, కాటేస్తుంటాయి.  ఆ కాటు విషం శరీరమంతా పాకితే మందూమాకు ఏదీ పంజెయ్యదు.  మనిషి శరీరం మట్టిలో కలిసేదాకా పట్టుబడుతుంది.  మన విష్ణువర్ధన మహారాజుది అదే పరిస్థితి.  ఎవరెంత చెప్పినా నిష్ప్రయోజనమే."  నిరాశగా ఊపిరి పీల్చుకున్నాడు.

నివ్వెరబోయి మొహాలు చూసుకున్నారంతా,  యువకులు ఆవేశంతో ఊగి పోతున్నారు.

"అయితే గురువర్యా !"  ఓ బాలనగరునిలో పౌరుషం పొంగింది." పద్మశయన పురములో ఆ దుర్మార్గునికి మార్గదర్శనం చేసేవారే లేరా ?  మంత్రులు, గురువులు, పెద్ద మనుషులంతా ఏమంటున్నారు ?"

"పాపం ! వారంతా ప్రయత్నించి, విఫలమై మౌన ప్రేక్షకుల్లాగుండిపోయారు. మహారాణి విమలాదేవి గూడా చెప్పాల్సిందంతా చెప్పారట, చెయ్యాల్సిందంతా చేశారట. అయినా విషతుల్యమైన విష్ణువర్ధనుని మనసు మారలేదు."

"రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా ! మహారాజు మనోభావాలను... మంత్రులకు ఇష్టమున్నా లేకున్నా గౌరవించి తీరాలి గదా !" ఓ వృద్ధ వైశ్యుడన్నాడు.

"వైశ్యులంటే బలహీనులను కుంటున్నాడేమో ! అతనికి తగిన శాస్తి జరగాల్సిందే !" ఓ బాలనగరు పిడికిళ్లు బిగుసుకున్నాయి.

బాలనగరుల పౌరుషానికి మంత్రుల వాలకం తోడైంది.

"ఇది ఒక్క కుటుంబానికి సంబంధించిన సమస్య కాదు. మనందరి సమస్య. లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి." ప్రధానమంత్రి గుర్తు చేశాడు.

"ఎందుకైనా మంచిదని సేనలను సర్వ సన్నద్ధం చేస్తున్నాము." సర్వ సేనాధిపతి అన్నాడు.

బాలనగరుల పౌరుషదృక్కులు విరూపాక్షుని మీద కేంద్రీకృతమైనాయి. విరూపాక్షుని ముద్దు మొహం మంకెనపూ వర్ణమైంది. నరాల్లో ఉడుకునెత్తురు ఉరుకులాడింది.

"ప్రధానామాత్యా !" విరూపాక్షుడు దిగ్గున లేచాడు. "ఇందుకోసం మీరెవ్వరూ శ్రమపడాల్సిన అవసరం లేదు. ఈ సమస్యను మా బాలనగరుల కప్పగించండి. కామాంధుడై కండకావరముతో గర్విర్తిస్తున్న విష్ణువర్ధనుని శిరస్సు ఖండించి తెచ్చి మీ ముందుంచుతాం. అనుమతించండి." పళ్లు పటపట లాడినై.

"కుమారా ! విరూపాక్షా !" కుసుమార్యుడు చలించి పోయాడు. "తొందరపడకు, ఆవేశము అనుభవ పాఠాలను మరిపిస్తుంది. మన ముందొక లక్ష్యముంది. మన వాసవి ప్రవచించిన అహింసా వ్రతమున్నది. దేనికీ భంగము కలుగకుండా మనలక్ష్యాన్ని సాధించాలి." అంటూ చూపుల్ని వైశ్య సమూహమువైపు మళ్లించి వారి అభిప్రాయా లడిగాడు.

నగరస్వాములు, వృద్ధవైశ్యులు విష్ణువర్ధనుని వైఖరిని ఖండించారు. కాని ఆరొందల పన్నెండు గోత్రాల వారు విభేదించారు. వారంతా గుసగుసలాడుకున్నారు. ఆ గుంపులోంచి ఓ వైశ్యుడు లేచి

"అతి బలవంతుడైన మహారాజు విష్ణువర్ధనునికి వాసవినిచ్చి పెళ్లి చేస్తే మనం గూడా బలవంతులమై పోతాము. ఈ సమస్య నెందుకు మరింత జఠిలంచెయ్యాలి ?" అడిగాడు.

నూటారెండు గోత్రాల సిద్ధవైశ్యులందు కంగీకరించలేదు. సభలోని వారంతా చర్చించు కున్నారు. గుసగుసలు చెప్పుకున్నారు. కోపంతో ఊగిపోతున్నారు. భాస్కరాచారి కంతా అర్థమైంది.

"మీరంతా శాంతించాలి." అన్నాడు సౌమ్యంగా. అందరూ మాటలు ఆపేసి గురువుగారి వైపు తిరిగారు. ఆరొందల పన్నెండు గోత్రీకుల్లో ఒకాయన లేచి అడిగాడు.

"గురువర్యా ! మాకందరికీ కర్తవ్యాన్ని బోధించండి !"

"ఓ వైశ్య ప్రముఖులారా !" అందరినీ కలియజూశాడు భాస్కరాచారి. "మీలో మీరు కీచులాడుకోవడం శ్రేయస్కరం కాదు. బ్రహ్మదేవుని ఆదేశముతో అపరార్కమహర్షి సూచించిన ధర్మాన్ని గమనించండి

విశ్వసృష్టి కర్తయగు ఆదిశక్తి పద్నాలుగు రూపాల్లో ఒకటి కన్యకాపరమేశ్వరి. బ్రహ్మదేవుడు కన్యకాపరమేశ్వరి ఆదేశానుసారము తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ జీవరాశులు, మానవసృష్టి కార్యాన్ని నిర్వర్తించాడు. ఆ క్రమములో వైశ్యులు బ్రహ్మదేవుని ఊరువుల నుండి జన్మించారు. అందులో ఏడొందల పద్నాలుగు గోత్రీకులున్నారు. వారి ప్రవరల వివరాలు గూడా ఆలకించండి.

మొదట ఋషి గణములకు సంబంధించిన నూటారెండు ప్రవరల వారు జన్మించారు. అంతా కలసి ఏడొందల పద్నాలుగు గోత్రాలవారైనారు. ఈ గోత్రీకుల ప్రవరలను బట్టి 1. ఏకార్షేయులు, 2. ద్వార్షేయులు, 3. త్రార్షేయులు, 4. చతురార్షేయులు, 5. పంచార్షేయులు, 6. సప్తార్షేయులు, 7. దశార్షేయులుగా గోత్రశుద్ధికి దోహదపడిన ఋషుల సంఖ్య ద్వారా ప్రసిద్ధులైనారు. అందులో భార్గవ ఋషి గణములో 200 గోత్రములు (40 ప్రవరలు), శాండిల్య ఋషి గణములో250 గోత్రములు (36 ప్రవరలు), ప్రభాత ఋషి గణములో 66 గోత్రములు (26 ప్రవరలు), కాశ్యపఋషి గణములో 198 గోత్రముల వారున్నారు. మీ పూర్వజులు నూటారెండు, ఆరొందల పన్నెండు గోత్రాల వారుగా మొదట విడిపోయినా తర్వాత ఏకమైనారన్న సంగతి మరువరాదు.

ఇప్పుడు గూడా కన్యకాపరమేశ్వరి ఆశీస్సులందుకుంటూ ఐకమత్యముగా ముందుకు సాగండి. ఈ పరిస్థితిలో విడిపోయిన వారు పడిపోతారు. ఇక్కడిక్కడ పెనుగొండ నగరవాసులు మాత్రమే ఉన్నారు. మిగితా పదిహేడు సామంతరాజ్యాల నగరస్వాములు, వైశ్య ప్రముఖులను పిలిపించండి. అందరూ కలిసి చర్చించి సమిష్ఠిగా నిర్ణయం తీసుకోండి." హితవు పలికాడు.

అందరూ సరేనన్నారు. నగరేశ్వరస్వామికి పూజలు చేసి వెళ్లిపోయారంతా.

అందరి నిర్ణయానుసారము కుసుమగుప్తుడు సామంతరాజులకు ఆహ్వానాలు రాయించాడు. వారి వారి రాజ్యాల్లోని నగరస్వాములు, వైశ్యప్రముఖులందరినీ వెంట బెట్టుకుని రావాలని సూచించాడందులో. మెరికల్లాంటి భటులు మేలుజాతి గుర్రాలమీద పదిహేడు నగరాలకు వెళ్లారు.

సామంతరాజులంతా వెంటనే స్పందించారు. ఆయా రాజ్యాల వైశ్యులు సమావేశమై ప్రతినిధులను పెనుగొండకు పంపాలని నిర్ణయించుకున్నారు.

అనుకున్న ప్రకారము అందరూ పెనుగొండకు బయలుదేరుతున్నారు.

పెనుగొండలో జరుగుతున్న విషయాలన్నీ అంతఃపురవాసులకు తెలుస్తున్నాయి. వాసవి మాత్రం నిండుకుండ లాగుంది. విషయాలన్నీ అవలోకిస్తూ నిర్లిప్తంగా నవ్వు కుంటుంది. శ్రద్ధాసక్తులతో కన్యకాపరమేశ్వరి ముందు కూచుండి ధ్యానంలో మునిగి పోతుంది. ఒక్కోసారి

'తల్లీ ! ఆదిశక్తీ ! మానవమాత్రుల అంతరంగాలను అదిలిస్తూ విశ్వశ్రేయస్సు కోసం వింతవింత నాటకాలాడిస్తావు గదూ ! నీ లీలావినోదములో భాగంగానే నన్నీ వంశములో పుట్టించావు గదా ! నా వంశము, నాజాతి, నా దేశ సౌభాగ్యాలను కాపాడు తల్లీ !" ప్రార్థిస్తుంది.

కుసుమాంబ మాతృహృదయం కుమిలి పోతోంది. కన్నకూతురు సుఖ సంతోషాలను కళ్లారా చూద్దామనుకుంటే కష్టాల సుడిగుండాల్లో చిక్కుకు పోతుందేమిటి? తనలో తాను బాధ పడుతుంది. వాసవి వైఖరేమిటో ఆమెకర్థం కావడం లేదు. అయినా కూతురు మనోనిబ్బరము కన్నతల్లి గుండె గాయాలకు మలాములా పంజేస్తుంది.

తెల్లవారితే పద్దెనిమిది రాజ్యాల నగస్వాములతో విస్తృత సమావేశం జరగ బోతోంది. కూతురు ఆలోచన ఏమిటో తెలుసుకోవాలనిపించింది కుసుమార్యునికి. రాత్రి భోజనానంతరము తాను భోజనశాల నుండి వస్తున్నాడు. వాసవి పూజాగదిలోంచి బయటికొచ్చింది. సరియైన సమయం దొరికింది.

"అమ్మా ... వాసవీ !" పిలుపులో ఆవేదన ధ్వనించింది.

"పిలిచారా నాన్నా ?" మందహాసముతో ముందుకొచ్చి నుంచుంది వాసవి. ఎప్పట్లాగే మొహమ్మీద శుభ్రజ్యోత్స్న, కళాకాంతుల్ని వెదజుల్లుతోంది.

"అమ్మా ... కూచో తల్లీ !" కూచొమ్మని సైగచేస్తూ తానూ కూచున్నాడు. "విష్ణువర్ధనుని కోర్కె, మొండివైఖరి గురించి తెలుసు గదమ్మా !"

"తెలుసు నాన్నా, నా అభిప్రాయం మీకు తెలుసుగదా !" కూచుంది.

"తెలుసు తల్లీ !" గుండె పొంగుకొచ్చింది. "నీ లేత మనసు ఎంత గాయ పడిందో... ! ఆందోళన చెందకమ్మా !" ధైర్యం చెప్పబోయాడు.

"నాకెలాంటి ఆందోళనా లేదు నాన్నా !" నిర్వేదంగా నవ్వేసింది. "మనము నిమిత్తమాత్రులము. కానున్నది కాక మానదు. విష్ణువర్ధన మహారాజులాంటి వాళ్లు వందమంది ఏకమై వచ్చినా నా సంకల్పం మారదు. తాత్కాలిక సుఖాలనిచ్చే పెళ్లి, సంసార బాధ్యతలంటే నాకే మాత్రం ఇష్టం లేవు. నా నియమనిష్ఠలను భంగం చేయలేవు. పవిత్ర భారతభూమి వేదసంస్కృతికి నిలయము. ఈ వేదభూమిలో ధర్మం విరాజిల్ల వలసిందే. అందుకు మన తెలుగునేల ఆదర్శంగా ఉంటుంది. భారమంతా కన్యకా పరమేశ్వరిపై వేస్తే అంతా మంచే జరుగుతుందని మీకు తెలుసుగద నాన్నా !"

"అమ్మా .... వాసవీ !" పితృహృదయం పరితపించింది. గొంతులో ఉద్వేగం. "నువు నా మురిపాల మూటవు, వరాల పంటవు. నీకే మాత్రం కష్టం కలిగినా ఈ తండ్రి హృదయం తల్లడిల్లుతుంది."

"నాన్నా !" గొంతులో గాంభీర్యం. "నామీద మీకు నమ్మకముంది గదా ! ధైర్యంగా ఉండాలి. అంత మనమంచికే జరుగుతుంది. మీరు బాధపడితే నాకు బాధవుతుంది. మీ సంతోషమే నా సంతోషము." అంటూ లేచి వెళ్లిపోయింది.

కూతురు దృఢచిత్తం కుసుమార్యునికి ధైర్యాన్నిచ్చింది. ఆమె ఆత్మవిశ్వాసము బలాన్నిచ్చింది.

కుసుమగుప్తుని ఆహ్వానాన్నందుకుని సామంతరాజ్యాల నుండి ప్రతినిధులు వచ్చేస్తున్నారు. వచ్చిన వారందరికి స్వాగతం పలుకుతూ బాలనగరులు వసతి సౌకర్యం చూపిస్తున్నారు. సభాస్థలి గురించి చెబుతున్నారు.

పద్దెనిమి గోత్రాల వైశ్యప్రతినిధులు అశ్వారూఢులై ఏలాపురము నుండి విచ్చేశారు. మాండవ్య – మదన గోత్రోద్భవులు గోవిందుడు – గోపసింహులు, అంగీరస – అనుపాల – అనుపకుల వంశస్థులు, శంకవంశమందు జన్మించిన శంభుగోత్రజుడు కంపుడు, నిచులగోత్రోద్ధారకుడు నింబుడు ... మొదలైన వారందులో ఉన్నారు.

వీరనారాయణ పట్టణము నుండి పద్దెనిమిది గోత్రాలవారు దర్జాగా పల్లకీలలో పయనించి పెనుగొండలో దిగారు. గణేశ గోత్రీకుడు భీముడు, గుంటక వంశోద్ధారకుడు – ధర్మదేవతగా పేరుగాంచిన శంకరశ్రేష్ఠి ఆ బృందములో ఉన్నారు. వారితో పాటు కష్యప గోత్రజుడు శంభుశ్రేష్ఠి, కౌశికాయనస గోత్రజ్ఞుడు, నిరంతర గోదానప్రియుడు –

వసు గోత్రజుడైన వసుమంతుడు గూడా అదే బృందములో దిగారు.

విశాలనగరములో ముప్పయ్యొక్క గోత్రములవారు గుర్రాలనెక్కి సరదాగా స్వారి చేస్తూ వచ్చారు. గోవ్రత గోత్రీకుడు సాంబుడు, సత్యవ్రతుడు – పులస్త్య గోత్రజుడు శంభుడు, మందార గోత్రోద్భవుడు – అందగాడైన మంకుడు మొదలగు వారు మేటి వేగముతో గోదావరి నదిని దాటి వచ్చారు.

అపరకుబేరులు వైరాజ గోత్రజులైన మధుశ్రేష్ఠి, మాధవశ్రేష్ఠి, గర్గిశ్రేష్ఠి, పరమతత్వఋషి గోత్రీకుడు పద్మశ్రేష్ఠి, సత్యధర్మ పాలకులు పెద్దిశిష్ట వంశోద్భవులు విశాలాక్షుడు, హరి, కృష్ణుడు, మంగళశ్రేష్ఠి మొదలగు ముప్పయ్యెనిమిది గోత్రాలవారు నాదస్వరాది మంగళవాద్యాలతో ఊరేగుతూ ప్రమదగణముల వలె శివపురము నుండి ఎడ్లబండ్లలో వచ్చారు.

చాండిల్య – శమీక – శీధర గోత్రజులు సత్యవాక్పరిపాలకులు భద్రుడు – సుభద్రుడు – రుద్రుడు, మగధ – మాళవ – భర్గు గోత్రజులైన నంది – సునందాదులు, కాంపిల్య వంశస్తుడు – రాజకీయ దురంధరుడు ముని, కాళింగుడు, సూరిష్టుడు మొదలగు నలుబది గోత్రముల నగరస్వాములు ఆచంట రాజ్యము నుండి వాయువేగముతో వచ్చి విశ్రాంతికుపక్రమించారు.

ధనపురము నుండి బయలుదేరిన వారు బ్రహ్మణులను వెంటబెట్టుకున్నారు. వారిలో మహత్తేజస గోత్రీకులు, ఇక్ష్వాకు వంశస్తుడు – నగరాధ్యక్షుడైన మాధవశ్రేష్ఠిలతో నాగశ్రేష్ఠి, భద్రశ్రేష్ఠి, రుచిశ్రేష్ఠి, కాలశ్రేష్ఠి, గురుశిష్టుడు మొదలగు వైశ్యప్రముఖులంతా కలిసి అరువదినాల్గు గోత్రాల వారు గుర్రపు బండ్లలో వచ్చారు. అలావచ్చిన వారిలో విప్రచిత్ర ఋషి గోత్రజులు, కురటంక వంశస్థులైన సంపన్నులున్నారు.

నలుబది గోత్రముల వారు ధర్మపురము నుండి ఏనుగుల మీద వచ్చారు. అందులో అట్టహాసంగా వచ్చిన ధర్మశ్రేష్ఠి వినయవిధేయతలే ఆభూషణముగా గలవాడు. అతని ఒంటినిండా దివ్యాభరణాలున్నాయి. అతనితోపాటు మాధ్యందిన – సైకతాయన – అసుర మాండిస ఋషిగోత్రజులైన గురుశ్రేష్ఠి, నాగశ్రేష్ఠి మొదలగు వైశ్యోత్తములు దిగారు.

వివిధ వాహనములలో ఎనభైగోత్రముల వారున్నారు. వారి రాజ్యాధిపతి వీరశ్రేష్ఠితో వచ్చిన వారిలో కాలకంజస గోత్రజులైన పౌరుడు, దర్భుడు, శాబరుడు, మణిగ్రీవుడు, విశ్వేశ్వరుడు, వీరభద్రులు వేంచేశారు.

భరద్వాజ గోత్రోద్భవుడు బలిశిష్ఠ వంశస్థుడైన జగన్నాథ పురాధీశుడు – భద్రుడు

పాలనా వ్యవహారాలను మంత్రులకప్పగించి హుటాహుటిన బయలుదేరి అశ్వారూఢుడై వచ్చాడు. అతనివెంట మనువన్య గోత్రజ వంశోత్తముడు – ఐశ్వర్యాధిపతి కమలాక్షుడు, విశాలహృదయుడు విశాలాక్షుడు మొదలుగాగల అరువది నాల్గు గణముల వారున్నారు.

మరో సామంత రాజ్యము కళింగ నుండి ఈశ్వర ప్రియుడు – గౌతమ గోత్రజుడైన సామంతరాజు శంకరశ్రేష్ఠి అశ్వారూఢుడై పరుగెత్తుకొచ్చాడు. అతని గుంపులో అనుభవజ్ఞుడైన గాంగేయుడు, ముకుళ గోత్రజులైన కామశ్రేష్ఠి, నాగశ్రేష్ఠి మొదలగు ముప్పదినాల్గు గోత్రీకులున్నారు. వారంతా సూర్యోదయ సమయాన చేరుకున్నారు.

పాంచాల రాజ్యము నుండి వచ్చిన ఇరువదియారు గోత్రీకులకు సముచిత స్వాగతం లభించింది. మరువంశీయుడు – మార్కండేయ గోత్రీకుడైన ప్రోలాఖ్యుని నాయకత్వములో వారంతా పరుగుపరుగున వచ్చారు. అక్కడినుండి వచ్చిన వారిలో పౌంద్రక – పుష్పదంత – పురుత్సక ఋషి గోత్రీకులైన సంపన్నులున్నారు. వారివెంట వత్సపాల – బభ్రు – కాప్యకైశోర్య ఋషి గోత్రజులు వేణుడు, కుణికిపాలుడు, బుద్ధి విరూపాక్షుడు, భద్రుడు మొదలైన వారు కబుర్లు చెప్పుకుంటూ వచ్చారు.

భీముని పట్నం నుండి ముప్పది గోత్రముల వారు రథారూఢులై వేంచాశారు. వారికి పారాశర్యగోత్రీకుడైన పడగశిల వంశస్థుడు భీముడు, పావనఋషి గోత్రీకుడు పాంచాల వంశజుడైన అచ్యుతుడు సారధ్యము వహించారు. క్రౌంచగౌళాఖ్య ఋషి గోత్రీకులైన మలహాళ వంశస్తులు వారివెంట వచ్చారు.

త్రిగుణ పట్టణ వైశ్యోత్తములు అరువది నాల్గు గోత్రములవారు ఆ రాజ్యాధిపతి సారధ్యములో ఆనందలహరుల్లో తేలియడుతూ గుంపుగా విచ్చేశారు. మదనుడు, మంగళుడు, చంద్రుడు, ఘంటుడు, రైభ్యుడు మొదలగు బలసంపన్నుల వెంట బృహస్పతి – వశిష్ఠుడు – పుండరీక మహర్షుల గోత్రోద్భవులు వస్తుడు, పృథ్వికానుడు, రుద్రవీణుడు, ముకుందుడు, మాధవశ్రేష్ఠి వచ్చేశారు.

ఘంటసాల పురాధీశుడు విశ్వామిత్ర గోత్రజుడు వినికుల వంశస్థుడైన వీరశ్రేష్ఠి నేతృత్వములో పద్దెనిమిది గోత్రముల వారు గజారూఢులై వచ్చారు. కపిల ఋషి గోత్రీకులైన శ్రీరంగడు, ధర్ముడు, విష్ణువు, కురంటులు వ్యాపార వాణిజ్యాల్లో ఆరితేరినవారు. వారితో పాటు హయగ్రీవ, మణిగ్రీవ, శంఖగ్రోవ గోత్రీకులైన లింగభాను, బలాధ్యక్షులు తరలి వచ్చారు.

కామపురము నుండి వేంచేసిన ప్రముఖులలో వాలిఖిల్య గోత్రజుడు – వెన్నకుల వంశోద్భవుడైన ధనాఖ్యుడు ఏనుగు మీద ఎక్కి వచ్చాడు. అతని గణములో వసు –

శంఖు ఋషి గోత్రజులు, మణికుంట వంశ సంజాతులు మార్కండేయుడు, మనోహరుడు, మాళవశ్రేష్ఠి మొదలగు వారంతా రథాలలో ప్రయాణించి వచ్చారు.

సనందన ఋషి గోత్రజుడు – సానక వంశస్థుడైన మాధవశ్రేష్ఠి పీఠికా నగరాధిపతి. అతని నేతృత్వములో చండ గోత్రజులు కేశ, శృంగ వంశజులతో ఏడు గోత్రముల వారు సూర్యోదయానికల్లా పెనుగొండ చేరుకున్నారు.

అశ్వారూఢులై పందొమ్మిది గోత్రముల వారు జనదపురము నుండి విచ్చేశారు. పాణిస గోత్రజుడు – చిరుబిల్ల వంశజుడైన ఉరుడు, బోధాయన ఋషి గోత్రీకుడు నాగుడు, పింగళ ఋషి గోత్రజుడు – బుధవంశ సంజాతుడు శివుడు, యనసవంశజుడు ఈశానుడు, అంగుడు, వైశ్యుడు, హరి, ఇంద్రుడు మొదలగువారు అత్యంతాసక్తితో వచ్చి విడిది చేరుకున్నారు. అతిముఖ్యమైన విషయం కాబట్టి అంతా పట్టుదలతో ఉన్నారు.

అన్ని రాజ్యాల నుండి తరలి వచ్చిన వారికి కుసుమగుప్త మహారాజు తరఫున పెనుగొండ పురాధీశుడు మౌళిశిష్టుడు తన పరివారముతో కలిసి స్వాగత సత్కారా లందిస్తున్నాడు.

సామంత రాజ్యాల ప్రతినిధులు, వైశ్యోత్తములతో పెనుగొండ పట్టణము జన సంద్రముగా మారింది. రాజధాని ప్రజలు సంతోషంగా ముందుకొచ్చి అతిథులకు మర్యాదలు చేస్తున్నారు. వచ్చిన వారందరికి సకల సౌకర్యాలు సమకూర్చడములో సహకరిస్తున్నారు.

ఒక్కో ఋషి గోత్రములో కొన్ని వంశముల వారున్నారనీ, అలనాటి బ్రాహ్మణ శాపము వల్ల ఆ వంశముల మూల పురుషుల పేర్లు సంకేతనామము లైనాయనీ, ఆ సంకేత నామములే వ్యవహార గోత్రములైనవని వృద్ధవైశ్యులు యువతరానికి చెబుతున్నారు. సంకేత గోత్రనామాల ద్వారా మూలఋషి గోత్రాన్ని గుర్తించాలని గూడా చెబుతున్నారు.

పెనుగొండ రాజధానికి వచ్చిన ప్రతినిధులంతా మొదట కులగురువు, రాజ గురువైన భాస్కరాచారిని దర్శించి, ఆశీర్వాదాలందుకున్న తర్వాతనే విడిది చేరు కుంటున్నారు. అందరికీ పంచభక్ష్య పరమాన్నాలతో విందు భోజనాలేర్పాటైనాయి.

వివిధ రాజ్యాల నుండి విచ్చేసిన వారంతా విడిదిలో పరస్పరాలింగనములతో, పాత పరిచయాలను నెమరేసుకుంటున్నారు.

పెనుగొండ పట్టణము వైశ్య సంగమ స్థలిగా రాణిస్తోంది. ఉదయమే ప్రతినిధు లంతా పవిత్ర గోదావరి ఒడిలో కాస్సేపు ఓలలాడి పూజాదులు ముగించు కుంటున్నారు. నదులన్నీ సముద్రములో కలిసినట్టు ప్రతినిధులు, ప్రముఖులంతా సమావేశ స్థలమైన

నగరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం చేరుకుంటున్నారు. అందరికీ ఆసనాలు తయారుగా ఉన్నాయి. వేదికను అందముగా అలంకరించారు. ప్రధానమంత్రి, మంత్రులు, దండనాథులు, రాజపరివారమంతా అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఏడువందల పధ్నాలుగు గోత్రీకుల ప్రతినిధులతో సభాస్థలి కిటకిటలాడ్తోంది. వేదికపై రాజగురువు భాస్కరాచారి ఆసీనుడైనాడు. సభామంటపములో వరుసలు దీరి కూచున్న సామంత రాజ్యాధిపతుల్ని, ప్రతినిధుల్ని, ప్రముఖులను విహంగ వీక్షణము చేసి తృప్తిగా నిట్టూర్చాడు. గురువుగారి పక్కన ఉచితాసనముపై కుసుమగుప్త మహారాజు కూచున్నాడు.

భాస్కరాచారి స్వస్తివాచనము పలికాడు. వైశ్య పురోహితులు బ్రాహ్మణోత్తములతో గొంతులు కలిపి శాంతిమంత్రము పఠించారు. కులదైవము, ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి ప్రార్థనతో సభాకార్యక్రమం ప్రారంభమైంది.

పెనుగొండ ప్రధానమంత్రి అందరికీ స్వాగతం పలికాడు. సమావేశము ఉద్దేశాన్ని, పూర్వాపరాలను వివరించి ప్రతినిధులు తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెలిబుచ్చాలని విజ్ఞప్తి చేశాడు. "మొదట కుసుమగుప్త మహారాజు ప్రసంగిస్తా"రని ప్రకటించి కూచున్నాడు.

వేలాది ప్రముఖులతో నిండిన సభ నిశ్శబ్దంగా ఉంది. మహారాజు గారి మాటలు వినేందుకంతా సావధాన చిత్తులైనారు. మణిమయ భూషణాలు, రత్నఖచిత కిరీటము ప్రభలు వెదజల్లుతూంటే కుసుమగుప్తుడు లేచి సవినయముగా సభకు నమస్కరించాడు. కళ్లల్లో గాంభీర్యం గొంతులో నిర్భీకత చోటుచేసుకున్నాయి.

"పెనుగొండ సామ్రాజ్య భవనానికి మూలస్థంభాలైన సామంత రాజులారా ! వైశ్యోత్తములారా ! ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి అమ్మవారి కృపతో మన సామ్రాజ్యం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. కృషితో నాస్తి దుర్భిక్షమ్ అన్నట్టుగా మన జనావళి స్వయంకృషితో సామ్రాజ్యం సస్యశ్యామలమైంది. ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగుతుంది. ప్రస్తుతం మన ముందొక సమస్య ఉంది. ఈ సమస్యలో పెనుగొండ సామ్రాజ్యం పరువు ప్రతిష్ఠలు ఇమిడి ఉన్నాయి. వర్ణాశ్రమ ధర్మాచరణలాంటి సునిశితాంశాలున్నాయి.

పద్మశయన సామ్రాజ్యాధిపతి విష్ణువర్ధనుడు ఉచితానుచితాలు మరిచాడు. వర్ణాశ్రమ ధర్మాలను, వయోబేధాలను తుంగలో తొక్కి మా ముద్దుల కూతురు వాసవిని తన భార్యగా చేసుకుంటానని పట్టుబడుతున్నాడు. ఇది ధర్మం కాదని వారి పట్టమహిషి, వారి ప్రధానమంత్రి, శ్రేయోభిలాషులు, మన రాజగురువు శ్రీశ్రీ భాస్కారాచారి గారు

సముదాయించినా తన పంతాన్ని వీడలేదు. బలవంతంగా అనగా యుద్ధం చేసైనా సరే తన కోర్కె నెరవేర్చుకుంటానని ప్రకటించాడు. వాసవికిగాని, మాకుగాని ఈ సంబంధం అసలే నచ్చలేదు. విష్ణువర్ధనుని మూర్ఖత్వం వల్ల శాంతిసౌభాగ్యాలతో తులదూగుతున్న మన సామ్రాజ్యాన్ని సమర రంగముగా తయారు చెయ్యాలంటే మనసొప్పడం లేదు. మీరంతా మన ప్రజల మనోభావాలను మోసుకొచ్చారు. కాబట్టి ప్రజావాణిని ఇక్కడ వినిపించండి. సామూహిక నిర్ణయం తీసుకుందాం. లేదా ఇది నా ఒక్కని సమస్యనే అని భావిస్తే నిర్మొహమాటంగా చెప్పండి."

"ఇది మీ ఒక్కరి సమస్య కాదు. మనందరి సమస్య." సామంతరాజులంతా ముక్తకంఠంతో పలికారు.

"మహారాజా !" అనుభవజ్ఞుడైన ఓ నగరస్వామి అందరి తరఫున లేచి నుంచున్నాడు. "భారతీయ వివాహ వ్యవస్థ అత్యంత పవిత్రమైంది. వధూవరులు ఇద్దరిలో ఎవరికిష్టం లేకున్నా అది ధర్మబద్ధం కాదు. చిరంజీవి వాసవి మీ కూతురుగానే కాదు, శిక్షాస్మృతికి నూతన ఒరవడి సమకూర్చిన మహిళామణిగా సామ్రాజ్యములో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇష్టం లేని పెళ్లి సంబంధాన్ని తిరస్కరించే హక్కు ఆమెకు, దాన్ని కాపాడే బాధ్యత మనందరికుంది." నిర్మొహమాటంగా చెప్పేశాడు.

కరతాళ ధ్వనులతో ఆ మాటలనందరూ సమర్థించారు.

"అయితే ... మనందరం కలిసి చర్చించి తీసుకున్న నిర్ణయాన్నే అమలు పరుద్దాం." కుసుమగుప్తుడన్నాడు.

విష్ణువర్ధనుని ఎలా ఎదుర్కోవాలని సభాసదులు చర్చించుకుంటున్నారు. తమలో తాము గుసగుసలాడుకున్నారు.

"సభకు నమస్కారం" అంటూ ఓ సామంతరాజు ప్రారంభించాడు. "వ్యవసాయం – వ్యాపారాలతో ప్రజలకు ముఖ్యమైన సేవలందిస్తున్న వైశ్యులంటే విష్ణువర్ధన మహారాజు కింత చులకన భావం తగదు. భుజబలము కంటే బుద్ధిబలముతోనే పనులు సాధించు కుంటున్న మనము సమరాంగణమంటే చతికిల పడిపోతామను కున్నాడేమో ! ఏది ఏమైనా సరే వర్ణాశ్రమ ధర్మాన్ననుసరించాల్సిందే. వాసవినతని కివ్వరాదు. దైవ సేవలో నిమగ్నమైన వాసవిని ఇప్పుడే సంసారసాగరములోకి లాగడం అన్యాయం, అధర్మం." నొక్కి చెప్పాడు.

ఆరొందల పన్నెండు గోత్రీకులు ఒక్కచోట చేరి గుసగుసలాడు కున్నారు. నూటారెండు గోత్రాల వారిపై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నారు. అందులోంచి ఒకాయన లేచి

"ఆర్యులారా ! ఒకమ్మాయి పెళ్ళిగురించి ఇంత రాద్ధాంతమవసరమా ? ఓ సామ్రాజ్యాధిపతి, బలవంతుడైన విష్ణువర్ధనునితో బంధుత్వం మన అదృష్టం. అతడీ సామ్రాజ్యానికి అల్లుడైతే మన సామ్రాజ్యం బలోపేతమవుతుంది గదా ! ఏరికోరి అతిబలవంతునితో వైరం కొనితెచ్చుకుని సమరాంగణములో చచ్చి మనము సాధించే దేముంది ? కాబట్టి ఈ వివాహాని కంగీకరించడమే మేలు." పలికాడు.

సభ ఉలిక్కి పడింది, కలవరపడింది. వెంటనే కలకలం బయలుదేరింది. నూటారెండు గోత్రీకుల సిద్ధవైశ్యులకా మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి. పౌరుషం మేల్కొంది.

"అయితే మనం పిరికి పందలమా ?"

"చేవచచ్చిన వాళ్లమా, చేతగాని వాళ్లమా ?"

"మన ఆత్మాభిమానాన్ని ఫణంగా పెట్టడం భావ్యమా ?"

"వైశ్య జాతి విశ్వజ్యోతి అనేది వాస్తవం. మనం విష్ణువర్ధనునికి దాసోహమంటే ముందుతరాల వారు క్షమించరు."

ఒక్కొక్కరూ లేచి తమ అభిప్రాయం చెప్పేస్తున్నారు.

ఆరొందల పన్నెండు గోత్రాలవారు వారిని ప్రతిఘటిస్తున్నారు. బాలనగరుల్లో పౌరుషావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. అయినా సభామర్యాద పాటిస్తున్నారు. వారంతా సైగలు చేసుకున్నారు. ఓ బాలనగరు లేచి పిడికిలి పైకెత్తాడు.

"వీర వైశ్య సభకు నమస్కారాలు ! తుచ్ఛమైన కోరికతో మన జాతిని లోబరుచుకోవాలనుకుంటున్న విష్ణువర్ధనుని ఆటలు సాగనివ్వము. అతని పిచ్చి వైఖరిని సమర్థించడమంటే మూర్ఖత్వాన్ని ప్రేమించడమే. మానాభిమానాలు తాకట్టు పెట్టడం కంటే కదనరంగములో కన్నుమూయడమే మేలు. బతికినంత కాలం వీరులుగా బతకాలి. ఆర్యవైశ్యులు సిగ్గుమాలిన వారు కాదు. కామాంధుని బెదిరింపులకు భయపడి కన్య నివ్వడం సిగ్గుచేటు." రోషం ప్రదర్శించాడు.

మరో బాలనగరు ఆవేశంగా లేచాడు.

"పెద్దలారా ! యత్ర నారీ పూజ్యంతే, తత్ర రమంతి దేవతా – అనేది భారతీయ సిద్ధాంతం. ఆడవారు మగవారితో సమానం గదా ! మగవాడి ఇష్టానికి ఇష్టంలేని యువతిని బలిచేయడం మన సంస్కృతికి విరుద్ధం. ఆ మహారాజు బలపరాక్రమాలకు భయపడి కన్యనిచ్చుటకు మనమేమన్నా పిరికి సన్నాసులమా ? మనకు చీమూనెత్తురు లేదా ? అతనికి సైనిక బలగాలెక్కువగా ఉంటే మనకు చెక్కుచెదరని ఆత్మబలముంది. మన ఆత్మబలం ముందు ఆ సైనికబలం బలాదూరే." తన వాదనను గట్టిగా వినిపించాడు.

మరొకాయన లేచి "మదన పీడితుని మక్కెలిరగ్గొట్టడమే మంచిపని. ఆ కామ పీడితునికి కరవాలమే జవాబిస్తుంది. ఈ అన్యాయాన్నెదిరించి తీరాల్సిందే." దృఢంగా అన్నాడు.

"వాసవాంబను విష్ణువర్ధనుని కివ్వరాదు." సామూహికంగా ఎలుగెత్తి చాటారు.

ఆరొందల పన్నెండు గోత్రాలనిషిద్ధ వైశ్యులు పూర్వము తమ సమూహానికి జరిగిన అవమానాలను గుర్తు చేసుకున్నారు. చెవులు కొరుక్కున్నారు. అందులోంచి జగన్నాథ పుర ప్రముఖుడు కమలాక్షుడు లేచి

"విష్ణువర్ధనుడు దయా హృదయుడు. బ్రాహ్మణులకెప్పుడూ దానధర్మాలు చేస్తూ యశోవిరాజితుడైనాడు. ఆ మహారాజుతో బంధుత్వం మనకే క్షేమం." సగర్వంగా చెప్పాడు.

అతనికి విశాలాక్షుడు వంత పాడాడు.

సిద్ధవైశ్యుల్లో ఆత్మాభిమానము, రోషము పెల్లుబికింది. ఒకొకరికొకరు సైగలు చేసుకున్నారు. జగన్నాథపుర ప్రముఖుడు, భరద్వాజ గోత్రీకుడైన భద్రుడు తనను సంబాళించుకుంటూ పిడికిళ్లు బిగించి, రోషంతో నుంచున్నాడు.

"దుష్టుడు, కామాంధుడైన విష్ణువర్ధనుని బెదిరింపులకు లొంగి వాసవినిచ్చి పెళ్లి చెయ్యడమంటే మనజాతి పరువు ప్రతిష్ఠలు మట్టిలో కలిసినట్టే. భుజ – బుద్ధి బలాలు అన్నీ ఉన్న మనం తప్పటడుగు వేస్తే ముందుతరాల వారు క్షమించరు. చరిత్ర కారులు మనను చరిత్రహీనులుగా చిత్రిస్తారు. కాబట్టి తాటాకు చప్పుళ్లకు కుందేళ్లు బెదరవన్నట్టుగా యుద్ధాన్నెదుర్కొని మన శౌర్యప్రతాపాలు చూపించి తీరాలి." మాటల్లో పౌరుషం ప్రస్ఫుటమైంది.

బాలనగరుల్లో హర్షోద్వేగము ఉరకలేసింది. సామంత రాజ్యము నుండి వచ్చిన బాలనగరుడొకాయన "ప్రాణాల కంటే పరువు ప్రతిష్ఠలు మిన్న." రోషంతో వణికి పోతున్నాడు. "బతికినన్నాళ్లు సింహములాగుండాలి. విష్ణువర్ధనుని దబాయింపులకు దాసోహమంటే వైశ్యజాతి చరిత్ర కళంకితమైపోతుంది ..."

అదే రాజ్యము నుండి వచ్చిన వృద్ధవైశ్యుడు

"అవును. ఆ పద్మశయన పురాధీశుని కామవాంఛకు మన ఆడపిల్లను బలి చేస్తే వచ్చే తరాలవారు వైశ్యులంతా పిరికి పుట్టలో పుట్టిన చీమలని దెప్పిపొడుస్తారు. సమకాలికులు మొహమ్మీద ఉమ్మేస్తారు." హెచ్చరించాడు.

పీఠికాపురము నుండి వచ్చిన బాలనగరు పళ్లు నూరి "మనం అభిమాన ధనులం. మాటలతోనే కాదు మారణాయుధాలతో యుద్ధరంగములోకి దిగగల పులిబిడ్డలం ... జై కన్యకాపరమేశ్వరీ ..." అంటూ గాల్లోకి చెయ్యెత్తి జైకొట్టాడు.

జై ఆదిశక్తీ ... జై కన్యకాపరమేశ్వరీ ... జైజై మాతా ... నినాదాలతో బాలనగరులంతా బలపరిచారు.

వాతావరణం వేడెక్కింది. నిషిద్ధవైశ్యులు ... ఆరొందల పన్నెండు గోత్రాల వారు గోత్రాల సంఖ్యలో ఎక్కువున్నా జనాలు తక్కువ సంఖ్యలో ఉన్నారు. అయినా వారికా అభిప్రాయాలు మింగుడు పడలేదు. ఒళ్లంతా ఉప్పుకారం కలిపి పూసినట్లైంది. అందులోంచి కామశ్రేష్ఠి చేతులూపుతూ నుంచున్నాడు. చూపుడు వేలును బాలనగరుల వైపు గురిపెట్టి "పిల్లకాకికేందెల్సు ఉండేలు దెబ్బ అన్నట్టుగా ఈ పడుచు పిల్లల పెడసరం మాటల్ని పట్టించుకోవద్దు. వాళ్లు అనుభవశూన్యులు. ఉడుకు రక్తం ఉరుకులాడుతుంటే నోటి కొచ్చినట్టు మాట్లాడ్తున్నారు. విష్ణువర్ధనుని కెదురి తిరిగే మన వైశ్యులంతా అగ్ని కీలల్లో శలభాల్లా మాడి బూడిదై పోతారు. తస్మాత్ జాగ్రత్త !" తీవ్రంగా హెచ్చరించాడు.

ఆ వైఖరిని నాగశ్రేష్ఠి బలపరుస్తూ "వర్ణాశ్రమ ధర్మాల్లో మూడవజాతి వారమైన మనకు రెండవ జాతి వాడైన విష్ణువర్ధనుడు పూజనీయుడు. కాబట్టి మన జాతిరత్నము వాసవిని అతనికిచ్చి వివాహము జరిపించడమే ఉత్తమ మార్గము." అన్నాడు.

అదే నిషిద్ధ వైశ్యులైన గాంగేయ, ముకుళ, అరిష్ట, తుంబ, బంధుక ఋషుల గోత్రీకుల వారు గట్టిగా సమర్థించారు.

సిద్ధవైశ్యుల్లో గౌతమ ఋషి గోత్రీకుడైన శంకరశ్రేష్ఠి నరాల్లో రక్తప్రవాహం పౌరుష స్వరాలు వినిపించింది. తనను తాను నియంత్రించుకుంటూ సిద్ధవైశ్యుల వాలకాన్ని చదివేశాడు.

"ఓయీ ! మీరు యుక్తాయుక్త విచక్షణ మరిచారు. ఈ సంబంధము వధువుకు గానీ, ఆమె తల్లిదండ్రులకు గానీ ఇష్టం లేదని తెలియదా ? మీ మాటలు కర్ణకఠోరాలు. మీది కపట నాటకము. వెనకటికి బ్రహ్మలోకములో మీ సమూహానికి జరిగిన అవమానానికి ప్రతీకారం ఈ విధంగా తీర్చుకోవాలనుకోవడం శుద్ధ అవివేకము. మావారి సహాయముతోనే మీ పూర్వజుల కష్టాలు తీరాయని గుర్తుంచుకోండి. సద్బుద్ధి అలవరుచుకోండి." హితవు పలికాడు.

మరో వృద్ధవైశ్యుడు సభకు నమస్కరించి

"మీరు ఆరున్నూట పన్నెండు గోత్రాల వారున్నారని మళ్లీ గర్వంగా మెదుల్తున్నారు. అది క్షేమకరం కాదు. సృష్టి ఆదిలోని మన పూర్వవైభవాన్ని గుర్తుకు తెచ్చుకోండి. మనమంతా సమైక్యంగా ఈ అన్యాయాన్నెదిరించి వైశ్యజాతి పరువు కాపాడుకుందాం." అనునయంగా పలికాడు.

పరపక్షముగా భావిస్తున్న వారికదేమీ బాగన్పించలేదు. పాలకుండ పురాధీశుడు,

కరాళస్మయ వంజుడైన విశ్వేశ్వరుడా మాటల్ని ఖండించాడు. కాలకంజ ఋషిగోత్రజుడైన వీరభద్రుడదణ్ని బలపరుస్తూ

"వాద వివాదాలు చాలించి మర్యాదగా వాసవిని విష్ణువర్ధనునికిచ్చి రంగరంగ వైభోగంగా పెళ్లి జరిపించుటే మన ప్రస్తుత కర్తవ్యము." అనేశాడు.

కొందరిలో రోషావేశం, కొందరిలో కోపావేశం, మరికొందరిలో అసహనం అనుభవజ్ఞుల్లో సదవగాహన ... అందరి మధ్యన కొద్దిసేపు నిశ్శబ్దం చోటుచేసుకుంది.

ప్రశాంత చిత్తుడైన ధర్మశ్రేష్ఠి మందహాసముతో లేచి సభకు సవినయముగా నమస్కరించాడు. అతడు ధర్మపుర రాజ్యాధిపతి. కాశ్యప గోత్రీకుడు, గణపకుల వంశస్తుడు. పున్నమిచంద్రునిలాగున్న అతని ముఖకవళికలు గమనిస్తూంటే అందరి మనసుల్లో ఉదాత్తభావాలుదయిస్తున్నాయి. అతడు గొంతు సవరించుకుని వేదికకు నమస్కరించాడు.

"ఆర్యులారా ! ఆవేశం అనర్థానికి దారి దీస్తుంది. శాస్త్రాలను పరిశీలించిన మహనీయుల వచనాలు అందరికీ ఆచరణీయములు. ధర్మసూక్ష్మాలను లోతగా పరిశీలించి చూస్తూ మన వాసవి కన్యకను ఆ మహారాజుకివ్వడం తగదనిపిస్తుంది. వాసవి సంసార జీవితానికి సుముఖముగా ఉంటే ఆమెకు నచ్చిన, ఆమెను మెచ్చిన వైశ్య వరునికే ఇచ్చి పెళ్లి చెయ్యడము ధర్మబద్ధము, న్యాయబద్ధము. పంతాలు – పట్టింపులు, ప్రతీకార వాంఛల కతీతముగా అందరూ సావధాన చిత్తులై ఆలోచించండి. వైశ్యజాతి ప్రపంచాని కాదర్శప్రాయమైందని కలియుగములో నిరూపించే సమయమాసన్నమైనది." మృదు మధుర వచనాలతో అలరించాడు.

పరపక్షము వారికి వేపకాయ నమిలినట్లైంది. ఆ మాటలు కర్ణకఠోరముగా తోచాయి. విప్రచిత్ర ఋషి గోత్రీకుడు, ధనపురాధీశుడైన కాళశ్రేష్ఠితో కూడి మరికొందరు వెర్రిగా అరుస్తూ "చర్చలు చాలించండి. వాసవినిప్పుడే తీసుకెళ్లి విష్ణువర్ధనుని కప్పగించి బహుమతు లందుకుందాం" ఎదురు దాడికి దిగారు.

సభలో దుమారం చెలరేగింది. ప్రధానమంత్రి కల్పించుకుని అందరికీ నమస్కరించాడు. "దయచేసి కోపతాపాలు మాని సంయమనముతో చర్చ సాగించండి." విజ్ఞప్తి చేశాడు.

టేకువనంలో వెలిసిన వానలా దుమారం సద్దుమణిగింది.

మహత్తేజస గోత్రీకులు, ఇక్ష్వాకు వంశజులు, తేజోసంపన్నులైన ప్రముఖులు మాధవశ్రేష్ఠితో ముచ్చటించారు. మాధవశ్రేష్ఠి సంయమనము పాటిస్తూ

"మనమేమీ భయపడాల్సిన అవసరము లేదు. మనం ధర్మాన్ని రక్షిస్తే ధర్మం మనను రక్షిస్తుంది. అదే మన పరువు మర్యాదలను కాపాడుతుంది." అన్నాడు.

మరో నగరస్వామి కళ్లతో కొందరిని పలుకరించి "మన సహాయ సహకారాల వల్లనే విష్ణువర్ధనుని సామ్రాజ్యము చల్లగా ఉందనే విషయము గుర్తుంచుకోవాలి. మన సేనల సుహృద్భావ సహకారము వల్లనే అతని సామ్రాజ్య సరిహద్దులు, సామంతరాజులు, నగరాలు సురక్షితంగా ఉన్నాయి. మనము సహకరించడము మానేస్తే పద్మశయన సామ్రాజ్యము రేకులు రాలిన పద్మంలా తయారవుతుంది. యుద్ధరంగములో మన సేనల కెదురొడ్డి గెలిచే శక్తి అతనికి లేదు. అతనిదంతా మేకపోతు గాంభీర్యం. కామపిశాచం ఆవహించి పిచ్చికూతలు కూయిస్తుంది. ఒకవేళ మనమీదికి కత్తిగట్టి యుద్ధానికొస్తే సర్వనాశనమై పోతాడు." సూటిగా చెప్పేశాడు.

వాద వివాదాలు చాలాసేపు సాగాయి.

నూటారెండు గోత్రాల సిద్ధవైశ్యులు, ఆరొందల పన్నెండు గోత్రాల నిషిద్ధ వైశ్యులు చెరో పక్షముగా విడిపోయారు.

విడిపోయిన రెండు పక్షాలవారు ఒకరిపై ఒకరు నిందాస్త్రాలు సంధించు కుంటున్నారు. నిషిద్ధవైశ్యులు తమ పంతాన్ని గెలిపించుకోవాలని పట్టుదలగా ఉన్నారు. వారిలోని మగధ, మాళవ, భర్గ గోత్రజులు, ఆచంట రాజ్యాధిపతి ప్రతీకార వాంఛతో ఊగిపోతున్నారు.

"ఈ మాత్రానికే మమ్ముల నెందుకు పిలిపించారు ?" నిలదీశారు.

చిని, శిరి, శిరీష వంశజులైన భద్రుడు, సుభద్రుడు, రుద్రుడు మొదలగు వారు కేకలు వేస్తూ "మేము మా ఘంటసాల పట్టణానికి వెళ్లిపోతా"మని బెదిరించారు. నైరాజస గోత్రజులగు శివపుర రాజ్యనివాసులు మధు, మాధవ, గర శ్రేష్ఠులు

"విష్ణువర్ధన మహారాజుకు కన్యనివ్వకుంటే మనకు ప్రమాదం. వివాహ ముహూర్తం నిర్ణయించిన తర్వాతనే మమ్ముల్ని పిలిస్తే బాగుండేది." అని వాదించారు.

సిద్ధవైశ్యుల్లో అసహనం హద్దులు దాటింది.

పెద్దిశిష్ట గోత్రీకుడు – పేరిశిష్టకుల వంజుడైన వైశ్య శిఖామణి నిషిద్ధ వైశ్యులను కొరకొర చూస్తూ

"ఓరీ మూర్ఖ శిఖామణులారా ! నేను పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అన్నట్టుగా మీరు వెర్రి వాదనలు వినిపిస్తున్నారు. పెద్దలమాట చద్దిమూట అని మరిచారు. వర్ణాశ్రమ ధర్మాలను వక్రబుద్ధితో చూస్తున్నారు. వధువు ఇష్టానికి వ్యతిరేకంగా జరిగే పెళ్లి అధర్మం,

అన్యాయం, పాపకార్యం. మన వైశ్యజాతి పెద్దలంతా, అనుభవజ్ఞులంతా ఇది అధర్మమని మొత్తుకుంటున్నా మీకు వినబడ్డం లేదా ? వాసవిని విష్ణువర్ధనుని కిచ్చుట ఏరకంగా చూసినా అధర్మమేనంటున్నారు గురువుగారు. మీరింకా మీ పద్ధతిలోనే ఆలోచిస్తే తగిన శాస్తి అనుభవిస్తారు." గట్టిగా హెచ్చరించాడు.

కాలగమనం, కడలికెరటం మనిషి కోసం ఆగవు గదా ! అప్పటికే మిట్ట మధ్యాహ్నమైంది.

వాదోపవాదాలు ఇలాగే సాగిపోతుంటే పరిస్థితి చేయిదాటి పోయేలాగుంది. కుసుమగుప్తునికంతా అర్థమైంది. మౌళిశ్రేష్ఠి మొదలగు నగరస్వాములను సైగలతో సంప్రదించి

"గౌరవ సభాసదులారా ! ఈ విషయములో మనము ఇంకా కొంత ఆలోచించాల్సిన అవసరముంది. ప్రస్తుతం విడిదిగృహాల కెళ్లిపోదాము. తర్వాత మళ్లీ కలుద్దాము." ప్రకటించాడు.

వైశ్యులతోపాటు మిగిలిన వారంతా తలపాగాలు సవరించుకుంటూ, ముచ్చట్లాడు కుంటూ విడిదిగృహాలకు వెళ్లిపోయారు. నగరేశ్వరాలయ ప్రాంగణము ఖాళీ అయింది. మానవమాత్రుల మనస్తత్వాలను నిశితంగా పరిశీలిస్తున్న నగరేశ్వరస్వామి విగ్రహం తనలోతాను నవ్వుకుంది.

సభలో వాదనలెలాగున్నా, ఎవరి మనసులో ఏముందో చారుల ద్వారా తెలుస్తుంది. విడిదిగృహాల్లో సేవకులుగా, భోజనశాలలో వడ్డించే వారిలా సేవలందించిన గూఢాచార బృందముతో కుసుమగుప్తుడు సమావేశమయాడు. ఎవరెవరేమను కుంటున్నారో చెప్పుమన్నాడు.

విడిది గృహాలలో, నదీ స్నానస్థలాల వద్ద సంచరించి సామంతరాజ్యాల ప్రతినిధుల పిచ్చాపాటి కబుర్లను విన్న గూఢాచారులు వివరాలందించారు. కొందరు నిషిద్ధ వైశ్యులు తప్ప అందరూ వాసవిని విష్ణువర్ధనుని కివ్వరాదని మనసారా కోరుకుంటు న్నారని తెలిసింది. వ్యతిరేకులు గూడా కేవలం ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్నారని తేటతెల్లమైంది.

వెంటనే వెళ్లి కుసుమగుప్తుడు రాజగురువు భాస్కరాచారికి విషయమంతా వివరించాడు.

భాస్కరాచారి పద్దెనిమిది రాజ్యాల నగరస్వాములను, అనుభవజ్ఞులను పిలిపించు కున్నాడు. వారంతా ఆనందభరితులై గురువుగారికి పాదనమస్కారము గావించి ఎదురుగా కూచున్నారు.

ఆశ్రమం చుట్టూ ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు, తులసివనము, పూల సువాసనలు ... వాతావరణము ఆహ్లాదకరంగా ఉంది.

"వాసవిని విష్ణువర్ధనుని కిచ్చి పెళ్లి చెయ్యడం మీకామోదయోగ్యమేనా ? నిర్మొహమాటంగా చెప్పండి." అడిగాడు భాస్కరాచారి. ప్రశ్న సూటిగా వచ్చినందుకు అంతా మొహాలు చూసుకున్నారు.

"వీల్లేదు. మాకామోదయోగ్యం కాదు." ముక్త కంఠముతో జవాబిచ్చారు.

"వాసవి నివ్వకపోతే విష్ణువర్ధన మహారాజు యుద్ధానికి దిగుతాడు. దానికి మీరేమంటారు ?"

"అయినా సరే ... ఎదిరిస్తాం."

"బాగా ఆలోచించండి. విష్ణువర్ధనుడు సామాన్యుడు కాడు. సామ్రాజ్యాన్ని సర్వనాశనం చేస్తానని సైన్యాలతో తరలివస్తే ... ఏం చేస్తారు ?"

"ప్రాణాలున్నంతవరకు పోరాడి విజయమో, వీరస్వర్గమో తేల్చుకుంటాం. వాసవిని రక్షించుకుంటాం." అన్నాడో నగరస్వామి. అంతా తృప్తిగా నవ్వుకున్నారు.

అందరిదీ ఒకేమాట, ఒకేబాట అని అర్థమైంది. గురువుగారు మౌనముద్ర దాల్చారు. అంతాకలిసి తమలోతాము ముచ్చటించుకున్నారు. అందరిసైగలందుకుని ఓ వైశ్యశిఖామణి

"ఆచార్యా ! ఈ విషయములో వెనక్కు తగ్గమని మీ పాదాల సాక్షిగా ప్రమాణం చేస్తున్నాము." కరాఖండిగా చెప్పేశాడు. అంతా కలిసి ప్రమాణం చేశారు.

కుసుమగుప్తుని కిదంతా తెలిసిపోయింది. ఆత్మవిశ్వాసం బలపడింది. ధైర్యం రెట్టింపైంది. అందరినోసారి కలియజూసి చెప్పేశాడు –

"విష్ణువర్ధనుడు నిర్ణయించిన గడువు సమీపిస్తున్నది. అతడు దుర్మార్గుడు, చండ ప్రచండుడని వేగుల ద్వారా తెలిసింది. జరగవలసిన సామూహిక నిర్ణయం అందరి సమక్షములో జరగాలి."

నిజమే అన్నారంతా. తిరిగి నగరేశ్వరాలయ ప్రాంగణములో సమావేశమవాలను కున్నారు.

మరో సాధారణ సమావేశములో అంతా ఆసీనులయ్యారు. వాతావరణం ఉత్తేజకరంగా ఉంది.

పద్దెనిమిది రాజ్యాల నగరస్వాములు, వైశ్య ప్రముఖులు, అనుభవజ్ఞులు భాస్కరాచారి ఆశ్రమ సమావేశములో వెలిబుచ్చిన అభిప్రాయాలను సభకు వివరించారు. నిషిద్ధ వైశ్యుల్లో కొందరు వాదోపవాదాలకు దిగారు. వారు... భాస్కరాచారి సమావేశములో

లేని వారని అందరికీ తెలిసిపోయింది. దుందుడుకు మాటలతో రెచ్చిపోతున్నారు.

"విష్ణువర్ధనుడు క్షత్రియుడు. వైశ్య, శూద్ర కన్యలను గూడా పెళ్లాడే అర్హత ఉందతనికి. పైగా ఓ సామ్రాజ్యాధిపతి అల్లుడుగా రావడం మనకే గర్వకారణం గదా !" పాత పాట అందుకున్నారు. అందులోంచి ఒకాయన మీసాలు మెలేస్తూ "వాసవిని విష్ణువర్ధనుని కివ్వకుంటే మన వైశ్యజాతికి వినాశనం తప్పదు." హెచ్చరించాడు.

వారి వాదనలను సిద్ధవైశ్యులు తేలికగా కొట్టిపారేశారు.

సంయమన మనస్కుడైన ఓ సామంతరాజు లేచాడు.

"మనం ధర్మవర్తనులం. శాంతి కాముకులము. శాంతి కాముకులకు, మద మాత్సర్య పీడితులకు మధ్య సుహృద్భావం పొసగదు. పెళ్లి సంబంధం కుదరదు. మనకంటే విష్ణువర్ధనునికి గజ, తురగ, రథసేనలు ఎక్కువ ఉండవచ్చు. కాని అతడు అహంభావి, దుష్టుడు, కామాంధుడు. పక్క సామ్రాజ్యాలతో వైరం కొనితెచ్చుకుంటున్నాడు. భారత ఖండములోని సామ్రాజ్యాధిపతులంతా మన మహారాజు నభిమానిస్తున్నారు. విష్ణువర్ధనుని పట్ల ద్వేషభావం పొడసూపింది. కాబట్టి సామ్రాట్టుల నైతిక మద్దతు మనకే ఉంది. కన్యకాపరమేశ్వరి వరప్రసాదియైన వాసవాంబను ఆమె మనోభీష్టానికి వ్యతిరేకముగా ఓ కామాంధునికి కట్టబెట్టాల్సిన అవసరం లేనే లేదు." కరాఖండిగా అన్నాడు.

నిషిద్ధ వైశ్యుల్లోని కొందరి కది కోపం తెప్పించింది. అందులోని కేశిశృంగుడు అవమాన భారంతో ఊగిపోతూ "మీరు అహంభావులు" మొహం చిట్లించాడు. చూపుడు వేలుతో సిద్ధవైశ్యులను చూపిస్తూ "మీ వితండ వాదనను మేమంగీకరించము. ఈ పాపానికి మీరు తగిన శిక్ష అనుభవించాల్సి ఉంటుంది." బెదిరించాడు.

సిద్ధవైశ్యుల కదేమీ బాగన్పించ లేదు. సానక గోత్రీకుడు మాధవశ్రేష్ఠి పళ్లు పటపటలాడిస్తూ కేశిశృంగుడు, అతన్నెగదోస్తున్న చండ, నంది ఋషి గోత్రీకులను సూటిగా చూశాడు. అతని కళ్లు అగ్ని గోళాల్లాగున్నాయి. పిడికిళ్లు బిగించి పైకి చూపిస్తూ "ఓయీ ! చరిత్ర హీనులారా ! మీరు కళంకితమైన మీ గతాన్ని పట్టుకు వేళ్లాడుతున్నారు. వర్తమాన, భవిష్యత్తులను మరిచి పోతున్నారు. ఇది కలియుగారంభము. గత యుగములలో సాధ్యమైన అశ్వమేధయాగము, గోమేధ కర్మము, జ్యేష్ఠ భాగము, మాంస శ్రాద్ధము, విచక్షణాతీత వివాహము, దేవర న్యాయముతో సంతానప్రాప్తి, జాతి హీనులతో వివాహము లీయుగములో అసాధ్యములని పరాశర మహర్షి చెప్పియున్నారు. ఋషి ప్రవచించిన ధర్మసూత్రాలను పాటించి తీరాలి. కాబట్టి ఈ వివాహ సంబంధము అసాధ్యము, అసంభవము." తేల్చి పారేశాడు.

కామపురాధీశుడైన ధనిశ్రేష్ఠి మౌనంగా ఉండలేకపోయాడు. "మాధవశ్రేష్ఠి గారు సరిగా చెప్పారు. చంద్రవంశములో చెడబుట్టిన విష్ణువర్ధనునితో వివాహ సంబంధము మనజాతి కనర్థదాయకము. దీన్ని అదునుగా తీసుకుని భవిష్యత్తులో బర్బరులు, కళిందులు, మ్లేచ్ఛులు, కిరాతకులు, జారులు, చోరులు మనజాతి వారలను చులకనగా భావించి మన కన్యలను చెరబట్టవచ్చు." భయంకరమైన భవిష్యవాణి వినిపించాడు.

ఘంటపురాధీశుడు వీరశ్రేష్ఠిలో సంతోషం పొంగింది. ఆ వాదనను ధైర్యంగా సమర్థించాడు. మాసంతకుల గోత్రీకుడు శ్రీరంగశ్రేష్ఠి గంభీరవదనుడై

"ఆ దుష్ట బుద్ధి విష్ణువర్ధనునికి వాసవినిస్తే మన పితృదేవతలకు సద్గతులుండవు. వారు నరకయాన ననుభవిస్తారు. ఈ లోకములో వైశ్యజాతి ఆచంద్రతారార్కము వర్ధిల్లాలంటే, మన ముందు తరాలవారు గర్వంగా తలెత్తుకు తిరగాలంటే ఈ సంబంధము మన కామోదయోగ్యము కానేకాదు. మా అందరి అభిప్రాయమిదే" నన్నాడు.

ఒకరి తర్వాత ఒకరు చాలామంది ఆ వాదనను బలపరుస్తూ పోతున్నారు. నిషిద్ధవైశ్యుల వాదన బలహీన పడింది. అయినా ఆశ చావక ఏలాపుర నివాసులైన శంభు, నింబచోళులు తమ అసమ్మతి తెలియజేశారు.

ఇంత సుదీర్ఘ చర్చ జరిగినా నిషిద్ధవైశ్యుల వైఖరి మారనందున సిద్ధవైశ్యులు వారిని గట్టిగా నిరసించారు. మాన్య, మానాభ గోత్రీకులగు గిరిశ్రేష్ఠి మొదలగు వారు.

"వాసవిని విష్ణువర్ధనునికిచ్చుట అసంభవము. అందుకా మహారాజు యుద్ధంలో మమ్ముల్ని నరికి పారేసినా లొంగము. ఆత్మాభిమాన రక్షణ కోసం వాసవాంబతో సహా దేహత్యాగమైనా చేసి పరమేశ్వర సాన్నిధ్యము చేరుకుంటా"మని ధైర్యంగా ముక్తకంఠముతో ప్రకటించారు.

పులస్త్య గోత్రకులు గోశీల వంశోద్భవులైన మహేశ్వరుడు, నృసింహుడు మున్నగు వారు "ఇది మంచి మాట. దీనికిక తిరుగులేదు." స్పష్టంచేశారు. అంతేకాదు

"మీ ఆరున్నూట గోత్రీకులు పిరికిపందలై మరణమంటే బయపడ్తున్నారు. కాబట్టి ఈ సామ్రాజ్యాన్ని వదిలిపెట్టి పారిపొండి. మీకూ, మాకూ పొంతన కుదరదు." హెచ్చరించారు.

నిషిద్ధవైశ్యుల్లోంచి చంద్ర, అర్కకాల, అగ్ని, కాల, భద్ర, మంద్ర ఋషుల గోత్రీకులైన మణి గ్రీవుడు, పారవుడు, దర్దరుడు మొదలగు వారు కోపోద్రిక్తులై ముందుకు చొచ్చుకొచ్చారు.

"అయితే మీ పక్షము వారికి, మా పక్షము వారికిప్పట్నించి సంబంధ బాంధవ్యా

లుండవు. మన అన్యోన్య బంధము ఈనాటితో చెల్లు. మేమీ పట్టణాన్ని వదిలి కుంటుంబాలతో సహా వెల్తున్నాము. వేరే సామ్రాజ్యాలలో తలదాచుకుంటాము." నిశ్చయంగా ప్రకటించారు.

సృష్టి ప్రారంభము నుండి సమిష్ఠి మంత్రాన్ని జపిస్తూ విడిపోయి, కలిసిన ఏడొందల పద్నాలుగు గోత్రాల వైశ్యజాతి రెండుగా, నిట్టనిలువుగా చీలిపోయింది. ఆరొందల పన్నెండు గోత్రాల నిషిద్ధవైశ్యులు వెళ్ళిపోయారు. నూటారెండు గోత్రాల సిద్ధవైశ్యులు మిగిలారు. విడిపోయిన వారితో వివాహ సంబంధాలు కూడా కుదుర్చుకోవద్దని సిద్ధవైశ్యులు నిర్ణయించుకున్నారు. భద్ర, ధర్మ, హరి, వీర, భీమ, మాధవ, హేలాబలురు కుసుమగుప్తుని చుట్టూ చేరి తదనంతర కార్యక్రమం గురించి సావకాశంగా సంప్రదింపులు సాగించారు.

సమస్యను శాంతియుతంగానే పరిష్కరించుకోవాలనే కోర్కెతో, తమ చివరి నిర్ణయాన్ని విష్ణువర్ధనునికి తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం వృద్ధ వైశ్య పండితుడు వణిజశ్రేష్ఠిని దూతగా పంపించాలని తీర్మానించారు.

అటు నిషిద్ధవైశ్యులు ఆరున్నూట పన్నెండు గోత్రీకులు వారు నివసిస్తున్న రాజ్యాలను వదిలిపెట్టి ఇతర సామ్రాజ్యాలకు వలస వెళ్లేందుకు తయారవుతున్నారు. ఇటు వణిజశ్రేష్ఠి తయారై పద్మశయన పురానికి బయలుదేరాడు.

పెనుగొండ నుండి మరో రాయబారి వచ్చాడని వినగానే విష్ణువర్ధనునిలో ఆశ తళుక్కుమంది. వణిజశ్రేష్ఠి కెదురుగా మంత్రులను పంపి సగౌరవముగా సభలోకి రప్పించు కున్నాడు. శుభవార్త మోసుకొచ్చాడనుకుని స్వయంగా ఎదురేగి గుండెలకు హత్తుకున్నాడు. వణిజశ్రేష్ఠికంతా అయోమయంగా ఉంది. తన చుట్టూచేరి వింజామరలు వీస్తున్న దాసీజనాలను విచిత్రంగా చూస్తున్నాడు. నరాల్లో భయాందోళన ప్రవేశించి సన్నని వణుకు పుట్టించింది. రాజనర్తకి దెయ్యంలా కనబడింది. గాయకుల స్వరమాధుర్యం గార్ధభస్వరంలా వినబడుతుంది. ఏది ఏమైనా చల్లకొచ్చి ముంత దాచడమెందుకను కున్నాడు. ధైర్యం కూడగట్టుకుని నమస్కరించాడు.

"మహారాజా ! దయచేసి నా మాటలు వినండి."

విష్ణువర్ధనుని కనుసైగతో నృత్య, గానాలు ఆగిపోయినై.

"చెప్పండి వైశ్య శిఖామణీ !" మహారాజు ముఖకవళికలు సంతోషాన్ని సంతరించుకున్నాయి. "మీరు మాకు అత్యంత ప్రియమైన శుభవార్త తెచ్చారు గదూ !"

"ప్రభూ ! ఇరుసామ్రాజ్యాల ప్రజలకు శుభం చేకూర్చే వార్త తెచ్చాను." అన్నాడు భయంభయంగా.

"అయితే వాసవి మా పద్మశయన సామ్రాజ్య లక్ష్మి కాబోతుందన్నమాట !"

"కాదు మహారాజా, వాసవాంబ విశ్వశాంతి సామ్రాజ్య లక్ష్మి కాబోతుంది."

"అం ... టే !" భృకుటి పీట ముడేసుకుంది.

"మహారాజా ! పెనుగొండ సామ్రాజ్యము లోని వైశ్యప్రముఖులు, సామంత రాజులంతా ఈ సమస్య గురించి చాలా చర్చించారు."

"చర్చించి .... వాసవిని ... "

"వాసవిని మీకివ్వరాదని నిర్ణయించుకున్నారు. వర్ణాశ్రమ ధర్మాలను, వయోభేదాలను, వాసవి మానసిక స్థితి... అన్నింటిని పరిగణలోకి తీసుకునే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు మీరు గూడా సమ్మతిస్తారని ఆశిస్తున్నాను. ఈ విషయములో ఇది చివరి రాయబారమని గూడా విన్నవిస్తున్నాను."

సభలో పిడుగు పడ్డట్లైంది.

"ఏమిటీ దుస్సాహసం !" విష్ణువర్ధనుడు పడగెత్తిన విష సర్పంలా బుసకొట్టాడు. పగబట్టిన నాగులా వణిజశ్రేష్ఠి ముందుకు రాబోయాడు. వణిజశ్రేష్ఠి దృష్టి ప్రధానమంత్రి వైపు మళ్లింది. ప్రధాని విజయసింహునితో పాటు మరికొందరు అడ్డుకున్నారు.

"శాంతించండి మహారాజా !" అంటూ కూచోబెట్టారు.

"పద్మశయన సామ్రాజ్యాధిపా !" తిరిగి ధైర్యం పుంజుకున్నాడు వణిజశ్రేష్ఠి. "గత యుగములో పతివ్రతామ తల్లి ద్రౌపతి మీద కన్నేసిన కీచకుడేమయాడో దయచేసి గుర్తు చేసుకోండి !" సముదాయించ బోయాడు.

మహారాజుకు ఒళ్లు భగ్గుమంది.

"ఈ పనికిరాని నీతులు మాకొద్దు. మాకన్నీ తెలుసు. మనసైన కన్యను మాదానిగా చేసుకోవడ మెలాగో మాకు బాగా తెలుసు. రాయబారాలు మాని రణరంగానికి రండి." కళ్లు అగ్నిగోళాల్లాగున్నాయి.

"మహారాజా ! దయచేసి మరోసారి ఆలో ... " వణిజశ్రేష్ఠి మాట పూర్తి కాలేదు. విష్ణువర్ధనుడు దిగ్గున లేచి ఒరలోంచి కత్తి తీయబోయాడు.

"మహారాజా !" విజయసింహుడు అడ్డుకున్నాడు. "రాయబారిని శిక్షించగూడదు. రాయబారిగా వెళ్లిన శ్రీకృష్ణునికి కౌరవసభలో జరిగిన అవమానానికి ఫలితమేమైందో మనందరికీ తెలుసుగదా !" చేతులు జోడించాడు వణిజశ్రేష్ఠి వైపు తిరిగి

"వైశ్యోత్తమా ! మీరు చెప్పాల్సింది చెప్పారు గదా ! ఇక దయచేయండి." బయటికి దారి చూపించాడు. "మీ మహారాజు గారినే మరోసారి ఆలోచించుకొమ్మనండి. మీ శుభ సందేశం కోసం గడవుతీరేదాకా ఎదిరిచూస్తాం" అన్నాడు.

వినాశకాలే ... విపరీత బుద్ధిః ... తనలో తాను అనుకుంటూ వణిజశ్రేష్ఠి సింహము గుప్పెట్లోంచి విడుదలైన చిట్టెలుకలా పరుగులాంటి నడకతో బయటికి నడిచాడు. అశ్వారూఢుడై అదే రాత్రి పెనుగొండ చేరుకున్నాడు.

రాత్రంతా నిద్రలేదు. ఉదయత్పూర్వమే లేచి తయారై పూజాగదిలో, కన్యకా పరమేశ్వరి విగ్రహానికి మోకరిల్లిన వణిజశ్రేష్ఠి మనసంతా ఆవేదనతో నిండి ఉంది.

"అమ్మా ! జగజ్జననీ ! గడ్డిపోచలాంటి సమస్య గడ్డపారలా తయారైంది తల్లీ ! శాంత స్వభావులైన మా కుసుమగుప్త ప్రభువుల సంకట పరిస్థితి మాకందరికీ బాధాకరమే. మా వైశ్య జాతికెందుకమ్మా ఈ పరీక్ష ? కామాంధుని కండబలానికి దాసోహమంటే నీ వరప్రసాది వాసవి బతుకు అన్యాయమై పోతుంది గదా ! ఎదిరించి పోరాడితే ... శాంతి, అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకము. ఈ సమస్యకు సరియైన పరిష్కారము చూపించు మాతా !" హృదయ వేదన విన్నవించుకున్నాడు.

సూర్యోదయ సమయాన మహారాజు ముందున్నాడు. ముఖ్యమైన నగర స్వాములు, బాలనగరులున్నారక్కడ. అందరికీ చేతులు జోడించి సమ్కరించాడు.

"మహారాజా ! వైశ్యోత్తములారా ! మంచి మాటలు, మన రాయబారాలు అన్నీ దయ్యాలకు వేదమంత్రాలు బోధించిన చందాన నిరుపయోగమైపోయినై. మన వైఖరి మంచి మాటలతో వివరించాను. ఎవరెన్ని చెప్పినా విష్ణువర్ధన మహారాజు వియ్యమో లేదా కయ్యమో తప్ప మూడోమార్గం లేదంటున్నాడు." విన్నవించాడు.

వైశ్యవృద్ధులంతా విచారములో మునిగారు. బాలనగరులు, యువకులు క్రోధావేశముతో ఊగిపోతున్నారు. విష్ణువర్ధనుని బలుపేమిటో యుద్ధరంగములోనే తేల్చుకుందా మంటున్నారు. కుసుమగుప్తుడు నిండుకుండలాగున్నాడు. వణిజశ్రేష్ఠికి నమస్కరించి "మహాత్మా ! మరిప్పుడు మన కర్తవ్యమేమిటి ? మీరు వయోవృద్ధులు, జ్ఞాన వృద్ధులు. మీ సలహా ఏమిటి ?" సవినయముగా అడిగాడు.

"మహారాజా !" వణిజశ్రేష్ఠి అనుభవము ముఖ కవళికల్లో కనబడింది. "అహింసా మార్గములో సాగుతున్న పరిపాలన... అలాగే సాగితే బాగుంటుంది. హింసాజ్వాలలు చెలరేగడం శ్రేయస్కరం కాబోదు ... "

"తాతా !" విరూపాక్షుని యువరక్తం కుతకుతలాడింది. "అయితే అక్కను ఆ కామాంధుని కప్పజెప్పి మనం పిరికి పీనుగుల్లా చూస్తూ కూచుందామా ?" సూటిగా అడిగాడు.

"కాదు మనవడా ... కాదు. మన ఆత్మాభిమానాన్ని చంపుకుని వాసవిని ఆ దుష్టుని కప్పజెప్పాల్సిన అవసరం లేదు."

"మరింకేమిటి మహాత్మా ?" ఓ నగరస్వామి అడిగాడు.

"మన వైశ్యజాతి విశ్వజ్యోతిగా వెలుగుతూనే ఉండాలి. అందుకే సరియైన నిర్ణయం తీసుకోవాలి. జాతికి కళంకము తేవడము కంటే నశ్వరమైన శరీరాలను త్యాగం చెయ్యడమే మేలు. ధర్మరక్షణ కోసం దైవ సన్నిధిలో ప్రాణాలొదలడమే శ్రేష్ఠమని పిస్తుంది." గంభీరంగా నిర్మోహమాటంగా తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"అయితే ... అందరమూ చర్చించి సమావేశములో నిర్ణయం తీసుకుందాం." అంటూంటే కుసుమార్యుని గొంతు వణికింది. అందరూ తయారై వచ్చి సమావేశములో కలుసుకుందా మనుకున్నారు. వణిజశ్రేష్ఠి వెళ్లిపోతూ

"మహారాజా ! ఈ లోగా చిరంజీవి వాసవి అభిప్రాయం గూడా కనుక్కుంటే బాగుంటుంది గదా !" సలహా ఇచ్చాడు.

విరూపాక్షుని నరాల్లో పౌరుషస్వరాలు వినిపిస్తున్నాయి. పెద్దలముందు వినయ విధేయతల నుల్లంఘించరాదని తనను తాను సంబాళించుకున్నాడు.

పరిస్థితినవగాహన చేసుకున్న పెనుగొండ ప్రధానమంత్రి సైనిక బలగాలను, సేనాధిపతులను పిలిచి అప్రమత్తం చేశాడు. ఏ క్షణాన్నైనా యుద్ధరంగములోకి దిగేందుకు సేనలు సిద్ధంగా ఉండాలని ఆదేశించాడు. పెనుగొండ పౌరుల్లో స్వాభిమానం పెల్లుబికింది. అందరి మనసుల్లో ఒకటే భావన – దైవ సేవకు అంకితమైన వాసవాంబను దుష్ట విష్ణువర్ధనుని కివ్వరాదు. ఒకవేళ ఆమె పెళ్లి, సంసారానికి సుముఖత చూపితే బాలనగరుకే ఇవ్వాలి. ఈ నియమాన్ని అక్షరాలా పాటించాలి.

# 14

కమ్మని హోమధూమము ఆశ్రమముపైన తెరలు తెరలుగా కనబడుతోంది. భాస్కరాచారి శిష్యగణం వేదమంత్రాలు వల్లెవేస్తోంది. తులసి వనముతో సయ్యాట లాడుకుంటున్న గాలితరగలు ఆశ్రమవాసులను ఆనంద లహరుల్లో విహరింపజేస్తున్నాయి. విరబూసిన పొన్న, పొగడ, సన్నజాజి, చేమంతులు గాలి అలలతో దోబూచులాడుతున్నాయి. కలకూజితాల కలరవాలు వీనుల విందు చేస్తున్నాయి.

పావన గోదావరి తరగల ఒడిలో స్నానం చేసి వచ్చిన భాస్కరాచారి శ్రీ కన్యకా పరమేశ్వరి విగ్రహానికి పూజలు చేస్తున్నాడు. మనిషిగా పూజచేస్తున్నా మనసులో కుసుమార్యుని సమస్య, వాసవి ఆలోచన, విష్ణువర్ధనుని మంకుపట్టు మెదుల్తున్నాయి. అమ్మవారి పాదాలకు నమస్కరించి చేతులు జోడించాడు.

"తల్లీ ! ఆదిశక్తీ ! నీ లీలావిలాసము మానవమాత్రుల కర్థం కాదు గదా ! వైశ్యజాతి నుద్ధరించేందుకే కుసుమగుప్తునిచే సుపరిపాలన చేయిస్తున్నావు. ఆణిముత్యాల్లాంటి ఇద్దరు పిల్లల్ని ప్రసాదించావు. జనమనోరంజకముగా పాలన సాగిస్తున్న వైశ్య భూపతి కెందుకమ్మా ఈ పరీక్ష ?" అడిగాడు.

మనోభావన అమ్మవారిని ప్రశ్నిస్తూంటే, ఆదిశక్తి ముఖారవిందముపై కాంతి రేఖలు ... కాంతిరేఖల్లో చిరునవ్వులు చిందులేస్తున్నాయి.

"కుమారా ! భాస్కరాచారీ !" అమ్మవారి పిలుపుతో పులకించిపోయాడు. తల్లి చల్లని చూపులతో తన్మయత్వం ఆవరించింది. సంతోషం పట్టలేక మరోసారి పాదాభివందనం చేశాడు.

"నేనే కుమారా ! కలియుగారంభమై పోయింది గదా !"

"అవును తల్లీ !"

"కలియుగములో ధర్మదేవత ఒంటికాలు మీద నడుస్తుంది. ఆ ఒంటి కాలుకు తోడుగా మిగితా మూడుకాళ్లు సహకరించాలంటే యుగారంభము నుండే నీతి, న్యాయం పరిఢవిల్లాలి. దుర్మార్గం, దౌర్జన్యాల కాలవాలమైన కలియుగములో న్యాయవర్తనులు నలిగిపోతారు. ముందు ముందు హింసా, దౌర్జన్యాలు మితిమీరకుండా ఉండాలంటే శాంతి, అహింస ప్రాధాన్యతలు అందరికీ తెలియజేయాలనే గదా వాసవి జన్మించింది. మానవ లోకములో ఉన్నావు కాబట్టి ... గతాన్నోసారి గుర్తుకు తెచ్చుకో. అంతా నీకే అవగతమవుతుంది."

"నిజమే తల్లీ !" భాస్కరాచారి చూపులు శూన్యంలో తచ్చాడుతూంటే మనసు పొరల్లో గతం సంఘటనలు మెదల్తున్నాయి. ...

నిత్య శివపూజతో పులకరిస్తూ వైశ్యులు కైలాసములో కులాసాగా గడుపుతున్న రోజులవి. అప్పటికే వంద దేవవర్షములు గడిచిపోయినై. వైశ్య శిఖామణి అందాల కూతురు ప్రభావతినో గంధర్వుడు వివాహమాడదలచి విఫలుడైనాడు. దేవలోకములో గంధర్వులు కడజాతివారు. అందుకే కన్యనివ్వమన్నారు వైశ్యులు. గంధర్వుడు కోపగించి ప్రతీకారం తీర్చుకోవాలని భంగపాటు చెందాడు. వైశ్యోత్తముడైన సోమకాంతునితో ప్రభావతి వివాహమైంది.

ప్రభావతి – సోమదత్తుల జంట చిలకాగోరెంకల్లాగుంది. కలిసి సుఖాలనుభవిస్తున్నారు. వారి ప్రేమానుబంధాన్ని, అన్యోన్యతను ప్రశంసించి శచీదేవి ఆశీర్వదించింది. దంపతులు శచీదేవికి భక్తితో నమస్కరించారు.

"అమ్మా ! విశ్వసుందరివైన నీ అంశతో మాకో కూతురు జన్మించేలా ఆశీర్వ దించమ్మా !" అన్నాడు సోమదత్తుడు.

"ఆ కూతురు నీలాగే అపురూప లావణ్యవతిగా ఉండాలమ్మా !" ప్రభావతి ప్రార్థించింది. శచీదేవి సంతోషించి

"తథాస్తు" అంది.

ఆ ఆశీర్వాదబలంతో వారికో కూతురు జన్మించింది. ఆ బాలిక అందచందాలు వర్ణనాతీతము. పెరిగి పెద్దదై కీర్తిగడించాలనే ఉద్దేశ్యముతో ఆ పాపకు కీర్తికన్యక అని నామకరణం చేశారు.

గారాబంగా పెరిగి పెద్దదైన కీర్తికన్యకకు యుక్తవయసు వచ్చింది. ఆ అందాల భరిణ షోడషకళా ప్రపూర్ణయై సకల విద్యలతోపాటు సంగీతం నేర్చుకుంది. అందరినీ ఆకట్టుకునే అవయవ సంపదతో మధురోహల్లో తేలిపోతుంది.

ఓ రోజు చెలికత్తెలతో సుందరోద్యాన వనములో స్వేచ్ఛగా ఆటలాడుకుంటుంది. గొంతెత్తి పాడుతుంది. పిల్లగాలి తరగలకు ముంగురులు మెల్లగా కదుల్తొంటే మీగడ లాంటి చెక్కిళ్లు మురిపాలొలికిస్తున్నాయి. సుస్వరాల రాగఝరి గంధర్వగానాన్ని మించి పోయింది.

అప్పుడే ... హాయిగా విహారయాత్రకు అటువచ్చిన గంధర్వరాజు చిత్రకంఠుని చెవులకు సోకింది. అతడు మణిపురాధీశుడు. గానామృతం పులకింపజేసింది. కన్యకా మణుల ఆట పాటలను పొదలమాటనుంచి చూస్తున్నాడు. సుమపరిమళాల సురభిళాలు మత్తెక్కిస్తున్నాయి.

కీర్తికన్యక వీణ వాయిస్తూ పరమేశ్వర తత్వాన్ని పాడుతుంది. కందిరీగల గుంపులా చుట్టూ చేరిన చెలికత్తెలు గానలహరిలో తేలిపోతున్నారు. అందాల భామ కీర్తికన్యక రూపలావణ్యం చిత్రకంఠునికి గిలిగింతలు పెట్టింది.

ఆహా ! ఈ సుందరాంగిని అర్ధాంగిగా చేసుకుంటే సుఖసంద్రములో ఈదులాడొచ్చు... మనోభావన బలపడింది. గిలిగింతలు పులకింతలైనాయి. ధైర్యంగా దగ్గరి కెళ్ళి

"మధుమతీ ! నీవెవవ్వరు ?" అడిగాడు ఓరచూపులతో

ఓరచూపులకు దోరవయసు కీర్తికన్యక తుళ్లిపడింది. మత్తుమధుపము రెక్కల్లా కనురెప్పలు టపటప లాడినై. దిగ్గున లేచి నుంచుంది.

"నువ్వెవరు ? ఇక్కడికెందుకొచ్చినట్టు ?" క్రీగంటతో చూస్తూ అడుగుతూంటే దొండపండులాంటి కిందిపెదవి మునిపళ్ల మధ్యకొచ్చింది.

"సుందరీ ! నీ రూపలావణ్యం నన్ను పరవశింపజేసింది." కిరీటం సవరించు కుంటూ "నాపేరు చిత్రకంఠుడు, గంధర్వరాజును, మణిపురాధీశుడిని. మొదటి చూపుతోనే నన్ను కట్టిపడేశావు సుమా !" ముందుకు రాబోయాడు.

"ఆగండి !" ఓ చెలికత్తె ఆపేసింది. "తమరు మణిపురాధీశులైతే మాకేమి ? మణిపూసలైతే మాకేమి ?" ధుమధుమలాడింది. "మా కీర్తికన్యక సామాన్యురాలు కాదు, జాగ్రత్త !"

"ఓహో ! ఈ మధుమతి పేరు కీర్తికకన్యకనా ? చాలా సంతోషం. అయితే..."

"అయితే మాత్రం మా కీర్తికన్యకమ్మ గారికి అపకీర్తి అంటగడ్తారా ?" మరో చెలికత్తె నిలదీసింది.

"లేదు. నేనామెను మనసారా ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకుంటాను ..." అనగానే

కీర్తికన్యక భీత హరిణేక్షలా పరుగు లంకించుకుంది. చెలికత్తెలు ఆమె ననుసరించారు. చిత్రకంఠుడు మన్మథబాణాలతో సతమతమై పోతున్నాడు. "అందాల భామా ! కీర్తి కన్యకా ... !" గొంతెత్తి పిలుస్తూ వెంబడిస్తున్నాడు. అందుకోవాలని ఆరాటపడుతున్నాడు.

కీర్తి కన్యక ఆగి వెనుదిరిగింది. కోపదృక్కులతో వణికిపోతోంది. చెలికత్తెలు రక్షణ కవచంలా చుట్టూ నుంచున్నారు.

"గంధర్వరాజా ! నేను నా తల్లిదండ్రుల ఆధీనను. కన్నవారి కను సన్నలలో పెరిగాను. స్వతంత్రురాలిని కాను. తెలుసుకో !" హెచ్చరించి తిరిగి పరుగు లంకించు కుంది. దమ్మిదీస్తూ ఇంటి కెళ్లింది. విషయమంతా తల్లిదండ్రులకు చెప్పింది.

మదనతాపం చిత్రకంఠునికి మత్తెక్కిస్తోంది. కీర్తికన్యక అధరామృతాన్ని తనివిదీరా గ్రోలాలని మనసు ఉబలాటం. ఉద్యానవనములోని చెట్లు, చేమంతులు తనను చూసి నవ్వుతూ గుసగుస లాడుకుంటున్నట్టనిపించింది. విరహవేదన భరించలేక పోయాడు. పరుగు పరుగున సోమదత్తుని చెంతకు చేరి తన కోర్కె వెలిబుచ్చాడు.

"మీ ముద్దుల మూట కీర్తికన్యకను శాస్త్రోక్తంగా పెళ్లాడ్తాను. ఆశీర్వదించండి" అంటూ బతిమాలాడు.

అప్పటికే సోమదత్తుని ఇంట్లో కొందరు వైశ్యమునులున్నారు. వైశ్యులందరినీ వైశ్యమునులంటా రక్కడ. సోమదత్తుడు ఆగ్రహావేశాలతో చిత్రకంఠుడిని చురచురచూస్తూ

"ఓయీ ! పెళ్లంటే పిల్లలాటనుకున్నావా ? పిచ్చివాని వలె కారుకూతలు

కూయవద్దు. వెంటనే వచ్చిన దారిలో వెళ్లు" మని హెచ్చరించాడు. మరో వైశ్యముని

"కామోద్రేకముతో కల్యాణం గురించి మాట్లాడుతున్నావు. ఇది ధర్మం కాదు, పద్ధతి కాదు." అన్నాడు.

చిత్రకంఠుడు కదలలేదు. లోపలి గర్వం కళ్లల్లోకొచ్చింది. ఆ చూపులు వైశ్య మునుల అసహనానికి కారణమైనాయి.

"ఓయీ గంధర్వుడా ! పిల్లనివ్వమని తేల్చి చెప్పింతర్వాత ఇక్కడే ఎందు కున్నావు?" ప్రశ్నించాడో వైశ్యముని.

"ఓయీ వైశ్యులారా ! నేను గంధర్వుడను." చిత్రకంఠునిలో అహంభావం పొంగులెత్తింది. "అందచందాలలో వైశ్యులకంటే మిన్నను, దైవీశక్తులు కలవాడను. మీ అమ్మాయిని పెళ్లాడేందుకన్ని అర్హతలున్న వాడిని. కాదంటే కుదరదు." భుజ కీర్తులు సర్దుకుంటూ బెదిరించాడు.

సోమదత్తుడది భరించలేకపోయాడు. మొహంలో రంగులు మారాయి. "ఏం ... భయపెడుతున్నావా ? ప్రేలాపనలు కట్టిపెట్టు. మూర్ఖుడిలా ప్రవర్తించకు వెళ్ళు" మన్నాడు.

వైశ్యమునులందరినీ కోపంగా చూస్తూ

"ఊహుం ! నేను ఒంటరిగా వెళ్లను. కీర్తి కన్యకను పెళ్లాడి జంటగా వెళ్తాను. మీరే మీ పెద్దతనాన్ని కాపాడుకోండి." హెచ్చరించాడు చిత్రకంఠుడు.

ఓ వైశ్యముని చిత్రకంఠుని చేతులు పట్టుకుని

"నువు గంధర్వుడివే. కాదనము. కాని ... గంధర్వులు దేవలోకములో కడజాతి వారు. కడజాతి వారితో వైశ్యులకు పెళ్లిసంబంధం కుదరదు. పైగా ... నీవు వయసు మీరిన వాడవు. కీర్తికన్యక యవ్వనవతి. మరో సంగతి విను. సుదంతుడనే వైశ్యయువకునికి కీర్తికన్యకనిచ్చి వివాహం చెయ్యాలని నిర్ణయమైంది. కాబట్టి నీ కోర్కె నెరవేరదు. ఈ పెళ్లి కుదరదు. మర్యాదగా వెళ్లిపో !" సముదాయించాడు.

చిత్రకంఠునిలో కోపావేశాలు కట్టలు తెంచుకున్నాయి. రోషం బుసబుసలాడింది.

"ఇదేనా మీ నిర్ణయం ?" గద్దించి అడిగాడు.

"అవును. ఇదే మా నిర్ణయం." సోమదత్తుడు తేల్చిచెప్పాడు.

"అయితే మీ పనికిమాలిన పట్టుదలకు మీరంతా ఫలితమనుభవించాల్సిందే. మీరంతా కైలాసాన్ని వదిలి భూలోకములో మానవులై పుడ్తారు. అక్కడ కీర్తికన్యకతో సహా క్రోధావేశమనే అగ్ని జ్వాలల కాజ్యమై పోదురు గాక !" శపించాడు.

అనూహ్యమైన సంఘటన ... వైశ్యమునులు రోషావేశానికి లోనయారు. అవమానం రుసరుసలాడించింది. సోమదత్తుడు ముందుకొచ్చి

"ఓరీ గంధర్వా ! దైవీశక్తులు నీకే కాదు. మాగ్గూడా ఉన్నాయి. దుర్మార్గుడా! ఏ అపకారం చెయ్యని మమ్ముల్ని శపిస్తావా ! కాచుకో ! మాతోపాటు నీవు గూడా భూలోకంలో మనిషిగా జన్మించి మా పట్టుదలను పరీక్షించి తలపగిలి ఛస్తావు." అందరి తరఫున ప్రతిశాపమిచ్చాడు.

"అవును. ఇది తథ్యం !" వైశ్యమునులంతా శాపాన్ని బలపరిచారు.

గర్వం సర్వం హరించుకుపోయిన చిత్రకంఠుడు చింతాక్రాంతుడై వెనక్కు తిరిగాడు. వైశ్యుల హృదయాలు బాధాతప్తమైనాయి. తమలోతాము సంప్రదించుకుని పరమశివుని చెంతకేగారు. శివస్తోత్రము గావించి జరిగిన వృత్తాంతమంతా వివరించి, పర్యవసానము సెలవివ్వమన్నారు.

త్రినేత్రుని కంతా అవగతమైంది.

"మీరు ప్రశాంతచిత్తులై ఉండండి. ప్రస్తుతం కలవరపడాల్సిందేమీ లేదు." అన్నాడు.

వైశ్యమునులు సంతృప్తి చెందలేదు. పక్కనున్న నందీశ్వరునికి ప్రణామాలర్పించి దీనవదనులై నుంచున్నారు.

నందీశ్వరుడు అయోమయంలో పడిపోయాడు. శివునికి నమస్కరించి "ఇదంతా ఏమిటి స్వామీ ? పాపమా వైశ్యులను శాపభయం పీడిస్తుంది." సానుభూతి ప్రకటించాడు. శివుడు నవ్వేసి

"ఇది విధాత లీలారహస్యం. ఈ శాపాలు, ప్రతిశాపాలు లోకకల్యాణార్థమే, కాబట్టి నువ్వేమి వ్యాకుల పడొద్దు." అన్నాడు.

అప్పుడే తపస్సంపన్నుడైన కణ్వమహర్షి శివదర్శనార్థమై కైలాసాని కొస్తున్నాడు. మధ్యలో వైశ్యమునులెదురయ్యారు. వారి మొహాల్లో ఆందోళన ద్యోతకమైంది. దివ్యదృష్టితో అంతా గ్రహించాడు. మందహాసం చిందించాడు. వైశ్యమునులతనికి పాదనమస్కారం చేశారు.

"వైశ్యమునులారా ! మీ ఆందోళనకు కారణం నాకవగతమైంది." అన్నాడు మహర్షి "మీరంతా సిద్ధవైశ్యులు గదా !"

"అవును మహా తపస్వీ !" సిద్ధవైశ్యులకు ప్రాణం లేచొచ్చింది. "కీర్తి కన్యక వివాహం గురించి మా కర్తవ్యమేమిటో సెలవివ్వండి మహర్షీ !" సోమదత్తుడడిగాడు.

శీల సంపన్నులైన సిద్ధవైశ్యులను చూస్తుంటే మహర్షికి జాలేసింది.

"వైశ్యఋషులారా ! వీరు ధర్మాచరణులు. మాయావి చిత్రకంఠుని దురాగ్రహానికి గురయ్యారు. అదంతా విధి విధానము. చాతుశ్వర్ణ విభజనలో వైశ్యవర్ణం ధర్మాల గురించి ఋగ్వేదములో విపులీకరించారు. వైశ్యులు మేనమామ కుమార్తెను పెళ్లాడ్డం మేనబావకు హక్కుగా భావించవచ్చు. ఇది వైశ్యజాతికి శ్రేయస్కరము. కాబట్టి సోమదత్తుని మేనల్లుడైన సుదంతునికే కీర్తికన్యక నిచ్చి పెళ్లిచెయ్యడం శ్రేయస్కరము." తేల్చి చెప్పి ఆశీర్వదించి వెళ్లిపోయాడు.

సిద్ధవైశ్యుల కదే శిరోధార్యమైంది.

చిత్రకంఠుడు అవమాన భారంతో తల్లడిల్లిపోతున్నాడు. సుదంతుణ్ని తప్పిస్తే కీర్తికన్యక తనదవుతుందనుకున్నాడు. పథకం అల్లుకున్నాడు. మాయోపాయ మంత్ర ప్రయోగముతో సుదంతుడిని శరీరకంగా బలహీన పరిచాడు. సుదంతుడు కృశించి పోతున్నాడు.

సిద్ధవైశ్యులు కలవరపడ్డారు. నందీశ్వరుణ్ని వేడుకున్నారు. నందీశ్వరుడు కరుణించాడు.

"వైశ్యమునులారా ! చిత్రకంఠుడోసారి పరమశివుణ్ని ప్రార్థించి మాయాశక్తిని సంపాదించాడు. కాని ఆ మాయామంత్రం వారం రోజులే పంజేస్తుంది. అంతవరదాకా ఈశ్వరోద్యాన వనమందున్న పారిజాత వృక్షముల మధ్య కీర్తికన్యక – సుదంతులనుంచండి. మీకు శుభం కలుగుతుంది." రహస్యం విప్పి చెప్పి తరుణోపాయం సూచించాడు.

వైశ్యులా సూచన నమలు పరిచారు. వారం తర్వాత సుదంతుడు మామూలుగా బలవంతుడైనాడు.

పారిజాత సుమాదులతో సుందర ఈశ్వరోద్యానవనము వివాహ వేదికగా మారింది. దాన్ని మరింత అందముగా అలంకరించారు. పరిమళ పుష్ప సువాసనలు ఉత్సాహ పరుస్తున్నాయి. వేదమంత్రాలు, మంగళవాద్యాలు ఉల్లాసాన్నిస్తున్నాయి. ప్రమద గణాలు, భృంగి, నందీశ్వరాది దేవతల సాక్షిగా కీర్తికన్యక - సుదంతుల వివాహం కన్నుల పండుగగా జరిగింది.

చిత్రకంఠునికి ఒళ్లు భగ్గుమంది. వేదమంత్రాలు, నాదస్వరాలు కర్ణకఠోరా లైనాయి. ఈశ్వరోద్యాన వనము చెట్లు తలాడిస్తూ "ఓసి వెర్రివాడా ! కీర్తికన్యక నాశించి అవమానాల పాలయావు గదూ ! ఎందుకీ పాడు బతుకు ?" అంటూ ఛీకొడుతున్నటని పించింది. పెళ్లి జరుగుతున్నప్పుడు గంధర్వులు, దేవతలు అక్కడున్నారు కాబట్టి వెళితే అపహాస్యం తప్పదు. కాని ... వైశ్యులను సుఖంగా ఉండనీయరాదనుకున్నాడు. ప్రతీకారం తీర్చుకోవాలనుంది.

పెళ్లయిన మూడవ రోజు ... పళ్లు పటపటలాడిస్తూ సోమ దత్తుని ఇంటికెళ్లాడు. అందరూ పెళ్లి పనుల్లో ఉన్నారు. ఇంటినిండా బంధువులున్నారు. కీర్తికన్యక – సుదంతులు ఓరచూపులు, ముసిముసి నవ్వుల మురిపాలలో తేలిపోతున్నారు. చిత్రకంఠునికి ఒళ్లంతా కారం రాసినట్లైంది.

"అహ్హా హ్హా ! ఓ హొ హ్హో ... !" భయంకరంగా నవ్వాడు. హడిలిపోయి జడుసుకున్నారంతా. పనులు మానేసి చిత్రకంఠుని ముందుకొచ్చారు.

"అరెరే ... ఇతడు చిత్రకంఠుడు. ఇప్పుడు, ఇక్కడికెలా వచ్చాడ"ని ఆందోళన పడుతున్నారు.

"ఓరోరి వైశ్యాధములారా !" చిత్రకంఠుడు మరింత భయంకరంగా, పైశాచికంగా నవ్వాడు. "మీరంతా ఇక్కడినుండి ఇప్పుడే నదిలో కొట్టుకు పోదురు గాక !" చేతులు తిప్పుతూ మాయచేసి వెళ్లిపోయాడు.

అంతే... ఇంటిలో నదీప్రవాహం ... మందాకిని వేగాన్నందుకుని ప్రవహిస్తోంది. కొత్త జంటతో సహా వైశ్యులంతా కొట్టుకుపోతున్నారు. ఆర్తనాదాలు, హాహాకారాలు చెలరేగాయి. ఒకరికొకరు కనబడుట లేదు. అంతా గొంతెత్తి జగన్మాతను ప్రార్థించారు. జగన్మాత కరుణించి ప్రత్యక్షమైంది. ఒక్కక్షణంలో మాయా ప్రవాహం మాయమైంది. ఎప్పట్లాగే ఇల్లు పెళ్లికళతో కన్పించింది. అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జగన్మాత వెంటనున్న దేవతలు అంతా చూస్తున్నారు.

నా ఆశీస్సులతో జరిగిన పెళ్లికిలాంటి ఆటంకమా ! నందీశ్వరునికి కోప మొచ్చింది. "ఓరోరి చిత్రకంఠా !" కేకేశాడు.

చిత్రకంఠుడు ముందుకొచ్చాడు. ఛాతీవిరిచి నుంచుని విచిత్రంగా నవ్వు తున్నాడు. హేళన చేస్తున్నాడు.

"చిత్రకంఠా !" నందీశ్వరుడు కోపంగా కొమ్ములనాడిస్తూ "ఇంకా నువ్విక్కడ ఉండాల్సిన పనిలేదు. భస్మమైఫో !" శపించాడు.

చిత్రకంఠుడది భరించలేకపోయాడు.

"ఓయీ నందీశ్వరా ! నేనిప్పుడు భస్మమై పోయినా, తర్వాతి కాలములో మానవ లోకములో జన్మించాలి గదూ ! అప్పుడు నీవు గూడా మానవుడిగా జన్మిస్తావు. ఇది నా ప్రతిశాపము" అరిచాడు.

వెంటనే అగ్నిజ్వాలలు చుట్టుముట్టి చిత్రకంఠుణ్ని కాల్చి బూడిదగా మార్చేశాయి.

వైశ్యమునులు నందీశ్వరుణ్ని ప్రార్థించారు.

"స్వామీ ! శాంతించండి." అంటూ వేడుకున్నారు.

"మా కారణంగా మీరు శాపగ్రస్తులైనారా స్వామీ !" సోమదత్తుడు బాధపడ్డాడు.

నందీశ్వరుడు శాంతించాడు.

"సోమదత్తా ! వైశ్యశిఖామణులారా ! ఇదంతా లోక కల్యాణార్థమే జరుగుతుంది. ఇది కృతయుగము. నేను, కీర్తికన్యక మానవులుగా పుట్టేసరికి కలియుగారంభమవుతుంది. చిత్రకంఠుడు గూడా అప్పుడే మానవుడిగా జన్మిస్తాడు. అతని పీడ అప్పుడు మీకు తప్పదు. మీతో అకారణ వైరము పెంచుకుని మీ వల్లనే మరణిస్తాడు." భవిష్యవాణి వినిపించాడు ...

ఆనాటి నందీశ్వరుని పలుకులు ఈనాడు భాస్కరాచారి చెవుల్లో గింగురుమన్నాయి.

ఏ సమయాన ఏం జరుగనున్నదో ఎవరికీ తెలియదు. విధివిధానాన్ని తప్పించే శక్తి ఎవరికీ లేదు ... తనలో తాను నవ్వుకున్నాడు. ఆశ్రమవాసులు ఎవరిపనుల్లో వారున్నారని అర్థమైంది. ముందున్న అమ్మవారికి నమస్కరించాడు.

"తల్లీ ! నాకు మరో సంఘటన గూడా గుర్తుకొస్తుందమ్మా !"

"శుభం కుమారా ! గుర్తు చేసుకో ... నెమరేసుకో ... అప్పుడే నీకు భావి కర్తవ్యం అవగాహన కొస్తుంది." అమ్మ ఆజ్ఞాపించింది.

భాస్కరాచారి మనోఫలకమ్మీద ఆనాటి కైలాసపర్వతం ప్రత్యక్షమైంది. ఆనాడు... కైలాసములో పార్వతీపరమేశ్వరులు కొలువుదీరి ఉన్నారు. ప్రమదగణాల ప్రార్థనలందుకుంటున్నారు. గాయకుల గొంతులో నవరసాలు నాట్యమాడుతున్నాయి. డమరుకం, తప్పెట, డోలు, తాళాలు నర్తకుల నాట్యభంగిమల కనుగుణంగా మోగుతున్నాయి. శివసంకీర్తనలు కైలాసవాసులకు కమ్మని అనుభూతినిస్తున్నాయి. పరమశివుని కంఠాభరణాలైన సర్పములు సంతోషముతో పడగలెత్తి తలాడిస్తున్నాయి. తలమీద గంగమ్మ, శిఖపైన చంద్రవంక ఆసక్తిగా తిలకిస్తున్నారు. అంతమంది ఉన్నా నందీశ్వరుడు లేని లోటు కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

"నందీశ్వరుడింకా రాలేదేమిటి ?" కొందరు చెవులు కొరుక్కుంటున్నారు.

"నా నేస్తమింకా రాలేదెందుకో !" భృంగి ఎదిరి చూస్తున్నాడు.

పార్వతీదేవి ముఖారవిందము పద్మదళాల్లాంటి విశాల నేత్రాలతో వెలిగిపోతుంది. నున్నని నుదురు మధ్యన కుంకుమబొట్టు కస్తూరి మృగము నాభినుండి స్రవించే రస బిందువులా కనబడుతుంది. కైలాస పర్వతం కళాకాంతులతో ఆనంద తాండవమాడుతుంది.

అందరి మధ్యలోంచి నందీశ్వరుడు ఆగమాగంగా వస్తున్నాడు. ఆలస్యమైనందుకు సిగ్గుపడుతూ పరుగెత్తుకొస్తున్నాడు. దమ్మిదీస్తూ నేరుగావెళ్ళి పరమ శివునికి పాదాభివందనం చేసి నుంచున్నాడు. కంగారుగా ఉన్నాడు. కాబట్టి పక్కనున్న పార్వతివైపు దృష్టిపోలేదు. వెనుదిరిగి తన స్థానానికెళ్ళి పోతున్నాడు. పార్వతికదేమీ బాగనిపించలేదు.

పరమేశ్వరుని అర్ధాంగిని, పక్కనే కూచున్నాను. నాకు కనీసం అభివాదము కూడా చేయ్యలేదు. అసలు నా ఉనికినే గమనించలేదు. ఇంత నిర్లక్ష్యమా !... లేక కావాలనే నిరాదరణ చూపిస్తున్నాడా ?

"నందీ... ఆగు !" కోపం మిళితమైన గొంతుతో పిలిచింది. దాంతో కైలాసం కకావికలైంది. వాయిద్యాలు, నాట్యాలు ఆగిపోయినై. నందీశ్వరుని గుండె ఝల్లుమంది.

అయ్యో ! పార్వతిమాతను మరిచాను గదూ ! .... నాలిక్కరుచుకున్నాడు. వెనుదిరిగి చేతులు జోడించే లోగా

"యజమానుల పట్ల సేవకుల నిర్లక్ష్యం సహించరానిది. పరమేశ్వరుని పక్కనే ఉన్న నా ఉనికినే గమనించని దురహంకారానికి తగిన శిక్ష అనుభవిస్తావు." పార్వతి హెచ్చరించింది.

"తల్లీ ! మాతా !" వంగి నమస్కరించాడు.

"ఎందుకా కృత్రిమ మర్యాద ? నీ నమస్కారములో సంస్కారం లేదు. ఎందుకీ పైపై భక్తి ! పరమేశ్వరుని సన్నిధిలో, ప్రమద గణాల మధ్యన లోకమాతనైన నాకింత అవమానమా ! నువు భూలోకములో మానవుడివై పుడ్తావు." శపించింది. ఎగసి పడుతున్న గుండెలమీద స్వర్ణాభరణాలు అరుణవర్ణమై కదుల్తున్నాయి.


నందీశ్వరుడది సహించలేక పోయాడు. ఇంత చిన్న తప్పుకు అంతపెద్ద శాపమా ! పరమశివుని వాహనాన్ని, ప్రియమైన సేవకుడిని, నాకే ఇంత పరాభవమా ! రోషంతో కొమ్ములాడిస్తూ పార్వతి ముందుకెళ్లాడు.

"అమ్మా ! నాతో పాటు తమరు గూడా భూలోకములో మనిషిగా జన్మిస్తారు. నాకంటే ముందే తనువు చాలిస్తారు." ప్రతిశాపమిచ్చాడు.

అక్కడున్న వారంతా నిర్ఘాంతపోయారు.

అయ్యయ్యో ! ఇంతసేపట్లో అంత జరిగిందా ! అనుకుంటూ అవాక్కయారు. తేరుకుని పరమశివుని ప్రార్థించారు.

"ఇదేమిటి స్వామీ ? రజతాద్రిపైన రణరంగ వాతావరణమా ! మీ సమక్షములో ఇంతటి ఘోరమా !" బాధతో అడిగాడు భృంగి.



త్రినేత్రుడు తనలో తానే భవిష్యద్దర్శనం చేసుకున్నాడు.

"పరమశివా ! ఈ శాప ప్రతిశాపాల పర్యవసానమేమిటి దేవా ?" మళ్లీ అడిగాడు భృంగి – అందరి తరఫున.

పరమశివుడందరినీ చూపులతో తడుముతూ

"భక్తులారా ! ఇది విధి నిర్ణయము. వీరిద్దరి శాపాలు అమల్లో కొచ్చి తీరాల్సిందే."

ప్రమద గణాలు హడలిపోయినై. నందీశ్వరుడు బెంబేలెత్తిపోయాడు. పార్వతి అప్రతిభురాలైంది.

"శంకరా ! అభయంకరా !" నందీశ్వరుని రోషం బాధగా పరిణమించింది." కైలాసాన్ని, ప్రమదగణాలను విడిచి మీ ఆదిదంపతులకు దూరంగా భూలోకములో నేను మనగలనా ? మీ సేవలో తరిస్తూ నిరంతరం సదానంద భరితుడ నవుతున్న నాకింత పెద్ద శిక్షనా ? తరుణోపాయం సెలవివ్వండి మహదేవా !" గోడు గోడుమన్నాడు.

"ప్రాణేశ్వరా !" పార్వతి గొంతు వణికింది. "తాత్కాలికావేశములో ప్రియ సేవకుడిని శపించాను. నన్ను మన్నించండి. కైలాసానికి దూరంగా నేను మాత్రం మనగలనా స్వామీ ?" నల్లని కళ్లల్లో తెల్లని మంచు పొర తళుక్కుమంది. పరమశివుని వాలకం గంభీరమైంది.

"మీరేమీ కలవర పడొద్దు. సృష్టికి మూలమైన ఆదిశక్తి నిర్ణయమిది. ముందు జాగ్రత్త చర్యగా భావించాలి. రాబోవు కలియుగము దోపిడి, దౌర్జన్యాలు, అసూయ, ద్వేషం, పగ, ప్రతీకారాల కాలవాలమై ఉంటుంది. యుగారంభము నుండే సదాచారము, ధర్మాచరణ వర్ధిల్లాలి. అందుకోసము దేవతలే మానవులుగా అవతరించి మానవాళికి ఆదర్శమార్గం చూపాలి. అందుకే కలియుగారంభములోనే ఆదిశక్తి రూపాల్లో ఒకటైన శ్రీ కన్యకాపరమేశ్వరి అంశతో పార్వతి మానవిగా జన్మిస్తుంది. చేతల ద్వారా విశ్వమానవాళికి శాంతి సందేశాన్నందించి అవతారం చాలిస్తుంది. ఆమెకు సోదరుడుగా నంది జన్మిస్తాడు. మానవ మాత్రులకు ఆచరణ యోగ్యమైన పథనిర్దేశం చేసి అవతారం చాలిస్తాడు. చివరికి వాళ్లిద్దరూ ఈ కైలాసానికే తిరిగి వస్తారు. ఆ విశేషాలను ముందు ముందు మనం చూస్తుంటాము." అనునయంగా చెప్పి అందరి ఆందోళనను దూరం చేశాడు ....

ఆహా ! జగన్మాతా ! కన్యకా పరమేశ్వరీ ! గుర్తొచ్చిందమ్మా ! నెమరేసు కున్నానమ్మా !" భాస్కరాచారి ఆనందావేశముతో విగ్రహానికి పాదనమస్కారం చేశాడు.

నిజమేనమ్మా ! ఆనాడు కుబేరుని అంశతో జన్మించిన ఆ సోమదత్తుడే ... తిరిగి కుబేరునిలో లీనమయాడు. ఈనాడా కుబేరుడే కుసుమగుప్తుడైనాడు గదా !

పార్వతిదేవియే వాసవి, నందీశ్వరుడే విరూపాక్షుడు గదా ! అలనాటి గంధర్వరాజు చిత్రకంఠుడే విష్ణువర్ధనునిగా జన్మించాడు గదమ్మా ! నీ లీలలు అనంతములు. ఇక జరగాల్సిందేదో జరిపించు జగన్మాతా ! ... మరోసారి నమస్కరించాడు.

అమ్మా ! విగ్రహరూపములో ఉండి నా నిగ్రహాన్ని పరీక్షించావు గదూ ! ప్రత్యక్షంగా నాతో మాట్లాడావు గదూ ! నా మనసు పొరల్లో నిద్రాణమై ఉన్న గత సంఘటనలను గుర్తు చేశావు గదమ్మా !

పూజ ముగించుకుని ఉల్లాసంగా బయటికొచ్చాడు.

ఇకముందు జరగాల్సిందేదో జరిపించాల్సిన బాధ్యత నీమీదుంది ... సంకల్పం దృఢమైంది.

# 15

గోదావరి తీరప్రాంతమంతా పెనుగొండ, పద్మశయన సామ్రాజ్యాల అధీనములో ఉంది. వాసవి – విష్ణువర్ధనుల విషయం సామంతరాజ్యాలన్నింటిలో చర్చనీయాంశమైంది. ప్రతిఇంటిలో అదే విషయం. నలుగురు కలిసిన చోటల్లా అదే ప్రస్తావనకొస్తుంది. సామాన్యులంతా విష్ణువర్ధనుని మొండి పట్టుదలను, కామోద్రేకాన్ని నిరసిస్తున్నారు. అమాయకురాలైన వాసవి పట్ల, ధర్మపాలనా దక్షుడైన కుసుమగుప్తుని పట్ల సానుభూతి వ్యక్తమవుతుంది. సామాన్యుల, అసామాన్యుల మనోభావాలను సేకరించి వేగులు పై అధికారులకు పంపిస్తూనే ఉన్నారు.

పెనుగొండ అంతఃపురములో పెనుతుఫాను వాతావరణముంది. కుసుమ గుప్తుడు కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతున్నాడు. కుసుమాంబ అంతరంగము అల్లకల్లోలముగా ఉంది. వాసవి మాత్రం నిర్లిప్తంగా కూచునుంది. విరూపాక్షుని ఉడుకు రక్తం ఉరకలేస్తోంది.

"తల్లీ ... వాసవీ !" కుసుమగుప్తుడు ప్రస్తావించాడు. "విష్ణువర్ధనుని పంతాన్నెలా ఎదుర్కోవాలని అందరం ఆలోచిస్తున్నామమ్మా."

"ఇంకా ఆలోచించేదేముంది నాన్నా ?" విరూపాక్షుని వీరావేశం. "అలాంటి దుష్టచిత్తునికి దండనం దశగుణం భవేత్, అన్నారు గదా ! మాకు అనుమతివ్వండి. బాలనగరులమే కలిసివెళ్ళి వాని పెడరెక్కలు కట్టితెచ్చి మీముందు పడేస్తాం." చెయ్యి కత్తి మీదుంది.

"కుమారా ! తొందరపాటు తగదు." బాధనంతా పొత్త కడుపులో అదిమి పెట్టుకుంది కుసుమాంబ. "నాన్నగారు, పెద్దలు కలిసి తీసుకున్న నిర్ణయాన్ని అమలు పరచడం నీ బాధ్యత."

రోషాన్నంత దిగమింగి కూచున్నాడు విరూపాక్షుడు.

"ప్రస్తుతం మనం బాగా ఆలోచించి సరియైన నిర్ణయం తీసుకోవాలి." కుసుమ గుప్తుడు అందుకున్నాడు. "సామ, దాన, భేద, దండోపాయాల్లో మనకిపుడేది ఆచరణీయమో చూడాలి. మంచిమాటతో చెప్పాము. రాజగురువు భాస్కరాచారిని రాయబారిగా పంపి స్నేహ హస్తమందించాము. విష్ణువర్ధనుని భార్య, మంత్రులు చెప్పి చూశారు. సామ, దాన, భేదోపాయాలు ఫలించలేదు. మిగిలింది దండోపాయం."

"నిజమే నాన్నా ! అందుకు మమ్మల్ని అనుమతించండి."

కుసుమగుప్త దంపతులు మొహాలు చూసుకున్నారు. వాసవి నిర్వేదంగా తల పైకెత్తింది. కుసుమగుప్తుడు నిట్టూర్చాడు.

"కుమారా, శాంతించు ! యుద్ధమంటే మన అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకము." చూపులు వాసవివైపు మళ్లాయి. "ఆ విష్ణువర్ధనుడేమో కయ్యానికి కాలు దువ్వుతున్నాడు. మన సర్వ సైన్యాధిపతి గూడా యుద్ధానికి సేనలను సమాయత్త పరుస్తున్నాడు. సామంతరాజులంతా ఆ దుష్టుని పన్నాగం నెరవేరరాదని పట్టు పడుతున్నారు. దీనికి పరిష్కారమేమిటో తోచడం లేదమ్మా"

"నాకు తోచింది నాన్నా !" వాసవి కళ్లల్లో కాంతిరేఖలున్నాయి. మొహం నిర్మలంగా ఉంది. జడలోని పూలు చెవుల పక్కనుండి తొంగిచూస్తున్నాయి. తల్లిలో ఆశ మెదిలింది.

"అదేమిటో చెప్పు తల్లీ !" తండ్రి అడిగాడు.

"మనమంతా విధి చేతిలో కీలుబొమ్మలం నాన్నా !" వాసవి మాటల్లో ఆత్మ విశ్వాసము, గొంతులో ప్రశాంతత ఉంది. "ఈ సమస్యకు సరియైన పరిష్కారముంది. తుచ్ఛమైన ఏ శారీరక సౌందర్యాన్ని ఆ విష్ణువర్ధన మహారాజు కోరుకుంటున్నాడో ఆ పాంచభౌతిక శరీరాన్ని అగ్నిదేవునికి సమర్పించుకునుడే సరియైన పరిష్కారము."

ఆకాశం విరిగి నెత్తిమీద పడ్డట్టైంది ముగ్గురికి.

"అమ్మా ... వాసవీ !" వాసవాంబ చెవులు మూసుకుంది.

"తల్లీ ! ... అంటే నీ ఉద్దేశ్యం ... !" కడుపులో పేగులనెవరో కరకర కోసినట్టని పించింది కుసుమగుప్తునికి.

విరూపాక్షుడు నిశ్చేష్టుడయాడు.

"నా ఉద్దేశ్యం స్పష్టం నాన్నా !" వాసవి మోహమ్మీది ప్రశాంతత చెక్కు చెదర లేదు. "శ్రీ కన్యకా పరమేశ్వరి కృపతో అందరిముందు ఆత్మార్పణం చేస్తాను నాన్నా ! ఇరు సామ్రాజ్యాల్లో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలంటే దీన్ని మించిన పరిష్కారం మరోటి లేదు. శాంతి, అహింసలు శాశ్వతంగా నిలిచిపోతాయి" స్థిరంగా అంది.

"అక్కా ! ఏమిటీ అనర్థం ?" విరూపాక్షుని అంతరాళాల్లోని రోషావేశం తుఫానుగా మారింది. "అది పిరికివాళ్ల లక్షణం. వైశ్యజాతి ధైర్యసాహసాలకు, శౌర్య ప్రతాపాలకు పెట్టింది పేరు. కదనరంగములోకి దిగితే ... అరివీరుల కవోష్ణధారల్లో స్నానమాడుతాం. విజయమో, వీరస్వర్గమో ... అదే మన ఆశయం కావాలక్కా !"

కుసుమాంబ గుండెలు బాదుకుంది.

"వైశ్యజాతి ధైర్యసాహసాలను, శౌర్యప్రతాపాలను నేను శంకించడం లేదు తమ్ముడూ !" వాసవి మందహాసము. "ప్రస్తుత పరిస్థితిలో వాటినే ప్రధానమైనవిగా ఎన్నుకోలేము. ఎందుకంటే మనుషుల ప్రాణాలతో చెలగాటం. అదొక మారణహోమం. క్షాత్రవీర్యం, శౌర్యతేజం ... యుగయుగాలుగా మానవజాతిని ప్రభావితం చేస్తున్నవే. రక్తపాతానికి దారిదీస్తున్నవే. మనమీ కలియుగానికి నూతన సందేశమివ్వాలి. శాశ్వతమైన అహింసా సిద్ధాంతమే ఈ యుగానికి శాశ్వతానందాన్నిస్తుంది. అందుకిదే తరుణోపాయం. మన జాతికి శ్రేయస్కరం" గట్టిగా సమర్థించుకుంది. తల్లిదండ్రులు ఆందోళనగా చూస్తున్నారు.

"అంటే అక్కా ! ఎదుటివారు హింసామార్గములో మన మీదికి దూసుకొస్తుంటే మనం శాంతిమంత్రం పఠిస్తూ కూచుంటే సరిపోద్దా ?" నిలదీశాడు.

"కాదు తమ్ముడూ !" వాసవి చిరునవ్వు ... "హింసా ప్రవృత్తికి జవాబు హింసనే అయితే ఈ లోకమేమైపోతుందో తెలుసా ? ఎదుటివారిని హింసించే బదులు మనమే త్యాగనిరతి నవలంబిస్తే లోకకల్యాణానికి దారిదీస్తుంది గదా !"

కడుపు తీపి కన్నవారి మనసుల్ని కల్లోల పరిచింది.

"అమ్మా ... వాసవీ ! నా బంగారు కొండా !" కుసుమగుప్తుని మనసు నిలువ లేదు. "అంత కఠిన నిర్ణయమవసరమా తల్లీ !" గొంతు ఆర్ద్రమైంది. తల్లి తల బాదుకుంది.

"నాన్నా !" వాసవి వాలకంలో మార్పేమీ లేదు" మన భారత ఖండము పుణ్యభూమి. అహింసో పరమో ధర్మః అని ప్రపంచానికి మనమే చెప్పాలి. మాటలు

కాదు, చేతల ద్వారా నిరూపించాలి. జాతస్యః ధృవో మృత్యుః అంటుంది గదా భగవద్గీత. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదు. ఆర్ష ధర్మానికి ఆయువు పట్టుగా ఉన్న వర్ణాశ్రమ ధర్మాలను సరిగా అర్థం చేసుకుని ఆచరించాల్సిన సమయమిది. ధర్మాచరణకు ఏమాత్రం భంగం వాటిల్లరాదు. దేహం కంటే దేశం మిన్న. దేశ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడాలి గదా !" తాపీగా సముదాయించింది.

గుండె కరిగి నీరై, కుసుమాంబ కంటిధారలుగా బయటికొస్తోంది. వాసవి కంతా అర్థమైంది. మెల్లిగా నడిచి వెళ్లి తల్లి ముందు నుంచుంది. తన కొన కొంగుతో కంటి ధారలనద్దింది.

"అమ్మా !" ప్రేమగా పిలుస్తూ తల్లి చేతులందుకుంది. "కన్న కడుపు ఘోష నేనర్థం చేసుకోగలనమ్మా. కాని అన్నింటినీ మించిన ప్రజాహితాన్ని కాంక్షించి నేనీ నిర్ణయం తీసుకున్నాను. దయతో ఆశీర్వదించమ్మా !" చేతుల్ని నెత్తిమీదుంచుకుంది.

మౌనమే కుసుమాంబ సమాధానమైంది. తమ్మునివైపు తిరిగింది.

"తమ్ముడూ ! మనకు కన్పించే భోగభాగ్యాలకంటే చర్మచక్షువులకు కనిపించని మోక్షం ఎంతో విలువైంది. అధర్మాన్ని ధైర్యంగా ఎదిరించాల్సిందే. స్వచ్ఛంద దేహత్యాగము ధైర్యసాహసాలతో కూడుకున్నది. నా నిర్ణయం సాహసోపేతమైనది. అది అహింసా ధర్మాన్ని అక్షరాలా పాటిస్తుంది. ఇది మన అమ్మానాన్నలకు, నీకు బాధాకరమైనా రెండు సామ్రాజ్యాల ప్రజా సంక్షేమం దృష్ట్యా ఆమోదయోగ్యమైంది. నా ఒక్క ప్రాణత్యాగంతో వేలాది సైనిక కుటుంబాల దుఃఖాన్ని నివారించవచ్చు. ప్రజాసంక్షేమమే పరమావధిగా సాగుతున్న పాలనలో ఇది సమంజసమే తమ్ముడూ !" అర్థమయ్యేలా చెప్పింది.

పౌరుశావేశాలతో పొంగులెత్తిన విరూపాక్షుని నెత్తురు హంగులు మార్చుకుంది. సంయమనం లొంగదీసుకుంది.

"అక్కా ! నీ ఆలోచన బాగానే ఉంది గానీ దీంతో వైశ్యజాతి భవిష్యత్తెలా గుంటుందోనని అయోమయంగా ఉంది" అన్నాడు. మంద్ర స్వరంతో.

"అమ్మా ... వాసవీ !" అంతా అర్థమైనా కుసుమాంబ కన్న కడుపు తట్టుకోలేక పోతుంది. "ఎన్నో నోములు నోచి, పుత్రకామేష్ఠి చేసి నిన్ను పొందామమ్మా. గారాబంగా పెంచిన కన్నకూతురు సున్నిత శరీరము మా కళ్లముందే అగ్నిజ్వాలల కాహుతి అవుతుంటే ... ఆ కడుపు కోతను భరించలేమమ్మా ! నీ పెళ్లి వేడుకలను కళ్లారా చూడాలని, నువు పిల్లాపాపలతో పచ్చగా కళకళ లాడ్తుంటే చూసి సంతోషించాలని ఈ

మాతృహృదయం కలలు కన్నదమ్మా. కన్న కలలన్నీ ఘోరంగా విఫలమై కళ్లముందే కల్లలై పోతుంటే ఈ భూమ్మీద మేము సజీవంగా ఉండగలమా ?" వెక్కివెక్కి రోదిస్తోంది.

వాసవాంబ పెదాలమీద నిర్వేదమైన చిరునవ్వు మెరిసింది. మంచుపూలైన తల్లి కళ్లను అరచేతులతో తుడిచింది. ఆస్పర్ష ... అమోఘం ... అద్వితీయం. మానవ లోకములోని మాయామర్మాలను, కష్టసుఖాలను మరిపించే స్పర్ష. కుసుమాంబ శరీరంలో ఏదో శక్తి జరజరాపాకింది. చూపులు వాసవి మీదనే కేంద్రీకృతమైనాయి. అలనాడు బాలకృష్ణుని నోట్లో విశ్వదర్శనం చేసుకున్న యశోదలా ... మంత్ర ముగ్ధురాలైంది. అవాక్కై, నోరెల్లబెట్టి చూస్తుండి పోయింది.

"అమ్మా ! కన్నకడుపు ఆరాటం, నాకోసం మీ ఆవేదన అర్థమైందమ్మా !" తల్లి అరచేతుల్ని తన చెంపలకు రాసుకుంది. "మన వైశ్యజాతి త్యాగాలకు ప్రతీక గదమ్మా. త్యాగాన్ని మించిన సద్గుణం మరోటి లేదు. నశ్వరమైన ఈ లౌకిక ప్రపంచములో సుఖ భోగాలు, అనురాగాలు, ఆప్యాయతలు, అనుబంధాలు, ప్రేమాభిమానాలు, రాగ-ద్వేషాలు అన్నీ తాత్కాలికమైనవే. ప్రేమతో కూడిన త్యాగమే పరమాత్మకు, ఆ కన్యకాపరమేశ్వరికి ప్రియమైంది".

తండ్రి ముందుకొచ్చింది. తమ్ముని తలమీద అరచేత్తో రాసి, కుసుమగుప్తుని వైపు తిరిగింది.

"నాన్నా ! అమ్మా - నీవు కన్న ప్రేమను, తమ్ముడు సోదరి ప్రేమను, నేను నా శరీరంపై ప్రేమను త్యాగం చేస్తే లోకానికి మేలు జరుగుతుంది. నాఒక్క ప్రాణం కోసం ముగ్గురింతగా బాధపడుతున్నారు గదా ! యుద్ధములో వేలమంది సైనికులు ప్రాణాలర్పిస్తారు. వారి కుటుంబ సభ్యులు మరెన్నో వేలమంది ఇలాగే బాధపడ్తారు గదా ! అన్నివేల మంది దుఃఖాన్ని నివారించాలంటే ఈ త్యాగం తప్పదు. దీంతో మానవజాతి తలెత్తుకు తిరుగుతుంది. ముందు తరాల వారికి ఆదర్శంగా ఉంటుంది. పుట్టిన మనిషి భూమ్మీద ఎన్నాళ్లు బతికున్నాడనేది కాకుండా ఏం సాధించాడని ... ప్రజలు గుర్తు చేసుకుంటారు గదా ! మీరు భ్రాంతిని వదిలి ప్రశాంతంగా సంతోషంగా ఉండాలి. విధాత నిర్ణయాన్ని ఆహ్వానించక తప్పదు గదా నాన్నా !" అని చూపులు విరూపాక్షుని వైపు తిప్పింది.

"నీగ్గూడా అర్థమైంది గదూ !" అన్నట్టుగున్నాయా చూపులు. ఆ చూపుల్లో సౌందర్యలహరి తోణకిసలాడ్తోంది.

పద్మశయన సామ్రాజ్యములోని సామంతులు కొందరు రాచకార్యముకై రాజధానికి వచ్చి విడిదిలో కలుసుకున్నారు. విష్ణువర్ధన మహారాజు గురించి ప్రస్తావనకు వచ్చింది.

"మన సామ్రాజ్యాధిపతి మనసుపడ్డ మగువను అర్ధాంగిగా చేసుకోలేడా ! అది అతని పౌరుషానికే పరీక్ష" అన్నాడొకాయన.

"కాని ... ఆ మగువ సామాన్యురాలు కాదు. ధర్మాచరణకు ప్రతీకయైన కుసుమగుప్తుల వారి గారాల కూతురు. పెళ్లి చేసుకోనంటుందటా. ఏరి కోరి ఆమెపైనే కన్నువేయాలా ? ఆ పెనుగొండకు అతిథిగా వెళ్లి ఆ రాజకుమారినే బలవంతంగా పెళ్లాడ్తాననడం తిన్న ఇంటివాసాలు లెక్కబెట్టడమే గదా !" ఇంకో రాజన్నాడు.

మరో రాజు వేలి ఉంగరాలను సవరించుకుంటూ "మన మహారాజు క్కావాలంటే వాసవిని మించిన సుందరాంగులు ఈ రాజధానిలోనే దొరకగలరు. కావాలంటే మా రాజ్యం నుండి పంపిస్తాను. కానీ ... మహారాజు మనసులో వాసవే ఉంది. ధర్మాధర్మాల గురించి ఆలోచిస్తున్నారట. పెనుగొండలో బాలనగరు అమ్మాయిని బాలనగరుకే ఇచ్చి పెళ్లిచేసే ఆచారముందటా. ఆ సదాచారాన్ని ఇప్పుడు మానుకొమ్మంటే బాగుంటుందా?" అన్నాడు.

"ఏది ఏమైనా శారీరక సుఖం కోసం శాశ్వత ధర్మాన్ని కాదనడం, ఆడదాని కోసం అంతగా వెంపర్లాడడం అతఃపతనానికి దారిదీస్తుందేమో ! మన మహారాజు కేమవుతుందో !"

"ఏమవుతుందా ! మంచి మాటలు వింటే మనసు కుదుట పడుతుంది. లేకపోతే కొరివితో తలగోక్కున్నట్టే ... "

ఇవన్నీ వేగుల ద్వారా మహారాణి విమలాదేవి వింటోంది. సామాన్యులు గూడా తన భర్త ప్రవర్తన నామోదించడము లేదని తెలిసింది. రాబోయే అనర్థాన్ని ఇప్పుడే అరికట్టాలనుకుంది.

అంతఃపురములో గురువు, మిత్రమండలి, ఇతర ప్రముఖులతో సమావేశమేర్పాటు చేసింది. అందరికీ సవినయంగా చేతులు జోడించింది.

"మహాశయులారా ! మీరు పద్మశయన సామ్రాజ్య భవనానికి మూలస్తంభాలు. సామ్రాజ్య హితాన్ని కాంక్షించేవారు. పాలకుల స్వభావం పరిపాలనపై ప్రభావం చూపుతుంది. మన మహారాజు వింతకోరిక, వితండవాదము, మొండి పట్టుదల గురించి మీకందరికీ తెలిసిందే." బాధనంతా దిగమింగి విషయాన్నంతా వివరించింది. "మనమెవ్వరం ఎంతచెప్పినా మహారాజు మనసు మారలేదు. మహారాజు పతనమైతే

రాజ్యపాలన స్తంభించిపోతుంది. ఇదే అదునుగా శత్రురాజ్యాలవారు మన రాజ్యాన్ని కబళించవచ్చు. కాబట్టి మహారాజు మనసు మళ్లించడానికేదైనా ఉపాయ మాలోచించి సలహా ఇవ్వండి.” గంభీరంగా అడిగింది.

కాస్సేపు చర్చ, సమాలోచన జరిగింది.

విమలాదేవి అంతరంగములోని తుఫాను ఛాయలు మొహమ్మీద తచ్చాడుతుంటే ముత్యాల ముక్కుపుడక మేఘాల మధ్య మెరుపులా కనిపించింది. అందరి దృష్టి రాజగురువు వైపు మళ్లింది.

“గురుదేవా !” ప్రధాన మంత్రి విజయసింహుడు అందుకున్నాడు.

“ఈ సంకట సమయంలో మార్గదర్శనం చేసి రాణిగారి మనస్తాపాన్ని, సామ్రాజ్యానికి దాపురించిన సంకట పరిస్థితిని దూరం చెయ్యండి.” సవినయముగా అడిగాడు.

రాజగురువు మొహం బ్రహ్మతేజస్సుతో వెలిగి పోతోంది. తెల్లని గెడ్డాన్ని సాలోచనగా నిమురుకున్నాడు. కాస్సేపు భృకుటి ముడిపడింది. అర్ధ నిమీలిత నేత్రాల్లో ఆశాకిరణం పొడసూపింది.

“మనకు మిగిలిందొక్కటే మార్గం.” గురువుగారి కళ్లు పూర్తిగా తెరుచుకున్నాయి. “రాజకుమారుడు రాజనరేంద్రుని గురుకుల విద్యాభ్యాసం ముగిసింది. ఆ చిరంజీవిని రప్పించి మహారాజుతో మాట్లాడించి చూస్తే సత్ఫలితము రావచ్చు.”

నిజమే. కట్టుకున్న భార్య మీదున్న ప్రేమకంటే కన్నకొడుకు మీది వాత్సల్యం మిన్న కావచ్చు. మహారాజు మనసు మారవచ్చు. ప్రతిపాదన నందరూ ఆమోదించారు.

రాజనరేంద్రుడు విద్యావంతుడై గురుకులము నుండి వచ్చేశాడు. ఉరకలేస్తున్న ఉడుకు రక్తంతో హుషారుగా ఉన్నాడు. అందరి మాటలు విన్నాడు. తండ్రి కోర్కె, తల్లి ఆవేదన, మంత్రుల అయోమయం అవగాహనకొచ్చింది. ఉత్సాహంగా తండ్రి వద్ద కేగి పాదాభివందనం చేశాడు.

విష్ణువర్ధనుడు ఆనందముతో కొడుకును అక్కున చేర్చుకున్నాడు. ముగిసిన విద్యాభ్యాసం, యోగక్షేమాలడిగి తెలుసుకుంటుంటే వాత్సల్యం జాలువారింది. రాజనరేంద్రుడు అసలు విషయానికొచ్చాడు.

“నాన్న గారూ ! మీ మానసిక పరిస్థితి ఓ ఆడదాని కారణంగా డోలాయమాన మైందని తెలిసింది. దయచేసి మిమ్మల్ని, మన సామ్రాజ్యాన్ని కలవరపెడుతున్న మగువను

మీ మనసు నుండి పారదోలండి. మన మంత్రులు, ప్రజావళి మనోభావనలను మన్నించండి." చేతులు జోడించాడు.

"కుమారా !" మహారాజు మనసు భగ్గుమంది. "అది అసంభవం, అసాధ్యం" అరిచాడు. "తండ్రి మనసెరిగి ప్రవర్తించడం తనయుని బాధ్యత." కళ్లల్లో ఎర్ర జీరలు కనబడుతున్నాయి. కోపంతో మొహం ఎర్రబారింది. కనుగుడ్లు గుచ్చకాయల్లాగున్నాయి.

రాజనరేంద్రుడు హడలి పోయాడు.

"కానీ... మహారాజా !" ధైర్యం కూడగట్టుకున్నాడు. "మీరు రాజనీతిజ్ఞులు. అన్నీ తెలిసినవారు. కేవలం ఓ ఆడదాని కోసం అనర్థాన్నాహ్వానించడం బాగుంటుందా ? మన శ్రేయోభిలాషులెవ్వరూ హర్షించడము లేదునాన్నా !."

"కుమారా ! నీకింకా లోకజ్ఞానం తెలియదు. ఏ విషయాన్నెలా పరిగణించాలో, ఏ సమస్యనెలా పరిష్కరించాలో నాకు బాగాతెలుసు. నువ్వీ విషయంలో తలదూర్చవద్దు." హెచ్చరించాడు.

"నాన్నా !" రాకుమారుడు పట్టువీడలేదు. "రావణబ్రహ్మ వేదపారంగతుడు, గొప్ప శివభక్తుడు. పరిపాలనా దక్షుడు గూడా. అంతటి సర్వజ్ఞుడు గూడా ఓ ఆడదాని మూలంగా సర్వనాశనమై చరిత్రహీనుడయ్యాడు తెలుసుగదా !....."

"కుమారా !" భవనం దద్దరిల్లింది. "ఈ విషయంలో నాకెవ్వరూ సలహాలివ్వాల్సిన అవసరం లేదు. నీతులు చెప్పాల్సిన అగత్యం అంతకన్నా లేదు. ఇప్పుడు నా మనసులో వాసవికి తప్ప మరి దేనికీ చోటులేదు. ఇంతచిన్న కోర్కెను తీర్చుకోలేని బలహీనుడుగా చరిత్ర సృష్టించలేను. మిగిలిన కొద్దిపాటి గడువులోగా కుసుమగుప్తుని మనసు మారవచ్చు. మీరంతా ఎవరి విధులు వారు నిర్వహించాలని ప్రధాన మాత్యునికి చెప్పండి. పద్మశయన సామ్రాజ్యాధిపతి బలహీనుడని ప్రపంచానికి తెలిస్తే మన మనుగడ ప్రమాదములో పడుతుంది." చెప్పేసి చరచరా లోపలికెళ్లిపోయాడు.

పద్మశయన సామ్రాజ్యం ప్రమాదాన్నెదురుకోబోతోందని రాజనరేంద్రుని కర్థమైంది. తన ప్రయత్నాన్ని, తండ్రి వైఖరిని అందరికీ తెలియజేశాడు. అంతా హతాశులైనారు. అయినా సామ్రాజ్యం గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకోవాలనే పట్టుదల అందరిలోనూ వ్యక్తమైంది. రాజగురువు కల్పించుకొని

"ఎందుకైనా మంచిది రాజకుమారుణ్ని యువరాజుగా పట్టాభిషేకం చెయ్యాలి." సలహా ఇచ్చాడు మహారాణికి.

మంత్రిమండలి, మహారాజుతో సహా అందరూ ఆమోదించారు. విష్ణువర్ధనుడు సంతోషముతో

"నా కుమారుడు రాజ్యపాలనలో చేదోడు వాదోడుగా ఉంటాడిక. రాజగురువు గారి సలహాతో ముహూర్తం నిర్ణయించండి." ప్రధానమంత్రి నాజ్ఞాపించాడు.

వేదపండితులను సమావేశపరిచి చర్చించి రాజగురువు ముహూర్తం నిర్ణయించాడు. సామంత రాజులందరికీ ఆహ్వానాలు పంపారు. ముహూర్తానికి ముందే అంతా వచ్చేశారు. రాజనరేంద్రుని స్ఫురద్రూపం, తెలివితేటలు అందరినాకట్టుకున్నాయి. పద్మశయన సామ్రాజ్యానికి సమర్థుడైన వారసుడు లభించాడని అంతా గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నారు.

భారత ఖండములోని పుణ్య నదుల నుండి పవిత్ర జలాలు తెప్పించారు. సుముహూర్తం దగ్గర పడుతుంది.

మహారాణి విమలాదేవి మానసికస్థితి విచిత్రంగా తయారైంది. కన్నకొడుకు యువరాజవుతున్నాడనే సంతోషం ఒక కంట ఆనంద బాష్పాలు రాలుస్తుంటే... భర్త వాలకం మరో కంట దుఃఖాశ్రులు రాలుస్తుంది. హృదయం నిండా పరితాపం, పెదాల నిండా చిరునవ్వుతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

మంగళవాద్యాలు మోగుతున్నాయి. వేద మంత్రాలు పఠిస్తున్నారు. సామంత రాజులు కొలువుదీరి ఉన్నారు. యువరాజు సింహాసనంపై రాజనరేంద్రుడాసీనుడయ్యాడు. రాజగురువు, విష్ణువర్ధన మహారాజు చెరో పక్కనున్నారు. వేదమంత్ర సహితముగా పుణ్యనదీ జలాలను రాకుమారునిపై చల్లారు. మహారాజు దంపతులు ఆశీర్వదించారు. రాజగురువు గూడా వేదమంత్రాలు పఠిస్తూ రత్నఖచిత యువరాజు కిరీటాన్ని రాజనరేంద్రుని శిరస్సు నలంకరింపజేశారు.

యువరాజు రాజనరేంద్రుల వారికి జై... నినాదాలు మిన్ను ముట్టాయి. దాన ధార్మాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. యువరాజు పట్టాభిషేకోత్సవం కన్నుల పండుగగా ముగిసింది.

కన్నకూతురు దేహత్యాగం చేస్తానన్న నిర్ణయం కన్నకడుపులో చిచ్చుపట్టింది. మొదట వాసవి సముదాయింపు మాటలతో మనసు రాజీపడినా ఆ తర్వాత పరిపరి విధాల పరితపించి పోతోంది.

కుసుమగుప్త దంపతులు విచారవదనాలతో పూజాగదిలో కెళ్లి శ్రీ కన్యకా పరమేశ్వరి విగ్రహం ముందు మోకరిల్లారు.

కన్నీటి పొరల్లోంచి కన్యకాపరమేశ్వరిని చూస్తూ కుసుమాంబ

"ఏమిటమ్మా ఈ విషమపరీక్ష ? కన్నకూతురు జీవితం మూడు పూవులారు కాయలుగా వికసిస్తూంటే చూసి సంతోషించాలని ప్రతి తల్లిదండ్రులూ కోరుకుంటారు గదా ! మరి మాకెందుకమ్మా ఈ కడుపుకోత ?" దీనంగా అడిగింది.

"వాసవి నీ వరప్రసాది గదమ్మా !" కుసుమార్యుని గుండె చెరువైంది. "కూతురు నిండుబతుకు మంటల్లో మాడిపోతుంటే మా గుండెలు బద్దలు కావా తల్లీ ? కూతుర్ని పోగొట్టుకుని మేమీ భూమ్మీద ఉట్టిగట్టుకుని ఊరేగాలా ?" ప్రశ్నించాడు.

విగ్రహానికి రెండు పక్కల వెలుగుతున్న దీపకాంతులు అమ్మవారి ముఖవర్చస్సును దేదీప్యమానం చేస్తున్నాయి. మెడలో స్వర్ణాభరణాల మీదున్న మందారమాల చిరునవ్వులు చిందిస్తోంది. ఆ చిరునవ్వుల్లో కుసుమాంబకేదో సందేశం గోచరించింది. అలాగే మోకాళ్లపై కూచుని కొంగుతో కళ్లద్దుకుంది.

"మహారాజా ! నేను గూడా వాసవితోపాటు దేహత్యాగం చేస్తాను. దయచేసి అనుమతించండి" భర్తనడిగింది.

మోకాళ్లమీదనే కూచుని ఉన్న కుసుమార్యుని అంతరంగములో నూతన తరంగం ఎగిసిపడింది. మొహంలో రంగులు మారాయి. కొత్త ఆలోచన తాలూకు మెరుపు ఆ రంగుల్లో హంగులు చూపింది.

"అవును మహారాణీ ! ఒంటరిగా కాదు, మనం జంటగా వాసవి వెంట దేహత్యాగం చేద్దాం" కళ్లల్లో ఆనందం.

"మీరెందుకు మహారాజా ?" ముత్యాల ముక్కుపుడక తళుక్కుమంది.

"మరి తమరెందుకు మహారాణీ ?" భుజకీర్తులు మిలమిలలాడాయి. ఇద్దరూ మొహాలు చూసుకున్నారు. కళ్లల్లో నూతన కాంతులు ద్యోతకమైనాయి. మనసుల్లోని ఆవేదన మటుమాయమై మందహాసముగా రూపాంతరము చెందింది.

"మీ నిర్ణయం చాలా బాగుంది మహారాజా !" తృప్తిగా ఊపిరి పీల్చుకుంది." "మనం గూడా మనమ్మాయి వెంట దేహత్యాగం చేసేందుకు అమ్మవారి ఆశీస్సులందు కుందాము."

జంటగా వంగి అమ్మవారి పాదాల మీద తలలుంచారు. కిటికీలోంచి గాలి కెరటమొకటి రివ్వున చొచ్చుకొచ్చి ఎగిరి పడింది. రెండు పూలు అమ్మవారి మెడలోని

మాలను వీడి దంపతుల తలలపై వాలాయి. పూలను చేతుల్లోకి తీసుకుని లేచి కూచున్నారు. ఆనందముతో కళ్లకద్దుకున్నారు. ఇద్దరిలో నూతనోత్తేజం పరుగులు తీసింది. కుసుమాంబ భర్త కళ్లలోకి చూస్తూ "మహారాజా ! అమ్మవారు మన ప్రతిపాదన నామోదించి ఆశీర్వదించింది గదూ !" గుండెల మీద చెయ్యేసుకుంది.

"అవును మహారాణీ ! మన జీవితాలు ధన్యం కాబోతున్నాయి" హుషారుగా భార్య చేతులందుకున్నాడు.

నాలుగు కళ్లు ఒకటైనాయి. రెండు నిండు గుండెలు ఒకటైనాయి. చూపుల్లో ఉత్సాహం ... తమలో తామే నవ్వుకున్నారు. అమ్మవారికి మరోసారి మోకరిల్లారు. గుండెల్లోని బాధనంతా అమ్మవారి పాదాలచెంత వదిలేసి బయటి కొచ్చారు.

# 16

పెనుగొండ నగర ప్రజావళి ఎదపొదల్లో అలజడి చెలరేగింది. అందరూ వాసవి గురించే ఆలోచిస్తున్నారు. నగరేశ్వరాలయ ప్రాంగణము నాగరికులతో నిండి పోయింది. సామంతరాజులు, నగరస్వాములు, సామ్రాజ్యములోని ప్రముఖులంతా ఉన్నారక్కడ. విష్ణువర్ధనుని కరవాల ప్రహారాల నూహించుకుని, భీతిల్లి తోటి వారలతో విభేదించిన నిషేధ వైశ్యులెవ్వరూ లేరక్కడ. వారంతా పంతాలు, పట్టింపులు వీడలేక పట్టణం వదిలి పారిపోయేందుకు తయారవుతున్నారు. దీనికంతకూ కారణం నువ్వంటే నువ్వని ఒకరినొకరు నిందించుకుంటున్నారు. తగవులాడుకుంటూ మూటాముల్లె సర్దుకుంటున్నారు. తెగిన హారము నుండి రాలిపడిన ముత్యాల్లా చెల్లాచెదురై పోతున్నారు.

నగరేశ్వరాలయం చుట్టూ కాపలాకాస్తున్న తరుతరుణులు విరబోసుకున్న కొమ్మలు, రెమ్మలతో తలలాడిస్తూ సమావేశాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. నగరేశ్వర స్వామిగా కొలువుదీరిన పరమేశ్వరుడు గర్భగుడిలోంచి అంతా గమనిస్తున్నాడు. విధాత లీలావిలాసాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తున్నాడు.

రాజగురువు భాస్కరాచారి తన ఆసనమ్మీదున్నాడు. ఉచితాసనమ్మీదున్న కుసుమగుప్తుడు సభాసదుల వాలకాన్నోసారి విహంగవీక్షణం గావించాడు. మనసారా గురువు గార్కి నమస్కరించి ప్రారంభించాడు.

"మాన్యులారా ! పెనుగొండ సామ్రాజ్య నగరస్వాములారా ! వైశ్యోత్తములారా! విష్ణువర్ధనుడు మంకుపట్టు వీడలేదు. సమరాంగణములోనే తాడోపేడో తేల్చుకుంటా నంటున్నాడు. వర్ణాశ్రమధర్మాలను రక్షిస్తూ ఆత్మాభిమానమే మూలధనంగా భావిస్తున్న మనం శౌర్య సాహసాల్లో ఎవరికీ తీసిపోము. కాని ... శాంతి, అహింసలు ఈ కలియుగ

రథానికి రెండు చక్రాల్లా ఉండాలని ఆశిస్తున్నాము. అదేప్రాతిపదికపై పాలన సాగిస్తున్నాము. ఈ సిద్ధాంతము భవిష్యత్తులో భారతావనిని శ్రేయోరాజ్యంగా ఉంచుతుందని భావిస్తున్నాము. సమరం శాంతి – అహింసా సిద్ధాంతాన్ని బలపరచదు. ఈ మధ్యనే అవతరించిన గౌతమబుద్ధుడు జీవనమూల్యాలివేనని ప్రతిపాదించాడు. మన జాతినుద్ధరించేందుకు జన్మించిన వాసవి వాటిని ప్రాతిపదికగా తీసుకుంది. దివ్యమైన ఈ ఆలోచనను మనమంగీకరించాము. అమలు పరుస్తున్నాము. పవిత్ర గోదావరి తీరము రక్తసిక్తము కావద్దు. అలాగని విష్ణువర్ధనునికి దాసోహమనలేము ...”

“ఆ రెండూ కాక మూడో మార్గమేముంది మహారాజా ?” ఓ నగరస్వామి సవినయంగా అడిగాడు.

“ఉంది మిత్రమా ఉంది. మా గారాల కూతురు వాసవి ఆత్మాహుతే అనగా దేహత్యాగమే ఈ సమస్యకు సరియైన పరిష్కారం. అది ఆమె నిర్ణయమే. వాసవితోపాటు నేను, నా భార్య గూడా అగ్నిప్రవేశం చేస్తాము. ఇది మా నిర్ణయము. దీనికి మన గురువుగారు, మీరంతా ఆమోదం తెలపాలని వేడుకుంటున్నాము.”

సభ ఉలిక్కిపడింది. సభాసదులంతా దిగ్భ్రాంతికి లోనయారు. అనూహ్యమైన ప్రతిపాదన అందరినీ కలవరపెట్టింది. తమలో తాము ముచ్చటించుకున్నారు.

“వీల్లేదు మహారాజా !” ఓ సామంతరాజు మనసు చివుక్కుమంది. దబుక్కున లేచి నుంచున్నాడు. “ఇంట్లో ఎలుకలున్నాయని ఇంటికి నిప్పు పెట్టుకుంటామా ? దుష్టునికి గుణపాఠం అతని అంతమేకావాలి గాని శిష్టుల ప్రాణత్యాగం పరిష్కారమా ?” సూటిగా అడిగాడు.

“ఎలుకలున్నాయని ఇంటికి చిచ్చు పెట్టడము కాదు గానీ ఎలుకలకేమీ దొరక్కుండా చెయ్యడమే శాంతియుత పరిష్కారం గదా !” కుసుమగుప్తుని దృష్టి గురువు గారివైపు మళ్లింది. “సుఖశాంతులతో పరిఢవిల్లుతున్న పెనుగొండ సామ్రాజ్యములో రక్తపుటేరులు ప్రవహింపజేసి భీభత్సము సృష్టించే కంటే అశాశ్వతమై దేహాన్ని అగ్నిదేవుని కర్పించడమే మేలు గదా ! ఈ లోకములో త్యాగాన్ని మించిన మహత్కార్యం మరోటి లేదు గదా !”

భాస్కరాచారి అంతా వింటూ అందరి హావభావాలను మనోనేత్రాలతో చదివేస్తున్నాడు. బాలనగరుల్లో కలకలం బయలుదేరింది. పౌరుషం బుసలు కొట్టింది.

“అయితే మహారాజా ! కామాంధుని కుత్తుక నుత్తరించాలని ఉవ్విళ్లూరుతున్న మా కరవాలము ఒరలో దాగుండవలసిందేనా ?” ఓ బాలనగరు సూటిగా అడిగాడు.

"చిరంజీవీ !" కుసుమగుప్తుని గొంతులో తొణుకు, బెణుకు లేదు. "సమస్య పరిష్కారానికి మరోదారి లేనప్పుడు మాత్రమే కరవాలము ఒరలోంచి బయటికి రావాలి. దుర్మార్గుల తలల్ని చీల్చిచెండాడాలి. సామూహిక ప్రజాసమస్య తలెత్తినప్పుడు ... చివరిది మాత్రమే దండోపాయము. చీటికి మాటికి రక్తాన్ని కళ్లజూడ్డం వీరుల లక్షణం కాదు". అందరినోసారి అవలోకిస్తూ మందహాసము చిందించాడు. "వైశ్యజాతి శ్రేయస్సును, పెనుగొండ సామ్రాజ్య సంక్షేమాన్నాశించే ఇంతటి సాహసోపేత నిర్ణయం తీసుకున్నాము. మన వైశ్యజాతి శాంతిసౌభాగ్యాల కల్పవల్లిగా ఆచంద్రతారార్కం వెలగాలనేదే మా ఆశయం. దయచేసి మీరంతా అనుమతించాలని వేడుకుంటున్నాను".

బాలనగరుల్లోని ఆవేశం రాజీపడింది. ఆలోచన జాగృతమైంది. అంతా విరూపాక్షుడిని చూస్తూ మిన్నకున్నారు. నగరస్వాములు, సామంత రాజ్యాధిపతులు సైగలతో గుసగుసలతో సంప్రదించుకున్నారు. నిర్మొహమాటంగా చర్చసాగింది.

వైశ్యజాతి ఆత్మాభిమాన సంరక్షణ కోసం సామ్రాజ్యాధిపతి భార్య, పుత్రికతో దేహత్యాగం చేస్తుంటే మనమంతా అమాయకుల్లా, రోషం లేని బలహీనులుగా చూస్తూ గుండెలు బాదుకుందామా ? వారితోపాటు మన నూటారెండు గోత్రాల సిద్ధవైశ్యుల మంతా త్యాగం చెయ్యాలి. ఒక్కో గోత్రం నుండి ఒక్కో జంటనన్నా అగ్నిప్రవేశం చేసి కన్యకాపరమేశ్వరి కృపాకటాక్ష వీక్షణాలతో మోక్షపథములో పయనించాలనుకున్నారు.

జ్ఞాన వృద్ధుడైన ఓ నగరస్వామి అందరి తరపున లేచి సభకు నమస్కరించాడు. "మహారాజా ! గురువర్యా ! పెనుగొండ వెలుగులారా ! మన మహారాజు కుసుమ గుప్తుల వారి వాదనలో అర్థముంది. కాని ఇంతటి మహత్కార్యానికి తామొక్కరే పూనుకోవడం, మేమంతా నిష్క్రియులమై చూస్తుండడం సబబుగా ఉండదు. వైశ్యజాతి ఆత్మాభిమాన సంరక్షణ మనందరి బాధ్యత. మనమంతా అభిమాన ధనులం. మన బాలనగరులు, సేనాపరివారము తలుచుకుంటే విష్ణువర్ధనుడు, అతని సామ్రాజ్యం కకా వికలమైపోతుంది. కాని శాంతి సంరక్షణే ధ్యేయంగా అహింసా మార్గాన పయనించా లనుకున్న మనమంతా మహారాజు గారి కష్టసుఖాలను కలిసి పంచుకుందాము. వైశ్యులమంతా ఒక్కో గోత్రానికొక్కొక్క జంట మన వాసవి వెంట అగ్నిప్రవేశం చెయ్యడం భావ్యం. ఇదే వైశ్యజాతి సమైక్యతకు, త్యాగశీలతకు తార్కాణం కావాలి" అందరి అభిప్రాయాన్ని బహిర్గతం చేశాడు.

సనందన గోత్రీకుడైన హరిష్ఠుడు ధైర్యంగా సభనుద్దేశించి

" ఏది ఏమైనా కాని విష్ణువర్ధనునికి కన్యనివ్వరాదని మనమంతా కలిసి

నిర్ణయించాము. అలాగే నగరేశ్వరస్వామి - వింధ్యవాసిని, జనార్ధనస్వామి - కోన కమలాదేవిల సాక్షిగా మనం దేహత్యాగం చేసి వైశ్యజాతి పట్టుదల - ప్రతాపాన్ని విశ్వ వ్యాప్తం చేద్దాము. ధర్మాన్ని రక్షించుదాం” సగర్వంగా ప్రకటించాడు.

జగన్నాథ పురాధీశుడు, సిద్ధవైశ్యులలో ప్రముఖుడైన భద్రశ్రేష్ఠి మనసు ఆనంద డోలిక లూగింది. గతం కళ్లల్లో కదిలింది.

“ఆత్మ బంధువులారా !” కంటి చూపులతో అందరినీ తడుముతూ రత్నాలు పొదిగిన తలపాగా బిళ్లను తడుముకున్నాడు. “గతములో చాలాకాలము నేను శ్రీమన్నారాయణున్ని భక్తిశ్రద్ధలతో పూజించాను, ప్రార్థించాను. దయాసాగరుడైన శ్రీమహా విష్ణువు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకొమ్మన్నాడు. నేను మోక్షము కావాలన్నాను. ఆ స్వామి కరుణించి

“నీకు మోక్షం సిద్ధిస్తుంది. కాని ఇప్పుడు కాదు. నీ వైశ్యజాతిలో ప్రముఖుడొకాయన ఓ కన్యతో అగ్నిప్రవేశం చేస్తాడు. అప్పుడే నీవు గూడా నీ భార్యతో కలిసి వారి ననుసరిస్తే మోక్షం ప్రాప్తమవుతుంది” అని వరమిచ్చాడు.

నాకిప్పుడు ఆనందముగా ఉంది. నేను తప్పకుండా సతీ సమేతంగా అగ్నిప్రవేశం చేస్తాను. ఆ దుష్టబుద్ధి విష్ణువర్ధనుని మంకుపట్టు ఫలితంగా మేము అగ్నిప్రవేశం చేసి మోక్షాన్నందుకో బోతున్నాము. ఇది ప్రపంచ చరిత్రలో వైశ్య ప్రాభవాన్ని చాటుతుంది” మురిసి పోయాడు.

మరో నగరస్వామి రోషంగా లేచి నుంచున్నాడు.

“భద్రశ్రేష్ఠి మహాషయా ! మోక్షం మీకు మాత్రమే కాదు. అగ్నిప్రవేశం చెయ్యబోతున్న మన నూటారెండు గోత్రీకుల సిద్ధవైశ్యులందరికీ లభించబోతుంది. ఇంతకు ముందెన్నడూ ఎవ్వరు చేయని సాహసాన్ని మన వైశ్యజాతి చెయ్యబోతుంది. ఇందు కంగీకరించని వారు ఈ సభ నుండి ఇప్పుడే వెళ్లిపోవచ్చు” అలవోకగా చెప్పేశాడు.

ఏమి జరుగబోతున్నదో చూడాలని నిషిద్ధవైశ్యుల్లోని కొందరు ముందేవచ్చి కూచున్న సంగతి అందరికీ తెలిసిపోయింది. వారంతా నిరాశతో చెవులు కొరుక్కున్నారు. వారిని బాలనగరులు గుర్తించి సైగలు చేసుకున్నారు. విరూపాక్షుడు హుంకరిస్తూ

“మీరింకా ఇక్కడే కూచుంటే తీవ్ర పరిణమాన్నెదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సభ నిర్ణయాని కిష్టపడనివారు వెంటనే వెళ్లిపోవాలి” కత్తిపై చెయ్యేశాడు.

చెవులు కొరుకున్న వారంతా లేచి ప్రాణాలరచేతిలో పెట్టుకుని బయటికెళ్లి పలాయనం చిత్తగించారు.

మరికొద్దిసేపు చర్చ జరిగింది. తీర్మానం ఏకగ్రీవమైంది. కుసుమగుప్తుడు భాస్కరాచారికి నమస్కరించి

"గురువర్యా ! సభ అభిప్రాయం విన్నారుగదా ! దయచేసి మీ సందేశంతో మాకు మార్గదర్శనం చెయ్యండి" అన్నాడు.

భాస్కరాచారి గంభీరదృక్కులు శూన్యంలోకి చొచ్చుకుపోతున్నాయి. విధాతకు మనసులోనే నమస్కరించాడు. అర్ధనిమీలిత నేత్రాలు శిష్యుల మనోభావాలను పసికట్టాయి. కుసుమగుప్తుని కళ్లల్లో ముందటి కళాకాంతులు నామమాత్రంగానే ఉన్నా దృఢ నిర్ణయం తాలూకు ఛాయలు గాంభీర్యాన్ని ప్రోది చేస్తున్నాయి.

గురువు గారేం చెబుతారోనని అందరిలో ఉత్కంఠ, ఉద్విగ్నతలున్నాయి. అందరి చూపులు గురువుగారి మీదున్నాయి.

"నాయనలారా !" భాస్కరాచారి కళ్లల్లో గతం తాలూకు ఛాయలున్నాయి. "కన్యకా పరమేశ్వరి అమ్మవారు నా ద్వారా మీకు ఆశీస్సులందిస్తుంది" చేతులెత్తి అందరినీ ఆశీర్వదించాడు. "ఇది ఇలా జరగడానికో నేపథ్యముంది. అది మీకు తెలిస్తే మనసుల్లోని ఆందోళన మాయమవుతుంది. జరగాల్సిందేదో జరిగిపోతుంది" అన్నాడు గంభీరంగా.

"గురుదేవా ! మీరు సాక్షాత్తు బ్రహ్మాంశ సంభూతులు. ఆ నేపథ్యమేమిటో మాకందరికీ తెలియజేసి ఆశీర్వదించండి" కుసుమగుప్తుడు సవినయంగా అడిగాడు.

"అయితే వినండి" భాస్కరాచారి గొంతు సరిజేసుకున్నాడు. "మన కుసుమగుప్త మహారాజు జన్మించినపుడు కుసుమవర్షము కురిసింది. కుసమాలలో కళ్లు తెరిచిన వాడు కాబట్టి కుసుమగుప్తుడనే నామకరణం చేశారు. అలా పుష్పవర్షం కురియడానికో నేపథ్యముంది. అది గూడా వినండి.

సృష్టి జరిగింతర్వాత ఒకప్పుడు వైశ్యులంతా మణిద్వీపములో నివసించారు గదా ! అప్పుడో యక్షుడు కుబేర అంశతో సోమదత్తుడనే వైశ్యోత్తముడుగా జన్మించాడు. కుబేర అంశతో జన్మించాడు కాబట్టి సంపదలకు కొదవలేదు. అతని భార్య ప్రభావతి. ఆమెనే సుశీల అని గూడా పిలిచేవారు. సోమదత్తుడినే సోమకాంతుడని గూడా పిలిచేవారు.

సోమదత్త – ప్రభావతులది అన్యోన్య దాంపత్యం. వారోసారి ఆదిశక్తి రూపమైన కన్యకాపరమేశ్వరి దర్శనానికి వెళ్లారు. అప్పుడే దేవరాజు ఇంద్రుడు తన భార్య శచీదేవితో అక్కడికొచ్చాడు. ఆదిశక్తిని పూజించి ఆశీస్సులందుకున్నాడు.

పచ్చిపాలలో సాయపసుపు రంగరించిన దేహఛాయ, పూర్ణ వికసిత పద్మకాంతిని

తలదన్నే ముఖ వర్చస్సు, ధవళ వర్ణం అరికాళ్లు, ప్రణవనాదాన్ని ప్రతిధ్వనిస్తున్న పాద మంజీరాలు ... హంస నడకతో దేవగణాన్ని అబ్బురపరిచే శచీదేవి అందచందాలను తనవిదీరా చూసి నూతన దంపతులైన సోమదత్త – ప్రభావతులు పొంగిపోయారు. ప్రభావితులయారు. ఆదిశక్తికి చేతులు జోడించి

"అమ్మా ! ఈ అందాలరాశి శచీదేవి మా కూతురుగా జన్మించేలా ఆశీర్వదించు" మని ప్రార్థించారు.

ఆదిశక్తి సంతోషించి "తథాస్తు" అంది.

శచీదేవి – ఇంద్రుడు గాబరాగా మొహాలు చూసుకున్నారు.

"అమ్మా ! ఆదిశక్తీ ! ఇదేమిటి తల్లీ ? నేను వీరి కూతురుగా జన్మించాలా ?" వణికిపోతూ అడిగింది శచీదేవి.

"తల్లీ ! నాభార్య వీరి కూతురుగా జన్మిస్తే మరో మగాడిని పెళ్లాడాల్సి వస్తుంది. అది నేను భరించలేనమ్మా !" ఇంద్రుని మొహంలో రంగులు మారాయి.

ఆదిశక్తి తనలోతానే నవ్వుకుంది. నలుగురూ ఆసక్తిగా ఆమెనే చూస్తున్నారు. కన్యకా పరమేశ్వరి రూపములో ఉన్న ఆదిశక్తి

"శచీదేవీ ! ఆనాడు బ్రహ్మదేవుడు నీవద్దకొచ్చాడు. నీ కుమారుడు జయంతుడిని శతజిహ్వుడనే రాక్షస సంహారానికై తనవెంట పంపుమన్నాడు. దానికి నీవు నిరాకరించావు. తనయుని మీది మమకారం లోకహితాన్ని మరచింది. ఫలితంగా నీవు భూలోకములో జన్మించుమని బ్రహ్మ శపించాడు. గుర్తుంది గదూ ! ఆ శాపం ఊరకే పోతుందను కున్నావా ! ఆ శాపము అమలయేందుకే వీళ్లనలా ఆశీర్వదించాను" గతం విప్పి చెప్పింది.

నలుగురూ ఒకరినొకరు అయోమయంగా చూసుకున్నారు.

"అయోమయంగా ఉంది గదూ !" ఆదిశక్తి మళ్లీ అందుకుంది. "ఈ సోమదత్తుడు – ప్రభావతి దంపతులు కలియుగారంభములో భూలోకములో జన్మించ బోతున్నారు. పార్వతీదేవి నా అంశతో వీరి కూతురిగా జన్మించాలని ఇదివరకే అనుగ్రహించాను. పార్వతీదేవి ఈ శచీదేవి రూపలావణ్యాన్ని, అందచందాలను పుణికి పుచ్చుకుని వీరి కూతురుగా జన్మిస్తుంది" అయోమయం తొలగించింది.

"అమ్మా ! దేవతలిద్దరూ కలిసి మానవ కన్యగా జన్మిస్తారా ?" సోమదత్తుడు ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"అవును నాయనా ! దేవతల శాపాలు గాని, ఆశీస్సులుగాని ఊరకే పోవు. ఏదోరకంగా అమలైపోవాల్సిందే."

ఇంద్రుడి మనసులో ఏదో వికారం చోటుకుంది. ఆ ఛాయలు మొహమ్మీది కొచ్చి కళ్లల్లో కదలాడినై. ఆదిశక్తికి నమస్కరించి

"అమ్మా ! కన్యకా పరమేశ్వరీ ! నా భార్య రూపురేఖలతో జన్మించినామె మరొకరిని పెళ్లాడ్డం నేను భరించలేనమ్మా" ఆందోళన వ్యక్తం చేశాడు.

"అందుకు నువ్వేమీ కలవరపడాల్సి అవసరం లేదు. దేవరాజా ! మానవిగా జన్మించిన పార్వతి, అందచందాలలో శచీదేవిలాగుంటుంది. శాపవశాత్తు మానవుడిగా జన్మించిన ఓ గంధర్వుడు ఆమె అందాలను దోచుకోవాలని ప్రయత్నించి భంగపడ్డాడు. ఆమె అవివాహితగానే అవతారం ముగిస్తుంది" ఆదిశక్తి వివరణ ఇచ్చింది.

ఇంద్రుడు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

వైశ్యోత్తములారా ! అలనాటి సోమదత్త – ప్రభావతి దంపతులే ఈ కుసుమ గుప్త – కుసుమాంబ దంపతులు. ఆ పార్వతీదేవి, శచీదేవిల అవతారమే వాసవి. విష్ణువర్ధనుడే ఆనాటి గంధర్వుడు" దేవరహస్యం విప్పిచెప్పాడు భాస్కరాచారి.

"అయితే మేమంతా ఎవరము గురుదేవా ?" ఓ వైశ్యోత్తముడడిగాడు.

"చెబుతాను వినండి" సర్దుక్కూచున్నాడు. "వాసవి పూర్వజన్మలో సోమదత్త – ప్రభావతి ముద్దుల కూతురు కీర్తికన్యక. కీర్తికన్యక సౌందర్యరాశి..." తో ప్రారంభించి చిత్రకంఠుడు – కీర్తికన్యకల వృత్తాంతం, చిత్రకంఠుడు – వైశ్యుల శాప – ప్రతిశాపముల గురించి వివరముగా చెప్పాడు. చివరికి

"ఆనాడు వారి వివాహాన్ని వ్యతిరేకించిన నూటారెండు గోత్రీకుల సిద్ధవైశ్యులే మీరు. కాబట్టి మీరు గూడా వాసవి వెంట అగ్నిప్రవేశం చేసి చరితార్థులవుతారని ఆనాడే నిర్ణయం జరిగింది."

అంతా విన్న తర్వాత బరువెక్కిన అందరి గుండెలు తేలికైనాయి. కాని ఒకే ఒక్కరి మొహం మ్లానమైంది. అతడే కాశ్యపగోత్రీకుడైన ధర్మశ్రేష్ఠి. అతడు తన పక్కనున్న నగరస్వామికి చెవిలో గుసగుస చెప్పాడు. ఆ నగరస్వామి లేచి

"మిత్రులారా ! మన నూటారెండు గోత్రీకుల్లో ఒక్కరికి తప్ప అందరికీ వారసు లున్నారు. పాపం ! ధర్మశ్రేష్ఠికి సంతానం లేదు. వారసులు లేరు. మనతో అగ్ని ప్రవేశం చేస్తానంటున్నాడు. అలాగయితే అతని వంశాన్నెవ్వరూ గుర్తుంచుకోరు గదా !" సభాదృష్టికి తెచ్చాడు.

"అయితే ధర్మశ్రేష్ఠి గారు మనతో అగ్నిప్రవేశం చేయాల్సిన అవసరం లేదు" కుసుమగుప్తుడన్నాడు.

ధర్మశ్రేష్ఠి అంతర్మధనం కళ్లల్లో కనబడింది.

అయ్యో భగవంతుడా ! అటు వంశం పేరు మాసిపోవడం సహించలేను. ఇటు వీళ్లందరితో పాటు మోక్షాన్నందుకోవాలనే కోరిక చంపుకోలేను.... లోలోపల బాధపడ్తున్నాడు. బాధ కరిగి కన్నీటి పొరలుగా మారింది.

"మహారాజా ! గురువు గారూ ! నా తోటివారంతా దేహత్యాగము చేసి మోక్షగాములవుతూంటే నేనింకా ఈ నశ్వర ప్రపంచములో ఉండిపోవాలా ? ఇక్కడ సాధించేదేముంది ? మనిషి పుట్టిన్నుంచి చచ్చేదాకా త్రివిధ పురుషార్థాలైన ధర్మార్థ కామములను సాధించి దుర్లభమైన నాల్గో పురుషార్థం మోక్షాన్ని వెతుక్కుంటాడు. మోక్షాన్ని వదులుకోలేను. కానీ ... మా వంశము పేరు మాసిపోవడాన్ని గూడా భరించలేను" అన్నాడు.

అతని గుండెనిబ్బరం అందరినీ కదిలించింది. వారందరి దృష్టి భాస్కరాచారి వైపు మళ్లింది. భాస్కరాచారి ఆలోచించి

"నిజమే గదా ! అందివస్తున్న మోక్షాన్ని వదులుకోవడం మూర్ఖత్వమే. నూటా రెండు గోత్రీకులుగా ఉన్న సిద్ధవైశ్యులు విడిపోరాదు. అందుకే ... ధర్మశ్రేష్ఠి దంపతుల దేహత్యాగం చేసినా వారి గోత్రాన్ని అందరూ గుర్తుంచుకుంటారు" అన్నాడు.

"అదెలా గురువుగారూ ?" ఓ వృద్ధవైశ్యుడడిగాడు.

"ఎలాగంటే ... మీ నూటా ఒక్క గోత్రీకుల వారసులు ఏది లెఖ్ఖబెట్టాలన్నా ఒకటికి బదులుగా ధర్మశ్రేష్ఠి గోత్ర వంశనామమైన "లాభం" అని అంటారు. దాంతో అతని లాభకుల వంశము పేరు అజరామరంగా నిలిచి ఉంటుంది. వైశ్యజాతి లాభకుల వంశాన్ని మననం చేసుకుంటూనే ఉంటారు" తరుణోపాయం ఆదేశించాడు.

"ధన్యోస్మి గురుదేవా !" ధర్మశ్రేష్ఠి తృప్తిగా నమస్కరించాడు.

కుసుమగుప్తుని మనసు స్థిరత్వాన్ని పుంజుకుంటోంది.

నా సామ్రాజ్య ప్రజా సంక్షేమం కోసం వాసవివెంట ఇంతమంది ప్రాణత్యాగానికి సిద్ధమవడం అపూర్వము అనుకున్నాడు. అందరికీ ధన్యవాదాలు తెలిపి

"గురువర్యా ! దయచేసి అగ్నిప్రవేశము విశిష్టత గురించి కొందరిలో దోబూచు లాడుతున్న అనుమానాలను తొలగించండి" అడిగాడు.

భాస్కరాచారి ఆలోచనలను నెమరేసుకున్నాడు. "వైశ్యోత్తములారా !

*శ్లో ॥ జలే, వహ్నౌ, బృగౌచైవ । తథా ప్రాయోప వేశమే ।*
*తను త్యాగ స్పృహ త్పుణ్యం । లభతే శివాజ్ఞయా ॥*

అన్నారు పెద్దలు. నీరు, నిప్పు, నింగి, నేల, గాలి ... ఈ పంచభూతాల్లో దేనివల్లనైనా ప్రాయోపవేశము లేదా ఆత్మార్పణ ద్వారా శరీరత్యాగము చేసిన మానవ మాత్రులు కైలాసస్థానాన్ని పొందుతారని బౌద్ధధర్మం చెబుతోంది.

యుద్ధమందున బ్రహ్మజ్ఞానుల కొరకునూ, వంశధర్మాన్ని నిలుపుటకునూ, యోగ్యమగు దేహత్యాగముచేసినచో స్వర్గలోకము ప్రాప్తిస్తుంది. మరుజన్మకు ఆస్కారం లేకుండా ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది.

పంచభూతాల్లో అగ్నికి విశిష్ఠ స్థానముంది. అగ్నిజ్వాలల కాహుతియైన పాంచ భౌతిక శరీరముతో పాటు పాపాలన్నీ కాలిపోతాయి. పవిత్ర ఆత్మ పరమాత్మ చెంతకు చేరుతుంది.

ఆనాడు వేదవతి రావణాసురిని ముందు అగ్నిప్రవేశమైంది. దాక్షాయని తన శరీరాన్ని దక్షయజ్ఞజ్వాలల కర్పించుకుంది. మహాపతివ్రత సీతమ్మ అగ్ని పరీక్షకు నిలబడింది. ఆ ఉద్దేశ్యంతోనే. అన్నీ తెలిసిన వాసవి ఎంచుకున్న ఈ పద్ధతి అత్యంత పవిత్రమైంది. ఆమె కారణ జన్మురాలు. అందుకే ఆమె నామకరణము సమయములో బాగా ఆలోచించాల్సి వచ్చింది. త్రిమూర్తులైన వాసుదేవుడు, సత్యలోకాధిపతి (బ్రహ్మ), విశ్వేశ్వరుడు పేర్లలోని మొదటి అక్షరాలను, త్రిమాతయైన వరలక్ష్మి, సరస్వతి, విశ్వేశ్వరి లోని మొదటక్షరాలను తీసుకొని వాసవి అనే పేరు నిర్ణయించడమైంది. ఆ ప్రాముఖ్యతను గుర్తెరిగి వాసవి నిర్వహిస్తున్న సత్యాగ్రహ యజ్ఞములో మీరంతా భాగస్తులు కావాలను కోవడం సరియైన నిర్ణయము. మీకు శుభమవుతుంది."

సామంత రాజ్య ప్రతినిధులతో సహా నగరస్వాములంతా సంతసించి అగ్ని ప్రవేశానికి ముహుర్తం నిర్ణయంచాలని కోరారు.

భాస్కరాచారి తనలోతాను తర్కించుకుంటూ వేళ్లమీద లెఖ్కలు వేసుకున్నాడు. ఆ తర్వాత

"మాఘ శుద్ధ విదియ శుభముహూర్తంగా నిర్ణయించడమైంది" ప్రకటించాడు.

"అంతేకాదు, చివరగా మీకందరికీ ముఖ్యమైన సూచనలిస్తున్నాను ... వినండి. అగ్నిప్రవేశానికి ముందు వీరకంకణధారణ చెయ్యాలి. ఒక్కో గోత్రము నుండి ఒక దంపతుల జంట మాత్రమే తయారై రావాలి. త్రికరణశుద్ధిగా అగ్నిప్రవేశాని కిష్టపడు సిద్ధవైశ్యదంపతులు మాత్రమే ఈ ధర్మకంకణ ధారణ కర్హులు. ఈ విషయములో ఎవరినీ బలవంత పెట్టరాదు సుమా !" హెచ్చరించి మరికొన్ని సూచనలిచ్చాడు. అగ్ని ప్రవేశం విధివిధానాలను వివరించి చెప్పాడు.

ఆరోజుకు సభ చాలించారు.

ఇదంతా విన్న ఆరున్నూట పన్నెండు గోత్రాల నిషిద్ధ వైశ్యులు మూటాముల్లె సర్దుకుని కుటుంబాలతో బయలుదేరారు.

పెనుగొండలో ఉండిపోతే విష్ణువర్ధనుని చేతిలో ఛస్తాం. విష్ణువర్ధనుడు వదిలేసినా బాలనగరులు వదలరు. బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు.

ఎవరికెవరూ చెప్పకుండా ఎవరికి తోచిన విధంగా వారు ప్రాణాలరచేతిలో పెట్టుకుని పరుగు పరుగున పట్టణం దాటి వెళ్లిపోయారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తలా ఒక దిక్కు చెల్లాచెదరైపోయారు. అందులో

రెండొందల తొంబయ్యేనిమిది గోత్రాల వారు పడమటివైపు పయనమైనారు.

ఎనబది గోత్రాల వారు తూర్పువైపు పారిపోయారు.

వంద గోత్రీకుల కుటుంబాలు దక్షిణము దిశగా నిష్క్రమించారు. మళ్లీ ఇటువైపు రావద్దనుకున్నారు.

ఒక వంద ముప్పదినాల్గు గోత్రములవారు ప్రాణభీతితో ఉత్తర దిశగా సాగిపోయారు.

వెళ్లిపోయిన వారంతా ముందుజాగ్రత్తగా తమ పేర్లను, మరికొందరు ఇంటి పేర్లను మార్చుకున్నారు.

ఒకే దిక్కుగా వెళ్లిన వారు గూడా గుంపులు గుంపులుగా కాకుండా విడివిడిగా ఎవరికి తోచిన దారిలో వారు వెళ్లిపోయారు. భారతఖండమంతా వ్యాపించి ఏవేవో మారు పేర్లతో బతుకుబాట వెతుక్కున్నారు.

## 17

మేతకు వెళ్లి ఇంటికి తిరిగివస్తున్నాయి ఆలమందలు. గోధూళి ఆకాశానికెగిరి అరుణవర్ణం దాల్చింది. సాయంసంధ్య మీరిపోయింది. పెనుగొండ వీధుల్లో ఆముదము దీపాలు చీకటి పరదాలను చీల్చుతూ వెలుగులు పరుస్తున్నాయి. బాటనడిచే నాగరికుల మనోభావాలను కనిపెడుతున్నాయి. నాలుగు వీధుల కూడలి చౌరస్తా మధ్య గద్దె మీద కూచున్న జనాలు పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. మాటల మధ్యలో వ్యాపారం, వ్యవసాయం, రాజ్యపాలన విషయాలు దొర్లాయి. ఆ తర్వాత వాసవి నిర్ణయము చర్చ కొచ్చింది. మొహాల్లో విచారం, మనసుల్లో ఆర్ద్రత ... దీపకాంతుల్లో హావభావాలు కనబడ్తున్నాయి. చర్చ చివర్లో విష్ణువర్ధనుని ఆటలు సాగబోవని గర్వంగా ఊపిరి పీల్చు

కున్నారు. బాలనగరుల శౌర్యసాహసాలను, వాసవి సాహసోపేత నిర్ణయం, సిద్ధవైశ్యుల సంఘీభావము ప్రశంసలందుకున్నాయి.

ప్రజల మధ్య ఉండి అందరి మనోభావాలను వింటున్న పద్మశయన గూఢాచారుల గుండెల మీద సమ్మెటపోట్లు పడ్తున్నాయి. తమ మహారాజు పట్ల ఏహ్యాభావం స్థిరపడి పోయింది.

రాజాంతఃపురములో రాత్రి భోజనాలు ముగిశాయి. శయ్యాగదుల్లో కెవ్వరూ వెళ్లలేదింకా. కుసుమార్యుని మనసులో ఊగిసలాట చోటుచేసుకుంది. ఎన్ని విన్నా, ఎన్ని గమనించినా మానవ స్వభావం కలవరపెడ్తూనే ఉంది. కూచున్న ఆసనం సుఖంగా లేదు. దీపకాంతులేవో ప్రశ్నల్ని సంధిస్తున్నాయి. పితృహృదయ పరితాపం పూర్తిగా తొలగిపోలేదు. ముందు కూచున్న కుసుమాంబ, వాసవి, విరూపాక్షులు కొత్తగా కనబడుతున్నారు.

భగవంతుడా ! కన్నకూతురు కల్యాణోత్సవాన్ని కళ్లారా చూసే సౌభాగ్యం లేదు గదూ ! బంధుమిత్రుల మధ్య పెళ్లివేడుకల్లో ఆనందనందన విహారము ఆశ అడియాశగా మారిందే ! శిరీష కుసుమపేశల సమానమైన కూతురు దేహము అగ్నిజ్వాలలకాహుతై పోవాల్సిందేనా ! ... హృదయవేదన ... చల్లగాలి తాకిన మేఘాల్లా కళ్లు వర్షిస్తున్నాయి. జలజలా రాల్తున్న అశ్రుబిందువులు పట్టు అంగరఖాను తడిపేస్తున్నాయి.

కుసుమాంబ ఆవేదన గుండెల్ని మెలిపెట్టింది. కంటిధారలు కపోలాలను తడిపేస్తున్నాయి. బంగారు బొమ్మలాగున్న కూతురు మంటల్లో బూడిదైపోతుంది గదూ ! ... భరించలేక పోతుంది.

వాసవి ఎప్పట్లాగే గంభీరంగా ఉంది. విరూపాక్షుని కదంతా అయోమయంగా ఉంది. వాసవి గోడలమీదున్న తైలవర్ణ చిత్రాలను వరుసగా చూసి కన్న వారి వైపు దృష్టి మరల్చింది. ముక్కు పుడక, చెవుల కమ్మలు చిరునవ్వులు చిందిస్తున్నాయి.

"నాన్నా !" కాటుక కళ్లు మిలమిలా మెరుస్తున్నాయి. కనుబొమలు ఎక్కుపెట్టిన ధనుస్సుల్లాగున్నాయి. "మీరు దుఃఖిస్తున్నారా ? నశ్వరమైన శరీరాల గురించి చింతిస్తున్నారా ? ఎండుగడ్డి పోచలు నదీప్రవాహములో కొట్టుకపోయినట్టు పాంచ భౌతిక దేహాలు కాలగమనములో కొట్టుకు పోయేవని మీకు తెలుసు. గత జన్మలో మనమెవరము ? ఎక్కడున్నాము ? మరో జన్మలో ఏమైపోతాము ? ఎక్కడుంటాము? అదంతా విధివిలాసము. మోక్షప్రాప్తి కోసము నిరంతరము ప్రయాణిస్తున్న ఆత్మకు ఒక్కో జన్మ ఒక్కో మజిలీ గదా ! ఈ జన్మలో ఓ అనుబంధము మనల్ని కట్టి పడేసింది.

ఐహిక ప్రపంచములోని బంధాలు, అనుబంధాలు శాశ్వతము కావు గదా ! ఎంతకాల మిక్కడ కలిసి ఉన్నా ఏదో ఒక రోజు ఆప్యాయతానురాగ బంధాల్లోంచి విడిపోవాల్సిందే గదా ! కన్యకా పరమేశ్వరి ప్రసాదించిన ఈ జన్మ సార్థకం కాబోతుంది. అశాశ్వతమైన ఈ లోకములో శాశ్వత విలువలను ప్రతిపాదించి ఆచరిస్తున్నాము గదా ! ఆ విలువలు సత్యాగ్రహాలై మానవాభ్యుదయాన్ని సాధిస్తాయని చేతల్లో చూపించబోతున్నాము. జనన మరణాలు శరీరానికే గాని ఆత్మకు కాదని తెలుసుగదా ! ఆత్మ ఆరాటము పరమాత్మలో లీనమవడమే గదా ! ఈ సత్యాన్ని గుర్తు చేసుకోండి నాన్నా ! మనో మాలిన్యాన్ని తొలగించుకుని సంతోషంగా ఉండాలమ్మా !"

ఆత్మ బంధువులందరినీ చూసి మనోవ్యాకులతకు లోనై కురుక్షేత్రములో డీలా పడిన అర్జునునికి గీతాబోధ చేసిన శ్రీకృష్ణ పరమాత్మలా సముదాయించింది. ఆమెలో దివ్యకాంతులు ద్యోతకమవుతున్నాయి.

"అక్కా !" విరూపాక్షుడు గూడా దివ్యానుభూతికి లోనయాడు. "నీ మాటల్లో ఏదో మాయాజాలముంది" అని తల్లిదండ్రుల ముందు కొచ్చాడు.

"మీరలా బేలగా మారడం బాగాలేదమ్మా ! నాన్నా ! కండకావరముతో కన్నూ మిన్ను గానక పేట్రేగి పోతున్న ఆ దుర్మార్గుని అంతం చూస్తానంటే అనుమతించరైతిరి. మీ ఆలోచనలను, ఆదేశాలను అమలు పరచడమే నా కర్తవ్యంగా భావించి మిన్న కుంటున్నాను" అని బయటికెళ్లిపోబోయాడు.

"తమ్ముడూ ! ఒక్కమాట !" వాసవి గొంతులో గాంభీర్యం.

"ఏమిటక్కా ?"

"మనిషి ఎంత బలవంతుడైనా, శక్తియుక్తులెన్ని ఉన్నా, ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటేనే స్థిత ప్రజ్ఞుడవుతాడు. ఆటు పోట్లకు అదరడు. మిన్ను విరిగి మీదపడినా బెదరడు. నా తమ్ముడు స్థితప్రజ్ఞుడనే నేను భావిస్తున్నాను సుమా !" అంది.

అక్క కళ్లల్లోని వెలుగుల నాస్వాదించిన విరూపాక్షుని ఎదప్రశాంతమైంది. అక్క వాక్కులు అమృతగుళికల్లాగున్నాయి.

"సరే అక్కా!" తల నేలకు వాలింది. "నీ ఆలోచన, ఆచరణ సరి అయిందేనని నిరూపించే శక్తినివ్వమని ఆదిశక్తి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రార్థిస్తున్నాను" వెనుదిరిగి చిన్నపిల్లాడిలా అడుగులేస్తూ వెళ్లిపోయాడు.

వాసవి పెదాలపై చిరునవ్వు మెరిసింది. తల్లిదండ్రుల కుడి చేతులందుకుని తన చెంపల కద్దుకుంది.

ఆ స్పర్శ అమోఘము ... అదొక దివ్యానుభూతి. మానవలోకము నుండి మనసులను మరోలోకానికి తీసుకెల్తోంది. కుసుమగుప్త దంపతుల చూపులు కూతురు మీద నిలబడిపోయినై. బొమ్మల్లాగైపోయారు.

"నాన్నా ! అమ్మా !" వాసవి ఇద్దరి మధ్యన కూచుంది. "పాంచభౌతిక శరీరములో చైతన్యమే ప్రాణము. ప్రాణములున్నన్ని రోజులే ఈ జగన్నాటకములో మనుషులు పాత్రధారులవుతున్నారు. శరీరమనే పంజరము లోంచి ప్రాణమనే చిలక ఎగిరిపోయిన నాడు శరీరాన్ని పంచ భూతాల్లోని అగ్నికైనా, భూమికైనా అప్పగించక తప్పదు. కాకపోతే మనం ముందు జాగ్రత్త పడుతున్నామంతే ! అరిషడ్వర్గాల అల్లరికి లొంగరాదు. భ్రాంతిని వీడాలి. ధర్మ రక్షణ కోసం శరీరాలను త్యాగం చేసి పరమానంద భరితమైన మోక్షలోకాని కెల్తున్నామని సంతోషిద్దాం ..." చెప్పుకు పోతోంది.

ఈమె మా కూతురేనా ? లేక జగన్మాత శ్రీ కన్యకా పరమేశ్వరా ? రాజ దంపతులు విభ్రమంగా చూస్తున్నారు. ఆవేదన స్థానాన్ని ఆనందము ఆక్రమించింది. మనసు మల్లెపూవులా ... నిర్మలంగా ఉంది. చేతులెత్తి నమస్కరించి " ధన్యోస్మి తల్లీ !" అన్నారు.

రాత్రి సుఖంగా నిద్రించారు.

ఉదయభానుని క్రాంతికిరణాలు అంతఃపుర భవనాలను మెరిపిస్తున్నాయి. కుసుమార్యుడు పూజాగదిలో అమ్మవారి ముందున్నాడు. కూతురు పరిస్థితి మళ్లీ కల్లోల పరిచింది. మళ్లీ మానవ మాత్రుడైనాడు. మనసు బిగపట్టుకుని ధ్యానం ప్రారంభించాడు.

శ్లో ॥ ధ్యాయే శ్రీ వాసవీ దేవీం, బ్రహ్మ విష్ణు శివాత్మికాం.
పరాశక్తిం, జగద్ధాత్రీం, కన్యకా పరమేశ్వరీం
చతుర్భుజాం, చంద్ర చూడాం, కమలాసన సంస్మితాం
వరదా అభయ హస్తం చ, శుక పద్మాకర కరాం ... "

అమ్మవారి పాదాలను కళ్లకద్దుకున్నాడు.

"జగజ్జననీ ! ఏమిటమ్మా నీ లీల ?" అడుగుతూంటే కుసుమాంబ వచ్చి పక్కన కూచుంది. "ఏ జన్మలో ఏ పాపం చేశామని మాకీ శిక్ష ? ఇది శిక్షనా పరీక్షనా? పలుకు తల్లీ ... !" తల్లిముందు చిన్నపిల్లాడిలాగైపోయాడు.

"అమ్మా ! మాతా ! వాసవి ఎంత చెప్పినా ... మా మనసు ఆక్రోశిస్తూనే ఉందమ్మా !" కుసుమాంబ నమస్కరించింది.

"కుమారా ! కుసుమగుప్తా !" తల్లి చల్లని పిలుపు



"ఆc ... అమ్మా ! కన్యకా పరమేశ్వరీ !" విభ్రమంగా చూస్తూ మోకాళ్లమీద కూచున్నారు. కళ్లు విశాలమైనాయి. నిజమా ! ఇది నిజమా !? ఎదురుగా విగ్రహం... కాదు ... అది జగన్మోహన సుందరాకారము ... తమ కళ్లముందే ఉంది ... దివ్య మంగళ స్వరూపం.

ఆ తల్లి కనుదోయి సరోవరములో ఈదులాడుతున్న ముఖ కాంతులు మిరుమిట్లు గొల్పుతున్నాయి. వెండికొండపై పున్నమి వెన్నెల తుళ్లి పడినట్టుందామె చిరునవ్వు. ముక్కోటి దేవతలు ఆమె కంఠహారములో ముత్యాల్లా ఒదిగి ఉన్నారు. ఆ సౌందర్యలహరి అమోఘం ... అద్భుతం ...

"వత్సా ! నీవు నీ గతాన్ని మరిచి పోయావు గదూ ! ఏదీ ఓసారి గుర్తు చేసుకో ! నువు కుబేరుడివి. నవనిధులకు అధిపతివి. సకల సంపదలకు రక్షకుడివి.

అలనాడు పార్వతీదేవి తండ్రియైన హిమవంతుని పుత్రికాహంకారన్ని గమనించావు. హిమవంతుడు పార్వతిని కూతురుగా పొందినందుకే అంతగా గర్విస్తున్నాడని గ్రహించావు. నా గురించి తపస్సుచేసి ప్రత్యక్షం చేయించుకున్నావు. నన్నే నీ కూతురుగా పొందాలని కోరావు. అదే పార్వతి నా అంశతో నీకు కూతురుగా జన్మిస్తుందని వరమిచ్చాను. ఆనాటి వరము ఈనాడు అమలైంది. నీ వాసవి నా అంశతో జన్మించిన పార్వతి. జగత్కల్యాణం కోసం నీ ఇంట పారాడింది. ఆమె రూపలావణ్యములో శచీదేవిలా ఉందిగదూ ! ఆనాడు కుబేరాంశతో సోమదత్తుడిగా జన్మించి శచీదేవిని కూతురుగా పొందాలని గూడా వరమందుకున్నావు. ఆనాటి నీ భార్య ప్రభావతే ఈ కుసుమాంబ. నా అంశతో పార్వతి నీ కూతురై శచీదేవి రూపలావణ్యాన్ని సంతరించుకుంది. ఇపుడీ అవతారాలు చాలించే సమయమాసన్నమైంది. ... తెలుసుకుని మసలుకో !"

మాటలు స్పష్టంగా వినబడ్డాయి. మనసు శాంతించింది.

కుసుమాంబ మురిసిపోతోంది.

"ధన్యోస్మి మాతా !" అంటూ మరోసారి పాదనమస్కారం చేశారు. ఎప్పట్లా కూచున్నారు. ఎదురుగా కన్యకాపరమేశ్వరి విగ్రహముంది. ఇద్దరూ మొహాలు చూసు కున్నారు.

పాదమంజీరాలు ప్రణవనాదాన్ని ప్రతిధ్వనిస్తూంటే మందగమన వాసవి పూజా గదిలో ప్రవేశించింది. దివ్యానుభూతి ఛాయలు దంపతుల మొహాలమీదున్నాయి.

ఈ వాసవి ... ఈ దేవదూత ... మా గుండెల మీదాడుకుంది... మా కూతురు ... హాయిగా, తృప్తిగా కూతురు నాపాదమస్తకం పరిశీలిస్తున్నారు.

ఆహా ! ఈమె నా కూతురే ! నా వంశాన్ని పావనం చేసింది. కుసుమగుప్తుడు మురిసిపోతూ భార్య చేతులందుకున్నాడు.

"చూశావా మహారాణీ ! కుసుమాంబా ! మన కోర్కె నెరవేరింది. ఈ జన్మ కింకేం కావాలి ?"

కుసుమాంబ ఉత్సాహంగా భర్త చేతుల్ని కళ్లకద్దుకుంది "మన జన్మ ధన్యమైంది మహారాజా !" మురిసి పోయింది.

లేచి కూతురుకు ఎదురెళ్లి ఆప్యాయంగా బుగ్గలు నిమిరింది. నుదురు ముద్దాడింది.

తల్లిదండ్రుల వాలకం వాసవికి తృప్తినిచ్చింది.

"అమ్మా ! నాన్నగారు ఎవరెంత చెప్పినా వినడం లేదు. నాన్న మనసు దోచిన ఆ వాసవి ఎవరోగాని మనపాలిట దుష్టగ్రహమైందమ్మా !" రాజనరేంద్రుడు తల్లిముందు తన ఆవేదన వెలిబుచ్చాడు. వాసవి గురించి అంతకు ముందే అంతా తెలుసుకున్నాడు. పద్మశయనపురములోని పరిస్థితినంతా అవగాహన చేసుకున్నాడు.

అంతఃపురములో ఎదురెదురుగా కూచున్నారు. రాజభవనం బోసిబోయినట్టుంది.

వికలమైన విమలాదేవి మనసు దేనికైనా తయారుగా ఉంది. కాని ... తండ్రి విషయము ... కొడుకులో ద్వేషభావం బాగుండనుకుంది. కొడుకు ముఖకవళికలను చదివేస్తూ

"కుమారా ! యువరాజా !" దగ్గరికు జరిగింది. "వాసవి దుష్టగ్రహమో, అదృష్టగ్రహమో కాలమే చెబుతుంది, కాని నాన్న గారి మానసిక పరిస్థితి నర్థం చేసుకో, పరిపాలన పనుల్లో సతమతమై అలసిపోయారు. సమస్యలను ఎదిరిస్తూ విసిగిపోయారు. జాతకరీత్యా మీ నాన్నగారికివి మంచిరోజులు కావు. కాబట్టి నువు పాలనా పనుల్లో క్రియాశీల పాత్ర వహించాలి. నాన్నగారి పరిస్థితిని అదునుగా తీసుకుని మంత్రులు, ఉన్నతాధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించకుండా జాగ్రత్త పడాలి. ప్రధానామాత్యులు, సేనాధిపతులతో చర్చలు సాగిస్తుండాలి. గూఢాచార విభాగముపై నిఘావేసి ఉంచాలి... ఇదీ నీ బాధ్యత" నచ్చజెప్పింది. "నువు నీ బాధ్యతలను విస్మరిస్తే మన సామ్రాజ్యాన్ని కాపాడే వారుండరు నాయనా ! జాగ్రత్త !" ధైర్యంగా హెచ్చరిచ్చింది.

"నేను నా బాధ్యతనెప్పుడూ విస్మరించనమ్మా. రాజధాని పరిస్థితే కాదు సామంత రాజ్యాల స్థితిగతుల్ని గూడా వేగుల ద్వారా తెలుసుకుంటున్నాను. కాని ... నాన్నగారి

మొండి పట్టుదలనే ఆందోళనకు గురిచేస్తుందమ్మా !" యువరాజు రాజనరేంద్రుని మొహం పగటి కలువలా ముడుచుకు పోయింది.

"కుమారా ! మానవాతీతమైన శక్తి ఏదో మానవమాత్రులను నడిపిస్తుంది. దాన్నే విధి అంటున్నాము. విధివిధానానికి దేవతలు గూడా అతీతులు కారు. విధి విధానాలను మార్చే శక్తి లేదు గదాని కర్తవ్యాన్ని మరువరాదు. జరగాల్సిందేదో జరిగి తీరుతుంది. రోట్లో తల ఉంది కాబట్టి రోకటి పోటుకు భయపడాల్సిన అవసరం లేదు. మన ధర్మాన్ని మనం నిర్వర్తించాలి" గుండె దిటవుతో కర్తవ్యబోధన చేసింది.

కల్లోల సముద్రంలాగున్న రాజనరేంద్రుని మనసు కుదుటపడింది. కొద్దిసేపు తల్లితో సలహా సంప్రదింపులు సాగాయి. తానీ క్లిష్టపరిస్థితిని చాకచక్యంగా, సాహసోపేతంగా ఎదిరించాలనుకున్నాడు. దృష్టి పరిపాలనవైపు మళ్లింది.

విష్ణువర్ధనుని కింకా ఆశ చావలేదు. ఏ క్షణమైనా పెనుగొండ నుండి వియ్యానికి ఆహ్వానం రావచ్చుని, కయ్యాన్ని నివారించ వచ్చుని ఎదిరి చూస్తున్నాడు. పెనుగొండలో నియమించిన భటులనుండి సమాచారమేదీ అందడం లేదు. కేవలం ఓ ఆడప్లి పెళ్లి సమస్య కారణంగా పెనుగొండ ప్రజలు, సైనికులు పెనుతుఫానులాంటి యుద్ధాని కిష్ట పడతారా ! నా శక్తిసామర్థ్యాలు పెనుగొండ మంత్రులకు, సైనికాధికారులకు తెలుసు. కాబట్టి చివరి చర్యగా కల్లోలానికి బదులు కల్యాణానికే ఇష్టపడ్తారు ... ఆలోచనా లోచనాలతో ఊహల ఉయ్యాల లూగుతున్నాడు.

తల్లి ఆదేశాన్ననుసరించి రాజనరేంద్రుడు ముందు జాగ్రత్త చర్యలకు శ్రీకారం చుట్టాడు. ప్రధానిని పిలిపించుకున్నాడు.

"ప్రధానామాత్యా ! పెనుగొండ నుండి సమాచారమేమన్నా అందుతుందా ?"

"లేదు యువరాజా !" విజయసింహునిలో ముందటి ఉత్సాహం లేదు." అక్కడున్న మన భటులనుండిగానీ, ఇతర వేగుల నుండి వార్తలేవీ రావడం లేదు. అసలక్కడ ఏం జరుగుతుందో ఏమో ... అగమ్య గోచరంగా ఉంది."

"అయితే నమ్మకస్తులైన మరికొందరు భటుల్ని వెంటనే పెనుగొండకు పంపండి. వారి ద్వారా మనకు అక్కడి సమాచారం అంది తీరాలని లేకపోతే తలలుత్తరిస్తామని హెచ్చరించి మరీ పంపండి" ఆదేశించాడు.

విజయసింహుడు సంబంధిత అధికారులతో చర్చించాడు. పరిస్థితిని మహారాజుకు వివరించి కొన్ని వందల మంది భటుల్ని పెనుగొండకు పయనం కట్టించాడు.

పెనుగొండకు చేరుకున్న భటులు మారువేషాల్లో ప్రజల్లో కలిసిపోయారు. నలుగురు కలిసి మాట్లాడుకుంటున్న వివరాలన్నీ సేకరిస్తున్నారు. ఎక్కడ, ఎందరినోట విన్నా విష్ణువర్ధన మహరాజు పట్ల ఏహ్యాభావం వ్యక్తమవుతోంది. పద్మశయన సామ్రాజ్యములో మంత్రులు, అధికారులు, సైనికులు ఆత్మవంచన చేసుకుంటున్నారని సామాన్యులు అసహ్యించుకుంటున్నారు.

చిఛీ ... ఇంత బతుకు బతికి ఇంటెనక చచ్చినట్టు దుర్మార్గుడైన మహారాజు మెప్పుకోసం ధర్మం తప్పాలా ?... అనే ఆలోచన భటుల్లో ఉదయించి బలపడుతోంది. ఊగిసలాటలో పడిపోయారు.

అరివీర భయంకరులైన బాలనగరుల బలమున్నా, శత్రువులను చావుదెబ్బ తీయగల సైనికబలగాలున్నా ధర్మాచరణ కోసం, అహింసా పద్ధతి నవలంభించి నూటా రెండు గోత్రీకులు అగ్నికాహుతి కాబోతున్నారని విని ఉక్కిరిబిక్కిరై పోయారు. తమను తాము తిట్టుకుంటున్నారు. విష్ణువర్ధన మహారాజు తుచ్ఛమైన కోర్కె ఇంతమంది మహాత్ములను, వాసవిని, ఆమె తల్లిదండ్రులను బలి తీసుకుంటుందని బాధ పడుతున్నారు.

సిద్ధవైశ్యుల సభకు వెళ్తే అంతకు ముందక్కడున్న భటులు అక్కడ కనబడ వచ్చునుకున్నారు.

పెనుగొండ పట్టణములో అసలు హడావుడి ప్రారంభమైంది. త్యాగధనులైన సామంతరాజ్యాల నూటారెండు గోత్రీకులు జంటలుగా పెనుగొండకు చేరుకున్నారు. వారి వెంట బంధుమిత్రులున్నారు. వారిని చూస్తుంటే మిగితా వారికి చేతులెత్తి నమస్క రించాలనిపిస్తుంది. వర్ణాశ్రమ ధర్మ రక్షణ కోసం, వైశ్యజాతి ఆత్మాభిమాన సంరక్షణ కోసం ప్రాణాలర్పిస్తున్నామనే భావన నూటారెండు గోత్రీకుల నుత్తేజ పరుస్తోంది.

యువరాజు విరూపాక్షుడు, బాలనగరులు పెద్దల మాటకు కట్టుబడి ఉన్నారు. నరాల్లో ఉరుకులాడుతున్న పౌరుషాన్ని సంయమనముతో అదుపు చేసుకుంటున్నారు. ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

ఆరోజు ... మాఘ శుద్ధ పాఢ్యమి

అంతకు ముందట్నుంటే మల్హరుడను పండితుడు రాజగురువు భాస్కరాచారి ఆదేశాన్ననుసరించి ఆత్మాహుతి కేంద్రమైన బ్రహ్మగుండం క్షేత్రములో కార్యోన్ముఖుడైనాడు. వాసవి కోసం ప్రధాన అగ్నిగుండాన్నేర్పాటు చేయించాడు. దాని చుట్టూ నూటారెండు అగ్నిగుండాల నేర్పాటుచేయిస్తున్నాడు. సత్యాగ్రహానికి సర్వసన్నద్ధం చేయిస్తున్నాడు.

సామ్రాజ్య ప్రజలంతా వాసవి అగ్నిప్రవేశ క్రతువును దివ్యమైన, భవ్యమైన యజ్ఞముగా భావిస్తున్నారు. వాసవి భువినుండి దివికి దిగివచ్చిన కన్యకా పరమేశ్వరిలా కుసుమగుప్త దంపతుల మనసుల్లో తిష్ఠ వేసుకుంది.

నగరేశ్వరాలయ ప్రాంగణము నూటారెండు వైశ్యదంపతులు, వారి బంధువులతో నిండిపోయింది. కంకణ ధారణ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయినాయి.

భాస్కరాచారి గురుపీఠాన్నధిష్ఠించి కంకణధారణ చేయించేందుకు తయారుగా ఉన్నాడు. కుసుమగుప్త దంపతులు గురువుగారి కెదురుగా ప్రత్యేకాసనాన్నలంకరించారు. నగరస్వాములంతా గొంతెత్తి ఓంకారనాదం చేశారు. మంగళతూర్యాలు మోగుతూంటే జై కన్యకా పరమేశ్వరీ, జై వాసవాంబా ! నినాదాలిచ్చారు. నగరేశ్వరాలయం గాలి గోపురం నయనానందకరముగా కనబడింది. కర్మసాక్షియైన సూర్యభగవానుని ఆశీర్వాద బలమందులో ఇమిడి ఉందని అర్థమైంది. కంకణధారణ చెయ్యబోతున్న వారిలో నూతనోత్సాహం ఉరకలెత్తింది. లోకోద్ధరణ కోసం ప్రాణత్యాగం చేస్తున్నామనే ఉదాత్త భావం అలరిస్తోంది. గర్వంగా ఉంది గూడా.

నూటారెండు బంగారు పళ్లాలలో వీరకంకణాలు చూపరుల నుత్తేజ పరుస్తున్నాయి. బ్రహ్మతేజస్వి, కాషాయాంబరధారియైన భాస్కరాచారి

"సనాతన ధర్మ రక్షకులారా ! వైశ్యోత్తములారా ! ఒక్కొక్క గోత్రము నుండి ఒక్కోజంట మాత్రమే ముందుకొచ్చి ధర్మ కంకణాలైన ఈ వీరకంకణాలను ధరించుకోవాలి. అందుకు తయారుగా ఉన్నవారు ముందు తాంబూలాలు అందుకోండి" ఆప్యాయంగా సూచించాడు.

త్యాగమూర్తులు ఉల్లాసంగా, ఉత్సాహంగా తాంబూలలందుకున్నారు. భక్తి పారవశ్యముతో జై వాసవీ, జైజై కన్యకా పరమేశ్వరీ అంటూ గొంతెత్తి నినాదాలిచ్చారు.

"ఇప్పుడిక ధర్మకంకణ ధారణ కోసం ఒక్కోజంట నా ముందుకు రావాలి" భాస్కరాచారి సూచించాడు. పక్కన భటులు కంకణాల బంగారు పళ్లాలను పట్టుకుని తయారుగా ఉన్నారు.

సంతానం లేని ధర్మశ్రేష్ఠి అందరికంటే ముందున్నాడు. భార్యతో సహా ముందు కొచ్చాడు. అందరికీ నమస్కరించాడు.

"పెద్దలారా ! నా తర్వాత నా వారసులెవరూ ఈ లోకములో ఉండరని తెలిసి మీరంతా నా వంశనామమైన 'లాభం' ను మనజాతి వారలంతా ఉచ్చరిస్తారన్నారు.

అందుకు నాకెంతో తృప్తిగా ఉంది. కాబట్టి ధర్మ కంకణధారణ నాతోనే ప్రారంభ మవుతుంది" ప్రకటించాడు. హర్షధ్వానాలతో అందరూ ఆమోదించారు.

ఆహా ! వైశ్యులెంత ధర్మాత్ములు ! ఆత్మాభిమానం అనర్వచనీయము. ధర్మరక్షణ కోసం దేహత్యాగానికి పోటీ పడ్తున్నారు. ప్రపంచ చరిత్రలో ఇంతకుముందిలా జరగలేదు. ఇకముందు గూడా జరకగ పోవచ్చు. వీరంతా త్యాగధనులే. వీరి యశక్కాంతులు దేవ లోకాన్ని గూడా కదిలిస్తాయి ... విష్ణువర్ధనుని భటుల ఆశ్చర్యానికంతులేదు. ఇలాంటి పుణ్యాత్ములకు నష్టం చెయ్యడం మహాపాపమనుకున్నారు.

అందరి హావభావాలను కళ్లతో చదివేశాడు కుసుమగుప్తుడు.

"ధర్మశ్రేష్ఠీ ! నీ పేరే ధనదశ్రేష్ఠి గదా ! నీ సాహసము మానవజాతి కాదర్శ ప్రాయము. ఇది వీరధర్మకంకణ ధారణ. అది నీకే మొదట జరుగుతుంది" అన్నాడు అందరి మాటగా ఓంకారానుచ్చరిస్తూ అందరూ ఆమోదించారు.

ధర్మశ్రేష్ఠి దంపతులు సంతోషముతో గురువు గారికి పాదాభివందనం చేసి కుడిచేతులందించారు.

"శుభం" భాస్కరాచారి ధర్మశ్రేష్ఠి దంపతులకు కంకణధారణ చేస్తూ "వైశ్యజాతి ఉన్నంతవరకు వారు ఒకటికి బదులుగా 'లాభం ధనద' అని ఉచ్చరిస్తారు. దివ్యలోక ప్రాప్తిరస్తు" ఆశీర్వదించాడు.

తర్వాత కుసుమగుప్త దంపతులకు కంకణధారణ జరిగింది. అందరూ కన్యకా పరమేశ్వరిని ధ్యానిస్తున్నారు. ఒకరి తర్వాత ఒకరు జంటగా ముందుకొచ్చి కంకణ ధారులై మురిసి పోతున్నారు. వీరావేశ వాతావరణములో వీరకంకణ ధారణ పూర్తయింది.

"రేపు ఉదయమే మీరంతా అనగా కంకణధారులంతా మంగళస్నానాలాచరించి పట్టువస్త్రాలు ధరించి నిర్మల మనస్కులై వచ్చి అగ్నిగుండాల ముందుండాలి" భాస్కరాచారి గుర్తుచేశాడు. అందరినీ ఆశీర్వదించి పంపాడు.

నూటారెండు దంపతుల త్యాగనిరతిని, వాసవి ధర్మదీక్షను ఎలా పొగడాలో మాటలు రాక వేలాది ప్రజలు నగరస్వాములు, వైశ్యోత్తములు ఆత్మానంద భరితులైనారు. బాలనగరుల హృదయాల్లో పవిత్రభావం చోటుచేసుకుంది.

ఆపూటకందరూ విడిదికెళ్లి పోయారు.

ప్రజల మధ్యన ఉండి కంకణధారణ తిలకించిన విష్ణువర్ధనుని భటుల గుండెలు కరిగి కళ్లు చెమర్చాయి. ఈ ధర్మాత్ముల కపకారం తలపెట్టినవారు పాపాత్ములై నరక లోకానికెళ్తారనుకుని గుసగుసలాడుకున్నారు. అంతకు ముందే అక్కడ ఉండి వాసవి

భక్తులైన తోటి భటులతో మాట్లాడి ప్రభావితులైనారు. వారుగూడా వాసవి భక్తులమై పోతున్నామని సగర్వంగా ప్రకటించుకున్నారు.

అందరూ కలిసి వెళ్లి వాసవాంబ సమక్షములో కుసుమగుప్త మహారాజును దర్శించుకున్నారు. కంట తడిబెట్టారు.

"కామాంధుడైన విష్ణువర్ధనుని కొలువు విడిచిపెట్టి ధర్మక్షేత్రమైన ఈ పెనుగొండ లోనే శాశ్వతముగా ఉండిపోతాము. దయచేసి అనుమతించు"మని వేడుకున్నారు.

కుసుమగుప్తుడు సంతసించి

"నాయనలారా ! మీరు ధర్మవర్తనులు. శాశ్వతంగా మీరిక్కడే మీ కుటుంబాలతో ఉండవచ్చు" నన్నాడు. వాసవి వైపు చూశాడప్పుడు. భటులంతా వాసవికి నమస్కరించారు. ఆమెలో కనబడిన దివ్యతేజస్సుకు ఉక్కిరిబిక్కిరై పోయారు. వాసవి విరూపాక్షుడిని

"వీరంతా ధర్మరక్షకులే. అధర్మాన్ననుసరించి అపకీర్తి పాలవడం వీళ్లకిష్టం లేదు. ఇంతకు ముందట్నుంచే ఇక్కడున్న పద్మశయన సామ్రాజ్యభటులు వీరముష్టులుగా, తర్వాత వచ్చిన వారు మైలారులుగా పిలువబడుతూ ఇక్కడే ఉంటారు. వీరి జీవనోపాధి కోసం వైశ్యులే సహాయసహకారా లందించాలి సుమా !" సూచన పూర్వకముగా ఆదేశించింది.

"సరే అక్కా ! వీరంతా ఇప్పట్నుంచి మన ప్రజల్లో కలిసిపోతారు" విరూపాక్షుడు ఆమోదించాడు.

వాసవి సహా వైశ్యదంపతుల అగ్ని ప్రవేశ క్రతువు ... సత్యాగ్రహము గురించి నగరమంతా చాటింపు వేశారు. సామ్రాజ్యములోని ప్రజలందరికీ విషయం తెలిసి పోయింది.

ప్రజల మనసుల్లో కొలువున్న మహారాజు కుసుమగుప్తుని పరిపాలనలో సుఖ శాంతులనుభవిస్తున్న సాధారణ జనాలు ఆ వార్తను జీర్ణించుకోలేక బాధపడ్తున్నారు. కన్నీరు మున్నీరుగా కొందరు రోదిస్తున్నారు. అంతా కలిసి రాజదర్శనానికి బయలుదేరారు.

పెనుగొండ నగరస్వాముల సమేతముగా కుసుమ గుప్తుడు జనసంద్రము ముందుకొచ్చాడు.

కుసుమగుప్త మహారాజుకు జై ... నినాదాలు మిన్నంటాయి. నగరస్వాములు వారిని శాంతింపజేశారు.

"మా మహారాజు కుసుమగుప్తుల వారు కలకాలం జీవించాలి. మరో వంద సంవత్సరాలన్నా పరిపాలించాలి".

"మా కన్నకూతురు లాంటి వాసవాంబ ఆత్మాహుతి నిర్ణయం మా మనసుల్ని కలచివేస్తుంది".

"మేమంతా యుద్ధరంగములోకి దిగి విష్ణువర్ధనుని మదమడిగిస్తాము. మీరు క్షేమంగా ఉండాలి".

"ఇలాంటి మహారాజు మాకు మరొకరు దొరకరు, విష్ణువర్ధనున్ని నామ రూపా ల్లేకుండా చేస్తాము".

"వాసవమ్మ మా ఇంటి ఆడపడుచు. ఆమెను మా ప్రాణాలడ్డువేసైనా సరే కాపాడు కుంటాము".

ప్రజలంతా తమ ఆవేదన వెలిబుచ్చారు. మరి కొందరు బోరున విలపిస్తున్నారు.

కుసుమ గుప్తుడిలో ఓవైపు బాధ, మరోవైపు ఆనందము. ఎదపొదలో తియ్యని అలజడితో అతలాకుతలమయాడు.

"మాన్యులారా ! మహాజనులారా ! శాంతించండి" మరింత ముందుకొచ్చి అందరికీ అభివాదము చేశాడు. "పెనుగొండలో పుట్టినందుకు, మీ మనసుల్లో చోటు సంపాదించుకున్నాను. ఇది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. వాసవాంబ కారుణ జన్మురాలు. మన కళ్లముందు పెరిగిన వాసవి సమస్య మనందరి సమస్య. ఆమె కోసం లేదా మా ఒక్క కుటుంబం కోసం పెనుగొండ సామ్రాజ్యములో పెనుతుఫాను రేపడం, వేలాదిసైనికుల ప్రాణాలతో చెలగాటమాడడం మాకిష్టం లేదు. మొండిగా రెచ్చి పోతున్న విష్ణువర్ధనుని యుద్ధకాంక్ష నెరవేరితే మన సైనికులే ధైర్యసాహసాలు ప్రదర్శించి విజయం సాధిస్తారని తెలుసు. కాని ... యుద్ధం ఒక మారణహోమం. ఇరు పక్షాల వారు ప్రాణాలకు తెగించి పోరాడుతారు.

యుద్ధములో ఎంతో మంది సైనికులు వీరమరణం చెందక తప్పదు. ఎన్నో సైనిక కుటుంబ సభ్యులు అనాథలైపోతారు. ప్రభుత్వ పరంగా వారినెంత ఆదుకున్నా చచ్చినవారి ఆప్యాయతానురాగాల నందించలేము. శాంతి, అహింసల ప్రాతిపదికగా సాగుతున్న పాలనలో యుద్ధాగ్ని జ్వాలలు రేపి వందలు, వేలాది కుటుంబాలను శోక సముద్రములో ముంచే బదులు మా కుటుంబములోని ముగ్గురం, మరో నూటాఒక్క దంపతులము అగ్నిగుండాల్లో బలిదానం చేసి మోక్షగాములమైతున్నాము. అందుకు మీరంతా మమ్ముల్ని ఆశీర్వదించండి. మీకు శుభం జరుగుతుంది. ఈ విషయములో ఎవరూ బాధపడవద్దు. మీరు, మీ పిల్లలు, ముందు తరాలవారు సుఖశాంతులతో వర్ధిల్లండి. దయచేసి నా ప్రార్థన నాలకించండి" మరోసారి చేతులెత్తి నమస్కరిస్తూ వేడుకున్నాడు.

ఇంకేం మాట్లాడాలో ప్రజల కర్థం కాలేదు.

మనక్షేమం కోసం, మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం వాసవాంబ, వైశ్యజాతి ఎనలేని త్యాగం చేస్తున్నారు. వాసవాంబ దేవతనే గదా ! అనుకుంటూ వెనుదిరిగారు.

ప్రశాంత సముద్రములాగున్న కుసుమగుప్తుని మనసు మళ్లీ వికలమైంది. పక్కన కూచున్న కుసుమాంబలో దుఃఖం పొంగుకొచ్చింది. కంటిధారలు కపోలాలను తడిపేస్తూ గుండెల్ని పిండేస్తున్నాయి. వాసవి తల్లిదండ్రుల ముందుకొచ్చి నుంచుంది.

"అమ్మా ! నాన్నా ! మీకన్నీ తెలుసు. కడుపుతీపి మిమ్ముల్ని కంటతడి పెట్టిస్తుంది. మీరు గూడా నాతో దేహత్యాగం చేస్తామన్నారు. మీగురించి మీరేమీ బాధ పడ్డం లేదు. కాని ... నా గురించే పరితపించి పోతున్నారు. కన్నవారి కడుపుతీపి కడుపున పుట్టినవారికి వరప్రసాదమే గదా ! చూడండి ... ఇటు చూడండి. నన్నోసారి కళ్లారా మనసారా చూసుకోండి... "

మంచుపూలైన కళ్లతో కుసుమాంబ దంపతు లటు చూసి నోరెల్లబెట్టారు.

అమోఘం ... అద్భుతం ... ఆశ్చర్యం ... తమ ముందున్నది వాసవి ... కాదు ... కైలాసం నుండి దిగివచ్చిన పార్వతీదేవి ... కాదు కాదు ... మణిద్వీపం నుండి మా కోసం దిగివచ్చిన ఆదిశక్తి కన్యకాపరమేశ్వరి. సర్వాభరణ, సర్వమంగళ స్వరూపిణి, జగజ్జనని ... నాలుగు భుజాలు ... ఓ చేతిలో చిలక, మరోచేతిలో వికసిత పద్మము, ఇంకో రెండు చేతులు... ఒకటి అభయ హస్తము మరోటి ఆశీర్వాదహస్తము ... సౌందర్య లహరి ప్రభలను చర్మచక్షువులతో చూడ్డమా ! ... అనిర్వచనీయమైన ఆనందోద్వేగము ... దివ్యాను భూతి ...

ఆపాదమస్తకం సంతోషతరంగాల్లో తేలిపోతోంది. గొంతు పెగలక, నోటిమాట రాక కాస్సేపలాగే విగ్రహాల్లా ... కళ్లప్పగించి చూస్తుండి పోయారు. చేతులెత్తి నమస్కరించారు.

కుసుమగుప్తుని భావావేశం గొంతులోకొచ్చింది. పులకింతలు పెదాలను కదిలిస్తున్నాయి.

"చతుర్భుజాం, చంద్రచూడాం కమలాసన సంస్మితాం
వరదా అభయ హస్తంచ శుక పద్మాకరం శుభం ... " కీర్తించాడు.

కుసుమాంబ హృదయస్పందనలో కొత్త స్వరాలు ధ్వనిస్తున్నాయి.

"మాతా ! వాసవీ కన్యకా పరమేశ్వరీ ! మమ్ముల్ని కరుణించు తల్లీ !"

పారవశ్యంతో పాదాలంటి నమస్కరించారు.

సకల కళాశోభిత, సర్వాలంకార భూషితయైన కన్యకా పరమేశ్వరి వాసవిలో కనిపించింది. ఎఱ్ఱని పెదాలపై తెల్లని చిరునవ్వు వేయి పున్నమ వెన్నెల వెలుగులు విరజిమ్ముతోంది.

"నాయనా కుసుమగుప్తా !" వంద సూర్యులొకేసారి ఉదయిస్తున్న కాంతిపుంజాలు కళ్లను మిరుమిట్లు గొల్పుతున్నాయి. "మానవుడిగా జన్మించావు కాబట్టి గతాన్ని మరిచావు. కడుపు తీపి కల్లోల పరుస్తుంది గదూ !

ఆర్ష సంస్కృతి, అనితర సాధ్యమైన భూతదయ, ప్రేమానుబంధాలమయమైన సనాతన ధర్మక్షేత్రమీ భారతభూమి. ఈ పుణ్యభూమిలో దేవతలు కొందరే మానవులుగా జన్మించే అదృష్టానికి నోచుకున్నారు. అలాంటిది మీకా అదృష్టము లభించింది.

ఈ లౌకిక ప్రపంచములో కనబడేదేదీ శాశ్వతము కాదు. కనబడే దేదైనా ఏదో ఒకరోజు కనుమరుగయేదే గదా ! అలాంటి నశ్వర శరీర త్యాగాని కెందుకింత దుఃఖము ? మమతాను రాగాల బంధాల్లో బందీలైనారు గదూ ! ఇవేవీ శాశ్వతమైనవి కావు గదా ! భ్రమలో పడి జీవితాదర్శాన్ని విస్మరించరాదు గదా ! తాడును చూసి పాముగా భ్రమించే రజ్జు – సర్ప భ్రాంతిని వీడాలి. మామూలు మనిషి మహనీయుడిగా ఎదగాలంటే వేద సంస్కృతి అనుసరణీయము. కాబట్టి జరిగిన దానికి చింతించక జరగబోవు కార్యక్రమాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వహించండి. లోకానికి, రాజకుంటుంబానికి మేలు చేకూర్చండి" హితవు చెప్పి అదృష్యమైంది.

వాసవిగా దర్శనమిచ్చింది.

కుసుమాంబ దంపతుల్లోని మాయామోహం పటాపంచలైంది. భ్రమలు తొలగి పోయినై. అప్పటినుండి వాసవి పూజాగదికే పరిమితమై ధ్యానంలో నిమగ్నమైంది.

జరగాల్సిన కార్యక్రమం గుర్తుకొచ్చి రాజదంపతులు బయటికొచ్చారు. జరుగు తున్న ఏర్పాట్ల గురించి ప్రధానమంత్రి నడిగి తెలుసుకుంటున్నారు.

# 18

హిమ పర్వత శ్రేణులు నిండుపున్నమి వెన్నెల ఆరబోసిన వెండికొండల్లా తళతళ లాడ్తున్నాయి. వెండికొండ ఒడిలో పారిజాత పుష్పవనము. వనముమధ్యన పార్వతీ పరమేశ్వరుల ఏకాంతము. ఏకాంతములో సరససల్లాపాలు సాగిపోతున్నాయి.

సిద్ధేశ్వరుని కృపావలంబులైన సిద్ధవైశ్యులు కైలాస నివాసములో కులాసాగా గడుపుతున్న రోజులవి.

పారిజాత సుమ సురభిళాలు పార్వతీ పరమేశ్వరులనుత్తేజ పరుస్తున్నాయి. ఆది దంపతుల కేళీవిలాసము అరమరికలు లేకుండా సాగిపోవాల్సిందే. బయట నందీశ్వరుడు, సురధుడు, గాధి, బాణుడు, వైశ్యముని సమాధి పారిజాతవనము ద్వారము వద్ద ఉన్నారు. వారంతా పరమేశ్వరుని పరమభక్తులు. ఎవరొచ్చినా లోపలి కనుమతించరు. పార్వతీ పరమేవ్వరుల ఏకాంతాని కాటంకము కలిగించరు.

తెల్లవారింది. భానూదయమైంది. నునులేత సూర్యకిరణాలు వెండికొండ వెలుగులతో దోబూచులాడు తున్నాయి. పక్కనే గంగానది పరవళ్లు తొక్కుతోంది. స్నానాలకు సమయమైపోయింది. అందరిలో సందిగ్ధం.

"మనమంతా స్నానానికెళ్తే ద్వారము వద్ద ఎవరుంటారు ?" బాణుడు నందీశ్వరు నడిగాడు.

అంతా మొహాలు చూసుకున్నారు.

నందీశ్వరుని దృష్టి సాలోచనగా సమాధిమునిపై బడింది.

"వైశ్య మునీశ్వరా ! మీరిక్కడే ఉండి మమ్ముల్ని స్నానానికి పంపించండి. మేము వచ్చిన తర్వాత మీరు వెళ్లిరండి" కోరాడు.

"అవును. వైశ్యజాతికి ఓపిక వెన్నతో పెట్టిన విద్య. దయచేసి మీరిక్కడే ద్వారము వద్ద ఉండి మమ్ముల్ని వెళ్లనివ్వండి సమాధి మునీశ్వరా !" బలపరిచాడు సురధుడు.

సమాధి ఆలోచించి "సరే ! మీరు వెళ్లిరండి. మీరొచ్చేదాకా నేనిక్కడే పరమేశ్వర సేవలో ఉంటాను" సంతోషంగా అంగీకరించాడు.

వారంతా చెట్టాపట్టాలేసుకుని గంగాస్నానానికెళ్లిపోయారు. సమాధిముని అప్రమత్తుడై ద్వారము ముందు అటూ ఇటూ తిరుగుతున్నాడు. పారిజాత పుష్పదళాలతో సరసాలాడి సువాసనలను మోసుకొస్తున్న గాలి తరగలు ఒంటిని స్పర్శించి ఉల్లాసాన్ని స్తున్నాయి. గంగానదీ ప్రవాహ తరంగ ధ్వని చెవులకింపుగా వినబడుతోంది.

"జై పరమేశ్వరా ! జైజై శంకరా !" అలికిడి వినబడింది. ఎదురుగా దుర్వాస మహర్షి ... నేరుగాలోపలి కెళ్లబోతున్నాడు.

"దయచేసి ఆగండి మునీంద్రా !" నమస్కరించాడు సమాధి.

"ఎందుకు ఆగాలి ? తక్షణమే పరమేశ్వరుణ్ని దర్శించుకోవాలి" గుబురు గెడ్డాన్ని గర్వంగా నిమురుకున్నాడు. మొహమ్మీద కోపం ఛాయలున్నై.

"మునీంద్రా ! పార్వతీ పరమేశ్వరులు ఏకాంతములో ఉన్నారు. ఆది దంపతుల

ఏకాంతానికి భంగం కలిగితే లోకానికి నష్టం జరగొచ్చు. కాబట్టి ప్రస్తుతం లోపలికెవ్వరినీ అనుమతించడం లేదు" సవినయంగా మనవి చేశాడు.

"అనుమతా ? నేను గూడా అనుమతి తీసుకోవాలా ?" దుర్వాస మహర్షి అగ్రహోదగ్రుడయాడు. కళ్లు నిప్పుకణికలైనాయి.

"మన్నించండి ఋషీశ్వరా ! పరమేశ్వర దర్శనానికిది తగిన సమయం కాదు" ద్వారం మధ్యకొచ్చినుంచున్నాడు.

"ఏమీ నీ దురహంకారం !" దుర్వాసుని కళ్లల్లో క్రోధానలం జ్వలించింది. భృకుటి ముడిపడింది. "ఎక్కడో ఉండాల్సిన నీవు కొద్దిపాటి తపశ్శక్తితో ఇక్కడున్నావు. నీ అహంకారానికి కారణమదే కదూ ! ఇది క్షమించరాని నేరము. ఈశ్వర సన్నిధానము నుండి భూలోకానికెళ్లిపో ! మనిషివై జన్మించు" శపించాడు.

సమాధిముని హడలిపోయాడు.

"ఈశ్వరా ! పరమేశ్వరా ! జగదీశ్వరా ! పాహిమాం ... పాహిమాం" చేతులు పైకెత్తి గొంతెత్తి ప్రార్థించాడు.

పరమేశ్వరుడు ప్రత్యక్షమయాడు. తేజోహీనుడైన సమాధిముని పరమేశ్వరుని పాదాలపై బడి గోడుగోడుమన్నాడు.

పరమశివునికంతా అవగతమైంది. సమాధిని లేపాడు.

"సమాధీ ! భయపడకు. తపోధనుల శాపము ఊరకే పోదు. దాన్ని అనుభవించి తీరాల్సిందే !"

వెండికొండ శిఖరం విరిగి వెన్నుమీద పడ్డట్టైంది సమాధికి.

"పరమేశ్వరా ! నిరంతరం నీ సేవలోనే తరిస్తున్నాను గదా ! ఇక నాకు దిక్కెవ్వరు ? ఎవరినాశ్రయించాలి స్వామీ ?" విలవిల్లాడిపోయాడు. పరమేశ్వరుని దృష్టి దుర్వాసునివైపు మళ్లింది.

సమాధిముని దుర్వాసఋషిని వేడుకున్నాడు. దుర్వాసుని కోపతాపాలు నీటి బుడగల్లా మాయమైనాయి.

"సమాధీ ! మనమిప్పుడు పరమేశ్వర సన్నిధానములో ఉన్నాము. శాపవిముక్తి పరమేశ్వరులే సూచిస్తారు" అని ఈశ్వర స్తుతి చేశాడు.

"సమాధీ !" సమాధి ఆందోళనంతా ఓ చూపుతో మాయం చేశాడు పరమేశ్వరుడు. "నువు భూలోకములో మనిషిగా జన్మించి ఓ మహత్కార్యాన్ని

నిర్వహించాలని విధి విధానము. లోక కల్యాణము కోసము ఓ ఘనకార్యాన్ని సాధిస్తావు. అగ్నిపునీతుడివై తిరిగి కైలాసానికే చేరుకుంటావు".

"అదెలా స్వామీ ?"

"నీవు నిరంతరము పూజిస్తున్న పార్వతీదేవి భూలోకములో మానవిగా జన్మిస్తుంది. విశ్వమానవ కల్యాణం కోసం ఆమె శరీరం అగ్నిజ్వాలల కాహుతై పోతుంది. ఆమెతో పాటు శాపవిముక్తుడవైతావు. నీ జాతికి చెందిన నూటారెండు గోత్రీకులు గూడా పార్వతి వెంట అగ్నిప్రవేశం చేసి కైలాసం చేరుకుంటారు. అంతవరదాకా వేచి ఉండక తప్పదు" తరుణోపాయం సెలవిచ్చాడు.

ఈశ్వరాజ్ఞానుసారము కలియుగారంభములో సమాధిముని మానవుడుగా జన్మించాడు. వర్తక వ్యాపారాల్లో నిష్ణాతుడైనాడు. భార్యాపిల్లలతో సంసార సాగరాన్నీదుతున్నాడు. పిల్లలు పెరిగి పెద్దవారయారు. ఈతిబాధలు భరించలేక సంసార బాధ్యతలు కుమారుల కప్పగించి తపస్సు కోసం అడవుల నాశ్రయించాడు. అదొక కీకారణ్యము, హిమాలయ సానువుల్లో ఉంది.

మృగాలు యధేచ్ఛగా తిరుగుతుంటాయి. మానవసంచార ముండదు. తపస్సుకు అనువైన స్థలాన్ని వెతుక్కుంటూ ఓ చెట్టు కిందికెళ్లాడు.

"ఎవరు నువ్వు ?" వెనుకనుండి అరుపు.

హడలిపోయి వెనుదిరిగాడు. మనిషి ... మహారాజులాగున్నాడు. ఓ మూలన కూచున్నాడు.

"నువ్వెవరు ?" ధైర్యంగా అడిగాడు. దయ్యమో, భూతమో మానవాకారములో ఉందనుకున్నాడు.

"నాపేరు సురధుడు. ఓ రాజ్యానికి పాలకుడిని. విధివంచితుడిని. శత్రువులు నా రాజ్యాన్ని వశపరుచుకుని నన్ను తరిమేశారు. నా భార్యాపిల్లలేమయారో తెలీదు. దిక్కుతోచక ప్రాణాలరచేతిలో పెట్టుకుని ఇటు వచ్చాను" అన్నాడతడు.

కాస్సేపిద్దరూ ఒకరినొకరు పరిశీలనగా చూసుకున్నారు. సురధుడు లేచి సమాధి ముందు కొచ్చాడు. ఇద్దరూ మనుషులనే నమ్మకం కుదిరింది. కనుసైగలతో అక్కడే కూచున్నారు.

"మరి ... నువ్వెవరు ?" అడిగాడు సురధుడు.

సమాధికి పూర్తిగా నమ్మకం కుదిరింది. నోరు విప్పాడు.

"నాపేరు సమాధి, నా వృత్తి వ్యాపారము. అశాశ్వతమైన సంసార సుఖాలే

శాశ్వతమనుకున్నాను. వర్తక – వాణిజ్యాల్లో శక్తియుక్తులు ప్రయోగించి కోటీశ్వరుడి నయాను. పరమేశ్వర ప్రసాదమైన ఆస్తిపాస్తుల్లోంచి కొన్ని సమాజ పరమేశ్వరుని కర్పించాలను కున్నాను. ప్రజా సహకారంతో సంపాదించిన ద్రవ్యం లోంచి కొంత దానధర్మాల కుపయోగించాలను కున్నాను. కాని ... పెద్దవారైన నా పుత్రులు అందుకు వ్యతిరేకించారు. నా భార్య గూడా పుత్రులకే మద్దతు పలికింది. దివారాత్రాలు శ్రమించి, ప్రమాదకరమైన నౌకాయానం చేసి బోలెడంత సంపాదించి పెట్టాను. నా కష్టార్జితాన్ని కొంతైనా సంత్కార్యాలకుపయోగించ లేక పోయాను. ఎన్నాళ్లున్నా ఇంతే కదా ! అని మనసు రోసింది. అంతరాత్మ పిలుపు విన్నాను. ఐహిక బంధాలొదులుకున్నాను. భార్యా బిడ్డల్ని వదిలేసి ధర్మక్షేత్రమైన ఈ హిమగిరుల నాశ్రయించాను... మహాషయా !" విచార వదునుడైనాడు.

"అయితే ... మనిద్దరి పరిస్థితి ఒక్కటేనన్నమాట" సురధుడన్నాడు.

ఒకరికొకరు దిక్కై మిత్రులయారు. ఏమి చేయాలో తోచక అడవిలో సంచరి స్తున్నారు. ఓరోజు సుమేధ మహర్షి ఎదురైనాడు. వారి దీనగాధలు విని చలించిపోయాడు.

"మీరిద్దరూ ఆదిశక్తిని ప్రార్థించండి. తపస్సు చేసి ఆ మాతను మెప్పించండి. మీకు శుభం కలుగుతుంది" సలహా యిచ్చి మంత్రోపదేశం చేశాడు.

ఇద్దరూ ఓకే చోట ... ఆదిశక్తి కోసం కఠోర తపస్సు ప్రారంభించారు. ప్రకృతి బీభత్సాలకు వెరవక, క్రూరజంతు సంచారానికి భయపడక నియమనిష్ఠలే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా తపమాచరించారు. వారి భక్తికి, పట్టుదలకు సంతసించి ఆదిశక్తి ప్రత్యక్షమైంది. ఇద్దరి దీనగాథల నవలోకించుకుంది. ఏం కావాలో కోరుకొమ్మంది. సురధుడు తన రాజ్యాన్ని కోరుకున్నాడు. తథాస్తు, అంది ఆదిశక్తి.

"పుత్రా ! నీకేం కావాలో కోరుకో !" అడిగింది సమాధిని.

"తల్లీ !" సమాధి ఆనందోత్సాహం అంతా ఇంతా కాదు. "నీ దివ్యమంగళ రూపాన్ని చర్మచక్షువులతో వీక్షించే భాగ్యం కలిగింది. ఈ జన్మకిదిచాలు. శాశ్వతానంద దాయకమైన మోక్షాన్ని ప్రసాదించు తల్లీ !" అడిగాడు.

ఆదిశక్తి ముఖకాంతులు అనుపమానము. సకల కళా శోభిత చిరునవ్వులు చిందించి గతాన్ని గుర్తు చేసింది.

"కుమారా ! గత జన్మలో నీవు మహామునివి గదా ! శాపగ్రస్తుడివై భూలోకములో మానవుడివై జన్మించావు గదా !"

సమాధికంతా గుర్తుకొచ్చింది.

"అవును మాతా ! నాకు శాపవిమోచన మెప్పుడమ్మా ?"

"వత్సా ! నా అంశతో పార్వతీదేవి ఈ భూలోకములో మానవిగా జన్మిస్తుంది. వాసవి పేరుతో చరితార్థురాలవుతుంది. ఆమె జన్మించడము, అవతార సమాప్తి అన్నీ నీకు గోచరిస్తాయి. అంతవరదాకా తపస్సుతో గడిపెయ్. మహా తపస్సంపన్నుడివైపో. ఆమెతో పాటు నీగ్గూడా శాపవిమోచన మవగానే కైలాసవాసం ప్రాప్తిస్తుంది" వివరించి ఆశీస్సులందించింది ....

పర్వతాసనమ్మీద ప్రశాంతంగా కూచుండి వినీలాకాశంవైపు దేనికోసమో ఎదిరి చూస్తున్న సమాధి మనసు తెరపై గతానుభవాలు రంగులచిత్రాల్లా కదలాడాయి.

అలనాటి దుర్వాసమహర్షి శాపవిముక్తి, నాటి ఆదిశక్తి ఆశీస్సులు ఫలించే సమయమాసన్నమైందని గోచరించింది. ఆదిశక్తి రూపాల్లో ఒకటైన కన్యకా పరమేశ్వరి అంశతో వాసవిగా జన్మించిన పార్వతి, శచీదేవి రూపలావణ్యంతో అగ్నిప్రవేశం చెయ్య బోతుందని అంతరాత్మ ఘోషించింది. అంతరాళాల్లో ఉత్సాహం ఉరకలేసింది.

"ఆదిశక్తీ ! జగన్మాతా ! ధన్యోస్మి తల్లీ !" మనసులోనే తలచుకుంటూ చేతులు ఆకాశానికెత్తి నమస్కరించాడు.

"శంకరా ! అభయంకరా ! వెల్తున్నాను స్వామీ ! అమ్మవారి అవతార సమాప్తితో నాకు విముక్తి గదా ! త్వరగా వచ్చి నీ పాదాలచెంత పరవశిస్తాను స్వామీ!" గొణుక్కున్నాడు. తల్లి ఒడిలో చేరేందుకు తహతహలాడ్తున్న పసిబాలుడిలా ఒక్క ఉదుటున పర్వతమ్మీంచి దూకేశాడు. తప్పటడుగులతో పరుగులెడుతున్న పసిపాపలా పెనుగొండ కభిముఖంగా నడకసాగింది.

"విజయసింహా !" విష్ణువర్ధనునికి ఒళ్లంతా ముళ్లు గుచ్చుకున్నట్టుంది. ముందున్నది తన ప్రధానమంత్రి అనీ, అతన్తో మర్యాదగా మాట్లాడాలనే ఇంగితజ్ఞానం అడుగంటింది. పిలుపు అరుపులాగైంది. "పెనుగొద సమాచారమేమిటి ? అక్కడ మన భటులు, వేగులు ఏం చేస్తున్నారటా ?" కల్లుదాగిన కోతి నిప్పులు తొక్కినట్టుంది అతని వాలకం.

"మహారాజా !" విజయసింహుని చూపులు నేలకు వాలాయి. "పెనుగొండలో ఏమి జరుగుతుందో ఏమో ! ఏ సమాచారమూ రావడం లేదు. బావిలోపడ్డ గుండ్రాళ్లలా మనమక్కడ ఉంచిన భటులు, ఇక్కడినుండి పంపించిన భటులు, గూఢాచారులు అటే

పోయారు. ఇంతకూ మనం పంపిన వారక్కడికి చేరుకున్నారా లేదా అనేది అగమ్య గోచరంగా ఉంది ప్రభూ !" సవినయంగా మనవి చేశాడు.

"ఛీ ... !" ఆసనమ్మీద కూలబడ్డాడు ... మహారాజు.

వాసవి రూపలావణ్యం మెదడు పొరల్లో తళుక్కుమంది. నవ్వుతూ, కవ్విస్తూ పరుగెడుతోంది కాలి అందియల ఘల్లు ఘల్లులు గాజుల గలగలలతో మిళితమై లయబద్ధంగా వినిపిస్తోంది. మనసు ఆరాటం, కోరిక పోరాటం ... సమాచారలోపం ... పిచ్చెక్కి పోతోంది.

"సరే ! ఇక మనమే యుద్ధ సన్నద్ధులమై బయలుదేరుదాం. మనమిచ్చిన గడువు గూడా ముగిసిపోయింది గదా ! వాసవితో వివాహము పెనుగొండ విధ్వంసానికి ముందో, వెనకనో అక్కడే తేల్చుకుందాం. పదండి" ఆదేశించాడు.

విజయసింహుడు మంత్రిమండలి, సేనాధికారులతో సమావేశమయాడు. రాజాజ్ఞను వినిపించి యుద్ధానికి ఆదేశాలు జారీ చేశాడు. అంతకు ముందే సైనిక బలగాల నప్రమత్తంగా ఉంచారు కాబట్టి తెల్లవారకముందే బయలుదేరేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాణి విమలాదేవి దుఃఖదేవతైపోయింది. పూజాగదికి పరిమితమై పోయింది. రాజనరేంద్రుడు తల్లినూరడిస్తున్నాడు.

రాత్రి ... పొద్దుబోయింది.

మానసికాందోళనకు సురాపానం తోడై విష్ణువర్ధనునికి అయోమయంగా ఉంది. నిద్ర వచ్చీరానట్టుగా ఉంది. మత్తు మందు ఎంత సేవించినా పూర్తి ఉపశమనం లభించలేదు. విరహవేదనతో ఒళ్లు వేడెక్కిపోతోంది.

హమ్మయ్య ! అతి ప్రయత్నమ్మీద ... అర్ధరాత్రి నిద్రాదేవి కరుణించింది. కన్నంటుకుంది. కన్నంటుకోగానే కలత నిద్ర. కలలో ఆదిశక్తి కనిపించింది.

"తల్లీ ! నేనీ విరహబాధను భరించలేను. నన్ను కరుణించుమాతా !" ప్రార్థించాడు ఆత్రంగా.

"వత్సా !" ఆదిశక్తి ఆప్యాయంగా పలుకరించింది. "నేనే కన్యకా పరమేశ్వరిని. తెల్లవారకముందే పెనుగొండకు బయలుదేరు సరియైన సమయానికి చేరుకుంటావు. నీ బాధలు, బాదరబందీలు అన్నీ తీరిపోతాయి. వీటినుండి శాశ్వత విముక్తి లభిస్తుంది" ఆశీర్వదించి అదృశ్యమై పోయింది. నిద్రాదేవి విడిపోయింది.

గబుక్కున లేచికూచుని మురిసిపోతున్నాడు విష్ణువర్ధనుడు. సమధికోత్సాహముతో తయారైనాడు. తెల్లవారక ముందే సైనిక బలగాలతో పెనుగొండకు పయనమయాడు.

తూరుపు ఆకాశం కాషాయకాంతులు సింగారించుకుంది. సూర్యభగవానుడు సప్తాశ్వరథారూఢుడై కాంతి కిరణాలను వెదజల్లుతూ ఆసక్తిగా బయలుదేరుతున్నాడు. ఎన్నడూ కనీవిని ఎరుగని సంఘటన నారోజే చూడబోతున్నాననే ఉద్విగ్నత ఒళ్లంతా కళ్లు జేసింది.

మాఘ శుద్ధ విదియ శుభారంభ మవుతోంది.

పెనుగొండ పట్టణము ఒళ్లు విరుచుకుంటుంది. విశాలమైన బ్రహ్మకుండములో అగ్నిగుండాలు యజ్ఞగుండాలుగా తయారై ఉన్నాయి. అక్కడ అలనాడు జరిగిన పుణ్యకార్యాన్ని ఆ ప్రదేశం గుర్తు చేసుకుంటూ పులకించిపోతోంది.

పూర్వ సృష్టి ఆరంభములో ఆదిశక్తి త్రిమూర్తులకు ఎవరి బాధ్యత వారికప్పగించింది. తనకప్పగించిన ప్రాణికోటి సృష్టి బాధ్యతను సమర్ధవంతముగా నిర్వహించాలనే పట్టుదల బ్రహ్మదేవుడిలో బలం పుంజుకుంది. కొన్ని యుగాలు గడిచిం తర్వాత భారతభూమి, గోదావరి నదీతీర ప్రాంతములో దివ్యమైన యజ్ఞాన్ని నిర్వహించాడు. చతుర్ముఖుని యజ్ఞానికి దేవతలంతా సాక్షులయారు. సంతసించారు. యజ్ఞ నిర్వహణ బాధ్యతను కుమారస్వామి కప్పగించారు. అతడా బాధ్యతను నిర్వహిస్తూ ముందుగా అగ్నిచక్ర మేర్పాటు చేశాడు. అక్కడే బ్రహ్మ కుండము ఏర్పాటైంది. అది మామూలు యజ్ఞం కాదు. బ్రహ్మ యజ్ఞం.

అప్పుడే గోదావరి నదిలో ఒక తామర తూడునకు మూడురంగుల కమలా పుష్పాలు పుట్టి వికసించాయి. ఆ ఎరుపు, తెలుపు, నలుపు రంగులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు సంకేతాలైనాయి. ఆ ప్రదేశమే బ్రహ్మకుండముగా వాసికెక్కింది. ... బ్రహ్మస్వరూపుడైన భాస్కరాచారి ఆ ప్రదేశాన్ని ధర్మరక్షణకు కర్మక్షేత్రముగా ఎంపిక చేశాడు. వాస్తుపండితుడైన మల్హణునిచే అగ్నిగుండా లేర్పాటు చేయించాడు.

ప్రతి గుండము అడుగున చందనము చెక్కలు పరిచారు. వాటిపై కర్పూర తైలము, కర్పూరము పొడి చల్లారు. ప్రతిగుండము వద్ద పూజా ద్రవ్యాలుంచారు.

సూర్యోదయము నుండే మునీశ్వరులు, తపస్సంపన్నులు అక్కడికి చేరుకుంటున్నారు. వైశ్యప్రముఖులు, సాధారణ జనాలు తండోపతండాలుగా వస్తున్నారు.

తమ మహారాజు మహాభినిష్క్రమణాన్ని కళ్లారా చూడాలని సామంత రాజ్యాల ప్రముఖులంతా తరలి వచ్చారు.

ధ్యానములో నిమగ్నమై యున్న వాసవి వదనారవిందము దివ్యతేజస్సు సంతరించుకుంది.

అగ్నిగుండాల బ్రహ్మక్షేత్రము చుట్టూ పచ్చని పందిళ్లు వేయించారు. ఆకులు, పూలమాలలతో అలంకరించారు. అవి కనువిందుచేస్తూ అందరికీ స్వాగతం పలుకు తున్నాయి.

బ్రహ్మకుండము మధ్యభాగములో ప్రధాన గుండముంది. ఒకవైపు ప్రధాన గుండముతో కలిపి తొమ్మిది, మరోవైపు ఎనిమిది, మరో రెండు పక్కల రెండేసి గుండాలున్నాయి. ఆరు మూలలలోను చక్రాకారముగ ఆరు, వర్తులాకారముగ పన్నెండు, నాల్గు మూలలకు అరవైనాల్గు గుండములు ధర్మక్షేత్రాన్ని యజ్ఞక్షేత్రముగా చూపిస్తున్నాయి. గుండములు ఏర్పాటులో కళానైపుణ్యము, ఆధ్యాత్మిక వాతావరణము ఆకట్టుకుంటుంది. మహనీయుడైన మహాశిల్పి రూపొందించిన గుండాలు చిత్రవస్త్ర గంధాక్షత ధూపదీపాలతో, అరటి స్తంభాలతో చూపరులకు దివ్యానుభూతి నిస్తున్నాయి. చూసిన వారంతా చేతులెత్తి నమస్కరిస్తున్నారు.

పెనుగొండ పట్టణము శివారు ప్రాంతాలను కలుపుకుని నగరముగా రూపొందింది. నగరములోని ముఖ్య సువాసినులు, పెళ్లీడు కొచ్చిన ఆడపిల్లలు అంతః పురము చేరుకుని వాసవిని అలంకరిస్తున్నారు. సుమనోహర సౌందర్యరాశి సున్నిత శరీరము భయంకరమైన అగ్నిజ్వాలల కాహుతి కాబోతుందనే సత్యాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. దుఃఖాన్నాపుకోలేని కొందరు గొల్లుమంటున్నారు. కొందరు వాసవిని మనసారా ఒడిలోకి తీసుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నారు. అందరినీ వాసవే ఊరడింప జేస్తోంది.

ముహూర్తము సమీపిస్తోంది. వాసవి రూపము కోటి సూర్యప్రభలతో వెలిగి పోతోంది. దుఃఖిస్తున్న వనితలను చిరునవ్వుతో పలుకరించి వీపులు నిమురుతోంది. వనితల ఆందోళన మటుమాయమైంది. అంతా శాంతించారు. వారి కంటికి వాసవి అప్పుడే దివినుండి భువికి దిగివచ్చిన పార్వతీదేవిలా కనిపించింది. ఇంద్రాణి శచీదేవి అందచందాలన్నీ ఆమెలో గోచరించాయి. దుఃఖం దివ్యానుభూతిగా మారింది. వారంతా పారవశ్యంతో చేతులెత్తి నమస్కరించారు. ఆ తర్వాత వాసవి చిరునవ్వుల బాలాకుమారిగా కనబడింది.

కుసుమగుప్త దంపతులు పూజాగది నుండి బయటి కొచ్చారు. చివరి దర్శనానికి వచ్చిన ప్రజలను ప్రేమగా పలుకరిస్తూ, ఎవ్వరూ బాధపడవద్దనీ, అంతా మంచికే జరుగుతుందని నచ్చజెపుతూ సెలవు తీసుకుంటున్నారు.

పెనుగొండలో విచిత్రమైన వాతావరణముంది. ఒకవైపు ప్రజారంజకుడైన మహారాజు కుటుంబ సభ్యుల దేహత్యాగ నిర్ణయము బాధ, మరోవైపు ధర్మ సంరక్షణా నందము... ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వాసవి ప్రవచించిన అహింసో పరమో ధర్మః సిద్ధాంతాన్ని నెమరేసుకుంటూ తన్మయులవుతున్నారు.

వైశ్యోత్తములంతా స్నాన సంధ్యాదులు ముగించుకుని, దాన ధర్మాలాచరించి సంతోషముతో బయలుదేరుతున్నారు. అగ్నిప్రవేశం చేయనున్న దంపతులను పట్టు వస్త్రాలతో అలంకరింప జేసి మంగళహారతులిచ్చి వెంట తీసుకెల్తున్నారు.

కుసుమగుప్త దంపతుల అంతరాళాల్లో ఏ వికారమూ లేదు. మనసు శుభ్రజ్యోత్స్న లాగుంది. ఆశించిన వారికి ధన కనక వస్తు వాహనాదులు దానం చేస్తూ మానవాత్మలో పరమాత్మను దర్శించుకున్నారు. బ్రాహ్మణులకు గోదాన భూదానాలు చేసి ఆశీస్సు లందుకున్నారు.

సైనిక బలగాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయి. రక్షణ దళాలు సరిహద్దుల్లో గస్తీ తిరుగుతున్నాయి. బాలనగరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సామంతరాజ్యాల నుండి వచ్చిన నగరస్వాములు వారి రాజ్యాలనుండి వచ్చిన వారికి ఏర్పాట్లుచేస్తూ బ్రహ్మకుండము వద్ద వారిని వరుసల్లో కూచోబెడ్తున్నారు. ఇంతకు ముందెన్నడూ కనీవిని ఎరుగని సత్యాగ్రహాన్ని, బలిదానోత్సవాన్ని కళ్లారా చూసేందుకు ఆకాశమైదానములో దేవతలు, గంధర్వులు, కిన్నెర కింపురుషులు గుంపులుగా గుమిగూడుతున్నారు.

కుసుమగుప్త మహారాజు ఇష్టమైన పట్టువస్త్రాలు, ఆభూషణాలు, రత్నఖచిత కిరీటాన్ని ధరించి పూజాగదిలోకెళ్లాడు. కుసుమాంబ వెంట ఉంది. కన్యకా పరమేశ్వరికి పాదాభివందనం చేశారు. కిరీటాన్ని అమ్మవారి పాదాల చెంత ఉంచారు. మేళతాళాల వాయిద్యాల మధ్య బయటికొచ్చారు. గృహలక్ష్మికి భక్తితో నమస్కరించారు.

సర్వాంగ సుందరముగా అలంకరించి తయారుగా ఉన్న ఏనుగుల నెక్కి కూచున్నారు. బలగాల మధ్య బయలుదేరారు. అదొక శోభాయాత్రగా రూపుదిద్దుకుంది.

షోడష కళాప్రపూర్ణ వాసవి వనితలు వెంటరాగా బయటికొచ్చింది. నాదస్వరాల మధ్య పల్లకినెక్కింది. తల్లిదండ్రుల వెంట జనసందోహముతో బయలుదేరింది. అందరి మనసుల్లో వాసవి దేవదూతగా నిలిచిపోయింది. ఆమెనే చూస్తూ వెంటనడుస్తున్నారు.

ఉద్వేగాన్నాపుకోలేక చేతులెత్తి నమస్కరిస్తున్నారు. తమ సొంత కూతురును అత్తవారింటికి సాగనంపుతున్నట్టు భావిస్తున్నారు.

అంతా కలిసి నగరేశ్వరస్వామి ఆలయానికెళ్లి నమస్కరించారు. పూజారులు వేదమంత్రాలు పఠిస్తూ పూజలు చేశారు. ముగ్గురూ కలిసి నగరేశ్వరస్వామి – వింధ్య వాసినికి పాదాభివందనం చేశారు. కుసుమగుప్త దంపతులు గర్భగుడినుండి బయటకు రాగా వాసవి వింధ్యవాసిని ముందు నుంచుంది. వింధ్యవాసిని మోము వికసించింది.

"వాసవీ ! నీకూ – నాకు తేడా ఏముంది ? నన్నిక్కడ అలంకార ప్రాయముగా ఉంచావు గదూ ! మానవాళి శ్రేయస్సుకోం మహాభినిష్క్రమణానికి తయారైనావు గదూ! శుభమస్తు – లోకకల్యాణమస్తు, బయలుదేరు" మాటలు వాసవికి మాత్రమే వినిపించినై. తనలో తాను నవ్వుకుంది వాసవి.

ఆ తర్వాత కోనకమలాదేవి సహిత శ్రీ జనార్ధనస్వామి ఆలయానికెళ్లారు. సాష్టాంగ ప్రణామమాచరించి ఆశీస్సులందుకున్నారు. గోదావరి వరదలాగైన ప్రజా సమూహముతో పెనుగొండ వీధులగుండా ఊరేగుతూ బ్రహ్మకుండము చేరుకున్నారు.

ఉదయమే తయారైన సిద్ధవైశ్య దంపతులు, బంధువులతో సహా భాస్కరాచారి ఆశ్రమానికెళ్లి గురువుగారి ఆశీస్సులందుకున్నారు. తమ సంతానానికి, బాలనగరులకు ధర్మోపదేశము చేశారు. తమ సంపదల్లోని సగభాగము కుటుంబాల కుంచుకుని మిగితా సగభాగాన్ని దానధర్మాల కుపయోగించాలని, వారసుల నుండి వాగ్దానాలు తీసుకున్నారు. కులగురువు భాస్కరాచారిని తోడ్కొని ఊరేగింపులో కలిసి బ్రహ్మకుండము చేరుకున్నారు.

బ్రహ్మకుండము పెద్ద మైదానము. అగ్నిగుండాల చుట్టూ అందరూ కూచుని చూసేలా తగు ఏర్పాట్లున్నాయి. రావల్సిన వారంతా వచ్చి తమతమ స్థానాల నాక్రమించారు. పరమేశ్వర స్తుతి, ప్రణవనాదము, శంఖానాదము, మంగళవాద్యాలు మనసుల్లో ఉదాత్త భావాలు రేకిత్తిస్తున్నాయి.

జనసందోహాల హావభావాలను మనోనేత్రాలతో తిలకిస్తూ భాస్కరాచారి ప్రధాన గుండము వద్దనున్న ప్రత్యేకాసనాన్ని అలంకరించాడు. తల్లిదండ్రుల వెంట వాసవి అక్కడికి చేరుకుని సామాన్య జనమనోభావాలను ముఖకవళికలను బట్టి చదివేసింది. శిరస్సు వంచి అందరికి నమస్కరించింది. సంపెంగలాంటి ముక్కుచివర కెంపుల ముక్కుపుడక ఆకాశంలో అంగారక నక్షత్రములా మెరిసింది.

"దయచేసి మాకోసం ఎవ్వరూ బాధపడొద్దు. నేను మీ ఇంటి ఆడపడుచును. నన్ను సంతోషంగా సాగనంపండి. *"త్యాగేనైకే అమృతత్వం మానశుః"* అంటుంది

కైవల్యోపనిషత్తు. త్యాగము చేతనే మోక్షము లభిస్తుంది. భారతనారి సంయమనానికి ఏలిక, సమరాంగణములో కాళిక ... అని గుర్తుంచుకోవాలి. నా పోరాటం ఫలితంగా కామాంధుడైన విష్ణువర్ధనునికి తగిన శాస్తి జరిగి తీరుతుంది. ధర్మ సమరాంగణములో విజయం మనదే. ఇప్పుడు పెనుగొండ ధర్మక్షేత్రము. మా బలిదానాలతో పవిత్ర పుణ్య క్షేత్రమవుతుంది". చిరునవ్వులు చిందిస్తూ విన్నవించుకుంది.

కుసుమగుప్త దంపతులు సహా నూటారెండు గోత్రాల వైశ్యదంపతులు తమకు నిర్దేశించిన గుండముల ముందున్నారు. వారందరి ఎదలో భక్తిభావం, పెదాలమీద పరమేశ్వర స్తుతి కదలాడుతోంది. భాస్కరాచారి ఆదేశముతో పెనుగొండలోని వరిష్ఠ నగరస్వామి ముందుకొచ్చి అందరికీ నమస్కారం చేశాడు. దేహత్యాగ క్రతువుతో పునీతమై మోక్షము నొందే దంపతుల పేర్లు ప్రకటిస్తూ ఏ జంట ఏ గుండము వద్ద ఉన్నారో తెలియజేస్తున్నాడు.

"మొట్టమొదట పెనుగొండ సామ్రాజ్యాధినేత, మహారాజు శ్రీశ్రీ కుసుమగుప్తుల వారు, వారి ధర్మపత్ని మహారాణి కుసుమాంబ గారున్నారు. వారితోపాటు వారి గోత్రానికే చెందిన అభిరామాంబ – రామచంద్ర శ్రేష్ఠి గారలు మహారాజు దంపతుల ననుసరిస్తారు. మిగితా గుండముల వద్దనున్న దంపతుల వివరాలివి.

2. చంద్రలేఖ – శృంగాఖ్య శ్రేష్ఠి
3. రాజముఖి – రాజ శ్రేష్ఠి
4. విమలాంబ – కపిల శ్రేష్ఠి
5. హలకాంబ – పార్థివ శ్రేష్ఠి
6. కమలాక్షి – సమ్మద శ్రేష్ఠి
7. ధర్మాంబ – ఉత్తమ శ్రేష్ఠి
8. అనుమిత – ఆనంద శ్రేష్ఠి
9. నీలవేణి – భాసుర శ్రేష్ఠి
10. సమదర్శిని – సోమద శ్రేష్ఠి
11. అమృతభాషిణి – గౌతమ శ్రేష్ఠి
12. కంబుకంఠి – గౌర శ్రేష్ఠి
13. కుముదవల్లి – సుదర్శన శ్రేష్ఠి
14. ధనలక్ష్మి – ధన శ్రేష్ఠి
15. చంచలాక్షి – పావన శ్రేష్ఠి
16. కమల – గౌర శ్రేష్ఠి
17. కుందవదన – గోవింద శ్రేష్ఠి
18. అర్కాంబ – మల్లాఖ్య శ్రేష్ఠి
19. శ్యామల – కృష్ణ శ్రేష్ఠి
20. కాళీదేవి – కాళకంఠ శ్రేష్ఠి
21. కమల – గజసత్య శ్రేష్ఠి
22. కీర్తికాంత – ఉత్పలాక్ష శ్రేష్ఠి
23. లోలాంబ – లోకాహ్వాయ శ్రేష్ఠి
24. తనుమధ్య – దృతసత్వ శ్రేష్ఠి
25. బాలమణి – బలదేవ శ్రేష్ఠి
26. హేమాంగి – మత్స్యధ్వజ శ్రేష్ఠి
27. మణిమంజరి – ఆదిత్య శ్రేష్ఠి
28. మోహనాంగి – సుందర శ్రేష్ఠి
29. కళావతి – చంద్రాఖ్య శ్రేష్ఠి
30. పావని – చంద్రబాణ శ్రేష్ఠి
31. చంద్రకళ – చంద్రమౌళి శ్రేష్ఠి

32. సోమప్రభ - సింహధ్వజ శ్రేష్ఠి
33. బాలామణి - జనార్ధన శ్రేష్ఠి
34. భూమాంబ - బ్రహ్మ శ్రేష్ఠి
35. మంజువాణి - సుందర శ్రేష్ఠి
36. సుదర్శిని - పాదాఖ్య శ్రేష్ఠి
37. పల్లవపాణి - వల్లభ శ్రేష్ఠి
38. మణిమాల - ఘనముఖ శ్రేష్ఠి
39. భ్రమరామణి - దంతునామార్యులు
40. హేమరేఖ - స్వర్ణరథ శ్రేష్ఠి
41. సుబోధిని - సింహసేన శ్రేష్ఠి
42. ధనాదాంబ - మూల్యాఖ్య శ్రేష్ఠి
43. నీలాంబ - నందాఖ్య శ్రేష్ఠి
44. ధనలక్ష్మి - ధనద శ్రేష్ఠి
45. పల్లవాంబ - పాలాహ్వయ శ్రేష్ఠి
46. పోతాంబ - భోగాఖ్య శ్రేష్ఠి
47. కనకాంగి - కుముద శ్రేష్ఠి
48. చంద్రముఖి - పాలాఖ్య శ్రేష్ఠి
49. పుష్పాంబ - భువన శ్రేష్ఠి
50. రుక్మావతి - పావన శ్రేష్ఠి
51. చిత్రాంగి - విన్నవరేణ్య శ్రేష్ఠి
52. చిత్రలేఖ - కుశల శ్రేష్ఠి
53. బింబాధరి - పీనవక్ష శ్రేష్ఠి
54. ఇభయాన - నాగాఖ్య శ్రేష్ఠి
55. పల్లవాంబ - భోగాఖ్య శ్రేష్ఠి
56. పృథ్వీదేవి - పృథునామ శ్రేష్ఠి
57. విన్నాంబ - విశ్వనాథ శ్రేష్ఠి
58. విచక్షణాంగి - దక్షిణాహ్వయ శ్రేష్ఠి
59. భామామణి - భాస్కర శ్రేష్ఠి
60. పిప్పలాంబ - నాగధ్వజ శ్రేష్ఠి
61. సరస్వతి - సరస శ్రేష్ఠి
62. నారీమణి - నాగాఖ్య శ్రేష్ఠి
63. కమలాంబ - గౌరాఖ్య శ్రేష్ఠి
64. మంజువాణి - గుణపుంజ శ్రేష్ఠి
65. భ్రమరాంబ - బాలాహ్వయ శ్రేష్ఠి
66. నవనీతాంగి - విన్నాఖ్య శ్రేష్ఠి
67. అభినవాంబ - అమల శ్రేష్ఠి
68. తారకాంబ - వామన శ్రేష్ఠి
69. వాసంతిక - అర్ధనారీశ్వర శ్రేష్ఠి
70. సుందరి - జీమూత శ్రేష్ఠి
71. పుష్పధామ - విద్యాఖ్య శ్రేష్ఠి
72. భీమాంబ - పృథ్వీ శ్రేష్ఠి
73. విదురాంబ - మాధవ శ్రేష్ఠి
74. రాజ్యలక్ష్మి - ద్రవిణరాజ్య శ్రేష్ఠి
75. సత్యవతి - సత్యసంధ శ్రేష్ఠి
76. మేధాంబ - వీరభద్ర శ్రేష్ఠి
77. గంగాభవాని - విద్యాధర శ్రేష్ఠి
78. మణిశలాక - కందర్ప శ్రేష్ఠి
79. పద్మావతి - పద్మనాభ శ్రేష్ఠి
80. ధనవతి - ధర్మాఖ్య శ్రేష్ఠి
81. అబ్జముకి - జమదగ్ని శ్రేష్ఠి
82. లీలావతి - జనార్ధన శ్రేష్ఠి
83. దంతవతి - అమృతాఖ్య శ్రేష్ఠి
84. రాగమంజరి - రాగాఖ్య శ్రేష్ఠి
85. ఉత్పలాక్షి - పండితార్యులు
86. రాజముఖి - రాజేశ్వర శ్రేష్ఠి
87. దావని - నిర్జలసేవ శ్రేష్ఠి
88. సమశీల - సకలాఖ్య శ్రేష్ఠి
89. చిత్రభాషణి - చిత్రశుభ శ్రేష్ఠి
90. పల్లవాంబ - మల్లాఖ్య శ్రేష్ఠి
91. పద్మగంధి - బాలభాను శ్రేష్ఠి
92. మోహిని - పవిత్రపాణి శ్రేష్ఠి
93. కృష్ణాంబ - నాగాహ్వయ శ్రేష్ఠి

94. మేధాంబ – మార్కండేయ శ్రేష్ఠి
95. జాహ్నవి – జమదగ్ని శ్రేష్ఠి
96. ఇందుముఖి – విద్యాఖ్య శ్రేష్ఠి
97. ప్రోల్లాసిని – పుణ్యరాశి గుప్త
98. పద్మాక్షి – మేఘసేన గుప్త
98. దేవాంబ – భోగ శ్రేష్ఠి
99. చపలాక్షి – సింహముఖ శ్రేష్ఠి
100. చపలాక్షి – సింహముఖ శ్రేష్ఠి
101. చంద్రాంబ – జలదాఖ్య శ్రేష్ఠి
102. ధరణీదేవి – కుమార శ్రేష్ఠి

ఈ పుణ్య దంపతులు తమతమ గుండుముల వద్ద తయారుగా ఉన్నారు. ఇప్పుడు మన కులగురువు బ్రహ్మశ్రీ భాస్కరాచారి వారు ధర్మసందేశాన్నిస్తారు" ప్రకటించి తన స్థానాన్నాక్రమించాడు.

భాస్కరాచారి అపరబ్రహ్మలా కనబడుతున్నాడు. నుదుటి భస్మరేఖల మధ్య సిందూరము బొట్టు, వెండితీగల్లా మెరుస్తున్న పొడగాటి గెడ్డము ... చూడగానే ఎవరికైనా భక్తిభావం కలుగుతుంది.

"నాయనలారా !" విశాల దృక్కులతో అందరినీ విహంగవీక్షణం చేస్తూ ప్రారంభించాడు. "ధర్మో రక్షతి రక్షితః – ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనను రక్షిస్తుంది. ధర్మాన్నాచరించిన వారు మోక్షప్రాప్తికి అర్హులు. కలియుగములో ధర్మదేవత ఒకే కాలుతో నడుస్తుంది. ఇది కలియుగారంభమే. వర్ణాశ్రమ ధర్మాలను ఇప్పటి నుండే సరిగా పాటించి ముందు తరాల వారికి ఆదర్శంగా ఉండాలి. హింస, రక్తపాతముతో ధర్మదేవత గాయపడితే లోకానికి దుఃఖహేతువవుతుంది. వైశ్యజాతికే కాదు, ఇది మానవాళి కంతటికీ ఓ అగ్నిపరీక్ష. ఈ అగ్ని పరీక్షలో ప్రాణాలర్పించి ధర్మాన్ని రక్షించేందుకు వైశ్యజాతి సిద్ధమైంది. ఇది ఆదిశక్తి లీలా విలాసము. సర్వం శక్తిమయం అంటుంది వేదము. ఆదిశక్తి పధ్నాలుగు రూపాలలో కన్యకా పరమేశ్వరి ప్రముఖమైంది. ఆదిశక్తి ఆదేశాను సారమే త్రిమూర్తులు సృష్టి, స్థితి, లయ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. విశ్వమంతా ఆమె సృష్టియే. ఆమెను నియంత్రించే శక్తి మరోటిలేదు. మణి ద్వీపము ఆమె మూల నివాసస్థానము. కల్పవృక్షము ఛాయలో విశాలమైన బంగారు మేడ, మేడలో హేమ పీఠము, హేమపీఠముపై ఆ తల్లి అభయముద్రలో కొలువుదీరి ముజ్జగాలను పాలిస్తుంది. లక్ష్మి, పార్వతీదేవి చెరోవైపు కూచుని వింజామరలు వీస్తుంటారు. చతుష్షష్ఠి కళాదేవత, విద్యాదేవి సరస్వతి మృదుమధుర స్వరాలతో ఆదిశక్తి లీలా విలాసాన్ని గానం చేస్తుంటుంది. వీణా వాయిద్యం ఆ గానానికి తోడై ప్రాణకోటిని అలరిస్తుంది.

బ్రహ్మ సృష్టించిన చాతుర్వర్ణాలు వృత్తిని బట్టేకాని పుట్టుక ప్రాతిపదిక కాదు. మనిషి తనకు జన్మనిచ్చిన వారి వృత్తినే స్వీకరించడం ఆనవాయితీగా మారింది. ముందు

ముందు ఇదే ఆనవాయితీ కొనసాగుతుందనడానికి వీల్లేదు. వేదవ్యాసుల వారు వివరించిన వేదవాఙ్మయ సారాంశమిదే.

పంచభూతాత్మక ప్రపంచములో కనిపించేదేదీ శాశ్వతము కాదు. అశాశ్వతమైన శారీరక సుఖాల కోసం శాశ్వత ధర్మసూత్రాలను మలినం చేయరాదని యోగవాసిష్టము చెబుతుంది.

వేదాధ్యయనం, దానధర్మాలు, సమాజసేవ, యజ్ఞయాగాదుల నిర్వహణ అందరి బాధ్యత. చాతుర్వర్ణాలలో ఒకరెక్కువ, మరొకరు తక్కువని భావించరాదు. ధర్మరక్షణ అందరి బాధ్యత. అదే ధర్మరక్షణ కోసం నేడు వైశ్యజాతి వాసవితోపాటు సన్నద్ధమైంది. వీరందరికీ మోక్షం లభిస్తుంది. శుభంభూయాత్" సందేశము ముగించాడు. ఆ తర్వాత

"మన మహారాజు కుసుమగుప్తుల వారిపుడు తమ చివరి సందేశాన్నిస్తారు" సూచన పూర్వకముగా ఆదేశించాడు.

సుప్రభాత సూర్యకిరణాలు భూమ్మీద పరుచుకున్నాయి. నడుముకు ఒడ్డాణము, పున్నమి వెన్నెలలాంటి మందహాసముతో వాసవి అందరి దృష్టి నాకట్టుకుంటోంది. అద్దాల్లాంటి చెక్కిళ్లు పద్మరాగమణికాంతులై మెరుస్తోంటే అశేషజనావళివైపు చూస్తోంది. కుసుమగుప్తుడు కూతురునోసారి చూపులతో తడిమి ప్రారంభించాడు.

"మహాజనులారా ! సృష్టికార్యము సమస్తము ఆదిశక్తియైన కన్యకా పరమేశ్వరి అమ్మవారి కనుసన్నలలో జరుగుతుంది. ఆ తల్లి సంకల్పములో ధర్మాచరణ ముఖ్యమైంది. గడిచిన యుగాలలో శీల సంరక్షణకోసం వేదవతి, శీలపరీక్ష కోసం సీతామాత అగ్ని ప్రవేశం చేశారు. ఈ యుగములో మా ముద్దుల కూతురు వాసవి వేదవతి ననుసరిస్తోంది. విధి విధానాన్ననుసరిస్తూ ఆమె వెంట మేమున్నాము. ధర్మాచరణలో భాగమైన శాంతి, అహింసా మార్గములో పయనిస్తున్నాము. ప్రాణాలర్పించ బోతున్నాము. వాసవి దీక్ష, త్యాగము మీ ద్వారా ముందు తరాల వారికందుతాయి.

మన ధర్మదీక్షకు ప్రభావితులై మనను నమ్ముకుని మన రాజ్యంలోనే ఉండిపోయిన పద్మశయనపుర భటుల్ని వీరముష్టులుగా, మైలారులుగా ఆదరించాల్సిన బాధ్యత మీ మీద ఉంది. భారత పుణ్యభూమిలో జన్మించే అవకాశమిచ్చిన ఆ కన్యకా పరమేశ్వరికి ధన్యవాదాలర్పిస్తున్నాను. జై ఆదిశక్తి ... జై కన్యకా పరమేశ్వరీ ... !" నినాదాలతో ముగించాడు.

వెంటేనే జై వాసవాంబా ! జైజై వాసవాంబా ! నినాదాలతో బ్రహ్మకుండం మార్మోగింది. జనాలంతా ఉద్విగ్నంగా ఉత్తేజంగా చూస్తున్నారు.

వాసవి ముఖారవిందము వింతకాంతులతో వికసించింది. భాస్కరాచారికి, సభకు చేతులెత్తి నమస్కరించింది.

"గురువర్యా ! అనుమతించండి" శిరస్సు వంచి అడిగింది. భాస్కరాచారి చూపుల్లో భక్తిభావముంది.

"చిరంజీవి వాసవి మానవాళికి, వైశ్యజాతికి అంతిమ సందేశమిస్తుంది" ప్రకటించాడు.

సభలో నిశ్శబ్దం వ్యాపించింది.

సామంత రాజ్యప్రతినిధులు, నగరస్వాములు, అగ్ని ప్రవేశానికి తయారైన దంపతులు, ఆబాలగోపాలము ఎదపొదల్లో సంచలనం చోటుచేసుకుంది. సిద్ధవైశ్య దంపతుల్లో మోక్షానందము నిండి ఉంది. మిగితా వారిలో బాధామయమైన ఆనందోద్వేగము నిండి ఉంది. అంతాకలిసి ఒకేసారి గొంతులు విప్పి "జై వాసవాంబా!" "జై కన్యకా పరమేశ్వరీ !" నినాదాలిచ్చారు. నినాదాలకనుగుణంగా తుములనాదాలు మోగుతూంటే పండితులు వేదమంత్రాలు పఠిస్తున్నారు. అందరి చూపులు వాసవి మీద కేంద్రీకృతమైనాయి.

వాసవిలో విచిత్రమైన కదలిక కన్పించింది. బాలాకుమారిగా నుంచున్న ఆమె ఎత్తుగా ఎదిగింది. ముఖపద్మం సహస్రదళాలుగా విచ్చుకుంది. సిగపూవుగా నెలవంక కొలువుదీరింది. ముత్యాల ముక్కుపుడక వెలుగులు బంగారు కిరీటం దగద్ధగల్లో కలిసి పోతున్నాయి. కళ్ళు మిరిమిట్లుగొలిపే దివ్యకాంతులు అందరినీ స్పర్శించాయి. ఆమె తలచుట్టూ దివ్యప్రభలు ... భుజాలదాకా వ్యాపించాయి. రెండు చేతులకు మరో రెండు చేతులు తోడైనాయి. చతుర్భుజిగా మారింది. ఒకచేతిలో చిలక, మరోచేతిలో పూవు, ఒకచేయి అభయముద్ర, మరోచెయ్యి ఆశీర్వాద ముద్ర ... సకల అలంకార భూషిత ... కన్యకా పరమేశ్వరిగా ప్రత్యక్షమైంది.

జన సందోహములో పట్టరాని ఆనందోత్సాహాలు.

జై కన్యకా పరమేశ్వరీ ! జైజై కన్యకా పరమేశ్వరీ !! జై మాతా ! జైజై మాతా!! జై వాసవాంబా ! జైజై వాసవాంబా !!

గుండెల్ని చీల్చుకు వచ్చిన జయజయ ధ్వానాలు ఆకాశాన్నంటాయి. అద్వితీయ కాంతిపుంజాలతో ...

"భక్తులారా !" కన్యకా పరమేశ్వరి రూపములో వాసవి ఆప్యాయంగా సంబోధించింది. సభ సద్దు మణిగింది. అంతా కలిసి ఒళ్లంతా కళ్లు చేసుకుని చూస్తున్నారు.

ఆహా ! ఏమి మా అదృష్టము... ఆనందడోలిక లూగుతూ చెవులు రిక్కించి వింటున్నారు.

"భక్తులారా ! కన్యకా పరమేశ్వరి రూపములో నున్న నన్ను గుర్తించారు గదూ! వాసవి కారణ జన్మురాలు. ధర్మ రక్షణార్థం కలియుగారంభములో ఇది అనివార్యమైంది. పార్వతీదేవి నా అంశతో, శచీదేవి రూపలావణ్యంతో వాసవిగా జన్మించింది. అగ్ని ప్రవేశమై అవతారం చాలించే సమయమాసన్నమైంది. ఈ నూటారెండు గోత్రాల వైశ్య దంపతులు కైలాసవాసులు. వీరంతా వాసవితోపాటు అగ్నిపునీతులై పార్థివ శరీరాల నొదిలేసి కైలాసానికి చేరుకుంటారు. ఇది విధి విధానం. మీకు శుభం కలుగుతుంది" ఆశీర్వదించి తిరిగి వాసవిగా కనబడింది.

దివ్యతేజస్వరూపాన్ని కళ్లారా చూసిన వారంతా "వాసవాంబనే కన్యకా పరమేశ్వరి ... కన్యకా పరమేశ్వరే వాసవాంబ" అంటూ చేతులెత్తి నమస్కరించారు.

"ఆర్యులారా ! కొన్ని విషయాలు మీకు చెప్తాను. వైశ్యజాతి శ్రద్ధగా వినాలి". వాసవి కన్యకాపరమేశ్వరి గొంతులో తొణుకు బెణుకు లేదు. కాని... ఉల్లాసంగా ఉంది. ఉల్లాసములో గాంభీర్యముంది.

"బంధువులారా ! పూర్వజన్మల శాపాలు, వరాలు ఈ పరిస్థితిని కల్పించాయి. అపరిమితమైన నా అందచందాలు, రూపలావణ్యము విష్ణువర్ధనుడిని మోహాంధకారములో ముంచెత్తాయి గదా ! ఇకముందు ఇంతటి అందచందాలు, రూపలావణ్యము మరే వైశ్య కన్యకూ అబ్బవు. మానవాతీతమైన నా అందచందాలు ఎవరికీ అందిరాకూడదు.

అధర్వవేదంలో చెప్పినట్టుగా మనిషి ఏడు మర్యాదలు పాటించాలి. అవి ఏమనగా (1) దొంగతనము చేయరాదు, (2) వ్యభిచారము చేయరాదు, (3) బ్రహ్మ మార్గములో సంచరించాలి, (4) ఎవరినీ బాధపెట్టకూడదు, (5) దుర్వ్యసనములుండ రాదు, (6) దురాచారము పాటించరాదు, (7) అసత్యమాడే పాపముచేయరాదు.

వైశ్యులు దానగుణము వీడరాదు. సహనమే అభూషణముగా భావించాలి. భుజబలము కంటే బుద్ధిబలమే వైశ్యజాతికి మేలు చేస్తుంది. బలపరాక్రమాలు శాంతిని రక్షించేందుకే ఉపయోగించాలి. ధర్మరక్షణార్థం నేడు అహింసా పథములో పయనిస్తూ దేహత్యాగమనే సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభిస్తున్నాము. ఈ మా ఆత్మాహుతిని విశ్వ జనావళి ఆదర్శంగా తీసుకుంటుంది. మా శాంతి సందేశాన్ని ముమ్ముందు తరాల వారి కందించేందుకు కాలగమనములో శాంతిదూతలు జన్మిస్తారు. మరేవిధంగాను సాధింప జాలని ధర్మవిజయాలను అహింసకు ఆయువు పట్టైన సత్యాగ్రహమనే ఆయుధముతోని



సాధిస్తారు. ఆత్మాభిమానాన్ని రక్షించుకుంటూ త్యాగపథములో పయనించి అనితర సాధ్యులనిపించుకుంటారు.

వేదభూమియైన భారతావని ఆచంద్రతారార్కం వర్ధిల్లుతుంది. ఆటుపోట్లు, విజాతీయుల దురాగతాలను స్వశక్తితో ఎదుర్కొంటూ సనాతన సంస్కృతీ సాంప్రదాయాలను నిలబెట్టుకుంటుంది.

అలనాడు కామాంధుడైన రావణబ్రహ్మ స్పర్శతో మలినమైన దేహాన్ని అగ్ని కాహుతిచ్చిన వేదవతిలా నేడు విష్ణువర్ధనుని కామదాహం చూపులతో అపవిత్రమైన నా దేహాన్ని అగ్నిజ్వాలల కర్పిస్తున్నాను. ఆడపిల్లల తల్లిదండ్రులారా ! భారత స్త్రీ అబల కాదు సబల అని, శీల సంరక్షణకోసం ఎంతకైనా తెగిస్తుందని నేను నిరూపిస్తున్నాను. నా దేహత్యాగం వార్త వినగానే దుష్ట విష్ణువర్ధనుని తల ముక్కలై పోతుంది.

ఆశేష జనావళికి నా నమస్సుమాంజలి. ఇక సెలవు" మరోసారి సభకు నమస్కరించి భాస్కరాచారి వైపు తిరిగింది.

"గురువర్యా ! అనుమతివ్వండి !"

భాస్కరాచారి ఆదేశముతో అగ్నిగుండాలలో శాస్త్ర విధిన అగ్నిపుట్టించారు. శ్రీగంధము చెక్కలతో నిండిన అగ్ని గుండాలలో నిప్పురాజుకుంది. బ్రాహ్మణోత్తములు అగ్నిసూక్తమంత్రాలను పఠిస్తున్నారు. అగ్నిజ్వాలలు దేదీప్యమానమై పైకెగురు తున్నాయి. జనాలంతా ఒకేసారి నినాదాలందుకున్నారు.

జై వాసవాంబా ! జై కన్యకా పరమేశ్వరీ ! వాసవి కన్యకా పరమేశ్వరికి జై ... జయజయ ధ్వానాలు ఆకాశవీధిలో నున్న దేవతలకు వినబడుతున్నాయి.

వాసవిలో నూటారెండు గోత్రీకుల దంపతుల్లో ఆనందోత్సాహాలు ఉరకలేశాయి. ముందు వాసవి ఆ తర్వాత అందరూ నాల్కలు చాచిన అగ్నిజ్వాలలకు నమస్కరించారు.

జైమాతా ... జైజై ఆదిశక్తీ ... గుండెల నిండా నినాదాలిస్తూ వాసవి అగ్నిగుండములో దూకింది. నూటారెండు గోత్రాల దంపతులామె ననుసరించి దూకేశారు.

చూస్తున్న వారి గుండెలు బరువెక్కాయి. కొందరు మూగబాధ ననుభవిస్తూంటే మరికొందరు తట్టుకోలేక బోరమని రోదిస్తున్నారు. జయజయధ్వానాలు మార్మోగుతూనే ఉన్నాయి.

ఆశ్చర్యం ... అసాధారణం ... అపూర్వం ... ఆకాశానికంటబోతున్న అగ్నిజ్వాలలన్నీ చప్పున చల్లబడిపోయినై. జయధ్వానాలతో మార్మోగుతున్న బ్రహ్మకుండము

విస్తుబోయి ప్రశాంతమైపోయింది. ఇప్పటికిప్పుడు ఏం జరిగింది ? అసలేం జరుగబోతోందోనని అంతా ఆసక్తిగా చూస్తున్నారు. అగ్నిగుండాల్లో దూకిన వారు మాయమైన మంటల్ని తలుచుకుంటూ వాసవివైపు చూస్తున్నారు.

"అగ్నిదేవా ! పాపహరణా !" వాసవి భక్తిశ్రద్ధలతో చేతులు జోడించింది. అగ్నిదేవుడు ప్రత్యక్షమైనాడు.

"నిర్మల హృదయా ! ఇదేమిటి ? ఎందుకిలా ఉగ్రరూపాన్ని ఉపసంహరించుకున్నట్టు ? చల్లబడి పోవడమెందుకు ?" అనునయంగా అడిగింది వాసవి.

అగ్నిదేవుడు ప్రతినమస్కారం చేశాడు. కళ్లల్లో అయోమయముంది. వినయ విధేయతలను కూడగట్టుకున్నాడు.

"అమ్మా ... వాసవాంబా ! మీలాంటి ధర్మాత్ముల పవిత్ర దేహాలను కబళించి ఆకలి తీర్చుకోలేను. క్షమించండి."

"పుణ్యపురుషా ! అగ్నిదేవా !" కుసుమగుప్తుడు కల్పించుకున్నాడు. "మేము స్వచ్ఛందంగా దేహత్యాగం చేస్తున్నాము. మాలో ఏదైనా లోపమున్నదా ?"

"లేదు మహారాజా ! మీరు సాధుజీవులు. పవిత్ర హృదయులు. ధర్మవర్తనులైన మీరంతా సద్గుణ సంపన్నులు. ఆదిశక్తి అంశతో పార్వతీదేవినే కూతురుగా పొందిన ధన్యజీవులు."

"మరెందుకు సందేహిస్తున్నారు ?"

"మీలాంటి పుణ్యాత్ములను నా ఆకలిజ్వాలలకు ఆహుతి చేసి ఆకలి తీర్చుకోలేను. పూర్వమోసారి భృగుమహర్షి శాపానికి గురై సర్వభక్షకుడినయాను. సాధుజీవనులైన ఇంత మందిని భక్షిస్తే ... నాగతి ఏమవుతుందోనని భయంగా ఉంది."

"భృగు మహర్షా ! పాపసంహారియైన అగ్నిహోత్రునికే శాపమా ? అదెలా జరిగింది మహానుభావా ?" కుసుమార్యుడడిగాడు.

"మహాశయులారా ! వినండి ఆ వృత్తాంతము !" అగ్నిదేవుడు సంక్షిప్తముగా చెప్పాలనుకున్నాడు. "పూర్వము ఓసారి నేను భృగుమహర్షి ఇంటివద్ద ఉన్నాను. అప్పుడా మహర్షి ఇల్లాలు నిండు చూలాలు. ఇంటివద్ద నన్ను రక్షణగా ఉంచి మహర్షి అడవికెళ్లాడు.

మహర్షి ఇల్లాలు మహాపతివ్రత. ఆమె ఇంటిలో ఉంది. నేను బయట కూచుండి ఏదో ఆలోచిస్తున్నాను. అప్పుడే శుక్రాచార్యుని శిష్యుడు పులోమాసురుడు గబగబా వచ్చి ఇంటిలో చొరబడ్డాడు. నేను ఆలోచనలోంచి తేరుకుని లోపలికెళ్లే లోగా

వాని దుర్బుద్ధి ఊరుకోలేదు. వాడు మహర్షి పత్నిని సమీపించాడు. ఆమె భయంతో గుండెలు బాదుకుంటూ నేలమీద పడిపోయింది. గర్భం జారింది. చ్యవనుడు జన్మించాడు. హృదయ విదారక దృశ్యాన్ని చూడలేక పులోమాసురుడు పారిపోయాడు.

భృగుమహర్షి వచ్చాడప్పుడే. విషయమంతా వివరించి చెప్పాను. ఆ మహర్షి నా పరధ్యానాన్ని క్షమించలేదు. కోపానికొచ్చి "సర్వభక్షకుడివి కమ్మ"ని శపించాడు. ఎంతో బతిమాలాను. శాంతించి పరమేశ్వరుణ్ని ప్రార్థించుమన్నాడు. అలాగే చేశాను. పరమేశ్వరుడు ప్రత్యక్షమై శాపవిముక్తికి దారి చూపించాడు.

అప్పట్నుంచి చాలా జాగ్రత్త వహిస్తున్నాను. అప్పటి చిన్న పొరపాటుకే శాపగ్రస్తుడినాయను. ఇప్పుడిక్కడ ఇందరు వైశ్యమునులు మానవాకారాల్లో ఉన్నారు. ఈ పుణ్యదేహాలను దహిస్తే పాపాత్ముడినై పోతానేమో !"

కుసుమగుప్తుడు అందరి తరఫున నమస్కరించి

"స్వాహానాథా ! మీకలాంటి అనుమాన మవసరం లేదు. ఆనాటి, నేటి పరిస్థితుల్లో తేడా ఉంది. ఇది మా స్వచ్ఛంద దేహ త్యాగము, సత్యాగ్రహము. జగదంబ సంకల్పమిలా ఉంది. స్వచ్ఛందంగా ఎవరికి వారు కోరుకున్నది. అమలిన హృదయుడి వైన నీద్వారా నశ్వరమైన మా శరీరాలను జగత్కల్యాణార్థం త్యాగం చేస్తున్నాము. దయచేసి విశ్వరూపం ప్రదర్శించండి. వేయినాలుకలు చాచి మహాగ్నిజ్వాలలతో మమ్ముల్ని పునీతం చెయ్యండి. మా ఆత్మలను పరమాత్మ చెంతకు చేర్చండి" వేడుకున్నాడు.

అగ్నిదేవుని ఆందోళన మాయమైంది కాని ఇంకా సందేహిస్తున్నాడు. వాసవి స్పందించాలనుకుంది.

"అగ్నిదేవా !" వాసవిలో ఆదిశక్తి కనిపించింది అగ్నిదేవునికి. "సందేహించకు, ఇది విధి విధానము. కలియుగములో శాంతి, అహింసా మార్గాలే మానవాళికి శ్రేయస్కరము. అవే ధర్మాన్ని రక్షిస్తాయి. ధర్మరక్షణ కోసం త్యాగాలు చెయ్యక తప్పదు. ఆ త్యాగఫలమే మోక్షప్రాప్తినిస్తుంది. ఇదే సంగతి చేతల ద్వారా చూపిస్తున్నాము. దీని వల్ల నీకే పాపమూ అంటదు. ఈ త్యాగధనుల ధర్మకార్యానికి సహకరించి కర్తవ్యాన్ని నిర్వర్తించు. ఈ సత్యాగ్రహము భావితరాల వారికి ఆదర్శమవుతుంది. ఇందులో నీవు గూడా భాగస్వామివైపో !" ఆదేశించింది. కన్యకా పరమేశ్వరిగా కనిపించింది.

దివ్యమంగళ స్వరూపమది. సిగపూవుగా నెలవంక, కనకాంబర కాంతులు వెదజల్లుతున్న పచ్చడము, అదే రంగు కంచుకము ధరించి, చతుర్భుజిగా ... సంపూర్ణ దర్శనమిచ్చింది. అభయ హస్తము, మందస్మిత వదనము అందరి నలరించింది.

"చిత్తం తల్లీ ! మీ ఆజ్ఞ శిరోధార్యం !" అగ్నిదేవుడు నమస్కరించాడు.

అన్నిగుండాలలో అగ్నిజ్వాలలు పైకెగురుతున్నాయి. అగ్నిశిఖలు ప్రచండ రూపం దాల్చాయి. శరీరాలు చిటపటమంటున్నాయి. "జై వాసవాంబా ! జై వాసవి కన్యకా ! ..." జయజయ ధ్వానాలతో ప్రదేశం మార్మోగింది.

ప్రధానగుండములోంచి వాసవి గొంతు వినిపించింది. "భక్తులరా ! భయపడకండి" అది వాసవి కన్యకా పరమేశ్వరి స్వరూపము. "పరమశివుని అర్ధాంగినైన పార్వతిని నేను. పవిత్ర లక్ష్యసాధన కోసం మీ మధ్య అవతరించాను. భారత పుణ్య భూమిలో మానవులుగా జన్మించడమంటే దేవతలందరికీ మక్కువనే.

ఈ కుసుమగుప్త దంపతులు కుబేర దంపతులు. నూటారెండు గోత్రాల దంపతులు వైశ్యముని దంపతులు, కైలాసవాసులు. వైశ్యజాతి కీర్తి ప్రతిష్ఠలు ముల్లోకాల్లో స్థిరంగా ఉంటాయి. ఈ వేదభూమిలో జన్మించిన మీరంతా అదృష్టవంతులు.

'ఓం, ఐం, హ్రీం, క్లీం, శ్రీం, హ్లాం, వం .... వాసవి కన్యకే సర్వసౌభాగ్యం దేహి దేహి స్వాహా ...' అనే బీజాక్షర సహిత మంత్రముతో నన్ను ఆరాధించే భక్తులను ఆదుకుంటాను ... "

అంతకు ముందే సమాధిముని అక్కడికి చేరుకుని అంతా చూస్తున్నాడు, వింటున్నాడు. సంతోషాన్ని తట్టుకోలేక "జై వాసవాంబా" "జైజై వాసవాంబా !" అంటూ జయధ్వానాలిచ్చాడు. నూటారెండు గోత్రీకుల దంపతులు అగ్నిమంటల్లో కరిగిపోతూ అవే నినాదాలిచ్చారు.

అక్కడున్నవారంతా సమాధిమునిని ఆశ్చర్యంగా చూస్తున్నారు. అందరి వాలకం గమనించి తనను తాను పరిచయం చేసుకున్నాడా సమాధిముని. ఆ తర్వాత

"మహాశయులారా ! ఈ రోజుతో నేను శాపవిముక్తుడనవుతున్నాను. వాసవి కన్యకా పరమేశ్వరి ఉపదేశించిన మంత్రములో ఓం అనునది ప్రణవబీజము. ఐం, హ్రీం, క్లీం ... అనునవి మహామాయా బీజాక్షరాలు. శ్రీం అనునది కమలాసన బీజము. హ్లాం అనునది చంద్రబీజము. వం అనునది అమృతబీజము.

ఈ మంత్రములో ఎన్ని అక్షరాలున్నాయో అన్ని లక్షల సార్లు జపించిన వారికి విజయం చేకూరుతుంది. 'ఓం, ఐం, హ్రీం, క్లీం, శ్రీం, హ్లాం, వం వాసవే కన్యకే మహ్యాం సర్వసౌభాగ్యం దేహి, దేహి' మూల మంత్రానికి దేహి పదాన్ని చేర్చి ఆరాధించుటే వాసవి యజ్ఞము. ఈ యజ్ఞాన్ని త్రయాహ్నికము అనగా మూడురోజులు గానీ, పంచాహ్నికము అనగా ఐదు రోజులు గానీ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి. ఈ యజ్ఞమును

నూటారెండు హోమగుండములతో నిర్వహించినచో ద్వుత్తరదశ వాసవీ యజ్ఞము అంటారు. ఇది లోకకల్యాణార్థము ఉపదేశింప బడినది" వివరణ ఇచ్చాడు.

ఆ తర్వాత వాసవి అంతర్ధానమవుతున్న ప్రధానగుండము ముందుకెళ్లి "జై వాసవాంబా ! జై వాసవి కన్యకా పరమేశ్వరీ !" నినాదాలస్తూ నమస్కరించాడు.

అంతే ... సమాధిముని అక్కడే అదృశ్యమయాడు.

అగ్నిదేవుడు వేలనాల్కలతో భీకర స్వరూపం ప్రదర్శించాడు. ఆకాశం నుండి దేవతలు పూలవర్షం కురిపించారు.

అంతా చూస్తున్న సామంతరాజులు, నగరస్వాములు, వైశ్యప్రముఖులు, ఇతరులలో ఉత్సాహం, ఉద్వేగాలు పొంగాయి. జై వాసవాంబా – జైజై వాసవాంబా ! జై వాసవి కన్యకా పరమేశ్వరీ ! జైజై వాసవి కన్యకా పరమేశ్వరీ ! ... గుండె పొంగుల్ని నినాదాలుగా వినిపిస్తూ తాదాత్మ్యం చెందారు.

ప్రధాన గుండము నుండి వాసవి ఆత్మ అనన్య కాంతులు విరజిమ్ముతూ ఆకాశము పైకి ఎగసి మాయమైంది. వెంటనే నూటారెండు గుండముల నుండి జంట వెలుగులు పైకెగసి అదృష్యమైనాయి. బ్రహ్మకుండము పునీతమైంది.

భాస్కరాచారి ఆదేశానుసారము ప్రముఖులంతా తదుపరి కార్యక్రమాలకు పూనుకున్నారు.

మిగితావారంతా నిండుగుండెలతో నిమిత్తమాత్రులుగా కదిలారు.

విష్ణువర్ధనుని ఆరాటము అమితోత్సాహమై పోరాటానికి తరలివచ్చింది. ఆఘమేఘాల మీద పద, గజ, తురగ త్రివిధ సైనిక బలగాలతో పెనుగొండ కోటద్వారము చేరుకున్నాడు. కోటద్వారము వెలుపలనే హఠాత్తుగా ఆగిపోయాడు. గుండె నరాల నెవరో కసికసిగా పిండేస్తున్నట్టనిపించింది.

గత రాత్రి భోజనములో పంచభక్ష్య పరమాన్నాలు రుచించలేదు. బంగారు గిన్నెలో అందించిన పాయసము చేదుగా తోచింది. అవుపాలు రక్తమాంసాలమయంగా కన్పించినై. సుందరాంగుల ఉపచారాలతో ఆందోళన ఉపశమించింది. కలత నిద్ర నుండి మేల్కొనేముందు ఏదో శక్తి తన ముందుకొచ్చింది. ఆ శక్తి నల్లగా, కాటుక కొండ లాగుంది. కబంధ హస్తాలతో అమాంతం కబళించింది. పొత్తికడుపులోంచి తోసుకొచ్చిందో పెనుకేక. తనకేక తనకే భయంకరంగా వినిపించింది. వెంటనే

మెలకువొచ్చి లేచి కూచున్నాడు. తెల్లవారకముందే బయలుదేరాలనే కోరిక కార్యరూపం ధరించింది.

ఇప్పటికే ఎన్నో యుద్ధాల్లో పాల్గొని అరివీరులను పరిమార్చిన అనుభవముంది. యుద్ధరంగము క్రీడారంగమన్పించేది. శత్రువుల కుత్తుక లుత్తరించిన కత్తిని గోదావరి తరంగాల్లో కడుగుతూంటే నూతనోత్తేజం ఉరకలేసేది.

మరిప్పుడో ! పంతం నెగ్గించుకుని కోరుకున్న వనితను దక్కించుకోవాలనుకున్న కోర్కె తప్ప మరేమీ లేదు. బయటికి ఎంత బింకముగా కన్పించినా లోలోపల ఏదో తొలుస్తోంది. ... రథమ్మీదున్న విష్ణువర్ధనుడు ఆశ్చర్యానికి లోనయాడు. మెదడు పొరల్లోని ఆలోచనలను బలవంతంగా అదిమి పెట్టాడు. కోటద్వారము ముందు బాలనగరులు యుద్ధ సన్నద్ధులై ఎదిరి చూస్తున్నారు. పెనుగొండ సైనికబలగాలు కవాతు చేస్తున్నాయి.

విష్ణువర్ధనుని బలగాలు కనబడగానే పెనుగొండ సేనలు కవాతు ఆపేసి ఒరల్లోంచి కత్తులు తీశాయి. కరవాలాల తళతళలకు పద్మశయన సేనల కళ్లు మూసుకు పోతున్నాయి. శంఖానాదాలు జోరందుకున్నాయి. జైవాసవాంబా ! జైజై వాసవాంబా!! జై వాసవి కన్యకా పరమేశ్వరీ ! జైజై వాసవి కన్యకా పరమేశ్వరీ !! ... జయజయ ధ్వానాలు చెవి గూబలను ఢీకొడుతున్నాయి.

విష్ణువర్ధనుడు అయోమయంలో పడిపోయాడు. పెనుగొండ సామ్రాజ్య యువతలో ఇంత చొరవనా ? వారి ఖడ్గాల కంత తేజస్సు ఎలా వచ్చింది ? శాంతి వచనాలు వల్లిస్తున్న కుసుమగుప్తుని సేనలింత బలపడ్డాయా ? బాలనగరులంతా వైశ్య యువకులే గదా ! వైశ్యజాతిలో ఇంతటి వీరులున్నారా ? ... గుండెల్లో గుండ్రాళ్లు దొర్లాయి.

పెనుగొండ సేనాధిపతి ఆదేశాలందుకుని సేనలు మెరుపువేగంతో ముందు కొచ్చాయి. భీకరయుద్ధం ప్రారంభమైంది. క్షణాల్లో సమరం ఊపందుకుంది. విచ్చుకత్తుల వీరవిహారం, గుర్రాల సకిలింపులు, గజరాజుల ఘీంకారాలతో యుద్ధభూమి దద్ధరిల్లింది.

"విష్ణువర్ధనా !" పిలుపు కాదది గర్జన. బాలనగరుల సామూహిక గర్జన. పద్మశయన సేనలు హడలిపోయినై. పెనుగొండ సేనల ప్రహారాలకు తట్టుకోలేక – ఒడ్డుకు తలబాదుకుని వెనక్కు పరిగెడుతున్న సముద్ర కెరటాల్లా వెనుదిరిగిపోతున్నాయి.

"కాచుకో మా దెబ్బ !" విరూపాక్షుని గుండెల్లోంచి వచ్చిందా హెచ్చరిక. విష్ణువర్ధనునిలో రోషం పొడుచుకొచ్చింది.

"పిల్లపిచ్చుకా ! నువ్వా నన్నెదిరించేది ?" హుంకరించాడు. ఒరలోంచి కత్తి బయటికొచ్చింది.

"మహారాజా !" పద్మశయన సామ్రాజ్య సైనికాధికారి శరవేగముతో విష్ణువర్ధనుని ముందుకొచ్చాడు. గూఢాచారుల ద్వారా తాను విన్న వార్తను మహారాజుకు తెలియ జేయాలనుకున్నాడు. విష్ణువర్ధనుని రథము ఆగిపోయింది.

"ఏమిటి ? నా ముందుకొచ్చావెందుకూ ?" గొంతులో అసహనం. ఎత్తినకత్తి చేతిలో అలాగే ఉండిపోయింది.

"మహారాజా ! వాసవి అగ్నిగుండములో దూకి ఆత్మాహుతి చేసుకుంది. ఆమె ఈ లోకములో లేదిప్పుడు. ఆమెతోపాటు నూటారెండు వైశ్య గోత్రీకుల దంపతులు గూడా అగ్నిగుండాల్లో ఆహుతై పోయారు."

అంతే ... విష్ణువర్ధనుని మెదడు పొరల్లో చురకత్తుల విన్యాసం ... మెదడు నరాలు, రక్తనాళాలు పటపటా తెగిపోయినై. అవమానం, అసహ్యం, ఆందోళన. అన్నీ కలిసి

"వాసవీ ! నాకు దక్కకుండా పోయావా !" గుండె పొరల్ని, గొంతుగోడల్ని చీల్చుకుంటూ వచ్చిందో కేక. అతని ఖడ్గం అతని మెడ మీదనే నాట్యం చేసింది. ఆ కేక ఆకాశానికంటింది. యుద్ధభూమి దద్దరిల్లింది. ఫటేల్ ఫటేల్ మంటూ తల వెయ్యి పగుళ్లు చూపింది. రథమ్మీంచి జారి నేలమీద పడిపోయాడు. యుద్ధం ఆగిపోయింది.

"హా ... హత విధీ !" విష్ణువర్ధనుని చావుకేక అది. పంచప్రాణాలు పంచ భూతాల్లో కలిసిపోతున్నాయి.

"విష్ణువర్ధనా !" షోడషకళా ప్రపూర్ణ ఆదిశక్తి కన్యకా పరమేశ్వరి అతని కళ్లల్లో సాక్షాత్కరించింది.

"అమ్మా ! తల్లీ ! నేనెవరిని ?"

"నువు గంధర్వుడివి కుమారా ! నీ పేరు చిత్రకంఠుడు. గుర్తుకొచ్చిందా ? నేనే వాసవిని, కన్యకా పరమేశ్వరిని."

"అవును తల్లీ ! నిజమే. ధన్యోస్మి" మనసు మాట్లాడింది. ముక్కలుగా పగులు చూపిన తల చెక్కలు చెక్కలుగా విడిపోయింది. శరీరం లోంచి ఓ కాంతి పుంజము వెలువడి ఆకాశానికెగిరి మాయమైంది.

విరూపాక్షుని ఆదేశాలతో బందీలుగా పట్టుబడిన పద్మశయన సేనలను పెనుగొండ బలగాలు ప్రాణాలతో వదిపెట్టాయి. రక్తపాతాని కాస్కారం లేకుండా సేనలు

ఊపిరి పీల్చుకున్నాయి. "చెప్పినా వినకుండా మన మహారాజు మట్టికరిచాడు" అనుకుంటూ విష్ణువర్ధనుని సేనలు వెనుదిరిగాయి.

విష్ణువర్ధన మహారాజు ధారుణ మరణ వార్త విని పద్మశయన యువరాజు రాజనరేంద్రుడు గుండెలు బాదుకున్నాడు. పెనుగొండ నుండి ప్రాణాలరచేతిలో పెట్టుకుని తిరిగి వచ్చిన దండనాథుడు సేనలతో సహా అతని ముందున్నాడు.

"యువరాజా ! మహారాజుగారి తల పెనుగొండ కోటద్వారము ముందు వెయ్యి ముక్కలైంది. పెనుగొండ బాలనగరులతో యుద్ధము చెయ్యడం పరమేశ్వరుని గ్గాడా అసాధ్యమే. మహారాజు గారి చావుకేకకు యుద్ధభూమి ద్దరిల్లింది" విశేషాలు వివరించి చెప్పాడు.

"అయ్యో ... పరమేశ్వరా ! మా తండ్రిగారి కెంత జెప్పినా ప్రయోజనం లేకపాయనే !" పరిపరి విధాల దుఃఖించాడు. ప్రధానమంత్రి విజయసింహునితో కలిసి వెళ్లి గురువుగారైన దౌమ్యుని పాదాలచెంత వాలాడు. అప్పటికే గురువుగారి కంతా తెలిసింది. రాజనరేంద్రుని తలనిమురుతూ

"కుమారా ! రాజనరేంద్రా ! పరాయి ఆడదంటే నిప్పుల మూట. దాన్ని ఒడిలోకి చేర్చుకోవాలనుకుంటే నిట్టనిలువునా కాల్చిపారేస్తుంది. ఆడదాన్ని ఆటవస్తువుగా భావించిన వారికిదే గతి పడుతుంది. మీనాన్న పూర్వజన్మ కర్మఫలము ఈ జన్మలో పరిపక్వమైంది. పూర్వజన్మలో నీతండ్రి చిత్రకంఠుడనే గంధర్వుడు ... " విషయమంతా తెలియజేసి "వ్యాసమునీంద్రుల ద్వారా ఆ వృత్తాంతము తెలుసుకున్నాను. జరిగిన దానికి చింతించకు. జరగాల్సింది చూడాలి. మహారాజు పార్థివ శరీరానికి అంత్యక్రియలు జరగాలి. అతని చర్యలవల్ల గాయపడ్డ మనసులతో బాధపడ్తున్న పెనుగొండ వైశ్యుల నూరడించాలి" దిశానిర్దేశనం చేశాడు.

"గురువు గారూ ! దయచేసి మీరు మా వెంట ఉండి నడిపించండి" శాంతించి అడిగాడు రాజనరేంద్రుడు.

"సరే"నని తయారయాడు దౌమ్యుడు.

అంతా కలిసి పెనుగొండ చేరుకున్నారు. రాజనరేంద్రుని చేతులమీదుగా విష్ణువర్ధనుని శరీరానికి అంత్యక్రియలు చేయించారు.

వాసవి వెంట ఆత్మాహుతులైన వైశ్య దంపతులకు వారసులు ఉత్తరక్రియలు జరిపించారు. రాజనరేంద్రునితో సహా పద్మశయన ప్రముఖులు విరూపాక్షుని కలిశారు.

ఒకరినొకరు ఊరడించుకున్నారు.

ఇకముందు ఇరుసామ్రాజ్యాల మధ్య మైత్రీబంధం బలపడాలనుకున్నారు. అంతా కలిసి వెళ్లి వాసవి బలిదాన ప్రదేశాన్ని చూసి, పూజలు చేసి అక్కడే వాసవాంబ మందిర నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. వెంట వచ్చిన ప్రజలు 'వాసవాంబకు జై' నినాదాలిచ్చారు. రాజనరేంద్రుని బృందము వారు గూడా శృతి కలిపారు.

పద్మశయనానికి తిరిగివెల్తూ రాజనరేంద్రుడు "విరూపాక్షా ! గతాన్ని మరిచి మనము ఆప్తమిత్రులుగా మెలగుదాం. మీరోసారి మా పద్మశయన పురాన్ని సందర్శించండి !" కరచాలనంతో ఆహ్వానం పలికాడు.

పెనుగొండ పట్టణములో పదకొండు రోజులు పితృయజ్ఞము నిర్వహించారు. పదమూడోరోజు వైశ్యబాలకులు భాస్కరాచారిని తోడ్కొని కాశీకి ప్రయాణమైనారు. ప్రయాగ త్రివేణి సంగమములో, కాశీలో గంగానదిలో మాతాపితరుల అస్తికలు నిమజ్జనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి – విశ్వనాథుని ఆశీస్సులందుకున్నారు.

కాశీనగరము నుండి నూటారెండు లింగములు తెచ్చి పెనుగొండలో ఒకే వీధిలో ప్రతిష్ఠింపజేశారు.

అక్కడ పద్మశయన నగరములో, ఇక్కడ పెనుగొండ నగరములో రాజనరేంద్రుడు, విరూపాక్షుడు సామ్రాజ్యాధిపతులుగా పట్టాభిషక్తులైనారు. మహారాజులుగా పరిపాలనా బాధ్యతలు చేపట్టారు.

ఆ తర్వాత హేలాపుర నివాసి ఆదిశ్రేష్ఠి అందాల పుత్రిక రత్నావతితో విరూపాక్షుని వివాహమైంది. పెళ్లికి సామంతరాజులతోపాటు పద్మశయన సామ్రాజ్యాధిపతి రాజనరేంద్ర మహారాజు హాజరై కానుకలందించారు.

నూతన దంపతులు గుడికెళ్లి వాసవి కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులందుకున్నారు.

–: శుభం :–



సర్వేజనా స్సుఖినో భవంతు